# కరీంనగర్ జిల్లా కవిత్వం – వస్తు, రూప విశ్లేషణ

## (2001 – 2010)

**పిహెచ్.డి. పట్టా కోసం హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి**

**సమర్పించిన పరిశోధన గ్రంథం**


**పరిశోధన**

గరిగె రాజేశ్

**పర్యవేక్షణ**

ఆచార్య పిల్లలమర్రి రాములు

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాద్ విశ్వవిద్యాలయం

గచ్చిబౌలి, హైదరాబాద్ - 500046

తెలంగాణ


ఆగస్ట్, 2021

**KARĪṀNAGAR JILLĀ KAVITVAṀ – VASTU, RŪPA VIŚLĒṢAṆA**

**(2001 – 2010)**

(A Thesis submitted to the University of Hyderabad in partial fulfilment of the Degree of Doctor of Philosophy)


Researcher

Garige Rajesh

13HTPH09



Department of Telugu

School of Humanities

University of Hyderabad

Hyderabad – 500046

Telangana


August - 2021

# కరీంనగర్ జిల్లా కవిత్వం – వస్తు, రూప విశ్లేషణ

**(2001 – 2010)**

**(పిహెచ్.డి. పట్టా కోసం హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం)**


పరిశోధన

**గరిగె రాజేష్**

13HTPH09

పర్యవేక్షణ

**ఆచార్య పిల్లలమర్రి రాములు**

తెలుగుశాఖ

మానవీయశాస్త్రాల విభాగం

హైదరాబాద్ విశ్వవిద్యాలయం

హైదరాబాద్ – 500046

తెలంగాణ


ఆగస్ట్ – 2021

# DECLARATION

I, GARIGE RAJESH hereby declare that this Thesis entitled "Karimnagar Jillā Kavitvam – Vastu, Rūpa Viślēṣaṇa (2001 – 2010)" Submitted by me under the guidance and supervision of **Prof. Pillalamarri Ramulu** is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodganga/ INFLIBNET

Date: GARIGE RAJESH

Place: Hyderabad Regd. No.13HTPH09

# CERTIFICATE

This is to certify the Thesis entitled **“Karīṁnagar jillā kavitvaṁ – vastu, rūpa viślēṣaṇa (2001 – 2010)”** submitted by **Mr. Garige Rajesh** bearing **Regd. No. 13HTPH09** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

Parts of this thesis have been: (NOT EXACT PARTS. Issues discussed in the following papers have been presented elaborately in the chapter-2 of the thesis.)

1. **“Karīṁnagar jillā kavitvaṁ – vastu viślēṣaṇa”** (ISBN 978-93-81992-32-6), 2nd Chapter. Pg.NO. 49 - 53, February 2016. "Pariśōdhana: nāḍu, nēḍu, rēpu (pariśōdhana patrāla saṅkalanaṁ)"Edited by Prof. Sampathkumar, Madabhushi. Department of Telugu, Madras University. Madras.
2. **“Karīṁnagar jillā kavitvaṁ prapaṅchīkaraṇa”** (ISSN 2349-2376), 2nd Chapter. Pg.No.31 - 34, May, 2018. “Naḍustunna Telaṅgāṇa” Monthly Magazine. Chief Editor Dr. Kaseem.

And

**B. Presented in the following conferences:** (Issues presented in the following papers have been discussed elaborately in the chapter - 4 and chapter – 7 of the thesis.)

1. **“Karīṁnagar jillā kavitvaṁ – Rūpa viślēṣaṇa”** (National), 4th Chapter. By SRR GOVT. ARTS & SCIENCE COLLEGE - Karimnagar. Sponsored by TSCHE. On 17th- 18th February, 2017.
2. **“Karīṁnagar jillā kavitvaṁ – Maṇḍalika padāla pariśīlana”** (National), 7th Chapter. Coordinated by Dr. B. Bhujangareddy. Department of Telugu, University of Hyderabad. On 23-24 February, 2017.

Further, the Student has passed the following courses towards fulfillment of coursework requirement for Ph.D./was exempted from doing coursework (recommended by Doctoral Committee) on the basis of the following courses passed during his M. Phil program and the M. Phil degree was awarded.

| **Course Code** | **Name** | **Credits** | **pass/fail** |
|---|---|---|---|
| 1. TL701 | Research Methodology | 4.00 | PASS (A) |
| 2. TL702 | History of Telugu Research | 4.00 | PASS (A+) |
| 3. TL703 | Studies in Specialized Area | 4.00 | PASS (A+) |
| 4. TL704 | Broad Field | 4.00 | PASS (A+) |
| 5. TL780 | Dissertation | 16.00 | PASS (A+) |

| | | |
|---|---|---|
| Prof. PILLAMARRI RAMULU | Prof. D. VENKATESWARA RAO | Prof. D. KRISHNA |
| **Research Supervisor** | **Head, Telugu** | **Dean, Humanities** |

# విషయసూచిక

**కృతజ్ఞతలు**

**ముందుమాట**

**సంకేతపదాల వివరణ**

## అధ్యాయం – 1

## కరీంనగర్ జిల్లా కవిత్వం – నేపథ్యం 1 - 31

| | |
|---|---|
| 1. పరిచయం | 01 |
| 1.1. కరీంనగర్ జిల్లా – పేరు | 01 |
| 1.2. సరిహద్దులు | 03 |
| 1.3. పాలించిన రాజవంశాలు – రాజులు | 04 |
| 1.4. చారిత్రక ఆధారాలు | 06 |
| 1.5. చారిత్రక, పర్యాటక ప్రదేశాలు | 08 |
| 1.5.1. అడవి సోమనపెల్లి గుహాలయాలు | 08 |
| 1.5.2. వేములవాడ | 08 |
| 1.5.3. బొమ్మలగుట్ట శాసనం | 09 |
| 1.5.4. ధర్మపురి | 09 |
| 1.5.5. కోటిలింగాల | 10 |
| 1.5.6. కాళేశ్వరం | 10 |
| 1.5.7. మంథని | 11 |
| 1.6. కళా రూపాలు | 11 |
| 1.6.1. ఒగ్గుడోలు | 12 |
| 1.6.2. చిందు యక్షగానాలు | 12 |
| 1.6.3. ఒగ్గుకథ | 13 |
| 1.6.4. గంగిరెద్దులోళ్ళు | 13 |

1.6.5. సిల్వర్ ఫిలిగ్రీ హస్తకళ 13
1.6.6. నకాషీ 14
1.7. కరీంనగర్ జిల్లా ఆధునిక ప్రక్రియలు – పరిచయం 14
1.7.1. నాటకం 14
1.7.2. నవల 17
1.7.3. కథ 19
1.8. కరీంనగర్ జిల్లా కవిత్వం – నేపథ్యం 21
1.8.1. సాహిత్య నేపథ్యం 21
1.8.1.1. సాహితీ సంస్థలు 23
1.8.1.2. పత్రికలు 26
1.8.2. ఉద్యమ నేపథ్యం 27
1.8.3. సామాజిక నేపథ్యం 30

## అధ్యాయం – 2

## కరీంనగర్ జిల్లా కవిత్వం – వస్తు విశ్లేషణ 32 - 118

2. పరిచయం 32
2.1. వస్తువు – నిర్వచనాలు 33
2.2. కరీంనగర్ జిల్లా కవిత్వం – వస్తు విశ్లేషణ 37
2.2.1. సామాజికాంశాలు 37
2.2.1.1. కుటుంబం 38
2.2.1.1.1. తల్లి 38
2.2.1.1.2. తండ్రి 40
2.2.1.2. వృత్తులు 43
2.2.1.2.1. చేనేత 43
2.2.1.3. దళితులు 46
2.2.1.4. మైనారిటీలు 50

| | | |
|---|---|---|
| 2.2.1.5. | సింగరేణి కార్మికులు | 52 |
| 2.2.1.6. | స్త్రీ | 57 |
| 2.2.1.7. | పల్లె | 60 |
| 2.2.1.8. | ప్రకృతి | 64 |
| 2.2.1.9. | రైతు | 67 |
| 2.2.1.10. | వలస | 70 |
| 2.2.1.11. | కరువు | 73 |
| 2.2.1.12. | స్మృతి | 76 |
| 2.2.1.13. | ప్రత్యేక తెలంగాణ ఉద్యమం | 79 |
| 2.2.1.13.1. | వివక్షను, దోపిడిని ప్రశ్నించడం | 80 |
| 2.2.1.13.2. | ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కాంక్ష | 83 |
| 2.2.1.13.3. | తెలంగాణ భాష | 86 |
| 2.2.1.13.4. | సంస్కృతి, సాహిత్య, చరిత్రల గొప్పతనం చెప్పడం | 88 |
| 2.2.1.13.5. | అమరవీరుల స్మరణ | 89 |
| 2.2.2. | రాజకీయాంశాలు | 91 |
| 2.2.2.1. | ఎన్నికలు | 91 |
| 2.2.2.2. | నాయకుడు | 92 |
| 2.2.2.3. | ఓటర్లు | 94 |
| 2.2.3. | సాంస్కృతికాంశాలు | 96 |
| 2.2.3.1. | పండుగలు | 97 |
| 2.2.3.1.1. | బతుకమ్మ | 97 |
| 2.2.3.1.2. | ఇతర పండుగలు | 99 |
| 2.2.4. | ఆర్థికాంశాలు | 102 |
| 2.2.4.1. | డబ్బు | 102 |
| 2.2.4.2. | ప్రపంచీకరణ | 103 |
| 2.2.4.2.1. | వృత్తుల విధ్వంసం | 104 |
| 2.2.4.2.2. | పల్లె పరాయీకరణ | 106 |

2.2.4.2.3. మానవ సంబంధాల విధ్వంసం 110
2.2.4.2.4. సాంస్కృతిక విధ్వంసం 112
2.2.4.2.5. కొత్త వస్తు సంస్కృతి 116
2.2.4.2.6. ప్రపంచీకరణ ప్రతిఘటన 117

## అధ్యాయం – 3

## కరీంనగర్ జిల్లా కవిత్వం – వస్తు పరిణామం119 - 162

3. పరిచయం 119
3.1. కరీంనగర్ జిల్లా ప్రాచీన సాహిత్యం 126
3.2. కరీంనగర్ జిల్లా ఆధునిక కవిత్వం – వస్తు పరిణామం 128
3.2.1. అభ్యుదయ, సామ్యవాద కవిత్వం (1965 – 1990) 129
3.2.2. విప్లవ కవిత్వం (1991 – 2000) 135
3.2.3. ప్రపంచీకరణ కవిత్వం (1991 - 2017) 138
3.2.4. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వం (1996 – 2014) 146
3.2.5. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానంతర కవిత్వం (2014 – 2017)156

## అధ్యాయం – 4

## కరీంనగర్ జిల్లా కవిత్వం – రూప విశ్లేషణ 135 - 223

4. పరిచయం 163
4.1. రూపం – నిర్వచనాలు 164
4.2. రూప ఆవిర్భావం – కారణాలు 169
4.3. కరీంనగర్ జిల్లా కవిత్వం – రూప విశ్లేషణ 170
4.3.1. వచన కవిత్వం 170
4.3.1.1. పరిచయం 170
4.3.1.2. ఆవిర్భావ కారణాలు 172

| | | |
|---|---|---|
| 4.3.1.3. | లక్షణాలు | 174 |
| 4.3.1.4. | కరీంనగర్ జిల్లా వచన కవిత్వం | 174 |
| 4.3.2. | దీర్ఘకవితలు | 179 |
| 4.3.2.1. | పరిచయం | 179 |
| 4.3.2.2. | నిర్వచనాలు – లక్షణాలు | 180 |
| 4.3.2.3. | కరీంనగర్ జిల్లా దీర్ఘ కవితలు | 180 |
| 4.3.2.3.1. | వాస్కోడిగామా డాట్ కామ్ | 181 |
| 4.3.2.3.1.1. | చౌరస్తా | 181 |
| 4.3.2.3.1.2. | శక్తి | 183 |
| 4.3.2.3.1.3. | ఓ అయిదు ఎపిసోడ్స్ | 186 |
| 4.3.2.3.1.4. | వాస్కోడిగామా డాట్ కామ్ | 187 |
| 4.3.2.3.2. | తెగినపోగు | 188 |
| 4.3.2.3.3. | లోకాలోకనం | 193 |
| 4.3.2.3.4. | మనస్సు | 195 |
| 4.3.2.3.5. | పిల్లలమర్రి | 197 |
| 4.3.2.3.6. | మట్టిముద్దలు | 199 |
| 4.3.3. | ఒకరోజు పది గాయాలు | 201 |
| 4.3.4. | మినీ కవితలు | 203 |
| 4.3.4.1. | పరిచయం | 203 |
| 4.3.4.2. | ఆవిర్భావ కారణాలు | 203 |
| 4.3.4.3. | నిర్వచనాలు | 203 |
| 4.3.4.4. | లక్షణాలు | 205 |
| 4.3.4.4.1. | సంక్షిప్తత | 205 |
| 4.3.4.4.2. | చురక | 206 |
| 4.3.4.4.3. | వ్యంగ్యం | 207 |
| 4.3.4.4.4. | భావ గాంభీర్యం | 208 |
| 4.3.4.4.5. | శీర్షిక | 209 |

4.3.5. నానీలు 209
4.3.5.1. పరిచయం 209
4.3.5.2. నిర్వచనం, లక్షణాలు 210
4.3.6. పేరడీ 217
4.3.7. నానోలు 221

## అధ్యాయం - 5

## కరీంనగర్ జిల్లా కవిత్వం - రూప పరిణామం 224 - 293

5. పరిచయం 224
5.1. రూపం – నిర్వచనాలు 224
5.2. కరీంనగర్ జిల్లా కవిత్వం – రూప పరిణామం 227
5.2.1. ఛందోబద్ధ కవిత్వం 227
5.2.2. ఖండకావ్యం 230
5.2.3. గేయం 234
5.2.4. పాట 238
5.2.5. గేయ నాటికలు 241
5.2.6. గజల్స్ 245
5.2.7. రుబాయీలు 250
5.2.8. ప్రపంచపదులు 253
5.2.9. వచన కవిత 256
5.2.10. దీర్ఘకవిత 258
5.2.11. మినీకవిత 270
5.2.12. నానీలు 277
5.2.13. హైకూలు 280
5.2.14. పేరడీ 284
5.2.15. ఫీచర్ కవిత 286

5.2.16. హాజిర్ హై 288
5.2.17. నానోలు 291

## అధ్యాయం – 6

## కరీంనగర్ జిల్లా కవిత్వం – శిల్ప విశ్లేషణ 294 - 363

6. పరిచయం 294
6.1. శిల్పం – నిర్వచనాలు 295
6.2. కరీంనగర్ జిల్లా కవిత్వం – శిల్ప విశ్లేషణ 297
6.2.1. ప్రతీకలు (Symbols) 297
6.2.2. భావచిత్రాలు (Imagerys) 302
6.2.3. భాష (Diction) 307
6.2.3.1. గ్రాంథిక భాష (Textual Language) 308
6.2.3.2. మాండలిక భాష (Dialect Language) 310
6.2.3.3. సమ క్రియల వాడకం 315
6.2.3.4. జాతీయాలు, సామెతలు, నానుడుల ప్రయోగం 317
6.2.4. విరోధాభాసం (Paradox) 320
6.2.5. అలంకారాలు (Figures of Speech) 323
6.2.6. జానపద విధానం (Folk Narrative) 326
6.2.7. పౌరాణిక నేపథ్యం (Mythopoeie) 329
6.2.8. ప్రశ్న – సమాధాన పద్ధతి 333
6.2.9. సంభాషణాత్మకం 335
6.2.10. వర్ణనాత్మకం 339
6.2.11. అసాధారణ పోలిక (Conciet) 340
6.2.12. అపరిచయీకరణ (Unfamiliar) 343
6.2.13. మానవ గుణారోపణ (Personification) 346
6.2.14. తళుక్కున ప్రారంభం కావడం (Abrupt Beginning) 350
6.2.15. భంగిమలకు తగిన భాషను ఎన్నుకోవడం (Language of gesture)353

6.2.16. వస్తు స్థానభ్రంశం (Misplacement of Things) 355
6.2.17. ధ్వన్యనుకరణ (Onomatopoeia) 358
6.2.18. పునరుక్తి (Repetetion) 360

## అధ్యాయం – 7

## కరీంనగర్ జిల్లా కవిత్వం – భాషా విశ్లేషణ 364 - 397

7. పరిచయం 364
7.1. తెలంగాణ భాష 365
7.2. అన్యదేశ్యాలు 366
7.2.1. ఉర్దూ, ఫారసీ, అరబ్బీ పదాలు 367
7.2.2. హిందీ భాషా పదాలు 370
7.2.3. ఆంగ్ల భాషా పదాలు 372
7.3. దేశ్య పదాలు 374
7.4. క్రియలు 375
7.4.1. భూతకాలం 376
7.4.2. వర్తమానం 376
7.4.3. భవిష్యత్ కాలం 376
7.5. ధ్వని పరిణామం 377
7.5.1. వర్ణ సమీకరణం 377
7.5.1.1. పరవర్ణ సమీకరణం 377
7.5.1.2. పూర్వవర్ణ సమీకరణం 378
7.5.2. వర్ణ నాశనం 378
7.5.3. స్వరలోపం 378
7.5.4. వర్ణాగమనం / వర్ణాధిక్యం / స్వరభక్తి 378
7.5.5. లోప దీర్ఘత 379
7.5.6. వర్ణమార్పు 380

7.5.6.1. చ > స 380

7.5.6.2. చ > శ 380

7.5.6.3. ష > స 381

7.6. పదాదిన వు, వూ, వొ, వో లు వాడడం 381

7.7. ధ్వన్యనుకరణ పదాలు 382

7.8. జంట పదాలు 382

7.9. విభక్తి ప్రత్యయాలు 382

7.9.1. ప్రథమా విభక్తి ప్రత్యయాలు 383

7.9.2. ద్వితీయా విభక్తి ప్రత్యయాలు 383

7.9.3. తృతీయా విభక్తి ప్రత్యయాలు 384

7.9.4. చతుర్థీ విభక్తి ప్రత్యయాలు 384

7.9.5. పంచమీ విభక్తి ప్రత్యయాలు 385

7.9.6. షష్ఠీ విభక్తి ప్రత్యయాలు 385

7.9.7. సప్తమీ విభక్తి ప్రత్యయాలు 387

7.9.8. సంబోధన ప్రథమా విభక్తి ప్రత్యయాలు 387

7.10. ఔపవిభక్తిక ప్రత్యయాలు 387

7.11. అన్యదేశ్య పదాలకు తెలుగు ప్రత్యయాలు 388

7.11.1. ఆంగ్ల పదాలు 388

7.11.2. ఉర్దూ, అరబీ, ఫారసీ పదాలు 388

7.12. తిట్లు 389

7.13. నానుడులు, జాతీయాలు, సామెతలు 389

7.14. సంధులు 391

7.14.1. వకారలోప సంధి 391

7.15. సర్వనామాలు 392

7.15.1. పురుష వాచక సర్వనామాలు 392

7.15.2. రీత్యర్థక సర్వనామాలు 393

7.15.3. హేత్వర్థక సర్వనామాలు 394

7.15.4. కాలవాచక సర్వనామాలు 394

7.15.5. స్థలవాచక సర్వనామాలు 394

7.15.6. పరిమాణార్థక సర్వనామాలు 394

7.16. సంఖ్యావాచకాలు 395

7.16.1. ఏకత్వ బోధక సంఖ్యావాచకాలు 396

7.16.2. బహుత్వ బోధక సంఖ్యావాచకాలు 396

**ముగింపు** **398 - 406**

**అనుబంధం - 1** **407 - 422**

కరీంనగర్ జిల్లా కవులు – ఇంటర్వ్యూ

1. డా. నలిమెల భాస్కర్ (కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత, భాషావేత్త, ప్రముఖ కవి) 407
2. డా. పత్తిపాక మోహన్ (నేషనల్ బుక్ ట్రస్ట్ తెలుగు విభాగ ఛైర్మెన్, ప్రముఖ కవి)412
3. అన్నవరం దేవేందర్ (ప్రముఖ కవి) 417

**ఉపయుక్త గ్రంథసూచి** **423 - 440**

**పుస్తకాల్లో, మ్యాగజిన్‌లలో ముద్రితమైన పత్రాలు** **441 - 456**

**జాతీయసదస్సుల్లో సమర్పించిన పరిశోధన పత్రాల ధ్రువ పత్రాలు 457 - 458**

# కృతజ్ఞతలు

ఎదురుగా మాయమై ఎదలోకి చేరిపోయిన అమ్మానాన్నలకూ–

కన్నీటిని దిగమింగి కన్నతల్లిల పెంచిన అమ్మమ్మకీ,

నా ఆనందాన్ని, ఆరోగ్యాన్ని కోరుకునే ప్రియమైన తమ్ముడికీ,

కలిసిన ప్రతిసారి 'బాగా పరిశోధన చెయ్యాలి, ఏదో ఒక్కటి రాయాలి' అని నిత్యం ప్రేరణని, ఉత్సాహాన్ని, ధైర్యాన్ని అందించే గురువులు, నా పరిశోధన పర్యవేక్షకులు ఆచార్య పిల్లలమర్రి రాములు గారికీ,

నాకు పరిశోధన అవకాశాన్ని కల్పించిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య గడ్డ అరుణ కుమారి గారికీ, ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి గారికీ, ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికీ, ఆచార్య రేమిల్ల వేంకట రామకృష్ణ శాస్త్రి గారికీ, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికీ, డా. పమ్మి పవన్ కుమార్ గారికీ, డా. దేవారెడ్డి విజయలక్ష్మి గారికీ, డా. బాణాల భుజంగరెడ్డి గారికీ, డా. విజయకుమారి గారికీ, ఎం.ఏ.లో పాఠాలు చెప్పిన ఆచార్య ఎన్.ఎస్. రాజు గారికీ, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారికీ,

సదా తమవంతు సహాయాన్ని అందించిన భవాని శంకర్ గారికీ, రాంబాబు గారికీ, గణేశ్ గారికీ,

ముంబయిలో నెలసరి జీతగాన్నయ్యే నన్ను విశ్వవిద్యాలయం తోవను చూపిన గురువు డా. ఎస్. జైకిషన్ గారికీ, ఎప్పుడు కలిసినా 'ఏం చేస్తున్నవ్, ఏం చదివావ్' అంటూ ఎన్నెన్నో కొత్త విషయాల్ని, పరిశోధన విధానాల్ని చెప్పే గురువులు కుర్రా జితేంద్రబాబు గారికీ, 'పరిశోధన ఎంతవరకు వచ్చింది, బాగా చెయ్' అంటూ ప్రోత్సహించే గురువులు డా. కె. ముత్యం గారికీ, కవిత్వాన్ని అర్థం చేసుకోవడంలోగానీ, విశ్లేషణ పద్ధతి తెలుసుకోవడంలోగానీ ఏ విషయంలోనైనా, ఎప్పుడు ఫోన్ చేసిన అన్ని విషయాలు చెప్పే ఎం. నారాయణశర్మ గారికీ, 'నీకు ఏం పుస్తకం కావాలన్నా నాకు చెప్పు' అని ప్రేమగా మాట్లాడే డా. పత్తిపాక మోహన్ గారికీ, ఆప్యాయంగా మాట్లాడుతూ నా పరిశోధనాభివృద్ధిని కాంక్షించే గురువులు డా. నలిమెల భాస్కర్, డా. యాకూబ్, అన్నవరం దేవేందర్, చెమన్, బూర్ల వెంకటేశ్వర్లు, కూకట్ల తిరుపతి గార్లకూ,

అడిగినప్పుడల్ల తగిన సూచనలు, సలహాలు అందించే అన్నయ్యలు డా. బి. చంద్రశేఖర్, డా. భగ్గు నాయక్, డా. కె. రమేశ్, పాత అశోక్‌లకూ,

కాలాన్ని, పరిశోధనని ధైర్యంగా దాటడానికి అండగా నిలిచిన మిత్రులు ఎం. రాంచందర్, కె. రవి, పి. సురేశ్, కె. కృష్ణ, కె. శ్రీధర్, పి. అనిల్ కుమార్, ఎం. వెంకటేశ్ చౌహాన్, జి. మహేశ్‌లకీ, తమ్ముళ్ళు కె. కృష్ణ, ఎం. అభిషేక్, ఎం. తిరుపతి, కె. శ్రావణ్ కుమార్, ఎం. మోహన్‌లకూ,

నా అభ్యున్నతిని, ఆనందాన్ని కోరుకునే అందరికీ....

హృదయ పూర్వక కృతజ్ఞతలతో.....

– గరిగె రాజేశ్

# ముందుమాట

ఉత్తర తెలంగాణలో ఒక్కటైన కరీంనగర్ జిల్లాకి అటు తెలుగు సాహిత్యంలో ఇటు తెలంగాణ సాహిత్యంలో విశిష్టమైన స్థానముంది. మొదటినుంచి కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్యంలో, తెలంగాణ సాహిత్యంలో తనదైన పాత్రను నిర్వహిస్తూ వస్తోంది. ఈ జిల్లాని మొదట్లో 'ఎల్గందుల' ని పిలిచేవారు. కాని ఎల్గందుల అప్పుడు కరీంనగర్‌లో చిన్న గ్రామం. 1905వ సంవత్సరంలో ఆరవ నిజాం కాలంలో జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఎల్గందుల నుండి కరీంనగర్‌కి జిల్లా మార్చబడింది. కరీంనగర్‌లో 57 మండలాలున్నాయి. తెలంగాణ రాష్ట్రావిర్భావం తర్వాత 2016లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు గారు చేసిన జిల్లా విభజనలో కరీంనగర్ జిల్లా కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలుగా విభజించబడింది.

కరీంనగర్ జిల్లా కవులకు నిలయమని కరీంనగర్ జిల్లా సాహిత్య ప్రస్థానాన్ని గమనిస్తే అర్థమవుతుంది. కరీంనగర్ జిల్లాకు రెండువేల సంవత్సరాల చరిత్ర ఉంది. "ఇయ్యాల్నే కాదు రెండు వేల ఏండ్ల ఎనుకట కూడ సాహిత్యంల కరీంనగర్ అక్షరమై నిలబడ్డది. కోటిలింగాల రాజధానిగా శాతవాహనులేలినప్పుడు హాలుడు ఒక కుప్పజేసి పోసిన 'గాథాసప్తశతి' ఇయ్యాల మన కండ్ల ముంగటున్నది" (భాస్కర్, నలిమెల(సంపా.). 2013: vi). హాలుడు ప్రాకృతంలో తన చుట్టున్న కథల్ని 'గాథాసప్తశతి'గా సంకలనం చేశాడు. దీని తర్వాత నన్నయ కంటే వంద సంవత్సరాలకి ముందైన జినవల్లభుని కురిక్యాల శాసనంలో కంద పద్యాలు కనిపిస్తాయి. ఇవి తెలుగులోనే మొట్టమొదటి కందపద్యాలు. ప్రాచీనకాలంలో కరీంనగర్ జిల్లాలో సాహిత్యం ప్రాకృత, కన్నడ, సంస్కృత, తెలుగు భాషల్లో వచ్చింది.

కరీంనగర్ జిల్లా ప్రాచీన సాహిత్యంలో మడికి సింగన, వెలిగందుల నారన, చరిగొండ ధర్మన, వేములవాడ భీమకవి, శరభాంక కవి, ఎడపాటి ఎర్రయ, శేషప్ప, నరసింహదాసు మొదలైనవారు పేర్కొనదగినవారు. గొప్ప వ్యాఖ్యాతగా పేరుపొందిన సోమనాథకవి ఈ జిల్లావాడే. సురవరం ప్రతాపరెడ్డిగారి 'గోలకొండ కవుల సంచిక'లో ఈ జిలాకు చెందిన 42 మంది కవులుండడం గొప్ప విషయం. 20వ శతాబ్దం ఉత్తరార్థం వరకు పద్య కావ్యాలు, గేయ కావ్యాలు, ఖండ కావ్యాలు ఎక్కువగా వచ్చాయి. తెలుగులో పాశ్చాత్య సాహిత్య ప్రభావంవల్ల ఏర్పడ్డ అన్ని ఆధునిక ప్రక్రియలు కరీంనగర్ జిల్లాలో కనిపిస్తాయి.

కథ, నవల, కవిత్వం మళ్ళీ కవిత్వం(గజల్స్, రుబాయిలు, ప్రపంచపదులు, వచన కవిత్వం, దీర్ఘకవిత, మినీ కవిత, నానీలు, హైకూలు, నానోలు మొదలైనవి), నాటకం మొదలైన ప్రక్రియల్లో చెప్పుకోదగ్గ గొప్పవాళ్ళు కరీంనగర్ జిల్లా నుండి ఉన్నారు. కథా ప్రక్రియలో జి. రాములు (మొదటి కథ రాశారు), గూడూరి సీతారాం, పి. యశోదరెడ్డి, కాలువ మల్లయ్య, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, అల్లం రాజయ్య, పి. చంద్, డా. మలయశ్రీ, బి.యస్. రాములు, ఆడెపు లక్ష్మీపతి మొదలైనవారు, నవల ప్రక్రియలో ముదుంబై రామానుజాచార్యులు, వెంకటరాజన్న అవధాని, అల్లం రాజయ్య, పెద్దింటి అశోక్ కుమార్, పి.చంద్, నేరేళ్ల శ్రీనివాస్ గౌడ్, ముద్దసాని రాంరెడ్డి, కె.వి. నరేందర్ మొదలైనవారు, కవిత్వ ప్రక్రియలో జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి. నారాయణరెడ్డి, డా. జె. బాపురెడ్డి, అలిశెట్టి ప్రభాకర్, జూకంటి జగన్నాథం, అన్నవరం దేవేందర్, పత్తిపాక మోహన్, వఝుల శివకుమార్, జింబో మొదలైనవారు, నాటక ప్రక్రియలో డా. సి. నారాయణరెడ్డి, డా. మలయశ్రీ, ఎస్. వెంకటాద్రి, ఎస్. బుచ్చిరాజం, ఎడ్మల్ల రామచంద్రారెడ్డి, డా. జె. బాపురెడ్డి, బైరి నర్సయ్య మొదలైనవారు ముఖ్యులు.

## పరిశోధన నేపథ్యం

నేను 'జులూస్ (కవితా సంకలనం ) – భాషా సాహిత్య పరిశీలన'' అనే అంశంపై ఎం.ఫిల్. చేశాను. ఆ తర్వాత పిహెచ్.డి. కూడా కవిత్వంపైనే చేస్తే బాగుంటుందని అనుకున్నాను. దీనికి రెండు కారణాలున్నాయి. ఒకటి కవిత్వమంటే ఇష్టముండడం, నేను కవిత్వం రాస్తూ ఉండడం. ఇలా ఈ రెండు కారణాలవల్ల కవిత్వంపై పరిశోధన చేస్తే బాగుంటుంది అని అనుకున్నప్పుడు దేనిపైన చేయాలి అనే ప్రశ్నకు సమాధానం వెతికే క్రమంలో కరీంనగర్ జిల్లా కవిత్వంపై చేస్తే బాగుంటుంది అని నిర్ణయించుకున్నాను. ఈ అంశం ఎన్నుకోవడానికి ప్రధానమైన కారణాలు కొన్నున్నాయి. అవి నేను కరీంనగర్ జిల్లాకి చెందినవాన్ని కావడం, తెలుగు సాహిత్యంలో, తెలంగాణ సాహిత్యంలో కరీంనగర్ జిల్లాకి విశిష్టమైన స్థానం ఉండడం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ ప్రాంతం తన సాహిత్యాన్ని, భాషని మళ్ళీ కొత్తగా పరిశోధించాల్సిన అవసరాన్ని కలిగి ఉండడం.

## పరిశోధన పరిధి

ఆధునిక సాహిత్యంలో కవిత్వానిది ప్రథమస్థానం. ఎందుకంటే ఏ సంఘటన జరిగినా ఆ సంఘటనని తొందరగా సాహిత్య రూపంలో వెలువరించడానికి కవిత్వమంత వెసులుబాటు మరే రూపానికి లేకపోవడంవల్ల కవిత్వ సృజన ఎక్కువగా జరుగుతోంది. ఇలాంటి కవిత్వాన్ని పరిశోధించాలి అని నిర్ణయించుకున్నప్పుడు ఎక్కడి నుండి మొదలుపెట్టాలి, ఏం తీసుకోవాలి అన్న ప్రశ్నలు వచ్చాయి. కనుక కరీంనగర్ జిల్లాకి పరిమితమై నా పరిశోధన చెయ్యాలనుకున్నప్పుడు ఈ జిల్లా మొత్తం కవిత్వాన్ని పరిశోధించడం కష్టమైన పనిగా తెలుసుకొని 2001 నుండి 2010 కాలాన్ని నా పరిశోధన పరిధిగా నిర్ణయించుకున్నాను. నేను పరిశోధనలోకి వచ్చేటప్పుడు జిల్లాల విభజన కాలేదు. కనుక నేను నా పరిశోధనను ఉమ్మడి కరీంనగర్ జిల్లానే తీసుకున్నాను.

కవి పుట్టిన ప్రాంతాన్నే పరిగణనలోకి తీసుకున్నాను. వేరే ప్రాంతంనుంచి ఉద్యోగం రీత్యానో, మరే కారణాలవల్లనో కరీంనగర్‌కి వచ్చి కవిత్వం రాస్తున్నవాళ్ళ కవిత్వాన్ని పరిశోధనకి గ్రహించలేదు. కరీంనగర్‌లో పుట్టి ఉద్యోగం కోసమో, పెళ్ళయ్యో, మరే ఇతర కారణాల మరో ప్రాంతానికి వెళ్ళిన వాళ్ళని కరీంనగర్ జిల్లాగానే భావించి వాళ్ళ కవిత్వాన్ని పరిశోధనకి తీసుకున్నాను. కవులు వేసిన కవిత్వ సంపుటాల, సంకలనాల మొదటి ప్రచురణ కాలానికే ప్రాధాన్యతనిచ్చాను. ఆ తర్వాత ఆయా పుస్తకాలు ఎన్ని ప్రచురణలు పొందినా, ఒక కవి కవిత్వం అంతా సమగ్ర సాహిత్యంగా వచ్చినా విడివిడి కవిత్వ సంపుటాల మొదటి ప్రచురణ కాలాన్నే పరిగణలోకి తీసుకొని, ఆయా కాలవిభజనలోకి చేర్చాను.

దిన, వార, మాస పత్రికల్లో వచ్చిన కవితల్ని పరిశోధనకు స్వీకరించక కేవలం సంపుటాలను, సంకలనాలను మాత్రమే స్వీకరించాను. కరీంనగర్ జిల్లా కవుల కవితలు ఏ ప్రాంతం నుండి వచ్చిన సంకలనాల్లో ఉన్నా తీసుకున్నాను.

కవిత్వం అన్న పదాన్ని వచన కవిత్వ ప్రక్రియలన్నింటిని దృష్టిలో పెట్టుకొని వాడింది. వచన కవిత్వమైనా, దీర్ఘ కవిత్వమైనా, మినీ కవిత్వమైనా, నానీలైనా, హైకూలైనా ఏ కవిత్వ రూపమైన దాన్ని కవిత్వం అన్న పదంతో సూచించాను. 2001 నుండి 2010 మధ్య వచ్చిన ఏ కవిత్వ రూపాన్నైన నా పరిశోధనకు స్వీకరించాను.

## పరిశోధన ఆవశ్యకత

ఏ ప్రాంతానికైన ప్రత్యేక జీవన విధానం, సంస్కృతి, చరిత్ర, భాష, కళలు మొదలైనవి ఉంటాయి. ఇవన్నీ ఒక సాహిత్య విద్యార్థిగా సాహిత్యాన్ని పరిశీలించడం ద్వారా తెలుసుకోవాలి. ఇలా కరీంనగర్ జిల్లాకి కూడా ప్రత్యేకమైన జీవన విధానం, సంస్కృతి, చరిత్ర, భాష మొదలైనవి ఉన్నాయి. వీటినన్నింటిని కవిత్వం ద్వారా పరిశీలించి, పరిశోధించి చెప్పడం ద్వారా తెలుగు సాహిత్యంలోకి నూతన అంశాలు చేరుతాయి. ఏ కవైనా తన ప్రాంతానికి, తనున్న సమాజానికి అతీతంగా మెలగలేడు, కవిత్వం రాయలేడు. తన చుట్టూ ఉన్న సమాజాన్నే తన రచనలో పొందుపరుస్తాడు. తద్వారా ఆ ప్రాంత సామాజిక చరిత్రని తెలుసుకోడానికి, ఆయా కాలాల్లో జరిగిన మార్పుల్ని అధ్యయనం చేయడానికి ఇలాంటి పరిశోధనలు తోడ్పడతాయి. ఒక సమాజాన్ని సాహిత్యంగా మలిచే క్రమంలో ఆ ప్రాంతానికి సంబంధించిన ప్రతీకలు, విశేషాలు, స్థానిక పదాలు ఆ రచనలో చోటుచేసుకుంటాయి. వీటిని అధ్యయనం చేయడంవల్ల సాహిత్యం పరిపుష్టమవుతుంది, విస్తృతమవుతుంది.

## పూర్వ పరిశోధనల పరిగణన

కరీంనగర్ జిల్లాలోని వివిధాంశాలపైన ఇప్పటివరకు వివిధ విశ్వవిద్యాలయాల్లో పదకొండు పరిశోధనలు వచ్చాయి. విశ్వవిద్యాలయాలే కాక సంస్థల, వ్యక్తుల తరపున కొన్ని పుస్తకాలు వచ్చాయి. 'కరీంనగర్ జిల్లా ఆధునిక కవిత్వం – అనుశీలన' అనే అంశంపై ఆచార్య ఆర్. తిరుమలరావు గారి పర్యవేక్షణలో ఎస్. శివప్రసాద్ గారు 2006 పరిశోధనను పూర్తిచేశారు. 1990 నుండి 2004 వరకు వచ్చిన కరీంనగర్ జిల్లా కవిత్వాన్ని తన పరిశోధనకు తీసుకున్నారు. ఈ ఒక్క సిద్ధాంత గ్రంథం తప్ప కరీంనగర్ జిల్లా కవిత్వంపై మరే పరిశోధన జరగలేదు. కరీంనగర్ జిల్లా జానపద సాహిత్యంపై ఎక్కువగా పరిశోధనలు జరిగాయి. ఇప్పటివరకు లభించిన పరిశోధనల వివరాలని ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

1. ఎన్. రాజేశం. కరీంనగర్ జిల్లా జానపద గేయాల్లో సాంఘిక జీవనం. ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం. ఉస్మానియా విశ్వవిద్యాలయం. 1980.
2. జైశెట్టి రమణయ్య. కరీంనగర్ జిల్లా చరిత్ర – సంస్కృతి. పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్ విశ్వవిద్యాలయం. 1986.

3. సి.హెచ్. సత్యంరాజు. కరీంనగర్ జిల్లా బంధుత్వ ప్రదర్శన గేయాలు. ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం. ఉస్మానియా విశ్వవిద్యాలయం. 1988.
4. ఎస్. మల్లయ్య(మలయశ్రీ). కరీంనగర్ జిల్లా సాహిత్య చరిత్ర. పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. ఉస్మానియా విశ్వవిద్యాలయం. 1993.
5. ఐ. స్వామిరెడ్డి. కరీంనగర్ జిల్లా కథా గేయాలు. పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. ఉస్మానియా విశ్వవిద్యాలయం. 1993.
6. జె. శంకరయ్య. కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార వ్యవహారాలు. ఎంఫిల్. సిద్ధాంత వ్యాసం. ఉస్మానియా విశ్వవిద్యాలయం. 1993.
7. ఎ.ఎం. రమణారెడ్డి. కరీంనగర్ జిల్లా పిల్లల జానపద ఆటలు – ఒక పరిశీలన. ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం. తెలుగు విశ్వవిద్యాలయం. 2000.
8. వి. శ్రీనివాస్. కరీంనగర్ జిల్లా జానపద కళలు – సాంస్కృతిక అధ్యయనం. పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. ఉస్మానియా విశ్వవిద్యాలయం. 2004.
9. ఎం. రత్నం. కరీంనగర్ జిల్లా గోసంగి పురాణం – ఒక పరిశీలన. ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం. తెలుగు విశ్వవిద్యాలయం. 2006.
10. టి. శ్రీనివాస్. కరీంనగర్ జిల్లా గ్రామనామాలు. పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. ఉస్మానియా విశ్వవిద్యాలయం. 2006.
11. భాగవతుల జనార్ధనశర్మ. కరీంనగర్ జిల్లా గ్రామనామాలు. పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. కాకతీయ విశ్వవిద్యాలయం.
12. వాసం శివనారాయణ. కరీంనగర్ జిల్లా శతక సాహిత్యం. ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం. కాకతీయ విశ్వవిద్యాలయం.
13. కోటగిరి జయవీర్. కరీంనగర్ జిల్లా నాటకరంగం – ఒక పరిశీలన. ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

## అధ్యాయ విభజన

నా పరిశోధనాంశాన్ని ఏడు అధ్యాయాలుగా విభజించాను

మొదటి అధ్యాయంలో కరీంనగర్ జిల్లాకి పేరెల వచ్చిందో వివరించి, జిల్లాని పరిచయం చేశాను. జిల్లాలోని చారిత్రక, ప్రాచీనమైన స్థలాలను చెప్పాను. జిల్లాలోని ఆధునిక

ప్రక్రియల్ని పరిచయం చేసాను. కరీంనగర్ జిల్లాలో ఆధునిక కవిత్వం రావడానికి గల సాహిత్య, సామాజిక, రాజకీయ కారణాల్ని విశ్లేషించాను.

రెండవ అధ్యాయంలో కరీంనగర్ జిల్లా కవిత్వంలో కనిపించే వస్తు వైవిధ్యాన్ని సూక్ష్మంగా విభజించి విపులంగా వివరించాను.

మూడవ అధ్యాయంలో కరీంనగర్ జిల్లాలోని వస్తువు పరిణామాన్ని కూలంకషంగా వివరించాను.

నాల్గవ అధ్యాయంలో కరీంనగర్ జిల్లాలో కనిపించే కవిత్వ రూపాలైన వచన కవిత, మినీ కవిత, నానీలు లాంటి వాటిని విశ్లేషించాను.

ఐదవ అధ్యాయంలో కరీంనగర్ జిల్లాలో ఆయా కాలాల్లో కవిత్వ రూపాల పరిణామాల్ని వివరించాను.

ఆరవ అధ్యాయంలో కరీంనగర్ జిల్లా కవిత్వంలోని శిల్పాన్ని విపులంగా వివరించాను.

ఏడవ ఆధ్యాయంలో కరీంనగర్ జిల్లా కవిత్వంలోని భాషను విభజించి ఉదాహరణలతో విశ్లేషించాను.

# సంకేత పదాల వివరణ

| | | |
|---|---|---|
| త్రి.భా.ని | – | త్రిభాష నిఘంటువు |
| ఉ.తె.ని. | – | ఉర్దూ తెలుగు నిఘంటువు |
| బ్రౌ.ఇ.తె.ని. | – | బ్రౌణ్య ఇంగ్లీష్ తెలుగు నిఘంటువు |
| బా.వ్యా. | – | బాల వ్యాకరణము |
| ప్ర.సంపా. | – | ప్రధాన సంపాదకుడు |
| సంపా. | – | సంపాదకుడు |
| బాల వ్యా. | – | బాల వ్యాకరణం |
| పరి. | – | పరిచ్ఛేదం |
| పరి. | – | పరిష్కర్త |
| అను. | – | అనువాదకుడు |

# అధ్యాయం – 1
# కరీంనగర్ జిల్లా కవిత్వం – నేపథ్యం

## 1. పరిచయం

ఒక ప్రాంత భౌగోళిక, చారిత్రక అంశాల్ని తెలుసుకోవడంవల్ల ఆ ప్రాంత సామాజిక, సాంస్కృతిక జీవనాన్ని అర్థం చేసుకోగలుగుతాం. ప్రాచీనకాలం నుంచి వచ్చిన మార్పుల్ని అధ్యయనం చేయడంవల్ల, ప్రజా జీవనంలో కలిగిన మార్పుల్ని తెలుసుకోవడంవల్ల సాహిత్యానికి అవి ఎంతవరకు దోహదపడ్డాయో అంచనా వేయవచ్చు. ఉత్తర తెలంగాణలో ఒక్కటైన కరీంనగర్ జిల్లాకి తెలంగాణ చరిత్రలో, సాహిత్యంలో విశిష్టమైన స్థానం ఉంది. మానవ జీవన వికాసంలో, అభివృద్ధిలో నదులు చాలా ప్రాముఖ్యతని వహించాయని ప్రాచీన చరిత్రని గమనిస్తే మనకు అర్థమవుతుంది. హరప్పా, మొహంజదారో, కలకత్తా ఇలా అనేక పట్టణాలు, కాశి, ప్రయాగ, నాసిక్ లాంటి పుణ్యక్షేత్రాలన్నీ నదుల తీరంలోనే పుట్టి అభివృద్ధి చెందినవి. అలాగే కరీంనగర్ కూడా మానేరు నది ఒడ్డున వెలిసింది. మానేరు నది గోదావరినదికి ఉపనది.

భారతదేశంలో ప్రాంతీయ చరిత్రలకు కూడా ప్రాధాన్యత ఉంది. గోదావరి పరివాహ ప్రాంతమైన ఉత్తర తెలంగాణకు గొప్ప సంస్కృతి, నాగరికతలు ఉన్నాయి. అలాగే కరీంనగర్‌కు వేల సంవత్సరాల చరిత్ర, ఉజ్వల సంస్కృతులున్నాయి. ఈ జిల్లాలో అన్ని కులాల, మతాలు వాళ్ళు 'గంగ యమున తహజీబ్'ల జీవిస్తున్నారు. వాళ్ళ వాళ్ళ ఆచార, సంస్కృతి, సంప్రదాయాలు అనాదిగా కాపాడుకుంటూ భావి తరాలకు అమూల్య సంపదగా అందిస్తున్నారు.

### 1.1. కరీంనగర్ జిల్లా – పేరు

కరీంనగర్ జిల్లా 1905లో ఏర్పడింది. కరీంనగర్ జిల్లా పూర్వనామం ఎ(వె)లిగందుల. వంద సంవత్సరాలకు పూర్వం జిల్లా కేంద్రం కరీంనగర్ పట్టణానికి పడమర పదమూడు కిలోమీటర్ల దూరంలో ఉండేది. 14వ శతాబ్ది మలికాకతీయ యుగ చక్రవర్తి

కాపయనాయకుని సామంత పాలకుడైన రామగిరి ముప్పభూపాలుని దండనాథుడైన కందన మంత్రి వెలిగందుల పాలకుడు. ఇది గిరిదుర్గ ప్రాంతం. కొండ చిన్నగా ఉండి కోట పెద్దగా ఉంటుంది.

ఆరవ నిజాం మహబూబ్ అలీఖాన్ జారీ చేసిన ఫర్మానాతో జిల్లా కేంద్రం ఎలిగందుల నుంచి కరీంనగర్‌కి 1905 మే28న మారింది. అప్పుడు కరీంనగర్ చిన్న గ్రామం. దీనికి కరీంఖాన్ ఖిల్లాదార్‌గా ఉండేవాడు. అతని పేరు మీదనే కరీంనగర్ వచ్చిందని అంటారు. అలాగే మానేరు నదిలో ఏనుగు మీద టప్పా తెచ్చేవారు. కాబట్టి కరీంనగర్ అన్న పేరు వచ్చిందని మరో కథ.

అసలు ఈ జిల్లా పేరు కరీముల్లా అన్న సాధు పేరుతో వచ్చిందనేది మరో వాదన. "నిజానికి కరీముల్లా అనే ముస్లిం సాధు పేరుతో ఈ ఊరి పేరు వచ్చింది. అతడు ఏదో చిన్న ఉద్యోగం చేసేవాడట. మాటలు కూడా సరిగా రావు. దైవ భక్తిలో పడ్డాడు. ఒంటరిగా ఇప్పుడున్న పాతబజార్–బొమ్మకల్ మధ్య అడవి పరిసర మార్గాల్లో 'క, ఖా' అంటూ తిరిగేవాడట. జనానికి అతడంటే అభిమానం ఏర్పడింది. అతనికి ప్రయాణికులు, ప్రజలు దండాలు పెట్టేవారు. ఆయన ఉన్నాడని వారు దారిదోపిడి దొంగల భయం లేకుండా నిర్భయంగా ఈ ప్రాంతం గుండా ప్రయాణించేవారట. అతడు నవ్వుతూ ఆశీర్వదించేవాడు. అతడు మరణించినప్పుడు అతని గోరీ ఈ ఊరిలోనే కట్టారు. కరీంనగర్ పాతబస్తీ శివాలయం వీధిలో 'కరీముల్లా టక్కీయా' అని ఆ నిర్మాణం ఇప్పటికీ ఉంది. ఇది నూటా యాభై ఏండ్ల పూర్వపు సంగతి" (పార్థసారథి, సి.(ప్ర.సంపా). 2006: 47) అన్న సి. శ్రీనివాసరాజు గారి మాటలవల్ల కరీంనగర్ జిల్లాకి పేరు కరీముల్లా అనే సాధువువల్ల వచ్చినట్లు తెలుస్తుంది.

కరీమొద్దీన్ తన పేరిట ఈ కరీంనగరాన్ని స్థాపించినట్టు మరో వాదన. "హైద్రాబాద్ రాజధానిగా పాలించిన అసఫ్‌జాహీల కాలంలో ఎల్గందుల ఖిలేదారుగా పనిచేసిన సయ్యద్ కరీమొద్దీన్ తన పేరట స్థాపించిన పట్టణమే నేటి జిల్లా కేంద్రమైన కరీంనగర్ పట్టణము" (రమణయ్య, జైశెట్టి. 2003: 1). రెండవ అరికేసరి శాసనంలో 'అరిపెణపల్లి' అని, ఇది ఒక బ్రాహ్మణుడికి దానమిచ్చినట్లుగా ఉంది. ధూపాటి వేంకటరమణాచార్యులు కరీంనగర్ మొదటి పేరు అరిపిరాల అన్నారు. ఆ అరిపెణపల్లి, ఈ అరిపిరాల ఒక్కటేనేమో.

## 1.2. సరిహద్దులు

కరీంనగర్ జిల్లా $17^0 - 50$ మరియు $19^0 - 05$ ఉత్తర అక్షాంశాల మధ్య, $78^0 - 29$ మరియు $80^0$ - 22 తూర్పు రేఖాంశాల మధ్య వ్యాపించి ఉంది. ఈ జిల్లాకు ఉత్తరంలో అదిలాబాద్, పడమరలో నిజామాబాద్, దక్షిణంలో మెదక్, వరంగల్, తూర్పులో ఛత్తీస్ఘడ్ రాష్ట్రంలోని బస్తర్, ఈశాన్యంలో మహరాష్ట్రలోని చాందాలు సరిహద్దులుగా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా విస్తీర్ణం 4582 చ.మై.

1897లో ఎల్గందులలో చెన్నూరు, జగిత్యాల, జమ్మికుంట, కరీంనగర్, లక్షెటిపేట, మహదేవపూర్, సిద్ధిపేట, సిరిసిల్ల, మరియు సుల్తానాబాద్ అనే 9 తాలూకాలు ఉండేవి. ఆరవ నిజాం కాలంలో 1905లో జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా జిల్లా కేంద్రం ఎల్గందులనుండి కరీంనగర్కి మారడంతో అప్పుడు లక్షెట్టిపేట, చెన్నూరులను అదిలాబాద్లో, సిద్ధిపేటను మెదక్లో కలిపి పరకాలని కరీంనగర్లో కలపడం వల్ల 7 తాలూకాలు మిగిలాయి. తర్వాత మెటుపల్లి తాలుకా అయ్యింది. ఆ తరువాత పరకాలని తిరిగి వరంగల్లో కలపడంతో ఏడు తాలుకాలు మిగిలాయి. కరీంనగర్లో 57 మండలాలు ఉండేవి.

తెలంగాణ రాష్ట్రం కొత్తగా అవతరించిన తర్వాత జరిగిన జిల్లాల విభజనలో భాగంగా కరీంనగర్ జిల్లా మొత్తం నాలుగు జిల్లాలుగా విభజించబడింది. పాత కరీంనగర్ జిల్లాతో పాటు జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలు కొత్తగా ఏర్పాటు చేశారు. కరీంనగర్ జిల్లాలో కరీంనగర్, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్, మానకొండూర్, తిమ్మాపూర్, గన్నేరువరం, గంగాధర, రామగూడు, చొప్పదండి, చిగురుమామిడి, హుజురాబాద్, వీణవంక, వి. సైదాపూర్, జమ్మికుంట, ఎల్లందకుంట, శంకరపట్నం అనే మండలాలు, జగిత్యాల జిల్లాలో జగిత్యాల, జగిత్యాల రూరల్, రాయికల్, సారంగపూర్, బీర్పూర్, ధర్మపురి, బుగ్గారం, పెగడపల్లి, గొల్లపల్లి, మల్యాల్, కొడిమ్యాల, వెల్గటూర్, కోరుట్ల, మెట్పల్లి, మల్లాపూర్, ఇబ్రహింపట్నం, మేడిపల్లి, కథలాపూర్ అనే మండలాలు, పెద్దపల్లిలో అంతర్గావ్, బమగుండం, ధర్మారం, జూలపల్లి, ఎలిగెడ్, సుల్తానాబాద్, ఓదెల, శ్రీరాంపూర్, ముతారాం మంథని, మంథని, కమాన్పూర్, రామగుండం, పెగడపల్లె, పాలకుర్తి, రాజన్న సిరిసిల్లా జిల్లాలో సిరిసిల్ల, తంగల్లపల్లి, గంభీరావుపేట్, వేములవాడ, వేములవాడ రూరల్,

చందుర్తి, రుద్రంగి, బోయిన్‌పల్లి, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్, ఇల్లంతకుంట, కోనారావుపేట అనే మండలాలున్నాయి.

## 1.3. పాలించిన రాజవంశాలు – రాజులు

కరీంనగర్ జిల్లాని చాలా రాజవంశాలు, రాజులు పాలించారు. మొదట ఆసఫ్‌జాహీ కాలంలో అమీన్‌ఖాన్, తర్వాత అతని కుమారుడు ముఖర్రబ్‌ఖాన్, ఇతని తర్వాత ఫకీర్ మనవ్వర్‌ఖాన్ ఎల్గందుల్ జాగీర్దార్లు. మునవ్వర్‌ఖాన్ పాలనాధికారిగా ఉన్నప్పుడే 1754లో ఎల్గందుల కోటను నూతన నిర్మాణాలతో బలపరిచాడు. తర్వాత ఫారూక్ మిర్జా 1791లో స్వతంత్రం ప్రకటించగా నిజాం అలీఖాన్ సైన్యాలు ఎల్గందుల, జగిత్యాల, నిర్మల్ కోటలను ముట్టడించి అతన్ని బంధీగా చేశాయి. ఆ తర్వాత సయ్యద్ కరీమొద్దీన్ ఖిల్లాదార్ అయ్యాడు. ఇతని పేరుమీదనే కరీంనగర్ గ్రామం ఏర్పడిందని ఒక కథ.

క్రీ.పూ. 6వ శతాబ్దంలో ఏర్పడ్డ పదహారు మహా జనపదాల్లో అస్మక ఒక మహాజనపదం. ఇదే ఇప్పటి నిజామాబాద్ జిల్లా. ఈ జిల్లాతోపాటు కరీంనగర్ కూడా అస్మక మహాజనపదంలో ఒక భాగమై ఉండేది. మగధనేలిన నందపురాజులు దక్కన్‌పై కూడా రాజ్య విస్తరణ చేశారు. గోదావరి తీరంలోని దక్కన్ ప్రాంతం వీరి ఆధీనంలో ఉండడంలో కరీంనగర్ కూడా వీరి పాలనలో భాగంగా ఉండేది. దీని తర్వాత మౌర్యచంద్రగుప్తుడు, నందరాజుల పాలనను అంతంచేసి అధికారంలోకి వచ్చాడు. అశోకుడు క్రీ.పూ.261లో కళింగను జయించి దక్కన్‌ను వశపర్చుకున్నాడు. తద్వారా కరీంనగర్ కూడా వీరి పాలనలోకి వచ్చింది. "రాయచూర్ దోబ్(Doab) ప్రాంతమున గల మస్కి, కోప్‌బాల్ చిన్న శిలాశాసనములు(Minor rock edicts) మరియు కర్నూలు జిల్లాలోని ఎర్రగుడి శాసనముల వలన దక్కనపై అశోకుని సంపూర్ణాధికారము ఉండినట్లు విదితమగుచున్నది. కావున దక్కన్‌లోని కరీంనగర్ మండలం గూడా వీరి ఏలుబడిలో ఉండేది" (రమణయ్య, జైశెట్టి. 2003: 34). నేరుగా కరీంనగర్‌ని పాలించిన తొలిరాజులు శాతవాహనులు అన్న అభిప్రాయం కరీంనగర్ జిల్లాలో జరిపిన తవ్వకాలవల్ల మారిపోయింది. వీరికంటే ముందు ఆంధ్రరాజులు కరీంనగర్‌ని పాలించారు. కోటిలింగాల శాతవాహనుల కంటే పూర్వమే వెలిసిన స్థావరమని చరిత్రకారుల అభిప్రాయం. శాతవాహనుల కంటే పూర్వమే నాణెల

వాడుక ఉన్నట్లు కోటిలింగాల, పెద్దబొంకూరు, కొండాపూర్‌ల వద్ద జరిపిన తవ్వకాలవల్ల తెలుస్తుంది.

ఆంధ్రరాజుల తర్వాత గొప్ప సామ్రాజ్యమైన శాతవాహనుల కొత్త అధ్యాయం ఆరంభమైంది. వీరి మొదటి రాజధాని ప్రతిష్ఠానపురమనీ, తర్వాతది ధరణికోటనీ భావించిగా కోటిలింగాలలో బయల్పడిన ఆధారాలతో అవన్నీ పూర్వపక్షమయ్యాయి. శాతవాహనుల తొలి రాజధాని కోటిలింగాల అని ఇక్కడి ఆధారాలు నిరూపించాయి. శాహవాహనుల మూల పురుషుడు సిముకుడు(శ్రీముఖుడు) కాదనీ, శాతవాహనుడని ఇక్కడి ఆధారాలు చెబుతున్నాయి. "శాతవాహనుల వంశపు మూలపురుషుడు శాతవాహనుడని కొత్తగా వెలుగుచూసిన ఆధారాలు తెలియజేస్తున్నాయి. ఇతని నాణెములు పశ్చిమ మహారాష్ట్రము, విదర్భ, మరత్వాడ, ఆంధ్రప్రదేశ్‌లలో లభ్యమైన తరువాత చరిత్రకారుల అభిప్రాయము మారినది. వీరి రాజ్యస్థాపకుడు సిముకుడు కాదు శాతవాహనుడే మొట్టమొదటి రాజుగను వీరి వంశమునకు శాతవాహనులని పేరు వచ్చినది" (రమణయ్య, జైశెట్టి. 2003: 37). ఇలా కరీంనగర్‌లో జరిపిన తవ్వకాలు చరిత్ర పునర్ లిఖించుకోవల్సిన ఆగత్యాన్ని కల్పించాయి.

శాతవాహనుల తర్వాత ఇక్ష్వాకులు ఈ ప్రాంతాన్ని పాలించారు. వీరి తర్వాత విష్ణుకుండినులు ప్రధాన పాత్ర వహించారు. బాదామి చాళుక్యులు బాదామిని రాజధానిగా చేసుకొని గొప్ప సామ్రాజ్యాన్ని స్థాపించారు. వీరిలో సుప్రసిద్ధుడైన రెండవ పులకేశి అరేబియా నుండి బంగాళాఖాతం దాకా దక్కన్ ప్రాంతాన్ని జయించి తన సోదరుడైన కుబ్జవిష్ణువర్ధనున్ని రాజ ప్రతినిధిని చేశాడు. దీంతో తెలంగాణతోపాటు కరీంనగర్ కూడా వీరి పాలనలో ఉండేది. నేటి నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాలను అప్పుడు 'సపాదలక్షదేశం' అని పిలిచేవారు. 'సపాదలక్షభూమి' అంటే లక్షాపాతికవేల సువర్ణాల ఆదాయం వచ్చే భూమి. దీన్ని పాలించిన రాజవంశీయులే వేములవాడ చాళుక్యులు. వీళ్ళు మొదట బోధన్‌ను, తర్వాత వేములవాడని రాజధాని చేసుకొని క్రీ.శ. 973 వరకు రాష్ట్రకూట సామంతకులుగా పాలించారు. వీరి కాలంలో కన్నడ భాష గొప్ప వైభవంతో వెలుగొందింది. "ఈ వంశమునకు గొప్ప వీరుడును, అరివీర భయంకరుడును, యుద్ధవిద్యావిశారదుడునగు రెండవ అరికేసరి పంపమహాకవిని ఆదరించి గౌరవించి ధర్మపురి అగ్రహారాన్ని ఇచ్చాడు. పంపకవి విక్రమార్జున విజయమను మహా కావ్యమును, ఆది పురాణమును రచించాడు. వీరి కాలముననే గంగాధర ఉపరాజధానిగా పాలించిన వాగరాజువద్ద ఆశ్రయము పొందిన సోమదేవసూరి యశస్తిలక

చంపువు అను గ్రంథము రచించాడు. ఈ రచనలు ఆనాటి చరిత్రకు అద్దము పడతాయి" (రమణయ్య, జైశెట్టి. 2003: 45).

జగిత్యాలకు ఉత్తరంలో 6 కి.మీ. దూరంలో ఉన్న పొలాసలోని రాజులు పొలాస నుండి వరంగల్ జిల్లా నర్సంపేట వరకు రాజ్యాన్ని పాలించారు. తర్వాత కాకతీయులు, ముసునూరి నాయకులు, రేచర్ల వెలమరాజులు, బహమనీ సుల్తానులు, గొల్కొండ కుతుబ్‌షాహీలు పాలించారు. చివరగా తెలంగాణ ఏడవ నిజాం పాలనలో ఉంది. భారతదేశం 1947 ఆగస్టు 15న ఆంగ్లేయులనుండి విముక్తి పొందిన ఏడవ నిజాం స్వతంత్రంగా పాలించుటకు నిర్ణయం తీసుకున్నాడు. ఈ కాలంలో రజాకార్ల దురాగతాలు మితిమీరాయి. వీళ్ళను ఎదురించడానికి ప్రజలు దళాలుగా ఏర్పడ్డారు. "కరీంనగరములోని మందపురం కొడలవద్ద, ఖమ్మంలోని మీనబోలువద్ద, నల్గొండలోని రేనికుంటవద్ద, సూర్యాపేట సమీపపు పాతర్ల పహాడ్ వద్ద రజాకార్లకు ప్రజలకు మధ్య సాయుధ సంఘర్షణలు జరిగినాయి" (పైదే: 150). ఆ తర్వాత భారతదేశ ప్రభుత్వ పోలీస్ చర్యలో సెప్టెంబర్ 17న నిజాం లొంగిపోయాడు. 1949 వరకు మిలటరీ ప్రభుత్వం, 1952 వరకు వెల్లోడి ముఖ్యమంత్రిగా చేయగా 1952లో సార్వత్రిక ఎన్నికలు జరిగి బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు.

అప్పటిదాకా కరీంనగర్‌ని మొదట పాలించింది శాతవాహనులు అన్న అభిప్రాయం కనుమరుగై గోదావరి లోయలో దొరికిన ఆధారాల ఆధారంగా అలాగే కోటిలింగాలలో జరిపిన తవ్వకాల వల్ల కరీంనగర్‌ని శాతవాహనులకంటే పూర్వం సమగోప, గోభద, కంపయ, నారన మున్నగు పాలకులు పాలించినట్లు తెలుస్తుంది. ఇక్కడ లభ్యమైన అనేక రాగి మరియు సీసపు నాణేలపై క్రీ.పూ. 2వ శతబ్దాపు బ్రాహ్మీ లిపిలో రాణోగోభద, రాణోనారన, రాణోసిరికంపయ, రాణో సామగోప అన్న పేర్లు కనిపిస్తున్నాయి.

ఇకా ఈ జిల్లాని పాలించిన కాకతీయులు జిల్లాలో నగునూర్, కొత్తపల్లి, భీందేవరపల్లి, సైదాపూర్ మొదలైన ప్రాంతాల్లో దేవాలయాలు, వాటిల్లో అందమైన శిల్పాలు నిర్మించారు. ఆ తర్వాత రేచర్ల వెలమ రాజులు, విజయనగర రాజులు మొదలైన రాజవంశాలు పాలించాయి.

## 1.4. చారిత్రక ఆధారాలు

కరీంనగర్ జిల్లా చరిత్రకు ముఖ్యాధారాలు శాసనాలే. శిలశాసనాలు, తామ్రపత్రాలు ఆనాటి జీవన విధానాల్ని, పరిస్థితుల్ని తెలియజేస్తున్నాయి. వీటిలో దాదాపు ఎక్కువ దేవుడికి

దానాలిచ్చేటప్పుడు వేసిన శాసనాలే. వీటి వల్ల గ్రామాలు, కోటలు ఎంత ప్రాచీనమైనవో, ఎవరు ఎవరికిచ్చారో చెప్పడంవల్ల ఏయే రాజులు ఎప్పుడు పాలించారో, ఎంతవరకు పాలించారో, వంశానుక్రమణిక మొదలైనవి తెలుస్తాయి. కరీంనగర్‌లో దొరికిన మొదటి శాసనాలు రెండవ అరికేసరివి. వేములవాడ పాలకుల శాసనాలు ఆరు, పశ్చిమ చాళుక్యుల శాసనాలు 20, కాకతీయ శాసనాలు 15 ఈ జిల్లాలో ఉన్నాయి. పి.వి. పరబ్రహ్మశాస్త్రిగారి సంపాదకత్వంలో 1974లో 80 శాసనాలతో కూడిన పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురావస్తు శాఖ ముద్రించింది. అలాగే 2001లో వెంకటాయపల్లెలో ఐదు తామ్రపత్రాలు లభ్యమయ్యాయి.

కరీంనగర్‌లోని అనేక గ్రామాల్లోని ప్రాచీన దేవాలయాలు అనాటి సామాజిక స్థితికి ప్రతిబింబాలుగా ఉన్నాయి. చారిత్రక స్థలాల పర్యటనలో, తవ్వకాల్లో దొరికే మట్టిదిబ్బలు, కుండపెంకలు, ఇటుకముక్కలు, నాణేలు మొదలైనవన్నీ చరిత్రను పునర్ లిఖించడానికి ఎంతగానో దోహదపడ్డాయి. 1953లో నేలటూరి వెంకటరమణయ్యగారి 'The Chalukyas of Vemulavada', 1972లో డా. యం. రాధాకృష్ణశర్మ గారి 'Temples of Telangana', 1974లో డా. పి.వి. పరబ్రహ్మశాస్త్రి సంపాదకులుగా 'Inscriptions of A.P. Karimnagar District', 1981లో కరీంనగర్ జిల్లా రచయితల సంఘం, శ్రీ త్యాగరాజ లలిత కళాపరిషత్ సంయుక్తంలో వచ్చిన 'కరీంనగర్ మండల చరిత్ర', ఠాకూర్ రాజారాంసింగ్ గారి వ్యాసాలు, 1989లో జైశెట్టి ర్తమణయ్యగారి 'Temples of South India', 1990లో కృష్ణవేణి 'Inscriptional Geography of Karimnagar District' అన్న పరిశోధనా వ్యాసం (M.Phil. Thesis), డా.కె. నరోత్తమరెడ్డి 'The Contribution of Karimnagar District to the Social and Political Movements in Telangana' అన్న పరిశోధనా వ్యాసం (M.Phil. Thesis), డా. ఎస్. జైకిషన్ గారి 'War Craft, Arms and Armour in Medieval Deccan(1500 – 1700 A.D.)', మలయశ్రీ గారి 'కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర మొదలైన ఎన్నో పుస్తకాలు కరీంనగర్ జిల్లా చరిత్రని, సాహిత్యాన్ని తెలుకోడానికి అర్థం చేసుకోడానికి ఉపయోగపడతాయి.

## 1.5. చారిత్రక, పర్యాటక ప్రదేశాలు

దక్కన్ ప్రాంతంలో భాగంగా ఉన్న కరీంనగర్‌కి విశిష్టమైన చరిత్ర ఉంది. నది మైదానాల్లో విలసిల్లిన కరీంనగర్‌కి సంస్కృతి, చరిత్రతోపాటు అనేకానేక చారిత్రక, పర్యాటక ప్రదేశాలున్నాయి. ఇక్కడి వాస్తు, శిల్పాలవల్ల, అనేక దేవాలయాల నిర్మాణంవల్ల రాజులు ధనవంతులనీ, గొప్ప కళాత్మక విలువలు కలిగినవారనీ అర్థమవుతుంది. కొండ గుహల్ని ఆలయాలుగా మలచడం, దేవాలయాలు నిర్మించడం లాంటి గొప్పనైన పనులు చేశారు. ఇవి ఆనాటి కళాత్మకతకు, చరిత్రకు సాక్ష్యాలేకాక నేటి కాలంలో దర్శనీయ, పర్యాటక స్థలాలు.

### 1.5.1. అడవి సోమనపెల్లి గుహాలయాలు

ఇది మంథనికి 22 కి.మీ. ల దూరంలో అడవి సోమనపెల్లి గుట్టపై ఉన్న శిలను తొలిచి నిర్మించిన నాలుగు గుహాలయాలు. 'నైనగుళ్లు' అని స్థానికులచే పిలువబడే ఈ గుహాలయాలు ప్రాచీన భారతీయ వస్తుశిల్పాలకు చిహ్నాలుగా ఉన్నాయి. ఒక్కో గుహ రెండు స్థంభాలపై నిర్మించబడింది. ఈ గుహలకు ముందు తెలుగు లిపి లక్షణాలతో రెండు చిన్న శాసనాలు కలవు. మొదటిది అసంపూర్ణం కాగా రెండవది పెనుకంటి ముచ్చిరెడ్డి రామేశ్వదేవుడికి ముగ్గు దీప నైవేద్యాలకు పన్నస భూదానమిచ్చినట్టు తెలుపుతుంది.

### 1.5.2. వేములవాడ

ఇది వేములవాడ చాళుక్యుల రాజధాని. కరీంనగర్‌కి పడమరలో 3 కి.మీ.ల దూరంలో ఉంది. ఇందులోని శిల్పాలు చాలా గొప్పనైనవి. ప్రాచీనమైన దేవాలయాలు ఇక్కడే ఉన్నాయి. దక్షిణకాశీగా వెలుగొందుతున్న ఈ దేవాలయంలో భీమేశ్వర, నగరేశ్వర, బద్దిపోచమ్మ, కేదారేశ్వర, రాజరాజేశ్వర ఆలయాలు ఉన్నాయి. వీటిలో రాజరాజేశ్వర ఆలయం ముఖ్యమైంది. పశ్చిమ కళ్యాణి చాళుక్య చక్రవర్తి, ఆరవ విక్రమాదిత్యుని మహా మండలేశ్వరుడైన రాజాధిత్యుడు ప్రతిష్టించిన రాజరాజేశ్వర దేవర గొప్ప దేవాలయం కట్టాడని ఈ ఆలయం ముందున్న క్రీ.శ. 1083నాటి శాసనం చెబుతుంది.

### 1.5.3. బొమ్మలగుట్ట శాసనం

రెండవ అరికేసరి, అతని వారసుల కాలంలో జైనక్షేత్రంగా వెలుగొందింది. కరీంనగర్ నుండి జగిత్యాలకు వెళ్ళే మార్గంలో కురిక్యాల, న్యాలకొండపల్లి, కొండన్నపల్లి గ్రామాల మధ్యలో ఉంది. ఈ శాసనం కన్నడ ఆదికవిగా గుర్తించబడ్డ పంపకవి సోదరుడైన జినవల్లభుడు క్రీ.శ. 946లో వేయించాడు. ఈ శాసనంలో సంస్కృత, కన్నడ, తెలుగు భాషల్లో గద్యపద్యాలు ఉన్నాయి. చాళుక్య రాజైన రెండవ అరికేసరి పంపకవి రచించిన తన 'విక్రమార్జున విజయం' గ్రంథాన్ని అంకితమివ్వగా అది మెచ్చి ధర్మపురి అగ్రహారాన్ని దానంగా ఇచ్చినట్టు ఈ శాసనంలో ఉంది. "ఈ జినవల్లభుడు వేసిన బొమ్మలగుట్ట శాసనం 'ఓం నమః సిద్ధేభ్యః' అను సంస్కృత వాక్యంతో ప్రారంభమైన తరువాత నొక దీర్ఘ కన్నడ గద్య, తరువాత మూడు సంస్కృత వృత్తాలు(రెండు శార్దూల విక్రీడితాలు, ఒక పృథ్వీ) ఆ తరువాత ఆరు కన్నడ వృత్తాలు(నాలుగు చంపకమాలలు, ఒక మత్తేభ విక్రీడితం, ఒక తరళం), ఆ తరువాత మూడు తెలుగు కందపద్యాలు, చివరన కన్నడ వచనమొకటీ వున్నాయి" (ముత్యం, కె(ప్ర.సంపా.) 2011: 42). ఈ శాసనం నన్నయ భారతంకంటే 100 సంవత్సరాల పూర్వపు శాసనం. మొట్టమొదటి కందపద్యాలుగల శాసనం.

### 1.5.4. ధర్మపురి

పవిత్ర గోదావరి తీరాన వెలిసిన క్షేత్రం ధర్మపురి. కవులకు, ఆధ్యాత్మిక వేత్తలకు, కళాకారులకు నిలయమైంది. "ఆంధ్రదేశమును పాలించిన బలివర్మ మహారాజు తన కుమారుడు అర్థాయుస్కుడని తెలిసి మృత్యువును జయించుటకు గాను ధర్మదేవత యాగం చేసి విజయం పొందినందున, అచటి ప్రజలు ధర్మ మార్గమును నడుచుకొనుచున్నందున ఆ నగరానికి ధర్మపురి అని నామకరణ జరిగనట్లు బ్రహ్మాండ పురాణంలో పేర్కొనబడింది" (పార్థసారధి, సి(ప్ర.సంపా). 2004: 5). అలాగే "ధర్మవర్మ మహారాజు ఈ గ్రామాన్ని పొందించాడు కనుక దీని ఆయన పేరుతో ధర్మపురి అని పేరు వచ్చి ఉందని ధర్మపురి క్షేత్ర మాహాత్మ్యంలో రాసి ఉంది" (నరసయ్య, సంగనభట్ల. 2004: 5). ఇలా ధర్మపురి అని ఈ ఊరికి పేరు రావడానికి గల కారణాలు కనిపిస్తున్నాయి. శాసనాల్లో కూడా ధర్మపురి వివిధ రకాలైన పేర్లతో ఉన్నట్టు చరిత్రకారులు గుర్తించారు.

మహావిష్ణువు అవతారమైన నృసింహస్వామి దేవాలయం ఇక్కడ ఉంది. 'ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం' అన్న స్థల పురాణం ఈ ప్రాంత విశిష్టతను తెలియజేసే గ్రంథం. అలాగే కురిక్యాల శాసనం, ధర్మపురి రామలింగేశ్వరాలయంలోని శాసనాలు, ఏకామ్రనాథుని ప్రతాపచరిత్ర, కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక, శేషప్ప త్రిశతి మొదలైనవి ఈ ప్రాంత చరిత్రకు, వైశిష్ట్యానికి ఆధారాలు. పాత నరసింహస్వామి దేవాలయం చాలా విశిష్టమైంది.

### 1.5.5. కోటిలింగాల

వెల్గటూర్ మండలంలో ఉన్న చారిత్రక స్థలం ఇది. ఇక్కడ చరిత్రకారులు జరిపిన తవ్వకాల్లో బయటపడ్డ ఆధారాలు ఎన్నో కొత్త అంశాల్ని చరిత్రకు అందిచాయి. శాతవాహనుల మొదటి రాజధాని ఇదేననీ, వీరి మొదటిరాజు శాతవాహనుడనీ, శాతవాహనుల కంటె పూర్వం ఆంధ్రరాజులు దక్కన్ ప్రాంతాన్ని పరిపాలించారనే విషయాలు చరిత్రకి ఈ ప్రాంతం అందిచిన కొత్త విషయాలు. వాస్తవానికి ఇక్కడ కోటిలింగాలు లేకున్నా కోటలో లింగం ఉండటంవల్ల కోటిలింగాల అయ్యింది. "వాస్తవమునకు ఇచట కోటి సంఖ్యలో లింగాలు లేవు. ఈ కోటలో కోటీశ్వరు, సిద్ధేశ్వర లింగము గల శివాలయముంది. కోటలో లింగములుండుట చేత పూర్వము ఇది కోటలింగాలుగా పిలువబడి ఉంటుంది. క్రమముగా అది కోటిలింగాలుగా మారి మధ్యయుగమునకు చెందిన శివాలయములో కోటీశ్వరుడు ప్రతిష్ఠింపబడుట వలన ఈ ప్రదేశము కోటీశ్వరుని పేరట కోటిలింగాలుగా మారియుండును" (రమణయ్య, జైశెట్టి. 2003: 333). హాలుని గాథాశప్తశతి, ఇక్కడి నాణేల ఆధారంగా శాతవాహనుల దుర్గమని తెలుస్తుంది. ఇక్కడి శివాలయం చాళుక్య రీతిలో కట్టబడింది.

### 1.5.6. కాళేశ్వరం

త్రిలింగాల్లో (శ్రీశైలం, దాక్షారామం, కాళేశ్వరం) ఒక్కటైన కాళేశ్వరం మహాదేవపూర్ మండలంలో ఉంది. కాళేశ్వరం, ముక్తేశ్వరాలయాలు ఒకే పానపట్టంపై ఉండడం విశేషం. కాలుడు, ఈశ్వరుడు వెలిసిన క్షేత్రం కనుక దీనికి కాళేశ్వరం అని పేరు వచ్చింది. మొదట్లో ఒక్క ముక్తేశ్వరుడే ఉంటే, యముడు తన ఆయుధాలు తుప్పుపట్టగా ఒక యాగం చేస్తాడు.

అప్పుడు శివుడు ప్రత్యక్షమవుతాడు. అప్పుడు యముడు నీతోపాటు నాకు పూజలందుకునే వరం ఇవ్వాలని అడగగా వరమిస్తాడు. మొదట యముడికి చేసి తర్వాత శివుడికి పూజలు చేసి ముక్తిని పొందే వరమిస్తాడు. మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో ఈ క్షేత్రముంది. ఇక్కడి సంగమేశ్వరాలయం, ఆదిముక్తీశ్వరాలయం, చంద్రశేఖరాలయాలు ముఖ్యమైనవి.

### 1.5.7. మంథని

గోదావరి తీరంలో విద్వాంసులకు, వేదపండితులకు, కవులకు, నిలయమైన చారిత్రక, దివ్యక్షేత్రంగా గొప్పనైంది. మంత్రకూటంగా ప్రసిద్ధిచెందిన మంథని మొదట బౌద్ధ, జైన మతాలకు స్థావరంగా ఉండి తర్వాత వైదిక, అద్వైత క్షేత్రంగా మారిపోయింది. ఇక్కడి అనేక శిథిలాలు, శిల్పాలు ఈ ప్రాంత విశిష్టతను చాటి చెబుతున్నాయి. కాకతి రుద్రదేవుడు క్రీ.శ. 1163లో వేయించిన శాసనంలో మంత్రకూటంగా, కాకతీయ గణపతిదేవుడు క్రీ.శ. 1199లో వేయించిన శాసనంలో 'మంత్రకూటం' మరియు 'మంథెన' అని ఉంది. వేద, తర్క, వ్యాకరణ, మీమాంస మొదలైన శాస్త్రాలలో నిష్ణాతులైన వారు ఈ ప్రాంతంలో ఉండేవారు. ఆది శంకరాచార్యులు దీని సార్థకతను గమనించి ధర్మపీఠంగా గుర్తించారని స్థానికుల కథనం. శీలేశ్వర, సిద్ధేశ్వర, గౌతమేశ్వర, కోదండరామ, గోపీజనవల్లభలాంటి 20 దేవాలయాలు చాళుక్యుల, కాకతీయుల కళావైభవాన్ని తెలియజేస్తున్నాయి.

## 1.6. కళా రూపాలు

తెలంగాణకి నట్టనడుమ ఉన్న కరీంనగర్ ఎంతో వైవిధ్యమైన జీవన విధానంతో కొనసాగుతూ వస్తోంది. ఈ జిల్లా అనేక కళారూపాలకు నెలవు. కళలకు, కళాకారులకు స్థానంగా ఉన్న ఈ జిల్లా ఎన్నో జానపద కళలతో నిత్యనూతనత్వంతో సాగుతోంది. ఛిందు యక్షగానాలు, పగటివేషగాళ్ళు, ఒగ్గుకథ, హరికథ, బుర్రకథ, గంగిరెద్దులోళ్లు, ఒగ్గుడోలు ఇలా అనేక కళారూపాలకు కాణాచి ఈ జిల్లా.

### 1.6.1. ఒగ్గుడోలు

పల్లెల్లో బీరప్ప జాతర, పండుగలు చేసేటప్పుడు సాంస్కృతిక కార్యక్రమాలు ఎర్రగొల్ల, కురుమల ఇండ్లల్లో కార్తీక పూర్ణిమ నుండి శివరాత్రివరకు జరుగుతాయి. ఈ నేపథ్యంలోంచి వచ్చిన శైవసాంప్రదాయ రూపమే ఒగ్గుడోలు. పొట్టకు, భుజాలకు, నుదుట విభూతి రేఖలు ధరించి, కాషాయ వస్త్రాలను గోచీలుగా పెట్టుకొని, మెడలో రుద్రాక్షలు, గవ్వల హారాలను ధరించి కాళ్ళకు గజ్జెలు వేసుకొని వీరశైవత్వాన్ని పుణికిపుచ్చుకొని, మెడలో ఒగ్గుడోళ్ళు తగిలించుకొని, వీరు ఈ కళారూపాన్ని ప్రదర్శిస్తుంటే, ఒళ్ళు గగుర్పాటుకు గురవుతుంది. నడుముకు గొంగలితో తయారుచేసిన మూడు కాళ్ళ నాగబందును చుట్టుకుంటారు. నందీ, భృంగి, చండి ప్రమద గణాలు కైలాసంలో ప్రదోష సమయంలో నర్తించే సంధ్యాతాండవానికి ప్రతిరూపంగా ఈ జానపదకళారపం కనబడుతుంది" (నాంగేంద్రశర్మ, సంకేపల్లి. 2004: 9). కరీంనగర్ జిల్లా రాఘవపూర్ కురుమలు దీంట్లో శిక్షణపొంది నేర్చుకున్నారు. ఇక్కడి 20 కుటుంబాలు దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. బీరన్నకథ, బాలనాగమ్మ, మాంధాత, భూలక్ష్మి, పురూరవ చక్రవర్తి, నలదమయంతి, ఐదుమల్లెల కథ వీరు ఆసక్తికరంగా చెబుతారు. 20 మంది వివిధ వేషాలతో ఐదు రకాల విన్యాసాలతో ప్రదర్శిస్తుంటే చూసి తీరాల్సిందే.

### 1.6.2. చిందు యక్షగానాలు

దీన్ని మాదిగ కళాకారులు ప్రదర్శిస్తారు. కరీంనగర్ జిల్లా తీగలగుట్టపల్లి ఈ కళారూపానికి కేంద్రంగా భాసిల్లుతోంది. రాజు, బుడ్డర్‌ఖాన్, ఆడవేషాలు ఇలా ఆరేడుగురు కళాకారులుంటారు. ఒకే ఊరిలో కులాల వంతుగా పదిహేను రోజుల వరకు పరదర్శిస్తుంటారు. హర్మనీ, తబలా, రెండు తాళాలు వీరి వాయిద్య పరికరాలు. గజివెళ్ళి రాజమల్లు, వెంకటనర్సయ్య, మల్లయ్య, లింగయ్యలు ఈ కళారూపాన్ని ఇంకా బతికిస్తున్నారు. వీళ్ళు మాయా సుబద్ర, మైరావణ, అల్లిరాణి, చెంచువిలాసం, భక్త ప్రహ్లాద, సత్యహరిశ్చంద్ర లాంటి ఎన్నో కథలను ఆహార్యంతో పాటు కథాగానం చేస్తూ చెబుతారు.

### 1.6.3. ఒగ్గు కథ

ఒగ్గు కథని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన మిద్దె రాములు ఈ జిల్లావారు. ఈ కళారూపంలో బుర్రకథ, ఛిందు భాగోతాలు కొంచెం మిళితమై ఉంటాయి. దాదాపు కరీంనగర్ అంతట ఈ కళారూపం ఉంది. ఎల్లమ్మ, మల్లన్న, బీరన్న, రేణుకాదేవిలాంటి కథలు సాధారణంగా చెప్పేవి. డోలు, కనకడప్పు, జగ్గు, తాళం, గొంగడి, ఆడ పాత్రధారి ఉంటాయి. ఐదుగురు సభ్యులుంటారు. కథామెత్తం స్థానిక భాషలోనే ఉంటుంది.

### 1.6.4. గంగిరెద్దులోళ్ళు

మచ్చిక చేసుకున్న గిత్తలతో వినోదాల్ని కలిగించేది గంగిరెద్దులాట. వీరు సంచారజీవులు. సంక్రాంతికి వీరు హడావిడి చేస్తారు. కొడిమ్యాల, ధర్మారం, చొప్పదండి, సుల్తానాబాద్, చిగురుమామిడి లాంటి గ్రామాల్లో వీళ్ళున్నారు. ప్రదర్శన తర్వాత ప్రజలు ఇచ్చే ధాన్యం, డబ్బు తీసుకొని జీవనం గడుపుతారు. ఈ ఆటలో గంగిరెద్దు యజమాని చెప్పింది చేయడం, అలిగి పడుకోవడం, నాభిపైకి ఎక్కడం, వందనాలు చేయడం ముఖ్యమైనవి.

### 1.6.5. సిల్వర్ ఫిలిగ్రీ హస్తకళ

వెండిని పల్చటి దారాలుగా తీసి అల్లే అపురూప కళ ఇది. కరీంనగర్, ఎలగందులలో వేయికిపైగా కంసాలి, స్వర్ణకార కుటుంబాలు ఈ కళపై ఆధారపడి బతుకుతున్నాయి. ఈ కళకి ఆద్యుడు కడార్ల ఏనయ్య(మునయ్య) 18వ శతాబ్దంలో ప్రారంభించి విజయవంతం అయ్యాడు. 1967లో కడార్ల సత్యనారాయణ డిల్లీలో అఖిల భారత చేతివృత్తుల బోర్డు మేళాలో ఈ కళా వస్తువుల్ని ప్రదర్శించి కేంద్ర వాణిజ్యమంత్రి మహమ్మద్ ఖురేషి చేతులమీదుగా అవార్డు పొందడంతో జతీయ స్థాయి గుర్తింపు వచ్చింది. 1968లో రామోజుల లక్ష్మణాచారికి రాష్ట్రపతి అవార్డు లభించింది. ఎర్రోజు అశోక్ చేసిన వినాయకుని ఆకృతికి గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకొన్నారు. పూర్తిగా చేతులతోనే ఎలాంటి యంత్రాలు అవసరం లేకుండా తీగలు లాగే మిషన్ పట్టెతో ఈ పనిని చేస్తారు. ఈ జిల్లా వారిచే పొదగబడిన వెండి తీగల సింహాసనం సాలార్‌జంగ్ మ్యూజియంలో ఉంది. రాష్ట్రపతి భవన్‌లో, అమృత్‌సర్ దేవాలయంలో వీరి వస్తువులు ప్రదర్శనకు ఉంచారు.

### 1.6.6. నకాషీ

రంపపు పొట్టు, కర్రముక్కలు, గుడ్డ, చింతగింజల అంబలితో బొమ్మలను చేసే కళ ఇది. ఈ కళ తెలంగాణ సంస్కృతికి, కళలకు ప్రతీక. పోచమ్మ, మహంకాళమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ వంటి గ్రామదేవతలను విగ్రహాలుగా చేయడమే కాకుండా, మందగొళ్ళోళ్ళు, ఇతర సంచార జాతులవారికి వీరు బొమ్మలు తయారు చేస్తారు. వేములవాడ మండలం అమపురం గ్రామవాసి ధనయాలకోట చంద్రయ్య ఒక్కడే ఈ కళకి సాక్షీభూతంగా ఉన్నాడు. ఒకప్పుడు ఆనందంగా బతికిన కుటుంబాలు నేడు ఆదరణలేక, గిట్టుబాటు ధరలేక వలస వెళ్ళాల్సి వస్తోంది. ఈ కళలో చింత అంబలి చేయడం, బొమ్మలను చేయడం, రంగులు వేయడం ముఖ్యమైన ఘట్టాలు.

## 1.7. కరీంనగర్ జిల్లా ఆధునిక ప్రక్రియలు – పరిచయం

ఆధునిక తెలుగు సాహిత్యంలో పాశ్చాత్య సాహిత్య ప్రభావంవల్ల వచ్చిన నవల, కథ, నాటకం, విమర్శ మొదలైన వివిధ ప్రక్రియల్లో కరీంనగర్ నుంచి చెప్పుకోదగ్గ రచయితలు, విమర్శకులు చాలామందే ఉన్నారు.

### 1.7.1. నాటకం

'నాటకాంతం హి సాహిత్యం' అనే లోకోక్తి ఉంది. సాహిత్య సృజన అనేది నాటక రచనతో పరిపూర్ణమవుతుంది. నాటకం కేవలం సాహిత్య ప్రక్రియనే కాదు. రంగస్థల కళతో మిళితమైన సాహిత్య రూపం. అందుచేత నాటకాన్ని సాహిత్య, రంగస్థల కళల సమాహారంగా చెప్పవచ్చు. ఇట్లాంటి నాటకం తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసింది. సంస్కృతంలో నాటకం 10వ శతాబ్దం నుంచి ఉన్నా తెలుగులో ఆధునిక నాటకం 19వ శతాబ్దం వరకు రాకపోవడానికి కారణం దృశ్యకావ్యాలకంటే శ్రవ్యకావ్యాలకే ప్రాధాన్యత ఉండడం. అట్లా 19వ శతాబ్దంలో మొదలైన నాటకం తెలుగు సాహిత్యంలో ఒక విశిష్టమైన సాహిత్య ప్రక్రియగా విశేషమైన జనాదరణ పొందింది. అలాగే కరీంనగర్ నాటకరంగం అటు తెలుగు సాహిత్యంలో ఇటు తెలంగాణ సాహిత్యంలో ఒక విశిష్టమైన స్థానాన్ని పొందింది.

కరీంనగర్ జిల్లాలో మొదటినుంచి జానపద కళారూపాలు ఎక్కువగా ప్రాచుర్యం పొందాయి. విభిన్న రూపాల్లో కళారూపాలు కనిపిస్తూ తమ ప్రత్యేకతను చాటుతున్నాయి. యక్షగానాలు, వీధి నాటకాలు, ఛిందు భాగోతం లాంటివి కరీంనగర్ జిల్లాలో చాలా ప్రసిద్ధి పొందినవి. తెలుగులో తొలి యక్షగానం కందుకూరి రుద్రకవి 'సుగ్రీవ విజయం' అయితే కరీంనగర్ జిల్లాలో మొదటి యక్షగానం శేషప్పగారి 'ధర్మపురి రామాయణం'. ఇది 1820లో రాయబడింది. నారంభట్ల రమణయ్య 'శ్రీ వెంకటేశ్వర మాహాత్మ్యం', నారంభట్ల నరహరి 'పట్టాభి రామాయణము', న్యాలకొండ కిషన్‌రావు 'భామరవేణి', అనసూయ', రాజరామనంద 'సుభద్రా పరిణయము', అయ్యవారు వెంకట నర్సయ్య 'ద్రౌపది స్వయంవరం', 'సుందరకాండ' 'నలదమయంతి', ధవూరి సత్యనారాయణచార్య 'మయూర ధ్వజము', 'యయాత చరిత్ర', పులికాంత రాజయ్య 'దేవాంగ నాటకము', 'రాహూజన్ నాటకం', దూడం నాంపల్లి 'పాండవ అజ్ఞాత వాసం' మొదలైనవారు మొదట్లో యక్షగానాలు, వీధి నాటకాలు, నాటకాలు రాశారు. "కరీంనగర్ జిల్లాలో రెండు వందలేండ్లుగా యక్షగాన – వీధి నాటకాల రచన – ప్రదర్శన విస్తారంగా సాగింది. 1950వరకు పద్యనాటకాలుగానీ, ఆధునిక వచన నాటకాలు కాని ఇక్కడ రాలేదు. వర్తమాన కాలంలోనూ ఇక్కడి కవులు – రచయితలు నాటకాలను ఎక్కువగా రచించలేదు. స్కూళ్లలో ఊళ్లలో విద్యార్థుల – యువజనుల ప్రదర్శనకోసం, నాటికలు ఎక్కువ సంఖ్యలో రచించబడ్డాయి. నాటక ప్రదర్శనలపై ఈ జిల్లాలో ఆసక్తి ఎక్కువగానే ఉన్నా రాష్ట్రవ్యాపి పొందిన తీరాంధ్ర ప్రముఖ రచయితల నాటకాలనే తీసుకున్నారు. అయినా ఈ జిల్లాలో కొందరైనా నాటక రచన కావించిన వాళ్ళు లేకపోలేదు. కరీంనగర్ జిల్లా నాటక రచయితలలో మొదటివారు కీ.శే. గంగా లక్ష్మణరావు. వారు రచించిన శ్రీకృష్ణదేవరాయ నాటకం అలభ్యం" (మలయశ్రీ. 1997: 603). ఈ జిల్లాలో మొదటి నాటకం 'శ్రీకృష్ణదేవరాయ' అయితే తొలి నాటక ప్రదర్శన లక్ష్మీనరసింహా నాటక మండలి వారి 'సతీసావిత్రి'.

ఈ జిల్లాలో సంగీత, సాహిత్యాలకున్న గౌరవం నాటకానికి కనిపించదు. 20వ శతాబ్దంలో ఏర్పడ్డ నాటక సమాజాలు నాటకాభివృద్ధికై దోహదం చేశాయి. కరీంనగర్‌లో 'శ్రీవెంకటేశ్వర నాట్యకళా సమితి', 'శారదా ఆర్ట్స్ క్లబ్', ధర్మపురిలో 'శ్రీ లక్ష్మీనరసింహ నాట్యమండలి', జగిత్యాలలో 'లలిత కళాసమితి', మంథనిలో 'సంగీత కళాసమితి', 'బాల

విశ్వనాథ నాట్యమండలి', మెట్‌పల్లిలో 'మార్కండేయ నాట్యమండలి', 'బాలానంద సంఘం', సిరిసిల్లలో 'శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి' మొదలైన ఎన్నో సంస్థలు స్థాపించబడి నాట్య, నాటక రంగాన్ని ప్రోత్సహించాయి. ఒకవైపు రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతంలో నాటకాలు విరివిగా నాటక రచనలు, ప్రదర్శనలు జరుగుతున్నా, కరీంనగర్‌లో మాత్రం నాటకాల రచన, ప్రదర్శన అంత పెద్దగా లేదు. కాని స్వాతంత్ర్యం తర్వాత కొన్ని నాటకాలు వచ్చాయి. "జిల్లా ఆధునిక నాటకరంగంలో శ్రీ మున్ననూరి హన్మంతరావుగారు కరీంనగర్ పట్టణం సమీపాన గల తిమ్మాపూర్ నివాసి. తన మిత్రులతో కలిసి 1960వ సంవత్సరంలో లలిత కళా సమితి అనే పేరుతో నాటక సంస్థను స్థాపించి, సాంఘిక నాటక, నాటికల ప్రదర్శనకు నాంది పలికారు. వీరు తిమ్మాపూర్ దొర, రాష్ట్రంలోని పలు ప్రాంతాలను సందర్శించి అక్కడ జరుగుతున్న నాటక ప్రదర్శనలు చూసి, కరీంనగర్‌లో కూడా నాటక ప్రదర్శనలు జరపాలని ఉద్దేశ్యంతో వారు నాటక సంస్థను ప్రారంభించుకొని, ప్రదర్శన తీరును నేర్చుకొని 'పునర్జన్మ' అనే నాటకాన్ని తీసుకొని తిమ్మాపూర్‌లో ప్రదర్శించారు. ఈ సంస్థ తరఫున ఎక్కువ సాంఘిక నాటకాలు ప్రదర్శించటం జరిగింది. వీరు తన సొంత ఆలోచనలతో నాటకాలను ప్రదర్శించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని జిల్లాలో పలు సంస్థలు ఏర్పడ్డాయి" (జయవీర్, కోటగిరి. 2012: 79). లలిత కళా సమితి, రతన్ ధార్ ఫెడరేషన్, శారద కళానికేతన్, నవోదయ కల్చరల్ అసోషియేషన్, శ్రీ వెంకటేశ్వర కళాసమితి, శాతవాహన కళా స్రవంతి, గోధూరి నాటక కళాశక్తి మొదలైన ఎన్నో ఆధునిక నాటక సంస్థలు ఆవిర్భవించాయి. 1985లో శ్రీ వి.రామారావు చేతులమీదుగా శ్రీ రాముల సత్యనారాయణ, బండారి శ్రీరాములు, కూనమల్ల రమేష్ మొదలైన వారి ఆధ్వర్యంలో 'చైతన్య కళాభారతి' నాటక సంస్థ ఏర్పడి విశేష కృషి చేస్తోంది. వై.ఎస్.శర్మ, సిద్ధార్థ, సొదాల ప్రభాకర్ తదితరుల ఆధ్వర్యంలో ఆవిర్భవించిన 'శాతవాహన కళాస్రవంతి' వివిధ ప్రదేశాల్లో అత్యుత్తమ నాటకాల్ని ప్రదర్శిస్తోంది. కరీంనగర్‌లోని ఎం. రాజేశం ఆధ్వర్యంలో 'శ్రీ వేంకటేశ్వర కళాసమితి' రాజమౌళి ఆధ్వర్యంలో 'నవరస ఆర్ట్స్' మొదలైనవి జిల్లా నాటకరంగ వికాసానికి కృషి చేస్తున్నాయి.

ఆధునికంగా డా. సి. నారాయణరెడ్డిగారు గేయ నాటకాల రచనలో సుప్రసిద్ధులు. 'నవ్వనిపువ్వు', 'రామప్ప', 'నాగార్జున సాగరం', 'కర్పూర వసంతరాయలు' మొదలైన గేయనాటకాలు రాశారు. డా. మలయశ్రీగారు 'శాంతిపథము', 'ప్రజాకవి వేమన'

'వరకట్నం' లాంటి నాటకాలు రాశారు. జె. బాపురెడ్డిగారు కూడా గేయనాటకాలు ఎక్కువగా రాశారు. వాటిలో 'రాకెట్టు రాయబారం', 'ఋతురాగం', 'సకల జన సంక్రాంతి', 'చాచా నెహ్రూ', 'సాగర సౌధ' మొదలైనవి ఉన్నాయి. ఎస్. వెంకటాద్రి 'భారతాభ్యుదయం', ఎస్. బుచ్చిరాజం 'వీర జ్యోతి', ఎద్మల్ల రామచంద్రారెడ్డి 'వరకట్న పిశాచం', 'మనోదర్పణము', రాయ్ బాల ప్రసాద్ 'రామగిరి' నాటకాలు రాశారు.

### 1.7.2. నవల

వచన సాహిత్యంలో నవలకొక ప్రత్యేక స్థానముంది. మానవజీవన వికాస దశలన్నింటికి సరిపోయే కాన్వాసు కలిగి సామాజిక పరిణామ చిత్రణకు అనువైన ప్రక్రియ నవల. కరీంనగర్ జిల్లా రచయితలు నవలా రచనకు ప్రాముఖ్యతను ఇచ్చారు. 20వ శతాబ్దపు పూర్వార్థంలో నవల రచన స్వల్పంగా సాగినా ఆ తర్వాత పరిస్థితి మెరుగైంది. ఈ జిల్లానుంచి 1934లో ముడుంబై రామానుజాచార్యులు 'కాదంబిని', 'ప్రేమ చాంచల్యం' అనే నవలలు రాశారు. వేణుగోపాలరావు 'జుహరాబాయి', వేంకటరాజన్న అవధాని 'పతి పత్ని', దప్పూరి సత్యనారాయణ 'కర్మయోగి', తిరునగిరి శివరామశాస్త్రి 'సాడేగ్యారా', జి. రాములు 'పెరటిచెట్టు', 'ఆత్మఘోష', వి. తిరుపతిరావు 'ప్రేమజ్యోతి', కర్నె చిరంజీవి 'అనురాగాలు – అనుబంధాలు' మొదలైన వారు నవలలు రాశారు.

"ఈ జిల్లాలో సాంఘిక నవలా రచనది అగ్రస్థానం. ఈ శతాబ్ది పూర్వార్థంలో ఇక్కడ నవలా రచన మితం. ఉత్తరార్థంలో మాత్రం ఆ పరిస్థితి మారింది. 1956 –94 మధ్యకాలంలో ఓ ఇరవై మంది రచయితలు అరువది నవలలు రచించారు. నవలా రచనలో 1960 –70 మధ్య చెలరేగిన రచయిత్రుల హోరుకానీ, 1970 – 85 మధ్య విజృంభించిన రచయితల మంత్ర తంత్రాల సైంటిఫిక్ ఫిక్షన్‌ల ఉప్పెనగానీ ఈ జిల్లాకు తాకలేదు. ఇక్కడ కాలక్షేపానికి చదివించే ప్రేమకథల నవలలు కొన్ని వచ్చినా, వాటికి మించి సాంఘిక చైతన్య – శ్రామిక జన పోరాట గాథలు నవలలుగా రావటం ఈ కరీంనగర్ జిల్లా నవలా రచయితల ప్రత్యేకత" (మలయశ్రీ. 1997: 573). కరీంనగర్ జిల్లా నుంచి సైన్స్ ఫిక్షన్, ప్రేమ నవలలు రాకపోవటానికి ఆ ప్రాంత సామాజిక పరిస్థితులే కారణం. ఎందుకంటే ఒక ప్రాంతం సామాజికంగా అల్లకల్లోలంగా ఉంటున్నప్పుడు అ ప్రాంతం నుండి ఆ సామాజిక పరిస్థితుల్ని చిత్రిస్తూ, వాటికి కారణాల్ని అన్వేషిస్తూ, వాటి నిర్మూలనకై ప్రజల్ని చైతన్యం చేసే రచనలు

వస్తాయి తప్ప సమయపాలనకోసం చదివే నవలలు, వ్యాపారాత్మక నవలలు రావు. తెలంగాణ సాయుధ పోరాటం, సింగరేణి కార్మికుల పోరాటం, దళితుల, బిసిల అస్తిత్వవాద ఉద్యమాలు, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలు ఇలా అనేక రకాల ఉద్యమాలు కరీంనగర్ జిల్లాలో కూడా ఉండడంవల్ల ఆయా ఉద్యమాలకు సంబంధించిన నవలా సాహిత్యం ఈ జిల్లానుంచి వచ్చింది.

కరీంనగర్ జిల్లా నుంచి మైలురాళ్ళుగా చెప్పుకోదగ్గ నవలలు రాసింది అల్లం రాజయ్య గారు. వీరి 'కొలిమంటుకుంది', 'కొమురం భీం', 'అగ్నికణం', 'వసంతం' లాంటి నవలలు సామాజిక ఉద్యమాల్ని, పరిస్థితుల్ని చక్కగా వివరిస్తాయి. అలాగే మలయశ్రీగారు 'కలవారి కష్టాలు', తాగుబోతు', 'విచిత్రప్రేమ', 'ఏం మగాళ్ళు', 'వెన్నెలవాన' వంటి ఎన్నో సాంఘిక, చారిత్రక, ఆత్మకథాత్మక నవలలు రాశారు. గ్రామ పెత్తందార్ల, హరిజనుల పోరాట నేపథ్యంలో ఎం. దశరథ్ 'శతాబ్దాల నిశ్శబ్దం', గిరిజనుల పోరాట నేపథ్యంలో 'వెదురుపొదలు నినదించాయి' నవలలు రాశారు. బి.యస్. రాములు గారు 'బతుకుపోరు', 'చూపు' మొదలైన నవలలు రాశారు. కాలువ మల్లయ్య గారు 'భూమి పుత్రుడు', 'సాంబయ్య చదువు', 'మాట్లాడే బొమ్మలు', 'బతుకు పుస్తకం', 'గువ్వల చెన్నా' మొదలైన పదిహేడు నవలలు, విప్లవ పోరాట నేపథ్యంగా గూడూరి సీతారాం 'కల్లోల నేత్రం' అనే నవల రాశారు. కె.వి. నరేందర్ టెస్ట్ ట్యూబ్ బేబీలపై 'బేబీ ఓ బేబీ', సింగరేణి కార్మికుల బాధలపై 'నల్ల సముద్రం', స్త్రీల సమస్యలపై 'అత్తారింటికి దారేది' నవలలు రాశారు. ఈ జిల్లానుంచి మరో మంచి నవలా రచయిత పెద్దింటి అశోక్ కుమార్. భూగర్భ జలాల క్షీణత ప్రధానాంశంగా 'దాడి', గల్ఫ్ వలసల నేపథ్యంగా 'ఎడారి మంటలు', రైతు వ్యవసాయ సాధకబాధకాల నేపథ్యంగా 'వసంతగీతం', ఇంకా 'జిగిరి' లాంటి నవలలు రాశారు.

గొప్ప కథకుడిగా పేరుగడించిన తుమ్మేటి రఘోత్తమరెడ్డి 'నల్లవజ్రం' నవల రాశారు. ఇది సింగరేణి కార్మికుల ఐకమత్యాన్ని, ఐకమత్యమయ్యే క్రమంలో జరిగిన పరిణామాల్ని చిత్రించింది. సింగరేణి కార్మికోద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ పోరాట మోధుడైన శేషగిరిగారి ఉద్యమ నేపథ్యాన్ని వివరిస్తూ పి. చంద్ 'శేషగిరి' నవల రాశారు. నేరేళ్ళ శ్రీనివాస్ గౌడ్ కళ్ళుగీత కార్మికుల జీవితాల్లో పెనవేసుకున్న రాజకీయ, సంస్కృతి, సామాజిక పరిణామాల్ని చిత్రిస్తు 'బతుకుతాడు' నవల రాశారు.

స్వంత నవలలతోపాటు అనువాద నవలలు కూడా ఈ జిల్లానుంచి వచ్చాయి. 'లండన్‌లో ఒక రాత్రి', 'రాగదర్బారి', 'వక్రరేఖ', 'ఆరడుగుల నేల' మొదలైన నవలలను ముద్దసాని రాంరెడ్డి అనువాదం చేశారు. అలాగే దివంగత ప్రధాని పి.వి. నరసింహారావుగారు మరాఠిలోంచి 'అబలా జీవితం'ను, హిందీలో వేయిపడగల్ని 'సహస్రఫణ్'గా అనువదించారు. నలిమెల భాస్కర్‌గారు కన్నడ నుంచి 'కుండీ' నవలను, మలయాళం నుంచి 'మనీ మేకర్' నవలను తెలుగు అనువాదం చేశారు. వేముల ప్రభాకర్‌గౌడ్ 'స్టీఫెన్ బగ్' అనే ఆంగ్ల నవలను 'విరాటుడు' అనే పేరుతో తెలుగు చేశారు.

### 1.7.3. కథ

పాశ్చాత్య సాహిత్య ప్రభావంవల్ల తెలుగు సాహిత్యంలోకి వచ్చిన ప్రక్రియల్లో కథా ఒక్కటి. తెలుగునాట బహుళ ప్రాచుర్యం పొందిన కథకి తెలుగు సాహిత్యంలో విశిష్టమైన స్థానముంది. తెలంగాణలో కరీంనగర్‌కి కూడా ప్రముఖస్థానమే ఉంది. ప్రపంచ కథలకు పుట్టినిల్లుగా భావించే 'బృహత్కథ' కరీంనగర్‌ను ఏలిన శాతవాహనుల కాలంలో గుణాఢ్యుడిచే రాయబడింది. బృహత్కథను సోమదేవుడు కథా సరిత్సాగరంగా అనువదించాడు. ఇతడు కరీంనగర్ వాడే. ప్రజల నోళ్ళలో ఎన్నో కథలు నాట్యమాడుతుంటాయి. రచ్చబండకాడ, నులకమంచాల్లో కూర్చొని ప్రజలు కథలు చెప్పుకునేవారు. ఇలా కరీంనగర్‌కి కథ కొత్తదేం కాదు. కాని ఇవన్నీ జానపదానికి సంబంధించినవి.

తెలుగు సాహిత్యంలో ఆధునిక కథ 1910లో వస్తే తెలంగాణలో 1912లో వచ్చింది. అది మాడపాటి హనుమతరావుగారి 'హృదయశల్యం'. తెలుగులో మొదటికథ వచ్చిన ముప్పయి సంవత్సరాలకుగాని కరీంనగర్ నుంచి కథ అచ్చు కాలేదు. 1942లో కరీంనగర్ జిల్లానుంచి జి. రాములుగారి 'ఆత్మఘోష' కథల సంపుటి అచ్చైంది. ఈ జిల్లాలో కథ కొంచెం ఆలస్యంగా వచ్చినా తర్వాతికాలంలో విస్తృతంగా వచ్చింది. మొదటితరం కథకుల్లో జి. రాములు, గూడూరి సీతారాం, జి. సురమౌళి, పి. యశోదరెడ్డి, పి.వి. నరసింహారావు ముఖ్యులు. గూడూరి సీతారాం 'నారిగాడి బతుకు', 'మారాజు' లాంటి కథలు, సురమౌళి 'అంగడుపొద్దు', 'ముక్కోటి బలగమోయి' కథలు ప్రసిద్ధి. తొలితరం రచయితలు

మాండలికాన్ని బలంగా రాశారు. ప్రజల జీవితాన్ని వస్తువుగా తీసుకొని కథలు రాయడంతో సామాజిక పునాదిని వేశారు.

మలితరం వచ్చే సరికి కొంత గందరగోళం ఏర్పడింది. "పత్రికలు తక్కువైనా, తొలి తరం రచయితలు తాను రాయదల్చుకున్నది, స్వేచ్ఛగా రాశారు. భాష విషయంలో తమకు తెలిసిన భాషనే వాడారు. మలితరం రచయితలు కలం పట్టేనాటికి పత్రికల సంఖ్య హెచ్చింది. ఆంధ్రప్రదేశ్ అవతరణతో పత్రికాభాష వాడాలన్న వాదం మొదలైంది. అభివృద్ధి చెందిన ప్రాంతంవాళ్ళు వాడే భాషను రాస్తేనే వేసుకుంటారని, వాళ్లలా రాయాలనే తపన పెరిగింది. తమ ముందుతరం రచయితలు వేసిన బాటలో వెళితే పేరు వస్తుందో రాదోనన్న భయం..... దానికితోడు వ్యవహారిక భాషే వాడాలన్న నియమాలు, అందరికీ అర్థమయ్యే విధంగా రాయాలన్న నిబంధనలతో మలితరంలో కరీంనగర్ నుంచి కథా రచనకు కొంత ఖాళీ ఏర్పడింది" (ముత్యం, కె.(ప్ర.సంపా.). 2011: 190 - 191). ఒక సందిగ్ధ అవస్థలో కరీంనగర్ జిల్లా కథా సాహిత్యంలో ఈ కాలం ఖాళీగా కనిపిస్తుంది.

మలితరంలో మలయశ్రీ, తాడిగిరి పోతరాజు, చొప్పకట్ల చంద్రమౌళి, ముప్పాళ్ల నరసింహారావు, ముదుగంటి పాపిరెడ్డి లాంటి వాళ్ళున్నారు. ఈ కాలంలో కథారచయితలు అంతా సీరియస్‌గా తీసుకోలేదు. మూడవతరంలో మంచి కథలు వస్తున్నాయి. భూపోరాటాలను, మధ్యతరగతి వెతలను, దళిత, బహుజన, స్త్రీ, గ్రామీణ జీవుల కష్టాలను, ఫ్యూడల్ వ్యవస్థవల్ల కలిగే వేదనల్ని, పీడిత వర్గాల వెతల్ని, ప్రాంతీయ అస్తిత్వాల్ని ప్రతిబింబిస్తూ చాలా కథలు వచ్చాయి, వస్తున్నాయి. తుమ్మేటి రఘోత్తమరెడ్డి(చామ, పనిపిల్ల, రఘోత్తమరెడ్డి కథలు), కాలువ మల్లయ్య (కట్నం కథలు, ఘర్మ జలానికి, రాజుకోడి, యుద్ధభూమి, ఆంబోతు, శనార్తి, సొసంత్రదినం, మౌన వసంతం, కాలువ మల్లయ్య కథలు, మా కథలు, అవ్వతోడు గిది తెలంగాణ మొదలైన వెయ్యి కథలు రాశారు.), బి.ఎస్.రాములు (పాలు, తేనేటీగలు, స్మృతి, మమతలు, మానవ సంబంధాలు, అడవిలో వెన్నెల, దక్షయజ్ఞం, వారసత్వం మొదలైన కథలు), సరిపల్లి కృష్ణారెడ్డి, కె.వి.నరేందర్ (కాలుతున్న పూలతోట మొదలైనవి), అల్లం రాజయ్య (సృష్టి కర్తలు, అతడు, మహదేవుడి కల, అల్లం రాజయ్య కథలు మొదలైనవి), జింబో (మా వేములవాడ కథలు మొదలైనవి), సాహు (మనం తుడుం కొట్టాలె, రక్త పింజెర మొదలైన కథలు), పెద్దింటి అశోక్ కుమార్ (కాగుబొత్త మొదలైన కథలు), జూకంటి జగన్నాథం (వైపని కథలు), ఆడెపు లక్ష్మీపతి (నాలుగు దృశ్యాలు,

జీవనస్మృతుడు మొదలైనవి) లాంటి వారెందరో కరీంనగర్ కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు.

## 1.8. కరీంనగర్ జిల్లా కవిత్వం – నేపథ్యం

### 1.8.1. సాహిత్య నేపథ్యం

కరీంనగర్ జిల్లాకు చారిత్రక, సాంస్కృతిక అంశాలతోపాటు సాహిత్యానికి విశిష్టమైన స్థానం ఉంది. షోడశ జనపదాల్లోని 'అస్మక' ఈ ప్రాంతమే. బుద్ధుని సమకాలీకుల్లో బావరి, సరభంగ జ్యోతిపాలుడు, బావరి శిష్యుల్లో 16మంది, బుద్ధుని తొలి ఐదుగురు శిషుల్లో ఒకరైన కొండన్న ఈ ప్రాంతం వాడే. "బౌద్ధ వాఙ్మయం తెలిపిన షోడశ మహాజనపదాలలోని అస్సక రాజ్యం ఈ ప్రాంతమే. బుద్ధుని సమాకాలికులైన క్రీ.పూ. 6వ నాటి బావరి, శరభంజ్యోతిపాలుడు, బావరి శిష్యులు పదహారుగురు, బుద్ధుని తొలి ఐదుగురు శిష్యులలో ఒక్కడైన కొండన్న వంటి వారిచే సమకాలిక బౌద్ధమతవ్యాప్తిచే పునీతమైన ప్రాంతం ఇది" (పార్థసారథి, సి.(ప్ర.సంపా.). 2006: 129). మూల మాధ్యమిక కారికలు, విగ్రహవ్యావర్తిని లాంటి ఎన్నో బౌద్ధరచనలు చేసి ప్రసిద్ధుడైన ఆచార్య నాగార్జునుడు, ఆచార్య దిఙ్నాగుడు, తొలి ప్రాకృత కవి, 'గాథాసప్తశతి' రాసిన హాలుడు ఈ జిల్లావారే. తెలుగులో మొట్టమొదటి కంద పద్యాలు ఈ జిల్లా కురిక్యాల శాసనంలో దొరికాయి. ఇవి నన్నయకు వంద సంవత్సరాల పూర్వం నాటివి.

తెలుగు సాహిత్యంలో కరీంనగర్ జిల్లాకి ప్రత్యేకమైన స్థానం ఉంది. మొదటినుండి కవులకు, పండితులకు నిలయం. వందల సంఖ్యలో కవులు వేల సంఖ్యలో రచనలు చేశారు. ఈ ప్రాంతాన్నేలిన రాజులు సాహిత్యాభిమానంతో అనేక మంది కవులను పోషించారు. కొంతమంది కవులు స్వంత అభిరుచితో రచనలు చేశారు. కరీంనగర్ జిల్లా తొలి పద్య కవిత కురిక్యాల శాసనంతో ఆరంభమవుతుంది. ఆ తర్వాతి కాలంలో సాహిత్యం ఎక్కువగా శాసన రూపంలోనే వచ్చింద. ఈ శాసనాలన్నీ కన్నడ, సంస్కృత భాషల్లోనే వచ్చాయి.

'ఉత్తరరామ చరిత్ర' రాసిన భవభూతి, తొలి కన్నడ కవి పంపకవి కూడా ఈ జిల్లావారే. పంపకవి 'విక్రమార్జున విజయం' ఇమ్మడి అరికేసరికి (వేములవాడ పాలించిన చాళుక్య చక్రవర్తి) అంకితమిచ్చాడు. 'కవి జనాశ్రయం' అనే తొలి ఛందోగ్రంథకర్త అయిన

మల్లియరేచన, ఎంతోమందిచేత కీర్తించబడ్డ వేములవాడ భీమకవి, రామగిరి దుర్గాధిపతి ముప్పభూపాలుని మంత్రి వెలిగందుల కందన, 'పద్మపురాణం', 'భాగవత దశమ స్కంధం' రాసిన మడికి సింగన, భాగవతంలోని చివరి రెండు స్కంధాలు రాసిన వెలిగందల నారన, 'చిత్రభారతం' రాసిన చరిగొండ ధర్మన, 'వసుచరిత్ర'కు 'విద్వన్ మనోరంజనీ' వ్యాఖ్య రాసిన సోమకవి, ధర్మపురి నరసింహస్వామి మీద త్రిశతి రాసిన శేషప్ప, 'శివపురాణం', 'మంథెన రామాయణం' అనే రెండు యక్షగానాలు రాసిన ముద్దుబాలంభట్టు, 'కూర్మపురాణాన్ని' చంపూకావ్యంగా అనువాదం చేసిన రాజలింగకవి, 'వసుచరిత్ర'కు గొప్ప వ్యాఖ్యానంతో పాటు 'చతుర్భుజాభిషేకం', 'ధ్రువచరిత్ర', 'మరుత్సందేశం', 'ముద్రాలాభము' రాసిన సోమనాథకవి, 'వామన చరిత్రము', 'గయోపాఖ్యానము', 'లక్ష్మణా పరిణయము', 'రుక్మిణీ కళ్యాణము' అనే యక్షగానాలు రాసిన చెర్లపల్లి కాశీనాథశాస్త్రి ప్రాంతానికి చెందినవారే.

సురవరం ప్రతాపరెడ్డిగారి 'గోలకొండ కవుల సంచిక'లో ఆచి రాఘవాచార్య శాస్త్రులు, ఆత్తలూరి విశ్వనాథశాస్త్రి, దవ్వూరి సత్యనారాయణచార్యులు, ముడుంబ రామానుజాచార్యులు, ఐల్నేని గోపాలనాయుడు, చక్రహరి అచ్యుతరాజు, నేరేళ్ల వెంకటాచార్యులు, పండిత భావి కృష్ణశాస్త్రి మొదలైన ఈ జిల్లాకు చెందినవారు 40కి పైగా కవులుండడం ఈ జిల్లా గొప్పతనాన్ని చాటుతుంది. ఆ తర్వాతి కాలంలో గంగా లక్ష్మణరావు, రామసింహకవి, సిరిశెనహళ్ కృష్ణమాచార్య శతావధాని, వానమామలై వేంకటాచార్యులు, వెలిచాల కేశవరావు మొదలైన పద్యకవులు, యక్షగాణ కవులు, మధుర కవులు ఎందరో ఉన్నారు. "వెయ్యేండ్ల కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్రలో ఈ 20వ, శతాబ్ది ఆరంభం వరకు పద్య కావ్యాలే తప్ప వచన రచనలు లేవు. మధ్యకాలంలో వేములవాడ సోమనాథసూరి వసుచరిత్ర వ్యాఖ్యానం ఒక్కటి మాత్రమే గణన కెక్కిన వచన గ్రంథం. అయినా జన వ్యవహారంలో గద్యం ఉంది. శిలాశాసనాలు, చంపూ కావ్యాల్లోని వచనాలు యక్షగాన వీధి నాటకాల్లోని సంధి వచనాలు – సంభాషణలు, ఆశ్వాసాంత గద్యలు ఇక్కడి ప్రాచీనాంధ్ర వచన రచనకు మచ్చు తునకలు" (మలయశ్రీ. 1997: 256).

ఇరవయ్యో శతాబ్దిలో వచ్చిన గొప్ప మార్పు అచ్చుయంత్రం రావడం. దీంతో కవులకు తమ పుస్తకాల్ని అచ్చులోకి తీసుకువచ్చారు. ఇరవయ్యో శతాబ్ది పూర్వార్థంలో లక్ష్మణాచార్యులు, నరిశినహళ్ కృష్ణమాచార్యులు, అనంతవరపు సిద్ధప్ప, పరమారాధ్యుల రాజయ్యకవి, రామసింహకవి, ఆనందమాంబ, వి. కేశవరామ, వేకంటరాజన్న అవధాని

మొదలైన వారంత పద్య కవిత్వాన్ని విస్తృతంగా రాసారు. డా. పింగళి లింబాద్రిగారు 'విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల' అనే ప్రచురణ సంస్థను ప్రారంభించి 21 పుస్తకాల వరకు ముద్రించారు.

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలోకి ఎన్నో కొత్త ప్రక్రియలు వచ్చాయి. నవల, కథ, కవిత్వం, వ్యాసం మొదలైన ఎన్నో కొత్త రూపాలు తెలుగు సాహిత్యానికి పరిచమయ్యాయి. వాటిలో కవిత్వం ఒకటి. పాశ్చాత్య సాహిత్యంతో పరిచయమున్నవాళ్ళు ఛందస్సు, గణాలు మొదలైన వాటినుండి బయటపడి స్వేచ్ఛగ తమ భావాల్ని వ్యక్తీకరించడానికి ఒక రూపం కావాలనుకున్నారు. అలా 1930లో వచ్చిన శిష్ట్లా ఉమామహేశ్వరరావు గారి మొదటి వచన కవిత మొదలు వచన కవిత్వంపైన విస్తృతమైన ప్రచారం జరిగింది. తెలంగాణలో 1948లో దాశరథి 'పునర్నవం' మొదటి కవిత కాగా అప్పటినుండి 1970దాకా కొనసాగుతూ వస్తోన్న పద్యాన్ని కాదనలేని స్థితి కనిపిస్తుంది. పద్యం, గేయం, వచన కవిత్వం సమపాళ్ళలో కనిపిస్తుంది. 1970 తర్వాత క్రమంగా పద్యం, గేయం తగ్గుముఖం పట్టాయి. ఈ కాలంలో కరీంనగర్ జిల్లాది కూడా అదే పరిస్థితి 1965 డా. సి. నారాయణరెడ్డిగారి 'అక్షరాల గవాక్షాలు'లో మొదటి కవిత కనిపించినా పద్యం కూడా ఉంది. 1968లో వచ్చిన 'మధ్యతరగతి మందహాసం' పూర్తి వచన కవితల పుస్తకం.

### 1.8.1.1. సాహితీ సంస్థలు

సాహిత్యాన్ని ప్రజలదగ్గరికి చేరవేయడంలో, ముందుకు తీసుకుపోవడంలో సాహతీ సంస్థల కృషి ముఖ్యమైంది. కవి సమ్మేళనాలు పెట్టడం, సాహితీ గోష్ఠులు నిర్వహించడం, పుస్తకాల్ని ప్రచురించడం, ఉత్తమ పుస్తకాలకి బహుమతులు అందించడం లాంటి ఎన్నో సాహితీ కార్యక్రమాల చెయ్యడం ద్వారా సాహిత్యం కొత్త ఉత్సాహాన్ని పొందుతుంది. కరీంనగర్ జిల్లాలో మొదటినుంచి సాహితీ సంస్థలు సాహిత్యానికి ఎనలేని సేవను చేస్తూ, ప్రోత్సాహాన్ని ఇస్తూ వచ్చాయి, వస్తున్నాయి. ఈ జిల్లాలో మొదటి సాహితీ సంస్థను డా. బోయినపల్లి వెంకటరామారావు 'సారస్వత జ్యోతి మిత్ర మండలి' అనే పేర 1950 సెప్టెంబర్, 2న ఏర్పాటు చేశారు. కరీంనగ్ జిల్లా ప్రాచీన చరిత్రను, సాహిత్యాన్ని వెలుగులోకి తేవడంలో, సాహిత్య, సాంస్కృతిక, వైజ్ఞానిక కార్యక్రమాలు చేయడంలో ఈ సంస్థ ముందుంటుంది. "ప్రాచీన చరిత్ర, సాంస్కృతిక కేంద్రాలైన మంథని, శనిగరం, ఉప్పల్ ప్రాంతాలనుండి,

ఇటుకలు, పెంకులు, నాణాలు, మృణ్మయ పాత్రలు తవ్వించి, వాటిని తెచ్చి సారస్వత జ్యోతి మిత్ర మండలి సంగ్రహాలయంలో భద్రపరిచింది. ఇంకా పెద్ద బొంకూరు, ధూళికట్ట, కోటిలింగాలు, చిత్రకూటమి ప్రాంతాలలో ప్రజలకు లభించిన శాతవాహన నాణాలు కూడా భద్రపరిచింది. ఈ నాణాలను పరిశీలించి కేంద్ర ప్రభుత్వ డిప్యూటి డైరెక్టర్ శ్రీ రాయప్రోలు సుబ్రహ్మణ్యం పరిశోధనా పత్రాన్ని తయారుచేసి గోల్డెన్ జూబ్లి సెలబ్రేషన్ సంచిక (ఉస్మానియా విశ్వవిద్యాలయం)లో ప్రచురించారు" (శివప్రసాద్, సంకేపల్లి. అముద్రిత సిద్ధాంత గ్రంథం. 2005: 362). రామభోజ, తిప్పర్తి సత్యనారాయణ, వాసాల నర్సయ్యలు కలిసి 'త్రివేణి సాహిత్య సంస్థ'ను ఏర్పాటు చేశారు. జాగిరి శ్రీనివాస్ గౌడ్ 'శాంతి బాలానంద', అందె వెంకటరాజం 'భారతి సాహిత్య సమితి' పేరుతో వ్యక్తిగతంగా సాహితీ సంస్థను స్థాపించి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారు. డి.వి. మురళీ మనోహరాచార్యులు 'లలిత కళాసమితి' ద్వారా ఎందరో యువకులలో సాహిత్య, సాంస్కృతిక ప్రేరణను కలిగించడానికి కృషి చేస్తున్నారు. ధర్మపురిలో 'శేషప్ప సాహితి'ని స్థాపించి కొరిడె రామయ్య, డా. సంగనభట్ల నరసయ్య మొదలైనవారు పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తూ స్ఫూర్తి కలిగిస్తున్నారు.

1962లో జరిగిన బోయినపల్లి జన్మదినోత్సవంలో మామిడిపల్లి సాంబశివశర్మ అధ్యక్షులుగా, వెంకటరామారావు కార్యదర్శిగా, శ్రీవేదాంతం కాశీనాథం, మునుగోటి కృష్ణమూర్తి కార్యవర్గ సభ్యులుగా 'కరీంనగర్ జిల్లా రచయితల సంఘం' ఆవిర్భవించింది. 12 డిసెంబర్, 1971నా కోరుట్లలో డా. దివాకర్ల వెంకటావధాని, డా. వానమామలై వరదాచార్యులచే 'భారత సాహత్య సమితి' స్థాపించబడంది. ఈ సంస్థ వరదాచార్యుల షష్టిపూర్తి 1973 మార్చి, 25, 26 తేదీలల్లో ఘనంగా నిర్వహించింది. వేములవాడలో 1976లో 'నటరాజ కళానికేతన్' సాంస్కృతిక సంస్థగా ఆవిర్భవించి నలుదిశల వ్యాపించి పల్లెపల్లెకు చేరింది. సాహిత్యంతో చైతన్యాన్ని కలిగించడానికి 'నవత' పత్రికను ప్రారంభించి కవులందరిని ప్రోత్సహించింది. 1982 ఆగస్టు 15వ తేదీన జగిత్యాలలో 'జనహిత సాహిత్య సమితి' 'కళ ప్రజలకోసం' అన్న నినాదంతో స్థాపించబడింది. ఈ సంస్థ వ్యవస్థాపకాధ్యక్షులు ఎస్.కె. పిళ్ళైగారు. హుస్నాబాద్‌లో సాహిత్యాన్ని ప్రోత్సహించేల, కవులకు ఆలంబనగా ఉండేల 1985లో హుస్నాబాద్‌లో 'నూతన సాహితి' ఆవిర్భవించింది. అప్పటినుంచి ఎన్నో కార్యక్రమాలు చేస్తూ వస్తోంది.

అన్నవరం దేవేందర్, సుద్దాల ఎల్లయ్య, కలిసి 1986లో హుస్నాబాద్‌లో 'నూతన సాహితి' సంస్థను స్థాపించి ఎన్నో పుస్తకాలను ప్రచురించారు. 1989 బుద్ధ పూర్ణిమ రోజున 'యువకళాసాహితీ'గా ప్రారంభమై తర్వాత 'మానేరు రచయితల సంఘం'గా మారింది. మారసం సభ్యులైన గూడూరి సీతారాం, డా. పత్తిపాక మోహన్‌లు సిరిసిల్లాలో గొప్పగొప్ప సాహతవేత్తల చేత కార్యక్రమాలు నిర్వహించి కవులకు కొత్త చైతన్యాన్ని అందిస్తున్నారు. సంఘంలోని హింసను సాహిత్యంద్వారా అడ్డుకోవాలనే ఉద్దేశ్యంతో 1990, ఫిబ్రవరి 8న 'సమతా సాహితి' అప్పటి కలెక్టర్ ఐ.వి. సుబ్బారావు గారిచే కరీంనగర్‌లో ప్రారంభించబడింది. సిరిసిల్లలోనే దూడం నాంపల్లి 'సిరిసిల్ల సాహితీ సమితి(సిసాస)'ని ఏర్పాటు చేసి పుస్తకాలు ప్రచురిస్తున్నారు. 'నయనం' పేరుతో జూకంటి జగన్నాథం ప్రచురణ సంస్థ పెట్టి దాదాపు 20 పుస్తకాల వరకు ముద్రించారు. చొప్పకట్ల చంద్రమౌళి, పురాణం రామచంద్ర 'కళానికేతన్'ని స్థాపించి ఎందరికో ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. వీళ్ళు 'లయ' పేరుతో వేసిన కవిత్వ సంకలనం విశిష్ట ప్రచారం పొందింది. దీంట్లో అలిశెట్టి ప్రభాకర్, వారాల ఆనంద్, జింబో, రవీంద్ర, వఝల శివకుమార్‌ల కవితలున్నాయి. మలయశ్రీ 'నవ్య సాహిత్య పరిషత్' ద్వారా ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణిమ రోజున విశిష్ట సాహితీవేత్తలకు, రచయితలకు, చరిత్రకారులకు పురస్కారాలు ఇస్తున్నారు.

'జానపద సాహిత్య పరిషత్' ద్వారా గోపు లింగారెడ్డి వైవిధ్యమైన అంశాలపై కార్యక్రమాలు, సెమినార్లు నిర్వహిస్తున్నారు. కలువకుంట రఘునాథాచార్యులు, కె.యస్. అనంతాచార్య, మాడిశెట్టి గోపాల్ మొదలైనవారు 'సమైక్య సాహితి'ని నెలకొల్పారు. అన్ని సాహితీ సంస్థలు కలిసి 1990లో 'సాహితీ గౌతమి'గా ఏర్పడ్డాయి. ఈ సంస్థ ప్రతి సంవత్సరం జ్ఞానపీఠ్ అవార్డు గ్రహిత డా. సి. నారాయణరెడ్డి గారి పేరుమీద సి.నా.రె. పురస్కారాన్ని రాష్ట్రస్థాయిలో ఉత్తమ కవితా సంకలనానికి 10 వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరిస్తున్నారు. 'గౌతమ పురస్కారం' పేరిట ఏట 1116 రూపాయలు విభిన్న ప్రక్రియలకు అందిస్తుంది. దురాచారాల్ని అంతంచేయడానికి, హింసను వ్యతిరేకించడానికి, ఉత్తమ సాహిత్య సృజనకై ఏప్రిల్ 24, 1990న కరీంనగర్‌లో 'సమైక్య సాహితి' ఆవిర్భవించింది. సాహిత్యంలో అణచివేయబడ్డ కులాలు ప్రముఖ పాత్ర పోషించాలని ఇప్పటి బి.సి. కమీషన్ ఛైర్మన్ అయిన బి.ఎస్. రాములుగారు 1990లో జగిత్యాలలో 'విశాల సాహిత్య అకాడమి'ని స్థాపించారు. బాలల శ్రేయస్సుకై 1992, అక్టోబర్ 2న కరీంనగర్‌లో

'బాలల వికాస సమితి' ఏర్పాటైంది. 1997 నవంబర్‌లో కేవలం 10 మందితో ప్రారంభమైన 'సిరిసిల్ల సాహితి సమితి' ఇప్పుడు 50 మందితో సాహితీ కార్యక్రమాలు జరుపుతోంది.

ఈవిధంగా కరీంనగర్ జిల్లాలో ఎన్నో సంస్థలు స్థాపించబడి కరీంనగర్ జిల్లా సాహిత్యాభివృద్ధికై ఎన్నో కార్యక్రమాలు చేస్తూ ప్రజలదగ్గరకు సాహిత్యాన్ని తీసుకెళ్తున్నాయి.

### 1.8.1.2. పత్రికలు

సాహిత్యాభివృద్ధికై సాహితీ సంస్థలతోపాటు పత్రికలు కూడా తమవంతు పాత్రను పోషించాయి. మొదటనుండి కరీంనగర్‌లో పత్రికలు తమవంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తూ వస్తున్నాయి. "జిల్లాలో సాతంత్రోద్యమ కాలం నుండి నేటివరకూ వెలువడిన పత్రికలపై సమగ్ర పరిశోధన అవసరం. ప్రాథమికంగా తెలిసిన వివరాల ప్రకారం, సీనియర్ పాత్రికేయుల అంచనాలనుబట్టి తాజీర్ అనే ఉర్దూ వార పత్రిక జిల్లానుంచి వెలువడిన మొదటి పత్రిక" (పార్థసారథి, సి(ప్ర.సంపా.). 2006: 275). 1953లో 'నాదం' పేరుతో సిరిసిల్ల తెలుగు రచయితల సంఘంవారు ప్రత్యేక సంచికను ముద్రించారు. దీనికి కనపర్తి లక్ష్మీనరసింహ గారు సంపాదకులు. 1954, ఫిబ్రవరిలో బోయినపల్లి వెంకటరామారావు సంపాదకత్వంలో 'సారస్వత జ్యోతి' త్రైమాసిక పత్రిక వెలువడింది. "1954లో కరీంనగర్ నుంచి బోయినపల్లి వెంకటరామారావు ప్రారంభించిన సారస్వతజ్యోతి తెలంగాణలో యువకవులకు వేదికగా నిలిచింది. ఎందరో యువకవుల తొలి కవితలు ప్రచురించిన పత్రికగా దీనికి గుర్తింపు ఉంది. యువకవులతో పాటుగా వానమామలై సోదరుల రచనలు, వేముగంటి నరసింహాచార్యులు, వేదాంతం కాశీనాథం, దూపాటి వెంకటరనంఆచార్యులు, జి.చంద్రమౌళి, కాళోజి, పొట్లపల్లి, దాశరథి, కంబాల తాతారావు తదితరులు ఈ పత్రికలో తమ రచనలు వెలువరించారు" (నారాయణరెడ్డి, సి.(ప్ర.సంపా.). 2013: 215) అన్న సంగిశెట్టి శ్రీనివాస్ మాటలవల్ల ఈ పత్రిక గొప్ప కవులతోపాటు యువకవులకు స్థానమిచ్చేదని తెలుస్తుంది. దీంతో యువకవులకు ఉత్సాహాన్ని, ప్రేరణను కలిగించింది. ఇదే సంవత్సరంలో లింబాద్రిరెడ్డి గారి సంపాదకత్వంలో 'సరోజిని' పత్రిక వచ్చింది. ఇది వ్యవసాయ, వాణిజ్య, సారస్వతాంశాలను ప్రచురించేది. అలాగే మంథని పాఠశాల విద్యార్థులు తమ రచనల ముద్రణకై 'విజయ' పత్రికను వెలువరించారు. దీనికి మంథని పాఠశాల విద్యార్థులే సంపాదకులు. 1955లో జగిత్యాల నుండి ఆర్. రాధాకృష్ణగారి

సంపాదకత్వంలో 'జ్యోత్స్న' వచ్చింది. దీంట్లో స్థానిక రచనలు ప్రాధాన్యత ఉండేది. కమల్ సంపాదకత్వంలో 1965లో 'సాగర్', కరీంనగర్ నుంచి 'మనబడి', 1968లో 'మానేరు' ఉర్దూ పత్రికలు, 1977లో కమల్, మలయశ్రీ సంపాదకత్వంలో 'సత్యార్థి', బాల రచయితల సంఘం తరఫున 'నవోదయ;, చొప్పకట్ల చంద్రమౌళి సంపాదకత్వంలో 1976 వేములవాడ నుండి 'నవత' పత్రికలు వెలువడ్డాయి. 1968 పురాణం రామచంద్ర సంపాదకత్వాన వెలువడిన 'ప్రతిధ్వని' పక్ష పత్రిక తెలంగాణ ఉద్యమానికి అద్దంలా నిలిచింది. బి. విజయ్ కుమార్, గోపు లింగారెడ్డి, పి. వెంకటరెడ్డి సారథ్యంలో 'విద్యుల్లత' మాస పత్రిక వెలువడింది.

'జీవగడ్డ' జిల్లా నుంచి వెలువడిన మొదటి దినపత్రిక. ఇది 1985 జూన్‌లో బి. విజయ్ కుమార్ సంపాదకత్వంలో వెలువడి ప్రజాసమస్యలకు కేంద్రంగా పనిచేసింది. 1992లో 'మానేరు టైమ్స్' వచ్చింది. జగిత్యాల నుండి ప్రభాకర్‌రావు సంపాదకత్వంలో 'మంటలు' పత్రిక వచ్చింది. గోపు లింగారెడ్డి 'జానపద సరస్వతీ', 'జానపద పరిశోధన' పత్రికలు నడిపారు.

### 1.8.2. ఉద్యమ నేపథ్యం

హైదరాబాద్ సంస్థానాన్ని 1721 నుంచి 1948 వరకు ఆసఫ్‌జాహీలు పాలించారు. వీరు భాషా పేరున తెలంగాణ, మరట్వాడా, కర్ణాటక అనే ప్రాంతాలుగా విభజించారు. తెలంగాణలోని 16 జిల్లాలను 4 సుభాలుగా విభజించారు. వరంగల్ సుభాలో వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలు ఉండేవి. కరీనగర్ మొదటి నుండి ఉద్యమాలకు కేంద్రంగా ఉంది. నైజాం కాలంలో భూములన్నీ సర్ఫేఖాస్, దివానీ, గైర్‌ఖాల్సాల కింద ఉండేవి. రైతు చనిపోతే భూమి వారసునికి రానివ్వకపోవడం, కౌలురేట్లు తరచుగా పెంచడం, ఎక్కువ శిస్తు వసూలు చేయడం లాంటి ఎన్నో దుర్మార్గపు పనులు చేసి ప్రజల్ని, రైతుల్ని కష్టాలు పెట్టేవారు.

దేశ్‌ముఖ్‌లు, దేశాయిలు, జాగీర్దార్లు, పటేల్ లాంటి వారందరూ ప్రజలచేత వెట్టిచాకిరి చేయించుకునేవాళ్ళు. కులాలవారీగా పనులు చేయించుకునేవారు. మంగలి లేదా చాకలి వాళ్ళు కచ్చురం(ఎడ్లబండి) ముందు పరిగెత్తడం, కుమ్మరివాళ్ళు కుండలివ్వడం ఇలా సమస్త కులాలవాళ్ళు ఏదో రకంగా పనిచేసేవాళ్ళు. నిజాం తనకు శిస్తు రావడానికి గ్రామాధికారులకు సర్వ అధికారాలు కల్పించాడు. తద్వారా పెత్తందార్లు, భూస్వాములంత చెలరేగి అధిక శిస్తూలు వసూలు చేయడం, కట్టనివాళ్ళ భూములు స్వాధీనం చేసుకోవడం

జరిగింది. దీంతో రైతులు, భూస్వామ్య అనే రెండు వర్గాలుగా ప్రజలు చీలిపోయారు. అనేక కష్టాలు, బాధలను భరించిన పేదరైతులంతా తిరుగుబాటు చేశారు. 1930లో తెలుగుకు గౌరవ స్థానం, హరిజనోద్ధరణ, గ్రంథాలయోద్యమం మొదలైన లక్ష్యాలతో ఆంధ్రమహాసభ ఏర్పడింది. కరీంనగర్‌లో కీ.శే. రాంపాల్ లాహోతి ఆధ్వర్యంలో 'ఆర్యసమాజం' ఏర్పడింది. పొల్కంపల్లి వెంకటరామారావు, బద్దం ఎల్లారెడ్డి, చెన్నమనేని రాజేశ్వరరావు, ఠాగూర్ శ్యాంసుందర్ సింగ్ మొదలైన వారు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1937లో బద్దం ఎల్లారెడ్డి ఆంధ్ర, తెలంగాణ రైతులు చెల్లిస్తున్న శిస్తు వివరాల్ని కరపత్రంగా వేసి పంచగా పోలీసులు నిర్బంధించారు.

ఆంధ్రమహాసభ మరియు స్టేట్ కాంగ్రెస్ కృషివల్ల ఆందోళనలు, ఉద్యమాలు జరిగాయి. "1935లో సిరిసిల్లలో జరిగిన నాలుగో ఆంధ్ర మహాసభానంతరం కరీంనగర్ జిల్లాలో ఆంధ్రమహాసభ కార్యక్రమాలు విస్తరించినవి. బద్దం ఎల్లారెడ్డి, పొల్కంపల్లి వెంకటరామారావు, అనభేరి ప్రభాకర్‌రావుల నాయకత్వంలో రైతు, కూలీ, విద్యార్థి ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఆంధ్రమహాసభ నిర్మాతలలో ఒకరైన బద్దం ఎల్లారెడ్డి అనేక గ్రామాలు పర్యటించి సభలు, సమావేశాలు జరిపి రైతు ఉద్యమానికి తొలి పునాదులు వేసినారు. సిరిసిల్ల తాలూకాలో జేరు బావులి(మోటబావి క్రింది సాగు చేసే తరిపొలం)పై పన్ను మినహాయించాలని ఉద్యమం నడిపినాడు. వెట్టి నిషేధించాలని, క్షామనివారణ పథకాలు అమలు జరగాలని, భూమి శిస్తు రద్దు చేయాలని నినాదలిస్తూ పదివేల మంది రైతులు కరీంనగర్‌లో ఆకలియాత్ర జరిపారు. నిజాం ప్రభుత్వం దిగివచ్చి శిస్తు వసూళ్లను ఆ సంవత్సరానికి నిలిపివేసింది" (ముత్యం, కె(ప్ర. సంపా.). 2011: 185). ఇలా కరీంనగర్ జిల్లా నిజాంకి వ్యతిరేకంగా పోరాటం చేసి విజయం సాధించింది.

రైతుల జీవన పరిస్థితి మెరుగుపడాలనీ, దున్నేవాడికే భూమి చెందాలనీ, వ్యవసాయ విప్లవం వర్ధిల్లాలనీ చేసిన కరీంనగర్ రైతాంగ పోరాటం విశిష్టమైంది. "వ్యవసాయ కూలీలకు(స్త్రీ, పురుష) కూలీ రేట్లు పెరగాలనీ, నెల జీతాలు, సంవత్సర పెట్టుబడులు పాలేర్ల(జీతగాళ్ల)కు పెరగాలని, వెట్టిచాకిరీని రద్దుచేయాలనీ, భూస్వాములకు ఇచ్చే అన్ని రకాల మామూళ్లను నిలుపుదల చేయాలని, భూస్వాములు కాజేసిన లక్షలాది రూపాయల దండుగల డబ్బు వాపస్సు ఇవ్వాలని, బంజరు, పోరంబోకు, బంచరాయి, శిఖం – భూములను భూస్వాముల అక్రమ ఆక్రమణ నుండి రైతు – కూలీ సంఘం నాయకత్వంలో

తిరిగి ఆక్రమించుకోవాలనీ, భూస్వాముల అక్రమ ఆక్రమణలో గల అడవులలో గల కలపను స్వాధీనం చేసుకోవాలనీ, ఇండ్ల స్థలాలు కావాలనీ మొదలగు నినాదాలపై రైతాంగం కదిలారు. కొద్ది దినాల లోపుగానే జగిత్యాల తాలూకాలో రైతుకూలీ పోరాటాల ఉప్పెన ఎగిసింది" (...... 2012: 23 - 24). ఇన్నీ దుర్మార్గపు విషయాలపై రైతాంగం పోరాటం చేసిందంటే ఆ కాలంలో ఎంత నిరంకుశత్వపు పాలన ఉండేదో అర్థమవుతుంది. ఒక్కటి కాదు రెండుకాదు ఎన్నివిధాల ప్రజలను హింసించాలో, పీడించాలో, దోచుకోవాలో అన్ని మార్గాలను ఆనాటి ప్రభుత్వం అనుసరించారు.

ఇలాంటి పరిస్థితుల్లో 1967 – 69 ప్రాంతంలో శ్రీకాకుళ గిరిజనోద్యమం వచ్చింది. గిరిజనులు రాజ్యంపై తిరుగుబాటు చేశారు. దీనికి రచయితలు, మేధావులు మద్దతుగా నిలిచారు. ఈ ఉద్యమ ప్రభావం చాలా ప్రాంతాలపై పడింది. అలాగే కరీంనగర్‌కి ఉద్యమ చైతన్యం అందింది. "1973లో శ్రీశ్రీచే కరీంనగర్ 'కళాభారతి' మైదానంలో బహిరంగ సభ నిర్వహించబడింది. ఆసభల వరవరరావు, యంటిఖాన్ తదితరులు పాల్గొని పౌరహక్కుల ఉద్యమాల గూర్చి వివరించారు. "పోదామురో జనసేనలో కల్సి" అంటూ రచయితలు ఊరేగింపు తీశారు. ఆ తదుపరి వేములవాడలో కూర రాజన్న ఆధ్వర్యంలో గద్దర్‌తో మరొక పౌరహక్కుల సభ జరిగింది. ఈ రెండు సభలు కరంనగర్ ఉద్యమానికి ఊతం లాంటివి" (పార్థసారథి, సి.(ప్ర. సంపా.). 2006: 116). ఉద్యమం కేవలం నినాదాలమీదనే సాగదు. దాంట్లో పాట, కవిత కలగలిసి ఉంటాయి. ఇది ఏ ఉద్యమాన్ని మనం గమనించిన తెలిసే విషయం. జగిత్యాల జైత్రయాత్రగా ప్రసిద్ధి పొందిన ఊరేగింపు జగిత్యాలలో 1978, ఆక్టోబర్‌లో లక్షలాది మంది రైతులతో సాగింది. ఇది ఆకాలంలో పెద్ద సంచలనం. చాలా గ్రామాలకు ఇది ఆదర్శంగా నిలిచి ఉత్తేజం నింపింది.

అలాగే 1970 తర్వాత దళిత ఉద్యమంవల్ల దళిత చైతన్యం వచ్చింది. విశ్వవిద్యాలయాల్లో చదువుకున్న మొదటితరం దళితులంత గ్రామాలల్లో అంబేద్కర్ సంఘాల్ని స్థాపించారు. ఈ సంఘాలు వివిధ సమావేశాల్ని, సభల్ని జరిపి జనచైత్యానికై ప్రయత్నించాయి. మండల కమీషన్ సిఫారసుల అమలుపై జరిగిన ఆందోళనల్లో బిసిలు కూడా చైతన్యం పొందారు.

1978, సెప్టెంబర్ 7న జగిత్యాలలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో బ్రహ్మాండమైన రైతు కూలీ ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శన చుట్టుపక్కల గ్రామాలకు గొప్ప

ఉత్తేజాన్నిచ్చింది. ఇలాంటి ప్రదర్శనలకు, ఉద్యమాన్ని ఆపాలని పోలీసులు శతవిధాల ప్రయత్నించినా ఆపలేకపోయారు. ఉద్యమంలో స్త్రీలు, పురుషులు చిన్నాపెద్ద అనే తేడా లేకుండా అందరూ పాల్గొన్నారు. దీనికి కొనసాగింపుగా 80 మంది భూస్వాములు మంత్రి చెన్నారెడ్డి దగ్గరికి వెళ్ళి మేము గ్రామాల్లో ఉండలేమంటే సిరిసిల్లా, జగిత్యాల తాలూకాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించారు. 1982లో ఉద్యమం హింసాత్మకంగా మారింది.

### 1.8.3. సామాజిక నేపథ్యం

కరీంనగర్ జిల్లా పోరాటాల పురిటిగడ్డ అని చరిత్రని అధ్యయనం చేస్తే అర్థమవుతుంది. ఆదినుంచి ఇప్పటిదాకా ఎన్నో ఉద్యమాలకు నిలయంగా పేరుపొందిన ఈ జిల్లా ఎన్నెన్నో కల్లోలాలను, కన్నీళ్లను చూసింది. ఆనాటి నైజాం వ్యతిరేక పోరాటం నుంచి నేటి ప్రపంచీకరణ పరిణామాలదాకా ఈ జిల్లాని ప్రశాంతతకి దూరం చేశాయి. ఎప్పుడూ ఏదో ఒక సామాజిక సమస్య ఈ జిల్లాని అతలాకుతలం చేసింది, చేస్తోంది.

హైదరాబాద్‌ని కేంద్రంగా చేసుకొని పాలించిన నైజాం దుర్మార్గాలకు లెక్కనే లేదు. ఇతనే కాకుండా పల్లెల్లో దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు మొదలైన ఎంతో మంది సామాన్య జనాన్ని నానా కష్టాలకు గురిచేశారు. ఎన్నో రోజులుగా పెదవికింద అణుచుకున్న బాధ ఒక్కసారిగా కట్టలు తెంచుకొని విప్లవమై ప్రవహించింది. ఈ ఉద్యమంలో కరీంనగర్‌ది ప్రత్యేక స్థానం. ఎన్నో రోజుల పోరాటం తర్వాత భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా నైజాం హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయకపోవడంతో ఉద్యమం మళ్ళీ మొదలైంది. ఆ తర్వాత హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో కలిసిన అధికారుల ఆగడాలు ఇంకా కొనసాగుతూ ఉండడంతో రైతాంగ ఉద్యమం వచ్చింది. 1979లో కరీంనగర్, ఆదిలాబాద్‌లలో జరిగిన రైతాంగ ఉద్యమం అందరికి తెలిసిందే. ఈ ఉద్యమంలో కరీంనగర్ జిల్లాలోని ప్రతిపల్లె విప్లవ నినాదమై, నెత్తుటిగాయమై నిలిచింది. లాఠీలు, తూటాలు, కర్ఫ్యూలు, ఎన్‌కౌంటర్లు పల్లెల్ని రక్తసిక్తం చేశాయి. వీటన్నింటిని తట్టుకొని ప్రజలు విజయం సాధించారు. ఇలా గడీల నుంచి పారిపోయిన దొరలు, భూస్వాములు పట్టణాలు చేరుకొని పారిశ్రామిక వేత్తలుగా మారారు.

జిల్లాలో అప్పుడప్పుడే ఎదుగుతున్న మధ్యతరగతి ప్రజలు విద్య, రాజకీయ మొదలైన రంగాల్లో అభివృద్ధికై పట్టణాలకు వలసవెళ్ళడం కనిపిస్తుంది. ఈ వలసలు ఎక్కువవ్వడంతో

పతనమౌతున్న నైతిక విలువలు, విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు, దెబ్బతిన్న సంబంధాలతో జిల్లా సామాజికంగా పతనమైంది. దీనికంతటికి కారణం ప్రపంచీకరణ విధానం. ఇలా ఫ్యూడల్, ప్రపంచీకరణల మధ్య కరీంనగర్ జిల్లా నలిగిపోయింది. స్వంత రాష్ట్రం, స్వంత భాష, స్వంత సంస్కృతి మొదలైన అంశాలు ముఖ్య భూమికగా వచ్చిన మలిదశ తెలంగాణ ఉద్యమానికి కరీంనగర్ ముఖ్య కేంద్రంగా ఉంది. ధూందాంలు, రాస్తారోఖోలు, వంటావార్పు, ర్యాలీలు ఇలా ఎప్పుడు ఏదోఒక చైతన్యంతో మునుముందుకు ఉద్యమాన్ని నడిపింది. ఇలా వచ్చిన ప్రతి సామాజిక అల్లకల్లోలంలో మూలాల్ని వెతుక్కునే క్రమంలోంచి, మూలాల్ని కాపాడుకునే సందర్భంలోంచి మారుతున్న మార్పుల్ని, జీవితాల్ని చిత్రిస్తూ ఈ జిల్లానుంచి విస్తృతమైన సాహిత్యం వచ్చింది.

# అధ్యాయం - ౨

# కరీంనగర్ జిల్లా కవిత్వం – వస్తు విశ్లేషణ

## ౨. పరిచయం

తెలుగు సాహిత్యంలో ఏ వాదమైనా మొదట కవిత్వంలోనే వెలువడుతుందని ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రని గమనిస్తే అర్థమవుతుంది. ఎందుకంటే కవిత్వానికున్నా సౌలభ్యం అలాంటిది. అలాగే తెలుగునాట అస్తిత్వవాద ఉద్యమాలు ప్రతి కవిని, రచయితని తన ప్రాంతం నుండి, కులం నుండి మాట్లాడేలా చేశాయి. ఇది స్త్రీవాద, దళితవాద, మైనార్టీ మొదలైన అస్తిత్వవాద ఉద్యమాల్లో కనిపిస్తున్నా తెలంగాణ ఉద్యమం మరింత ప్రభావాన్ని చూపగలింది. భాష, సంస్కృతి, చరిత్ర, వివక్ష మొదలైన అనేకాంశాల్లో తన నేలనుండి కవిని ఆలోచించుకునేలా చేసింది. తద్వారా ప్రతి కవి, రచయిత శత్రువును ప్రశ్నిస్తూనే, ఇన్నాళ్ళ వివక్షను, జరిగిన అన్యాయాన్ని లేవనెత్తుతూనే తన ప్రాంత గొప్పతనాన్ని, ప్రత్యేకతల్ని అక్షరాలుగా మలచడం మొదలుపెట్టాడు. "ఆధునిక తెలుగు సాహిత్యం ఇరవయ్యో శతాబ్ది ఆఖరి రెండు దశాబ్దాల్లో భిన్నపుంతలు తొక్కింది. సరిగ్గా ఇదే కాలంలో సాహిత్య స్రవంతిలో ఏకతావాదం విచ్ఛిన్నమై వినిర్మాణానికి దారి తీసింది. భిన్న అస్తిత్వాలు పాదుకుని బలపడ్డాయి. ఏ అస్తిత్వవాదమైనా ప్రధానంగా కవిత్వ ప్రక్రియలో ఆరంభమై బలపడ్డాకనే ఇతర ప్రక్రియల్లోకి విస్తరంచడం గమనార్హం. కనుకనే తెలుగు కవిత్వం నిరంతరం నవ్యతని సంతరించుకొని శోభిస్తుంది" (గుడిపాటి. 2006: 5). ఇలా సమాజంలో జరిగే ప్రతి చిన్న మార్పు మొదటగా కవిత్వంలో చోటుచేసుకుంటుంది.

అనేక సంవత్సరాలు పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రస్తుతం తెలంగాణ చరిత్ర(సాహిత్యపరంగా, చారిత్రకంగా), సంస్కృతి సంప్రదాయాలు, భాష, ప్రత్యేకతలు మొదలైన అంశాల్లో చర్చ జరుగుతుంది. ఇలాంటి చారిత్రక సందర్భంలో తెలంగాణలోని ప్రతి జిల్లా విశేషాల్ని, సంస్కృతి సంప్రదాయాల్ని, భాష, చరిత్రల్ని సాహిత్యపరంగా అధ్యయనం చెయ్యవల్సిన అవసరం ఏర్పడింది. ప్రతి జిల్లాలోని సంఘటనలను, చారిత్రక విషయాల్ని మొదటగా కవిత్వంలోనే వెలువడతాయి.

తెలంగాణ కవికి కవిత్వం గాలి ఊసులు కావు. ఆకాశంలో విహరించే ఊహాగానాలు కావు. వెన్నెలల వెలుగులు, ఇసుక తిన్నెలు ఇక్కడి కవిత్వంలో లేవు. ఇక్కడి జీవితంలో లేవు.

ఈడ్చుకుపోయిన డొక్కలు, తడిసిన కన్నులు, ఎండిన చెరువులు, భూములు, తల్లడిల్లె హృదయాలు మొదలైనవి తెలంగాణ కవిత్వంలో కనిపిస్తాయి. తెలంగాణ కవికి కవిత్వం నిజ జీవితం, రక్త సంబంధం. బతుకులోంచి, బాధలోంచి అది తన్నుకొస్తుంది, తల్లడిల్లుతది. తన చుట్టూ ఎటుచూసిన రోదనలు, వేదనలు. వీటినుండే కవిత్వం జనిస్తుంది. అలా జనించిన తెలంగాణ కవిత్వంలో ప్రపంచీరణ ప్రభావం వల్ల అన్యాయం పాలైన పల్లెటూర్ల వ్యధలు, వృత్తులన్ని పోయి బజారుపాలైన వృత్తికారుల కథలు, ఆంధ్రపాలకుల చేతుల్లో అన్యాయానికి గురైన తీరు, వివక్ష, దోపిడి, వర్షాలు లేక పొట్టచేతపట్టుకొని వలసెళ్ళిపోతున్న ప్రజల కన్నీళ్ళు, మనుసు, మానవత్వం కలగలిసిన గ్రామాల పరిస్థితి అన్ని కనిపిస్తాయి.

## ౨.1. వస్తువు – నిర్వచనాలు

కవి, రచయిత చెప్పే ప్రధాన విషయాన్ని వస్తువు అనవచ్చు. “సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భావాన్ని వస్తువనవచ్చును. రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చు” (మధుసూధనరావు, త్రిపురనేని. 1997: 13). కవి, రచయిత ఎంచుకున్న అంశం వస్తువు. వస్తువును అభివ్యక్తం చేసే తీరు శిల్పం. ఈ రెండింటిలో ముఖ్యమైంది వస్తువే. ‘Content’ అన్న ఆంగ్లపదానికి సమానార్థంలో ‘వస్తువు’ అని తెలుగులో వాడుతున్నాం. “ఒకానొక దృగ్విషయంలో ప్రత్యేకంగా నియమబద్ధంగా ఉన్న మూలకాల, క్రమ విధానాల మొత్తమే వస్తువు. మనిషి, మానవసంబంధాలు సామాజిక జీవితం వస్తువు. మనిషి, మానవ సంబంధాలు సామాజిక జీవితం వస్తువు అవుతుంది. కవిత్వంలో వ్యక్తమయ్యే ప్రధానమైన Conceptని వస్తువుగా చెప్పుకోవచ్చు” (లక్ష్మీకాంతం, పింగళి. 1986 : 39). రచనలో, కవిత్వంలో వ్యక్తమయ్యే ప్రధాన అంశం వస్తువుగా చెప్పుకోవచ్చు. “కవిత్వేతివృత్తం కవిత్వం దేన్ని గురించి రాస్తామో అది కవిత్వంలో వ్యక్తమయ్యే ప్రధానభాగం వస్తువు” (చెన్నకేశవరెడ్డి, జి. 1999 : 6). ఈ నిర్వచనం వస్తువు గురించి ముఖ్యంగా కవిత్వంలో వస్తువు గురించి చెప్పింది.

సాహిత్యంలో ఏ ప్రక్రియ తీసుకున్నా ఆ ప్రక్రియకు జీవానాధారంగా చెప్పుకోదగ్గది వస్తువు. ప్రతి అంశానికి మూలాధారం వస్తువే. కవి, రచయిత సమాజాన్ని సూక్ష్మదృష్టితో పరిశీలించి తను దేన్ని చూసి స్పందిస్తాడో దాన్ని వస్తువుగా గ్రహిస్తాడు. ఈ ప్రపంచంలో అన్నీ కవికి, రచయితకి వస్తువులవుతాయి. “మనిషి, మానవ సంబంధాలు, సామాజిక జీవితం,

అందలి సమస్త వైరుధ్యాలు – వీటన్నిటియొక్క కళాత్మక ప్రతిఫలనం సాహిత్యంలో వస్తువు” (శివశంకర్, పాపినేని. 2008: 78). మనుషులు, వారి మధ్య అనురాగాలు, ఆప్యాయతలు, ద్వేషాలు, ప్రేమలు మొదలైన మానవ సంబంధంలోని సమస్త వైరుధ్యాలతో పాటు చెట్లు, పర్వతాలు, నదులు అన్ని సాహిత్యంలో అందమైన వస్తువులుగా మారుతాయి. సాహిత్యంలో వస్తువు కానిదంటూ ఏదీ లేదు. సమాజం మారినకొద్దీ వస్తువు కూడా మారుతూ ఉంటుంది. ఎందుకంటే సాహిత్యం నిరంతర చలనశీలమైంది కనుక.

ఈ సమాజంలో కవికి, రచయితకి అనర్హమైన వస్తువే ఉండదు. అన్ని అతనికి వస్తువే అవుతాయి. తను గమనించిన, తనను స్పందింపజేసిన దానిని వస్తువుగా మలిచి ఆ అంశం పట్ల పరిచయాన్నో, చైతన్యాన్నో కవి, రచయిత కలుగజేస్తాడు. ఇలాంటి ధోరణి మన తెలుగు సాహిత్యంలో ప్రాచీనకాలం నుంచి జరుగుతూ వస్తోంది. ప్రాచీనకాలంలో మతపరమైన భావాల్ని, ఆధునికకాలంలో మతం, మతంలోని మౌలిక భావాలను ప్రశ్నించే అంశాలు చోటుచేసుకున్నాయి. ఇక ఇప్పుడు మత, లింగ, వర్గ, కులాలపరంగా జరిగే వివక్షతను, అన్యాయాన్ని సాహిత్యం ప్రశ్నిస్తోంది. ఇలా రచనల్లో చిత్రించబడ్డ అనేక అంశాలు, వాటి మూల్యాంకనం వస్తువుగా రూపొందుతుంది.

సమాజంలో సంభవించే అనేకానేక సంఘటనలు కళాత్మకంగా సాహిత్యంలో చిత్రీకరించబడతాయి. ఈ చిత్రీకరణ ఆయా కవుల, రచయితల దృక్పథానికి అనుగుణంగానే వస్తువు విభిన్న రకాలుగా ఆవిష్కరించబడుతుంది. సంఘటనల చారిత్రక నేపథ్యం ఆధారంగా కవి, రచయిత తన దృక్పథంతో వస్తువు అత్యంత అద్భుతంగా మలుస్తాడు, తీర్చిదిద్దుతాడు. కవి హృదయం ఎప్పుడు స్థానిక పరిస్థితులకు ఆయా కాలాల ప్రాభవానికి అనుగుణంగా స్పందిస్తూ ఉంటుంది. అందుకే గురజాడ, రాయప్రోలు, వంటివారు వాడుకభాషకు పెద్దపీటవేసి తమ కవితలతో సామాన్యుల గుండెలను తట్టిలేపారు.

ప్రాచీనకాలంలో కవులు తన ప్రతిభను జోడించి తనను పోషించిన రాజులకనుగుణంగా కవిత్వసృజన చేశారు. అంటే ప్రాచీన కవిత్వంలో రూప, వస్తువులు కవి అభిరుచిని దాటి పోషకుల అభిరుచితో కావ్యాలు వెలుగుచూసాయి. కాలక్రమేణా సమాజంలో జరిగిన అనుహ్య పరిణామాలవల్ల సాహిత్యంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. వస్తువు రాజాశ్రయాల గోడలను కూల్చుకొని సామాన్య వ్యక్తిని ఆశ్రయించి అతన్ని

సాహిత్యానికి రారాజుని చేసింది. అలాగే రూప, వస్తువులో కూడా విప్లవాత్మకమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి.

వర్గసమాజంలో బానిసవ్యవస్థ, భూస్వామ్య వ్యవస్థలు ఒకదానివెంట ఒకటివచ్చి, పరపీడనతో బలపడి పాలకవర్గానికి తీరుబాటు హెచ్చాక కవిత్వంలాంటి కళలు కూడా పాలకవర్గానికి తప్ప మొత్తం సమాజానికి ఉపయోగపడకుండా వచ్చాయి. మహేతిహాసాలు(Epics), బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాల – అప్పటి పాలకవర్గాల ప్రాభవానికి నిలువుటద్దాలుగా నిలిచాయి. పెట్టుబడిదారీవ్యవస్థ, భూస్వామ్య వ్యవస్థలు తమ లాభంకోసమే చూసాయి. సమాజంలోని కవుల్ని, కళాకారుల్ని పట్టించుకోలేదు. తద్వారా కవులు సమాజం నుండి పలాయనత్వం చెంది ఊహాలోకంలోకో, వారివారి మానసాల్లోకి దూరి తృప్తి పొందడం ఆరంభించారు. ఈ కాలంలో కవిత్వం స్వప్రయోజనానికే ఉపయోగపడింది. ఆ తర్వాతి కాలంలో వస్తూత్పత్తి అధికంగా పెరగడంతో మానవాంశకు ప్రాముఖ్యం తగ్గింది.

కమ్యూనిజం, ఫెమినిజంలాంటి దృక్పథాలతో కొత్త నడకలు నేర్చి సామాజిక ప్రయోజనాన్ని సాధించే దిశలో కవిత పయనించింది. కుల, మత, వర్గ విబేధాలు, వైషమ్యాల నిర్మూలనకు నడుంబిగించింది. ఫలితంగా – వ్యక్తిత్వానికి మాత్రమే పరమితం అనుకున్న కవితకు కొత్త 'వస్తువులు' ఎన్నో దొరికాయి. సహజంగానే వస్తుకొరత ఉండడంవల్ల భావాలు, ఆలోచనలు మెల్లిగా మరోవైపు తిరిగాయి. శిల్పరూపాల అర్థాంగీకారం సామాజిక, ప్రాపంచిక సమస్యలపై వస్తు అస్త్రాన్ని సంధించింది. 1797లో ఐరోపాలో ప్రారంభమైన కాల్పనిక ఉద్యమం వల్ల సాహిత్యంలో వినూత్నశైలి, విశిష్టరూపాలు, భావాలు అవతరించాయి. ఈ కాల్పనిక యుగావిష్కరణవల్ల సామాన్యుడి జీవితంతోపాటు మానసిక ప్రవృత్తికూడా రచనావస్తువులయ్యాయి. వస్తువులో నవ్యతే కాకుండా భాషలోనూ, శైలిలోనూ నవ్యత ప్రవేశించింది.

ప్రతిచిన్న సామాజిక సంఘటన, సాంఘిక సమస్య కవిత్వానికి వస్తువవుతుంది. అయితే కేవలం వస్తువు దొరికితే చాలదు. దాన్ని అభివ్యక్తీకరించడానికి సరిపడే భాషా పదబంధాలు, శైలి, శిల్పి నిర్వహణ, నూతన పదకల్పన, నవీన కవి సమయాలు ఇవన్నీ చాలా అవసరం. సమకాలీన కవిత్వం పట్ల సమగ్రమైన అవగాహనను ఏర్పరచుకోడానికి ముందు సమకాలీన కవిత్వంలో కనిపిస్తున్న వస్తువును, అభివ్యక్తిని సునిశతంగా పరిశీలించవలసి ఉంటుంది. ఈ రెండింటి పరస్పర సంబంధమే కవిత్వ గుణాత్మక పరిణామాన్ని నిర్ణయించేది. కవికుండే వస్తు

దృష్టి సామాజిక పరిణామాన్ని, అభివ్యక్తి దృష్టి సాహిత్య పరిణామాన్ని సూచిస్తాయి. దీని వల్ల సమకాలీన సమగ్ర సాహిత్య సామాజిక స్వరూపం స్పష్టంగా కనిపిస్తుంది.

సమాజంలో జరిగే అనేక సంఘటనలకు మానవుడు స్పందిస్తుంటాడు. అయితే సామాన్య మానవుడి కంటే కవి ఇంక ఎక్కువగా, భిన్నంగా స్పందిస్తాడు. సమాజంలోని అనేక రుగ్మతల్ని, అన్యాయాల్ని, వ్యత్యాసాల్ని, సంఘర్షణలని ఎవరు పట్టించుకున్నా, పట్టించుకోకపోయిన కవి మాత్రం వాటికి స్పందించి అక్షరాలుగా అవిష్కరిస్తాడు. ఈ ఆవిష్కరణ ఆయా కవుల భిన్నభిన్న దృక్పథాలను అనుసరించి ఉంటుంది. కవి వచ్చిన సమాజం, పరిసరాలను బట్టి కవి స్పందన సృజనగా మారే దశలో ఒక విలక్షణత ఉంటుంది. దీని ద్వారానే సాహిత్య వస్తువులో నిరంతరం మార్పులు చోటు చేసుకుంటాయి. మారుతున్న జీవన పరిస్థితులు, శాస్త్రసాంకేతిక అభివృద్ధి, ప్రపంచీకరణ ప్రభావంలో దూరమవుతన్న మానవుల బాంధవ్యాలు, నాగరికత మొదలైన వివిధ రకాల కారణాల వల్ల కవికి కొత్త వస్తువు అందతూనే ఉంటుంది.

'ప్రజలకోసం కవిత్వం' అనే భావన కేవలం వస్తువు వరకే పరిమతమయ్యింది. అభివ్యక్తికి కాదు. సమాజంలోని అన్ని వర్ణాల ప్రజలు వారి సమస్యలు, స్పందనలు, వారి మధ్యగల సంబంధాలు ఇవ్వన్నీ కవిత్వంలో వస్తువులైనాయి. ఎవరిని ఉద్దేశించి కవిత్వం రూపొందించబడుతుందో వారి జీవన విధానంలోని సహజత్వాన్ని వస్తువుగా తీసుకొని వారి మాండలిక భాషలో అభివ్యక్తి విధానం రూపొందించగలగాలి. సమకాలీన కవిత్వంలో కనిపిస్తున్న వస్తువులన్నింటినీ వర్గీకరించి వాటిలో ఉన్న సాధారణ లక్షణాలను, ప్రత్యేక లక్షణాలను గుర్తించి ఈ కాలాల్లో ఈ రకమైన వస్తువులే రావడానికి గల కారణాలను, వాటి వెనుక గల కవుల దృక్పథాలను పరిశీలించాలి.

"కవిత్వంలో అభివ్యక్తమయ్యే వస్తు లక్షణాలను కింది విధంగా అంచనా వేయవచ్చు

1. ఒక భావనను తీసుకోవటం ప్రధానం. దీన్నే కొంతమంది 'ఇతివృత్తం' అంటారు.
2. తీసుకున్న భావన లౌకిక, అలౌకికమైన దానిలో ఏదైనా కావచ్చు.
3. వస్తువు కళాత్మకత పొందటానికి ఆధారమవటం.
4. కవి చెప్పదలచుకున్న ఆశయం ఉండటం.
5. కవి చెప్పదలచుకున్న ఆశయం ఉండటం అనేక భావనలతో చెప్పగలగటం.
6. ఒకే భావన తీసుకున్నా కవికీ కవికీ మధ్య భేదం కనిపిస్తుంటుంది.

7. చలన శీలమై కాలంతోపాటు కొత్తకొత్త వస్తువులు తయారవుతుండటం.
8. వస్తువు, రూపంతో కలిసి ఉంటుంది. వీటి మధ్య వైరుధ్యం లక్షణమై పరస్పర విరుద్ధమైనా రెండూ విడదీయరానివిగా ఉంటాయి.
9. వస్తువుని రూపం, రూపాన్ని వస్తువు అధిగమించే స్థితి కవి అభివ్యక్తిని బట్టీ కలుగుతుంటుంది.
10. వస్తువు సరిగ్గా వ్యక్తం కావాలంటే సరైన 'రూపం' ఉంటేనే సాధ్యమవుతుంది. ఇలా రకాలుగా 'వస్తువు'లో గల లక్షణాలను విడదీసి చూపవచ్చు"

(శరత్ జ్యోత్స్నారాణి, ఎస్. 2003 : 25 – 26)

సామాజిక స్పృహగల ఏ కవి అయినా తనకు తెలిసో తెలియకో తానుంటున్న సమాజం ఆర్థిక రాజకీయ సాంస్కృతిక జీవిత వాస్తవ లక్షణాలను ప్రతిబింబిస్తూ వాటిమీద తిరుగుబాటుచేసి తానుండాలనుకునే సమాజ ఆర్థిక రాజకీయ సాంస్కృతిక జీవిత లక్షణాలను ప్రతిపాదిస్తూ ఉంటాడు. అలాంటి కవి తాను దేని గురించి రాయాలి? ఎందుకోసం రాయాలి? ఏ దృక్పథంతో రాయాలి? ఏ సామాగ్రి వాడాలి? అనే ప్రశ్నలు వేసుకోకమానడు. అతడి సామాజిక స్పృహయే ఈ ప్రశ్నలకు సమాధానాన్ని నిర్ణయిస్తుంది. ఆ నిర్ణయంమీదనే కవితా వస్తువు నిర్దేశింపబడుతుంది.

## 2.2. కరీంనగర్ జిల్లా కవిత్వం – వస్తు విశ్లేషణ

### 2.2.1. సామాజికాంశాలు

"వ్యక్తుల అన్యోన్య సబంధాల మొత్తాన్ని సమాజం అంటారు" (మధుసూదనరావు, త్రిపురనేని. అరుణతార. జులై. 1988: 14). అంటే మానవుల సమాహారం. సమాజం అంటే మనుషులు కనుక వారికి సంబంధించిన విషయాలు సామాజికం. ఈ సమాహారంలో కుటుంబ వ్యవస్థ ప్రధానమైంది. ఆ తర్వాత మనిషికి, మరో మనిషికి మధ్యగల సంబంధాలు పరిగణలోకి వస్తాయి.

### 2.2.1.1. కుటుంబం

భారతదేశంలో ప్రధానంగా కనిపించేది కుటుంబ వ్యవస్థ. ఆత్మీయత, అనురాగాలకు చిరునామాగా భారతదేశ కుటుంబాలు కనిపిస్తాయి.

#### 2.2.1.1.1. తల్లి

"పిల్లలకు
అన్నీ నేర్పించే
అమ్మకన్న
బహుముఖ ప్రజ్ఞాశాలి ఎవరు
బాధకీ ఆకలికీ
ఏడుపే బిడ్డకు
ఏది ఎందుకో
తెలిసేది తల్లికే
అమ్మ సేవలు
వెలకట్టలేనివి
వెల లేదు గనుకే
విలువ లేదు"

(లక్ష్మయ్య, దాస్యం(సంపా.) 2006: 27)

అవును ఈ లోకంలో అమ్మని మించిన ప్రజ్ఞాశాలి ఎవరు లేరు. కుటుంబంలో ఒక బిడ్డ తప్పు చేస్తే మొదటగా తల్లిదండ్రుల పెంపకాన్ని అనుమానిస్తారు. ముఖ్యంగా తల్లిని నిందిస్తారు. ఒక వ్యక్తి ఉన్నతంగా తయారుకావడానికి కుటుంబంలోని తల్లి పెంపకాన్నిబట్టి ఉంటుంది. సభ్యత, సంస్కారం, మర్యాద ఇలా అన్నింటిని తల్లి బిడ్డకు నేర్పిస్తుంది. బిడ్డ ఎందుకు ఏడుస్తుందో కూడా ఒక్క తల్లికి తప్ప మరెవ్వరికి అర్థం కాదు. ఉదయం లేచింది మొదలు పడుకునేవరకు ఇంట్లోని వారందరికి చేసే సేవలు వెలకట్టలేనివి. వాటికి వెలలేదు కనుకే విలువలేదు.

"అమ్మ సేవలు
వెలకట్టలేనివి
వెలలేదు గనుకే
విలువలేదు

(రాణీప్రసాద్, కందేపి. 2006: 15)

ఎన్నో ఏళ్లనుంచి స్త్రీకి కుటుంబంలో అంత ప్రాధాన్యత లేదు. దీనికి చరిత్రనిండా చాలా సాక్ష్యాలు మనకు కనిపిస్తుంటాయి. పురుషాధిపత్య సమాజం స్త్రీని ఒక వస్తువుగా మాత్రమే చూసింది తప్ప మనిషిగా గుర్తించలేదన్న భావన ఆధునిక కాలంలో స్త్రీవాదం ముందుకు తెచ్చింది. స్త్రీని బానిసగా చూసే సమాజాన్ని ప్రశ్నించింది. స్త్రీవాద ఉద్యమం ఇచ్చిన ధైర్యంతో చాలా మంది తమతమ సమస్యలగురించి చెప్పడం ప్రారంభించారు. ఆ దృక్పథంలోంచే ఇక్కడ కవయిత్రి మాట్లాడుతున్నారు. కుంటుంబానికి కేంద్ర బిందువు అమ్మ. పొద్దున లేచింది మొదలు పడుకునేదాక నిరంతరం ఏదో ఒక పనిగా కుంటుంబానికి సేవలు చేస్తూనే ఉంటుంది. అమ్మ ఋణం తీర్చుకోలేనిది అని అంటారు. అంతగా సేవలు చేస్తుంటుంది. ఆ సేవలు వెలకట్టలేనివి. ఆ వెల లేదు కనుకే అమ్మకి విలువలేదని చెబుతుంది కవయిత్రి.

"ఇరవై అయిదేళ్ళ కడుపు తీపికి
ఇరవై నిమిషాల్లో మృత్యు తూటా గుచ్చుకుంటుంది
గొంతులోంచి పెగిలిరాని
'అమ్మా' పిలుపు
సుళ్ళు సుళ్ళుగా కరిగి
రేగళ్ళను తడుపుతుంది"

(చెమన్. 2001: 10)

అమ్మకు మించిన అనుబంధం, ఆప్యాయత ఈ ప్రపంచంలో ఎక్కడ దొరకదు. అలాంటి అమ్మ గురించి కలం పట్టిన ప్రతివాళ్ళు ఏదో ఒక సందర్భంలో రాస్తుంటారు. ఇక్కడ కవి తన తల్లి మరణం గురించి దుఃఖిత గొంతుతో అక్షరాల కన్నీళ్ళను కార్చుతున్నారు. చెమన్‌గారు విప్లవ రచయిత. చాలాకాలం రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో సభ్యులుగా ఉన్నారు. కొన్నాళ్ళపాట పెద్దపల్లికి, కరీంనగర్‌కి రాడికల్ స్టూడెంట్ యూనియన్‌కి

అధ్యక్షులుగా పనిచేశారు. అలాంటి వారిపై నిఘా ఉంటుంది. కుంటుంబంపై కూడా. 'కన్న ప్రేగునులాక్కున్న తోడేళ్ళ రాజ్యంలో' అన్న ఈ కవితలోని ముందు వాక్యాలు తనతల్లిని చంపేసారన్న భావనని అందిస్తున్నాయి.

"అమ్మ చదువుకోలేదు కదూ!
కాని ఆమెకు విశ్వభాష తెలుసు
వాల్మీకి కన్నా ముందే
అమ్మ రామాయణం రచించింది
గుడిలో దేవుడు కదలడు
అమ్మ కదులుతుంది
అందుకే అంటాను
అమ్మాయిగా ఉన్నప్పటి కంటే
అమ్మైనప్పుడే
నాకు అమ్మ విలువ తెలిసింది"

(సుజాత, నాంపల్లి. 2009: 3 – 4)

అమ్మ చదువుకోకున్నా బిడ్డ ఏడ్చే ప్రతి ఏడుపు ఎందుకోసమో అర్థం చేసుకుంటుంది. అదే విశ్వభాష. గుడిలోని దేవుడు కదలడు కాని అమ్మ మాత్రం కదిలే దేవత. అందుకే అమ్మాయిగా ఉన్నప్పటికంటే అమ్మైనప్పుడే ఆ అమ్మతనాన్ని మరింత అర్థం చేసుకోగలిగారు, విలువ తెలుసుకోగలిగారు రచయిత్రి.

### 2.2.1.1.2. తండ్రి

"బుగ్గమీద గరుకు ముద్దై
మునికాళ్ళ ఉయ్యాలై
నడక నేర్పిన చిటికెన వేలై
జీవన తీరాల వేటలో
చివరి మెట్టుదాకా వచ్చిన నాన్న
ఇపుడు అనవసరపు లగేజిలా
కొత్త ఇంట్లో పాత వస్తువులా

జోడు తెగిన ప్రయాణంలో

తడబడ్డ అడుగుల్తో

గుడ్డి దీపపు వెల్తుర్లో

చీకటి చుట్టుముట్టిన దీపంలా"

(వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 24)

తెలుగు సాహిత్యంలో అమ్మపై వచ్చినంత కవిత్వం నాన్నపై రాలేదు. అమ్మపైనే ఇప్పటికి వరకు ప్రత్యేకమైన కవితా సంకలనలు వచ్చాయి. జీవన పయనంలో అమ్మ పాత్ర ముఖ్యమే అయినా నాన్న పాత్ర తక్కువదేం కాదు. నడక నేర్పడం, జీవనపయనానికి అవసరమైన ఆర్థికతని అందించడం నాన్న పని. అలాంటి నాన్న గురించి సాహిత్యంలో తగిన స్థానం దొరకకపోవడం విచారించదగ్గ విషయం.

"పచ్చపచ్చగా చిగురించేందుకు

పందిరి లాంటి ఆలంబన

అంబాడి అంబాడి బుచ్చిబుచ్చిగా

అడుగులేస్తున్నప్పుడు

చెయ్యి చాపిన చూపు తొలి సోపానం

చేతికిచ్చిన పలకా బలపం

దిద్దిచ్చిన ఆఅ ఇఈ లు

జీవితాన్ని సజీవంగా నిలుపుతున్నాయి"

(దేవేందర్, అన్నవరం. 2005: 120)

'అయ్య' అని కవి ఈ కవితకు పెట్టిన పేరే సహజమైంది. కవికి వాళ్ల నాన్నపై ఉన్న ప్రేమలా. సాహిత్యంలో యథాతథ చిత్రణ అనేది ఒకటి కనిపిస్తుంది. మనసుకు తోచిన విధంగా కవిత రాయడం. తీగ పచ్చగా చిగురించి వ్యాపించేందుకు పందిరి ఆలంబన. అలాగే జీవితంలో బిడ్డలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఆలంబన తండ్రి. ఈ పోలిక చాలా సహజ సిద్ధంగా ఉంది.

“నాన్నేమో అడిగినవీ
అడగనివీ అన్నీ కొనిచ్చి
ముద్దు చేస్తారు”

(హిమజ. 2006: 66)

వేలుపట్టుకొని అడుగులు నేర్పించే నాన్న తమ పిల్లలు అడిగిన వాటితోపాటు తనకి నచ్చినవి కూడా కొనిచ్చి ఆ ఆనందలో పిల్లలను ప్రేమగా ముద్దాడుతారు. అడిగిన వాటితోపాటు అడగని వాటిని కొనిచ్చినప్పుడు వచ్చే తృప్తితో ఆ తండ్రి మనసు ఆకాశంలో తేలియాడుతుంటుంది. కొన్ని కుటుంబాల్లో పిల్లలు అడిగారని తమ స్తోమతకు మించి ఖర్చు పెట్టి వాటిని కొనిస్తుంటారు తల్లిదండ్రులు. పిల్లల ఆనందమే వాళ్ళకి కావల్సింది.

“అర్థరాత్రీ లేదు
అపరాత్రీ లేదు
ఎప్పుడూ మనింటి ద్వారాలు తెరిచే వుండేవి
ఏ రాత్రి ఎవరు తలుపు తట్టినా
మందుల పెట్టెను తీసుకొని
కచేరీలోకి వచ్చేవాడివి నువ్వు
ప్లేగు వ్యాధి ప్రబలమైనా
కలరావ్యాధితో వూరు వూరంతా తల్లడిల్లుతున్నా
ఏదీ నిన్ను ఆపేదికాదు
ఎవరికీ నిన్ను ఆపే శక్తి వుండేది కాదు
ఎవరు ఎంత ఇచ్చారన్నది
ఎప్పుడూ నువ్వు చూసి ఎరగలేదు
లెక్కలే తెలియవు నీకు”

(జింబో. 2003: 68)

పాత జ్ఞాపకాలని గుర్తుచేసుకుంటూ రాసే కవిత పునశ్చరణ కవిత. తన తండ్రి జ్ఞాపకాలు ఇక్కడ కవితా వాక్యాలయ్యాయి. మనిషిని బతికించే దేవుడిగా వైద్యున్ని ప్రజలు చూస్తారు. అలాంటి వైద్యుడి గొప్పతనమే ఈ కవిత. ఏ సమయంలో ఎవరికి ఏ ఆపద వస్తుందో తెలియదు అందుకే ఎప్పుడూ వైద్యుడి తలుపు తెరిచే ఉంచుతాడు, ఉంచాలి కూడా.

పగలు, రాత్రి అనే భేదం లేకుండా ఎవ్వరొచ్చినా వారికి వైద్యం చెయ్యాలి. అత్యవసర పరిస్థితుల్లో ఇంటికి వెళ్ళి కూడా వైద్యం చెయ్యాలి. ఒకప్పుడు ఊర్లలో ప్లేగు, కలరా వ్యాధులు ఎక్కువగా వచ్చేవి. అవి అంటు వ్యాధులని స్వంత మనుషులు కూడా వాళ్ళని ముట్టుకొని, పట్టించుకొని సమయంలో వైద్యుడి తన బాధ్యతని ప్రాణాలు పనంగా పెట్టి చేసేవాడు. ఎందుకంటే వీటికి ఒకప్పుడు సరైన వైద్యం కూడా ఉండేది కాదు. వైద్యం పొందినవాళ్ళు డబ్బులెన్నిచ్చినా లెక్కపెట్టుకోలేద్ అనడంలో మానవత్వం తెలుస్తుంది.

### 2.2.1.2. వృత్తులు

#### 2.2.1.2.1. చేనేత

" 'చీరాల – పేరాల'
ఎంత గొప్ప పేరు.. పోరు
ఇప్పుడు
కూలిన మొగ్గంశాల"

(మోహన్, పత్తిపాక. 2009: 21)

గాంధిజీ గారు విదేశీ వస్తు బహిష్కరణలో భాగంగా చీరాల – పేరాల ఉద్యమం చేశారు. మన మగ్గం – మన బట్ట అన్న విధంగా చేనేత వస్త్రాలను, స్వంత దుస్తువులను ప్రోత్సహించారు. చేనేత పని కారణంగా ఆ ఊరికి ఆ పేరు వచ్చింది. అందుకే అది గొప్ప పేరు, పోరు అయ్యింది. అలాంటి చేనేత మగ్గం ప్రపంచీకరణ ప్రభావం వల్ల కూలిపోయింది, నేల రాలిపోయింది. ఆ వృత్తినే నమ్ముకున్న అనేక కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకోవడమో, వలస జీవులుగా మారడమో జరిగింది.

"అగ్గి పెట్టలో
చీర సోయగం
పరంధాములూ!
నీవు శాశ్వతం."

(గోపాల్, మాడిశెట్టి. 2007: 17)

అగ్గిపెట్టెలో పట్టే చీర నేయడం వల్ల పరంధాములు ప్రసిద్ధి చెందాడు. తాతల తండ్రుల కాలంనుండి వస్తున్న ఈ కళలో ఇంత గొప్ప నైపుణ్యం సంపాదించడం విశిష్టమైంది.

"బతుకంతా
పట్టుబట్టల మధ్యనే మరి!
కట్టింది లేదు
మురిసింది లేదు"

(మోహన్, పత్తిపాక. 2009: 3)

బట్టలు నేసినవారికే కట్టుకోడానికి బట్టలేని స్థితి నేడు మనకు కనిపిస్తుంది. ఒకప్పుడు ఆనందంగా, ఉన్నతంగా బతికిన కుటుంబాలు నేడు నడిరోడ్డున పడుతున్న స్థితి ప్రపంచీకరణ వచ్చింది. అందుకే స్థానికీకరణ అన్న నినాదంతో ఈ ప్రపంచీకరణను ఎదుర్కోవల్సిన అవసరం ఎంతైనా ఉంది. మళ్ళీ మన అస్తిత్వాన్ని నిలుపుకోవల్సిన బాధ్యత మనపైనే ఉంది.

"గాలికి ఎగిరిపోయే
దూది కణాల్లోంచి
మా జీవన రాట్నం కదురుల మీద
మా చేతి వేళ్ళ శిల్పంగా
మృదువైన కళగా
మా బ్రతుకు చూపుల రంగుల కలగా
సుతారంగా సున్నితంగా
పేనుకున్న ప్రేమవు
అల్లుకున్న ఆత్మబంధానివి"

(లక్షణరావు, జి. 2003: 13)

తన జీవనమైన వృత్తిని అంతే జీవితానుభవంగా వర్ణించిన కవిత ఇది. వందల సంవత్సరాల నుండి తన బతుకుగా మారి నడిపిస్తున్న కులవృత్తి ప్రాధాన్యత చాలా విశేషమైంది. ఈ కవితలో తన వృత్తి పదాల్ని సరికొత్తగా ఆవిష్కరించిన తీరు బాగుంది. 'జీవన రాట్నం, శిల్పంగా మృదువైన కళ' లాంటి వాక్యాలు ఈ కవితకి ప్రాణపదంగా నిలుస్తాయి. ఆత్మబంధువి అనడంలో తనని, వృత్తిని విడదీయలేని జీవన సత్యం కనిపిస్తుంది.

"వాడిపోతున్న
జరీ పువ్వు
ఇప్పుడు మగ్గం గుంట
ఒక సమాధి

(అశోక్, జిందం. 2006: 32)

రోజురోజుకు పెరిగిపోతున్న ఆధునికతలో భాగంగా వస్తున్న యాంత్రికత సామాన్య జీవితాల్లో పెనుమార్పుల్ని సృశిస్తోంది. ఒకప్పుడు ఆనందంగా బతికిన జీవితాల్లో ఒక్కసారిగా విషాదం నెలకొంది. ఎప్పుడైతే యంత్రాలు సమాజంలోకి వచ్చాయో అప్పుడే వృత్తులపైన తీవ్ర ప్రభావం పడింది. వృత్తి కార్మికులు ఒక వారమో, నెలో నేసే బట్టల్ని యంత్రం కొన్ని నిమిషాల్లోనే తయారు చెయ్యడం వల్ల శ్రామికుల శ్రమ తగ్గి వస్తు ఉత్పత్తి పెరిగింది. దీంతో ఆయా వృత్తిని నమ్ముకున్న కుటంబాలన్ని వలస పోవడమో, మరణించడమో జరిగింది, జరుగుతుంది. ఈ పరిస్థితికి కారణమైన వ్యవస్థను కవులు తీవ్ర స్థాయిలో ప్రతిఘటించారు. ఇలాంటి భయానక దృశ్యాల్ని కన్నీళ్లతో అక్షరరూపం ఇచ్చారు.

"జీవితాంతం
మొగ్గం గుంతలోనే
నేతకార్మికుడు
బతికున్న శవం"

(మోహన్, పత్తిపాక. 2004: 3)

శవం అంటే జీవం లేనిది. బతుకుండడం అంటే జీవించి ఉండడం. ఈ కవితలో కవి బతికున్న శవం అనే వాక్యంలో కవిత్వాభివ్యక్తిలో ఒకటైన విరోధభాసం కనిపిస్తుంది. అంటే జీవితానికి, మరణానికి పెద్ద తేడా లేదు అని చెప్పడం కవి ఉద్దేశ్యం. వారాలు, నెలలు పనిచేసిన సరిపడ డబ్బులురాని కాలంలో ఒకపూట తిని మితగా పూటలు పస్తులుండే జీవితం మరణంతో సమానమేగా.

"ఇవ్వాళ్ళ
నీ పుట్టిన రోజని బెంగ పెట్టుకోకురా కన్నా
చేనేత సమ్మెట పోటులు డొక్కలో
ఈడిసి కొడుతున్న బాధ భరించలేనప్పుడు

ఒక్కోదారం పోగు చెమ్కలా మారి
దూలానికి ఉరితాడులా కళ్ళముందు
దృశ్యా దృశ్యాలుగా కదులుతుంటే
ఏమీ చెయ్యలేని నిస్సహాయపు తండ్రిలా
నేనున్నానిప్పుడు....."

(లక్ష్మణ్, ఆడెపు. 2007: 1)

తన కొడుకు పుట్టినరోజు నాడు ఏమీ చెయ్యలేని, ఏమీ కొనివ్వలేని నిస్సహాయతలోకి వృత్తి నెట్టేసిన విధానాన్ని బాధగా, ఆర్తిగా కొడుకుతో చెప్పుకుంటున్నారు కవి. ఎప్పుడైతే ప్రపంచీకరణవల్ల యంత్రాలు ప్రవేశించాయో అప్పటినుండి వృత్తులన్ని నాశనమయ్యాయి. శ్రమ లేకుండ, తక్కువ సమయంలో ఎక్కువ బట్టలు నేసే యంత్రాలవల్ల అప్పటిదాకా చేనేతని నమ్ముకున్న కుటుంబాలని రోడ్డుమీద పడ్డాయి. వృత్తి ఆధారంగా సాగే భారతదేశంలో ప్రపంచీకరణను ప్రవేశపెడితే ఎలాంటి మార్పులొస్తాయో అన్న అవగాహనను అనాటి ప్రభుత్వం చేసిందో? లేదో? ప్రపంచీకరణను స్వాగతించినప్పుడు దానివల్ల నష్టపోయిన కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపించకపోవడం దౌర్భాగ్యం.

### 2.2.1.3. దళితులు

"పొద్దున్నే మసీదు మౌనరాగంలో లేసి
జాఫరింటికి పోయిన వైనం
సొట్టపోయిన బిందెవట్టుకొని
వాగువంక గిదగిద ఉరికినట్టు ఇంకా గురుతుంది
సల్లని నీల్లల్ల అడుగుల లొటుకలు
తుంగ ఊపుల్లు, తియ్యని పరకంపనలు
ఉగ్రూతలూగించే సెలయేటి గానం
ఏఋగానం ఒదిగిన బిర్రికింద
ఇరవైమోరీల తాళాల గిలిగింతల్లో
మధు బాండంలా సెలిమె
శుక్లారం తొలిపొద్దులో

అపుడే ఇరిసిన ముద్దబంతి పువ్వోలే పక్కనే పడుసుపిల్ల
ఆగోలే అలల లయల హొయలతో ఊగిసలాడే నడుం
'ఏరా అంటరాని వెధవా' అని కూసిన ఆమె నోరు
పదిపైసల బిందెకోసం, పదిపగ్గాల దూరమచ్చి తిట్లు
నా నవ నాడుల్లో ఇప్పటికీ షాగ్గొడతాయి
గానాడు ఎకేరే నేను తోడిన సల్లని సెలిమె"
(కనకయ్య, గుండెడప్పు. 2001: 15)

కరీంనగర్ జిల్లా నుంచి బలమైన దళిత గొంతుక ఆచార్య గుండెడప్పు కనకయ్యది. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేస్తున్నప్పుడు 'గుండెడప్పు' అనే కవితా సంకలనాన్ని కొందరు మిత్రులతో కలిసి తీసుకువచ్చారు. అదో పెద్ద విప్లవం. అప్పటినుండి ఆ గుండెడప్పు ఇంటిపేరైంది. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మొదలైన మిత్రులతో కలిసి ఏ.పి. దళిత రీసర్చ్ సెంటర్ మొదలుపెట్టి దాని ద్వారా కవితా సంపుటాలను, సంకలనాలను తీసుకువచ్చారు. ఊర్లల్లో దళితులు మంచినీళ్లు తాగడానికి చెరువుల, బావుల వద్దకు రానిచ్చేవారు కాదు. తెలియక వెళ్ళిన తిట్లు, దెబ్బలు. అందుకే వాళ్ళకు ప్రత్యేకమైన సెలిమెలు ఉండేవి. దాని ఉదాంతమే పై కవితలో కనిపిస్తుంది.

"తొడమీద అగ్ని పడ్డది
తీసేందుకు ఇగ ఎంకడు రాడు
రెండు మూడూ మిద్దెల
మిడిసిపాట్లు ఇంకెన్నొద్దులు
ఊరు ఊరవతల వాడ ఒక్క పట్టున్నది
(దేవేందర్, అన్నవరం. 2008: 3)

ఎన్నో ఏళ్లుగా బడికి, గుడికి దూరంగా ఉంచబడి, ఊరవతలికి నెట్టివేయబడ్డవాళ్లు దళితులు. అస్తిత్వవాద ఉద్యమాలు వచ్చన తర్వాత ఆయా వర్గాలకు, కులాలకు సంబంధించిన సమస్యలు సాహిత్యంలోకి వచ్చాయి. ఈ కవితలో కవి స్పష్టమైన దళిత స్పృహతో మాట్లాడుతున్నారు. "అన్నవరం కవిత్వంలోని వస్తువును మూడు రకాలుగా చెప్పాలి. ఒకటి ప్రపంచీకరణపై ధిక్కారం, రెండవది తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ నినాదం,

మూడవది దళితవాదం. అన్నవరం రచనలోని నిర్మాణ పరికరాల ప్రగాఢతవల్ల అన్నవరంలో ప్రత్యేక స్వరముంది. ప్రధానంగా ఏ పర్యవసనాన్నయినా అన్నవరం దర్శించే కోణం భిన్నమైంది. ప్రపంచీకరణని సామాజిక, రాజకీయ, ఆర్థిక కోణాల్నుండి గాక పల్లె సంస్కృతి, సంప్రదాయాల నుండి చూస్తాడు. వస్తుముఖంగా కులవృత్తుల ప్రస్తావన ఉన్నప్పుడు ఆర్థిక, సామాజిక స్పృహలు కనిపిస్తాయి. కాని అది ప్రధాన ఉద్వేగక్షేత్రం గాదు. వస్తుక్షేత్రాన్ని అనుసరించి చూస్తే కవిత్వమంతా పల్లె వాతావరణమే కనిపిస్తుంది. ప్రపంచీకరణని ధిక్కరించినా, ప్రాంతయ అస్తిత్వ చైతన్యమైనా దళిత నినాదమైనా ఈ క్షేత్రంలో పెద్దగా మార్పులేదు" (నారాయణశర్మ, ఎం. 2016: 11).

"తడబడిన అడుగుల గుర్తులను
తాటాకులు తుడిచిన చప్పుడు
ఉమ్మి ముంతల ఉమ్మిన ఉమ్మి
చెవులు బైర్లు కమ్మింది నా పూర్వీకులకే కదా!
నాకు పుట్టుకతో వచ్చింది అనుకున్నా!
ఎర్రటి చువ్వలు కంట్లో పొడిచి
సలసలకాగే నూనెలో చంపి పడేసినప్పుడు
మలం సాపు జేసేటప్పుడు
పెయ్యంత పట్టిన పగిలి కావుస్తావుంటే...
నానా బూతులు తిట్టి నాలుకలు కోస్తుంటే
తలలు తాటికాయల్లా తెగి పడుతుంటే
నా పూర్వీకులకే కదా! .... నాకేమిటి?"

(బాలయ్య, పొన్నాల. 2008: 21)

దళితుల అడుగుల గుర్తులు పడకుండా నడుముకు తాటాకులు కట్టడం, ఉమ్మి ఎక్కడపడితే అక్కడ ఉమ్మకుండా మూతులకు ముంతలు కట్టడం, చదువుకుంటే నాలుకలు కొయ్యడం, వింటే సీసం పొయ్యడం, గుడికి దూరంగా ఉంచడంలాంటివెన్నో చేశారు అగ్రకులాలవాళ్ళ. ఇలాంటి ఎన్నో బాధల్లోంచి, వేదనలోంచి అస్తిత్వవాద ఉద్యమంగా వచ్చింది దళిత ఉద్యమం. అటు సమాజంలో, ఇటు సాహిత్యంలో విప్లవాత్మకమైన మార్పును తీసుకువచ్చింది. అంబేద్కర్, పూలే మొదలైనవాళ్ళ సిద్ధాంతాల జాడల్లో దళితోద్యమం

సాగింది. ఈ ఉద్యమ ప్రేరణగా ఎంతోమంది కవులు తమ జీవితాల్ని సాహిత్యంగా సృజించారు.

"నేల పొరల్లోంచి పుట్టిన
మెరుపు తీగను నేను
మట్టి పాదాల మహా కదలిక ఇది
నా పేరు ఉనికి, ఆత్మ గౌరవం
మీ వర్ణ ధర్మాలకు బానిసనయ్యాను
మీ కర్మ ప్రచారాలకు బలికాబడ్డాను
వేయి తలల హైందవ నాగరాజు కాట్లకు
మేం శూద్రులం, అంత్యజులం, పంచములం
మీ దయ్యాల వేదాలు వింటే
చెవుల్లో సీసపు లోహం పోశారు
చదువుకున్న పాపానికి
పంచములని నాలుక తెగకోసారు
అంటరాని వర్ణం మాదని
మా పాదముద్రలు పడకుండా
వీపుకు చీపురు కట్టారు
ఉమ్మి నేలపై పడరాదని
మూతికి ముంతలు కట్టారు"

(దేవేందర్, అన్నవరం. 2001: 8)

సమాజంలో జరిగే సంఘటనలని కవిత్వం ఇలా నమోదు చెయ్యడం మూలాన చరిత్రకి ఎంతో కొంత దోహదపడుతుంది. చారిత్రక సత్యంగా ఈ కవిత కనిపిస్తుంది. కులం, వర్ణం కారణంగా నానా హింసలకు గుర్తైంది దళితులు. వేదాలువింటే చెవుల్లో సీసం పొయ్యడం, చదువుకుంటే నాలుకలు కొయ్యడం, దారిపొడుగునా అడుగులు పడకుండా ఆ అడుగులను చెరిపేయడానికి నడుములకు చీపుర్లు కట్టడం, ఉమ్మి నేపైన వేయకూడదని మూతికి ముంతలు కట్టడం మొదలైన ఎన్నింటినో అగ్రవర్ణాలు దళితులపై చేసారు. అందుకే

ఈ నేల మూలవాసులుగా వీటన్నింటిని వ్యతిరేకిస్తూ ఉనికి, ఆత్మగౌరవాన్ని చాటుతుంది దళిత కవిత్వం.

"కుతంత్రాలు పన్ని
కుత్సితాన్ని శాఖోపశాఖలుగా విస్తరింపజేశుకుని
నా అస్తిత్వాన్ని అవిటితనపు కత్తిమొన మీద వేలాడదీసి
బాధల సముద్ర గర్భంలోకి నా
బ్రతుకును ఈడ్చేయనెంచావు
ఫలించిన నీ కుట్ర మిగిల్చిన గర్వం చిగిర్చిన చిహ్నం
ప్రతిఫలించింది నీ కళ్ళలో –
ఆక్రోశితుణ్ణై, లజ్జితుణ్ణై మిగిలిపోయిన నేను
దిగుడు బావై వెలిసిన దిగులు మధ్య
ఏకాంత ప్రవాసాన్ని గడిపానిప్పటిదాకా –
ఇన్ని తుఫానులు కాపురమున్న నా సున్నితాంతరంగం
నిన్నిక మరువలేదు"

(ఎలనాగ. 2009: 48)

భారతదేశంలో అల్లర్లు, కొట్లాటలు మతాల, కులాల ప్రాతిపదికన ఎక్కువగా జరిగాయి, జరుగుతున్నాయి. ఎక్కువ కులంవాళ్ళు తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి, తక్కువ కులంవాళ్ళు ఆ ఆధిపత్యాన్ని తొలగించుకోవడానికి నిత్యం ఏదో ఒక రూపంలో గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి గొడవల్లోనిదే బ్రాహ్మణీయ, దళితులవాద ఉద్యమం. అంతా సమానమనుకుంటే ఈ గొడవలే ఉండవు. వచ్చిందల్లా మేం గొప్పంటే, మేం గొప్పని. మొదటినుండి దళిత సాహిత్యం బ్రాహ్మణీయ భావజాలాన్ని వ్యతిరేకిస్తూనే ఉంది. ఎన్నో విధాల బాధలు పెట్టిన బ్రాహ్మణీయవాదుల్ని మరిచిపోమని గుర్తుచేస్తోంది ఈ కవిత.

### 2.2.1.4. మైనారిటీలు

"మైనారిటీ అనే పదానికి చిన్నసమూహం, విభాగం అని అర్థం. సాంస్కృతికంగా, తెగలపరంగా, జాతిపరంగా, భషాపరంగా సంఘంలో ఉన్న వారికంటే భిన్నంగా ఉన్న ప్రజాసమూహాన్ని మైనారిటీ అంటున్నారు. ఐతే, తెలుగు సాహిత్యంలో మైనారిటీవాదం అనే

మాట ముస్లిం సాహిత్యానికీ పరిమితమై స్థిరపడింది. తెలుగులో మైనారిటీ సాహిత్యం దళిత అస్తిత్వ ఉద్యమంలోంచే ప్రారంభమైంది. ఆ తర్వాత ప్రత్యేక అసిత్వంగా పరిణమించింది” (యాకూబ్. 2018: 185). 1992లో బాబ్రీ మసీదును కూల్చివేయడం ద్వారా తెలుగు సాహిత్యంలో మైనారిటీవాదం మొదలైంది. ఈ దేశంలోనే పుట్టి ఈ దేశంలో పరాయివాళ్ళుగా గుర్తించబడుతున్న విధానాన్ని ఈ వాదం ముఖ్యంగా వ్యతిరేకిస్తుంది.

“ఈ మట్టిమీదే ఊపిరిపోసుకొని
పరాయి ముద్రతో
అణచబడుతున్న వాళ్ళు
పైనున్న ఆకాశాన్ని కప్పుకుని
కునుకెరుగని కనురెప్పలనిండా
భయాలు కూరుకుంటున్నవాళ్ళు
కన్నతల్లి గుండెల మీద అనాధలు
అనామకులు
బికార్లు ఫకీర్లు
బతుకును శాపంగా ఇచ్చినా
చెమటలో తడిపి వరంగా మార్చుకుంటున్నవాళ్ళు
మిల్లుల్లో మిషన్లలో సైకిల్ దుకాండ్లల్లో
ఆకలిని ఆరేసుకుని
నాల్గు మెతుకులు పోగేశుకుంటున్న వాళ్ళు”

(శివకుమార్, వఝల. 2004: 34 – 35)

కవిత్వాన్ని సామాజికమైంది, ఆత్మాగతమైంది, అనుభవక పూర్వకంతో తాత్త్విక భూమిక గలదిగ విభజించుకోవచ్చు. ఈ కవితను సామాజిక కవితగా మనం గుర్తించవచ్చు. ఈ దేశంలోనే పుట్టి ఈదేశంలోనే పెరుగుతున్న వాళ్ళని పరాయివాళ్ళుగా చిత్రించే సమాజ వివక్ష ధోరణిని కవి చెబుతున్నాడు. ఇలాంటి కవిత్వం గతంలో మనకు చాలానే కనిపిస్తుంది. అయినా ఈ ధోరణి మారకపోవడం విచిత్రం. ఉగ్రవాదులంటూ ఈ దేశ వాసులనే అనుమానించడం, అవమానించడం జరిగింది.

## 2.2.1.5. సింగరేణి కార్మికులు

తాను కరిగి నలుగురికి వెలుగునిచ్చేవాడే సింగరేణి కార్మికుడు. భూమిలోని బొగ్గును తేవడానికి 1888లో సింగరేణి కంపెనీ ఏర్పడింది. అప్పటినుండి ఇప్పటిదాక సింగరేణిలో అనేకమంది తమ ప్రాణాల్ని పణంగాపెట్టి లోకానికి వెలుగు అందిస్తున్నారు. ఉత్పత్తి పెంచడం మాత్రమే చూసినా ప్రభుత్వాలు వాళ్ళ బాధలను పట్టించుకోలేకపోయారు.

"చినిగిపోతున్న సాక్సులు చీకపోతున్న కంపెని బూట్లు
మాసిపోయిన నెక్కరు మసిబారిన బనీను
నెత్తిన టోపి పెట్టుకుని తట్టాచెమ్మాసు పట్టుకొని
నడుముకు బాట్రీ చేతికి లైటు
మైసమ్మను మనసున తలచి, నేలమ్మను కండ్లకద్దుకుని
భూమి పొరల సొరంగ మార్గం....
అప్పుడదే భూతల స్వర్గం...
బార్డరులోనే కాదు భూగర్భంలోనూ సైనికులున్నారు"

(రవీందర్, పిట్టల(సంపా). 2007: 1)

తన అనుభవాన్ని సాధారణ వాక్యాలలో చెప్పే కవితని సరళ కవిత అంటారు. ఈ కవితలో కవి సింగరేణి కార్మికుడు ఆహార్యాన్ని, తను పనికెళ్ళేటప్పుడు చేసే పనులను వివరించారు. చివరి వాక్యం ఈ కవితకి కొసమెరుపు. ప్రాణాలకి తెగించి దేశాన్ని కాపాడేవాళ్ళు సైనికులైతే, ప్రాణాన్ని పణంగా పెట్టి దేశానికి వెలుగిచ్చేవారు సింగరేణి కార్మికులు. అందుకే వీళ్ళని కవి సైనికులతో పోల్చారు.

"నల్ల సూర్యుల
త్యాగఫలం
తెలంగాణ సిగపువ్వు
సింగరేణి"

(అశోక్, జిందం. 2006: 29)

ఎప్పుడు బొగ్గుబాయిలో పనిచేయడంవల్ల వాళ్ళ దేహాలు నల్లగా మారిపోతాయి. కాని వాళ్ళు అలా పనిచ్యందే ఈ లోకానికి వెలుగే (విద్యుత్తే) ఉండదు. అందుకే కవి వాళ్ళని నల్ల సూర్యుళ్ళుగా పోల్చాడు. తెలంగాణ తల్లి అని అంటుంటాం. ఆ తలి జడలోని సిగపువ్వే

సింగరేణి. ఇలా ప్రతీకలతో, మానవగుణారోపణతో సింగరేణి, సింగరేణి కార్మికుల గురించి అద్భుతంగా కవి చెప్పారు.

"ఫ్యాక్టరీలు కొత్త కొత్త యంత్రాలు
మీ మెడమీద వేలాడే ఖడ్గాలు
గ్లోబల్ విధానాలన్నీ
మీ గొంతుకు ఉరితాళ్లు"

(రవీందర్, పిట్టల(సంపా). 2007: 61)

రోజు ఇరవై మంది చేసే పనిని ఒక్క యంత్రం ఒక గంటలో చేయగలుగుతుంది. అందువల్ల యంత్రంరాకతో కార్మికుల అవసరం తగ్గిపోతుంది. దీనివల్ల ఆ పనినే నమ్ముకున్న కార్మిక కుటుంబాలంతా జీవనోపాధి కోల్పోయి రోడ్డుపైన పడతారు. ప్రైవేటీకరణలో భాగంగా పారిశ్రామిక రంగాన్ని ప్రభుత్వంనుంచి తప్పించి ప్రైవేట్ వాళ్ళకు అప్పగించడం గ్లోబల్ విధానంలో భాగంగా వచ్చింది. దీనివల్ల కార్మిక జీవితాల్లో ఊహించని మార్పులు సంభవించాయి. "ఈ ప్రైవేట్‌రంగ పారిశ్రామిక, వ్యాపార విజృంభణవల్ల ఆర్థిక రంగంలో వచ్చిన మార్పులను గురించి ఇక్కడ అప్రస్తుతం గాని, కార్మికుల పని పరిస్థితుల విషయంలో, జీతభత్యాల విషయంలో, హక్కుల విషయంలో, సంఘటిత కార్మికోద్యమం విషయంలో ఈ ప్రైవేటీకరణ లోతయిన మార్పులు తీసుకువచ్చింది. అప్పటివరకు ప్రభుత్వరంగంలో అరకొరగనయినా ఉండిన ఉద్యోగభద్రతకు, సామూహిక బేరసారాల అవకాశాలకు, సంఘటిత నిర్మాణాలకు ప్రైవేట్‌రంగంలో అవకాశం లేకుండా పోయింది" (వేణుగోపాల్, ఎన్. 2011: 291). ఇలా ప్రైవేటీకరణ వల్ల వచ్చే పరిణామాలని కొంత ముందుగానే ఊహించి ఉద్యమించిన తర్వాత కార్మికోద్యమం చీలికలు ఏర్పడడం, అంత బలంగా లేకపోవడంవల్ల ప్రైవేటీకరణ స్థిరంగా పాతుకుపోయింది.

"నిజాలపై చీకటి తెర
నిద్రమత్తులో ఆవిరైన ఆకలి
తెల్లవారగానే నేనున్నానంటూ చేరి
కరకరమని పేగులను నలిపేస్తున్న సవ్వడి
అన్నం లేకున్నా సరే
సారాయి పడందే పని జరగని

బానిస బతుకులు
సింగరేణి కార్మిక కుటుంబాల చితులు
కాలుతున్నాయి సారాయికి తగిలిన ఆగిపుల్లల్లా
కూర లేదంటూ పెళ్లాన్ని తంతాడు
సారాయి కోసం రోడ్డు మీదికి పరుగెడుతాడు
డ్యూటీ టైమయిందని గనికెళుతాడు
సారా మైకం కళ్లకు మత్తు పొరలు కప్పుతుంది
వంచిన తల మీద పెళపెళ బొగ్గు పెళ్లలు కూలుతాయి
పాపం – కార్మికుని తల కట్"

(సూర్య, వొడ్నాల. 2003: 84)

సింగరేణి ఉద్యోగంలో బతుకుకు భరోసా ఉండదు. నేలలోపలికెళ్ళకా ఎప్పుడు ఏమవుతుందో తెలియదు. అలాగే చాలా కష్టంతో కూడుకున్న పని. ఒకరోజు పని చేసాక మరోరోజు పనికి వెళ్ళాలంటే సారాయి తాగాల్సిన పరిస్థితి. ఆ సారాయి కష్టాన్ని తొలిగిస్తుందని. ఇప్పటికి పల్లెల్లో ఎక్కువ మంది కార్మికులు సాయంత్రం కాగానే కల్లో, సారాయో, బీరో ఏదో ఒకటి తాగుతుంటారు. అన్నం ఉన్నా లేకున్నా మందైతే ఉండాలి. కొందరు తాగాక ఇంటికొచ్చి ఏదో ఒక కారణంతో భార్యతో గొడవపడడం, ఆవిడని కొట్టడం చేస్తుంటారు.

"బొగ్గు మరకలతో
నల్లబారి మా దేహాలు ఇపుడు
మా భార్యల ఎదుటే పరాయీకరణ చెందడం
ఆశ్చర్యమనిపిస్తోంది
వాణిజ్య కాంక్షతో లాభాల చప్పరింతలకై
చాపుతున్న నాలుకల మీద
ముక్కలైన గని కార్మికుల ఆకాంక్షల ఆనవాళ్ళే
జీవితాలను ఆవిష్కరిస్తాయి
ప్రైవేటీకరించిన విలాస మందిరంలో నల్లకళ్ళద్దాల మాటున
వాడు చీకటినే చూస్తున్నాడు

చీకటిలో బొగ్గను, బొగ్గుపైన 'కరెన్సీ' తళకులను మాత్రమే
చూస్తున్నాడు
గాయపడిన మా కలలు మాత్రం
వెల్లవేశిన బొగ్గుగోడలవైపు తెల్లబోయి చూస్తున్నాయి
నేలవొంటిమీద చర్మాన్ని తొలచి పాతాళానికి
తోడుకెల్తున్న సూర్యకిరణాలతో వాడికి పనేమిటి"

(రవీందర్, పిట్టల(సంపా). 2007: 10)

మనిషికి విలువ తగ్గించి మనిషిని కూడా మార్కెట్లో రూపాయిగా నిలబెట్టడమే ప్రపంచీకరణ లక్షణం. ప్రపంచీకరణ విధానంలో వస్తువు ప్రధానంకాని మనిషి , అతని కోరికలు, కష్టం ప్రధానం కాదు. వస్తువుపై ఉన్న ప్రేమ మనిషిపై ఉండకుండా చేస్తుంది ఈ ప్రపంచీకరణ. "ఇక ప్రపంచీకరణకు ఎన్నెన్ని వ్యక్తీకరణ రూపాలున్నప్పటికీ, దాని సుస్పష్టమైన ప్రయోజనం రాజకీయార్థిక రంగంలోనిదే. పెట్టుబడిదారీ విధానం పుట్టినప్పటినుంచీ కూడ, దానికి మౌలిక లక్ష్యాలు తన ఉత్పత్తి యంత్రానికి చౌక ముడిసరకులను ఇబ్బడిముబ్బడిగా, నిరంతరాయంగా సమకూర్చుకోవడం, ఆ ముడిసరకులలో ప్రకృతి సహజమైన వ్యవసాయోత్పత్తులు, ఖనిజ వనరులు, మానవ శ్రమ ఉండవచ్చు. అప్పటివరకూ సరకులుగా గుర్తించబడని ఎన్నో వస్తువులు సేవలు – మనిషికీ ప్రకృతికీ మధ్య ఉండేవి, మనిషికీ మనిషికీ మధ్య ఉండేవి – ఉండవచ్చు. ఈ సహజ సంబంధాలన్నిటినీ సరకుల సబంధాలుగా మార్చి, అన్ని సంబంధాలనూ, అన్ని వస్తువులనూ, అన్ని సేవలనూ మార్కెట్‌తో అనుసంధానం చేయడం పెట్టుబడిదారీ విధాన లక్ష్యం" (వేణుగోపాల్, ఎన్. 2011: 217). ఇలా మనిషికీ మనిషికీ, మనిషికీ ప్రకృతికీ ఉన్న సంబంధాన్ని కూడా మార్కెట్‌తో అనుసంధానించడం ద్వారా వస్తువులకు తప్ప మనషులకు, వారి శ్రమలకు, వారి కష్టాలకు విలువ లేకుండా పోయింది, పోతోంది.

"కళ్ళు చెదిరే ఎలుగురవ్వలు
మిల్లుమిషనూ ఫ్యానూరైలు
సకల యంత్రాలకు రక్తనాళం
బొగ్గుపెల్లలో పుట్టిన విద్యుత్ రేఖ
సొచ్చిన్నూంచి ఇల్లు చేరే దాకా

బుగులు బుగులైతది
బదిలి బదిలీకి మల్ల పుట్టినట్టు
అగ్గిలో అంటుకున్న బొగ్గు జీవితం
ఊరుపొమ్మని ఎల్లగొడితే
కాలేరు రమ్మని కాగలిచ్చుకున్నది
పరిగ లేరుకొని పలుచనైన బతుకులు
పచ్చపచ్చగానైతే చిగురిస్తున్నాయి"

(రవీందర్, పిట్టల(సంపా). 2007: 8)

భూమిలోపల ఎప్పుడు ఏమి జరుగుతుందో మనం ఊహించలేం. భూగర్భంలోకి ప్రవేశించినప్పటినుండి భయం. అందుకే బదిలి బదిలీకి మళ్ళీ పుట్టడం అని కవి చెపుతున్నారు. ఒకప్పుడు బాధలతో బతికిన కుటుంబాలు సింగరేణివల్ల కొంచం ఆనందంగా బతకడం కనిపిస్తుంది. మిషన్, ఫ్యాను, రైలు ఏదైనా కరెంట్ వల్లే నడవాల్సింది. వాటన్నిటికి మనిషి చెమటే రక్తనాళం. "కర్మజలానికి, ఘర్మ జలానికి ఖరీదు కట్టే షరాబు లేడోయ్' అని శ్రీశ్రీ అనడం అందుకే.

"జీవం రాళ్ళకోసం
జీవితం బొగ్గు తట్టె తల పైకెక్కింది
కారుతున్నది రక్తమో, చెమటో
తెలియని ఒక అవిశ్రాంత
యుద్ద గందరగోళం
జీవితాలు పూచిక పుల్లలైన చోట
జీవించడం కోసం మృత్యువును
కౌగిలించుకోక తప్పదు"

(చెమన్. 2001: 20)

జీవితంపై భరోసలేని పని సింగరేణి ఉద్యోగం. జీవితం గడవడానికి డబ్బులు కావాలి. ఆ డబ్బులకోసం ఒక ఉద్యోగం కావాలి. ఒక పని కావాలి. ఆ పనుల్లో అపాయమైంది బొగ్గుగని కార్మికులది. 'యుద్ధ గందరగోళం' అన్న వాక్యం ఈ పనిలోని పోరాటాన్ని,

‘జీవించడంకోసం మృత్యువును కౌగిలించుకోవడం తప్పదు’ అన్న వాక్యం అపాయాన్ని తెలియజేస్తుంది.

### 2.2.1.6. స్త్రీ

“జీవిత కాలమంతా
అతడిచ్చినా ఓ పదెకరాల పరిధిలోనే
ఆమె బ్రతుకు వ్యవసాయం
ఇది ఒక్క ‘ఆమె’ కథ కాదు
ఎందరో ‘ఆమె’ల కథ”

(హిమజ. 2006: 12)

స్త్రీ తన బాధని తానే చెప్పుకుంటామన్న, చెప్పాలన్న భావన స్త్రీవాదంవల్ల కలిగింది. అంతకుముందు అక్కడక్కడ స్త్రీలు తమ బాధల్ని సాహిత్యపరంగా చెప్పినప్పటికీ స్త్రీవాదంతో బలాన్ని పుంజుకుంది. ఈవాదం కేవలం ఉన్నత వర్గాల స్త్రీలకు మాత్రమే సంబంధించిందన్న వాదన ఉన్నప్పటికీ చాలా మంది స్త్రీ రచయిత్రులు, కవయిత్రులు ఈ వాదంవల్ల తమ తమ బాధల్ని రాయగలిగారు, రాయగలుగుతున్నారు. చిన్నప్పుడు నాన్న, పెళ్ళైయ్యాక భర్త, వృద్ధాప్యంలో కొడుకు ఇలా జీవితాంతం ఎవరో ఒక పురుషుని ఆధీనంలో ఉండే స్త్రీల బాధల్ని ఈ వాదం బహిర్గతంగా వెల్లడి చేసింది. ఈ కవితలో కూడా భర్త ఆధీనంలో బతికే భార్య జీవితాన్ని వివరించారు. ఇది ఒక ‘ఆమె’ కథ కాదు ఎందరో ‘ఆమె’ కథ అనడంలో దీన్ని విశ్వవ్యాప్తం చేసారు కవయిత్రి.

“ప్రకృతిలో విస్తరించిన పత్రహరితం
ఆకాశంలో విహరించిన నీలవర్ణం
పువ్వు పువ్వులో విరిసిన ఎరుపు
కలెగలిస్తే శిఖరాగ్రమైన రూపం
పుట్టుకలకే పుట్టుక
రూపానికి ప్రతిరూపం
సృష్టికి ప్రతి సృష్టి
అదంతా ఆమెకే చెందింది”

(దేవేందర్, అన్నవరం. 2008: 17)

వర్ణనాత్మకంగా సాగే కవిత ఇది. ప్రకృతిలో పత్రహరితం, ఆకాశంలో నీలవర్ణం లాంటి పదాలు స్త్రీ ప్రాధాన్యతను తెలియజేస్తాయి. ఒకరికి జన్మనిచ్చి సృష్టికి ప్రతిసృష్టి చెయ్యడం ఒక్క స్త్రీకే సాధ్యమయ్యేది.

"నా లేలేత ఊహలపై నిబంధనలు విధించి
చిగురాకు కోరికల్ని నియంత్రించి
నన్ను నా కదలికల్ని కట్టడి చేసి
లేని ఒద్దికను నాకు నేర్పి
గిరిగీసి ఆంక్షలు విధించి
స్త్రీత్వాన్ని నాకు అణుక్షణమూ గుర్తుచేయడం కోసం
నెలకు సరిగా హాజరు వేయించుకునే దానివి"

(హిమజ. 2006: 46)

స్త్రీ జీవితంలో భాగమైన పీరియడ్స్ గురించి చెప్పే కవిత. స్త్రీకి వయసు పెరుగుతున్న కొద్దీ ఆమె శరీరంలో మార్పులు చోటుచేసుకుంటాయి. ఆ మార్పులో భాగమైన ఒక అంశాన్ని స్త్రీ స్త్రీగానే చెప్పడానికి మాత్రమే కుదిరేది ఇది. తనెంత స్వేచ్ఛగా ఉందామనుకున్న ఆ స్వేచ్ఛను కట్టడి చేసి తన స్త్రీత్వాన్ని అణుక్షణం గుర్తుచేసే అంశం గురించి చెప్పారు.

"ఆమె
వేకువ ముఖాన్ని అలికి
ముగ్గుబొట్టు పెట్టాకగాని
ఇంట్లో సూరీడు ఉదయించడు
చక్కెరలా కరిగి తేనీటి విందైతే తప్ప
ఇంటాయన కరుణించడు
బాధల ముళ్ళన్నీ వెనక్కి నెట్టి
గులాబీల నవ్వనిదే
ఆఫీసులో బాసుగాడి ముఖం
ఇకిలించదు
తన బోనులోకి ప్రవేశించేదాక

పులుల మధ్యనున్న లేడి గుండె
లయబద్ధం కానేకాదు"

(వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 45)

ఇల్లు, ఆఫీసు, సమాజం ఇలా అన్నీ స్త్రీకి బంధిఖానలుగా మారిన వైనం పై కవితలో చూడవచ్చు. అనాదికాలం నుంచి స్త్రీని ఇంటికే పరిమితం చేసిన పురుషాధిపత్యాన్ని స్త్రీవాదం వ్యతిరేకించింది. స్త్రీలు, పురుషులతో సమానమన్న భావనని సాహిత్యంలోకి తీసుకువచ్చింది. ఈ భావనకు పాశ్చాత్య ప్రభావం కనిపిస్తుంది. "భగవంతుడు స్త్రీని పురుషుడికంటే తక్కువ స్థాయి వ్యక్తిగా సృష్టించాడన్న సంప్రదాయ భావాన్ని మేరీ ఉలస్టన్ క్రాఫ్ట్ తిరస్కరించింది. తల్లిదండ్రులు, అధ్యాపకులు, నిత్యనైమిత్తిక వ్యవహారాలు, ఇంటి నాలుగు గోడల మధ్య జీవితం అన్నీ కలిసి ఆదర్శ స్త్రీ మూర్తిని తయారు చేస్తాయని ఆమె అభిప్రాయ పడింది. ఆ రకంగా పుట్టుక కన్నా పెంపకపు సంస్కృతే స్త్రీ పురుషుల మధ్య తేడాలను సృష్టిస్తుందన్న అవగాహనను కనబరచిన ఉలస్టన్ క్రాఫ్ట్ ఏదైనా ఒక ధర్మం స్త్రీకి, ఒక రకంగా పురుషులకు ఒక రకంగా వుండటాన్ని 'లైంగిక ధర్మం' అని ప్రస్తావించింది. ఆ ద్వంద్వనీతిని వ్యతిరేకించింది" (కాత్యాయని విద్మహే. 2012: 7 – 8). ఇలా స్త్రీలకు పురుషులకు వేరువేరుగా ఉండే ద్వంద్వ రీతులను స్త్రీవాదం ప్రశ్నించింది.

"భాగస్వామి చిటికెన వేలును
పట్టుకుని కడపను దాటుతున్నప్పుడలా
నీవు కడపపై వేసిన ముగ్గులు
చిన్నబోయి చూస్తున్నాయి
మళ్లీ ఎప్పుడెప్పుడు వచ్చి వెళతావోనని
ఎదురుచూస్తున్నా
ఇల్లు, పల్లె, దోస్తులు"

(లక్ష్మణ్, ఆడెపు. 2007: 30)

పుట్టినప్పటినుండి అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు పెళ్ళి చేసుకొని అత్తగారింటికి వెళ్ళిపోతున్నప్పుడు తల్లిదండ్రులకు కలిగే బాధలోంచి కవి మాట్లాడుతున్నారు. పెళ్ళై వెళ్ళిపోయేటప్పుడు కడపపై ముగ్గులు చిన్నబోయి చూడడం గొప్పనైన ఊహ. కూతురే కదా ఇంటిని శుభ్రం చేసి అలుకుజల్లి, కడపలు కడిగి ముగ్గు పెట్టేది. రోజు తన చేతులతో

పుట్టే ముగ్గు రేపటినుండి తను లేదని చిన్నబోవడం ఇంటికి, స్త్రీకి ఉన్న సంబంధాన్ని తెలియజేస్తుంది. పెళ్ళి చేసుకొని వెళ్ళిపోయాక మళ్ళీ ఎప్పుడొస్తావా అని పల్లె, ఇల్లు, స్నేహితులు ఎదురుచూడడం పల్లెతో, ఇల్లుతో, స్నేహితులతో ఆమెకిగల బంధాన్ని, అనురాగాన్ని తెలియజేస్తుంది.

### 2.2.1.7. పల్లె

"వరండాలో,
ఎదురు చూపులతో అమ్మ...
పక్కింటిలో ముస్తాబై
మొగుడి జాడలో పరువాల బొమ్మ
మాట వినని కోళ్ళను,
మచ్చిక చేస్తూ ముసలమ్మ...
మాయింటి జామకొమ్మ
అద్భుతం! మా వూరి సంధ్యారాగం...
దేవుడైన హాయిపొందే జీవన గానం...!!!"
(రవీంద్ర, సంగెవేని. 2005: 77)

పల్లెటూరిని వర్ణిస్తూ రాసే కవిత్వం 'పల్లీయ కవిత్వంగా' ప్రసిద్ధి. ఇలాంటి కవిత్వం భావకవిత్వంలో భాగంగా వచ్చింది. "పల్లె జీవితానికి సంబంధించిన సంఘటనల ఆధారంగా పల్లె జీవితాన్ని చిత్రిస్తూ రచించిన కవిత్వం. పల్లె జీవితంలో ఉంటాయని భావించే అమాయకత్వాన్నీ, సంతృప్తినీ వివరించడం ప్రధానంగా కనిపిస్తుంది ఇందులో. పల్లె జీవితంలో క్రమంగా చోటు చేసుకుంటున్న మార్పులు కూడా ఇందులోకవితా వస్తువులుగా ఉంటాయి" (నళిని, ఎస్. ఎస్. 2009: 108). ఇక్కడ కవి పల్లెల్లో కనిపించే దృశ్యాల్ని కవిత్వీకరించారు.

ఎటుచూసిన పచ్చటి పొలాలు, బతుకంతా అల్లుకుపోయిన బంధాలు, స్వార్థం ఎరుగని మనుషులు, వృత్తిని నమ్ముకొని బతికే ప్రజలు, ఎన్నో ఏండ్లుగా వస్తున్న ఆచారాలకు కొలువు, సంస్కృతి సంప్రదాయాలకు నెలవు పల్లెలు. పైలపచ్చీస్, ఊంచుడుటెక్క, కట్టెచిమ్ముడు మొదలైన ఆటలు, 'పంతులయ్య పంతులయ్య పప్పుచెక్కరి బుక్కవయ్య' వంటి

పాటలు ప్రపంచీకరణవల్ల కనుమరుగయ్యాయి. దసరాకు, దీపావళికి, సంక్రాంతికి పిల్లాపాపలతో, చిన్నపెద్దలతో వెలిగిపోయే పల్లె బతుకు వేటలో వెలవెలబోతుంది. ఎవరికి ఆపదొచ్చిన ముందుండి ఆదుకునే వాళ్ళంతా వలసపడవెక్కి పరాయిదేశం చేరుకుంటున్నారు.

"ఊరు ఊరంతా ఇంపుసొంపుగా లేదు
ఇరిగిపోయిన పెంట పొనుక
తూట్లుపడ్డ వడ్ల బోరెం
కూలిపోయిన పిడికెల కుచ్చె
చెదలు పట్టిన పాతగుమ్మి"

(దేవేందర్, అన్నవరం. 2003: 5)

పగిలిపోయిన 'కూరాటి కుండ' అనే ఈ కవితలో ఇంపుసొంపు, పెంట పొనుక, తూట్లు, వడ్ల బోరెం మొదలైన అన్ని పదాలు మాండలిక పదాలే. పల్లెగురించి చెప్పినప్పుడు పరాయి భాషలో చెప్పడం వల్ల అది అసమగ్రంగా, అసంపూర్ణంగా ఉంటుంది అందుకే ఆ పల్లె భాషనే ఎన్నుకొని కవిత రాసారు.

"సాయిమాను కింద చూరనీళ్ళు
తడిసిపోయిన ఊరపిచ్చుక
ఏంచిన మక్కప్యాలాల వాసన...
అన్నీ యాదికొచ్చి....
పీరీల పండగ నాటి అగ్గిల దూకినట్లయితది...
లచ్చవ్వ పీరీకేసిన కుడుకలపేరు
మాదిగపోతడేసిన జడల దయ్యం
మంగలి బుచ్చివేసే మైసాచ్చిపొగ...
గుండెలనిండా కమ్ముకొని...
కండ్లల్ల నీళ్ళస్తయి..."

(రవీంద్ర, సంగెవేని. 2007 : 46)

జీవితం జ్ఞాపకాల గ్రంథాలయం. ఇందులో కొన్ని మనకు సంతోషాన్నిచ్చేవి, కొన్ని బాధనిచ్చేవి ఉంటాయి. పుట్టిన ఊరిలో బతుకుదెరువులేక చిన్నప్పటినుండి పెరిగిన నేలని,

స్వంతవారిని, బంధువులని, స్నేహితులని అందరిని వదులుకొని పొట్టకూటికై వలసపోయిన వ్యక్తి అంతర్మథనమే ఈ కవిత. వర్షాకాలంలో ఎంచుకున్న మక్కప్యాలాలు, పీరీల పండుగ రోజు లచ్చవ్వ వేసిన కుడకల పేరు, మాదిగపోతడి జడల దయ్యం, మంగలి బుచ్చి మైసాచి పొగ అన్ని జ్ఞాపకమచ్చి మనుసు భారంగా మారి కళ్ళన్ని కన్నీళ్ళతో నిండిపోతాయి.

"పూసిన తంగెడుపూలు
తాంబూలంలో బతుకమ్మయినట్లు
పల్లెకడుపు నిండా
అందరికందరు కలుస్తారు
మనిషి మనిషికీ మధ్య
'మనువు'గాని అంతరాల అరలున్నా
అంతా చుట్టాలే
అమ్మా మనువడు – తాతా మనువరాలు
మందలిస్తే శక్కల్‌గులగులల పరాశికాలు
బావా బామ్మర్ది – వదినే మరదలు
వైనంగానే సరసాల వాన తుంపర"

(దేవేందర్, అన్నవరం. 2005 : 7)

అమ్మ – మనువడు, తాత – మనువరాలు, బావ – బామ్మర్ది, బావ – మరదళ్ళు ఇలా ఎన్నో అనుబంధాల వరుసలతో పల్లె ఆత్మీయరూపాన్ని సంతరించుకుంటుంది. మంగళివారు, సాకలివారు, దళితులు, కమ్మరివారు, కుమ్మరివారు, కాపువారు ఇలా అన్ని రకాల కులాల వాళ్ళతో పల్లె తాంబూలంలో పేర్చిన బతుకమ్మల ఉంటుంది. కులం, మతం అనే అంతరాలు పల్లెటూర్లో ఉన్న వారందరూ బంధువులవలె కలిసే ఉండడం భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతుంది.

"శెప్పుకుంటె మానం బోతది
శెప్పకుంటె పానం బోతది
ఇల్లిల్లు ఏ పొంటకాపొంటె
శెబదల్లతోటి గడ్డవట్టె

పల్లె కండకర్గించి పెర్గిన పంట
పట్నం గోదాములల్ల నిండిపాయే”
(వెంకటేశ్వర్లు, బూర్ల. 2007 : 10)

భారతదేశం ముఖ్యంగా వ్యవసాయిక దేశం. వ్యవసాయానికి పట్టుకొమ్మలు పల్లెటూర్లు. వ్యవసాయం రెండు రకాలు ఒకటి కాలువ సేద్యం, రెండవది వర్ష ఆధారితం. తెలంగాణలో ఎక్కువ శాతం వ్యవసాయం రెండవ రకానికి చెందింది. వాన చినుకు పడితేనే వ్యవసాయం. ఆ చినుకు పడది ఒకవేళ పడ్డ అది నిలవడదు. చినుకు నిలవడడానికి ఆనకట్టలు, డ్యాంలు తెలంగాణలో లేవు. అందుకే ఇక్కడి వ్యవసాయం బక్కచిక్కిపోయింది. అన్ని బాగుండి ఒకటి రెండు పంటలు పండిన గిట్టుబాటు ధర లేక రైతు జీవితం రోజు రోజు అప్పులతో సాగుతుంది.

“కీసల పోసుకున్న మొల్క నూకలు
బుక్కలు బుక్కలుగా బుక్కి
చెంగలిచ్చె ల్యాగలతోటి ఆడుకున్న యాది
ఒలుసుక తినే పచ్చి పెసరుగాయ
నాము నామున్నా ఏరుకతిన్న బొబ్బరుకాయ
ఉడుకబెట్టిన కందికాయ ఇరుగతిన్న యాది”
(దేవేందర్, అన్నవరం. 2003. 20)

జీవితంలో ప్రతి మనిషికి అనుభవాలు, జ్ఞాపకాలుంటాయి. వాటిని కవిత్వంలా మార్చి అందరికి అందిచే శక్తి చాలా తక్కువ మందికి ఉంటుంది. తన చిన్ననాటి జ్ఞాపకాల్ని కవిత్వంగా చెబుతూనే తన స్వంత మాండలికంలో చెప్పడం ద్వారా ఈ కవిత్వం సౌందర్యాన్ని సంపాదించుకుంది. ల్యాగ దూడలు, రకరకాల పూల చెట్లు, పచ్చని వరిపొలలు, పెసర్లు, బబ్బెరు కాయలు మొదలైన అన్ని రకాల వస్తువులకు నిలయం పల్లెటూరు. అలాంటి పల్లెటూరు ప్రపంచీకరణ వల్ల తన అస్తిత్వాన్ని కోల్పోయి చిందరవందరైందనీ, ఆంధ్రాదిపత్య అధికారం వల్ల పచ్చని పల్లె ఎడారై తన స్వరూపాన్ని మార్చుకొని విలపిస్తుందనీ తన ఆవేదనను తెలియజేస్తున్నరు కవి.

“వరి పొలాల్లో శవాల గుట్టలు
పత్తి చేలల్లో చీడ పురుగులు

చిన్న రైతుల కళేబరాలు
కరెంటు బిల్లులకు కాలిపోయే బతుకులు
రాజ్యహింసకు రాలిపోయే అశ్రువులు
పంట పొలాలు బీటలు కండ్లల్లో కన్నీటి ఊటలు
వనం విడిచిన కోతులు వలస వెళ్లే బతుకులు"

(బాలయ్య, పొన్నాల. 2008 : 68)

ఆరుగాలం పగలనకా, రాత్రనకా కష్టం చేసి పండించిన పంటకు ధర నిర్ణయించే అధికారం రైతుకుండదు. తద్వారా సరైన గిట్టుబాటు ధర లేక పెట్టిన ఖర్చు వెళ్ళక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. వర్షాలు లేక, కరెంటు లేక పొలాల బీటలు పడి రైతు కండ్లలో కన్నీటి ఊటలు. కన్నతల్లిలా ప్రేమించిన భూమిని వదిలి వలసెళ్ళిపోతున్నాడు.

### ౨.౨.౧.౮. ప్రకృతి

"అప్పుడప్పుడు కొన్ని పక్షులు
రెక్కలు సాచి ఏ టపటపలు లేకుండా
గాలిలో అనాయాసంగా తేలిపోతుంటాయి
అప్పుడవి నాకు యోగుల్లా అగుపిస్తాయి
అంతమాత్రాన అవి విరాగులు కావు
కొమ్మల మీద గుంపులుగా వాలి
ఎదురెదురుగా కూచుని
గుసగుసలు పెడుతుంటాయి.
అంతలోనే
ఏ గిలిగింతలు తొందరపెడతాయో
ముక్కూ ముక్కూ కలుపుకుని
ముచ్చట తీర్చుకుంటాయి.
అవి ప్రేమికుల చుంబన ముద్రలే కదా."

(నారాయణరెడ్డి, సి. 2007: 3 – 4)

కవి చూపు మామూలు మనుషులకన్నా భిన్నమైంది, విశిష్టమైంది. అందుకే అందరికి మామూలుగా కనిపించేవి పక్షులు కవికి యోగుల్లా, ప్రేమికుల్లా కనిపించాయి. అందరికన్నా విలక్షణంగా ఆలోచిస్తారు కాబట్టే కవులవుతారు.

"చాకలిమోతల మృదంగ ధ్వనులకు
చల్లగా వీచే పిల్లగాలి వయోలిన్ స్వరాలకు
అలల లయల నృత్యాలు చేసేది మా చెరువు
సిన్మా డబ్బులకోసం నీళ్లలో మునిగి
చెరువు జేబు కొట్టినప్పుడు
అప్పుడప్పుడు చేపపిల్లలా కరిచినా
తల్లి మనసుతో చేతినిండా
మనీ పర్సు ఇచ్చేది"

(శివప్రసాద్, సంకేపల్లి. 2002: 55)

ఒక అంశాన్ని, సందర్భాన్ని ఎన్నుకుని వర్ణిస్తూ రాసిన కవితను వర్ణనాత్మక కవిత అంటారు. ఇక్కడ కవి తన చిన్ననాటి చెరువు గురించి వర్ణనాత్మకంగా చెప్పడం జరిగింది. మొదటి మూడు వాక్యాలలో పోలికలు, తర్వాతి వాక్యాలలో యదార్థంగా జరిగిన విషయాన్ని చెప్పారు. చాకలి మోతల మృదంగ ధ్వనులు, పిల్లగాలి వయోలిన్ స్వరాలు, అలల లయల నృత్యాలు  వర్ణనాత్మకమైన వాక్యాలు. చిన్నప్పుడు చూసినా తన చెరువును కవీత్వకరించారు కవి. చెరువుకు, దాని కింది భూభాగానికి భేదం చెప్తూ, ఈ చెరువు ఆ కింది భూభాగాన్ని ఎలా మార్చేసిందన్న విషయాన్ని చెప్పారు. ఆకుపచ్చని రంగు, ఒయ్యారి భామలా నాట్యాలు ఈ కవితకు ఒక సహజత్వాన్ని తీసుకొచ్చాయి.

"ఒక్కొక్కప్పుడు అది రంగురంగుల దుస్తులతో
ముస్తాబయ్యేది
దాని ఆకులు పిల్లగాడ్పులతో మౌనశ్రుతిలో
సరసాలాడుకునేవి
మండుటెండలు మా ఇంటి తలను
మలమల మాడుస్తుంటే

అది మనసారా మమ్మల్ని ఆహ్వానించి
తన చల్లని నీడలో కాసేపు పొదుగుకునేది"

(నారాయణరెడ్డి, సి. 2010: 60)

సౌందర్యం అనేది వస్తుగత సౌందర్యం, ఆత్మగత సౌదర్యం అని రెండు విధాలు. వస్తువులోనే సౌందర్యం మొదటిది అయితే, చూసే చూపులోని సౌందర్యాన్ని రెండవది చెబుతుంది. ఈ కవితలో కవి దృష్టికి అది సౌందర్యవంతంగా కనిపించింది. అందుకే కవి పూలని రంగుల దుస్తువులతో, గాలి తాకడాని సరసంతో పోల్చాడు. చెట్టు తన నీడకిందికి రమ్మని ఆహ్వానించదు. కాని కవి దృష్టిలో ఆహ్వానిస్తుంది. "ప్రకృతిలో కనిపించే సౌందర్యం దాన్ని ప్రేరేపించేకన్ను తటస్థించినప్పుడు అది రెండింతలతుందని ఎమర్సన్ అన్నాడు. ఈ విషయానికి కాస్త దగ్గరగా సంజీవదేవ్ ఆత్మాశ్రయానందం(Subjective joy) వస్త్వాశ్రయ అందాన్ని (Subjective Beauty) అధికం చేస్తుందని అన్నాడు. ప్రకృతి కవి సృజనలోనే కళగా మారుతుంది తప్ప దానికదిగా కళ కాదన్నది కళావేత్తల అభిప్రాయం" (నారాయణశర్మ, ఎం. 2014: 23). ఇక్కడ కూడా ప్రకృతి కవి దృష్టిలోపడి కళగా మారింది.

"చెట్టుమీద
చిలకల గుంపు
అడవి తల్లికి
అకాల వసంతం"

(మోహన్, పత్తిపాక. 2004: 4)

మామూలుగా అడవికి పచ్చదనమొచ్చిందంటే వసంతం వచ్చిందన్నమాట. కాని ఇక్కడ అకాల వసంతం అనడంవల్ల చిలుకలన్ని చెట్టుపై వాలడంతో ఆ చిలుకల పచ్చదనంవల్ల వసంత వచ్చిందని తెలియజేస్తున్నారు కవి. ప్రకృతిని జాగ్రత్తగా పరిశీలిస్తేనే ఇలాంటి వాక్యాలు పుట్టేది.

"చెప్పవశంగాని సక్కదనం
ఆ రూపు ఎన్నటికి మరుపురాదు
తెల్లగ సల్లగ ముద్దుగ బొద్దుగ
దిద్దినట్టు వుండేది!

ఎండకాలం జెగజెగ మెరిసేది
శినుకు వడంగనే నిగనిగ అయ్యేది
ఒక్క జాగల పెండకడి లెక్కనో
ముద్ద లింగమోలెనో పడి వుండేటిది గాదు
ఎప్పుడు జూసినా గునగున ఉరికేది – గలగల నడిచేది
నన్ను జూడంగానే చెంగులిచ్చుడే చెంగులిచ్చుడు"

(రమేశ్, సుంకర(సంపా.). 2009: 111)

కరీంనగర్ జిల్లా మానేరు నది ఒడ్డున ఉంటుంది. ఆ మానేరును మదిలో తలుచుకొని నలిమెల భాస్కర్ గారు రాసిన కవిత ఇది. ఆ నదికి, కవికిగల బంధాన్ని పునశ్చరణ కవితగా మలిచారు. మానవ గుణారోపణ, ఉపమాలంకారం మొదలైన శిల్పంవల్ల కవితా ఆద్యంత ఆసక్తిని కలిగిస్తుంది. ఈ కవిత భాష అదనపు అందం.

### 2.2.1.9. రైతు

"మట్టి ప్రశ్నించదు
చీడపట్టిన చేనూ నిలదియ్యదు
విత్తనాలకోసం విత్తం కోసం
బొక్కలరిగేలా తిరిగిన దేహాలు
శాపనార్థాలూ పెట్టవు
ఒక శ్మశానాన్ని కలగంటూ క్షేత్రాలమీద వాగ్దానాలు చల్లి
పథకాల ఎరువువేసి
మనం పండించుకుటున్నదే
ఈ శవాల పంట"

(శివకుమార్, వఝల. 2004: 73)

అందరికి అన్నంపెట్టే రైతుకే అన్నం దొరకని స్థితిలో ఉన్న పట్టించుకోని స్థితిని కవి వివరిస్తున్నాడు. పంటలోని క్రమాన్ని కవి రైతు హత్యకు ముడిపెట్టిన విధానం ఇక్కడ చూడవచ్చు. వాగ్దానాల విత్తులు, పథకాల ఎరువు, శవాల పంట అని వ్యవసాయ ఆరంభంనుండి చివరివరకుగల పరిణామాల్ని రైతు జీవితానికి అన్వయించి చెబుతున్నారు.

ఈ దేశానికి వెన్నెముకగా ఉండవల్సినవారే వెన్నుపూస కదిలి మరణిస్తున్న ధోరణిని ఎండగడుతున్నాడు. రైతు చనిపోయినప్పుడు వెళ్ళి పరిహారం ఇవ్వడంకన్నా చనిపోకుండా చర్యలు తీసుకునే స్థితికి ఈ ప్రభుత్వాలు రావాల్ని ఆకాంక్షిద్దాం.

"తెచ్చిన పిడికెడు మట్టిమీద ఒట్టు
ఇదిగో
సన్నని మూలుగు విన్పిస్తుంది
ఇది కూశికూశి అయిన నాగలి ఏడుపు
ఆ.. టక్.. టక్.. మనేవి
ఎద్దు డెక్కల చప్పుళ్ళే
పులుకు పులుకున సూసుకుంట
బక్కెద్దు కబేలాకు ఎలి పోతంది"

(దేవేందర్, అన్నవరం. 2008: 19)

అన్నవరం దేవేందర్ కవిత్వ సౌందర్యం తీసుకున్న వస్తువుని చెప్పేందుకు వాడే భాషలో కనిపిస్తుంది. సహజంగా ఎదుటివాళ్లు ఏదైనా నమ్మడానికి ఒట్టుపెట్టుకోవడం అలవాటు. దానే కవిత్వంలోకి తీసుకొచ్చి తను చెప్పే విషయాన్ని సత్యంగా మలుచుకుంటారు. ఈనాడు రైతుల పరిస్థితి దీనికంటే భిన్నంగా లేదు. ఒకప్పటి కవిత్వానికి ఇప్పటి కవిత్వానికి భేదం చూడవచ్చు. ఊహల ప్రధానంగా ఒకప్పటి కవిత్వం వస్తే సామాజిక సంఘటనల ఆధారంగా, వాటి చిత్రణగా నేటి కవిత్వం మనకు కనిపిస్తుంది.

"బ్యాంకోల్లు ఇజ్జత్ పజీత చేస్తండ్రు
అప్పులోల్లు మానం తీస్తండ్రు
నేనైతే ఇక బతుక లచ్చిమి!
సొసైటియి ఇరవై నలబై అయినయట
యాబై వేలు షావుకారుకియ్యాలె
ఇంక ఆడీడ మస్తున్నయే
నా మీద నాకే ఒకారం పుడుతుంది
బతకంటే సిగ్గనిపిస్తుంది"

(దేవేందర్, అన్నవరం. 2005: 38)

నలుగురికి బతుకునిచ్చే రైతు బతకలేని స్థితిలోకి నెట్టివేయబడడం వెనుక ప్రభుత్వ వైఫల్యం కనిపిస్తుంది. ఇన్నిరోజుల ఆనందంగా బతికి రైతు ఇప్పుడే ఎందుకు మరణిస్తున్నాడని మనం ప్రశ్నించుకుంటే వాస్తవికతను, దాని వెనకనున్న కుట్రను అర్థం చేసుకోవచ్చు. వాణిజ్య పంటలు, వాటికవసమయ్యే ఎరువులు, వాటివల్ల భూసారం తగ్గడం, ఒక్కసారి కొన్న విత్తనాలు మళ్ళీ వేయడానికి పనికిరాకపోవడం, సబ్సీడిలు లేకపోవడం, కనీస మద్దతుధర నిర్ణయించకపోవడం ఇలా అన్నీ కలిసి వ్యవసాయానికి ఉరిల మారాయి.

"దేశదేశాల్లో దేశాన్ని తాకట్టు పెట్టినవాల్లు
నేల నేలంతా అప్పుల మయం చేసినవాల్లు
దర్జాగనే బతుకుతున్నరు చూడు
అప్పుల ఊబిలో దిగిన ఓ రైతన్నా!
వేలాడుతున్న ఉరితాడును కొడలితో కొయ్యి
పచ్చని పంటకోసం పుట్టెడు అప్పులు కావచ్చు
ఆగం ఆగం కాకు... ముల్లును ముల్లుతోనే తియ్యి
ఇగురంగా బతుకు"

(దేవేందర్, అన్నవరం. 2005: 50)

ఉత్తమ కవికి ఉండాల్సిన లక్షణం సామాజిక స్పృహ. ఈ స్పృహలేని కవిత్వం అంతగా రాణించదు. అలాంటి సామాజిక స్పృహ అన్నవరంకు చాలానే ఉంది. అందుకే దేశానికే అన్నం పెట్టే రైతును ఓదార్చుతున్నారు. ధైర్యంగా బతకమని భరోసా ఇస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతు అప్పుల్లో బతుకుతుంటే ఆ రైతు శ్రమని అమ్ముకొని బతికే దళారులు మిద్దెల్లో బతకడం ఈ దేశ దగాకోరుతనాన్ని చూపిస్తుంది. అందుకే చెమట చుక్కల్ని దోచుకునేవాళ్ళను ఎదిరించి గెలవాలని చెబుతున్నారు.

"మాటల మర్మం తెల్వక
బోర్ల పడ్డం
మా యెన్ను పూస ఇరిసి
తైతక్కలాడుతండ్రు
నడుమంతరపు దళారి గాళ్ళు
నాసిరకం మందులిచ్చి

మా నడుములు విరగ్గొట్టి

మా ఆటలు చూస్తుండ్రు

దుక్కిదున్నిన భూమిల

మొలకెత్తని ఇత్తులు ఇచ్చి

మమ్ముల గోస పెడ్తుండ్రు"

(లక్ష్మణ్, ఆడెపు. 2007: 9)

రైతే దేశానికి వెన్నెముకని చెప్పే ప్రభుత్వం రైతును కాపాడుకోవడానికి చేసే ప్రయత్నాలు చాలా తక్కువ ఉంటాయి. ఋణాల దగ్గరినించి, విత్తనాలు, ఎరువులు, మందులు ఇలా అన్నింటిలో నాసిరకం లేదా కల్తీవి ఇచ్చి వ్యవసాయాన్ని, రైతును నట్టేట ముంచే దళారులను అణిచివేయలేకపోతున్నారు.

### 2.2.1.10. వలస

సాధారణంగా ప్రజలు తమ ప్రాంతంలో సరైన నధులు, భూములు లేక జీవనం దుర్భరమైనప్పుడు పొట్టకూటికై వలసపోతుంటారు. తెలంగాణలో నిధులు, భూములు అన్ని ఉన్నా వలసలు ఎక్కువగా ఎందుకున్నాయంటే నిధులు ఆంధ్ర రాజకీయ నాయకుల చేతుల్లో ఉండడంవల్ల నిధుల కేటాయింపుల్లో వివక్ష చూపించడం, కాలువల నిర్మాణంలో, నీళ్ళ విడుదల విషయంలో అన్యాయం చేయడంవల్ల భూములున్న నీళ్ళు పారకపోవడం, ఉద్యోగాలున్న వాటిల్లో సీమాంధ్ర ప్రాంతం వాళ్ళే ఉండడం, ప్రపంచీకరణవల్ల వృత్తులని నశించడం, యంత్రాల వాడకం పెరగడం మొదలైన కారణాలవల్ల తెలంగాణలో వలసలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో వలసలు ఎక్కువగా కనిపిస్తాయి.

"వలసంటే...

అకారణంగా తన్నుకువచ్చే కన్నీళ్ళను

అన్నీ తానై తుడుచుకునే అసహాయత...

మట్టి స్పర్శతో పులకంచిన పాదాలు

కాంక్రీటు నిప్పులపై ఆవిరయ్యే నిస్సహాయత..

ఆకలి మూలాల్ని పెళ్లగిస్తూ

పేగులు చేసే ఆర్తనాదాలు...
పల్లె దోసిలి నుండి ఎగిరొచ్చే పైరగాలి–
హృదయంపై తేనేగాయం చేస్తుంటే...
వలస ఎంత వేదనో తెలిసి వస్తుంది...

(రవీంద్ర, సంగెవేని. 2007 : 1 – 2)

పై కవిత వలసకి నిర్వచనంలా కనిపిస్తుంది. చిన్నప్పటినుండి పెరిగిన పల్లెని, చిన్ననాటి స్నేహితుల్ని, అమ్మనాన్నలను కుటుంబ సభ్యులందరిని వదిలి వెళ్తున్నప్పుడు వచ్చే కన్నీళ్ళలో బంధుత్వాల్ని, అనురాగాల్ని అంతం చేసుకోవడం. మట్టితో మనకుగల బంధాన్ని తెంచుకొని కాంక్రీటు నిప్పులపై నడవడం. పల్లెకు, పల్లె అనురాగాలకు వీడ్కోలు చెబుతూ మనదికాని ప్రాంతంలో, మనది కాని దేశంలో, మనది కాని భాషలో జీవనం సాగించడం. అమ్మ లాలన, నాన్న పాలన గుండెను వేదిస్తున్న మౌనంగా భరిస్తూ సాగిపోవడం.

"ప్రేమలేక కాదు
పనిలేక
వలస పక్షులు
ఎగిరిపోతున్నై"

(అశోక్, జిందం. 2006: 9)

తెలంగాణ నుంచి ఎక్కువ మంది దుబాయ్, మస్కట్, బొంబాయి మొదలైన ప్రదేశాలకు వలసపోతుంటారు. దీనిక్కారణం ఒకటి సీమాంధ్ర ప్రాంత నాయకులు, వ్యాపారవేత్తలు తెలంగాణ ప్రాంతపై వివక్ష చూపించడం, ఆధిపత్యం చెలాయించడం, అధికారంతో తక్కువ ధరకు కొనడం, ఇక్కడి భూముల్ని ఆక్రమించుకొని రియలెస్టేట్ వ్యాపారం చేయడం, ఇక్కడి ఉద్యోగాల్లో సీమాంధ్ర ప్రాంతంవాళ్ళు ఎక్కువగా ఉండడం అయితే, రెండోది ప్రపంచీకరణ. భూములున్నా, నిధులున్నా ఇక్కడి వాళ్ళు మరెక్కడికో వలసపోవాల్సిన స్థితి వచ్చింది. నీళ్లు, నిధులు, ఉద్యోగాలు అన్నింటిలో తెలంగాణకి జరగాల్సిన న్యాయం జరగకుండ చేయడంవల్ల తెలంగాణలో వలసలు ఎక్కువగా ఉన్నాయి. "ఆంధ్ర, తెలంగాణ విలీనం జరగగానే తెలంగాణలో ఉన్న ఉద్యోగ ఖాళీలలో ఆంధ్ర ప్రాంతం వారిని ఇష్టం వచ్చినట్లు నియమించారు. స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వమన్న నిబంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారు. దొంగ ముల్కీ సర్టిఫికేట్లతో ఉద్యోగాలో చొరబడ్డారు.

ప్రజా చట్టం 1957(నివాస, నిబంధనలు)లను పూర్తిగా ఉల్లంఘించారు. విద్యాసంస్థలలో సీట్లన్ని తెలంగాణ విద్యార్థులకే కేటాయించబడ్డప్పటికీ తప్పుడు ముల్కి సర్టిఫికేట్ల ద్వారా కానీ, ముల్కీ నిబంధనలను ఉల్లంఘించి కానీ ఆ సీట్లన్నీ ఆంధ్రా విద్యార్థులకే కట్టబెట్టారు. తెలంగాణా ప్రాంతానికి సంబంధించిన నిధులను ఆంధ్రా ప్రాంతపు అభివృద్ధి కొరకు కేటాయించారు. ఫలితంగా తెలంగాణలో అభివృద్ధి కుంటుపడింది" (శోభాగాంధి. 2010: 45 – 46). ప్రపంచీకరణవల్ల యంత్రాలు వచ్చాయి. తద్వారా అవి శ్రామికుల శక్తిని నిర్వీర్యం చేశాయి. ఉదాహరణకు ఒక్క ట్రాక్టర్ రావడంవల్ల ఎడ్లబండి తయారు చేసే వడ్లాయన, కర్రు తయారుచేసే కమ్మరాయన, పొలం దున్నడానికి, బంతి చేయడానికి వచ్చే కూలీలు ఇలా ఎందరో ఉపాధి లేకుండా అవ్వడంతో పనిని వెతుక్కుంటూ మరో ప్రాంతం వలస వెళ్ళాల్సిన స్థితి వచ్చింది.

"యుద్ధం చేసేవాడికి కత్తి విలువ తెలిసినట్టు...
వలస పోయేవాడికి కన్నీటి విలువ తెలుస్తుంది...
ఊరు విడిచేటప్పుడు...
నేనో కన్నీటి మూటని..."

(రవీంద్ర, సంగెవేని. 2007: 6)

ఒక కవిని అర్థం చేసుకోవాలంటే అతని రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిస్థితుల్ని తెలుసుకోవాలి. అప్పుడే అతని కవిత్వాన్ని మనం అర్థం చేసుకోగలుగుతాం. సంగెవేని రవీంద్ర గారు కరీంనగర్ (పాత కరీంనగర్ ఇప్పుడు జగిత్యాల) కు చెందినవారు. తన ఊర్లో ఆకలితీరే దరి లేక వలసదారి పట్టినవాడు. ముంబాయిలో బట్టల మిల్లులో ఆఫీస్‌బాయ్‌గా చేరి మేనేజరుగా పదవి విరమణ చేసినవారు. ఈ అంశాలు తెలియకపోతే రవీంద్ర కవిత్వాన్ని అర్థం చేసుకోలేం. వలసలోని బాధల్ని, వేదనల్ని అనుభవించినవారు కనుకనే వలసలోని దుఃఖాన్ని అంత సహజంగా కవిత్వీకరించగలిగారు. మనసుకు అల్లుకుపోయిన బంధాల తీగల్ని తెంచుకొని ఊరు విడుస్తున్నప్పుడు నేనొక కన్నీటి మూటనంటారు. యుద్ధం చేసేవాడికి కత్తి విలువ తెలిసినట్టు వలస పోయేవాడికి కన్నీటి విలువ తెలుస్తుంది అనడంలో నిజనిర్ధారణ అవుతుంది.

"బొంబాయి బస్సు
మనుషులతోపాటు
రోజూ కన్నీటి నదుల్ని
మోసుకెళ్తుంది"

(మోహన్, పత్తిపాక. 2004: 17)

సాహిత్యం, సమాజం వేర్వేరుగా ఉండవు. అవి ఒకదానికొకటి అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. కవి కూడా ఒకానొక సమాజంలో బతుకున్నవాడే కనుక ఆయా కాలంనాటి రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు కవిమీద ఉండడంతో అవి ఆయన కవిత్వంద్వారా వెలువడుతాయి. ఇక్కడ కవి జీవించేది తెలంగాణలోని కరీంనగర్ జిల్లా సిరిసిల్లాలో. అందుకే ఆ ప్రాంతానికి సంబంధించిన సంఘటనని అక్షరరూపం చేశారు. కరీంనగర్ నుంచి బతుకుదెరువుకై వలసపోతుంటారు. ఆ సంఘటనని ఆర్ద్రంగా చిత్రించారు. బస్సు మనుషులతోపాటు కన్నీటి నదుల్ని కూడా మోసుకుపోతుందన్నప్పుడు ఆ సంఘటన తాలూకు బాధని, దుఃఖాన్ని మనసుకి పరిచయం చేశారు.

### 2.2.1.11. కరువు

"సాధారణంగా కరువు అంటే ఏదైనా ఒక ప్రాంతంలోని ప్రజలు వర్షాభావం వల్ల, అధిక వర్షాల వల్ల, రోగాల మూలంగా ఆకలివాత పడినట్లయితే ఆ ప్రాంతాన్ని కరువు ప్రాంతం అంటారు" (మహేశ్వరం, వి. అముద్రిత సిద్ధాంతవ్యాసం. 2009: 18). ఒకప్పుడు తెలంగాణలో వర్షాలు అధికంగానే ఉండేవి. ఇంటి కలపకోసం, వంట చెరుకుకోసం, రియలెస్టేట్ మొదలైన కారణాలవల్ల అడవులన్నీ మాయమయ్యాయి. తద్వారా అడవుల శాతం తగ్గిపోయి వర్షాభావం ఏర్పడింది.

"నాలుగొద్దులకోపారి వచ్చే నీళ్లకు
నల్లకాడ లొల్లి లొల్లి
ఆపతి సంపతిల పాణం ఇచ్చుకొని
ఎప్పుడూ కూడుండే ఆడోళ్ళం
నీళ్ళు జెయ్యవట్టి కొట్లాడుతున్నం
నీళ్ళ తిప్పలు చెప్పరాదు

పావుగంట పనికి పొంటె పోతది
సోదు లేకుంటే పంటం గానీ
సుక్కనీళ్ళు లేకపోతే ఎల్లుద్దా"

(దేవేందర్, అన్నవరం. 2005: 34 – 35)

కరువు ప్రాణంలా కలిసున్న వాళ్ళని శత్రువుల్లా చేస్తుందనడానికి పై కవితనే ఉదాహరణ. నాలుగురోజులకు ఒకసారి నీళ్ళు రావడం వల్ల కలిగే బాధల్ని కవి వివరిస్తున్నాడు. తన చూసిన లేక అనుభవించిన అనుభవమే పై కవిత. పట్టణాల్లోనైతే నీళ్ళ ట్యాంకర్, పల్లెటూర్లోనైతే నల్లా నాలుగురోజులకు ఒకసారి రావడంతో ఆ వీధి వాళ్లంతా ఒకేసారి అక్కడకు చేరుకుంటారు. దాంతో గొడవలు మొదలవుతాయి. అన్నం ఉన్నా లేకున్నా బతకగలగవచ్చు కాని నీళ్ళు లేకుండా బతకలేం. అలాంటి కఠిన స్థితిలో నీళ్ళు అమూల్యమైనవి.

"పుట్టినపిల్ల పురిట్లనే పోయినట్లు
మంట్లెగలువక ముందే సినుకు గాల్లే గలువవట్టె
తాకినేలుకే దెబ్బతాకినట్టు
గాలిమీద గాలచ్చి రాళ్ళదెబ్బగొట్టవట్టె
ఆరుగాలం ఆవురావురుమని పన్జేసిన బక్కెడ్లను జూత్తె
పానం అవిశిపోవట్టె"

(వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 10)

తెలంగాణ రైతుకు అభిమానం ప్రాణంతో సమానం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పత్తిలాంటి వాణిజ్య పంటలు రైతులకు కొత్త కోరికలని రేకెత్తించాయి. పంట రహస్యం, మార్కెట్ రహస్యం తెలియని రైతులు నష్టపోయి అప్పులు మిగులగా ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. వర్షాలు లేకపోవడం, ఒకవేళ ఉన్న పంట చేతికొచ్చే సమయానికి గాలో, వానో వచ్చి పంటను నాశనం చేయడం రైతుల బతుకులను ఆగమాగం చేస్తున్నాయి. పంటలేకపోవడం వల్ల గడ్డి లేకపోవడంతో తెలంగాణ ప్రజలవలె ఎడ్లు ఎండుకపోయాయన్న వాస్తవ పరిస్థితిని వివరిస్తున్నారు కవి.

"నున్నగా తారు రోడ్డు పరిచి
కలల కూడా డ్రైవింగ్ చేయని వాళ్ళు

ఫోన్ లైన్ల కోసం కందకాలు తవ్వీ తవ్వీ
హలో అని పలకని వాళ్ళు
పాలరాళ్ళతో భవనాలెన్నో కట్టి
పూరిగుడిసెల్లో జీవించే వాళ్ళు
ఉస్నాద ఎములాడ సిర్సిల్ల...
చినుకులు కురవని పల్లెలు ఎల్లగొడితే
అడ్డ మీద కూలీలైరి"

(దేవేందర్, అన్నవరం. 2005: 60)

పల్లెల్లో వ్యవసాయంపై కేవలం రైతులే కాక పల్లెలోని మిగిలిన వృత్తులవారు కూడా ఆధారపడేవాళ్ళు. ఎలాగంటే కుమ్మరివాళ్ళైతే ఎడ్లబండికి నొగళ్ళు, చక్రాలు మొదలైనవి చెక్కేవారు. కమ్మరివారు కురిపెలు, కర్రులు, కొడండ్లు చాటువేసేవారు. వీళ్ళందరూ తమ కష్టానికి డబ్బులు తీసుకోక ఒకప్పుడు ధాన్యాన్ని తీసుకునేవారు. ఇలా పల్లెలో కరువు రావడం వల్ల పల్లెపల్లె మొత్తం కూలీలుగా మరే పరిస్థితి. అదే సందర్భాన్ని కవి ఇక్కడ వివరిస్తున్నాడు.

"కన్నీళ్ళకు కరువొచ్చింది
ఎన్నాళ్ళని కారుతాయి...?
గుండె బద్దలవుతుంటే
కళ్ళనిండా వచ్చేవి కన్నీళ్లేగా...
ఎన్నాళ్ళని ఊరుతాయి....?"

(రవీంద్ర, సంగెవేని. 2005: 5)

భూమి లోలోతులోకి వెళ్ళిన కొద్ది నీటి ఆనవాళ్ళు దొరికినట్టు తెలంగాణ చరిత్ర లోతుల్లోకి వెళ్ళినపుడు కన్నీళ్ళ అనవాళ్ళు కనిపిస్తాయి. పుట్టినప్పటి నుండి మరణించే వరకు కన్నీళ్ళు కార్చి కార్చి ఇక కన్నీళ్ళకు కరువొచ్చింది. ఇక కన్నులను ఎంత ఒత్తినా రాలేవి రక్తపు చుక్కలే తప్ప కన్నీటి చుక్కలు కావని సమస్యలతో సమరం సాగించే వారి జీవన పోరటాన్ని వివరిస్తున్నారు.

"కట్టమీన కూకోని పదం పాడుకుంట
వాయిలి బరిగెల తోని జెల్లలు పట్టేది
ఇప్పటి కత్తు పోరగాండ్లకైతే

గాలం తెల్వది... ఎర్రలు తెల్వయి
అస్సలు చెరువు నిండితే గదా!
పదం పాడుకుంట చాపలు పట్టుడు"

(దేవేందర్, అన్నవరం. 2005: 71)

సమాజం చలనశీలమైంది. చలనంలో సమాజంలో అనేకానేక మార్పులు వచ్చాయి, వస్తాయి. ఒక్కప్పుడు చెరువు కట్టమీద కూర్చోని జానపదాలు పాడుకుంటూ చేపలు పడితే ఇప్పుడు అది లేదు. అందుకే ఇప్పటి తరానికి గాలం, ఎర్రలు తెలియవు. కృత్రిమ ఎరువులు, మందులు వాడడంవల్ల ఎర్రలు(వానపాములు) చనిపోయి వాటి జాడ కనబడడం లేదు. వానలు కురవక చెరువులో నీళ్ళు లేక బతుకమ్మలు భూమ్మీదే వదులుతున్నారు. ఒకప్పుడు ఈత నేర్చుకోడానికి చెరువుకెళితే ఇప్పుడు ఈతనేర్చుకోడానికి స్విమ్మింగ్ పూల్లను ఆశ్రయిస్తున్నారు.

### 2.2.1.12. స్మృతి

'Elegy' అన్న ఆంగ్ల పదానికి సమానార్థకంగా 'స్మృతి కవిత' అని వాడుతున్నాం. ఎవరైనా చనిపోయినప్పుడు వాళ్ళను తలుచుకుంటూ రాసే కవిత స్మృతి కవిత. భావకవిత్వంలో ఈ స్మృతి కవిత్వం ఆరంభమైంది. "పాశ్చాత్యుల ఆత్మాశ్రయ కవిత్వంలో Elegy ప్రధానమైంది. Elegyని తెలుగులో శోకగీతమని, శోకకావ్యమని కొందరన్నారు. తాపీ ధర్మారావు గారు 'కారుణ్యము' అని నామకరణం చేశారు. కానీ Elegy కి సమానార్థకంగా స్మృతిగీతం, స్మృతికావ్యం అనే పదాలే సముచితమైనవని నా అభిప్రాయం" (నారాయణరెడ్డి, సి. 1975: 53). అలాగే డా. సి. నారాయణరెడ్డిగారు దేశ నాయక స్మృతి, సతీ స్మృతి, సుతాదిక స్మృతి, ఆప్త స్మృతి అని నాలుగు రకాలుగా విభజించారు.

"కాలం నిర్దయాత్మజ
అది కమనీయ భూమికలని తన్నుకుపోతుంది
నదులు నదులుగా మేం
వేదనలు మోసుకొచ్చి
నీ సాగరాత్మతో సంగమించేవాళ్ళం
మా అక్షరాకృతుల్ని

నీ గుండె సాంఘాలో పొదిగి
ఓ కలంకారీ కలనేతగా అలిచి
లోకానికందించేవాడివి

(శివకుమార్, వర్ఘుల. 2004: 78)

తెలుగు కవిత్వంలో ఇలాంటి కవితలు చాలానే వచ్చాయి. తన స్నేహితుడు ఆత్మహత్యను నిరసిస్తూ ఆప్తవాక్యాలుగా రాసుకున్న కవిత ఇది. ఇది అనుభవపూర్వకమైన కవిత. ఇలాంటి కవితల్లో వారితో గడిపిన క్షణాల్ని, ఆ అనుభవాల్ని పలవరించడం ఎక్కువగా ఉంటుంది.

శీలా వీర్రాజు గారు మరణించినపుడు ఆయన భార్య దృష్టి నుంచి రాసే ప్రయత్నం చేశారు కవయిత్రి.

"జీవన పర్యంతం తోడై నిలిచే చెలికాడు
సగంలోనే దారిని మార్చుకుంటాడని
కలనైనా అనుకొని వుండదా పిచ్చితల్లి
ఆరేళ్ళ దాంపత్య జీవనమెలా మరుస్తుంది!
నూరేళ్ళ భవితవ్యమెలా గడుస్తుంది!"

(హిమజ. 2006: 21)

నా అనుకున్నవాడు మధ్యలోనే మరణిస్తే కలిగే దుఃఖాన్ని వివరిస్తున్నారు. గడిచినా జీవితాన్ని మరవకపోవడం, వచ్చే భవిష్యత్తును ఊహించుకొని బాధపడడం ఈ కవితలో కనిపించే అంశాలు. అందుకే మనసులోని బాధ పోయేదాకా ఏడ్వండని చెబుతుంది.

"ఏరోజు
మనకి ఏ పేపర్ కావాలో
ఆదివారం ఎన్ని పేపర్లు కావాలో
అతనికి తెల్సినంతగా మనకు తెలిసేది కాదు
కానీ
తన శరీరానికి
ఏ మందులు కావాలో
చూసుకోకుండా వెళ్ళిపోయాడు

ఇవ్వాళ పేపర్ రాలేదు
కానీ రేపు పేపర్ వస్తుంది
రోజూ పేపర్లు మోసిన
పేపర్ సత్యనారాయణ
మరణవార్తని
ఏ పేపరూ మోసుకురాలేదు
కానీ
ప్రతిరోజూ
పేపర్‌ని ముట్టుకోగానే
అతని జ్ఞాపకం తడిగా నన్ను తాకుతుంది"

(జింబో. 2003: 35)

బంధువుల గురించి, బాగా కావసినవాళ్ళ గురించి, ప్రసిద్ధ వ్యక్తుల గురించి స్మృతి కవితలు రాసినవాళ్ళున్నారు. కాని ఒక పేపర్ బాయ్ గురించి స్మృతి కవిత రాయడం గొప్ప విషయం. ప్రపంచాన్ని పేపర్ రూపంలో మన ఇంటి ముందు ఉంచే పేపర్ బాయ్ గురించి రాసిన గొప్ప కవిత ఇది. ఏ రోజు ఏ పేపర్ కావాలో, ఎన్ని కావాలో ఒక్కసారి చెబితే గుర్తుంచుకొని వేసే పేపర్ సత్యనారాయణ జబ్బుకు తగ్గ మందులు వాడక మరణించడం పేదరికాన్ని తెలియజేస్తుంది. రోజు పేపర్‌లు వేసే సత్యనారాయణ మరణవార్తని ఏ పేపర్ మోసుకురాకపోవడం శోచనీయం. పేపర్‌ని తాకగానే ఆయన జ్ఞాపకం తడిగా తాకుతుందని ఆయనపట్ల కవికున్న ప్రేమని తెలియజేస్తున్నారు.

"ఎలా ఓదార్చమంటారు మిమ్మల్ని
ఏ ప్రశ్నడిగినా
మీ గుండెగాయం మరింత కెలకడమే
సుదూర తీరాల్లో జరిగిన విషాదాన్ని
మాటల కనువదించి మీరు
మరింత రక్తసిక్తమవ్వడమే
అందుకే
గట్టిగా ఏడవండి

దుఃఖం హిమపాతమై పేరుకోకముందే
వేదన మంచుఖడ్గమై కోయకముందే
కన్నీరై కురవండి!"

(హిమజ. 2006: 21)

శీలా వీ్రాజు గారు మరణించినప్పుడు శీలా వీ్రాజు గారి భార్యని దృష్టిలో పెట్టుకొని రాసిన కవిత ఇది. ఒక వ్యక్తి మరణించినప్పుడు వాళ్ళ కుటుంబం బాధలో, దుఃఖంలో ఉంటుంది. అలాంటప్పుడు మళ్ళీ వాళ్ళని పలకరించినా, ప్రశ్నలడిగినా మళ్ళీ ఆ గాయాన్ని గుర్తుచేసినావాళ్ళమే అవుతాము తప్ప ఓదార్చినవాళ్ళం కాలేము. ఏడుపే బాధని పోగొడుతుందని అందుకే బాధని పోగొట్టుకోవడానికి గట్టిగా ఏడ్వండని కవయిత్రి చెబుతున్నారు.

### 2.2.1.13. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం

మలిదశ తెలంగాణ ఉద్యమం అందించిన చైతన్యం అంతా ఇంతా కాదు. పరాయి భాష, పరాయి సంస్కృతి, పరాయి చరిత్ర, పరాయి పాలన మొదలైన ఎన్నో విషయాలను తిరస్కరిస్తూ తమ భాష, తమ సంస్కృతి, తమ చరిత్ర, తమ పాలన మొదలైన అంశాలను ముందుకుతీసుకొచ్చింది. సుప్తచేతనావస్థలో ఉన్న ప్రతి వ్యక్తిని నినదింపజేసి కలంతో, గళంతో యుద్ధోన్ముఖుల్ని చేసింది. ఇన్నాళ్ల దోపిడికి, దౌర్జన్యానికి, నిరంకుశత్వానికి భరతవాక్యం ఆలపించేలా చేసింది. ఈ ఉద్యమం అందించిన స్ఫూర్తితో ఎంతో మంది నవీన కవులు, కళాకారులు, పరిశోధకులు ఆవిర్భవించారు. కవులకు, కళాకారులకు, రచయితలకు, పరిశోధకులకు తెలంగాణ ఒక అమూల్య వస్తువైంది.

గ్రామగ్రామాన రోజుకో కొత్త పాట వెలసింది, వారానికో కొత్త కవితా సంకలనం నిలసింది. తెలంగాణ ఆవశ్యకత కేవలం భౌగోళికంగానే కాదు సకల దౌర్జన్యాలనుంచి, దురాగతలనుంచి అని కవులు, కళాకారులు నినదించారు. అసమానత, అక్రమ పరిపాలనను కూల్చడానికి స్థానికతావాదం ఎదురైనిలిచింది. అందుకే తెలంగాణ సాహిత్యం శత్రువుపైకి గురిపెట్టిన అక్షరబాణం. ఇలా వచ్చిన సాహిత్యాన్ని దేన్ని చూసిన తెలంగాణ ప్రాంతీయతవాదం కనిపిస్తుంది. తెలంగాణ ఉద్యమంలో ఎకడెక్కడో చిందరవందరగా వచ్చిన కవిత్వాన్ని ఒక రాశిగా పోసే సందర్భంనుండే అనేకానేక కవితా సంకలనాలు

పుట్టుకొచ్చాయి. ఏది న్యాయం, ఏది అన్యాయం, ఏది ధర్మం, ఏది అధర్మం అని తెలంగాణ ప్రజలకి తెలియజెప్పే బాధ్యతతో పాటు ప్రజలను ఉద్యమం దిశగా అడుగులు వేయించే బాధ్యతను కవులు, కళాకారులు స్వీకరించారు.

### 2.2.1.13.1. వివక్షను, దోపిడిని ప్రశ్నించడం

"నా మాటనెక్కిరిచ్చి పాటనెక్కిరిచ్చి
నా బాటనిండ కంపలు నాటి
నన్ను నట్టేట్ల ముంచుతున్న
మీ తీరొక్క దుర్మార్గాల మీద
ఇంక తిర్గవడితే తప్ప గతిలేదు మాకు
గందుకే మా బూమికి ఏమే నోర్రైతున్నం
కోటొక్క చేతుల కొట్లాట షురూ జేసినం"
(శివకుమార్, వఝల. 2004: 60)

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం రావడానికి దారితీసిన కారణాల్లో వివక్ష ఒకటి. ఇది భాష, యాస, ఉద్యోగాలు, నిధులు ఇలా అన్నింట ఉందని నిరూపించిన నిజం. ఇలాంటి విషయాల్ని తనదైన భాషలో చెప్పి మరింత బలాన్ని తీసుకొచ్చారు కవి. "ఇరవయ్యో శతాబ్దపు పూర్వోత్తర కాలాల్లో వస్తున్న సాహిత్యానికి ఒక ప్రత్యేక లక్షణముంది. జీవితాన్ని ఏ ప్రక్రియ ముఖంగా, ఏ వ్యక్తీకరణ దిశగా నిర్వచించినా, చిత్రించినా వేదన ప్రధాన వాహిక అమవుతుంది. సాహిత్యంలో కనిపించే వేదనలో అంతర్గాంభీర్యత ఎక్కువ" (నారాయణశర్మ, ఎం. 2016: 25). తెలంగాణ ఉద్యమ కవిత్వంలో కనిపించేది కూడా వేదననే. తాము పుట్టిన ప్రాంతాన్ని వదిలి తమ కళ్లముందే తమ వాళ్ళు వలసపోవడాన్ని, వలసవాదులు తమ ఉద్యోగాలను కొల్లగొట్టడాన్ని, భూములు ఆక్రమించడాన్ని చూసిన కవులు, కళాకారులు వేదనతో ఆ బాధల్ని అక్షరరూపం చేసారు.

"సిద్దప్ప శేషప్పల్ని
వేమన్న బద్దెన్నలు ఎన్‌కౌంటర్ చేసినప్పుడు
నీ నన్నయకు నా సోమన్నకు చుట్టీర్కమెక్కడ్డి
పీరీలను బతుకమ్మలను

అట్లతద్దెలు బ్రహ్మోత్సవాలు ఆగంజేశినప్పుడు

నీ ఆడంబరాలకు నా సంబురాలకు సాలెక్కడున్నది"

(వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 35)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావమైనప్పటినుండి తెలంగాణ చరిత్ర, సంస్కృతి వివక్షకు, అవహేళనకు గురవుతూనే ఉంది. ఈ సమాజంలో ఎవరైతే చరిత్రలు(చారిత్రక, సాహిత్య) రాస్తున్నారో వారి ప్రాంతం, జాతిపట్ల అభిమానాన్ని ప్రకటించడం, వాళ్ళ వారికే సముచిత స్థానాన్ని ఇవ్వడం చరిత్ర పుస్తకాలను గమనిస్తే అర్థమవుతుంది. ఇదే క్రమంలో తెలుగు సాహిత్య చరిత్రలు సీమాంధ్రప్రాంతం వారు రాయడం చేత తెలంగాణ కవులకు, కళాకారులకు సాహిత్య చరిత్రలో సరైన స్థానం దక్కలేదన్నది చారిత్రక సత్యం. అలాగే సంస్కృతి విషయానికొస్తే తెలంగాణలో అధికారం(ముఖ్యమైన రాజకీయ పదవులు, అధికార స్థానాలు) ఆంధ్రప్రాంతం వారివి కావడం మరియు మీడియా(వార్త పత్రికలు, టెలివిజన్ ఛానెళ్ళు), సినిమా వారి చేతిలోనే ఉండడం వల్ల ఇక్కడి సంస్కృతి అణిచవేయబడింది. తెలంగాణ సంస్కృతి సినిమాలల్లో(అస్తిత్వ ఉద్యమం రాక ముందు), మీడియాల్లో కనుమరుగైపోయింది. "విభిన్న సంస్కృతులలో ఐక్యజీవనం గడిపి కలువగలిగిన తెలంగాణా సంస్కృతి ఇయ్యాల్ల ఆంధ్ర సంపన్న వర్గాల సంస్కృతి చేతిలో విపరీతమైన ఆత్మన్యూనతకు లోనవుతున్నది. ఆంధ్ర సంస్కృతి అవహేళనలో తెలంగాణ అస్తిత్వాన్ని కోల్పోతున్నది" (సిధారెడ్డి, నందిని. 2007: 10).

"ఇక్కడి భాషపోయింది

ఇక్కడి సంస్కృతి పోతున్నది

అన్ని రంగాల్ల వలసలు అధికమై

రాజకీయ వ్యాపార సినిమా పత్రిక కళా

రంగాల్ల వాళ్ళజోరు ఎక్కువైంది

ఇక్కడి పూల బతుకమ్మల పూజ అటుపోలేదు

అక్కడి పెండ గొబ్బెమ్మల పాటలిటు వచ్చినై

ఇక్కడి స్వచ్ఛమైన తెలుగు అటు వెగటు యాస!

అక్కడి తమిళ ముద్ర ఆంధ్రం ఇటు సగటు బాస?"

(దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 39)

మనుసులోని భావాలను వ్యక్తీకరించేందుకు ఉపయోగపడే సాధనం భాష. అలాంటి భాషలో ఎక్కువ తక్కువలుండవు. కాని సీమాంధ్ర నాయకులు తెలంగాణ భాషని, యాసని నీచమైందిగా, మోటు భాషగా చూసారు. ఇక్కడి భాషను సినిమాలల్లో విలన్‌లకు, పనిమనుషలకు పెట్టి అపహాస్యం చేసారు. అలాగే తెలంగాణ సంస్కృతిని నిర్లక్ష్యానికి గురిచేశారు. ఇక్కడి భాష, సంస్కృతులు మరుగునపడి ఆంధ్ర భాష, సంస్కృతి ఇక్కడ చేరాయి.

"నా భాషలో లేని అనాకారితనాన్ని
వంకరలని జొప్పించి నాతో మాట్లాడిస్తారు
ద్రౌపదిని వివస్త్ర చేస్తున్న కురు సోదరుల్లా సంబరపడతారు
నిజమే!
భార్యనీ వదిననీ అవమానించిన వ్యక్తులు చరిత్రలో వున్నారు
కానీ, తల్లిని మానభంగం చేస్తున్న వ్యక్తులు ఇప్పుడే తయారవుతున్నారు
అందుకే –
నా యాసని పదును పెడుతున్నాను"

(జింబో. 2002: 32)

తెలంగాణ భాషని వలసవాదులు అవమానించిన సందర్భాలు చాలానే ఉన్నాయి. భాషశాస్త్ర దృష్టిలో ఈ ప్రపంచంలో ఉన్న ఏ భాష గొప్పది కాదు, తక్కువది కాదు. అన్ని సమానమైనవే. కాని కొందరు కొన్ని ప్రాంతాలమీద ద్వేషంవల్ల భాషని తక్కువచేసి మాట్లాడుతుంటారు. తెలంగాణ భాషని సినిమాలల్లో కమెడీయన్స్‌కి, విలన్లకి పెట్టడం కనిపిస్తుంది. అనేక రకాలుగా భాషని అవమానించడంవల్ల తెలంగాణ ప్రజల్లో విడిపోయే భావన కలిగింది. అది ఉద్యమానికి దారి తీసింది. "విశాలాంధ్ర ఏర్పడ్డాక ఈ యాభై ఏండ్లలో తెలంగాణకు జరిగిన విస్మరణ, వివక్ష, సహజ వనరుల దోపిడీ, నిధుల నియామకాల్ని కొల్లగొట్టడం, రాజకీయ ఆర్థిక సాంస్కృతిక వాస్తవ పరిస్థితులకు వక్రీకరణలు చెబుతున్న ప్రచార, ప్రసార మాధ్యమాలు తెలంగాణ ప్రజల రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక జీవితం అతి నికృష్టదశకు చేరుకునేలా చేశాయి. తెలంగాణకు తన అస్తిత్వాన్ని వెతుక్కునే దేవులాటలోకి అనివార్యంగా నెట్టాయి. ప్రత్యేక అస్తిత్వం అన్న ఆకాంక్ష కేవలం రాజకీయమైంది మాత్రమే కాదు. బాహాటంగాను, నిగూఢంగాను ఉన్న సామాజిక,

సాంస్కృతిక, సాహిత్య, భాషాత్మకమైంది కూడా. ఈ నేపథ్యంలో రచయితలు వివిధ రూపాలలో అస్తిత్వాన్ని అన్వేషించారు. ప్రత్యేకతను ప్రతిపాదించారు" (మల్లారెడ్డి, తూర్పు(ప్ర.సంపా.). 2007: ix). తెలంగాణ ఉద్యమం కేవలం సీమాంధ్ర రాజకీయ నాయకులపై, అన్యాయంగా ఇక్కడి సంపదను, భూమిని, ఉద్యోగాలను కొల్లగొట్టే వారిపై మాత్రమే కాని సామాన్య ప్రజానీకంపై కాదు అని స్పష్టం చేసింది.

"బూములు జాగలు
నీళ్ళు నిధులు.
ఉద్యోగాలు ఊదప్ప – మొత్తం మాయం
మందిమాటలు పట్టుకొని మార్మానం బోతె
మల్లచ్చె వరకు ఇల్లు గాలినట్టు
పెద్దమనుషుల ఒప్పందాన్ని నమ్మినందుకేనా
మీతోని మా బతుకులిట్ల కాలవడ్డయి?"

(దేవేందర్, అన్నవరం(సంపా). 2010: 41)

చరిత్రను వెలికితీసినకొద్ది కన్నీళ్ళ మూటలు, బాధలు కోటలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తాయి. 60 ఏండ్ల పరాయి పాలనలో తెలంగాణ అనుభవించింది బాధలు, కన్నీళ్ళే. భూములు, నీళ్ళు, నిధులు, ఉద్యోగాలు అన్ని తనవాడికే తప్ప తెలంగాణ వాడికి తక్కువ. జీవోలు, సూత్రాలు, ఒప్పందాలు అన్నింటిని తుంగలో తొక్కి పాచితీగ వలె తెలంగాణ ప్రజల బతుకుల నిండా అల్లుకుపోయిన వాని స్వభావం గురించి, చరిత్ర గురించి తెలుపుతున్నాడు కవి.

### 2.2.1.13.2. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కాంక్ష

"తెలంగాణమిప్పుడు
"తెగిన గాలిపటం గాదు"
తెలంగాణమిప్పుడు
"దారి దరి లేని ప్రయాణంగాదు"
తెలంగాణమంటె ఎత్తిన పిడికిలి
సరిజేసిన వడిసెల

మోగుతున్న డప్పు
దద్దరిల్లుతున్న నగారా
తెలంగాణమంటే
సబ్బండి వర్ణాల శాన్ నిషాన్
గురి చూసి ఇసిరిన బాణం”

(దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 56)

చిన్నాపెద్ద, ముసలిముతక, ఆడమగ అందరూ తెలంగాణకై పిడికిలెత్తిన చారిత్రక సందర్భంలోంచి కవి మాట్లాడుతున్నాడు. వంటావార్పు, ధూంధాంలు, ర్యాలీలు, రాస్తారోకోలు ఒక్కటేంటి అన్ని రకాలగా తన తెలంగాణ వాంఛని, కాంక్షని అభివ్యక్తం చేసారు తెలంగాణ ప్రజలు. సరిజేసిన వడసెలా, మోగతున్న డప్పులా, దద్దరిల్లుతున్న నగారాలా, గురచూసి వేసిన బాణంలా తెలంగాణ కనిపిస్తుందని వివరిస్తున్నాడు పత్తిపాక మోహన్ గారు.

“ఊకుంటే తెల్వదాన్నట్టు నేనుండ
ఏహే! ఒకడిచ్చుడేంది!? నా తెలంగాణ జాగ నాదేనాయే!
నా కట్టమే గెలుస్తంది. నాది నేనే తీసుకుంటా
గోస గోసగుంది బతుకు
నా జోలికొచ్చి సతాయిస్తే ఉప్పుపాతరేసి ఊరబెడ్త
నా యింట్ల నేనే ఇగురం జేసుకుంటా!
ఇంకా ఏరే ముచ్చట్లద్దు
నా తెలంగాణ నాదే!!

(పైదే: 80)

తెలంగాణ ఉద్యమ గొప్పదనం ఏమిటంటే తెలంగాణ ఉద్యమంలో కులమతాలకతీతంగా అందరు ఉద్యమంలో పాల్గొనడం. తెలంగాణ కోసం కలంతో, గళంతో నినదించడం. అదే బాటలో ఇక్కడ ఫాతిమా గారు తెలంగాణ కోసం అక్షరాయుధాలతో జంగ్‌లోకి దిగుతున్నారు. నిశ్శబ్దంగా కూర్చొవడం లేదు, నాకష్టమే గెలుస్తుంది, నా తెలంగాణ నాదే అంటూ ఇక నా జోలకి వస్తే ఉప్ప పాతరేసి ఊరబెడత అని

హెచ్చరిస్తున్నారు. ఇక తెలంగాణ ఎవరి సొత్తు కాదు నా తెలంగాణ నాకే స్వంతమవుతుందని తెలంగాణ సాధనను చెబుతున్నారు.

"ప్రేమలేదు, బాధ్యత లేదు
నాయకత్వానికై నటిస్తున్నావ్...
బట్ట పొట్ట బతుకు తంట
నిరుత్సాహం, నిర్లిప్తత
మాకోసం ఆలోచించలేదు
మీ కోసమే జీవిస్తున్నాం...
ఆవేశం తప్ప అనుమానం లేదు
అణిచివేతల నుండి...
పాట, పల్లవి పుట్టింది
ఉద్యమానికి ఊపిరయింది
ఉద్యమాలు నడుస్తాయ్...!
నాయకత్వాలు పుట్టుకొస్తాయ్...!"
(బాలయ్య, పొన్నాల. 2008: 24)

"1956లో రాష్ట్రం అవతరించిన రోజు నుండి దాదాపు 5 సంవత్సరాల కాలంలో తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్ర ప్రాంతంతో సమానంగా అభివృద్ధి పరుస్తామని వాగ్దానం చేయటం జరిగింది. తెలంగాణ ప్రాంతపు వనరులను ఈ ప్రాంతాభివృద్ధికే వినియోగించి ఇతర ప్రాంతాలకు తరలించి ఉండకుండా ఉంటే ఇరు ప్రాంతాలలో అసమానతలు 5 సంవత్సరాలు కాకపోయిన 10 సంవత్సరాలకైనా తొలగిపోయేవి. కాని రాష్ట్రావతరణ నుండి ఈనాటి వరకు తెలంగాణ ప్రాంతాన్ని అన్ని విధాలా కొల్లగొట్టి ఇతర ప్రాంతాలను అభివృద్ధిపరచుట వలన ఈ ప్రాంతం మరింత వెనుకబడిపోయింది. ప్రాంతీయ అసమానతలు మరింత పెరిగి పోయినవి. ప్రత్యేక రాష్ట్ర నినాదానికి ప్రత్యామ్నాయం లేకుండా పోయింది" (సింహాద్రి, యస్(సంపా). 2001 : 16). ఒకటే భాషని ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్‌లో సీమాంధ్ర నాయకులు తెలంగాణపై ప్రేమ, బాధ్యత చూపించలేదు. వలసలుపోయిన, ఆకలితో అల్లాడిన, నిరుద్యోగం పెరిగినా ఇక్కడి వారి గురించి ఆలోచించలేదు. ఉద్యమాలు చేసిన అణిచివేశారు తప్ప సమస్యల పరిష్కారానికై ప్రయత్నించలేదు. ఓట్లు రావడానికి,

నాయకత్వం సంపాదించడానికి ప్రేమగా ఉన్నట్టు నటించారు. ఇన్నాళ్ళు తమదికాని తమ బతుకు జీవించిన తెలంగాణ ప్రజల్లో నిర్లిప్తత, నిరాశ పెరిగిపోయింది. ఈ బాధల్ని అంతం చేయడానికి తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఈ ఉద్యమాన్ని నలుదిశలా వ్యాపింపజేసింది పాట.

### 2.2.1.13.3. తెలంగాణ భాష

“తంగేడు గోగుపూల
పుట్ట బంగారం
తెలంగాణ యాస
భాష”

(అశోక్, జిందం. 2006: 17)

తెలంగాణ భాష, యాసలపైన అభిమానం, ప్రేమ ఇంతకు ముందు ఉన్నా, తెలంగాణ అస్తిత్వ ఉద్యమంలో తెలంగాణ భాష, యాసలో కవిత్వం, పాటలు రాయడం ఎక్కువగా కనిపిస్తుంది. “తెలంగాణ భాష జిల్లా మాండలికాల మీది అభిమానంతో తమ భాషను రక్షించుకోవాలనే ఆగ్రహంతో నిస్సంకోచంగా తెలంగాణ కవులు, రచయితలు తమ భాషలోనే మాండలికాల్లోనే రచనలు చేస్తున్నారు. ప్రాంతీయమైన జీవన సంస్కృతులను, సమస్యలను చిత్రిస్తున్నారు. తెలంగాణ మీద జరిగే దోపిడి, వివక్ష, ఉపేక్ష, అన్యాయాలను ప్రశ్నించటం వుంది. పట్టణీకరణం వల్ల కలిగిన నైరాశ్యంతో పల్లెలు అక్కడి తమ బాల్యం మీద గాఢమైన అనురాగం వ్యక్తం చేయటం వుంది. ఛిద్రమౌతున్న పల్లె జీవితం, ప్రకృతి వనరుల వినాశం కవులను, రచయితలను బాధిస్తున్నది. ఇటువంటి భావజాలానికి లోబడే సాహిత్య సృష్టి జరుగుతున్నది. కాని దిశాహీనంగా కాదు. అటువంటప్పుడు సాహిత్య చరిత్రకారులు అస్తిత్వవాదాన్ని ఉపేక్షించలేరు” (సుజాతారెడ్డి, ముదిగంటి(సంపా). 2005: 4 – 5).

“నాది గాని యాస
నాది గాని బాస
ఇది మన పట్నమేనా
మస్తు సోచాయిస్తున్న....

నిండింద్రు

కొడుకులు నిండి పోయింద్రు'

(దేవేందర్, అన్నవరం. 2003: 63 )

బతుకు దెరువుకై వచ్చినవాళ్ళే స్థానికుల బతుకు మీదనే అధికారం చేలాయించడం, తన యాసని, భాషని ఎగతాళి చెయ్యడం జీర్ణించుకోని కవి కొడుకులు నిండి పోయింద్రు అంటూ నిక్కచ్చిగానే చెబుతున్నాడు. "రెండున్నర జిల్లాలదే దండి భాష అనడం, తక్కినోళ్ళ నోళ్ల యాస తొక్కి పెట్టడం నిజంగా ఆధిపత్య దురహంకారమే. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర భావన కలగడానికి ప్రాంతీయ అసమానతలతో పాటు భాష పట్ల వ్యావహారిక భాషావాదులు చూపిన వివక్ష, చేసిన అపహాస్యం, అవహేళన కూడా ఒక కారణం" (మల్లారెడ్డి, తూర్పు(ప్రసంపా.). 2007: XI). కవికి ఉండవల్సిన ప్రధాన లక్షణం ఇదే. తను చూసిన సంఘటనను, తను అనుభవించిన దానిని ఉన్నది ఉన్నట్టుగా చెప్పడం. అది దేవేందర్‌కి మస్తుగా ఉంది.

"తెలంగాణా భాష

కల్లా కపటం లేకుంట

ఏ ముసుగులు – నసుగులు లేకుంట

ధీటుగా సూటిగా

మేము ఊరోళ్లమే

మాట్లాడురాదు

ఇన్రోజులు ఓపికపట్టినం

ఇప్పుడు తెలివికచ్చినం"

(శోభారాణి, కొలిపాక. 2004: 87)

ఏ వాదమైన, ఉద్యమమైన అణిచివేత, వివక్షలోంచే పుడుతుంది. తెలంగాణ ఉద్యమం కూడా అంతే. ఆంధ్రప్రాంతం నుంచి వచ్చిన నాయకులు, పెట్టుబడిదారులు తెలంగాణ భాష, సంస్కృతి, కళలపై అణిచివేత, నిధులు, నీళ్లు, ఉద్యోగాలపై వివక్ష చూపడంవల్ల తెలంగాణ ఉద్యమం వచ్చింది. అందుకే ఇక్కడి భాష, సంస్కృతి, కళల గొప్పతనాన్ని తెలియజేస్తూ ఎంతో కవిత్వం వచ్చింది.

### 2.2.1.13.4. సంస్కృతి, సాహిత్య, చరిత్రల గొప్పతనం చెప్పడం

"తవ్వినకొద్దీ ఎల్లుతున్న ఖజానా పాతర
నాణాలు బిల్లలు శిలలు శిల్పాలు
సాంచ నాణాలు రాతనాణాలు బొమ్మ నాణాలు
బిల్ల బిల్లకూ అల్లుకున్న స్మృతి
దొరికిన ఇటుకలన్నీ చరిత్రకు కిటికీలు
గోదావరి పెద్దవాగు తీరం సాంస్కృతిక వాకిలి
కుండ పెంకల కెల్లి కురుస్తున్న మన్నువాసన
కోటిలింగాల నగరం సాతవాహనపురం"

(దేవేందర్, అన్నవరం. 2008: 79)

ఆంధ్రదేశాన్ని పాలించిన శాతవాహనుల తొలి ప్రాంతం కోటిలింగాల. ఈ కోటిలింగాల కరీంనగర్ జిల్లా (ప్రస్తుతం జగిత్యాల జిల్లా) ధర్మపురికి 17 కిలోమీటర్ల దూరంలో ఉంది. గోదావరి నది తీర ప్రాంతం ఈ కోటిలింగాల. ఇక్కడ చారిత్రక పరిశోధకులు జరిపిన తవ్వకాల్లో శాతవాహనులకు సంబంధించిన అనేక నాణాలు బయటపడ్డాయి. "శాతవాహనులకు చెందిన సకల అంశాలూ వివాదస్పదమైనవే. కాని కోటిలింగాల నాణాలవల్ల శతవాహనుల పాలన కోటిలింగాలలో ప్రారంభం అయిందనీ, శాతవానులు స్థానిక పాలకుడైన సమగోపుడి తర్వాత రాజ్యాధికారం చేపట్టారని, వారు సమగోపుడి దగ్గర భృత్యులు లేదా సేవకులు అని రుజువైంది" (ముత్యం, కె.(సంపా.). 2011: 14) అన్న డా. డి. రాజారెడ్డిగారి మాటలవల్ల శాతవాహనుల తొలి ప్రాంతం కోటిలింగాల అని తేలుతుంది.

"తెలంగాణ పోరాటం నిన్నటిదా? మొన్నటిదా?
నలుబదేండ్ల పోరాటంలో
నలిగి పోయేనా తెలంగాణ
తెలంగాణ ఇస్తమని నమ్మిస్తూ
మోసగించే రాజకీయ పార్టీలు
కలిసి ఉంటే నష్టమేంటి అంటరు
మన ఉద్యోగాలు లాకుంటున్నరు

నీళ్లు మల్లించుకుంటున్నరు
జరుగుతున్న నష్టం పిల్లకు కూడ తెలుస్తున్నది"
(దేవేందర్, అన్నవరం(సంపా). 2010: 173)

ఈ కవితలో కవయిత్రి ప్రశ్నవేసుకొని తనకుతానే సమాధానం చెప్పుకోవడం గమనించవచ్చు. నలభై సంవత్సరాల నుండి జరుగుతున్న తెలంగాణ పోరాటంలో ఇప్పుడిస్తం, రేపిస్తం, మాపిస్తం అని నమ్మబలికి మోసగించిన రాజకీయ పార్టీలు కలసుంటేనే కలదు సుఖం అని చెప్తూ ఇక్కడి నీళ్ళని, నిధుల్ని, ఉద్యోగాల్ని లాక్కునారు. ఈ విషయాల్ని గమనించిన తెలంగాణ ప్రజలు మహోత్తర ఉద్యమాన్ని చేపట్టారు. నదులు తలాపునుండి పారుతున్న తడవని బీడు భూములు, నిధులు చాలా ఉన్నా తాళాలతో బంధీ అయిన ఇళ్ళు, ఉద్యోగాలు ఉన్నా పెరుగుతున్న నిరుద్యోగం ఇలా అన్ని విషయాల్లో తెలంగాణ దోపిడికి గురైంది.

### 2.2.1.13.5. అమరవీరుల స్మరణ

తెలంగాణ రాష్ట్రావిర్భావానికై తెలంగాణ ఉద్యమంలో అసువులుబాశారు. అలాంటి వారందని తలుచుకొంటూ, గుండెల నిండా నింపుకొంటు ఎంతో సాహిత్యం వచ్చింది. అలాగే తెలంగాణ కోసం చావొద్దు, ధైర్యంగా బతికి కొట్లాడి సాధించాలని చెబుతూ కూడా కవులు, కళాకారులు రచనలు చేశారు.

"తెలంగాణ బిడ్డ
ఇది వీరులను కన్నగడ్డ
ధీరునిలా పోరాడు
భీరువులా చావద్దు
చచ్చి సాధించలేము
పోరాటం పోరాటం
బ్రతుకన్నది పోరాటం
ఆరాటం ఆరాటం
గెలుపు కొరకు ఆరాటం
(దేవేందర్, అన్నవరం(సంపా). 2010: 13)

తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఎంతో మంది తన ప్రాణాల్ని అర్పించి అమరులయ్యారు, చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. శ్రీకాంతచారి, యాదయ్య మొదలైన ఎంతో మంది తన ఊపిరిని ఉద్యమానికి అంకితం చేశారు. వారందరిని గుండెల్లో నిలుపుకుంటూ, వారిని, వారి త్యాగాన్ని అక్షరాలుగా మలుచుకుంటూ అనేక కవితలు రాశారు. ధీరుడిలా పోరాడాలే కాని భీరువులా చావద్దని ఉపదేశిస్తున్నాడు కవి. కన్నతండ్రిలా హితాన్ని కాంక్షిస్తున్నాడు. జన్మించడం ఒక పోరాటం, నడక నేర్వడం ఒక పోరాటం, చదువు నేర్వడం ఒక పోరాటం ఇలా ప్రతిక్షణం మనతో, సమాజంతో పోరాటం చేస్తేనే బతుకు. అందుకే గెలుపుమీద ఆరాటంతో పోరాటం చెయ్యాలి కాని మరణించొద్దని సూచిస్తున్నాడు కవి.

“బలిదానమెప్పుడూ ఆయుధం కాదు...
ఇంకా ఎగరని పతాకాన్ని అమరుడవై.. అవనతం చేయకు
ఇది పోరుగడ్డ..
తప్పు చేస్తే రామున్ని నిలదీసిన రామదాసు వారసులం
నీ పోరు తెలంగాణా కోసమే అయితే
నువ్వు లేని తెలంగాణ ఎవరి కోసం..?
నువ్వులేని ఉషోదయం కూడా
మాకు నిషిద్ధమే..!!”

(దేవేందర్, అన్నవరం(సంపా). 2010: 111)

యాభై ఏండ్ల నుండి కొట్లాడి ఇక భవిష్యత్తుపై ఆశలు వదులుకొని, అటు ఆంధ్రప్రాంత పాలకులు, ఇటు తెలంగాణ ద్రోహుల కుట్రలకు బలై ఆత్మహత్య చేసుకున్న అమరవీరులు తెలంగాణలో పెక్కుమంది. దాదాపు 1000 మంది తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసారు. తప్పుచేసిన వాణ్ణి ప్రశ్నించాలి తప్ప మన ధైర్యాన్ని కోల్పోకూడదు. పోరాటం, ఉద్యమం తెలంగాణ కోసమే అయితే అదే నువ్వు అనుభవించని తెలంగాణ ఎందుకు అని ప్రశ్నిస్తూ నువ్వు బతికుండి తెలంగాణను సాధించి నీ కల సాకారం చేసుకోవాలన్న ఉపదేశాన్ని కవి అన్యాయంగా ఆత్మహత్య చేసుకుంటున్న వారిని దృష్టిలో పెట్టుకొని మనో ధైర్యాన్ని అందిస్తున్నాడు.

### ౨.౨.౨. రాజకీయాంశాలు

#### ౨.౨.౨.౨. ఎన్నికలు

“ఎన్నికలు వస్తున్నాయి
ఎన్ని “కలలో” తెస్తున్నాయి...
అద్దంలో చంద్రుణ్ణి
మీ ఆరుబయట నిలబెట్టి
అరచేతిలో స్వర్గాన్ని
అదనంగా ఇస్తున్నారు....”

(రవీంద్ర, సంగెవేని. 2005: 58)

ప్రతి కవికి సామాజిక అవగాహనతో పాటు ఎంతోకొంత రాజకీయ జ్ఞానం అవసరమే. వాటివల్ల సమాజం ఏవిధంగా మారుతుందన్న స్పృహకూడా ఉండాలి. అప్పుడే అతడు సామాజిక పరిణామాన్ని, ఈ పరిణామంలో రాజకీయ పాత్రని అర్థం చేసుకోగలుగుతాడు. ఎన్నికల్లో నాయకులు ఎన్నో కలలను పంచుతారు. అద్దంలో చంద్రుణ్ణి చూపెట్టడం, పొలాలాన్ని ఎండిపోతున్న అభివృద్ధంటూ చూపిస్తారు. ధరలు పెరిగిపోతున్న తగ్గిస్తామని మాటలు చెబుతారు. ఇలా రాజకీయ నాయకులు ఎన్నికల ప్రచారం చేసేటప్పుడు చెప్పే మాటలన్నీ, చేసే వాగ్ధానాలన్నీ నీటి మీది రాతలే.

“రాజకీయమంటేనే
కుళ్ళు నీళ్ళ వరద
ఎలెక్షన్‌లో ఒకరికొకరు
చల్లుకోర బురద?!”

(ఎలనాగ. 2009: 43)

ఓట్లు రావడం కోసం ఒక పార్టీవాళ్ళు మరొక పార్టీపై అవాకులు చవాకులు పేలుతూనే ఉంటారు. కేవలం తమ పార్టీ గురించే, వాళ్ళు ఇంతకుముందు చేసిన మంచి పనుల గురించే చెప్పి ప్రజలను ఓట్లు అడుక్కోవడం బహుశా జరగలేదేమో, జరగదేమో. ఇక్కాడ ‘బురద చల్లుకోవడం’ అన్న పదబంధాన్ని ఒకరిమీద మరొకరు అభాండాలు వేసుకుంటారన్న ఉద్దేశ్యంలో వాడారు.

### 2.2.2.3. నాయకుడు

"క్లాస్‌లో ఎప్పుడు
వెనక వరసే
ఇప్పుడాయన
అగ్రనాయకుడు"

(గోపాల్, మాడిశెట్టి. 2007: 8)

చదువుకు పనికిరానివాడు రాజకీయాలకు పనికివస్తాడన్న నమ్మకం ఒకటుంది. చదువుకు రాజకీయం అవసరం లేదు, రాజకీయాల్లో అంతగా చదువు అవసరం లేదన్న విషయం ఇక్కడ తెలుస్తుంది. రాజకీయనాయకుడు చదువుకున్నవాడైతే ప్రజలకు మంచి చేసే అవకాశం, అభివృద్ధిలో కొత్త మార్గాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది.

"చెప్పనలవి గాదు మన అ
మాత్యువరుల శౌర్యం
తప్పక చేస్తారు సుమా
గొప్ప నిధుల చౌర్యం!"

(ఎలనాగ. 2009: 16)

దేశాని నీతిగా నడపాల్సిన నాయకులే అవినీతి చేసి లక్షలు, కోట్లు సంపాదించి పట్టుబడుతున్నారు. ఒకప్పుడు నాయకులు ప్రజలకు ఏం జరుగుతుంది అని ఆలోచిస్తే ఇప్పుడు మనకు ఏం మిగులుతుందని ఆలోచిస్తున్నారు. అందరూ అవినీతి నాయకులే కాకున్నా ఎక్కువ మంది అవినీతికి పాల్పడుతున్నారు. అవినీతి నిరోధక శాఖ(అనిశా)కు ఆ ఆఫీసరు చిక్కాడు, ఈ నాయకుడు పట్టుబడ్డాడని పేపర్లో చదువుతూనే ఉన్నాం.

"నాయకుడు గొప్ప
మాటకారి
ఓటరు కాటగలిసే
బాటసారి"

(గోపాల్, మాడిశెట్టి. 2007: 14)

రాజకీయ నాయకులకు అవసమైంది మాట్లాడే చాతుర్యం. ఒకతను బాగా మాట్లాడుతున్నాడంటే నువ్వు నాయకుడివవుతావు అని అంటారు అతని చుట్టున్న సమాజం.

మాటలతో మాయ చేసే గుణం రాజకీయనాయకుడికి ఉండాలి. ఇలా అందరూ ఓటర్లను మాయ చేయకున్న మంచిచేసేవాళ్ళున్న ఎక్కువమంది మాయచేసేవాళ్ళని ఒక అభిప్రాయం ప్రజల్లో ఉంది. అది చేస్తా, ఇది చేస్తానని ఎలక్షన్స్‌లో చెప్పడం తీర గెలిచాక ముఖం చాటేయడం ప్రస్తుత సమాజాల్లో ఎంతో కొంత జరుగుతన్నదే.

"ఎంతపనయింది ఎల్లన్నా!
మనగతేంది మల్లన్నా!
గిట్లయితదనుకోలేదు
గింతగనం కొంపలు ముంచుతడనుకోలేదు
గిట్ల జేత్తడనుకుంటే
గింతగూడ గెలువనియ్యకపోదుం"
(లక్ష్మణరావు, జి. 2003: 24)

మంచి నాయకుడు అని నమ్మి ఓటిసేన ప్రజలకు తర్వాత అతడు మంచివాడుకాదని తెలిసినప్పుడు ఓటరుగా కవి పడే ఆవేదన ఇది. ఈ కవిత ఎదుటివారికి చెబుతున్నట్టుగా సంభాషణాత్మకంగా సాగింది. కవితా నిర్వహణలోని ఆఖ్యానానికి చెందింది ఈ కవిత. తన బాధను సాటివాళ్లతో పంచుకోవడం కనిపిస్తుంది. మామూలుగా ఊర్లలో మాట్లాడుకునే మాండలిక భాషలో రాయడం వల్ల ఈ కవితకి భాష మరింత అందాన్ని, సహజత్వాన్ని తీసుకొచ్చింది.

"ఇప్పుడైతే వంగి వంగి దండాలు
అటెనుక దండం అన్నా దొరకరు
అయిదొద్దులు సుట్టు తిరుగుతరు
అయిదేండ్ల దాక సుట్టూ తింపుతరు
శక్కరి శిల్కల ముచ్చట్లు
రామ చిలుక పలుకులు
లేని లేని వరుసలు
అరచేతిలో వైకుంఠం
కండ్ల ముందే సూపిస్తరు"
(దేవేందర్, అన్నవరం. 2005: 23)

ఒక విషయంలో జ్ఞానాన్ని కలిగించి ప్రజల్లో మార్పుని, కదలికని తీసుకురావడం చైతన్యం. ఆ చైతన్యం సామాజిక విషయానికి సబంధించింది అయినప్పుడు అది సామాజిక చైతన్యం అంటారు. ఇక్కడ కవిది ఆ దృష్టే. ఐదేండ్లకు ఒకసారి జరిగే ఎన్నికల్లో నాయకుల చెప్పేవి అసంబద్ధ, అసత్య మాటలని తెలిపి ఓటర్లను చైతన్యం చేస్తున్నారు. పల్లెల్లో ప్రజలు ఎందుకు చస్తున్నారు, యువకులంతా గ్రామాల్ని వదిలి వలస ఎందుకు పోతున్నారు? అంటూ ఈ నాయకుల్ని ప్రశ్నిస్తున్నారు కవి.

"అవసరమున్నంత వరకూ
వాడికి తమ్ముడినవుతా
నక్కలా ఉంటూనే నన్ను పులిని చేస్తాడు
నా వీపూ నిమురుతాడు
మందు వాసన చూపించి
బొక్కలేని ఓటరు మాంసాన్ని తినిపిస్తాడు"
(లక్ష్మణ్, ఆడెపు. 2007: 21)

అవసరాన్ని బట్టి రంగులుమార్చే ఊసరవెల్లిల సమయం, సందర్భాన్నిబట్టి పైన చెప్పిన విధంగా మాటలు మార్చుతుంటారు, నటిస్తుంటారు రాజకీయ నాయకులు. అవసరమున్నంత వరకు అన్న, లేకపోతే జనాల్ని సున్నల అనుకుంటారు.

### 2.2.2.4. ఓటర్లు

"తన శక్తినీ విలువనూ
తన సర్వాధికారాన్నీ ముద్రవేసి
దానం చేశాక
అతను మళ్ళీ సామాన్యుడు
అతని తలరాత నలిపారేసిన చిత్తు కాగితం
అందరికీ తానే తలవంచే సాధుజంతువు
తన బతుక్కు తానే
కొత్త శక్తిని కూడగట్టుకునే నిత్య శ్రామికుడు
అతి తేలికగా వంచింపబడ్డ అమాయకుడు"
(లక్ష్మణరావు, జి. 2003: 28)

భారతీయ ఓటర్ల పరిస్థితిని చెప్పే కవిత ఇది. 'ఏక్ దిన్‌కా సుల్తాన్' అని శీర్షిక పెట్టడంలోనే ఎంతో ఔచిత్యముంది. ఓటరు ఎప్పుడైనా ఒక్కరోజు రాజు మాత్రమే అది ఓటువేసేరోజు. ఆ తర్వాత కథ మామూలే.

"అయిదేండ్ల కొక్కసారి వాడు
అదుక్కునే బిచ్చగాడు–
అయిదేండ్ల కొక్కసారి నీవు
మొలకెత్తే విత్తనానివి——
ఖర్మ అనుకోకు
కలవర పడిపోకు
హాలాహలం తాగబోకు——
ఈ దేశ భవిష్యత్తుకు
శక్తి దాతవు నీవు!!!"

(రవీంద్ర, సంగెవేని. 2005: 60)

ఎలాంటి నాయకుడు కావాలో నిర్ధారించే శక్తి ప్రజాస్వామ్య దేశంగా ఓటర్లకు ఉంది. కనుకనే కలవరపడకుండా, ఖర్మ అనుకోకుండా ఈ దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఓటు వెయ్యి అనే మేలుకొలుపుల ఉంది ఈ కవిత. ఒక నోటుకు, ఒక కోటరుకు లొంగిపోతే ఐదేళ్ళు నిన్ను దోచుకుంటాడు. అందుకే ఈ సమాజాన్ని సరైన మార్గంలో నడిపే బాధ్యత, ఆ బాధ్యతను నెరవేర్చేందుకు సరైన నాయకుణ్ణి ఓటర్లే ఎన్నుకోవాలి.

"ఎన్నికల బరిలో నాయకులు
ఎత్తుకు పై ఎత్తులు వేస్తూంటే
జనం పావులై కదులుతుంటారు
ఉచ్చులో కూరుకుపోతారు
కుట్రపూరిత విషపు నవ్వులు రువ్వుతూ
జనాన్ని మోసగించడం నాయకులకు తెలిసిందే"

(లక్ష్మణ్, ఆడెపు. 2007: 37)

ఎన్నికల సమయంలో ఎవరు ఎలా మారుతారో చెప్పడం కష్టం. అప్పటిదాకా మిత్రులుగా ఉన్నవాళ్ళంత శత్రువులవుతారు. అది రాజకీయమంటే. ఎన్నికలు వచ్చినా

ప్రతిసారి రాజకీయ నాయకులు కొత్త పద్ధతి, ఉపాయాలు ఆలోచించి ఓటర్లను మాయచేస్తుంటారు. ఆ తీయని మాటలకు ఓటర్లంత ఉచ్చులో చిక్కుకుంటారు. అందుకే అలిశెట్టి ప్రభాకర్ "ఒక నక్క / ప్రమాణస్వీకారం చేసిందట / ఇంకెవర్నీ మోసగించనని / ఒక పులి / పశ్చాత్తాపం ప్రకటించిందంట / తోటి జంతువుల్ని సంహరించినందుకు / ఈ కట్టుకథ విని / గొర్రెలింకా / పుర్రెలూపుతూనే ఉన్నాయ్" (తిరుమలరావు, జయధీర్ (సంపా.). 2013: 38) అని రాజకీయంలో నాయకుల విధానాన్ని, వారి ప్రవర్తనను, ఓటర్లు మోసపోయే విధానాన్ని చక్కగా వివరించారు.

## 2.2.3. సాంస్కృతికం

"సంస్కృతి (*Culture*) అనేది మానవ సమాజం జీవన విధానంలో ప్రముఖమైన విషయాలను – అనగా జీవనం, ఆచారాలు, వ్యవహారాలు, ప్రమాణాలు, మతం, సంబంధాలు, పాలన – వంటివాటిని సూచించే పదం" (తెలుగు వికిపీడియా). మానవ జీవన విధానానికి సంబంధించింది సంస్కృతి. "జాతి ప్రత్యేక అస్తిత్వాన్ని నిలబెట్టేది సంస్కృతి. జాతి జీవన విధానాన్నే సంస్కృతిగా వ్యవహరిస్తాం. జర్మన్ భాషలో 'కల్చర్' (Culture) కు సమానార్థకంగా 'సంస్కృతి'ని వ్యవరిస్తున్నాం. సమాజం యొక్క భౌతిక వికాసం 'నాగరికత' అనీ, బౌద్ధిక వికాసం 'సంస్కృతి' అనీ కొందరి అభిప్రాయం.

నాగరికత, సంస్కృతి రెండు సమానార్థకాలు కాకపోయినప్పటికీ నాగరికత సంస్కృతిలో భాగమే. మానవుడు ఉన్నత జీవితం గడపటానికి భౌతికంగా, మానసికంగా చేసే నిరంతర ప్రయత్నమే సంస్కృతి. వ్యవస్థ, రాజ్యం, మతం, జ్ఞానం, కళలు, వస్తుజాలం, వేషభాషలు, ఆచార వ్యవహారాలు, అనుబంధాలు, ఆహార విహారాలు, పండుగలు, జాతరలు, కట్టుబాట్లు, కష్టసుఖాలు, పెనుగులాటలు, పోరాటాలు అన్నీ సంస్కృతి వ్యక్తీకరణలే. సంస్కృతి స్వరూప స్వభావాలు, వికాసాలు ఆర్థిక రాజకీయ సామాజిక పరిస్థితులపై, పరిణామాలపై ఆధారపడి ఉంటాయి" (మల్లారెడ్డి, తూర్పు(సంపా). 2207: 17). తెలంగాణకి ఒక ప్రత్యేకమైన సంస్కృతి ఉంది. ఇక్కడ తీరొక్క పూలతో ఒక రూపం చేసి బతుకు ఇవ్వమ్మా అని మొక్కే బతుకమ్మ, జమ్మి ఆకు చేతిలో పెట్టి అలయ్ బలయ్ తీసుకునే దసరా, ఉపవాసంతో నైవేద్యమండి బోనం సమర్పించుకునే బోనాల పండుగలను గొప్పగా జరుపుకుంటారు.

హిందూ – ముస్లింలు కలిసి పీరీల పండుగ(మొహర్రం) చేస్తారు. మక్కగట్క, జొన్న అంబలి, పచ్చిపులుసు, గారెలు, సకినాలు, పోలెలు ఇక్కడి ఆహార ప్రత్యేకతను తెలియజేస్తాయి.

### 2.2.3.2. పండుగలు

#### 2.2.3.2.1. బతుకమ్మ

తెలంగాణ ప్రాంతంలో అత్యంత విశిష్టమైన పండుగ బతుకమ్మ. బతుకు ఇవ్వమ్మా అని ప్రకృతిని ఆరాధించే పండుగే బతుకమ్మ. చాలా ప్రాచీనమైన పండుగ ఇది. భాద్రపద పంచమి రోజు మొదలయ్యే ఈ పండుగ తొమ్మిదవరోజు బతుకమ్మతో ముగుస్తుంది. ఈ తొమ్మిదిరోజుల బతుకమ్మను ఒక్కోరోజు ఒక్కో పేరుతో పిలుస్తారు. ముఖ్యంగా ఇది కింది కులాలకు చెందిన పండుగ. "తెలంగాణలో 'బతుకమ్మ' గొప్పవేడుక. అచ్చంగా జానపదుల పండుగ. ప్రాచీనమైన పండుగ. ఇటీవల కొన్ని సంవత్సరాలుగా శతాబ్ది కాలంగా నాగరికుల దృష్టిని ఆకర్షించి ఆదరణ పొందుతున్నది. పరిశోధనల్లో కెక్కుతున్నది. కావ్యాల్లోనో చరిత్ర పుస్తకాల్లోనో పేర్కొనక పోయినంత మాత్రాన ఇటీవలి పండుగగా నిర్ధారించటం సహేతుకం కాదు. అనేక అంశాలు చరిత్రలో స్థానం పొందకపోవటానికి రకరకాల కారణాలుంటాయి. జానపదులకెంతో ఆరాధనీయమైన 'తంగెడు పూల'ను కవులు, నాగరికులు పట్టించుకోలేదు. కింది కులాల స్త్రీలు మాత్రమే తలలో పెట్టుకోవడం ఇప్పటికీ గమనించవచ్చు. కింది కులాల వాళ్లు తంగెడు చెక్కను వృత్తిపనుల్లో ఎక్కువగా వాడుతారు" (సిధారెడ్డి, నందిని. 2007: 73). ప్రాచీనకాలం నుంచి బతుకమ్మ తెలంగాణంతట ఉన్నప్పటికీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్రను పోషించడం వల్ల ప్రపంచానికి తెలిసివచ్చింది.

> "బతుకమ్మంటే
> రకరకాల పూలతో పేర్చిన నిలువెత్తు గౌరమ్మ మాత్రమే కాదు
> తెలంగాణ సంస్కృతికి నిలువెత్తు దర్పణం
> తెలంగాణకే పరిమితమైన ప్రత్యేక పండుగ"
>
> (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 71)

ఎలాంటి పోలికలు, కవితాత్మక వాక్యాలు లేకుండా సాధారణంగా రాసే కవితల్ని 'సరళ కవితలు' అంటారు. ఈ కవిత ఇలాంటిదే. కవిత్వంలో కవిత్వానికి నిర్వచనం చెప్పిన కవులున్నారు, కవితలున్నాయి. ఈ కవిత బతుకమ్మ అంటే ఏమిటో చెప్పే కవిత.

"చెరువు
పసుపు కుంకుమల్తో
పూదిచ్చిన కూరాడు
బతుకమ్మ పండుగ"

(అశోక్, జిందం. 2006: 54)

తెలంగాణలో గొప్పగా జరిగే పండుగ బతుకమ్మ పండుగ. ఎక్కడికెక్కడికో వలసవెళ్ళిన వాళ్ళంతా ఊరికి చేరుకొని తొమ్మిది రోజులు ఘనంగా జరుపుకునే పండుగ. 'ఎంగిలిపూల బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానేబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, చద్దుల బతుకమ్మ' అని తొమ్మిది రోజులకు తొమ్మిది పేర్లున్నాయి. 'బతుకు ఇవ్వమ్మ' అని ప్రకృతిని ఆరాధించే పండుగే బతుకమ్మ. ప్రకృతిని, ప్రకృతిలోని పూలను పూజించే సంస్కృతి విశిష్టమైంది. బతుకమ్మనుండి దసరా దాకా ఊరినిండా జనంతో పల్లె కొత్తనీరు చేరిన చెరువుల నిండుగా ఉంటుంది.

"సద్దుల పండక్కు తంగెడుపూలకు పోయి
కాపోని కంచెలో దెబ్బలు తిన్న జ్ఞాపకం
గునుగుపూలకు రంగులద్ది,
గోరంట, బంతిపూలతో పేర్చుకున్న
పెద్ద బతుకమ్మ..ఆ..!.. ఎంత పెద్దది?
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో!
బంగారి బతుకమ్మ ఉయ్యాలో!...
ఇద్దరక్క చెల్లెండ్లను ఉయ్యాలో..
ఒక్కోరికిచ్చిరి ఉయ్యాలో.."

(దేవేందర్, అన్నవరం. 2001: 4)

బతుకమ్మకు రెండురోజుల ముందే తంగేడుపువ్వు తెంపుకొచ్చి ఇంట్లో దాచిపెడతారు. ఎందుకంటే ఆనాడే వెళితే ఉండదు కనుక. ఇలా తంగేడు పువ్వుకు పోయినప్పుడు వేరేవాళ్ళ పెరట్లో తెంపినప్పుడు వాళ్ళు గొడవ చెయ్యడం, దెబ్బలు కొట్టడం జరిగేదే. ఇక్కడ అదొక జ్ఞాపకమైంది కవికి. తంగేడుపువ్వుతోపాటే గునుగుపూలు, కట్లపూలు, బంతిపూలు మొదలైన పూలతో పేర్చి పైన గుమ్మడి పువ్వును లేదా పసుపు ముద్దతో చేసిన గౌరమ్మని పెట్టి ఇంటి ఆడపిల్లలు అందంగా బతుకమ్మను తయారు చేస్తారు. ఇలాంటి బతుకమ్మ ప్రత్యేక తెలంగాణోద్యమంలో గొప్ప పాత్రను పోషించింది.

"బతుకమ్మ బతుకమ్మ
ఉయ్యాలో
ఊరును కలిపినడిపే
వెలుగుపాట"

(మోహన్, పత్తిపాక. 2004: 11)

బతుకమ్మ వచ్చిందంటే ఊరుఊరంత ఆనందంతో గంతులేస్తుంది. వాడలన్ని రంగులతో సింగారించుకుంటాయి. వాళ్ళవాళ్ళ వాడల్లో బతుకమ్మ ఆడిన తర్వాత ఊరుప్రజలంతా ఒకచోట కలుసుకొని బతుకమ్మ ఆడి ఆ అ తర్వాత అందరు కలిసి బతుకమ్మను సాగనంపడానికి చెరువు దగ్గరకు వెళ్తారు. అందుకే బతుకమ్మ పాట ఊరును కలిపి నడిపించేది.

### 2.2.3.2.2. ఇతర పండుగలు

"పల్లె ముంగిట్లో
పరిచిన పచ్చీస్
బోనాల పండుగ
ఎల్లమ్మ సిద్దోగం

(అశోక్, జిందం. 2006: 40)

తెలంగాణని ప్రపంచంనుంచి, సీమాంధ్ర ప్రాంతంనుంచి వేరుచేసి ప్రత్యేకంగా నిలిపే అంశాల్లో పండుగలు ఒకటి. తెలంగాణకే ప్రత్యేకమైన పండుగల్లో బోనాలు ఒక్కటి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అంతగా ఆదరణపొందని తెలంగాణ పండుగలు ఇప్పుడు దేదీప్యమానంగా

వెలుగొందుతున్నాయి. బోనాల పండుగ తెలంగాణ ప్రతి పల్లెలో కనిపించినా హైదరాబాద్ బోనాలకు ఒక విశిష్ట స్థానముంది. అసలు బోనాలంటే హైదరాబాదే అన్నంతగా ఉంటాయి.

"అన్నయ్య నిరాశకు
బలికాకుండా ఎగిరే గాలిపటానికి
గౌరవాభిమానాలకు ఆధారంగా
ఓ చెల్లెలు కట్టిన దారం రాఖీ!"

(సూర్య, వొడ్నాల. 2003: 72)

'నేను నీకు రక్ష, నువ్వు నాకు రక్ష, మనమిద్దరం దేశానికి రక్ష' అంటూ అన్నా – చెల్లెలు, అక్కా – తమ్ముళ్ళు ప్రేమగా కట్టుకునేదే రాఖీ. శ్రావణ పౌర్ణమినాడూ జరుపుకునే పండుగ. ముఖ్యంగా ఇది ఉత్తర, పశ్చిమ భారతదేశ పండుగైనా ఇప్పుడు భారతదేశమంతటా జరుపుకుంటున్నారు.

"లింగ రూప దర్శనం వల్ల
అజ్ఞాన తమస్సు అంతమై, విజ్ఞానం కలిగి
మోక్ష ధామానికి మార్గం సుళువవుతుంది
ఆత్మ స్వరూపుడైన ఆది దేవుని లింగ రూపం,
అర్ధ నారీశ్వర మహా దేవుని స్వరూపం
శ్రీ రాజరాజేశ్వర విశ్వరూపం
సర్వ జనులకు మంగళ కరం..."

(నారాయణ, ఆడెపు. 2004: 55)

మాఘమాస కృష్ణపక్ష చతుర్థి రోజున వచ్చే శివరాత్రి నాడు త్రిమూర్తుల్లో ఒక్కడైన శివున్ని పరమ పవిత్రంగా ఆరాధిస్తారు. ఆరోజు శివాలయాలు భక్తులతో నిండిపోతాయి. ఉపవాసాలు, జాగారాలు ఉండి ఆ మహాశివుణ్ణి భక్తితో కొలుస్తారు. శివపురాణం ప్రకారం ఈరోజే శివుడు లింగాకారం పొందుతాడు. ఆ లింగరూప దర్శనం వల్ల అజ్ఞానం అంతమై జ్ఞానం వస్తుంది.

"సమాజ రక్తాన్ని చిందించే శకటాసురులు
శ్రమక్తిని దోచేసే దమననీతి దగాకోరులు
నరభోక్తులు నశియించిననాడే

ఆకలి కేకలు, అప్పుల చావులు, ఆత్మహత్యలు
అలుముకొన్న ఆకలి కార్చిచ్చు ఆరిననాడే
వరకట్నాల మంటల్లో ఆహుతైన అబలల ఆర్తనాదం ఆగిననాడే
తరతరాల పురుష అహంకారానికి చరమగీతం పాడిననాడే
పట్టపగలే నరకాసురుల నరయాగాలు
రాజకీయ మదగజాల రంగులు బొంకులు అణిగి
వాళ్ల ముక్కుకు ముకుతాడు పడిననాడే
అసలు సిసలైన సంక్రాంతి
స్వర్ణోత్సవాల సంక్రాంతి"

(నారాయణ, ఆడెపు. 2004: 37)

వాకిళ్ళల్లో అలుకుచల్లి ముగ్గులేసి, గొబ్బెమ్మలు పెట్టి, కొత్తబట్టలు తొడుక్కోవడమే సంక్రాంతి కాదు. దోపిడిదారులు, దగాకోరులు, నరభోక్తలు నశించిననాడు, ఆకలి చావులు ఆగిననాడు, రైతుల ఆత్మహత్యలు ఆగిననాడు, వరకట్న చావులు లేనినాడు, పురుషాధిపత్యం తగ్గిననాడు, పట్టపగలే హత్యలు జరగనినాడు, రాజకీయ నాయకులు అసత్యపు మాటలు మాట్లాడనినాడు, వాళ్ళు మారిననాడు నిజమైన సంక్రాంతి అని సంక్రాంతిని సమాజ కోణంలో చెప్పారు కవి.

"అయితే మరి ఉగాది లేదా? రాదా?
వస్తుంది తప్పకుండా వస్తుంది
ఎలాగంటే, ఎప్పుడంటే
కార్మికుల స్వేదంలో
కర్షకుల హర్షంలో
తొలిజల్లు వర్షంలో
సెలయేటి పరవళ్ళలో....
పాపాయి నవ్వుల్లో, పాల బుగ్గల్లో
రమణీయ దృశ్యంలో, / రసగంగ కావ్యంలో,
కలిసి ఉన్నాను నేను, / కదలి వస్తాను నీకై...."

(రవీంద్ర, సంగెవేని. 2005: 53)

ఉగాది వస్తుంది ఎప్పుడంటే అని కార్మికుల స్వేదంలో, కర్షకుల హర్షంలో, తొలిజల్లు వర్షంలో అంటూ శ్రామిక జన ప్రాధాన్యతని, స్వచ్ఛమైన మనుషుల నవ్వుల్లో, చిన్నారుల పాల బుగ్గల్లో అంటూ మానవీయ కోణాన్ని, రమణీయ దృశ్యంలో, రసగంగ కావ్యంలో అంటూ ప్రకృతి, సాహిత్య ప్రాధాన్యతని వివరిస్తున్నారు.

### 2.2.4. ఆర్థికాంశాలు

#### 2.2.4.2. డబ్బు

"పొద్దుగాల లేచింది మొదలు
మనిషికి వేస్తుంది రూపాయి వాసన
ఎక్కడోవున్న మనిషి వాసన పసిగట్టే
రాక్షసునిలా భ్రమణం
దానికోసం సం'కుల' సమరం
(శివప్రసాద్, సంకేపల్లి. 2002: 76)

ఆర్థిక అవసరాల్ని తీర్చుకోవడానికి మనిషి సృష్టించిన రూపాయి ఇప్పుడు మనషులనే ఏలుతుంది. ప్రస్తుత సమాజంలో ఏ చిన్న పనైనా డబ్బుతో కూడుకొన్నదే. ఆర్థికతలేనిదే హార్థికతలేని నేటి సమాజం విచ్ఛిన్నమైపోతుంది. నిరంతరం సంఘర్షణలతో, గొడవలతో కుల సమరం సాగిస్తుంది. ఇలాంటి డబ్బు పోయి మనిషితనం, మంచితనం రావాలనే ఆశ కవిలో ఉంది.

"అయినా?
రూపాయి నీకంటే ముందు
జారిపోయే పాదరసం
మనిషి బతకడానికి రూపాయి కావాలి
చావడానికి రూపాయి కావాలి
కానీ, బతుకే రూపాయైనప్పుడు
ఆ రూపాయిని, ఆ రూపాల్ని ద్వేషిద్దాం
ఆ రూపాయి మత్తులోంచి కాలాన్ని

నిద్రలేపుదాం
మనిషంత ప్రేమతో రూపాయి
రూపాన్ని మారుద్దాం!”

(శివప్రసాద్, సంకేపల్లి. 2002: 77)

చావడానికి, బతకడానికి రూపాయి కావాలి గాని బతుకే రూపాయిగా మారడం అత్యంత దురదృష్టకరం. ‘లోకంలో మనిషి వస్తువుల్ని వాడుకోడానికి మనషుల్ని ప్రేమించడానికి సృష్టించాడు. కాని వస్తువుల్ని ప్రేమిస్తున్నారు మనషుల్ని వాడుకొంటున్నారు’ అన్న తీరు మనిషిప్పుడు వస్తువులా మారిపోయాడు. అలాంటి స్థితిని జయించాలంటే రూపాయి మత్తు వదలిపోవాలి, ప్రేమ మనలో నిద్ర లేవాలి.

### ౨.౨.౪.౩. ప్రపంచీకరణ

‘గ్లోబలైజేషన్’ అన్న ఆంగ్ల పదానికి సమానార్థకంగా ‘ప్రపంచీకరణ’ అని తెలుగులో వాడుకుంటున్నాం. ఈ పదం 1990 కన్న ముందు మన సమాజాల్లో లేనిది. పాశ్చాత్య దేశాల ప్రభావంగా 1991లో మొదటిసారిగా మనదేశంలోకి అడుగుపెట్టింది. 1990లో భారదేశ ఆర్థిక పరిస్థితుల్లో మాంద్యం వల్ల విదేశీయులకు బకాయిలు చెల్లించలేని స్థితిలో మనదేశంలో కూడా ప్రపంచీకరణ ప్రవేశించింది. “మనదేశం మూడు వారాలపాటు మాత్రమే విదేశాలకు చెల్లించవలసిన బకాయి బిల్లులు చెల్లింపగల స్థితిలో ఉంది. ఆపైన చేతులెత్తవలసిందే. 1990నాటి ఆర్థిక మాంద్యం నుండి తెప్పరిల్లుకోవడానికి మన దేశం కూడా గ్లోబలైజేషన్‌ను ఆదరించినది. పై రెండు కారణాల వలన మన దేశం ప్రపంచ బ్యాంక్ వద్ద చేయి చాప వలసిన పరిస్థితి ఏర్పడి గ్లోబలైజేషన్ అమలు చేసింది” (రాజీవ్ దీక్షిత్. 2003: 9). ప్రపంచీకరణ అంటే దేశాల మధ్య స్వేచ్ఛా వ్యాపారం, పెట్టుబడి, సేవలు, ఎంటువంటి ఆంక్షలు, ఆటంకాలు లేకుండా దేశ సరిహద్దులు దాటి స్వేచ్ఛగా ఎలాంటి ఆంక్షలు లేకుండా, నిబంధనలు లేకుండా సాగే వ్యాపారమే ప్రపంచీకరణ.

తమ ప్రయోజనాలకై ఇతర దేశాలపై అభివృద్ధిచెందిన దేశాలు అనుసరిస్తున్న ఒక వ్యూహంగా దీన్ని మనం అర్థం చేసుకోవచ్చు. “తమ ప్రయోజనాలకు అనుగుణంగా వర్ధమానదేశాల ఆర్థిక, రాజకీయ విధానాన్ని రూపొందించడానికి సంపన్నదేశాలు అనుసరిస్తున్న వ్యూహమే గ్లోబలైజేషన్” (గుడిపాటి. 2002: 13). తమ వస్తువుల్ని బయటి

దేశాల్లో అమ్మడానికి ఆరంభమైన ఈ ప్రంపంచీకరణ ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలపైన ప్రగాఢమైన ప్రభావాన్ని చూపించింది.

ఈ ప్రపంచీకరణ వల్ల జరిగిన విధ్వాంసాల్ని కవులు, రచయితలు సాహిత్యంలోకి తీసుకువచ్చారు. ప్రపంచీకరణ వల్ల జరిగిన మంచికంటే చెడే అధికంగా ఉండడం వల్ల కవులు, రచయితలు దీన్ని తీవ్రంగా నిరసించారు. ఈ ప్రపంచీకరణలో కొన్ని ముఖ్యమైన అంశాలు తెలుగు కవిత్వ ఆధారంగా అర్థం చేసుకోవచ్చు. పల్లెల, కులవృత్తుల, సంస్కృతి విధ్వంసం జరగడం, మానవీయ సంబంధాలు దెబ్బతినడం, ప్రపంచమంతా ఒక నీడ కిందకి చేరడం మొదలైనవి.

### 2.2.4.3.1. వృత్తుల విధ్వంసం

ప్రపంచీకరణ వల్ల ఎక్కువగా ప్రభావానికి గురైనవి వృత్తులు. వాటిని నమ్మకున్న కుంటుంబాలు. ఒకప్పుడు ఒక వ్యవసాయం నడిచేందుకు కమ్మరి, వడ్రంగి, ఎరుకల ఇలా దాదాపు అన్ని వృత్తులు ఆధారమయ్యేవి, వ్యవసాయ ఆధారంగా జీవించేవి. కాని ఎప్పుడైతే యంత్రమొచ్చిందో ఆ వృత్తులకు పనిలేకుంట అయ్యింది. మనిషి శ్రమపోయి యంత్ర శ్రమ అధికమవ్వడం వల్ల పల్లెటూర్లన్నీ వృత్తలను విడిచి ఉపాధికొసం పట్టణాలకి చేరాయి.

తమ తమ వృత్తులు పోయి అనాథలైన వాళ్లు, వాటిని చూసిన వాళ్ళు సాహిత్య సృజనను ఆయుధంగా వాడుకున్నారు.

“ఈ ఇన్‌స్టాంట్ కన్నీళ్ళూ కంటితుడుపుల తర్వాత
ఎక్స్‌గ్రేషియా ప్రహసనాల తర్వాత
మళ్ళీ దృశ్యం ఎదురుపడి
ఆధార దృశ్యం దిశమొల దరిద్రం
అభివృద్ధిని వెక్కిరిస్తుంది....
నిలదీస్తుంది....
వాళ్ళకిప్పుడు ఉనికి కావాలి
ఉనికి నీడపట్టే వృత్తి
వృత్తి నిలదొక్కుకునే నేల కావాలి

వాళ్ళ వృత్తి నైపుణ్యాన్ని ఆదరించి
గౌరవించే ప్రవృత్తి మనలో రావాలి"

(శివకుమార్, వఝుల. 2004: 98)

ఈ ప్రపంచంలో ఏ జీవైనా యుద్ధం చేసేది తన ఉనికికోసమే. ఆ ఉనికి మానవులకి తను చేసే పని ద్వారా వస్తుంది. అదే వృత్తి. అలాంటి వృత్తి ప్రపంచీకరణ వల్ల నాశనం అయ్యిందనేది అందరూ ఒప్పుకునే సత్యం.

"సిరిసిల్ల ఒకనాడు
సిరి శాలే
నేడది నేతన్నల
ఉరి శాల"

(గోపాల్, మాడిశెట్టి. 2007: 31)

ఒక క్రమం నుంచి మరో క్రమంలోకి దిగజారిపోవడం వెనక రాజకీయ, సామాజిక పరిస్థితులను జాగ్రత్తగా పరిశీలించవల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు సిరిసంపదలతో బతికిన నేత కుటుంబాలు మరణించే స్థాయికి రావడం వెనక ప్రపంచీకరణ నేపథ్యం ఒకటుంది. ఎప్పుడైతే రాజకీయ అవసరాలకోసం నాయకులు ఫ్యాక్టరీలకు అనుమతులు ఇచ్చారో అప్పటినుండి చిన్నచిన్న కుటీర పరిశ్రమలు, చేతి వృత్తుల జీవనం విధ్వంసమైంది. ఫ్యాక్టరీలకు అనుమతులివ్వడం తప్పుకాకున్నా వాటివల్ల జరిగే నష్టాన్ని అంచనావేసి వాటివల్ల నష్టపోతున్న వారికి మరో మార్గం చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉంది. కాని ఆ పనిని ప్రభుత్వాలు చేయలేకపోవడంవల్ల ఇలాంటి చేనేత కుటుంబాలతో పాటు అనేక వృత్తి కుటుంబాలు నష్టపోవల్సి వచ్చింది.

"అవుసులాయన హోటల్ వెట్టిండు
మేరాయన చికెన్ సెంటర్ వెట్టిండు
శాలాయన కట్టెల దుకాణం బెట్టిండు
వడ్లాయన వైద్యం నేర్చుకున్నడు
శానమంది ఓటికోటి జేత్తండ్రు / ఊరంత సిత్తు బొత్తయింది–
ఏషం మారింది – ఎవారం మారింది"

(లక్ష్మణరావు, జి. 2003: 36)

‘పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల / నా తల్లి బంధీ అయిపోయిందో కనిపించని కుట్రల’ అని గోరటి వెంకన్న అన్నట్లు కనిపించని కుట్రల ద్వారా పల్లె వృత్తి మృత్తిలో కలిసిపోయింది. స్వర్ణకారులు హోటల్ పెట్టుకోవడం, మేదరివాళ్ళు చికెన్ సెంటర్, పద్మశాలీలు కట్టెల దుకాణం ఇలా వృత్తిపనులు చేసుకునే వారంతా మరో వేషంలోకి మారిపోయారు. మరో వ్యవహారంలోకి దిగిపోయారు.

### 2.2.4.3.2. పల్లె పరాయీకరణ

“ఇంత భీకరంగా ప్రపంచ శాంతిని
సాధిస్తున్న నీ అద్భుత దుర్మార్గాన్ని
ఏ మూడో కన్నూ పట్టించుకోదు
అదినువు పొగబెట్టిన డాలర్ల మంటకి
పొరలు గమ్ముకుపోయింది
నీ రెక్కనీడలో అవసరాల వలసపక్షులూ
నోరెత్తవ్.... అవి ఆత్మల్ని అమ్ముకున్నాయి”
(శివకుమార్, వఝుల. 2004: 40)

ఈ కవితలో కవి మూడోకన్ను, రెక్కలనీడ, వలసపక్షులూ మొదలైన ప్రతీకల ద్వారా విషయ వ్యక్తీకరణ చేయదలిచాడు. అన్యాయాన్ని ఎదురిచడానికి శివుడు మూడోకన్ను తెరిచాడు ఇక్కడ అమెరికా సామ్రాజ్యవాద అన్యాయాన్ని సమాజంలో మూడోకన్నైన జర్నలిజం పట్టించుకోవట్లేదని కవి ఉద్దేశ్యం. సామ్రాజ్యవాద ఫలితంగా వస్తున్న విధ్వంసంలో పల్లెజనమంతా కూటికిలేక వలసమార్గం పడుతున్నారు. అలాగే అమెరికాతో అవసరమున్న ఉద్యోగస్తులు, నాయకులు అందరూ నోరెత్తడం లేదంటారు కవి. ఇక్కడ చివరలో వచ్చిన ‘ఆత్మల్ని అమ్ముకున్నాయి’ అనే పదం తన అస్తిత్వాన్ని వదులుకొని ఇంకొకరికి బానిసైన విషయాన్ని తెలియజేస్తుంది.

“పదేళ్ళ తర్వాత పల్లెకు బయల్దేరాం....
అన్నం చెట్టు పదం వాడిన పాపానికి
వరిగొల్కల్ని చూపించాలి...!
వెళ్తూంటే... నగర బానిసత్వపు కుబుసాన్ని

త్యజిస్తున్నట్లు... మనసు తళతళలాడింది..
కానీ అదెంతసేపు... పల్లె చిరునామా దొరకనే
లేదు..
ఊర్లో ఇప్పుడు అస్థిపంజరాలైన చెట్లు..
తొలిచేసిన కొండలు
గలుమల ముందు ఎండిపోయిన ముసలోల్లు
నెత్తుటి పూలు.. చీము కురుపులు విచ్చుకున్నట్లు
పత్తిచేండ్లు...
వరిగొల్కలు లేవు.. రంగుల పిట్టలు కూడా లేవు..
కట్టమైసమ్మకాడి సర్కారు తుమ్మల్ని చూపిస్తూ
ఇవేనా అన్నంచెట్లు అని అడిగింది..
మనసు మీద అదే ముండ్లకంపతో
చరిచినట్లయింది"

(రవీంద్ర, సంగెవేని. 2007: 54 – 55)

చిన్నరైతు ఎక్కువ ఉత్పాదన, కనీస మద్దతు ధర, సబ్సీడిలు, మిగులు ఎగుమతి అనే అంశాలతో ఒక వ్యవసాయ ఆర్థిక విధానం ఉన్న అది సరిగ్గా అమలుకాక దాని స్థానంలో సరళీకృత ఆర్థిక విధానం ద్వారా పత్తి లాంటి వాణిజ్యపంటలు రావడంవల్ల వ్యవసాయం రంగం దెబ్బతింది. "పాలకవర్గాలకు ఇన్నాళ్ళుగా ప్రకటిస్తూ వస్తున్న పాత దృక్పథాన్ని ప్రకటించి పేద ప్రజలను భ్రమల్లో ముంచవలసిన అవసరం కూడా లేదన్న మాట. ఏవో కల్లబొల్లి మాటలతో ఆ దృక్పథాన్ని వదులుకుని, ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ వాణిజ్య వ్యాపార ముఠాలు చెప్పినట్టుగా కొత్త దృక్పథాన్ని ప్రకటించదలచారన్నమాట. విజన్ 2020తో ప్రారంభమైన ఈ కొత్త దృక్పథమే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ కొత్త వ్యవసాయ విధానం కాబోతున్నదన్నమాట" (వేణుగోపాల్, ఎన్. 2011: 87 – 88). సహజ సిద్ధమైన ఎరువులతో పండే పంటల్లోకి కృత్రిమ ఎరువులు కూడా రావడం భూమి సారం క్రమంగా తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. దీంతో రైతులకు వచ్చే ఆదాయం కంటే ఖర్చు ఎక్కువైంది. ఇదీ పత్తిపంటలో మరింత ఎక్కువ కావడంవల్ల రైతు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకునే స్థితికి దిగజారాడు.

“పాలు, కూరగాయలు, వడ్లు, జొన్నలు
అరొక్కటి పట్న బోతన్నయి
వాటర్ క్యాన్‌లు కూల్‌డ్రింక్‌లు మందు సీసాలు
అల్కగ ఊల్లెకు దిగుతున్నయి”

(దేవేందర్, అన్నవరం. 2008: 8)

పది, పదిహేను సంవత్సరాల క్రితం పల్లెటూరిలో చేయి బదులు దొరికేవి. కొన్ని సందర్భాల్లో ఉచితంగానే దొరికేవి. అలాంటి పల్లెలోకి ప్రపంచీకరణ రావడం వల్ల అన్నీ మార్కెట్ మయం అయ్యాయి. పాలు, కూరగాయలు అన్నీ డబ్బు సంస్కృతిగా మారబడ్డాయి. అలాగే పల్లెలోకి కొత్త వస్తు సంస్కృతి, వ్యాపార సంస్కృతి వచ్చింది. మామూలు పండ్లైన జామ, సీతాఫలం మొదలైనవి కూడా నేడు వ్యాపారంగా మారిపోయాయి.

“కలిజమాకు కలెగూర కోతిమీరాకు
ఆ ఇంటి నుంచి ఈ ఇంటికి
ఈ ఇంటి నుంచి ఆ ఇంటికి
బంతులు చామంతులు మల్లె పూలన్నీ
ఉత్తగ తెంపుకచ్చుకునుడే
ఇప్పుడవన్నీ పైస కీసల వైకుంఠం”

(దేవేందర్, అన్నవరం. 2008: 14)

ఒకప్పుడు పల్లెలో దొరికే కరివేపాకు లాంటి ఆకుకూరలు, బంతిపూలు లాంటి పూల ఒకరికొకరు ప్రేమగా ఇచ్చిపుచ్చుకునేది. ఎప్పుడైతే ప్రపంచీకరణవల్ల మార్కెట్ సంస్కృతి వచ్చిందో అప్పటినుండి ఉచితంగా దొరికిన వస్తువులు మార్కెట్‌లోకి వెళ్ళాయి.

“అదిగో...
నా పల్లెతల్లి గుండె పగిలింది
పల్లెజనం పక్కదారి
గుంటుకల నాగళ్లు గుటుక్కుమన్నయ్
ఇనుప నాగండ్లు ఇగిలిత్తున్నయ్
డొక్కలెండిన రైతు బోర్లబడుతండు
అగో...

రూపం మారింది
నా ఎడ్లబండి ఎట్లనడుత్తది
బండినిలాగే బర్లకు ఇస సర్పం గుట్టింది
కొండచిలువలా చుట్టుతంది
కొంపలన్ని ముంచుతుంది”

(బాలయ్య, పొన్నాల. 2008 : 66)

వడ్లవాళ్ళు కట్టెతో ఎడ్లబండి చెక్కేవారు. కాని నేడు ట్రాక్టర్లు రావడంవల్ల దాదాపు ఎడ్లబండే లేకుండా పోతోంది. నాగళ్లు, ఎడ్లబండ్లు, రోకళ్లు, రుబ్బురోళు, మంచాలు ఇలా పనిలో సులభరతమైనా వృత్తి జీవనం కోల్పోయింది. పల్లెల్లో ఒకప్పుడు చేతినిండ పని. ఒక కందుకం తియ్యాలంటే పది ఇరవై మందికి పది రోజులదాక దొరికేది కాని నేడు అదే ప్రుక్లోన్ రావడం వల్ల అదే పనిని గంటలో చేసేస్తుంది. దీని వల్ల పల్లెలో పని లేకుండా పోయింది. ఇలా అన్ని విషయాల్లో జరగడం వల్ల పల్లె పట్నానికి వలసపోయింది.

“విలువైన స్టీరియో కేసెట్ రికార్డర్‌లోంచి
వినిపించే చిత్ర విచిత్ర ధ్వని సంగమ డిస్కో సంగీతం కన్న
పల్లెల్లో మా యింటి వెనక అల్లనేరేడు కొమ్మల్లోంచి వినిపించే
కోయిల కంఠస్వరం ఎంత తీయగా వుండేది!
కుళ్ళాయి మేఘాల్లోంచి
కురిసే శరత్కాల క్లోరినేషన్ వర్ష జలాన్ని
ఫల్టర్ చేసి తాగడం కంటె
మా వూరిని చుట్టివెళ్ళే ఏటిలో
అప్పటికప్పుడు చెలమ తోడి
నీటి స్వాదుత్వాన్ని ఆబ ఆబగా ఆస్వాదించే
ఆ అనుభూతి ఎంత గొప్పగా వుండేది!!”

(భాస్కర్, నలిమెల. 2008: 3)

చిత్ర విచిత్ర డిస్కో పాటలు కొమ్మల్లోని కోయిల పాటలను, అచ్చమైన, స్వచ్ఛమైన జానపద పాటలను నాశనం చేస్తున్నాయి. తియ్యనైన, కమ్మనైన ఊట నీటిని వర్షపు నీటి

ప్యూరిఫై చేసి అమ్మే బాటిల్ మింగేసింది. ఇలా సహజమైన పల్లె వాతావరణం పరాయి గాలి తాకిడికి కాలుష్యమై పోతోంది.

### 2.2.4.3.3. మానవ సంబంధాల విధ్వంసం

"మనసుల మధ్య
దూరాలు పెరుగుతుంటే
ప్రపంచం
గ్లోబల్ విలేజా!?"

(గోపాల్, మాడిశెట్టి. 2007: 27)

వస్తువులకు తప్ప వ్యక్తులకు ప్రాధాన్యత లేని ఈ ప్రపంచీకరణలో మనసుల మధ్య దూరం పెరిగిపోవడాన్ని ఖండించాల్సిందే. ఆర్థిక రంగం విస్తరిస్తున్నప్పుడు హార్థికం నశించడం విచారించదగ్గ విషయం. ఇప్పటికే తల్లిదండ్రులకు – పిల్లలకు మధ్య దూరం పెరిగిన విషయం కుటుంబాలని చూస్తే తెలుస్తుంది.

"ఇప్పుడు!
మా ఊర్నిండా బంగ్లాలే! జైలు కానాల్లెక్క
అన్నిటికి ఊసల గేట్లే ఎవ్వలకు మందలిచ్చే తీరిక లేదు
ఇప్పుడు!
నా పల్లెలో అభివృద్ధి అద్దంల సందమామ
సూపుకే నోసుకున్నదిగానీ
సల్లటి మనసు పాడుజేసుకున్నది"

(వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 12)

గతానికీ, వర్తమానానికీ భేదాలు చెప్తూ సాగే కవిత. ఒకప్పుడు ఊర్లో గుడెసులున్న వాటికి హృదయాలుండేవి. అందరినీ ప్రేమగా పలకరించేవి, మానవత్వానికి గుళ్ళుగా ఉండేవి. నేడు బంగ్లాలు అయినా వాటి చుట్టు స్వార్థపు కంచెలు. అందుకే అవి చూపుకు మాత్రమేగానీ ప్రేమకు, అనురాగానికి పనికిరాని ఇళ్ళుగా మారిపోయాయి.

"పిల్లలకు చక్కని క్రెషెష్
వృద్ధులకు ఏంచక్కా ఆశ్రమాలు

పక్కపక్కనున్నా మనిషికీ మనిషికీ నడుమ
విస్తరిస్తున్న వేనవేలకొలది మైళ్ళ దూరాలు"
(జగన్నాథం, జూకంటి. 2013: 47)

ఉరుకుల పరుగుల జీవితంలో ఒకరు ఇంకొకరితో మాట్లాడికునే తీరిక ఉండట్లేదు. డబ్బు డబ్బు అంతా డబ్బుమయం. ఎంత ఎక్కువ సంపాదిస్తే అంత గొప్ప. పిల్లలతో ఆటల్లేవు, తల్లిదండ్రుల బాగోగులు లేవు, అన్న తమ్ముడు, అక్క, చెల్లెలు ఇలా సంబంధాల బంధనాలు లేవు. అంతా నేను, నాది. అందుకే పిల్లలకు క్రషెష్‌లు, వృద్ధులకు ఆశ్రమాలు. అలాగే సాంకేతిక జీవితంలోకి ప్రవేశించాక ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ వచ్చాక అదే ప్రపంచమైపోయింది. మాటలు, పాటలు, పలకరించడం, చూసుకోవడం అన్నీ అందులోనే అయిపోతున్నాయి. ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సప్, మెస్సెంజర్ మొదలైనవి దూరమున్నవాళ్ళతో కలుపుతున్నాయి. కాని పక్కనున్న వాళ్ళను దూరం చేస్తున్నాయి. సాంకేతికతకి తప్పు కాదు దాన్ని వాడే మనుషులదే తప్పు.

వస్తు సంస్కృతి అందించిన ఫలితమే మనషుల మధ్య ముసుగులు, మనసులకు ముసుగులు. మాటలన్నీ ఉంటున్న, మాట్లాడుకుంటున్న మనషుల మధ్య దూరం ఎందుకుంటుందంటే ఆర్థిక అంశాలు. మనుషులకన్న మనీ విలువ పెరిగడంవల్ల ఈ సంస్కృతి వచ్చింది. ఒకరికి ఒకరు ఎన్ని మాటలు చెప్పుకున్నా వాటిల్లో ప్రేమ మాత్రం లేకపోవడంవల్ల అవి గుండెలకు చేరలేకపోతున్నాయి.

"అమ్మమ్మ నాయనమ్మల
తెనాలి రామలింగని కథలతో
నవ్వుల పువ్వులై విరబూసేవాళ్ళు
పిండారబోసిన వెన్నెల గుహల్లో
కలల తోటలై రెక్కవార్చుకునేవారు
ఇప్పుడు కలలదారుల్ని తుడిచేసిన / తుఫాను కింద
మనిషికి మనిషి అందకుండాపోయే
ఛానళ్ళ వరదల్లో కొట్టుకుపోతూ
శవాలు శవాలుగా బతికేస్తూ...."
(చెమన్. 2001: 28)

ఒకప్పుడు పల్లెల్లో రాత్రి అయ్యిందంటే చాలు చిన్నాపెద్దవాళ్ళందరూ రచ్చబండకాడనో, అరుగులమీదనో, ఇంటిముందటి బల్లమీదనో చేరి మాట్లాడుకునేవారు. ఎన్నో కథలు చెప్పుకునేవారు. ఆటలు ఆడుకునేవారు, పాటలు పాడుకునేవారు. ఇలా జానపదం ఒకరినుంచి మరొకరికి మౌఖికంగా జీవనం సాగిస్తూ ఉండేది. కాని నేడు ఆధునికతలో భాగంగ వచ్చిన టెలివిజన్ వీటన్నింటిని నాశనం చేసింది. ఇప్పుడు ఎప్పుడైన ప్రతివాళ్ళు టెలివిజన్‌కే బానిసగా మారిపోయారు. జానపద కథల స్థానంలో సీరియళ్ళు, ఆటల స్థానాల్లో క్రికెట్, పాటల స్థానంలో సినిమా గేయాలు వచ్చి పల్లెను, పల్లె మనుషుల్ని జీవచ్ఛవాలుగా మార్చేసాయి.

### 2.2.4.3.4. సాంస్కృతిక విధ్వంసం

"సాంస్కృతిక బానిసత్వాన్ని
నీ పేషెంట్ బాడీకి స్టెరాయిడ్‌లా ఎక్కిస్తాడు
పాప్‌మ్యూజిక్ రాప్ మ్యూజిక్ మేతలే! మోతలు!!
సమంతాఫాక్స్ నీకు దేవత
మైకేల్ జాక్సన్, మరెవడో
నీ గుండెను డ్రమ్స్‌గా మోగిస్తాడు
నిన్ను కీలుబొమ్మలా ఆడిస్తాడు!"
(శివప్రసాద్, సంకేపల్లి. 2002: 39)

ప్రపంచీకరణ వల్ల కట్టుబొట్టు, జీవన విధానంతో పాటు సంస్కృతిలోను అనేక మార్పులు వచ్చాయి, వస్తున్నాయి. ధోతి పంచెపోయి జీన్స్, టీషర్ట్స్, లంగవోణి పోయి చుడీదార్ మొదలైన దుస్తులు వచ్చాయి. అలాగే మనవైన డప్పులు, కంజీర, కిన్నెరమెట్ల వాయిద్యం ఇలాంటి దేశీయమైన వాయిద్యాలు, సంగీతం నాశనమయ్యి సాంస్కృతిక బానిసత్వంలో DJలు, పాప్ మ్యూజిక్‌లు, డ్రమ్స్ ఇలాంటి ఇప్పుడు నిత్య వాడుకలోకి వచ్చాయి. అందుకే మనమిప్పుడు కీలుబొమ్మలుగా మారిపోయాం. మనిషిని మార్కెట్ వ్యవస్థలోకి వలవేసి లాక్కోడానికి ప్రపంచీకరణ వెనకబడిన ప్రాంతాల సంస్కృతిని నాశనం చేసి ఒకే ఒక 'విశ్వమానవుడి'ని తయారు చేస్తుంది.

ప్రపంచీకరణ వల్ల అసలు అస్తిత్వ మూలాలకే నష్టం వస్తోంది. కుటుంబ వ్యవస్థ చెల్లాచెదురైంది. అనుబంధాలు మృగ్యమయ్యాయి. ఏవి భారతీయ సంస్కృతి మౌలిక సూత్రాలో అవన్నీ ఛిన్నాభిన్నమయ్యాయి. ఇంతవరకు ముందు ఏవో మార్పులు మన సంస్కృతిలో వచ్చినా మౌలికతకు భంగం ఉండేదికాదు. కాని నేడి పరిస్థితి భయంకరం. మూలాలు కొట్టుకుపోయే దశ వచ్చింది. అందుకే కవులు, రచయిలు, కళాకారులందరూ బలంగా వ్యతిరేకిస్తున్నారు.

"ఉరివేసుకుంటున్న బట్టలు
పురుగులమందు తాగుతున్న పంటలు
కళేబరాలను తయారుచేస్తున్న కాలేజీలు
పసిపిల్లల మార్కెట్లు
ఇంటర్నెట్ ఇంద్రజాలం
ఇంకా ఇంకా ఏవో ఏవేవో
అర్థమయ్యీ కాని అసంబద్ధ వాస్తవాలు...
నాకు నిద్రపట్టడం లేదు....
(లక్షణరావు, జి. 2003: 9)

ప్రపంచీకరణవల్ల ప్రభావితం కాని రంగమంటూ లేదు. వృత్తులు, విద్య, వ్యవసాయం, సేవారంగం ఒక్కటేంటి అన్ని మార్పులకు లోనయ్యాయి. అందుకే యాంత్రీకరణ, ఇంటర్నెట్ మాయ అన్ని పెరిగిపోతున్నాయి. ఇవన్నీ సామాన్య మానవుడికి అర్థమయ్యి కాని విషయాలు. పై కవితలో 'బట్టలు' పదాన్ని పద్మశాలీలకు ప్రతీకగా, 'పంటలు' పదాన్ని రైతులకు ప్రతీకగా వాడారు. మంచి మనుషులుగా, మానసికంగా ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన కాలేజీలు ర్యాంకుల వేటలో పిల్లల జీవితాలతో ఆడుకుంటున్నాయి.

"మర చెంబుతో దాహం తీర్చుకున్న
గొంతులకే 'కిన్లే' తడి
దూపతీర్చిన సల్ల ముంత పగిలింది
'హెరిటేజ్ బటర్మిల్క్' పాంచ్ రూపాయ్"
(దేవేందర్, అన్నవరం. 2008: 13)

కొత్తవాళ్ళు ఏ ఊరు వెళ్ళినా ఒకరుకాకుంటే ఒకరు నీళ్ళిచ్చేవారు లేక మజ్జిగ ఇచ్చేవారు. కాని నేడు కిన్లే బాటిల్స్, బటర్ మిల్క్ ప్యాకెట్లు వచ్చేశాయి. మన నీళ్ళనే మనం కొనుక్కునే స్థితిలోకి చేరుకున్నాం. అలాగే వస్తు సంస్కృతి కూడా ధ్వంసమైపోతుంది. మర చెంబు, సల్ల ముంత లాంటి వస్తువులు నేడు అపురూపమైనవిగా మారిపోయాయి. వాటి స్థానంలో ప్లాస్టిక్ బాటిళ్ళు వచ్చాయి.

"చిన్నప్పుడు
నేను 'లాల' తాగిన బొడ్డు చెంబు
ఇప్పుడు సందర్శకులను
విశేషంగా ఆకర్షిస్తూ అలరిస్తున్న పురావస్తువు–
ఎవరి గొంతులకు వారే
వంతులవారి
ఉరిత్రాళ్ళు బిగించుకుంటున్న కాలం"

(జగన్నాథం, జూకంటి. 2013: 47)

ఊర్లలన్నీ ఖాళీలై వలసపోతున్నాయి, ఇంకొంత పాత ఇండ్లన్నీ బంగ్లాలవుతున్నాయి. పాతకాలంనాటి వస్తువులన్నీ మరుగునపడి కొత్త వస్తు సంస్కృతి అందుబాటులోకి వస్తోంది. ఊర్లలో మసాలాలు నూరుకోడానికి, అల్లం, వెల్లుల్లి నూరుకోడానికి రోళ్ళు, రోకలి దుడ్లు ఉండేవి. ఇప్పుడు మిక్సర్, గ్రైండర్ మొదలైనవి రావడం వల్ల అవి మూలపడ్డాయి తద్వారా రోళ్ళు చేసేవారు, రోకలిదుడ్లు చేసేవారికి జీవనాధారం లేకుండా పోయింది. అలానే ఇంకా ఎన్నో పాత వస్తువుల స్థానంలో కొత్త వస్తువులు రావడంతో కొన్ని నేటి తరం వారికి అవి అపురూపమైనవిగా కనిపిస్తున్నాయి. ఇలా ప్రపంచీకరణ ఊర్లోని అన్ని వృత్తుల్ని తన కబంధ హస్తాల్లో బంధించి నాశనం చేస్తోంది.

"పాలనా భాష నాది కాదు
పాలకుల్లోనూ నా సంభాషణ లేదు
ఆహారం ఆహార్యం ఏవీ నావికావు
సంస్కృతి అంతా వికృతం
తనువు తనువంతా

వశీకరణంలా పరాయీకరణం చెంది

దేహం సమస్తం కొయ్య బారిన తనం”

(దేవేందర్, అన్నవరం. 2005: 67)

వేసుకునే దుస్తువులు, కొట్టుకునే పర్‌ఫ్యూమ్‌లు, పూసుకునే క్రీములు, క్లబ్‌లు, న్యూ ఇయర్ సెలబ్రేషన్స్, భాష ఇలా రోజురోజుకి మారుతున్న సంస్కృతి, పతనమవున్న మానవత్వ విలువలు మొత్తం మనది కాని బతుకు.

“వధువు ఆ ముహూర్తాన్ని

మార్చమంది

ఆమె కిష్టమైన

సీరియల్ టైమది”

(గోపాల్, మాడిశెట్టి. 2007: 3)

వధువు, వరుడు జాతకాలు చూసి ఒక శుభముహూర్తం పెట్టుకొని పెళ్ళి చేసుకోవడం సంప్రదాయం. అలాంటి సంప్రదాయాన్ని వద్దనడానికి కారణం టెలివిజన్‌లో ఆ సమయానికి వధువుకు ఇష్టమైన సీరియల్ రావడం. అంటే టెలివిజన్ ప్రభావం ప్రజలపైన ఎంతగా ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. అలాగే ఈ టెలివిజన్‌వల్ల రోజుల తరబడి ప్రజలందరిని ఒక్కచోటకు చేర్చి ఆనందాన్ని, జ్ఞానాన్ని అందించే నాటకాలు కనుమరుగయ్యాయి.

“క్రికెట్టు చేసిందేదో

కనికట్టు

ఇక ఇతర క్రీడల

ఆట కట్టు”

(గోపాల్, మాడిశెట్టి. 2007: 2)

ఈ కాలంలో తెలిసింది ఒకే ఒక్క ఆట క్రికెట్. క్రికెట్ రాకతో దేశీవాళి ఆటలైన కబడ్డీ, ఖోఖో, కట్టెచిమ్ముడు, ఊంచుడుటెక్క, చిర్రగోన లాంటి అనేక ఆటలకు కాలం చెల్లిపోయింది. గ్రామాల్లోనైన, పట్టణాల్లోనైన క్రికెట్టు తప్ప ఇంకేం ఆటలు కనిపించకుండపోయాయి.

### 2.2.4.3.5. కొత్త వస్తు సంస్కృతి

"సెల్లంటే!
అరచేతి దీపంలా
జేబులో జాబిలి ముక్కలా
నడిచి వెళ్తున్న స్నేహ వారధిలా ఉంటుంది
సెల్లుంటే!
జీవితానికొక సరికొత్త అస్తిత్వం
చెలికానికి ద్వితీయ రూపత్వం
ఇది
కవిత్వానికి నివేదించిన నవ్య వస్తు తత్వం"

(వెంకటేశ్వర్లు, బూర్ల. 2007 : )

'కాదేది కవితకనర్హం' అన్న శ్రీశ్రీ మాటల ప్రకారం కవికి ఈ ప్రపంచంలో వస్తువు కానిది ఏదీ లేదు. అందుకే ఇక్కడ కవికి సెల్‌ఫోన్ కవితా వస్తువయ్యింది. ప్రపంచీకరణ ప్రభావం వల్ల సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందింది. సాంకేతిక పరిజ్ఞానం వల్ల వచ్చింది సెల్‌ఫోన్. అది మనుషుల మధ్య దూరాన్ని తగ్గించినా అదే ఇప్పుడు ప్రపంచంగా మారిపోయింది. చాటింగ్, ఇంటర్‌నెట్, గేమ్స్ మొదలైన వాటి వల్ల 24 గంటలు వాటితోనే గడిపేసే యువత చాలా పెరిగిపోతుంది. అందుకే అది సరికొత్త అస్తిత్వం అయ్యింది.

"సెల్లంటే జీవకణం
నరనరాల్లో అణువణువునా
నవజీవాన్ని నింపేది సెల్
బంజర్లో ఉన్నా బస్సులో ఉన్నా
బాత్‌రూంలోనూ
అవతలి గొంతు
చెవికి చేర్చేది సెల్"

(వసునందన్, రావికంటి. 2006: 61)

ప్రపంచాన్ని అరచేతిలోకి తెచ్చింది సెల్ ఫోన్. మనిషెక్కడున్నా, అతడేం చేస్తున్నా అవతలి వ్యక్తి మాటల్ని మన మనసుదాకా మోసుకొచ్చే వాహకమే సెల్. దీనివల్ల మనుషుల

మధ్య దూరం తగ్గిపోయింది. వీడియో కాలింగ్ వచ్చాకా ఒకరికొకరు చూసుకుంటూ మాట్లాడడంవల్ల ఎదురెదురు ఉన్న అనుభూతి కలుగుతుంది. ఎక్కడో సుదూరంలో ఉన్నవాళ్ళని నేరుగా చూసిన ఆనందం వస్తుంది. అలాగే ఇంటర్‌నెట్ వచ్చాకా ఆ సెల్లే ప్రపంచం అయిపోయింది. పక్కనున్నవాళ్ళతో కూడా మాట్లాడనంత దూరం పెరిగిపోతోంది.

### 2.2.4.3.6. ప్రపంచీకరణ ప్రతిఘటన

వృత్తుల్ని కూల్చి మనుషుల ఉపాధి లేకుండా చేసి, మట్టితో మనిషికి బంధాన్ని తెంపి వలసపోయే విధంగా చేసిన, బంధాలకన్న డబ్బుకు విలువనిచ్చేల చేసిన, మనదికాని సంస్కృతిని, సంప్రదాయాన్ని, ఆహారాన్ని, ఆహార్యాన్ని ఇచ్చి మనల్ని మనం కాకుండా చేస్తున్న ప్రపంచీకరణని ప్రతిఘటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

"ప్రపంచ వాణిజ్యం ప్రచండమై
గ్రామ వికాసాన్ని ఆర్పేసింది
చేతి పనుల ఇరుసులు విరిగిన ధ్వని
నాలుగు వక్కలైన నాగలి కర్రు
దేశీయత దేహం గాయమైంది
భౌగోళీకరణ అగ్ని
దేశదేశాలకు అంటుకున్న నిప్పు
విస్తరిస్తున్న విశ్వీకరణ
ప్రాంతీయాత్మే ప్రతిఘటన"

(దేవేందర్, అన్నవరం. 2005 : 3)

ప్రపంచీకరణ ప్రభావానికి గురికాని రంగం లేదు, బలికాని ఇళ్ళు లేదు. ఎప్పుడైతే భారతదేశంలోకి ప్రపంచీకరణ ప్రవేశించిందో వృత్తులన్ని కూలాయి. వృత్తుల్ని నమ్ముకున్నా వాళ్ళంతా కూలీలుగా మారారు. వ్యవసాయం మూలకు పడి వాణిజ్య పంటలు వచ్చాయి. పల్లె ఆనందాలు, ఆప్యాయతలు, ఆచారాలు, సంప్రదాయాలు అన్నీ మాయమై పల్లె అందాన్ని కోల్పోయింది. దేశీయత మంట గలిచింది. దేశాదేశాల్లో విస్తురిస్తున్న ప్రపంచీకరణ ప్రాంతీయాత్మతో వ్యతిరేకించాలి. మనల్ని మనం రక్షించుకోవాలి.

"పరిఢవిల్లే విశ్వసంస్కృతి నుడికారాన్ని
'పరాయికరణ' పదఘట్టనల క్రింద నలపడాన్ని
రంగుస్వప్నాల వ్యాపార వ్యూహంతో
అంతరంగ స్వేచ్ఛావిహంగాల్ని
నేల క్కొర్చే కృరత్వాన్ని..
అడ్డుకోవాల్సిందే...ధిక్కరించాల్సిందే...
తమ దేశాల్లో తామే బందీలయ్యే
బానిసత్వ కీటాణువుల్ని మెదళ్ళ కుహరాల్లో
పొదుగుతున్న ఈ గ్లోబల్ 'వామన' పాదానికి
నిప్పుల చెప్పులు తొడగాల్సిందే"

(రవీంద్ర, సంగెవేని. 2007: 31)

ప్రపంచీకరణ మన జీవన సంస్కృతిని కాదని కొత్త సంస్కృతిని ప్రవేశపెడుతుంది. మన సంస్కృతిని చెరిపేసి మన జీవన విధానాన్ని మార్చేస్తుంది. అలాంటి విష సంస్కృతిని ధిక్కరించాలనే స్పృహ కవుల్లో కనిపిస్తుంది. "ఆర్థిక సంస్కరణల ఫలితంగా జీవితంలోని సకల రంగాల్లోనూ వ్యాపార ధోరణులు చోటుచేసుకున్నాయి. అమానవీయత ప్రబలింది. దళితులు, స్త్రీలు, మైనార్టీలు... ప్రతిఒక్కరు సరళీకృత ఆర్థిక విధానాల కారణంగా నష్టపోయినవారే. వీరి ఆగ్రాహావేశాలను ప్రతిఫలించే కవిత్వం ఇప్పుడు వస్తుంది" (గుడిపాటి. 2002: 28.).

# అధ్యాయం – 3

# కరీంనగర్ జిల్లా కవిత్వం – వస్తు పరిణామం

## 3. పరిచయం

'పరిణామం' అన్న పదానికి "1. మాఱుపాటు, మాఱురూపు, వికారము. 2. జీర్ణమగుట, అఱుగుట, 3. ఫలితము, పర్యవసానము" (సుబ్బయ్యశాస్త్రి, కాశీభట్ల. 1988: 572) అన్న అర్థాలిచ్చింది శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు. అలాగే "ఒకయర్థాలంకారము; (చూ. అలంకారము.) 2. క్షేమము, 3. అడ్డముగా విసరఁబడిన యేఁనుగు కొమ్ముదెబ్బ, 4. మాఱురూపు" (సీతారామాచార్యులు, బహుజనపల్లి. 2013: 556) అని శబ్దరత్నాకరము అర్థాలిచ్చింది. పరిణామం అంటే మారురూపు అనే అర్థం ఇక్కడ గ్రహించవచ్చు. ఒక కాలంలో ఉన్న సాహిత్యం మరో కాలానికి ఎలా మార్పు చెందిందో చెప్పడమే పరిణామం. సమాజం నిరంతరం చలనంలో ఉన్నట్టే సాహిత్యం కూడా చలనంలో ఉంటుంది. అందువల్ల సమాజంతోపాటు సాహిత్యమూ మారుతుంది. ఈ మార్పే పరిణామం.

"Marxism attempts to understand the relations between the literary text and the social world. Recognizing that literature is a process and that the social world involves contexts of production and those reception" (Rice, Philip (Edt.). 2001: 103). మార్క్సిజం రచనకు, సమాజానికి మధ్యగల సంబంధాన్ని అర్థం చేసుకోవాలని చెప్తుంది. ఎందుకంటే ఆయా రచనల్లో ఆయా కాలపు సామాజిక జీవన విధానాలు నమోదవుతాయి కనుక. సాహిత్య వస్తు పరిణామక్రమాన్ని అధ్యయనం చెయ్యడమంటే సమాజ గమనాన్ని కూడా అధ్యయనం చేసినట్టే. అలా అనుకున్నప్పుడు సాహిత్య వస్తు పరిణామక్రమాన్ని చాలా జాగరుకతతో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

తెలుగు సాహిత్యం నన్నయతో మొదలైనప్పటినుండి ఆధునికత(రూపంలో, వస్తువులో) ప్రవేశించేదాకా వస్తువంతా దైవం, రాజు, ధర్మం, ఊహా కల్పనలు, స్త్రీల అంగాంగ వర్ణలు మొదలైన వాటిచుట్టే తిరిగింది తప్ప (శివకవులు, శతకకవులు, కీర్తనకవులు కొంతమందిని మినహాయిస్తే) సామాన్య మానవుడిని పట్టించుకోలేదు.

రాజాస్థానాల వరకే కవిత్వం పరిమితమైంది. రాజును మెప్పించడానికో, తన పాండిత్యం చూపించడానికో ఒకప్పటి సాహిత్య సృజన జరిగింది. అంతా సాహిత్యం, అందరు కవులు ఇలానే ఉన్నారని కాదు. కాని ఎక్కువ సాహిత్యం, ఎక్కువ మంది కవులు ఈ కోవకు చెందినవారే. కాని నేడు పూరి గుడిసెల్లోకి చేరింది. సామాన్య మానవుడి జీవన చిత్రణ నేటి కవిత్వంలో కనిపిస్తుంది.

"సాహిత్య చలనం వస్తురూపాలు రెండింటికీ సంబంధించి ఉంటుంది. సాహిత్యంలో ఎప్పుడూ ఒకే కథా వస్తువు కొనసాగదు. రచనా విధానమూ ఒకే విధంగా ఉండదు. సమాజ పరిణామానకి సాపేక్షంగా సాహిత్యంలోనూ కొత్త కొత్త మార్పులు జరుగుతుంటాయి. అందుచేతనే భూస్వామ్య రాజరిక వ్యవస్థలో సామ్రాజ్యాల కాలంలో, జమీందారి వ్యవస్థలో, ఆధునిక ప్రజాస్వామ్య యుగంలో వెలువడిన సాహిత్యంలోని కథావస్తువుల్లో ఎంతైనా మార్పు కనిపిస్తుంది. సామ్రాజ్య యుగంలో రాజులు కావ్యనాయకులయ్యారు. ఆధునిక కాలంలో వ్యక్తి, వ్యక్తి భావజాలం సాహిత్య కేంద్ర బిందువు అయ్యాయి. అదే విధంగా ప్రాచీన రచనా విధానం, భాషా పద్ధతి మారిపోయి ఆధునిక పద్ధతి వచ్చింది" (శివశంకర్, పాపినేని. 1996: 38). చలనశీలతలేన సమాజం, సాహిత్యం ఉండవు.

తెలుగు సాహిత్యంలో శిష్ట్లా ఉమామహేశ్వరరావు నవమిచిలుక, విష్ణుధనువుతో ప్రారంభమైన తెలుగు ఆధునిక కవిత నేటి దాకా మూడు సంకలనాలు, ఆరు సంపుటాలుగా కొనసాగుతోంది. ఇంతటి విస్తృతమైన కవిత్వంలోని వస్తువు సమాజమంతా విశాలమైంది. ఆధునిక కవిత ఆవిర్భావం నుండి నేటివరకుగల వస్తువును గమనించినట్లైతే వస్తువును మలుపుతిప్పిన సందర్భాల్లో కొందరు వ్యక్తులతోపాటు కొన్ని ఉద్యమాలు, ధోరణులు, వాదాలు కనిపిస్తాయి.

"సమాజం నిన్నా ఉంది, రేపూ ఉంటుంది. సమాజాన్ననుసరించి కళలు మొదలైన చైతన్య రూపాలన్నీ ఉంటాయి. అయితే నిన్నటి సమాజం వేరు. నేటి సమాజం వేరు. రేపటి సమాజం ఈ రెండింటి కన్నా భిన్నమైందిగా ఉంటుంది. కారణం సమాజం అంటే వ్యవస్థ. అది మారేది. సమాజంతోపాటు చైతన్య రూపాలు కూడా మారుతాయి. కాబట్టి చైతన్య రూపాల్లో ఒకటైన కవిత్వం కూడా నిన్నటిలాగా నేడు లేదు. నేటి లాగా రేపు ఉండదు. ప్రాచీన కవిత్వం కంటె భిన్నమైంది ఆధునిక కవిత్వం. వస్తువులో శిల్పంలో పరిణామం మార్పు

స్పష్టంగా గోచరమవుతాయి" (చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం. 2002: 8). ఆధునిక జీవితం ఆధునిక కవితకు లెక్కలేని వస్తువుల్ని అందించింది.

నన్నయనుండి మొదలుకొని 19 శతాబ్దపు ఆరంభంవరకు కవితా వస్తువు సామాజికం కానిది. "పందొమిదవ శతాబ్ద ప్రారంభ కాలంలో తెనుగు సాహిత్యంలో క్షీణ ప్రబంధ యుగ లక్షణాలే ఇంకా రాజ్యం చేస్తుండేవి. అప్పటికి ద్వ్యర్థి కావ్యాలు, శ్లేష కావ్యాలు, పిల్ల వసుచరిత్రలు, ఆశు కవిత్వాలు, చిత్ర కవిత్వాలు, సమస్యా పూరణాలు, చాటువులు మొదలైనవి కొల్లలుగా వుండేవి. సమకాలీన సమాజ పరిస్థితుల చిత్రణ అవసరమనే స్పృహ ఎవరికీ వుండేది కాదు. పైగా అటువంటి ప్రయత్నాలు ఎవరైనా చేయబోయినా అవి హేళనకు పాత్రమవుతుండేవి. మొత్తం మీద చూస్తే 19వ శతాబ్దపు తెలుగు సాహిత్యమంతా అంతకు ముందు తీర్చిదిద్దిన ప్రబంధయుగ మార్గంలోనే నడిచింది. కాని కొత్త పుంతలు తొక్క లేదనేది యథార్థం. అందువల్లనే తెలుగు సాహిత్యం ప్రజలకు దూరమైపోయి కేవలం పండిత ప్రకాండుల ఆదరణ పరిధిలోనే కాలం వెళ్లబుచ్చవలసి వచ్చింది" (ఆంజనేయులు, కుందుర్తి. 1987: 17 – 18).

నన్నయ కాలంలో కవిత్వం మతాన్ని ఆలంబనగా చేసుకుంది. ఆనాటి సమాజంలో ఉన్న వైదిక మత పునరుద్ధణకై రాజులు కూడా కవులను ఆదరించారు. కావ్యాలు రాసేల చేశారు. ఆనాడు ఎక్కువ పండితులు ఎక్కువగా సంస్కృత పదాలతోనే రచనలు చేశారు. ఎందుకంటే ఆనాటి రాచరికంలో సంస్కృతానికే గౌరవం ఉండేది. రాజాస్థానంలో స్థానం సంపాదించాలంటే సంస్కతంలో రచన చేసినవాళ్ళై ఉండాలి. పాల్కురికి లాంటి కొంతమంది సంస్కృత భాషను కాదని తెలుగు భాషకు పట్టం కట్టి శైవమత ప్రచారం చేయడంవల్ల ప్రజలకు దగ్గర కాగలిగింది. అలాగే పోతన, ధూర్జటి లాంటివాళ్ళు రాజులకు వ్యతిరేకంగా రాసిన మతమే ప్రధానంగా కనిపిస్తుంది. తర్వాత ప్రబంధయుగంలో ఆ సామాజిక జీవితంలోని భోగలాలస, సుఖజీవితం ఆనాటి సాహిత్యంలో ప్రతిబింబించింది. స్త్రీ అంగాగ వర్ణన ఎక్కువగా కనిపిస్తుంది. "రాజాస్థానాలకు భిన్నంగా, సంస్కృత సంప్రదాయానికి భిన్నంగా, ప్రజలకు దగ్గరగా వచ్చిన తెలుగు కవిత్వం లేకపోలేదు. పదాలు, పాటలు, తత్వాలు, కీర్తనలు, చాటువులు, శతక పద్యాలు మొదలయినవన్నీ ఈ కోవలోకి వస్తాయి. అయితే వీటికి రాజాస్థానంలో చోటులేదు. అందుకే ఈ కవులకు పేరు ప్రతిష్టలు రాలేదు. తెలుగులో వందల సంఖ్యలో శతకాలున్నాయి. ఈ శతకాలన్నీ ప్రజల జీవితాన్ని

చిత్రించాయని కాదు. ఎంతో కొంత ప్రజల జీవితానికి అద్దం పట్టేవి కొంతవరకైనా యివే. ప్రబంధాలు రాజాస్థానికే పరిమితం అయివుంటే, ప్రజల్లో సజీవంగా ఉన్నది ఈ సాహిత్యమే" (చెంచయ్య, వి. అరుణతార. డిసెంబర్. 1991: v). తర్వాతి క్షీణయుగంలో వచ్చిన పిల్లవసుచరిత్రల్ని పక్కనబెడితే ఆ కాలంలో వచ్చిన యక్షగానాల్లో కొంత సామాన్య జీవితం వస్తువుగా మారింది.

వీరేశలింగంగారు ఆనాటి సామాజిక సంఘస్కరణోద్యమాల ప్రభావంవల్ల స్ఫూర్తి పొంది ఆంధ్రదేశానికి సాంఘిక పరంగా, సాహిత్య పరంగా వినూతన జాగృతిని కలిగించిన ప్రథమ వైతాళికుడు. వస్తువులో మౌలికమైన మార్పును తీసుకొచ్చారు. ఆ తర్వాత గురజాడ అప్పారావు, గిడుగు వేంకటరామమూర్తి కనిపిస్తారు. తర్వాత వచ్చిన భావకవులు అప్పటిదాకా కొనసాగుతూ వస్తోన్న ప్రబంధ వస్తువుకు భిన్నంగా కవితా వస్తువును స్వీకరించారు. వాళ్ళు ఏం రాసినా ఎంతగా భావోద్వేగానికి గురయ్యారో చూసారు. భావకవిత్వంలో ప్రకృతి, ప్రణయం, దేశభక్తి, సంఘసంస్కరణ, భక్తి, స్మృతి కవిత్వం వచ్చినా ఎక్కువగా ప్రణయ కవిత్వానికే పెద్దపీట వేశారు. కాని ఇదే కాలానికి సంబంధించిన జాషువా గారు సమకాలీన, సామాజిక పరిస్థితులను ఆర్ద్ర హృదయంతో కవిత్వం చేశారు.

ఆ తర్వాత వచ్చిన అభ్యుదయ కవిత్వం వస్తువులో పెను మార్పులు తీసుకువచ్చింది. ముఖ్యంగా శ్రీశ్రీవల్ల వస్తువు పెద్ద పరిణామాన్ని తీసుకుంది. దిగంబర కవిత్వం స్తబ్ధమైన వాతావరణాన్ని బద్ధలు చేస్తే, విప్లవ కవిత్వం ప్రజల సమస్యలని వస్తువుగా స్వీకరించి పోరాటాలకి సిద్ధం చేసింది. అనాదిగా కొనసాగుతూ వస్తోన్న పురుషాధిపత్య సమాజంపై దండెత్తింది స్త్రీవాద కవిత్వం. బ్రహ్మణీయ భావజాలం కారణంగా ఊరవతలకి విసిరేయబడి పంచములుగా గుర్తించబడ్డ వాళ్ళ గాయాల్లోంచి వచ్చిన కవిత్వమే దళిత కవిత్వం. ఈ దేశంలోనే పుట్టిన పరాయి దేశస్థులుగా గుర్తించబడి అవమానాలు, బాధలు అనుభవిస్తున్నవాళ్ళ కవిత్వమే మైనారిటీ కవిత్వం. ఇలాంటి ఉద్యమాలు, ధోరణులు, వాదాలు కవితా వస్తువులో గణనీయమైన మార్పులను తీసుకువచ్చాయి.

అలిశెట్టి ప్రభాకర్, శ్రీశ్రీ, కుందుర్తి ఆంజనేయులు, దాశరథి, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, మో, శివసాగర్, డా. సి. నారాయణరెడ్డి, దేవరకొండ బాలగంగాధర్ తిలక్ మొదలైన వారంత కూడా వస్తువులో మార్పును తీసుకువచ్చారు.

"వస్తు పరిణామ వికాసాలు

| కవిత్వం | ఫ్యూడల్ వ్యవస్థ | | | బూర్జువ వ్యవస్థ | |
|---|---|---|---|---|---|
| | భారతకవులు | ప్రబంధకవులు | గురజాడ | భావకవులు | శ్రీశ్రీ |
| ప్రయోజనం | మనస్సంస్కారం | మనోరంజనం | మనఃపరివర్తనం | మనఃప్రక్షాళనం | మనశ్చైతన్యం |
| పాఠకులు లేదా శ్రోతలు | పాలకులు, ప్రజలు | పండితులు, పాలకులు | మధ్యతరగతి విద్యావంతులు, ప్రజలు | సహృదయులు, కవులు | పీడితవర్గం, బూర్జువ వర్గం |
| వస్తువు లేదా సామగ్రి | మతం, గతం, కథలు | శృంగారం, వర్ణనలు | సందేశం, సమాజం, వర్తమానం | అనుభూతి, ప్రకృతి | విప్లవ సిద్ధాంతాలు, సమజాలిక జీవితం |

(రామకృష్ణ, మిరియాల. 1980: 629).

ఇదొకవైపైతే మరోవైపు తెలంగాణలో పరిస్థితులు భిన్నంగా కనిపిస్తాయి. తెలంగాణ ప్రాచీన సాహిత్యంలో మత, భక్తి కవిత్వం కనిపిస్తుంది. ఆ తర్వాత మత, శృంగార కవిత్వం అక్కడక్కడ కనిపించినా ప్రజలకు సన్నిహితమైన సాహిత్యమే ఎక్కువగా వచ్చింది. "19వ శతాబ్దంలో వచ్చిన సాహిత్యాన్ని పరిశీలిస్తే రాబోయే ప్రజాస్వామిక యుగానికి పూర్వరంగ మేర్పడిందని తెలుస్తుంది. ఈ కాలంలో గతానుగతికంగా 'అచలాత్మజాపరిణయం' వంటి కావ్యాలు 'శృంగార సుధా సముద్ర పూర్ణ చంద్రోదయం' లాంటి పచ్చి శృంగార ప్రబంధాలు వచ్చినప్పటికీ సామాన్య ప్రజలకు సన్నిహితమైన శతకాలు, కీర్తనలు, యక్షగానాలే లెక్కలేనన్ని వచ్చినవి. నరసింహశతకం, (ధర్మపురి శేషాచలకవి), శ్రీ కృష్ణ శతకం (కాకుత్సం నరసింహదాసు), ధర్మపురి రామాయణం, మైరావణ చరిత్ర, గయోపాఖ్యానం, శతకంఠ రామాయణం, ధర్మాంగద చరిత్ర మొ.వి అందులో కొన్ని" (శ్రీహరి, రవ్వా(సంపా.). 2016: 26) అన్న సుంకిరెడ్డి నారాయణరెడ్డి మాటలు ఆనాటి కాలపు తెలంగాణ వస్తువును తెలియజేస్తున్నాయి. 18, 19 శతాబ్దాల్లో హైదరాబాద్ రాజ్యంలోని గద్వాల, వనపర్తి, జటప్రోలు, పాల్వంచ, అమరచింత మొదలైన సంస్థానాల్లో సాహిత్య పోషణ, సృజన హితోధికంగా సాగింది.

"బ్రిటిష్ ఆంధ్రలో వచ్చిన సాహిత్య ధోరణులు, పుస్తకాల సంఖ్య, కవుల సంఖ్య చూస్తే చాలు, తెలంగాణాకు బ్రిటిష్ ఆంధ్రకూ కలిపి ఒకే సాహిత్య చరిత్ర రాయడం కుదరదని అవగతమవుతుంది. కేవలం పరిణామం ఒక్కటే కాదు, ఈ ధోరణులేవీ తెలంగాణా సాహిత్యంలో వ్యక్తం కాలేదు. తెలంగాణా బ్రిటిష్ వారి ప్రత్యక్షపాలనలో లేనందువల్ల బ్రిటిష్ వ్యతిరేక ప్రేరణలేవీ తెలంగాణా సాహిత్యరంగానికి లేవు. అలాగే, విద్యా విధానంలో కూడా రెండు ప్రాంతాలకూ భేదం ఉన్నందువల్ల, ఇంగ్లీషు సాహిత్యం కానీ, పాశ్చాత్య కళా సాహిత్య ధోరణులు కానీ తెలంగాణాలో ప్రతిధ్వనించలేదు" (శ్రీనివాస్, కె. 2015: 262). రెండు ప్రాంతాలమధ్యనున్న పరిపాలకుల భేదం, విద్యా విధానం, సామాజిక పరిస్థితులవల్ల తెలంగాణ సాహిత్యాన్ని ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం ఉంది. ఆధునిక కాలంలో వచ్చిన భావ కవిత్వం ఎక్కువగా ఇక్కడ లేదు. ఎందుకంటే నిజాం కాలంలో తెలుగు ఆదరణలేని కారణంగా తెలుగు భాషాభివృద్ధికై ప్రయత్నాలు జరుగుతున్న కాలం. ఆనాటి ప్రజల వాస్తవిక జీవితం గురించి, తెలుగు భాష ప్రాధాన్యత గురించి కవిత్వం వచ్చింది. తెలుగు పాఠశాలలు పెరగడం, ఆంధ్రజన సంఘం ఏర్పాటు, కొన్ని పత్రికల ఏర్పాటు ఇంచుమించు ఒకేకాలంలో జరగడంతో 1920 తర్వాత తెలంగాణా వికాసోద్యమం విస్తృతమైంది.

తెలంగాణలో వచన కవిత్వం 1948 మొదలైంది. సీమాంధ్రప్రాంతంలో వచన కవిత వచ్చి దాని గురించి విస్తృతమైన చర్చలు జరుగుతున్న కాలంలో తెలంగాణలో వచన కవితను తీసుకోవాలా? వద్దా? అన్న సంశయస్థితి కనిపిస్తుంది. 1948లో దాశరథి గారి పునర్నవం నుండి 1960 జగన్నాథం గారి సాగర సంగీతం దాకా వచన కవిత్వానిది రూపాన్వేషణ దశ అయితే, రూపాన్వేషణతోపాటు దృక్పథాన్వేషణ కూడా సమంగా సాగి 1970ల వరకు స్థిరపడింది.

నిజాం, దొరలు, దేశ్‌ముఖ్‌లు మొదలైన రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా వచ్చిన ఉద్యమ సాహిత్యంలో ఆనాటి ప్రజల కష్టాలు, నిజాం, దొరల, దేశ్‌ముఖ్‌ల అరాచకాలు, దౌర్జన్యాలు మొదలైనవి కవితా వస్తువులు. ఆ తర్వాత తెలంగాణ, సీమాంధ్ర కలిసి ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను సమర్థిస్తూ, వ్యతిరేకిస్తూ కవిత్వం వచ్చింది. 1965 నుండి 1969 మధ్య దిగంబర కవిత్వం వచ్చింది. దిగంబరకవుల్లో నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, చెరబండరాజు ముగ్గురు తెలంగాణకి చెందినవాళ్ళు. ఆ తర్వాత 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ నాటినుండే సీమాంధ్ర ప్రాంత నాయకులు పదవులు,

నీళ్ళు, నిధులు, ఉద్యోగాలు మొదలైన విషయాల్లో చేసిన వివక్షను, దోపిడిని, అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ వచ్చినా ఆ బాధ రగులుతూ రగులుతూ 1969లో ప్రత్యేక తెలంగాణోద్యమానికి దారి తీసింది. పై అంశాలే ఈ కాలపు కవిత్వంలో వస్తువులయ్యాయి. 1969 నుంచి 1980ల వరకు విప్లవ కవిత్వ సామాన్య ప్రజల కష్టాల్ని, బాధల్ని, దొరల, దేశ్‌ముఖ్‌ల దుర్మార్గాలను తెలియపరిచి పోరుబాట పట్టించింది.

"1980 నాటికి తెలంగాణా సమాజంలో పోరాటాలున్నాయి, లేదా పోరాటానికి సమాయత్తం అవుతూ ఉంది. సామాజిక ఉద్యమం బలహీనంగా ఉందనిగానీ, బలంగా ఉందనిగానీ చెప్పలేని స్థితి అది. ఈ స్థితిలో 1970ల నాటికి కొత్తగా కవిత్వం రాయటం మొదలు పెట్టిన కవుల్ని విరసం ఎంతో బలంగానో ఆకర్షించింది. 1980ల నాటికి ఈ పరిస్థితి తారుమారైంది. కొత్తతరంలో స్వల్పసంఖ్యలోనే కవులు విరసం పట్ల ఆకర్షితులయ్యారు. 1980-89ల మధ్య ఉత్తర తెలంగాణాలో జరిగే అనేక సంఘటనలు కవితా వస్తువులయ్యాయి. సిరిసిల్ల, జగిత్యాలపల్లె, ఇంద్రవెల్లి వీటి ప్రభావాల్లోంచి పుట్టిన కవులు కూడా కనిపిస్తారు. మొత్తం మీద విరసం తెలంగాణాలో తన ప్రాబల్యాన్ని అంతగా చూపలేకపోవటం 1980ల తర్వాత (అల్లం నారాయణ – జగిత్యాలపల్లె) జరిగింది" (సీతారాం. 2007: 43).

"అయితే ఆంధ్ర అభ్యుదయ కవిత్వానికి, తెలంగాణ అభ్యుదయ కవిత్వానికి ఉన్న తేడాని ఇక్కడ విశ్లేషించుకోవాలి. పెట్టుబడిదారి వ్యవస్థ ఏర్పడిన పాశ్చాత్య దేశాల్లో వచ్చిన ప్రోగ్రెసివ్ రైటర్స్ ప్రభావం వలనా, రష్యా మొదలైన దేశాల్లో వచ్చిన పరిణామాల వలనా, మార్క్స్ మొదలైన తత్త్వవేత్తల ప్రభావం వలన ఆంధ్ర అభ్యుదయ కవిత్వం ఆవిర్భవించింది. కాబట్టి, ఆంధ్ర అభ్యుదయ కవిత్వం ఆంధ్రదేశ సామాజిక పరిణామ ఫలితంగా వచ్చింది కాదు. అందుకు భిన్నంగా తెలంగాణ అభ్యుదయ కవిత్వం తెలంగాణ ప్రాంత సామాజిక పరిణామ సహజ ఫలితంగా వచ్చింది (రూపం రీత్యా కూడా తెలంగాణా అభ్యుదయ కవిత్వం తెలంగాణ కవిత్వ పరిణామం ఫలితంగా పద్యరూపంలో, పాట రూపంలో వచ్చింది)" (ప్రతాపరెడ్డి, కాసుల (సంపా.). 2013: 110) అన్న సుంకిరెడ్డి నారాయణరెడ్డి మాటలవల్ల సీమాంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో వచ్చిన అభ్యుదయ కవిత్వ సామాజిక నేపథ్యం తెలుస్తుంది.

1980 తర్వాత ఉద్యమాలు, రాజ్యహింస, శిథిల వ్యవస్థ, గ్రామాలకు, పట్టణాలకు మధ్య పెరుగుతున్న దూరం వస్తువులుగా కనిపిస్తే 1990ల నుంచి ప్రపంచీకరణవల్ల

ధ్వంసమైన ప్రతి విషయం కవిత్వంలో నమోదైంది. అలాగే కొన్ని కారణాలవల్ల ఆగిపోయిన తొలిదశ తెలంగాణోద్యమం మళ్ళీ 1996 నుంచి ఆరంభమై 2014 తెలంగాణ రాష్ట్రావిర్భావందాకా కొనసాగింది. ఈ కాలపు కవిత్వంలో తొలిదశ తెలంగాణోద్యమ కాలపు వస్తువులతోపాటు తెలంగాణ ప్రాంత చరిత్ర, సంస్కృతి, గొప్పతనాలు చెప్పడం, తెలంగాణ భాష ఔన్నత్యాన్ని వివరించడం మొదలైన వస్తువులు కనిపిస్తాయి. 2014 నుంచి వచ్చిన కవిత్వంలో విషాదం, ఆనదం, పల్లె మొదలైన ఎన్నో వస్తువులు తెలంగాణ పదాల గుబాళింపును అందించాయి.

### 3.1. కరీంనగర్ జిల్లా ప్రాచీన సాహిత్యం

కరీంనగర్ జిల్లా సాహిత్యం క్రీ.శ. 946లో జినవల్లభుని కురిక్యాల శాసనంతో ఆరంభమైంది. కన్నడ తొలికవి అయిన పంపకవి తమ్ముడే ఈ జినవల్లభుడు. ఈ శాసనంలో లభ్యమైన నాలుగు కందపద్యాలు ఈ జిల్లాకేకాక తెలుగు సాహిత్యానికే మొట్టమొదటి కందపద్యాలు. కరీంనగర్ జిల్లాలో మొదట్లో వచ్చిన సాహిత్యమంతా శాసనాలలోనిదే. సంస్కృత, కన్నడ, తెలుగు శాసనాలు ఈ జిల్లాలో లభ్యమయ్యాయి. వేములవాడ చాళుక్యుల కాలంలో వేసిన కురిక్యాల శాసనంతోపాటు అడవి సోమనపల్లి శాసనం దొరికింది. ఇది 11వ శతాబ్దానికి చెందింది. తర్వాత కళ్యాణి చాళుక్యుల కాలంలో దొరికిన 21 శాసనాల్లో 4 శాసనాలు తెలుగులో ఉన్నాయి. వీటిలో గంగపుర శాసనం, నగునూరు మూడు శాసనాలు గద్యాత్మకాలు. కాకతీయుల కాలంలో నగునూరు, మేడారం, గొడిశాల, కరీంనగర్, హుస్నాబాద్ మొదలైన ప్రాంతాల్లో శాసనాలు దొరికాయి. ఈ శాసనాల్లో ఎవరు వేయించారు, దేనికోసం వేయించారు, రాజుల పేర్లు, వారి బిరుదులు మొదలైన విషయాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి చరిత్రకి, రాజుల వంశావళిని నిర్మించడానికి ఎక్కువగా ఉపయోగపడతాయి.

14వ శతాబ్దం నుంచి కరీంనగర్ జిల్లాలో కావ్యసృష్టి జరిగినట్టు తెలుస్తుంది. 14వ శతాబ్దంలో మడికి సింగన 'సకలనీతి సమ్మతము' అనే కావ్యం రాశాడు. ఈయన రామగిరిని పాలించిన గురిజాల ముప్పభూపతి ఆస్థానకవి. 'సకలనీతి సమ్మతము'తో పాటు 'పద్మపురాణోత్తర ఖండము', 'భాగవత దశమ స్కంధము', 'వాసిష్ట రామాయణము' అనే కావ్యాలు రాశారు. కందన 'నీతి తారావళి', వెలిగందుల నారయ 'భాగవత ఏకదశ ద్వాదశ

స్కంధాలు', చరిగొండ ధర్మన 'చిత్ర భారతము' రాశారు. వీళ్ళంతా 14 నుంచి 16వ శతాబ్దాల మధ్య కనిపించే ముఖ్యమైన కవులు. ఈ కాలంలో వేములవాడ భీమకవి ఉన్నా ఒక్క కావ్యమన్నా దొరకలేదు.

కుతుబ్‌షాహీల కాలంలో తెలుగుకు ఆదరణ లభించినా ఆ తర్వాత వచ్చినా ఆసఫ్‌జాహీల కాలంలో తెలుగుకు స్థానం లేకుండా అయ్యింది. తెలంగాణలో కుతుబ్‌షాహీ సుల్తానుల కాలంలో ఆంధ్రభాషకు కవిత్వానికి ఆదరణ లభించింది. సారంగ తమ్మయ 'వైజయంతీ విలాసము', పొన్నిగంటి తెలగన 'యయాతి చరిత్ర', మల్లారెడ్డి 'షట్చక్రవర్తి చరిత్ర', అద్దంకి గంగాధరకవి 'తపతీసంవరణోపఖ్యానము' ముస్లిముల ప్రభువుల ఆదరణలో వెలువడినవే. కాని తర్వాత వచ్చిన ఆసఫ్‌జాహీల పరిపాలనలో దాదాపు రెండువందల సంవత్సరాలపాటు తెలుగు దేశంలో కోటిమంది ప్రజలకు మాతృభాషలో రచన చేయటానికి వీలు కలుగలేదు. పాఠశాలల్లో ఉర్దూ, అరబీ, ఫారసీ భాషలనే నేర్చుకోవలసి వచ్చింది. తెలుగువారు తమ నేలమీద తామే పరాయివారయ్యారు. గద్వాల, వనపర్తి, అమరచింత మొదలైన సంస్థానాల అధిపతులు తిరుపతి వేకంటకవులు వంటి కొందరి కవులను సత్కరించినా, మొత్తంమీద సాహిత్య జ్యోతి మినుకు మినుకుమంటూ చమురు చాలని దీపంలాగా వెలిగింది. మొత్తం తెలంగాణలో ఈ రెండువందల సంవత్సరాలు తెలుగు సాహిత్యానికి చీకటికాలం. కరీంనగర్ జిల్లాలో కూడా ఈ రెండువందల సంవత్సరాల్లో అంతగా కావ్య సృష్టి జరగలేదు. 'త్రిశతి(నరహరి, నరసింహ, నృకేసరి)','ధర్మపురి రామాయణం' ( ఇదే ఈ జిల్లా మొదటి యక్షగానం) రాసిన శేషప్ప, 'శివపురాణం', 'మంథెన రామాయణము' రాసిన ముద్దు బాలంభట్టు మొదలైనవారు ఈ కాలంలో చెప్పుకోదగ్గవారు. ఈ కాలంలో సోమనాథుని 'వసుచరిత్ర వాఖ్య' వచ్చింది. ఈ జిల్లా తొలి వచన గ్రంథం ఇది.

19వ శతాబ్దంలో ఎక్కువగా సంస్కృత కావ్యాలు, మధుర కవితలు, యక్షగానాలు వచ్చాయి. "ఈ కాలంలో ఇంచుమించు ఇరువది కవుల పేర్లు ఈ జిల్లాలో లెక్కకు చిక్కాయి. వారిలో అయిదుగురు సంస్కృత కవులే. పదిమందివరకు యక్షగాన, మధురకవిత వెలయించినవారు. పద్యకవులు కేవలం అయిదుగురు. అందులో ముగ్గురు శతక కవులు. కావ్య నిర్మాతలు ఇద్దరే. ఈ ఇరువురి కావ్యాలు అలభ్యాలు. పేర్లు మాత్రం వినవస్తున్నవి" (మలయశ్రీ. 1997: 108).

1950 దాకా పద్యసాహిత్యమే వచ్చింది. ఈ సాహిత్యంలో కావ్యాలు, యక్షగానాలు, స్తుతులు, కీర్తనలు కనిపిస్తాయి. వీటిల్లో కొంత సమాజానికి సంబంధించిన వస్తువు కనిపించినా ఎక్కువ భక్తికి సంబంధించిన వర్ణనలు, ఊహలే కనిపిస్తాయి.

## ౩.౨. కరీంనగర్ జిల్లా ఆధునిక కవిత్వం – వస్తు పరిణామం

19వ శతాబ్దపు పూర్వభాగంలో తెలుగునాట ఆధునికతకు బీజాలు పడ్డాయి. “తాత్త్వికంగా, సామాజికంగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వభావన, రాజకీయపరంగా ప్రజాస్వామిక భావన, ఆర్థికపరంగా పారిశ్రామికీకరణ, సాంప్రదాయిక విద్యావిధానం స్థానంలో ఆధునిక విజ్ఞానశాస్త్ర విద్యా బోధన, హేతువాదం, పునరుజ్జీవనోద్యమం, స్వేచ్ఛా సిద్ధాంత ప్రాతిపదికన పత్రికలు, గ్రంథలయాల వంటి ప్రసార మాధ్యమాల ఆవిర్భావం, సమానత్వ సిద్ధాంత ప్రాతిపదికన స్త్రీల హక్కులు, స్త్రీవిద్య, వివిధ కులాల సామాజిక ఉద్యమాలు, సంస్కరణోద్యమాలు, ఆధునిక న్యాయ విధానం, జాతీయవాదం మొదలయినవి ఆధునికతకు ముఖ్య లక్షణాలు” (శ్రీహరి, రవ్వా(సంపా.). 2016: 29). ఈ భావజాలాలన్ని తెలుగునాట ప్రవేశించి కొత్త శకానికి ఆరంభం పలికాయి.

తెలుగు సాహిత్యంలో గురజాడగారి ‘ముత్యాల సరాలు’ ఆధునిక రచనగా చెప్తారు. ఈ రచనలో భావవ్యక్తీకరణ, అలంకారం, ఇతివృత్తం అన్నీ ఆధునికమైనవే అయినా మాత్రల నియమం, పాదాల నియమం ఉండడంవల్ల రూపపరంగా ఆధునికం కాలేదు. Free verse ప్రభావంతో స్వేచ్ఛా కవిత, వచన కవితగా పిలువబడే కవితా రూపం శిష్ట్లా ఉమామహేశ్వరరావు గారి ‘నవమి చిలుక’తో తెలుగు సాహిత్యంలోకి వచ్చింది. కాని తెలంగాణలో 1948లో ఆధునిక కవిత్వం వచ్చింది. కారణం తెలంగాణేతర తెలుగు ప్రాంతాలు తెలంగాణా ప్రాంతంకంటే ముందుగానే సంస్కరణా ఫలితాలు అనుభవించడం, ఆధునిక ప్రపంచపు పోకడలను అవగాహన చేసుకోడానికి వెసులుబాటు ఉండడం, భారతదేశం వలస పాలనలో ఉన్నాయి. గుడ్డిలోమెల్లగా వలసపాలకుల అభివృద్ధిలో భాగం కావడం మొదలైనవి ఇతర ప్రాంతాలకు అందివచ్చిన అవకాశమే. తెలంగాణా ప్రాంతం విషయానికొస్తే హైదరాబాద్ రాష్ట్రం ఫ్యూడల్ భావనల నుండి, నిజాం పాలన నుండి అంత త్వరగా బయటపడలేదు.

నిజాం నిరంకుశ పాలనలో దౌర్భాగ్యమైన, దీనమైన జీవితాన్ని అనుభవించింది తెలంగాణ ప్రాంతం. ఆంధ్ర ప్రాంతంలో 1930లో ఆధునిక వచన కవిత వచ్చేనాటికి తెలంగాణ ఇంకా ముస్లిం పాలనలో ఉంది. ఈ ముస్లిం కాలంలో తెలుగుకు ప్రాధాన్యత లేని సమయంలో మాతృభాష ప్రాధాన్యతకై తెలంగాణ తెలుగువాళ్ళంతా ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. "తెలంగాణలో వచన కవిత్వం ఆధునిక ప్రక్రియగా నిలదొక్కునేందుకు ఒక దశాబ్ది కాలం పట్టింది. దీనిని కవిత్వ రూపాన్వేషణ దశగా గుర్తించాలి. 1950 – 60 మధ్యకాలంలో వచ్చిన కవిత్వం అంతా రూపాన్ని వెతుక్కుని, దానిని స్థిరపరచుకోవటం మీదనే దృష్టి నిలిపింది. అయితే ఈ క్రమం 1948 తరువాత మొదలైనట్లు కనిపిస్తుంది. దాశరథి 'పునర్నవం' వెలువడినాక గుర్తించదగిన రూపాన్ని వచన కవిత్వం తీసుకుంది. 'పునర్నవం' నుండి 1965లో జగన్నాథంగారి 'సాగర సంగీతం' వెలువడేదాకా వచన కవిత్వానిది రూపాన్వేషణా దశ అనే చెప్పాలి. దీనినే వచన కవిత్వావిర్భావ వికాస ప్రయత్న దశ అనవచ్చు" (సీతారాం. 2007: 30). దాశరథిగారి 'పునర్నవం' తెలంగాణ ప్రాంతంనుంచి వచ్చిన తొలి వచన కవితారూపం. కరీంనగర్ జిల్లా ఆధునిక కవిత్వం 1965లో డా. సి. నారాయణరెడ్డిగారితో ప్రారంభమైంది.

### 3.2.1. అభ్యుదయ, సామ్యవాద కవిత్వం (1965 – 1990)

కరీంనగర్ నుంచి వెలువడిన చైతన్యం, సారస్వత జ్యోతి, జయంతి, విద్యుల్లత, గౌతమి, సత్యార్థి మొదలైన సాహిత్య పత్రికలు సాహిత్యాభివృద్ధికి హితోధికంగా కృషి చేశాయి.

"సినారె 20, 21 సంవత్సరం వయసులోనే 'పూలపాటలు' గీతికా సంపుటి ప్రచురించబడింది. ఈ సంకలనం ఆరుగురు యువకవుల గీతికా సంపుటి. ఇది 1952లో ప్రచురించబడింది. 'పూలపాటలతో' ప్రారంభమైన ఈతని కవితాయాత్ర ఇంకా కొనసాగుతూనే వున్నది. నిరంతర కవితా సేద్యం చేస్తున్న సినారె జిల్లా ఆధునిక కవిత్వానికి ఆద్యుడిగా భావించవచ్చు" (శివప్రసాద్, సంకేపల్లి. 2004: 59. అముద్రిత సిద్ధాంత గ్రంథం.). కరీంనగర్ జిల్లా ఆధునిక కవిత్వానికి ఆద్యులైన డా. సి. నారాయణరెడ్డిగారి ప్రభావం కరీనగర్ జిల్లాలో అనేక మందిపై పడింది.

"పల్లెటూరు పత్రిక సంగారెడ్డి నుంచి వెలువడింది. ఈ పత్రిక దాదాపు ప్రతి సంచికలో సి. నారాయణరెడ్డి కవిత చోటు చేసుకునేది. చైతన్యకీల, గతం మరచి, కాల సాగరం, ప్రలయలాసిక,నేటి మనిషి అనే కవితలు ఈ పత్రికలో వెలువడ్డవే" (నారాయణరెడ్డి, సి. (ప్ర. సంపా.). 2013: 214). పల్లెటూరు పత్రిక 1951నుంచి రావడం ఆరంభమైంది. 1954, ఫిబ్రవరి సారస్వతజ్యోతి పత్రికలో సి.హెచ్. చంద్రమౌళి, కనపర్తిగారి వచన కవితా పాదాలు కనిపిస్తున్నాయి. కరీంనగర్ జిల్లాలో వచన కవితలు పుస్తకంలో రావడం డా. సి. నారాయణరెడ్డి గారితో ఆరంభమైంది. ఆయన 1965లో 'అక్షరాల గవాక్షాలు' అన్న పుస్తకంలో వచన, మాత్రాఛందస్సు కవితలు, పద్యాలున్నాయి. తెలంగాణలో 1948లో వచన కవిత వస్తే కరీంనగర్‌లో 1965లో వచ్చింది. అంటే 17 సంవత్సరాల తర్వాత కరీంనగర్ జిల్లా ఆధునిక కవిత్వం ఆరంభమైంది.

కరీంనగర్ జిల్లా ఆధునిక కవిత్వారంభం నుండి 1990 వరకు ఈ విభజన చేయడానికి కారణం ఈ మధ్యకాలంలో అభ్యుదయవాదాన్ని, సామ్యవాద దృక్పథాన్ని ఈ మధ్యగల కవిత్వం ప్రతిబింబించింది. తెలంగాణ సాయుధ పోరాటం, ప్రత్యేక తెలంగాణ తొలిదశ ఉద్యమం, బొగ్గుగని కార్మికోద్యమం, జగిత్యాల జంగల్ మహల్ ఉద్యమం, విప్లవోద్యమాలు కరీంనగర్ జిల్లా సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి. ఈ జిల్లానుంచి ఎక్కువ మంది పీడిఎస్‌యూలో పనిచేయడం, మావోయిస్టులుగా మారడం జరిగింది. "1970 తరువాత దేశీయ నక్సల్‌బరీ సంఘటన ప్రభావ ప్రేరణలతో నిర్దిష్టమైన సమూలమైన సామాజిక మార్పుకు జనచైతన్యాలను సిద్ధంచేసే కవిత్వం రావటం మొదలైంది. పల్లె జీవిత పరిణామాలు, కల్లోల జీవిత యదార్థ దృశ్యాలు కవితా శకలాలైనాయి. 1978 సెప్టెంబర్ 9 నాటి జగిత్యాల జైత్రయాత్ర నుండి మొదలుపెట్టి ఇంద్రవెల్లిని చుట్టుముట్టి వరంగల్లు వరకూ అనేకానేక నిర్దిష్ట తెలంగాణా చారిత్రక ఘటనలు కవిత్వంలో రూపు కట్టించబడినాయి" (కాత్యాయనీ విద్మహే. 2013: 30). కరీంనగర్ జిల్లాలో జరిగిన జగిత్యాల జైత్రయాత్రను విజయపథం దిశగా నడిపించేందుకు ఎంతో సాహిత్యం వచ్చింది. దాంట్లో ఎక్కువ భాగం 1990 తర్వాత పాటల, కవిత్వ పుస్తకాలుగా రావడం గమనించదగ్గ విషయం.

'మరణం నా చివరి చరణం కాదు' అని ఎలుగెత్తి చాటిన అలిశెట్టి ప్రభాకర్ ఆంధ్రజ్యోతిలో రన్నింగ్ కామెంట్రీల కవిత్వ 'చురకలు' అంటించాడు. ఆ సమయంలో చాలా ప్రసిద్ధిగాంచాయి. 1976 లో వాటన్నింటిని పుస్తకరూపంలో తీసుకువచ్చారు.

"రోగులంతా శవాలై, ఆసుపత్రులన్నీ శ్మశానాలైతే
కాటి సుంకంకై కాచుక్కూచున్నోళ్లే – డాక్టర్లు"

(తిరుమలరావు, జయధీర్(సంపా.). 2013: 62)

మానవత్వంలోంచి మనీలోకి వైద్యం జారిపోయినప్పుడే ఆసుపత్రులపై, డాక్టర్లపై గౌరవం తగ్గిపోయింది. కార్పో'రేటు' హాస్పిటల్స్‌కి డబ్బులపై ఉన్నంత శ్రద్ధ రోగులపై ఉండకపోవడం శోచనీయం. పై కవిత డాక్టర్లందరి మనసుకు అంటించిన చురకలాగే ఉంది.

"పట్టపగలే చీకటి రాజ్యం చేస్తుంది
మట్టి దీపాలైనా సరే పెట్టండి
దీపంపెట్టేవాడు లేని ఇల్లువలె ఉంది దేశం
తానంతస్తాపంతో దహించి పోతున్నా
చీకటిలో కాంతిని చూపించాలనే
వీధి దీపంలోని త్యాగాన్ని ఊహించి
మనస్సులోని తమస్సును కాల్చడానికి
చిరు దివియనైనా వెలిగించండి"

(చంద్రమౌళి, చొప్పకట్ల. 1971: 21 –22)

అవినీతి, స్వార్థం, ద్వేషం మొదలైన చీకట్లు పట్టపగలే సమాజంలో వ్యాపించడంవల్ల సమాజం అంధకారమైంది. అందుకే ఆ చీకట్లను తరిమికొట్టడానికి నీతి, నిస్వార్థం, ప్రేమ మొదలైన దీపాలను వెలిగించాలి.

"ఒక పసిగుడ్డు కాళ్ళూ చేతులూ తెగ్గోసి
వేళ్ళాడదీసిన దృశ్యం కంటే ఘోరంగా
నడవలేని వృద్ధుడి పొట్టలో కత్తి దింపి
పేగుల్ని బహిర్గత పరిచిన దృశ్యంకన్నా దారుణంగా
పురిటినొప్పులు పడుతున్న ఒక స్త్రీపై
అత్యాచారం జరిపే కామాంధుడి కన్నా వికారంగా
నాకీ దేశపు వర్తమానం
ఇంకా ఘోరంగా, దారుణంగా, వికారంగా కనిపిస్తుంది
డబ్బు దండెత్తి దౌర్జన్యం దండెత్తి వంచన దండెత్తి

మనుషుల్ని నిలువునా కొల్లగొడుతుంది
అణువణువూ కబళిస్తోంది"

(తిరుమలరావు, జయధీర్(సంపా.). 2013: 93)

కవి ఆర్ధ్రహృయుడు. సామాన్య మానవులవైపు నిలిచే వాడు. అందుకే డబ్బు, దౌర్జన్యం, వంచన సామాన్య ప్రజలపై దండెత్తడాన్ని నిరసిస్తున్నాడు, ప్రతిఘటిస్తున్నాడు. కొన్నింటిని చెప్పడానికి మాటలు లేనప్పుడు ఒక్కదాన్ని చెప్పి దానికంటే ఎక్కువగా ఉన్నాయని చెబుతాం. ఇక్కడ కవి అదే పని చేశారు. తనున్న సమాజపు వర్తమానం ఎలా ఉందో చెప్పడానికి మాటలు తెలియక కొన్ని సంఘటనలని తీసుకొని అంతకన్నా ఘోరంగా, దారుణంగ, వికారంగా ఉందని వివరిస్తారు. ఈ పంక్తులు ఇప్పటి వర్తమానానికి కూడా వర్తిస్తాయి.

"విప్లవం తెచ్చే మార్పేమిటి మేధావిపై వేసిన మరో ప్రశ్న ఇది
అక్రమ మార్గమున డబ్బు సంపాదించు
అధమ బేహారులను అణచిపెట్టి
చివరకు విప్లవం సమత తెస్తుంది
మేధావి చెప్పినట్టి తిరుగులేని సత్యాలివి"

(సత్యనారాయణ, వేముల(సంపా.). 1977: 27)

1970 ఫిబ్రవరి 1న విశాఖపట్నంలో జరిగిన శ్రీశ్రీ షష్టిపూర్తినాడు విశాఖ విద్యార్థులు 'రచయితలకు సవాల్' అన్న కరపత్రాన్ని పంచిపెడుతూ, శ్రీకాకుళ ఉద్యమంలో పోరాడి చనిపోయిన వారసత్వాన్ని అందుకోవల్సిన అవసరాన్ని చెబుతూ, మీరు(రచయితలు) పాలకుల పక్షమా? ప్రజల పక్షమా? అన్న ప్రశ్నను లేవదీశారు. దీనికి ఆ సభకు హాజరైన రచయితల్లో స్పందన కలిగి ఇలాంటి వేడి వాతావరణంలో శ్రీశ్రీ అధ్యక్షతన 1970, జులై 4న విప్లవ రచయితల సంఘం ఆవిర్భవించింది. తెలుగు సమాజంపై ఈ విరసం ప్రగాఢమైన ప్రభావాన్ని చూపించగలిగింది. విప్లవ పంథాలో ఎన్నో పాటలు, కవితలు, నవలలు, కథలు మొదలైనవి వచ్చాయి. కరీంనగర్ జిల్లాలో కూడా విప్లవ పోరాట ప్రభావ స్పష్టంగా కనిపిస్తుంది. ఆ ప్రభావంలోంచి ఎంతో సాహిత్య సృజన జరిగింది. పై కవిత కూడా విప్లవాన్ని సమర్థిస్తూ, విప్లవం ఏం చేస్తుందన్నదానికి సమాధానమే.

"అర్ధరాత్రి సూర్యుడుదయిచాడు
అఖిల లోకానికి వెలుగునందించాడు
అందరూ కళ్ళు తెరవండి!
మన చీకటి బ్రతుకుల్ని వెలిగించడం కోసం
చీకటిలో సూర్యుడుదయించాడు
చేతనా కేతనాన్ని ప్రతిష్ఠించాడు
మనల్ని దోచుకు తింటున్న
దళారీ, దగుల్బాజీ వర్గాల
పని పట్టడానికి, మన వీపు తట్టడానికి
అర్ధరాత్రి సూర్యుడుదయించాడు
అందరూ కళ్ళు తెరవండి!"

(వెంకటరాజం, జక్కని. 1977: 1 –2)

విప్లవ సాహిత్యంలో అడవి, కొడవలి, సూర్యుడు, ఎర్రజెండా మొదలైన పదాలు ఎక్కువగా కనిపిస్తాయి. పై కవితలోని సూర్యుడు చైతన్యాని, విప్లవానికి ప్రతీక. అర్ధరాత్రి సూర్యుడుదయించాడంటే విప్లవం పుట్టిందని అర్థం. ఆ విప్లవం చీకటిమయమైన జీవితాల్లో వెలుగును ప్రసరింపజేసేది. సామాన్య, బడుగు, బలహీన వర్గాలను దోచుకునే, హింసించే దళారీ, దగుల్బాజీల పనిపడుతుంది.

"అలా
సమాధిలా
అంగుళం మేరకన్నా
కదలకుండా పడివుంటే ఎలా?
కొన్నాళ్ళు పాటే నీ మీద నానా గడ్డిమొలిచి
నీ ఉనికే నీకు తెలిసి చావదు"

(రవీంద్ర, పి.ఎస్.(సంపా.). 1982: 1)

చైతన్యమే మనిషి ఉనికి. సమాజంలో జరుగుతున్న చెడును చూస్తు చలించకుండా ఉండలేనివాడు కవి. చెడును ధిక్కరిస్తూనే సమాజంలోని మనుషులను చైతన్యవంతం

చేస్తుంటాడు. అందుకే సమాధిలా పడి ఉండక అన్యాయాన్ని ఎదురించడానికి కదులు అని చైతన్య పరుస్తున్నాడు.

"రాత్రులు రాజ్యమేలుతుంటే
ఖాకీ బట్టలు కాపల కాస్తున్నాయ్
ఊరంతా చీకటి
వాడంతా చీకటి
జగమంతా చీకటి.....చీకటి.....చీకటి
చీకటిలో జరగరాని ఘోరాలు జరుగుతున్నయ్
లాకప్ న్యాయానికి చిత్రహింస జరుగుతుంది"

(పిళ్ళే, ఎస్.కె.(సంపా.). 1983: 31)

రాత్రి ఉన్నతవర్గానికి, చీకటి అన్యాయానికి, అక్రమానికి ప్రతీక. అధికారం మాటున జరగరాని అన్యాయాలు, అక్రమాలు జరుగుతుంటాయి. అధికారులకి తోడుగా పోలీసులు ఉండడంతో వాళ్ళని ఆపేవాళ్ళే ఉండరు. అప్పుడు న్యాయం లాకప్ డెత్ అయిపోతుంది. సామాన్య జనానికి జరగాల్సిన న్యాయం జరగకుండా పోతుంది.

"ఇప్పుడు మా వూరి దొరోనికి
గడి వుంది గని
పాడుబడ్డ గుడోలె వుంది
దొరున్నడు గని
దొరతనం లేదు"

(కృష్ణమూర్తి యాదవ్, టి. 1988: 52)

కరీంనగర్ నుంచి మాండలికంలో వచ్చిన తొలి కవితా సంపుటి 'తొక్కుడుబండ'. ఇందులోని కవితలు ఆనాటి సామాజిక పరిస్థితులకు అద్దం పడతాయి. దొర, అతడు చేసే దుర్మార్గపు పనులు, గ్రామంలోని దళితు బహుజనుల కష్టాలు మొదలైనవి ఇందులోని కవితా వస్తువులు. పై కవితలో అణిచివేతల, అన్యాయాల, దుర్మార్గాల చీకటికాలం పోయి స్వేచ్ఛా వెలుగు ప్రసరించిన సందర్భంలోంచి కవి మాట్లాడుతున్నారు. గ్రామ ప్రజలను నానాకష్టాలు పెట్టి హింసించిన దొర గడి పాడైపోయింది. దొరతనం మంటగలిసింది.

"వాడు మహా దుర్బలుడు
మహా బలశాలి ననుకుంటాడు
క్షణం క్షణం వాడిలో భయం
పిల్లిని చూసి పెద్దపులనుకుంటాడు
తన నీడను చూసి తాను జడుసుకుంటాడు
సనాతన సంప్రదాయాల కోసం
అనాది శ్రీనాధులను రక్షించుట కోసం
భూస్వామ్య పాలక వర్గ ప్రయోజనాన్ని కాపాడుట కోసం
సామ్రాజ్యవాద దోపిడి ప్రయోజనాలను నిలుపుట కోసం
శాంతి భద్రతల పేరిట పోలీస్ క్యాంపులను పెడుతున్నాడు
రైతు నడ్డి మీద గొడ్డలి వేటేస్తుంటాడు....
కార్మికుని పొట్టలో క్షుద్బాధ లేపుతాడు...
వాడు ఊరూరు గాలిస్తున్నాడు
దొరికినోల్లనల్లా కాల్చేస్తున్నాడు"

(రెసారె. 1988: 30 – 31)

ఆర్. సహదేవరెడ్డి (రెసారె) పాతికేళ్ళ వయసులో సిరిసిల్లా ప్రాంతంలో పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించారు. విద్యార్థి నాయకుడిగా, కామ్రేడ్‌గా ప్రజల పక్షాన పోరాడుతూ, ప్రజల విముక్తికై రచనలు చేసినవారు. పై కవితలోని 'వాడు' అంటే సామాన్య ప్రజానికాన్ని హింసించే వాడు, దోచుకునేవాడు, చంపేసేవాడు. సనాతన సాంప్రదాయాలను కాపాడడం కోసం, అనాది శ్రీనాథుల రక్షణకోసం, సామ్రాజ్యవాద దోపిడి ప్రయోజనాల్ని నిలపడం కోసం ప్రజల్ని చంపేసేవాడు.

### 3.2.2. విప్లవ కవిత్వం (1991 – 2000)

కరీంనగర్ జిల్లా పోరాటాల ప్రభావం దాదాపు 2000 సంవత్సర ఆరభం వరకు కొనసాగింది. తద్వారా ఆరంభంలో కరీంనగర్ జిల్లాలో విప్లవ కవిత్వం ఎక్కువగా వచ్చింది.

"మీ తలలన్నీ నా ఉక్కుపాదం కింద చీమలని విర్రవీగావు
మా నెత్తుటి లిపి రాస్తున్న వాళ్ల మీద కుట్ర కేసు బనాయించావు

మా రక్తంలో చలనం మొదలయింది
మా తలల అస్తిత్వం కోసం పోరాడుతున్న వాళ్లను ఎన్‌కౌంటర్ చేశావు
ఇప్పుడు నీ మీదకు గురిపెట్టిన తుపాకిలో
బుల్లెట్స్ అయ్యారు అమరవీరులు"

(ఎం.ఎస్.ఆర్. 1992: 7)

ఎం.ఎస్. శ్రీనివాసరావు కరుణాకర్, ప్రభాకర్ పేర్లతో విప్లవోద్యమంలో పనిచేశారు. సమాజంలోని చెడును చూసి తట్టుకోలేని గుణమే తిరుగుబాటుతనానికి పునాది. అది ఆ కాలంలో ఎక్కువ. అందుకే తెలంగాణ అంతటా తిరుగుబాటు వచ్చింది. ముఖ్యంగా కరీంనగర్ జిల్లాలో తిరుగుబాటు ఎక్కువగా కనిపిస్తుంది.

"పూలమొగ్గల్లో అగ్నిని చూస్తున్నాను
కొమ్మకొమ్మల్లో ఆకుల కత్తులు నూరుతున్నాను
వ్రేళ్ల నుండి ఉద్యమాన్ని వెలికి తీసుకొస్తాను
వెలుగుపూలకోసం అణగారిన జనాన్ని పోరాటానికి సన్నద్ధం చేసి
విజయ తిలకం దిద్దుతున్నాను
విప్లవాగ్ని సుహారాలు వేస్తున్నాను"

(మలయశ్రీ. 1997: 497)

పై కవిత పీడిత జనచైతన్యానికై వెలువరించిన జాగిరి శ్రీనివాస్ గారి 'క్రాంతిపూలు' కవితా సంపుటిలోనిది. కవి తను జీవిస్తున్న కాలంనాటి సామాజిక పరిస్థితుల్ని తప్పించుకోలేడు. సమాజంలో అల్లకల్లోలం జరుగుతుంటే నిశ్శబ్దంగా ఉండలేడు. ఆనాటి సామాజిక ఉద్యమాలు కవిని చుట్టుముట్టి ప్రశాంతంగా ఉండనివ్వవు. ఆ అలజడిలోంచి అక్షరం పురుడు పోసుకుంటుంది. పై కవిత ఆనాటి సమాజంలో జరిగే ఉద్యమానికి నిదర్శనంగా నిలుస్తుంది. అణగారిన, అణిచివేయబడ్డ జనం పక్షాన నిలబడి, కలబడి యుద్ధం చేయడం కవి కర్తవ్యం. అదే చేశారు ఇక్కడ. ప్రజలతో మమేకమై పోరాటం చేస్తూ రచనలు చేయడం ఒక పాయైతే, ఆ ఉద్యమాల్ని చూసి ఉత్తేజితులై రచనలు చేయడం మరో పాయ. కరీంనగర్ జిల్లా 1990 ఆరంభంలో వచ్చిన కవిత్వం ఎక్కువగా మొదటి పాయకి సంబంధించిందే.

"దోపిడి కొండల్ని పిండి చేస్తున్న
పోరాట ప్రజల ఎర్రెర్రని గుండెల్ని చూస్తూ
వర్గ కసిని మరింత పెంచుకొని విజృంభించు
తటస్థ మార్గానికి తిలోదకాలిచ్చి
ఊగిసలాటలను ఉలుకుపలుకూ లేకుండా అంతంచేసి
ధర్మ సందేహాల్ని సక్రమంగా నివృత్తి చేసి కొని
వర్గ పోరాటాన్ని విశాల ప్రాంతాలకు విస్తరింపచేయ్"

(నూతన్. 1993: 104)

నూతన్ కలం పేరుతో రచనలు చేసిన వేణు విప్లవ కార్యకర్త. సిరిసిల్లా భూస్వామ్య వ్యతిరేక పోరాటంతో స్పందించిన వేణు 1980 నాటికి కరీంనగర్ జిల్లా సి.పి.ఎం.(ఎల్.) సభ్యుడిగా ఎదిగారు. రెండు, మూడుసార్లు జైలుకు కూడా వెళ్ళారు. 1992, జూన్ 25న మంచిర్యాలలో ఓ కార్మికుని ఇంట్లో నిద్రిస్తుండగా పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్లో మరణించారు. ఇలా విప్లవపథంలో ఉండి విప్లవ రచనలు చేసి వేణన్నగా మారారు.

"దళిత భారతిలో
కాటికిపోయే కులాలన్నీ
కుస్తీలు పడుతున్నాయి
కూటికి లేని శ్రామికుని శక్తి
ఆధునికం వైపు తీసుకుపోతుంటే
కోటికి పడగలెత్తేవాడు కోతలెన్నో కూస్తుంటే
జాతి జీవనాడులన్నీ కలాలు పట్టి కులాల కుస్తీ పోరాటంలో
పొలాలు దాటి తారు రోడ్డెక్కినయి
జాతిగా జాతులుగా అణచబడిన అణగబడిన
అనాద జీవన రేఖలయి ప్రస్నిస్తు, శోధిస్తు,
రోదిస్తున్నవారిని చూచి ఒక్కటిగా చేస్తుంటే
సమానమని గుళ్లో కాలుమోపనీయనివాడు
ముందు వరుసలోకి వస్తుండు, కూనిరాగం తీస్తుండు"

(గంగాధర్, ఆకుల. 1994: 1)

తెలుగు సాహిత్యంలో గొప్పగా చెప్పుకునే దళితవాద సాహిత్యం కరీంనగర్‌లో ఎక్కువగా కనిపించదు. ఆకుల గంగాధర్, గుండెడప్పు కనకయ్య, పొన్నాల బాలయ్య మొదలైనవాళ్ళు ఎక్కువగా దళిత కవిత్వం రాస్తే మిగిలినవాళ్ళంత అప్పుడప్పుడు దళిత దృక్పథంతో కవితలు రాశారు. “1970ల నాటికి భారతీయ సమాజంలో వర్గ – కుల సంబంధాల విషయమై చర్చ మొదలైంది. అదిక్కడ 1990లకు స్పష్టరూపాన్ని తీసుకుంది. కులవ్యతిరేక చైతన్యంతో మొదలై ‘కుల నిర్మూలన’ నినాదం ప్రక్కకునెట్టబడి కులాధిపత్యం దిశగా సాగుతున్న సామాజిక ఉద్యమం స్వాతంత్ర్యానంతర రాజకీయాల అవలక్షణాలన్నిటినీ తనలో కలుపుకొని దళితవాదం ముందుకొచ్చింది. సమాజంలోని క్రింది కులాల అణిచివేతకు, అవమానాలకు, అధీనతకు పరిష్కారాలు ఏ సిద్ధాంతమూ వెతకలేదనే ప్రతిపాదనతో, ఒకవైపు బ్రాహ్మణీయ ఆధిపత్య భావజాలంతో తలపడుతూ, మరోవైపు వామపక్ష సిద్ధాంతాలను వ్యతిరేకిస్తూ దళిత ప్రజాస్వామిక విప్లవంగా, పరిణమించనున్న దళిత కవిత్వం వచ్చింది” (సీతారాం. 2007: 48).

### 3.2.3. ప్రపంచీకరణ కవిత్వం (1991 – 2017)

1991 జులై 1న భారత ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాల ప్రకటనతో ప్రపంచీకరణ మొదలైంది. “సరిగ్గా ఇరవై సంవత్సరాల కింద 1991 జూలై 1న భారత ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాల ప్రకటన ప్రారంభించి అతివేగంగా అనేక చర్యలు తీసుకుంది. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ(లిబరలైజేషన్ – ప్రైవేటైజేషన్ – గ్లోబలైజేషన్) పేరుతో ప్రఖ్యాతమైన ఈ రాజకీయార్థిక విధానాలను పి.వి. నరసింహారావు ప్రధానమంత్రిగా డా. మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా, పి చిదంబరం వాణిజ్యమంత్రిగా ఉండిన ప్రభుత్వం అధికారం వారంలోపే ప్రకటించడం మొదలుపెట్టింది” (వేణుగోపాల్, ఎన్. 2011: 9). దీనికి ముందునుంచే ప్రపంచీకరణ విధానం ఒకటి రెండు సంఘటనల్లో మనకు కనిపిస్తుంది. 1981లో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ అప్పుకోసం సంస్కరణలు అమలు చేయడం, 1985లో దిగుమతుల సరళీకరణ విధానం ప్రకటించడం 1991 చర్యకు ముందు ప్రయత్నంగా చెప్పవచ్చు.

ఇలా మొదలైన ప్రపంచీకరణ అన్ని రంగాలను తీవ్రస్థాయిలో ప్రభావితం చేసింది, చేస్తోంది. ఆనందంగా జీవనం సాగించే పల్లె జీవితం పెను మార్పులకు లోనైంది. “1990

నుండి భారత రాజకీయాల్లో మార్పు వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందని భావించి గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్(ఎల్.పి.జి.) ముసుగుతో అగ్రదేశాల సామ్రాజ్యవాదానికి అనుగుణంగా మన పాలకులు నిర్ణయాలు తీసుకొని గ్రామీణ వృత్తులను ధ్వంసం చేసారు. వ్యవసాయాన్ని నిరాధరించారు. చేయడానికి పని దొరకక ఉన్న ఊరును విడిచి వివిధ ప్రాంతాల్లోకి ముఖ్యంగా పట్టణాల్లోకి వలస వెళ్ళారు. తద్వారా  మానవ సంబంధాలు తెగిపోయి జీవితాలు సంక్షోభానికి గురైయాయి. మనీమయ ప్రపంచం బుసలు కొట్టింది. డబ్బున్నోడిదే సమాజం అన్నంత ధోరణి ప్రబలింది. ఈ ధోరణిని తెలంగాణా కవి నిరసిస్తూ కవిత్వం రాసాడు" (నారాయణరెడ్డి, సి.(ప్ర.సంపా.). 2013: 79).

నూతన ఆర్థిక విధానాలు తెలుగు ప్రాంతాల్లో అమలయ్యాక వాటివల్ల అనేక నష్టాలు సంభవించాయి. అభివృద్ధి అబివృద్ధి అని చెప్పుకున్నా వృత్తులు, కుటీర పరిశ్రమలు ఇలా చాలా రంగాలపై ప్రపంచీకరణ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఆప్యాయతలకు ఆనవాళ్ళుగా ఉన్న అనుబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారడం, మనుషులకన్నా మనీకే ప్రాధాన్యత ఇవ్వడం, ఇప్పుడున్న విషాదకరమైన పరిస్థితుల్లో ఒకప్పటి పరిస్థితులను తలుచుకోవడం, కొత్త వస్తుసంస్కృతిని తెలియజేయడం, వృత్తుల విధ్వంసాన్ని చెప్పి ప్రపంచీకరణను వ్యతిరేకించడం వంటి చాలా అంశాలు ఈ కాలంలో కవితా వస్తువులుగా మారాయి.

"సమస్త విలువలు నశిస్తాయి
పెట్టుబడి అన్ని రంగాలని
ఇనుప కౌగిలిలోకి
లాక్కొని బుజ్జగిస్తున్నపుడు
సమస్త విలువలు నశించిపోతాయి
ఈ ఇంటికీ ఆ ఇంటికీ మధ్య
ఈ మనసుకీ ఆ మనసుకీ మధ్య
కష్టజీవికీ కష్టజీవికీ మధ్య
నీకూ నాకూ
నీలాకాశంలాంటి సరిహద్దు మధ్య

డబ్బు అడ్డుగోడై లేస్తుంది
మనస్పర్థలు ద్వేషాలు
మనల్ని వేరుచేస్తాయి"

(జగన్నాథం, జూకంటి. 2013: 17).

ప్రపంచీకరణ గురించి విస్తృతమైన చర్చలు జరుగుతున్న సమయంలోనే 'పాతాళ గరిగె(1993), ఇండియా ప్రైవేట్ లిమిటెడ్(1996)' అని ప్రపంచీకరణ కవిత్వం రాసినవారు జూకంటి జగన్నాథం. పై కవిత 'పాతాళ గరిగె' లోనిది. ఇది 1987 జనవరి, 15న రాసినట్టు కవిత కింద ఇచ్చారు. అప్పుడే కవి ప్రపంచీకరణవల్ల కలిగే నష్టాన్ని ఊహించారు. ఈయన కవిత్వం ఎక్కువగా ప్రపంచీకరణకు సంబంధించింది. "జూకంటి ప్రపంచీకరణ క్రమంలో పాలన రాజ్యంపై అనేకమైన ప్రశ్నలు సంధిస్తారు. ఇది రాజ్యపు ఉనికిని ప్రశ్నించడం, వివిధ రకాల జీవన పరిధులపై ప్రశ్నించడం ఏదైనా కావచ్చు. ఉరామరికగా చెప్పుకుంటే రాజ్యాన్ని గురించి, దాని ఉనికి గురించి మాట్లాడటం, అందులో భాగంగా యాంత్రికంగా మారిన ఎలక్షన్ల పరిధిని గూర్చి మాట్లాడటం, సాయుధ పోరాటాల గురించి మాట్లాడటం ఇవి కొంత వైప్లవికానువృత్తి కలిగినవి. జీవితంలోకి టి.వి. రావడం, జీవితం మారడం, రోడ్డు వలన పల్లె ఉనికి చెడటం, ఒంటరితనం, కలగోలుతనం లేకపోవడం, వలసలు, ఇవన్నింటినీ జూకంటి సామాజిక కోణంలో ప్రపంచీకరణలో భాగంగా చూస్తాడు" (నారాయణశర్మ, ఎం. 2016: 19 – 20). ప్రపంచీకరణవల్ల ప్రభావంకాబడ్డ అన్నీ అంశాల్ని సామాజిక కోణంలో జూకంటి కవిత్వాన్ని రాసారు, రాస్తున్నారు.

"కన్నా! నువ్వు నా తడిగుండెల మీద
అర్థాంతరంగా వదిలి వెళ్ళిన నాగలి
తడారిన నా బీడు ఒంటిమీద అలాగే పడుంది.....
నువ్వు పదమెత్తుకుని మోటకొట్టిన బావిమీద
ఏతాముకొయ్యా, రేకుబొక్కెనా,
నీ కోసం బిక్కు బిక్కుమంటూ చూస్తున్నాయి
బీడులు బీటలైన ఈ గుండెమీద
ఇలా ఒక్కొక్క జ్ఞాపకాల పర్వతాన్ని మోసేదెలారా చిన్నా !

పచ్చిగడ్డి లేకుండా, పరిగె లేకుండా
ఎదుగూ బొదుగూ లేని ఉద్ధారకం చేస్తూ
నా నిలువెల్లా బూడిద కుప్పల మయం చేసి
నన్ను ఎందుకూ పనికిరాని గొడ్డుమోతుని చేసి
ఎందుకురా కాలువల్తవ్వి కవ్విస్తారు
ఎవుసాన్ని ఎటామటం చేసి
పారకం పెట్టి ఎందుకురా పరిహసిస్తారు"
(శివకుమార్, వఝల. 1998: 41)

ఒక పక్క నీళ్లు లేకపోవడం, ఇంకోపక్క రైతుకు గిట్టుబాటు ధర రాకపోవడం, మరోపక్క రియలెస్టేట్ వల్ల, ఫ్యాక్టరీ మొదలైనవాటి స్థాపనవల్ల వ్యవసాయ భూములు తగ్గి చాలా మట్టుకు వ్యవసాయం ఆగిపోయింది. పై కవితలో భూమి తన కొడుకులాంటి వాడైన రైతుకోసం బాధపడడం కనిపిస్తుంది. మానవ గుణారోపణగా పై కవితని నిర్మించారు. రైతులకు భూమన్నా, పశువులన్నా ప్రాణం. ఎందుకంటే అవే వాళ్ళ జీవనాధారం. రైతుల శ్రమే సమాజ జీవనం. కాని ఆ రైతు ప్రాణంలాంటి వాటిని వదిలి వలస ఎందుకుపోయాడో ఆలోచించాల్సిన అవసరం ఉంది.

"నాడుల కదలికలూ ఇ.సి.జి. సంకేతాలూ
ఎకో, డోప్లర్ సంకీర్ణ ధ్వనులూ
సాఫ్ట్‌వేర్ నిర్ణయాన్ని ఆశ్రయిస్తాయి
వైద్యం కంప్యూటర్ల ఆధీనంలో
వ్యక్తిత్వాన్ని కోల్పోవడం మొదలయ్యాక
రోగి, రోగి మానసిక స్థితి
అప్రస్తుతాంశాలౌతాయి
ఆదర్శ చికిత్సారీతులు
లామినేటేడ్ కోటింగులతో గోడలమీద
కీర్తిశేషమౌతాయి"
(శివకుమార్, వఝల. 1999: 24 – 25)

నీళ్ళు, నిధులు, భూమి మొదలైన వాటితోపాటు ప్రాణం కూడా వ్యాపారంగా మారడం ప్రపంచీకరణలో కనిపిస్తుంది. ఆసుపత్రులు డబ్బు సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు రోగులకు, వారి ఆవేదనలకు, రోగి బంధువుల తపనలకు విలువ ఇవ్వవు. ఇలాంటి కార్పోరేటు ఆసుపత్రుల గురించే పై కవిత. ఒకప్పుడు వైద్యమంటే ఉన్నతమైందిగా, వైద్యుడంటే దేవుడిగా చూసేవారు. కాని కొన్ని ఆసుపత్రుల డబ్బు కాంక్షవల్ల వైద్యవృత్తికి, వైద్యుడికి చెడ్డపేరు వస్తోంది. ఒక వ్యక్తి ఆసుపత్రికెళ్తే అతనికి అవసరమైన పరీక్షలతోపాటు అనవసరమైన పరీక్షలు చేసి డబ్బు వసూలు చేస్తుంటాయి కొన్ని ఆసుపత్రులు.

"ఒక్కోనాడు చెరువు ఒక్కోరకంలా అగుపించేది
బొడ్డెమ్మ ఆటపాటల్లో చెరువు
కన్నెపిల్ల ఓణీ ధరించేది
బతుకమ్మ ఆటపాటల్లో
పెద్ద ముత్తయిదువలా
నిండుగా అలంకరిచుకొని
అలరారేది"

(శివప్రసాద్, సంకేపల్లి. 2002: 54 – 55)

వర్తమాన వేదికపై నుంచి గతాన్ని తలుకోవడం 'నోస్టాల్జియా' అంటారు. ప్రపంచీకరణవల్ల అనేక మార్పులువచ్చి ఆనాటికీ, ఈనాటికీ ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. ఇప్పటికంటే అప్పటి స్థితే బాగుండే అని చెప్పడానికి కవి తను ఆనందంగా గడిపిన జీవితాన్ని తలుచుకోవడం ఈ ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వంలో కనిపిస్తుంది. ఇక్కడ కూడా అంతకు ముందున్న చెరువు ప్రపంచీకరణ వచ్చాకా ఎలా అయ్యిందో ఈ కవితలో చెప్పారు కవి. చిన్నప్పటినుండి ఎన్నో విషయాల జ్ఞాపకంగా ఉన్న చెరువు ఇప్పుడు ముసలిరోగిలా మారడాన్ని కవి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. "వర్తమాన విధ్వంసాన్ని చూస్తున్నప్పుడు గతంలోని మేలిమిని తలపోయకుండా ఉండలేరు. అందుకే ఒకప్పుడు జీవితం, మానవ సంబంధాలు ఎలా ఉండేవో పలవరిస్తుంటారు. ఈ పలవరింత యాదృచ్ఛికం కాదు. సర్వ సంబంధాలు మానవీయ స్పర్శని కోల్పోతున్నప్పుడు, ఒకప్పటి పచ్చదనం, ఆర్ద్రమైన రోజులు తలుపుకు వస్తాయి" (విజయ్ కుమార్, కోడూరి. 2010: 7 – 8) అని 'అనంతరం' పుస్తకానికి ముందుమాటలో అన్న గుడిపాటి గారి మాటలు అక్షరసత్యాలు.

"ఎలుగటి నాగలి చెక్కే పెద్దబాడిష అటకెక్కింది
పెద్ద కచ్రం నొగలు చేసే పెద్దేగి కర్రేది
గొర్రు, గుంటుకలు బండీ గీరెలు
వడ్ల మల్లయ్య దగ్గర చేపిచ్చుడే మరిచింద్రు
ట్రాక్టర్లు మిషన్లు ఊరు నిండినయి"

(దేవేందర్, అన్నవరం. 2003: 6)

ఊర్లోకి యంత్రాలు రావడంవల్ల కష్టం తగ్గి సమయం ఆదా అయినా ఎన్నో వృత్తులు, ఎందరో కూలీలు ఆర్థికంగా దెబ్బతిన్నారు. దున్నడానికి, నాటువేయడానికి, కోయడానికి, బంతి చేయడానికి ఇలా ఎన్నో విధాలుగా పని దొరికి హాయిగా జీవనం గడిపే పల్లె ప్రజలు పనిలేక, తిండిలేక వలసవెళ్ళాల్సిన స్థితి వచ్చింది. అలాగే వ్యవసాయంపై ఆధాపడ్డ కుమ్మరి, వడ్రంగి వృత్తులు కూడా నాశనమయ్యాయి.

"ఇక ముదు గంగాజలం గోదావరిజలం
ధన బలంతో అనుసంధానం
నీటికోసం మళ్ళీమళ్ళీ టెండర్ల ప్రహసనం
ఇంతలో టీవీల్లో అలజడి
భాష్పోత్సేకాన్ని నివారించడమెలా?
వాటర్ డాట్‌కామ్‌పై క్లిక్ చేయండి
వాడిన నీటిని మళ్ళీ మళ్ళీ వాడాలా?
మా వెబ్‌సైట్‌లో కలుసుకోండి
కన్నీటిని చెమటను ప్యూరిపై చేయాలా?
మా పరికరం వాడండి!
ప్రాణాల్ని గుప్పిట పట్టిన వ్యాపారం
మినరల్ వాటర్"

(వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 9)

పల్లెటూరిలో ఒకప్పుడు ఒకరికొకరు ఇచ్చుకునే పండ్లు, కూరగాయలు, పూలు అన్నీ ఇప్పుడు మార్కెట్‌లోకి చేరిపోయాయి. మార్కెట్ ఎంతగా విస్తరించిందో చెప్పడానికి పై కవితే ఉదాహరణ. ఒకప్పుడు ఎవరైన ఇంటికొచ్చి నీళ్ళడిగితే ఇచ్చేవారు. కాని నేడు పల్లెటూరికి

కూడా కిన్లీ, ఆక్వషూర్ వంటి మినరల్ బాటిల్స్ వచ్చాయి. రిసైక్లిన్ పేరుతో ఒక్కసారి వాడిన వాటిని మళ్ళీ వాడుకునే సదుపాయం వచ్చింది. అలాగే నీళ్ళను కూడా మళ్ళీ మళ్ళీ వాడుకునే పరిస్థితి ప్రపంచంలోని కొన్ని దేశాల్లోకి వచ్చింది. భవిష్యత్తులో మనదగ్గరకి కూడా వస్తుంది. భవిష్యత్తులో యుద్ధాలంటూ వస్తే అవి కేవలం నీటికోసమే అయింటాయి.

"అడవుల్ని నరికి
చెట్టుకొకర్నీ పుట్టకొకర్నీ చేసిన
రూపాయి ఇప్పుడు స్పష్టంగా
మనుషుల ముఖమ్మీద 'వెల లేబుల్' అతికేస్తుంది
ముందెప్పుడూ లేనంత
ఇప్పుడు అడుగడుగునా
మనసును విరగ్గొడుతుంది
కరవదు మొరగడం వుండదు
మనిషి అలికిడైతే చాలు
గావుకేక వేయడానికి అవకాశమీయకుండా
నిశ్శబ్దంగా నిలువునా లంఘించి 'ఖతం' చేస్తుంది
బివేర్ ఆఫ్ డాగ్!
బివేర్ ఆఫ్ రుపీ!!"

(జగన్నాథం, జూకంటి. 2013: 135)

భౌతికంగా హత్య చేయకుండా మూలాల్ని, జీవన విధానాల్ని మార్చేసే రూపాయి గురించి పడే బాధలో మధ్యతరగతి మానవుడి ఆవేదన కనిపిస్తుంది. రూపాయికి విలువ పెరిగాక మనుషుల విలువ తగ్గిపోయింది. ఏం చేయాలన్నా డబ్బు డబ్బు. అందుకే మనీతో జాగ్రత్త ఉండమని కవి హెచ్చరిస్తున్నాడు.

"ప్రపంచీకరణ
మహత్యం
కోకాకోలా
కొబ్బరిబోండంని తాగేసింది"

(గోపాల్, మాడిశెట్టి. 2007: 4)

1990 ప్రాంతంలో భారతదేశంలో థంప్సప్, పెప్సీ, కోకాకోలా లాంటి కూల్‌డ్రింక్స్ వచ్చాయి. ఇవన్నీ మధ్యతరగతి ప్రజల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. అప్పట్లోనే వీటి ధర ఎనిమిది నుంచి పది రూపాయలు ఉండేది. ఆ కాలంలో ఇది ఎక్కువ ధర. అయినా యూత్, మధ్యతరగతి, సామాన్య ప్రజలు ఆకర్షించబడి ఎక్కువగా తాగడం మెదలుపెట్టారు. ఇప్పుడు ఇది చాలా పెద్ద బిజినెస్. ఇవన్నీ రావడంతో కొబ్బరిబోండ లాంటి వాటికి ప్రాముఖ్యత తగ్గింది.

"మరచెంబుతో దాహం తీర్చుకున్న
గొంతులకే 'కిన్లే' తడి
దూపతీర్చిన సల్లముంత పగిలింది
'హెరిటేజ్ బటర్ మిల్క్' పాంచ్ రూపాయ్
మానెడు ఇత్తునాలు దొంతిల దాస్తే
పుట్టెడు గింజల పంట ఇల్లు నిండేది
తాపతాపకు 'మోన్‌సాంటో' సీడ్ తెస్తే
'కారు కారు' కింత భూమి కరిగిపోతుంది"

(దేవేందర్, అన్నవరం. 2008: 12 – 13)

మన నీళ్లు మనం కొనుక్కునే వ్యాపారపు స్థితిలోకి అనివార్యంగా నెట్టేసింది ప్రపంచీకరణ. ఎవరైనా బంధువులొచ్చినా, తెలిసినా, తెలియనివారొచ్చినా మరచెంబుతో నీళ్లిచ్చేవారు పల్లెటూరి ప్రజలు. అలాంటిది ఇప్పుడు కిన్లే బాటిల్ కొనుక్కుంటున్నారు. ఎండలో వచ్చినవాళ్ళకి మజ్జిగచేసి పోసేది. అదే ఇప్పుడు బటర్ మిల్క్ వచ్చింది. అలాగే తన పంటలోని వడ్లనే మళ్ళీ మొలకగా అలికి నాటువేసేవారు రైతులు. ఎప్పుడైతే హైబ్రిడ్ సీడ్స్ వచ్చాయో అప్పటినుంచి అవి ఒకసారి పంట పండించడానికే పనికొస్తాయి తప్ప తీసిన పంట వడ్లను మళ్ళీ పండించడానికి పనికిరావు. ఇది వ్యాపార సంస్కృతి ప్రధాన లక్షణం. అదే పంటను తిరిగి మళ్ళీ మళ్ళీ పండించడంవల్ల వ్యాపారులకు డబ్బులురావు కనుక ఇలాంటి హైబ్రిడ్ విత్తనాల్ని సృష్టించి వ్యాపారం చేస్తున్నారు.

"నాకున్నది
చల్లని మనసు

చక్కటి సంగీతం

యంత్రానికేది?"

(నారాయణశర్మ, ఎం. 2011: 14)

మరబొమ్మలు మానవ జీవనంలో ఎంతో ప్రాధాన్యతను వహిస్తున్నాయి. హోటల్స్‌లో, రెస్టారెంట్స్‌లో, వైద్యంలో ఇలా కొన్నింటిలోకి మరబొమ్మలు వచ్చి విలువైన సేవల్ని అందిస్తున్నాయి. కాని ఇవన్ని మనిషి ఏం ప్రోగ్రామ్ ఇస్తాడో అది మాత్రమే చేసేవి. అంతకు మించి చేయనివి. కాని మనిషి సమయాన్ని, సందర్భాన్ని, ఎదుటివాళ్ళ పరిస్థితినిబట్టి మెదులుతుంటాడు. అందుకే మనిషికున్న మనసు, విచక్షణ జ్ఞానం వాటికి ఉండవు.

### 3. 2. 4. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వం (1996 – 2014)

ఒక వర్గం నుంచి, కులం నుంచి, ప్రాంతంనుంచి ఉద్యమం రావడానికి కారణాలు చాలానే ఉంటాయి. అటు సమాజంలో, ఇటు సాహిత్యంలో వచ్చిన ఉద్యమాలను గమనిస్తే ఈ విషయం అవగతమవుతుంది. తెలంగాణ ఉద్యమం ప్రత్యేక అస్తిత్వవాద ఉద్యమంగా రావడానికి దోపిడి, వివక్ష, పీడన మొదలైన విషయాలున్నాయి. "ఇవాళ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలు ఒక కఠిన వాస్తవం. యాభై సంవత్సరాల ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ప్రజలను అన్ని రకాల దోపిడీకి, పీడనకు, అన్యాయానికి గురి చేసిన తర్వాత, అన్ని రక్షణాలనూ ఒప్పందాలనూ హామీలనూ ఉల్లంఘించిన తర్వాత, ఇక సమైక్య రాష్ట్రంలో మనుగడ అసాధ్యమని అర్థమైన తెలంగాణ తండ్లాట అనివార్యంగానూ సహజంగానూ ప్రత్యేక రాష్ట్ర వాంఛగా వ్యక్తమవుతున్నది. ఇది ఒక సహజమైన, అనివార్యమైన, న్యాయమైన, ప్రజాస్వామిక ఆకాంక్ష" (శోభాగాంధి. 2010: ii) అన్న ఎన్. వేణుగోపాల్ గారి మాటలు తెలంగాణ ఉద్యమం రావడానికిగల కారణాల్ని తెలియజేస్తున్నాయి.

"మలిదశ తెలంగాణ ఉద్యమం 1996 నుండి ప్రారంభమైంది. 1996లో అప్పటి ప్రధాని దేవేగౌడ ప్రత్యేక ఉత్తరాఖండ్‌ను ఏర్పాటు చేస్తానని మాటివ్వడంతో దేశవ్యాప్తంగా ప్రత్యేకరాష్ట్ర ఉద్యమాలు ఊపందుకున్నాయి. దాదాపు దేశంలోని తొమ్మిది ప్రాంతాలనుండి ఈ ఉద్యమాలు బయల్దేరాయి. అందులో తెలంగాణ ఒకటి అనేక ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు ఉద్యోగులు, కళాకారుల కృషితో తెలంగాణ అంతటా చైతన్యం రగుల్కొన్నది. తెలంగాణ సాంస్కృతిక వేదిక, తెలంగాణ జనసభ, తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్‌లు ఈ

కాలంలో తెలంగాణ ఉద్యమంలో నిర్వహించిన పాత్ర చాలా ముఖ్యమైనది. వీటి కృషి లేకుండా మలిదశ తెలంగాణా ఉద్యమాన్ని ఊహించడం కష్టం" (ఉదయభాను, దానక్క. అముద్రిత సిద్ధాంత వ్యాసం. 2011: 29). 1996లో ఆరంభమైన తెలంగాణ మలిదశ ఉద్యమం కె. చంద్రశేఖర్ రావు ఆమరణ నిరాహార దీక్షతో విస్తృతమైన రూపాన్ని తీసుకుంది. పల్లెపల్లెన ధూంధాంలు, ర్యాలీలు జరిగాయి. సకలజనులు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు.

ఈ ఉద్యమంలో కవులది, కళాకారులది, రచయితలది, మేధావులది సైద్ధాంతిక పాత్ర. ఈ ఉద్యమంలో పాట, కథ, నవల, వ్యాసం మొదలైన వాటికంటే కవిత్వం ఎక్కువగా వచ్చింది. వారానికో సంపుటం, సంకలనం వచ్చాయి. ఈ కవిత్వంలో కవులంతా ధిక్కార స్వరంతో దోపిడి, వివక్ష, అన్యాయాలను ప్రశ్నించారు, తెలంగాణ సంస్కృతి, భాష, కళ, చరిత్రల గొప్పతనాన్ని కీర్తించారు. ఏ తరంలోని సాహిత్యమైనా తనకాలపు ఆలోచనా స్వభావాలను ప్రతిబింబిస్తుంది. ఒక యుగం వెనుకటి యుగపు సాహిత్య ప్రమాణాలను గుడ్డిగా అనుసరించక వర్తమాన కాలం నుంచి ఆవేశాన్ని పొందుతుంది. విషయ స్వీకరణలో, భావ వ్యక్తీకరణలో రెండింట్లో తన లక్ష్యం జీవిత విమర్శేగాని, నిర్జీవ పదార్థ విమర్శయే కాదని ఉద్ఘాటిస్తుంది. ఇలాంటి పనినే చేసింది కరీంనగర్ జిల్లా కవిత్వం. ఒకవైపు ప్రపంచీకరణ, మరోవైపు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఈ రెండు అంశాలపైనే కరీంనగర్ జిల్లా కవిత్వం ఎక్కువగా వచ్చింది.

1996 నుంచి 2014 మధ్య కాలంలో వచ్చిన కవిత్వాన్ని 'తెలంగాణ ఉద్యమ కవిత్వం'గా విభజించాను. ఎందుకంటే ఈ కాలంలో తెలంగాణలోని మిదతా జిల్లాలతోపాటు కరీంనగర్‌లో కూడా తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన కవిత్వమే ఎక్కువగా వచ్చింది కనుక. మిగతా కవిత్వం వచ్చినా అది చాలా తక్కువ. అందుకే ఈ కాలాన్ని 'తెలంగాణ ఉద్యమ కవిత్వం' కాలంగా నిర్ణయించాను.

"కవాతుల ధ్వనులు
ఊరు ఊరంతా 'ఖాకీ' వనమై విరబూస్తుంది!
చిరిగిన ఓణీలు కాల్వల్లో
తేలుతున్న చీరలే సాక్ష్యాలుగా....
పగలో బాధ, రాత్రో బాధ
బాధల, భయాల ప్రపంచాల్లో

బతుకులు అడకత్తెర్లలో పోకల్లా
నలుగుతున్నాయి!
ఇప్పుడు అలసి సొలసిన
వీరునిలా తెలంగాణా!"

(శివప్రసాద్, సంకేపల్లి. 2002: 8)

నక్సలిజం సాకుతో పోలీసు బలగాలు తెలంగాణ పల్లెల్లోని ప్రజలను నానా బాధలకు గురిచేసేవారు. కొంతమందిని స్త్రీలని మానభంగం చేసేవారు, కొంతమందిని చంపేవారు. ఇలా ఎప్పుడు ఏమవుతుందోనన్న భయంలో తెలంగాణ పల్లెలు కాలం వెళ్ళదీసేవి. అలాగే తెలంగాణ భాషని కవిత్వంలోకి తీసుకొస్తున్న సందర్భం ఈ కాలంలో కనిపిస్తుంది.

"భాషని సాంస్కృతిక అంశంగా ప్రత్యేకతగా అంగీకరించే దృష్టి అలవడని వాస్తవంలో మాండలికాలపట్ల చిన్నచూపును ప్రదర్శించటం ఉంటుంది. చూస్తున్న చూడబడుతున్న వారిలో ఒకరిలో ఆధిక్యత, రెండో వారిలో న్యూనతలు సహజం. తెలంగాణా కవులు నిత్య వ్యవహారంలో ఉపయోగించే భాషనే కవిత్వ భాషగా ఉపయోగించడంలో చొరవ చూపకపోవడానికి ఈ న్యూన, ఆధిక్య భావాలు అడ్డొచ్చాయి కవులకు. తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వాన్ని పట్టియిచ్చే భాషను కవిత్వానికి విస్తృతంగా ఉపయోగించాల్సిన చోట తద్విరుద్ధంగా జరిగింది. దీనిని తెలంగాణ కవిత్వం అధిగమించాల్సిందే ఉంది. అయితే 1990ల తర్వాత విరివిగా మాండలిక భాష వచన కవిత్వంలో ప్రయోగింపబడుతున్నది" (సీతారాం. 2007: 47). ఈ పనిని కరీంనగర్ జిల్లా కవిత్వం సార్థకం చేసింది. ముఖ్యంగా అన్నవరం దేవేందర్, జూకంటి జగన్నాథం, వఝుల శివకుమార్, పత్తిపాక మోహన్ లాంటి కవులు విరివిగా తెలంగాణ భాషని కవిత్వంలోకి తీసుకువచ్చారు.

"కంపిన్లు తిరుగు కార్ఖానాలు సూడు
బస్సులల్ల తిరుగు పేపర్లు సూడు
ఆఖరుకు అడుక్కతినేటోల్లను సూడు
ఉప్పరోల్లను సూడు ఏనోల్లను సూడు
ఎంత తిప్పల పడ్డా....
మనోడు కానరాడు"

(దేవేందర్, అన్నవరం. 2003: 65)

ఆంధ్రప్రదేశ్ అవతరణ కంటె ముందునుంచే తెలంగాణలోకి వలసదారులు వచ్చారు. వాళ్ళు అక్రమంగా ఇక్కడి ఉద్యోగాలను సంపాదించడంతో ముల్కి ఉద్యమం వచ్చింది. ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత ఈ వలసలు మరింత ఎక్కువయ్యాయి. అప్పటికే ఇక్కడున్న వలసవాదులు కొత్తగా వచ్చిన వలసవాదులకు అక్రమంగా ఉద్యోగాలిప్పించారు. తెలంగాణలోని కొన్ని ప్రాంతాలలో ముఖ్యంగా హైదరాబాద్ చుట్టుపక్కల భూముల్ని తక్కువ ధరకో, అన్యాయంగానో ఈ వలసవాదులు కొనుక్కున్నారు, ఆక్రమించారు. తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమాల్లో ఉద్యోగాలు, భూములు అనేవి ప్రధాన పాత్ర వహించాయి. అలాగే హైదరాబాద్ వచ్చిన కోస్తాంధ్ర వాళ్ళు ఇక్కడి ప్రజలతో కలవకుండా కొత్తగా కాలనీలను ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడి సంస్కృతిపై కూడా చిన్నచూపు చూసారు. "ఆర్థికంగా తప్ప ఇక్కడి కోస్తాంధ్రవారికి తెలంగాణతో ఏ విధమైన సంబంధం లేదు. పైగా తెలంగాణ జీవన విధానం, భాష, సంస్కృతులపై వారికి చిన్నచూపు. ఈ చిన్నచూపు సినిమా, సాహిత్యం వంటి రంగాల ద్వారా మాత్రమే కాకుండా ఇతరత్రా కూడా బయటపడుతూ వస్తున్నది. తెలంగాణవారు తాగుబోతులని, సోమరిపోతులని కోస్తాంధ్రవారు వ్యాఖ్యానించడం స్థానికులకు అనుభవంలో ఉన్నదే" (ప్రతాపరెడ్డి, కాసుల. 2007: 2).

"రాండ్రి, రాండ్రి... జప్ప జప్ప ఏరుకోండ్రి
మూల మూలనున్న ఇల్లువాడ జల్లెడ పట్టుండ్రి
పండు ముసలోల్లను పలకరిస్తే
కవిత్వం కథలు మాటలై జాలువారుతయి
ఇగో
నేర్సుకొండ్రిగని
జర వాల్లకు నేర్పి రాకుండ్రి"

(దేవేందర్, అన్నవరం. 2008: 49)

అన్నవరం దేవేందర్ కవిత్వానికి అందం వస్తువుతోపాటు ఆయన వాడే ప్రాంతీయ భాష. చెప్పదలుచుకున్న విషయాన్ని స్వంత భాషలో వ్యక్తీకరించడం ఈ కాలంలో తెలంగాణ కవులు సాధించిన పురోగతి. ప్రాంతీయ పదాల్ని, బతుకు మాటల్ని కవిత్వంలోకి తీసుకు రావడం అన్నవరం దేవేందర్ మొదటినుంచి చేస్తున్న పని. జప్ప జప్ప, జల్లెడ, ఏరుకోండ్రి, పట్టుండ్రి, జర లాంటి పదాలు కవిత్వాన్ని సహజం, సజీవం చేశాయి. "అన్నవరం కవిత్వానికి

బలం కేవలం వస్తువువల్ల రాలేదు. అనల్ప శిల్పంవల్ల అబ్బింది. పైగా భాష చేతా వచ్చింది. ఇంకా చెప్పాలంటే కవిత్వాన్ని ఇంటెన్సిఫై చేసే పదాలవల్ల వచ్చింది" (దేవేందర్, అన్నవరం. 2008: iii) అన్న నలిమెల భాస్కర్ గారి మాటలు అక్షర సత్యాలు.

"ప్రపంచంల ఏ మనిషికైన దుఃఖమొక్కటే
ఇక్కడి దుఃఖం వేరు
ప్రపంచంల ఏ మనిషైన ఒక్కసారే చస్తడు
ఇక్కడి చావు వేరు
ఇక్కడ
ఊరూ వాడను తల్లి పిల్లను కంటిరెప్పల్ల దాసుకొని
దుబాయి కెళ్ళే దుఃఖం వేరు
ఇక్కడ
ఎగిరిపోయిన పావురాల రెక్కలు తెగిపడ్డపుడు
పారే వలస దుఃఖం వేరు"

(రమేశ్, సుంకర(సంపా.). 2009: 33)

ఒకవైపు ప్రపంచీకరణ, మరోవైపు వలసవాదుల వివక్ష తెలంగాణ ప్రాంతాన్ని దుఃఖపు స్థితిలోకి నెట్టివేశాయి. అందుకే ప్రపంచీకరణ, వలసవాద వ్యతిరేక కవిత్వం రెండు సమపాళ్ళలో వచ్చాయి. బూర్ల వెంకటేశ్వర్లు రాసిన పై కవిత కూడా ఈ రెండంశాల కలయికలో వచ్చింది. ప్రపంచంలోని మనుషుల దుఃఖమంత ఒక్కటే అయినా తెలంగాణ ప్రజల దుఃఖానికి కారణాలు తెలిస్తే ఈ కవిత్వాన్ని మరింత అర్థం చేసుకోగలుగుతాం. భూములున్నా నీళ్ళులేని, చదువున్నా ఉద్యోగంలేని, నిధులున్నా అభివృద్ధి లేని కారణాలవల్ల తెలంగాణ పల్లె ప్రజలు పట్టణాలకు, వేరే రాష్ట్రాలకు, దేశాలకు వలస వెళ్ళాల్సి వస్తోంది.

"ఎన్నికల ఎడ్లకు ఎన్నిసార్లు మ్యాత ఏస్తరు
అవి గెల్సినంక దొడ్డి గోడ దున్కయా!
పన్గడ పెట్టినంక ఎంతకని కావలుంటరు
మసలిన కడుపులు
అలసిన చేతులు ఆకలిదప్పులు
ఎదురు తిరిగినప్పుడల్లా ఎకసెక్కం నవ్వులు

నక్కజిత్తులతో
పొత్తూ వద్దూ వాని విత్తునమే వద్దంటే
ఇనకుంట బిగ్గర కాగలిచ్చుకుంటివి
పొయ్యిల పడ్తివి"

(దేవేందర్, అన్నవరం. 2011: 7)

తెలంగాణ రాష్ట్ర సమితి(టిఆర్ఎస్) 2001లో ఏర్పడ్డ రెండు నెలలకే వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర నినాదంతో ఘన విజయం సాధించింది. ఆ తర్వాత టిఆర్ఎస్ బలమైన రాజకీయ శక్తిగా ఎదగడంతో 2004లో వచ్చిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశాన్ని ఓడించాలని కాంగ్రెస్ టిఆర్ఎస్‌తో పొత్తుపెట్టుకొని గెలిచింది. కాని ప్రజలను వెక్కిరిస్తూ, వారి ఆకాంక్షలను కాదని ద్రోహం చేసింది. తర్వాత వచ్చిన 2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీతో కలిసి పోటీ చేసింది. ఆ తర్వాత యూ.పి.ఎ. దాటువేత ధోరణితో 2009 నవంబర్ 29న నిరాహార దీక్ష చేయడానికి సిద్ధమయ్యారు. ఇలా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర అజెండాగా కలిసి పోటి చేసి గెలిచిన పార్టీలు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంపై శ్రద్ధ చూపించలేదు. ఇలా ప్రత్యేక రాష్ట్ర నినాదంతో పొత్తు కూడి గెలిచి తర్వాత అవి కేవలం రాజకీయావసరాలు మాత్రమే అని తెలుసుకొని చివరికి స్వంతంగా ఉద్యమం చేసే స్థితి రావడాన్ని, టిఆర్ఎస్ పొత్తు పెట్టుకున్న పార్టీల నక్కజిత్తుల తనాన్ని తెలియపరిచారు.

"పొట్టనెత్తిన వెట్టుకొచ్చిన అన్నార్తులకు
మా యెత్తు, తంగేళ్ళు తలవంచి నీడనిచ్చినయ్
గండిపేట నీళ్ళు నాతో పాటు నీ దూప దీర్చినయ్
నడిబొద్దున చార్మినర్ నాలుగు చేతులు చాచి దోస్తీ గట్టింది
మక్కా మసీదు పావురాలు మన స్నేహం కోసం దువాజేసినయ్!
ఆత్మగల్ల హైద్రాబాద్ భూములన్ని సంకల పెట్టుకుంటివి
కొడిదెదు మట్టిని దీసి ఎప్పుడైనా వొంటికి పూసుకున్నవా!"

(బాలయ్య, పొన్నాల. 2011: 94)

ఎవరు వచ్చినా వాళ్ళని స్వాగతించి ప్రేమగా చూసుకునే మనస్తత్వం తెలంగాణ ప్రజలదనీ, ప్రాంతానిదని చెబుతూనే ఆ ప్రేమని, అనురాగాన్ని అర్థం చేసుకోక, ఇక్కడి ప్రజలతో కలిసిపోక ఇక్కడి బతుకు, భాష, సంస్కృతి మొదలైన వాటిని అవహేళన చేసి,

ఇక్కడి నిధుల్ని, భూముల్ని తక్కువ ధరకు కొనుక్కోవడమో, ఆక్రమించడమో చేసిన తెలంగాణ వ్యతిరేకిపై పై కవిత కనిపిస్తుంది.

"నేలతల్లి విముక్తికోసం
బరిగీసి నిలిచిన సబ్బండ వర్ణాల సమ్మె హోరులో
నిలువెల్లా వణికిపోతున్న
మేకపోతు సర్కారును గమనిస్తున్నాను
ఓటమి అంచున నిలబడి
నీల్గుతున్న ప్రభుత్వాన్ని పసిగడుతున్నాను
నేను శత్రువును గుర్తించాను
పెట్టుబడి రూపాన్ని, సారాన్ని
ఏకంగా సారాంశాన్నే మార్చివేసి..
డిల్లీ పెద్దలను పీతిరి గద్దలుగా ఏమార్చిన ఘనాపాటి
సీమాంధ్ర సంపన్న వర్గాల విద్రోహాల
చిట్టా గుట్టు విప్పుతున్నాను.... నేను శత్రువును గుర్తించాను"

(భాస్కర్, నలిమెల(గౌ.సంపా.). 2012: 3)

ఆ కులం, ఈ కులం అనే తేడా లేకుండా, చిన్నాపెద్దా భేదం చూపకుండా, పగలు రాత్రీ గమనించకుండా ప్రత్యేక రాష్ట్రంకై జరిగిన ఉద్యమం తెలంగాణ ఉద్యమం. ఉద్యమం ఎందుకు చేస్తాం, దేనికోసం చేస్తున్నాం, ఎవరితో చేస్తున్నాం అన్న విషయాల్లో నిర్దిష్టంగా లేకపోతే ఆ ఉద్యమం సఫలీకృతం కాదు. అందుకే తెలంగాణ ఉద్యమం దోపిడీ, వివక్ష, అన్యాయాలనుంచి విముక్తికై, స్వంత రాష్ట్రం, పాలన, నీళ్లు, నిధులు, ఉద్యోగాలకై, ఆంధ్రప్రాంత నుంచివచ్చి తెలంగాణను దోపిడి, అన్యాయం చేసే వాళ్ళపై అని ఉద్యమ రూపాన్ని స్పష్టంగా ప్రకటించింది.

"మా మాట తీరే గింత
గలగల పారుకం
ఎద్దుర్కం లేదు
పానానికి పానం తీసిత్తం
మా మాట తీరే గింత

కారెడ్డు తెలువదు
పునాస చేనుకు తవుటం పెట్టినట్టు
మేము గిట్లనే మాట్లాడుతం"

(జగన్నాథం, జూకంటి. 2013: 291)

ఒక ప్రాంతంపై, ఒక వర్గంపై ఆధిక్యత సాధించాలంటే వాళ్ళను సాంస్కృతికంగా, మానసికంగా బలహీనం చెయ్యాలి. తెలంగాణకు వచ్చిన సీమాంధ్ర ప్రాంతంవాళ్ళు ఇక్కడివాళ్ళపై ఆధిపత్యం చెలాయించడానికి ఇక్కడి సంస్కృతిని, జీవన విధానాన్ని, భాషను తక్కువగా చేసి మాట్లాడారు. "సాంస్కృతికంగా ఒక ప్రాంతం ప్రజలను అణచివేయడానికి వారిని ఆత్మన్యూనతకు గురి చేయాల్సి వుంటుంది. ఇందులో వారికి ప్రధానంగా కనిపించింది భాష. అందుకే భాషకు వారు నిమ్నోన్నతాలను అంటగట్టారు. భాషను కించపరచడం ద్వారా, సినిమావంటి మీడియాలో ఆ భాషను హాస్యపాత్రలకు, ప్రతినాయకులకు మాత్రమే వాడడం ద్వారా తెలంగాణ ప్రజలు తమను తాము చూసుకుని కించపడే స్థాయికి తెచ్చారు" (ప్రతాపరెడ్డి, కాసుల. 2007: 9). ఇలాంటి స్థితిని తెలంగాణ కవులు ప్రతిఘటించారు. అందుకు నిదర్శనమే పై కవిత.

"వెలుగుపూట బురద చల్లుకొని
రాత్రిపూట వాటాలుగా పెనవేసుకోం
ఒక సొల్లుకి ఆశపడి
కుల్లును కళ్ల పాపలుగా పొదుగుకోలేం
లౌక్యాల ఊసరవెల్లులం కాము
సత్యాన్ని సత్యంగా
అసత్యాని అసత్యంగా
ప్రకటించే అలల లాలనలో సాగే
పాటిమన్ను ప్రమిదలం"

(అంజయ్య, కందుకూరి. 2013: 18)

తెలంగాణవాళ్ళకి, కోస్తాంధ్ర దోపిడిదారులకు మధ్య వ్యత్యాసాన్ని చెప్పే కవిత ఇది. తెలంగాణ ప్రజల ఔన్నత్యాన్ని కీర్తించడంలో దోపిడిదారుల స్వభావంతో పోల్చడం ఈ ఉద్యమకాలంలో కనిపిస్తుంది. ఎదుటివాళ్లని మోసం చెయ్యని వాళ్ళం, ఒకరి మెప్పుకై తప్పులు

చెయ్యనివాళ్ళం, పూటకో మాట మార్చే వాళ్ళం కాదనీ, ఉన్నది ఉన్నట్టు చెప్పే మట్టిమనుషులమని వ్యక్తిత్వాన్ని చెబుతున్నారు కవి.

"అందుకే
నువ్వొక్కసారి గావుకేక పెట్టాలె
గాయిగత్తర జెయ్యాలె
చిల్లరచిల్లరైన చితుకులొక్కటి జెయ్యాలె
ఆగమాగమైన బతుకుల్ల ఆలోచన రాజెయ్యాలె
తెలంగాణ బతుకమ్మలు రుద్రమ్మలు గావాలె
ఉడుకెత్తిన యువరక్తం ఆజాద్‌ను తలువాలె
ఏమొస్తదో తెలుసా!
తెలంగాణ పాలనస్తది, తెలంగాణ భాషస్తది
తెలంగాణ సంస్కృతస్తది, తెలంగాణ రాష్ట్రమస్తది
ఆఖరికొక్కమాట
నువ్వేం జెయ్యకపోయినా తప్పకుంట
నీకు సావస్తది"

(వెంకటేశ్వర్లు, బూర్ల. 2013: 22)

ఆశలు పెట్టుకుంటే తెలంగాణ రాష్ట్రం రాదు. ఉద్యమం చేస్తేనే రాష్ట్రసిద్ధి కలుగుతుంది. ఇన్నాళ్ళు ఎన్నో పోరాటాలు చేశారు తెలంగాణ ప్రజలు కాని అన్యాయమే, మోసమే జరిగింది. ఉద్యమించిన ప్రతిసారి ఏదో ఒక జీవోతోనో, కమిటీ నివేదికతోనో సర్దిచెప్పారు. ఎన్ని జీవోలొచ్చిన, నివేదికలొచ్చినా ఇక్కడి ప్రజలకు న్యాయం జరగలేదు. మళ్ళీ ఇలాంటి అన్యాయం జరగకుండా ఉండాలంటే జాగ్రత్తగా ఉండాలనీ, కొత్త రాష్ట్ర సాధనకై నూతనోద్యమానికి సంసిద్ధం కావాలనీ, అలా అయితేనే స్వంత రాష్ట్రం వస్తుందనీ కవి చెబుతున్నారు.

"తెగించిన పోరాటం ఫలించి
జయ జయమంటంది తెలంగాణం
లోకాన సకల జనులు సమ్మె కట్టి
సాధించుకున్న తెలంగాణం

జై కొట్టుకుంట రానే వచ్చింది
ఊరువాడలు కళావేదికలై
కై గట్టిన తెలంగాణం
దప్పుసప్పుల్ల నడుమ రానే వచ్చింది
అమ్మలక్కల గాజులు ఘల్లుమనంగ
తోలుకచ్చిన తెలంగాణం
ముత్తైదువ లెక్క రానే వచ్చింది"

(దేవేందర్, అన్నవరం. 2014: 5)

దాదాపు యాభైనాలుగు రోజులుగా సాగిన తెలంగాణ ఉద్యమంలో సకలజనుల సమ్మె, వంటావార్పు, ధూంధాం, లాంగ్ మార్చ్, మిలియన్ మార్చ్ లాంటి ఎన్నో రకాలైన నిరసనలు, ధర్నాలు జరిగాయి. అలా సాగిన తెలంగాణం ఉద్యమం చివరికి విజయం సాధించింది, తెలంగాణ తీసుకువచ్చింది.

"ఇప్పుడు
అనాథలైన నా పసిడిపంటలకు
తల్లి ఓదార్పు లేదు / బీడు వారిన నేలపై
పావన గోదారి పాదముద్ర లేదు
నా వర ప్రసాదమిప్పుడు
కన్నీటి ఆవేదనల అంతరగం
నా రమణీయ
సౌందర్య దృశ్యమిప్పుడు
వెక్కిరింపు మోడుతో
పరుచుకున్న కావ్యం"

(గఫూర్ శిక్షక్, సిరిసిల్లా. 2014: 9)

సమాజంలోని దుర్మార్గాన్ని, అన్యాయాన్ని కవి ప్రశ్నించాలి. అందుకే ఇక్కడ గోదావరి తన నేలపై పాదం మోపకపోవడాన్ని కవి కవిత్వం చేస్తున్నారు. బీడు భూముల్ని తడపని, రైతుల కన్నీళ్లని తుడవని గోదావరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందగా, సుందరంగా

ఉండాల్సిన భూములన్ని బీడుభూములుగానే మిగలడానికి కారణమైన వాళ్ళపై పరోక్షంగా దాడి చేస్తున్నారు.

"వివర్ణమైన వివక్ష పెచ్చలు పెచ్చలుగా ఇచ్చుకపోయి
మనది మనకై నిలిచి గెలుస్తున్న తెలంగాణం
సచివాలయం నిండ సొచ్చిన ఉడుములు
ఎల్లిపోయి సచ్చమైన హంసలు కలె తిరుగాలె
రెండున్నర జిల్లల నోటిమాట పడిపోయి
పది జిల్లల మాట దద్దరిల్లాలె
యాంటండి... యాంటండి యస బాస మాయమై
అరె ఏందిరా బై... రా రా తమ్మీ రాగాలు పలుకాలె
కమ్మ సీన్మ రీళ్ల కనికట్లు తెగిపోయి
'మా భూమి' అసొంటి మాదండి ఆటలు ఆడాలె"

(దేవేందర్, అన్నవరం. 2014: 1)

తెలంగాణ ఆవిర్భావ రోజున 'పొక్కిలి వాకిళ్ళ పులకరింత' అనే కవితా సంపుటిని అన్నవరం దేవేందర్ గారు ఆవిష్కరించారు. 'పొక్కిలి వాకిళ్ళ పులకరింత' అని పెట్టడంలో గొప్ప ఔచిత్యం కనిపిస్తుంది. అప్పటిదాకా వలసవాదుల వల్ల పొక్కిలైన వాకిళ్ళలాంటి జీవితాలు స్వంత రాష్ట్రం రాగానే ఆనందంతో పులకరించాయి. అలా పులకరించిన కవి మనసు ఇలా అక్షరాలుగా ఆవిష్కృతమైంది.

### 3.2.5. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానంతర కవిత్వం (2014 - 2017)

తెలంగాణ ఉద్యమ సమయంలో విస్తృతంగా వచ్చిన కవిత్వం ఆ తర్వాత కొంచెం నెమ్మదించింది. కాని తెలంగాణ ఉద్యమం అందించిన చైతన్యంతో స్వంత బతుకును కవిత్వీకరిస్తూ, ఆ బతుకుతనపు సౌందర్యాన్ని ఆవిష్కరిస్తోంది. "తెలుగు కవిత్వంలో తెలంగాణ పరిమళాలు వీస్తున్నయి. మట్టిపొత్తిళ్లలోంచి పుట్టిన మాటలు మనసు పొరలను తాకుతున్నయి. విషాదం, ఆనందం, ప్రేమ వంటి సర్వజన జీవనానుభూతులకు ప్రాంతీయ, స్వీయ ముద్రలుంటయి. అవి పుప్పొడిల అంటందే కళకు పూర్ణత్వం రాదని తేలిపోయింది. కొత్త గుర్తింపుతో సరికొత్త శబ్ద సమ్మేళనంగా, స్థానిక ప్రతీకల పరంపరగా కవిత్వం కొత్త

సోయగాలు సంతరించుకొంటున్నది. భావానికి ఆవేశాన్ని కూర్చి ఆకట్టుకునేది బలమైన మాటల పొందికే. తిక్కన చెప్పిన పలుకుల పొందు దారిలో తెలంగాణ కవులు పలుకులను, పలుకుబడులను పొందించి కవిత్వాన్ని తీర్చిదిద్దుతున్నరు. ఏ కవి అయినా కవిత్వం చేదుకోవాల్సింది జీవితం నుంచే. ఎంత తోడినా ఒడవని జీవితం. తెలంగాణ జీవితం మరింత నిరంతర స్రవంతి. బహుముఖమైన, బహుకృతమైన తెలంగాణ అనుభవ సంపదను తడితడిగా ఆవిష్కరిస్తున్నరు తెలంగాణ కవులు" (బాలయ్య, పొన్నాల. 2011: vii) అన్న డా. నందిని సిధారెడ్డి గారి మాటలు తెలంగాణ కవుల దృక్పథాన్ని, తెలంగాణ ఉద్యమానంతర కవిత్వపు లక్షణాన్ని తెలియజేస్తున్నాయి.

తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, ఆ తర్వాతి కాలంలోనూ కవిత్వ సంపుటాలకు, సంకలనాలకు ప్రాంతీయ పదాలనే పెట్టండం జరిగింది, జరుగుతోంది. కుందాపన, పొక్కిలి వాకిళ్ళ పులకరింత, దండెడ, బాయిగిర్కమీద ఊరవిశ్క లాంటి ఎన్నో స్థానిక పదాలను, పదబంధాలను కవులు వారివారి కవిత్వ పుస్తకాలకు పెడుతున్నారు.

"బిందువు బిందువు కలిసి సింధువైనట్లు
జనప్రవాహం, జల ప్రవాహం వలె
తెలంగాణ దారులన్నీ నక్లెస్ రోడ్‌కే
కుప్పపోసిన క్రాంతివోలె, నిప్పు పూల వనం వోలె
తెలంగాణ జన జాతర
తెలంగాణ మార్చ్ నక్లెస్ రోడ్ హైద్రాబాద్
తెలంగాణ తల్లి మెడలో ఉద్యమ నక్లెస్‌హారం
జనసాగర హారం
'జై తెలంగాణ' నినాదంతో హోరెత్తిన జన ప్రవాహం
దిశదిశలా నలుదిశలా తెలంగాణ ప్రభంజనం
తెలంగాణ మార్చ్..
బారికేడ్లు ఇనుపకంచెలు, టియర్ గ్యాస్‌లు,
రబ్బరు బుల్లెట్లు, వాటర్ క్యాన్‌లు, లాఠీ విహారాలు
బలాదూర్! బలాదూర్!!"

(లక్ష్మీనారాయణ, సబ్బని. 2015: 1)

మిలియన్ మార్చ్‌గా తెలంగాణ ఉద్యమం కెరటమై లేచిన రోజు మార్చ్ 10, 2011. టి. జేఏసి ఆధ్వర్యంలో జరిగిన ఈ మార్చ్ తెలంగాణ ఉద్యమానికి ధైర్యాన్ని అందించింది. తెలంగాణ ప్రజలను చైతన్యవంతం చేసింది. తెలంగాణ నలువైపులనుండి ఉద్యమకారులంతా నక్లెస్ రోడ్ వైపు కదిలారు. బిందువు బిందువు కలిసి సింధువైనట్టు ఒక్కొక్కరు కలిసి లక్షలైనారు. ఎక్కడికక్కడ ప్రజల్ని నిరోధించాలని ప్రభుత్వం అనుకున్నా అది సాధ్యం కాలేదు. వందలుగా, వేలుగా, లక్షలుగా జనాలు నక్లెస్ రోడ్ చేరి దాన్ని జన సంద్రం చేశారు. తెలంగాణ రాష్ట్ర కాంక్షని బలంగా చాటారు.

"మొఘల్ రాజుల
హుక్కా కూజలు
ఎక్కడివనుకున్నరు
తాత చలవే!"

(సుజాత, నాంపల్లి. 2015: 11)

ఒకప్పటి చరిత్రకు ఆనవాలుగా నిలిచినవి మట్టిపాత్రలే. హరప్పా మొహంజదారో తవ్వకాల్లో లభించిన మట్టిపాత్రలు చరిత్ర పునర్నిర్మాణానికి దోహదపడ్డాయి. అలాంటి మట్టి పాత్రలు నేడు కనుమరుగై పురా జ్ఞాపకాలుగా మిగిలిపోతున్నాయి. వాటిని నమ్ముకున్న కుమ్మరి పొట్టచేతపట్టుకొని వలసపోతున్నాడు. నాంపల్లి సుజాత గారు తన ఈ నానీల పుస్తకానికి 'మట్టి నానీలు' అని పేరు పెట్టారు. మట్టిని నమ్ముకొని కుండలు చేసే కుమ్మరివాళ్ళ జీవితాలకు సంబంధించినవే ఈ నానీలు.

"రెక్కలు నావే
కొట్టుకుపోయాయి ఇన్నాళ్ళు
పోకిరి గాలిలో
దిగంతాల ఆవలి ఆకాశాన్ని
వెదుక్కుంటూ వెళ్ళిన
అలిగిన అక్షరం
అసంపూర్ణ ఆఖరి వాక్యంగా
ఇంటికి తిరిగొచ్చింది
పాటై వచ్చిన వ్యాకుల వాక్యాన్ని

అక్కున చేర్చుకుంది ఆత్మపద్యం
ఆత్మీయానురాగ అక్షర పదబంధం
నులివెచ్చని నునురెక్కల రాగగంధం!
పచ్చని స్వంత గూటిలో
పరవశిస్తున్నది అలసి వచ్చిన వలస గీతం!
ఆనందం ఆశ్చర్యార్థక చిహ్నమైన ఈ పూట
ఇంటిల్లిపాది ఆమని చిగురించిన ఓ లాలిపాట!"

(రామస్వామి, నాగరాజు. 2015: 28)

"యూంగ్ సాహిత్యంలో సహీత్యత్వమూ, మనస్తత్వమూ రెండు ఉంటాయన్నాడు. రామస్వామి గారి కవిత్వానికి ఈ వాక్యం మినహాయింపు కాదు. ఇంకా స్పష్టంగా చూస్తే కవిత్వంలో మానసిక ప్రతిఫలనాలే (Psychological Reflections) ఎక్కువ" (పైదే: 6) అన్న ఎం. నారాయణశర్మగారి మాటలు కవి దృక్పథాన్ని వివరిస్తున్నాయి. పుట్టిన ఊరును వదిలి ఎక్కడికో దూరంగా వలసవెళ్ళి చాలా రోజుల తర్వాత స్వంతూరికి తిరిగివచ్చినప్పుడు మనస్సు అనుభవించిన అనుభూతే ఈ కవిత.

"గరిగబుడ్డి అయిరేండ్లు కురాడి కుండలు
లగ్గం నాగెల్లి ఇండ్లల్ల దీవెనార్తుల ఆనవాల్లు
బోనాల పండుగంటే కుండల కుంభమేళ
పులకరించిన పట్నం పల్లెల గౌరంతం
అదంతా ఆడబిడ్డల భక్తి ప్రతిపత్తి
ముంతలు కడుముంతలు చిప్పలు కాగులు
ఎసులలు, గూనలు
గాజబొత్తలు దీపంతలు, గోలాలు
లొట్లు బింకులు పూలకుండీలు ఒక్కటేమిటి
మంటి పొయ్యిల నుంచి మంగులం దాకా
నీళ్ల ఒత్తు నుంచి, దాలిల పాలకుండ
కుమ్మరి సృష్టి లేని ఇల్లు లేదు వాడ లేదు"

(దేవేందర్, అన్నవరం. 2016: 19)

అన్నవరం దేవేందర్ అచ్చమైన, స్వచ్ఛమైన పల్లెటూరి కవి. ఆయన కవితా పుస్తకాలకి పెట్టిన పేరులో, అందులోని కవితా శీర్షికల్లో, కవితా వాక్యాల్లో స్థానిక పదజాలం పుష్కలంగా దొరుకుతుంది. ఈ కవితా సంపుటికి పెట్టిన పేరు 'బువ్వ కుండ'. ఎంత మాధుర్యంగా ఉందో బువ్వలాగా. బువ్వ కుండలోని రెండు పదాల్లో రెండు వృత్తులు దర్శనమిస్తున్నాయి. ఒకటి వ్యవసాయం, రెండోది కుమ్మరి. రైతు ఆరుగాలం కష్టపడి మట్టిలోంచి మల్లెల్లాంటి మెతుకులు తీసి సమాజాన్ని బతికిస్తే, కుమ్మరి మట్టికి తన కళానైపుణ్యంతో అందమైన రూపం పోస్తున్నాడు. పై పంక్తులు కుమ్మరి వృత్తిలోని గొప్పతనాన్ని, నైపుణ్యాని, కళాత్మకతని చెప్పేవే. ఒకనాడు కుమ్మరి చేసిన పాత్ర లేకపోతే పుట్టుకనుంచి చావుదాకా ఏ కార్యం జరగకపోయేది. అట్లాంటి వృత్తి మృత్తిలో కలిసిపోతోంది.

"ఎనుకటి తడి జ్ఞాపకాలు మోస్తూ
ఒళ్లంతా విచ్చుకున్న పొడి కళ్ళతో
ఎదురుచూస్తున్న చెరువును
సడి లేని మత్తడి
యెట్లా సముదాయిస్తది?
కాలువ మొదట్లో
ఆడుతున్న పిల్లగాండ్ల కళ్ళనిండా
కదలని కాగితప్పడవల నీలి నీడలు
పొద్దుగాలనంగా ఊరేగింపుకెళ్ళిన
కప్పతల్లి
పొద్దుగూకినా ఇల్లు చేరకపాయె"

(రవి, వీరెల్లి. 2017: 70)

ఒక అంశానికి సంబంధించిన తీవ్రతను చెబుతున్నప్పుడు ఆ తీవ్రతను పట్టించే కొన్ని వాక్యాలు కవిత్వంలో ఉంటాయి. ఈ కవితలోని ఒళ్లంతా విచ్చుకున్న పొడి కళ్ళు, కదలని కాగితప్పడవల నీలి నీడలు వంటి వాక్యాలు కరువు తీవ్రతను ప్రబలంగా పట్టిస్తున్నాయి. వానలుంటే మత్తడి పారడం, వరదల్లో చిన్నపిల్లలు కాగితప్పడవలు వదలడం ఉంటాయి. వానలే లేకుంటే ఇవేమీ ఉండవు. ఇలాంటి స్థితిలో వానలు పడాలని కప్పతల్లి ఆడుతుంటారు. ఇది ఎప్పటినుండో వస్తోన్న ఆచారం.

"అతడు
చాళ్ళు తీస్తూ కదులుతున్నాడు
వెనుకనే
ఆమె విత్తులు నాటుతూ వెళ్తున్నది
అతడన్నాడు
ఈ పునఃసృష్టి కళను నేర్పి
సంసారాన్ని ముందుకు నడిపిస్తున్నావూ అని
ఆమె అన్నది
నువ్వు లేకుండానా... అని"

(వెంకటేశ్వర్లు, బూర్ల. 2017: 190)

ప్రపంచీకరణలో అన్ని సంబంధాలు ఆర్థికంగా మారుతున్నాయి. అలాంటి నేపథ్యంలో భార్యాభర్తల మధ్య అనురాగం మళ్ళీ పచ్చగా మొలకెత్తడానికి అక్షర విత్తనాలు చల్లుతున్నారు కవి. "ఈ కవిత్వం ఇట్లా సంభాషణగా వెలువడడానికి ఒక ప్రేరణ దీవి సుబ్బారావు గారు తెలుగులోకి అనువాదం చేసిన గాథా సప్తశతి. ధ్వని ప్రధానంగా ఉన్న చిన్న గాథ ఒక భావాన్ని చెప్పడానికి బాగా ఉపయోగపడుతుంది. దంపతుల మధ్య లోపిస్తున్న అవగాహనను సరిచేయడానికి సున్నిత సరస సంభాషణే ఔషధం. ఈ కవిత్వాన్ని దంపతుల మధ్య సంభాషణా శైలిగా నేను మలుచుకున్నాను" (పైదే: i) అని తన ఈ కవిత్వ సంభాషణకి ప్రేరణ, లక్ష్యాలని చెప్పారు కవి. అవగాహన, అర్థం చేసుకునే తత్త్వం, నమ్మకం వీటిపైన సంసారం హాయిగా సాగుతుంది. అవే లేనప్పుడు ఆగిపోతుంది. చిన్న చిన్న విషయాలకు గొడవపడి విడిపోతున్న జంటలు ఎన్నో ఈ కాలంలో ఉన్నాయి.

"కన్నీళ్ళు
సిరా
కవిత్వం
విషాదం"

(లక్ష్మీనారాయణ, సబ్బని. 2017: 6)

నానీలు కాకుండా నానోలు అనేది ఒక కవిత్వ రూపం. నానో కవిత అంటే సూక్ష్మాతి సూక్ష్మమైన చిన్న కవిత. నాలుగు పాదాల్లో నాలుగు పదాలుగా సాగే కవిత. ఈ నానోలను సృష్టించింది ఈగ హనిమాన్ గారు. కన్నీళ్ళే సిరాగా రాస్తున్న కవిత్వం విషాదమే కదా.

"అరవై ఏళ్ళ తెలంగాణాకల సాకారం! మూడున్నరకోట్ల ప్రజల ఆశాదీపం!
ప్రజాపోరాటంలో పునీతమైన మట్టిభూమికి ఘనస్వాగత తోరణాలు కడదాం!
హస్తిన ఉభయ సభల్లో ఉద్రేకాల మాధ్య సాగిన విభజన చర్చల్లో
భజనపరులు ముల్లెమూట సర్దుకున్నారు!
తెలంగాణా రాష్ట్రావతరణం లాంచనంగా ఆవిష్కృతమైంది!
పెద్దల సభలో ఓ పెద్ద మోకాలడ్డం పెట్టి వీరంగం చేసినా
టి–అక్షర శ్రీకారం ఆగకుండాపోయింది,
అశువులు బాసిన వేయిమంది అమరులకి ఉద్వేగంతో
అంజలి ఘటిస్తు సలాం చెబుదాం,
తెలంగాణా సిద్ధాంత కర్త జయశంకరుడికి నమోవాకాలర్పిద్దాం,
జయహే జయహే అంటూ మనతె లంగాణా తల్లికి పునర్జీవన గీతాలు పాడుదాం
సకల జనులు, సబ్బండ వర్గాలు కలిసి
తెలంగాణా తల్లికి జయనీరాజనాలర్పిద్దాం!"

(నాగేంద్రశర్మ, సంకేపల్లి. 2017: 30)

అనేకానేక విధాలుగా తెలంగాణ ప్రజానీకం ఉద్యమాలు చేసిన తర్వాత వచ్చిన తెలంగాణకు అక్షర తోరణాలతో స్వాగతం పలుకుతున్నారు కవి. తెలంగాణ తొలిదశ మొదలుకొని చేస్తూ వస్తోన్న ఉద్యమం సాకారం పొందిన శుభతరుణంలో ఏం చెయ్యాలో చెబుతున్నారు. ఉభయ(రాజ్యసభ, లోక్ సభ) సభల్లో ఎవరు అడ్డుకున్న ఆగక తెలంగాణ బిల్లు పాసై కొత్త రాష్ట్రంగా వచ్చినా తెలంగాణ మట్టికి స్వాగత తోరణాలు కట్టాలనీ, అమరుల త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ ఉద్వేగంతో వారికి అంజలి ఘంటిస్తూ సలాం చెయ్యాలనీ, తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సార్‌కి నమస్కరించాలనీ, జయ జయహే తెలంగాణ అంటూ పునర్జీవన గీతాలాపన చెయ్యాలనీ, సకల జనులు, సబ్బండ వర్గాలు తెలంగాణ తల్లికి జయనీరాజనాలు అర్పించాలని కవి తెలియజేస్తున్నారు.

# అధ్యాయం - 4

# కరీంనగర్ జిల్లా కవిత్వం – రూప విశ్లేషణ

## 4. పరిచయం

ఆంగ్ల సాహిత్య విమర్శలో విక్టోరియా యుగం (1832 – 1900), రెండు ప్రపంచ మహా యుద్ధాల తర్వాత (1914 – 1918, 1939 – 1945) తర్వాత ఆధునిక యుగం ఆవిర్భవించింది. ఈ కాలంలో అప్పటిదాకా కొనసాగుతూ వస్తోన్న సౌందర్యం, మనిషి ఔన్నత్యం, ఆధ్యాత్మికం మొదలైనవి నచ్చకుండాపోయి కొత్త వస్తువులు, అభివ్యక్తి విధానాలు వచ్చాయి. వీటితోపాటే కొత్త విమర్శ పద్ధతులు వచ్చాయి. వాటిలో ఆంగ్లేయ రూపవాదం (Anglo – American Formalism), రష్యన్ రూపవాదం (Russian Formalism) కనిపిస్తాయి. ఈ రెండు దాదాపు ఒకే కాలంలో అంటే 1920లో వచ్చినప్పటికీ వీటి మధ్య సామ్యాలతోపాటు భేదాలు కనిపిస్తాయి. ఆంగ్లేయ రూప వాదం కవితను స్వంతంత్రంగా భావించాలనీ, ఒక రచన గురించి చెప్పేటప్పుడు రచయిత జీవితం, అతడు జీవించిన దేశకాల పరిస్థితులు మొదలైనవి చెప్పకుండా ఆ రచన ఏం చెబుతుందో చెప్పాలని అంటే, ఒక కళాఖండాన్ని స్వతంత్రమైందిగా భావించాలి. దాన్ని అంచన వేసేటప్పుడు రచయిత జీవితం, చరిత్ర, ఆనాటి సామాజిక, మానసిక పరిస్థితులు అవసరం లేదంటారు రష్యన్ రూపవాదులు. ఇరువురు భాషకు ప్రాధాన్యత కల్పించారు. ఆంగ్లేయ రూపవాదులు సాహిత్య ప్రక్రియలు అన్ని ఒక్కటే అంటే, రష్యన్ రూపవాదులు సాహిత్య రూపాలకి స్వయంప్రతిపత్తిని కల్పించారు. అలాగే సాహిత్య లక్షణాన్ని వెలుగులోకి తీసుకురావటానికి కవితా ప్రక్రియలతోపాటు అపరిచయీకరణ (ఒస్త్రానిన్యా)ను సాధనంగా ఉపయోగించాలన్నారు. ఈ రెండు విమర్శనావాదాలు పరిమితులవల్ల, రాజకీయ కారణాలవల్ల 1960 నాటికల్లా కనుమరుగయ్యాయి.

ఆధునిక సాహిత్య విమర్శలో ముఖ్యంగా వినిపించేది రూపం. మన విమర్శకులు ఆధునికతను నిర్ధారించే విషయంలో వస్తువుతోపాటు రూపానికి ప్రాముఖ్యత ఇచ్చారు. `Form' అన్న పదానికి సమానార్థకంగా తెలుగులో 'రూపం' అనే పదాన్ని వాడుతున్నాం. కవి ఎన్నుకున్న వస్తువు ఏదో ఒక రూపంలో పాఠకులకు చేరాల్సిందే. అంటే రూపం పొందని

వస్తువు వ్యర్థం. రూపం అన్న మాటలో రెండంశాలు దాగున్నాయి. ఒకటి బాహ్యరూపం. వచన కవిత, నవల, కథ మొదలైనవి. రెండు శిల్పం. ఒక వస్తువును వ్యక్తీకరించే విధానం. దీనిలో ప్రతీకలు, భావచిత్రాలు, భాష, అలంకారాలు మొదలైనవి ప్రాధన్యత వహిస్తాయి. "Form is one of the most frequent terms in literary criticism, but also one of the most diverse in its meanings. It is often used merely to designate a genre or literary type ("the lyric form", "the short story form"), or for patterns of meter, lines, and rhymes ("the verse form", "the stanza form")" (Abrams, M.H. 1999: 101).

"ఒక రచన యొక్క అంతర్గత సమీకరణ (Inner Urganisation), సుస్థిర నిర్మాణం (Structure) సాహిత్యరూపం అవుతాయి. ఆ రూపం వస్తువును ప్రత్యేక వ్యక్తీకరణ సాధనాల ద్వారా వెలిబుచ్చుతుంది" (మధుసూదనరావు, త్రిపురనేని. 1997: 13). పై నిర్వచనంలో రెండంశాలు ఉన్నట్టు తెలుస్తుంది. ఒకటి అంతర్గత సమీకరణం. అంటే కవి అభివ్యక్తీకరణలో ఎలాంటి వ్యూహాల్ని అనుసరించాలనేది. ఎలా చెబితే ఆ విషయం పాఠకుడికి సూటిగా చేరుతుంది, అర్థమవుతుంది అన్న విషయాలు దీనిలోకి వస్తాయి. రెండు సుస్థిర నిర్మాణం. ప్రాచీన సాహిత్యమంతా పద్యరూపంలోనే ఉంది. ఆ పద్యంలో జాతులు, ఉపజాతులు మొదలైనవి ఉన్నాయి. వాటిల్లో మాత్రలు, గణాలు, యతిప్రాసలు మొదలైనవన్నీ ఒక పద్ధతి ప్రకారం ఏర్పాటు చెయ్యబడ్డాయి. అది నిర్మాణం. ఇది బాహ్యరూపానికి చెందింది. ఇలా రూపంలోకి రెండంశాలు వస్తాయి.

## 4.1. రూపం - నిర్వచనాలు

రచనలను విడివిడిగా పరిశీలించినప్పుడు అందులో వస్తు రూపాల స్థితిని మాత్రమే గుర్తించగలం. వస్తు రూపాల క్రమ పరిణామాన్ని గుర్తించాలంటే రెండు కాలాల మధ్య సాహిత్య క్రమాన్ని గమనించాల్సి ఉంటుంది. ఇలా మనం సాహిత్య క్రమాన్ని గమనించినట్లైతే అనేక రూపాలు మనకు కనిపిస్తాయి. ప్రాచీన కాలం నుండి ఆధునికయుగ ఆవిర్భావం వరకు పద్యరూపంలోనే(నాటకమైనా, కావ్యమైనా, ప్రబంధమైనా ఇతర ఏ సాహిత్య ప్రక్రియైనా) సాహిత్య సృజన జరిగింది. ఆధునిక కాలంలో నవల, కథ, వ్యాసం, కవిత, మళ్ళీ కవిత్వంలో

దీర్ఘకవితలు, మినీ కవితలు, హైకూలు, రుబాయిలు, నానీలు మొదలైన అనేకానేక రూపాల్లో సాహిత్య సృజన జరిగింది.

"వస్తువును బట్టి రూపం ఏర్పడుతుందని గానీ వస్తువు రూపాన్ని ఎన్నుకుంటుందని గానీ అనగానే వస్తువుకూ రూపానికీ 'ఒకటి – ఒకటి సంబంధం'(One to one correspondence) ఉంటుందని భావించకూడదు. అంటే ఒక వస్తువు ఒకే రూపంలో వ్యక్తం కానవసరం లేదు. తనకు అనురూపాలనెన్నిటినైనా ఎన్నుకోవచ్చు. ఒకేరకం బంకమట్టితో ఒకే రకం పాత్రలే కాదు, రకరకాల పాత్రలు చెయ్యొచ్చు" (శివశంకర్, పాపినేని. 1996: 101). వస్తువు, రూపం అనేవి పరస్పర వ్యతిరేకాలు. వాటిమధ్య అననురూపత, అసమానత, అననుకూలత మొదలైన లక్షణాలుంటాయి. అయినా అవి కలిసి వుంటాయి. పరస్పర వ్యతిరేకాల మధ్యగల కలగలుపు సంబంధాన్ని వైరుధ్యం అంటారు. వస్తు రూపాల మధ్య ఏకత ఉంటుంది. తమ ఉనికికోసం అవి రెండూ కలిసి ఉండక తప్పదు. వస్తు రూపాల మధ్య ఏకతేగాక ఘర్షణ కూడా ఉంటుంది. ఈ ఘర్షణలో అవి ఒక దాన్ని మరోటి నియంత్రించటానికీ, అధిగమించటానికీ ప్రయత్నిస్తాయి.

మామూలుగా ఒక కళాఖండంలో వస్తురూపాలు పరస్పర నియమితాలుగా ఉంటాయి. వస్తువును బట్టి రూప విస్తృతి, వైవిధ్యం నియమించబడతాయి. రూప పరిధినిబట్టి వస్తువు ఆవిష్కరించబడుతుంది. వస్తు రూపాల్లో వస్తువు నిర్ణాయక పాత్ర నిర్వహిస్తుంది. సాధారణంగా వస్తువును బట్టి రూపం ఏర్పడుతుంది. వస్తువులో గుణాత్మక పరిణామం జరిగినప్పుడల్లా రూపంలోనూ మార్పురాక తప్పదు. అంటే కొత్త వస్తువు తనకు సరిపడే కొత్తరూపాన్ని ఎన్నుకుంటుంది. ఈ ఎన్నిక చివరిగా రచయిత అవగాహన బట్టే వుంటుందని చెప్పనక్కర్లేదు.

"ఒక సృజనశీలుడైన శాస్త్రవేత్త, నూతన వస్తు ఆవిష్కారంకోసం నిరంతరాయంగా ఎలాగ ప్రయోగాలు చేస్తుంటాడో, అదేవిధంగా కవి కూడా, ఒక కొత్త ఇతివృత్తాన్ని కొత్త రూపంలో ఎలా ఆవిష్కరించడమా? అని నిరంతరాయంగా – ప్రయోగాలు చేస్తుంటాడు. ఉదాహరణకి – ప్రాచీన కవుల్లో నన్నయభట్టు పద్యచ్ఛందాలను తెలుగు కవిత్వ ప్రకటనంకోసం తన భాషా పాండిత్యంతో, భావనా సంస్కారంతో, ఒక తరహాలో తీర్చిదిద్దాడు. కొంతకాలం గడిచేసరికి 'ఇది కాదు దారి' అని నిర్ధారించుకొని – పాల్కురికి సోమన పద్యాన్ని విడిచి, ద్విపదకు మెరుగులు దిద్దాడు. ఈ ఉభయుల ఉద్దేశాలను

గ్రహించుకున్న తిక్కన సోమయాజి పద్యరచనకొక మధ్యేమార్గాన్నేర్పర్చాడు. ఫలితంగా ఈ ముగ్గురు కవులు సాధించిన రూపశిల్ప ప్రభావం నుంచి ప్రబంధయుగ పర్యంతం సమర్థులైన కవులు పద్యాన్ని, ద్విపదనీ, కవిత్వ వ్యాసంగానికి అనువైన రూపాలుగా గ్రహించారు" (శ్రీకాంతశర్మ, ఇంద్రగంటి. 2007: 131). ప్రబంధయుగ కాలంలో ద్వర్థి కావ్యాలు, త్ర్యర్థి, చతుర్థి కావ్యాల రూపంలో, తాళ్ళపాక అన్నమయ్య, త్యాగరాజు, శ్యామశాస్త్రి వంటివాళ్ళు కీర్తనలతో, మరికొందరు కవులు బంధకవిత్వం, గర్భ కవిత్వం లాంటి చిత్ర విచిత్ర కవిత్వ బంధాలతో పద్యంలోనే వినూత్న రూపాలకు దారులు తీశారు.

"వస్తువు మారుతున్నదయ్యా – రూపం కూడా మారాలి. లేకపోతే సామరస్యం కుదరక, కవిత్వం చదికిలబడిపోతుందని – వేకంట పార్వతీశ కవులు హెచ్చరించారు. వీరు వంగీయ కావ్యధోరణి, ఏకేశ్వరారాధనలోని సౌందర్యాన్ని తెలుగు కవిత్వ కేదారంలోకి మళ్లించిన వైతాళికులు. వారు ఇట్లాగన్నారు

కేవల శ్లేషయే కావలయును కావ్య
　　మాధురి కను బుద్ధి మానుదాక
ఘన నారికేళపాకమున గ్రంథము వ్రాయు
　　కవి ప్రౌఢు దను వాదు కడచుదాక
దీర్ఘసమాసముల్ తెగి వ్రాయకుండిన
　　తేలిక యనువెర్రి తీరుదాక
నొక శబ్దమగు పల్కులుండు పద్యంబులే
　　హృద్యంబు లను నాడు లేగుదాక
దలచినప్పుడె యెన్నొపద్యములు వ్రాయ
దగు నను కవుల్ జనించుట తగ్గుదాక
నెంత తాపియించినను నీకు నెప్పటివలె
వెలయు భాగ్యంబుగలుగ దో తెలుగు భాస!

ఇది స్పష్టంగా రూపశిల్పంలో రావలసిన మార్పుకి సంకేతాలిచ్చే పద్యం" (శ్రీకాంతశర్మ, ఇంద్రగంటి. 2007 : 134 – 135).

తెలుగు సాహిత్యంలో వస్తువుకు, రూపానికీ అవినాభావ సంబంధం ఉంటుంది. In the experience of poetry they are not nerly "interwoven" or

"interdependent" or "simultaneous" or even "fused" for each of these words suggests a duality. They are indivisible. They are so completely intercreative that they are not "they" but "it". రూపమనేది కవిత్వాన్ని అనుభూతి చెందటంలో వస్తువుతో ఆధారపడి ఉండక, క్రమభంగం కాకుండా, మాటలు ఆంతరంగికంగా వస్తువును నిర్దేశిస్తూ ఉంటాయి. ఈ వస్తువు, రూపం పదాలలో సృజింపబడి ఉంటాయి. వస్తు, రూపాలు అవినాభావ సంబంధం కలిగి ఉంటాయని వీరి అభిప్రాయం" (చంద్రిక, యం. 1987 : 43).

నన్నయ నుండి నేటివరకు తెలుగు సాహిత్య చరిత్రలో ఎన్నో రూపాలు వచ్చాయి. ముఖ్యంగా వచన కవిత్వంలో ఎక్కువ కనిపిస్తుంది. "తెలుగు కవిత్వానికి, ఆమాటకు వస్తే భారతీయ భాషలన్నింటిలోని కవిత్వాలకు అనేక పరిమితులు, పరిధులు ఉన్నాయి. అందులో మొదటిది – మధ్యతరగతిచేత, మధ్యతరగతి యొక్క, మధ్యతరగతి కోసం కవిత్వం ఇది. మధ్యతరగతి జనాభా శాతం ఎంత, అందులో కవితాభిమానుల శాతం ఎంత అని ప్రశ్నించుకున్నప్పుడు – కవిత్వం పరిమితి గుర్తుకువచ్చి బాధ కలుగుతుంది. జాలి వేస్తుంది. ఇంక రెండోది – దాదాపు అయిదు దశాబ్దాల పాటు ఉద్యమ రాజకీయాలకు అనుబంధంగా ఉండి తెలుగు కవిత్వం పరిధి ఇంకా కుంచించుకుపోయింది. నేనిక్కడ ఈ మాట శుద్ధకవితావాదాన్ని దృష్టిలో పెట్టుకొని అనడం లేదు. కవి ఏమి రాయాలో ఉద్యమనాయకులు నిర్దేశించారు. అంటే వస్తు స్వేచ్ఛను కవి కోల్పోయాడు. వస్తువు, దృక్పథం ఒకటేనన్న భ్రమ మన కవులు చాలా మందిలో వ్యాపించింది. వస్తువు వేరు, దృక్పథం వేరు, నిజానికి వస్తువు రూపంలాంటిదే, రూపవైవిధ్యంలానే వస్తు వైవిధ్యం కూడా ఉంటుంది. కవిత్వం పరిణామచరిత్రను ఒక్కసారి అవలోకిస్తే ఆయా కాలాలలో వస్తువుకు ఒకసారి, రూపానికి మరోసారి ప్రాధాన్యం లభించడం కనిపిస్తుంది" (భాస్కరం, కల్లూరి. 2006 : 65 – 66). ఆయా సందర్భాలని బట్టి, ఆయా కాలాలని బట్టి ఆయా సాహిత్య రూపాలు, వస్తువులు ప్రాధాన్యతని సంతరించుకుంటాయి.

తెలుగు సాహిత్య ప్రస్థానాన్ని గమనిస్తే తెలుగు సాహిత్య రూప పరిణామ క్రమాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. ప్రాచీన సాహిత్యంలో కేవలం పద్యరూపం మాత్రమే. కాని ఆధునికకాలం వచ్చేసరికి సాహిత్యం కొత్త రూపాన్ని సంతరించుకుంది. విదేశీ సాహిత్య ప్రభావం కావచ్చు, అప్పటిదాకా కొనసాగుతూ వస్తోన్న పద్యం, గేయం లాంటివి ఆధునిక

భావజాలానికి సరిపడవన్న భావన కానివ్వండి ఏదిఏమైనా ఆధునికకాలంలో నవల, కథ, కథానిక మొదలైన నూతన సాహిత్య రూపాల్లోకి సాహిత్యం చేరింది.

"Form is of no value unless it is the form of its content' Marx, Carl. సార – రూప ద్వయంలో రూపం ప్రధానమైనదని, ప్రాథమికమైనదని, ఉన్నతమైనదని భావవాద తాత్వికులు నిర్ణయిస్తారు. ఇది భావవాదుల తలక్రిందుల ఆలోచనా ఫలితం. జనుల స్వభావాన్ని బట్టి జీవజాతుల స్వరూపం, అణునిర్మాణ స్వభావాన్ని బట్టి స్ఫటిక స్వరూపం, ఉత్పత్తిశక్తుల స్వభావాన్ని బట్టి ఉత్పత్తి సంబంధాల స్వరూపం ఏర్పడరతాయన్నది విజ్ఞానశాస్త్రం నిరూపించిన సత్యం. సారం మారినప్పుడు తదనుగుణంగా రూపం మారుతుంది. అంటే రూపంలో మార్పు సారంలో మార్పును ప్రతిబింబిస్తుంది. రూప – సార ఐక్యతను ఆవశ్యమైనదిగా భావిస్తూ సారం ప్రాథమికమైనదని, ప్రధానమైనదని, రూప నిర్మాణం సారంపై ఆధారపడి వుంటుందని అంటే సారం నిర్ణయాత్మక స్వభావాన్ని కలిగి ఉంటుందని గతితార్కిక భౌతికవాదం పరిగణిస్తుంది. అయితే రూపం కూడ క్రియాశీలమైనదని, సారంపై తనదైన ప్రభావాన్ని ప్రసరింపజేస్తుందని కూడా స్పష్ట పరుస్తుంది" (మధుసూదనరావు, త్రిపురనేని. 1997: 18 – 19).

"ఛందస్సులో పద్యనిర్మాణానికి పద్ధతులు సిద్ధంగా ఉంటై. అక్షరాలూ, గణాలూ, అక్షరక్రమం, గణక్రమం, యతులు, ప్రాసలు ఇట్లాంటివన్నీ నిర్ణీతమయి ఉంటై అందం కోసం కవి కొన్ని కల్పించుకోవచ్చు. పద్యస్వరూపం మాత్రం సిద్ధమయ్యే ఉంటుంది. వచన పద్యానికి రూపం తయారుగా ఉండదు. కవి నిర్మించుకోవాలి. ఛందస్సులో రాసే కవి సిద్ధంగ వున్న పద్యపు చట్రాల్లో అవసరమయిన వాటిని ఏరుకుంటాడు. 'వచన కవి' కవితా రూపాన్ని తానే సృష్టించుకోవాలి. అతనికి సిద్ధంగా దొరికేవి వాక్యాలు, వాటి పరస్పర సంబంధాలు, వాక్యాల్లో పదాల పరస్పర సంబంధాలు. ఈ సంబంధాలనే వ్యాకరణం అంటారు. ఈ వ్యాకరణ సంబంధాల ఆధారంగానే కవితారూపాన్ని నిర్మించుకోవాలి. ఎప్పటికప్పుడు కొత్తరూపం సృష్టించుకొంటున్నప్పుడు, ఆ రూపాల సంఖ్యకు పరిమితి లేదు. కవి సృజన శక్తిని బట్టి కవితా రూపం ఉంటుంది" (రామారావు, చేకూరి. 1997: 132). పద్యానికి ఒక నిర్మాణం అప్పటికే తయారుచేయబడి ఉండడం వల్ల దానికి శ్రమించాల్సిన అవసరం లేదు. కాని ఒక కొత్త రూపం నిర్మించాలన్నప్పుడు వాక్యాల పరస్పర సంబంధంతోనే నిర్మించాలనే అభిప్రాయం ఇక్కడ కనిపిస్తుంది.

## 4.2. రూప ఆవిర్భావం – కారణాలు

సాహిత్యంలోకి ఒక కొత్త ప్రక్రియ రావడానికి గల కారణాలు ఏంటి? అని మనం ప్రశ్నించుకుంటే కొన్ని విషయాలు అవగాహనలోకి వస్తాయి. "ఏ సాహిత్యంలోనైనా ప్రక్రియా విమర్శ చేసే విమర్శకుడుగానీ, ప్రయోగం చేసే రచయితలుగానీ క్రొత్తగా వచ్చిన రచనను అంతకుముందున్న ప్రసిద్ధ ప్రయోగంతోనో, ప్రక్రియతోనో పోల్చి క్రొత్తపాతలను విలువలను వివేచించుకొంటాడు. ఆ వివేచనలో నాలుగు రకాలైన ప్రమాణాలు పరిగణింపబడతాయి.

1. పూర్వ ప్రక్రియతోగల ఆనుగణ్యత(Conformity)
2. పూర్వప్రక్రియల కంటె గల వైవిధ్యం లేదా మార్పు (Variation)
3. పూర్వ ప్రక్రియలకంటె అభినవత్వం లేదా సృజనాత్మకత (Innovation)
4. పూర్వ ప్రక్రియలపట్ల నిరసన భావం లేదా ద్వేషభావం లేదా తిరుగుబాటు ధోరణి (Antagonism).

ఈ నాలుగు రకాల ప్రవృత్తులూ ప్రకియలలో నవ్య పరిణామాలకు కారణాలు అవుతూ ఉంటాయి. అంటే – ప్రక్రియ రూపాంతరం పొందటానికి దోహదకారులౌతాయన్నమాట!" (సుబ్రహ్మణ్యం, జి.వి. 2005: 117). పై ఉటంకింపులో రూప ఆవిర్భావానికి దారితీసే కారణాలేమిటో మనకు స్పష్టంగానే అర్థమవుతాయి. అంతకు ముందున్న రూపంతో విభేదం, వైవిధ్యం, కొత్తగ సృష్టించాలన్న తపన, తిరుగుబాటు ధోరణులవల్ల ఒక కొత్త రూపం వస్తుంది.

1. వస్తువును ఆశ్రయించుకొని రూపం ఉంటుంది. రూపాన్ని ఆశ్రయించుకొని వస్తువు ఉంటుంది. అంటే రెండూ విడదీయలేనంత సంబంధాన్ని కలిగి ఉంటాయి
2. వస్తు, రూపాలు విడదీయలేనంత సంబంధాన్ని కలిగి ఉండి కూడా వైరుధ్యస్థితిలో ఉంటాయి. అంటే ఒక దానిపై మరొకటి ఆధిక్యతను కలిగి ఉంటాయి. ఇది దృక్పథాన్ని బట్టి ఆధారపడుతుంది.
3. రూపాన్నిబట్టి వస్తువు కొన్నిసార్లు, వస్తువునిబట్టి రూపం కొన్నిసార్లు పాఠకుల ఆకర్షణకు గురవుతుంటాయి.
4. 'రూపం' కొన్నిసార్లు ప్రక్రియగా పిలవబడుతుంది. కానీ ప్రక్రియ రూపం అరుదుగా అంగీకరింపబడుతుంది.

కాలానుగుణంగా వస్తువుతోపాటు రూపంలోనూ మార్పు కన్పిస్తుంటుంది. అయితే అది చారిత్రక సందర్భాల్లోనే కనిపిస్తుంది" (శరత్ జ్యోత్స్నారాణి, ఎస్. 2003: 26). రచనా రూపంలో కూర్పు(Composition), కథాప్రణాళిక(Plot) ముఖ్యాంశాలు. కూర్పు అనేది నిర్మాణానికి సంబంధించింది. రచనలో వేర్వేరు విభాగాల సహసంబంధమూ, ఏర్పాటు కూర్పు అవుతాయి. భావాల కూర్పు, శబ్దాల కూర్పు కూడా ఇందులో ఉంటాయి. ఇక కథాప్రణాళిక రచనలోని సారూప్యాల మధ్య వైరుధ్యాల మధ్య లంకె ఏర్పరుస్తుంది. ఇది రచనలోని ఆయా పాత్రల, సన్నివేశాల అభివృద్ధికి చెందిన అంశం. కార్యకారణ సంబంధం గల అంశం. ఈ అంశాలే గాక రచనా ప్రక్రియ, వస్తు వ్యక్తీకరణ సాధనాలైన కళాత్మక భాష, వర్ణనలు, భావశబ్ద చిత్రాలు(Images), ప్రతీకలు(Symbols), లయలు మొదలైనవి రచనా రూపంలో ఉంటాయి.

## 4.3. కరీంనగర్ జిల్లా కవిత్వం – రూప విశ్లేషణ

కరీంనగర్ జిల్లా కవిత్వ పరిణామ క్రమాన్ని(2001 – 2010) గమనించినట్లైతే వచన కవిత్వంతో పాటు దీర్ఘకవితలు, మినీ కవితలు, హైకూలు, నానీలు, పేరడీ మొదలైన కవితా రూపాలు కనిపిస్తాయి.

### 4.3.1. వచన కవిత్వం

#### 4.3.1.1. పరిచయం

ఆధునిక తెలుగు సాహిత్యంలో కవిత్వానిది ప్రముఖ స్థానం. పాశ్చాత్య సాహిత్య ప్రభావంవల్ల ఆవిర్భవించిన సాహితీ రూపాల్లో కవిత్వం ఒక్కటి. నవల, కథ, వ్యాసం, నాటకం వంటి భిన రూపాలున్నా కవిత్వం తనదైన స్థానాన్ని ఎప్పుడూ కోల్పోలేదు. కవిత్వం తన శిల్పంతో మిగతా రూపాలపైన కొంత ప్రభావం కూడా వేయగలిగింది. నవలలో, కథలో, నాటకంలో, వ్యాసంలో కవితా పద్ధతిని పాటించిన రచయితలు మనకు అనేకమంది కనిపిస్తారు.

"ఇరవయ్యో శతాబ్దం నవ్యతకు పర్యాయపదంగా రూపొందింది. ఇరవయ్యో శతాబ్ద ప్రారంభమే నవ్య కవితోద్యమానికి కూడా ప్రారంభకాలం. ఈ ఉద్యమ వ్యాప్తికి అసలు కారణం ప్రబంధ పద్ధతి రానురాను కృతకరూపం ధరించి, కవులకూ ప్రజలకూ విసుగు

పుట్టించడం. ఇతర కారణాలు ఎన్నైనా వుండవచ్చు. మనమీదపడిన, పాశ్చాత్య రచనల ప్రభావం అనండి, ప్రథమ ద్వితీయ ప్రపంచ సంగ్రామాల ఫలితంగా యావత్ప్రపంచంలో కలిగిన మార్పులనండీ – యివన్నీ రెండవ తరహాకు చెందిన కారణాలే. తెనుగు కవులమీద విశ్వకవి రవీంద్రుని ప్రభావం కూడా యిట్టిదే. ఇవన్నీ జరిగినమాట నిజమే. కాని మనకు అవి సోకినా, మందులాగా పనిచేయటానికి అనువైన వాతావరణం అప్పటికి వుండటమే ముఖ్యమైన కారణం. ఆధునిక కవిత్వం ఆవిర్భవించిన రోజులలోనే యేమి, ఏ రోజులలోనైనా తత్కాల సంబంధమైన వివిధ ప్రభావాలు సోకుతూనే వుంటాయి. కాని అప్పటి మనస్థాయి, పునాది దృఢంగా వుంటే అవేమీ చేయలేవు" (ఆంజనేయులు, కుందుర్తి. 1987: 65). ఇరవయ్యో శతాబ్ది అంత ప్రత్యేకమైంది కనుకే తెలుగు సాహిత్య చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది. ఈ శతాబ్దంలో అనేక నూతన కవితా రూపాలు తెలుగు సాహిత్యంలో వికసించాయి.

"స్వాతంత్ర్యం వచ్చిన మొదటి దశాబ్దంలోనే ఈ వచన కవితా రూపంలో సంపూర్ణ కావ్య నిర్మాణం చేయాలనే ఆకాంక్ష, దీనిలో నాటకాలను కూడా రాయవచ్చునేమో ప్రయోగం చేసి చూడాలనే అభిప్రాయం కవుల్లో కలిగింది. అభ్యుదయ కవుల్లో ప్రయోగవాదులైన కొందరు కవులు పాశ్చాత్య కవితా రీతుల ప్రభావంతో కొన్ని అయోమయ పద్ధతులను వచనకవితలో ప్రవేశ పెట్టడంతోపాటు సంపూర్ణ కావ్యము, నాటకము వ్రాయాలనే నిర్మాణాత్మకమైన ఆలోచన కూడా కవుల్లో బాగా వృద్ధి పొందింది. దీనితో వచనకవితకు ఒక స్థిరత్వం ఏర్పడింది. క్రమేణా పెరిగి పెరిగి అన్ని రకాల అభిప్రాయాలు కలిగిన కవులందరికీ ప్రధాన వాహికగా అభివృద్ధి పొందింది. స్వాతంత్ర్యానంతరం దాదాపు రెండు దశాబ్దాల కాలం తెలుగులో వచ్చిన కవితలన్నింటిలో వచన కవితా రూపమే ఎక్కువగా అందరిని ఆకర్షించింది. కొద్దో గొప్పో చదువు సంధ్యలు కలిగిన మధ్యతరగతి ప్రజలు కూడా వచన కవిత్వం వినడానికి, అవగాహన చేసుకోడానికి అలవాటుపడ్డారు. తెనుగు కవిత్వానికి మాత్రాఛందస్సులే తుది రూపం అన్న వాదన నిలువలేదు. గురజాడ ప్రారంభించిన 'ముత్యాలసరాలు' అనే రూపం జానపద వాఙ్మయం నుండి గ్రహించబడినదైనప్పటికీ అప్పటినుండి మాత్రాఛందస్సులలో వచ్చిన కవిత్వమంతా మార్గ కవితా సంబంధిగానే వుంటూ వచ్చింది. శ్రీశ్రీ ప్రభృతులకు ఉన్నంత వ్యుత్పత్తి లేని కారణం చేత అంతా భాషాపాటవం తదనంతర కవులు చూపలేకపోయినప్పటికీ సరళమైన మాత్రాఛందస్సుల రూపం కూడా మార్గ కవిత్వంలో భాగంగానే యిమిడిపోయింది. అయితే వచన కవిత్వం

అనేది పుట్టిన తర్వాత వచ్చిన ప్రధానమైన మార్పు భాషలోనే వచ్చింది. వ్యావహారిక భాష ఉద్యమంవల్ల వచనంలో కలిగిన సారళ్యాన్నీ, సౌలభ్యాన్నీ వచన కవితా రూపం మాత్రమే జీర్ణించుకోగలిగింది. పూర్వకాలపు కావ్యభాషలోని సంస్కృత పదజటిలత్వమూ, సమాస అలంకారిక ఆడంబరమూ ప్రదర్శించడానికి వీలులేనంత క్రొత్తగా వచన కవితా తన రూపాన్ని మలుచుకుంది. దీనితో కవిత్వం ప్రజాస్వామ్యం యొక్క అవగాహన పరిధి అందుకునే అవకాశం కొంతలోకొంత కలిగింది. మనదేశంలో మరీ నిరక్షరాస్యులైన కొట్లాది ప్రజానీకం దగ్గరికి పోలేకపోయినా, అక్షరాస్యులైన మధ్య తరగతి, క్రింది తరగతి ప్రజల వద్దకు పోగల్గినంత సూటిగా, సరళంగా, నిర్మలంగా వచన కవితా రూపొందింది. తెలుగు కవితా రంగంలో స్వాతంత్ర్యానంతరం చెప్పుకోదగిన మార్పు ఏదైనా వచ్చిందా అంటే వచ్చింది అని చెప్పుకోవాలి. అభ్యుదయ కవులు ఇదే అరంభం నుండి ఆశించిన ప్రజల సాన్నిహిత్యం దీనివలన కొంతవరకు సిద్ధించింది” (అంజనేయులు, కందుర్తి. 1987: 77 – 78). ప్రాచీనకాలం నుంచి భావకవిత్వం(1910 – 1930) వరకు కూడా మాత్రాఛందస్సుల రూపంగానే ఉన్న కవిత్వానికి అభ్యుదయకాలంలోనే వచన కవితకు ఒక రూపం ఏర్పడింది.

### 4.3.1.2. ఆవిర్భావ కారణాలు

“తెలుగు సాహిత్యం ఇటీవలి వరక ఇంచుమించుగా పద్య గేయాత్మకంగానే సాగింది. పందొమ్మిద, యిరవైయవ శతాబ్దంలో ఆంగ్లభాషా ప్రభావంవలన ఈ సాహిత్యంలో వచనానికి క్రమక్రమముగా ఎక్కువ ప్రాముఖ్యం లభించడం జరిగింది. ఆర్థిక, రాజకీయ, సాంఘిక వ్యవస్థలో వచ్చిన మార్పులవలన సమాజంలో జన సామాన్యం కొంత ప్రతిపత్తిని, ప్రాముఖ్యాన్ని సంపాదించుకున్నది. ఇందువలన పండితులకూ, ప్రత్యేక వర్గాలవారికే పరిమితమయిన సాహిత్యం ప్రజా బాహుళ్యపు అందుబాటులోనికి రావలసివచ్చింది. వచన ప్రక్రియాగతాలైన వ్యాసాలు, నాటకాలు, నవలలు, కథానికలు తెలుగు సాహిత్య రంగంలో విప్లవధ్వజాలెత్తి, వీధుల్లో ప్రజాహృదయ వీధుల్లో విహరించడం మొదలు పెట్టాయి. బుద్ధిమంతులూ, ప్రగతిశీలురైన కవులు తమ కవితా గంధాన్ని పద్యపేటికలో భద్రపరచి ప్రజా బాహుళ్యానికి దారం కావటం ఇష్టంలేక వారికి సులభానుభవయోగ్యమైన గేయ, వచన గేయప్రక్రియలో, తత్కవితాపరిమళాలను వెదజల్లడం ప్రారంభించారు” (బాపురెడ్డి, జె. 2007: 24 – 25).

పాండిత్య ప్రకర్షణకోసం దీర్ఘ సంస్కృత సమాసాలతో, ఒకే పదానికి రెండు, మూడు, నాలుగు అర్థాలు వచ్చేటట్టు ప్రయోగించడం, ఛందస్సును ఉపయోగించడం మొదలైన కారణాలవల్ల రచనలు సామాజిక పాఠకులకు చేరలేకపోయాయి. అలాగే పాశ్చాత్య దేశాల్లో ఆధునికత పేరుతో 17, 18 శతాబ్దాల్లో సాహిత్యంలో, కళల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. వాటిని అధ్యయనం చేయడంవల్ల ఇక్కడి కవులు, కళాకారులు ప్రభావితులయ్యారు. అలాగే సామాజికంగా వచ్చిన ఉద్యమాలు కూడా కొంత ప్రభావితం చేశాయి. "వచన కవిత్వం పుట్టడానికి ఆద్యులుగా పేర్కొన్నవారి ద్వారానూ ఆనాటి యువకవులు ఆంగ్లభాషద్వారా తెలుసుకున్న ఇతర సాహిత్యాలలోని పరిస్థితుల ద్వారానూ పాశ్చాత్య ప్రభావం యువకవులమీద పడివుండడం కొంతవరకు కారణమైతే అయివుండవచ్చు, కానీ జాతీయ పరిస్థితుల ప్రకారం చూస్తే ప్రధానమైన కారణం వేరొకటిగా కనిపిస్తుంది. స్వాంతంత్ర్యం రాకముందు మనమందరం ఎన్ని త్యాగాలు చేసి అయినా సరే పరదాస్యం నుండి స్వేచ్ఛపొందాలనే దీక్షతో పోరాడుతున్న రోజులవి. ఈ స్వేచ్ఛా ప్రియత్వం రాజకీయరంగానికేకాక జీవితంలోని ఇతర రంగాలన్నింటికీ వ్యాపించింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామిక యుగ ధర్మంగా స్వేచ్ఛా ప్రియత్వం అందరినీ ఆకర్షంచింది. సాహిత్యంలోకూడా ఛందస్సునుండీ, భాషాభేషజంనుండీ, పాండిత్యంనుండీ, అలంకారిక శాసనాల నుండీ వ్యాకరణం మొదలగు ఇతర అంశాల నుండీ కూడా స్వేచ్ఛ కోసం కవుల మనస్సుల పరితపించాయి. ఫలితం వచన కవిత్వం" (ఆంజనేయులు, కుందుర్తి. 1987: 237). నిర్బంధాల మధ్య తమ భావాల్ని అనుకున్నట్టుగా వ్యక్తపరచలేరు కనుక, వ్యాకరణం, ఛందస్సనే కట్టుబాట్లమధ్య బంధీ అయిన కవితకు స్వేచ్ఛా ప్రపంచం ఒకటి కావాలని కవులు తపించారు.

"సామాజిక వస్తువు సంక్లిష్టంకాకుండా కవిత్వం సంక్లిష్టం కాజాలదు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఫలితాలైన ఆధునిక సంక్షుభిత సంబంధాల్లోంచి వచన కవిత్వం పుట్టింది. వచన కవిత్వంలో సంక్లిష్టత పుట్టుకొచ్చింది. సంక్లిష్టత మౌలికంగా ఆధునిక కవిత్వ లక్షణం" (అరుణతార. మే, 1991: 18) అన్న పాపినేని శివశంకర్ మాటలవల్ల పెట్టుబడిదారీ వ్యవస్థవల్ల కలిగిన సామాజిక సంక్లిష్టతలోంచి వచన కవిత ఆవిర్భావం జరిగినట్టు తెలుస్తుంది.

### 4.3.1.3. లక్షణాలు

వచన కవిత ఒక రూపంగా స్థిరపడుతున్న కాలంలో వచన కవితా లక్షణాల గురించి చాలానే చర్చ జరిగింది. ఈ లక్షణ చర్చ చేసిన వాళ్ళలో కుందురి ఆంజనేయులుగారు, చేరా గారు, కోవెల సుప్రసన్నాచార్య గారు ముఖ్యులు. కుందుర్తి ఆంజనేయులు గారు "ప్రజా జీవితాలను సర్వ సమగ్రంగా చిత్రించ ప్రయత్నించడం ఆధునిక కవితా లక్షణం" (ఆంజనేయులు, కుందుర్తి. 1987: 129) అని ప్రజాజీవితంలో అన్ని అంశాల్ని చిత్రించడం ఆధునిక కవితా లక్షణంగా చెప్పారు. అలాగే మాత్రా ఛందస్సును వదలడం, ప్రజల భాషను వాడడం, సమకాలీన సమాజ వస్తువును గ్రహించడం, క్లుప్తత మొదలైన లక్షణాల్ని చెప్పారు.

వచన కవిత్వంలో భాష సౌలభ్యం అంటే సామాన్య పాఠకులకి కూడా వచన కవిత భాష అర్థం కావడం. ఛందస్సులో స్వేచ్ఛ ప్రియత్వం, క్లుప్తత, లయ, తూగు, వస్తువు సమకాలీన సమాజానికి సంబంధించినదై ఉండాలి. "పై నిర్వచనాలన్నింటిని పరిశీలిస్తే వచన కవితా లక్షణాలు సంక్షిప్తంగా నిరాడంబరత, గణ నియమం లేకపోవడం, నియమ(ఛందో) రాహిత్యం, నడకలో వైవిధ్యం, వాక్యాల విరుపు, అంతర్లయ, అర్థగాంభీర్యత నిగూఢత, వ్యవహారిక పదాల ప్రయోగం, సూటిదనం, సరళత, క్లుప్తత, వస్తువైవిధ్యం, బలమైన భావ ప్రకటనా లక్షణాలు కనిపిస్తాయి" (వినాయక్, సువర్ణ(సంపా.). 2017: 203).

### 4.3.1.4. కరీంనగర్ జిల్లా వచన కవిత్వం

"చలికాలం – ఓ వింత జంతువు
అటు కొంత మధ్యాన్నాన్ని
ఇటు కొంత సాయంకాలాన్ని
కలిపి భోంచేసి
రాత్రిని గబుక్కున కక్కేస్తుంది
చలికి భయపడి – వీధి దీపాలు
ఉదయం పదింటివరకు నిదురే పోవు
కొమ్మలకున్న మొగ్గలు
విచ్చుకోవడానికే వణుకుతాయి

నిదుర దుప్పటిని శ్వాసిస్తూ
ఉన్ని కాపడంలో జనం"

(హిమజ. 2006: 33)

చలికాలంలో పగలు తక్కువగా ఉంటుంది. రాత్రి పాలు ఎక్కువ. ఉదయం తొందరగా తెల్లారదు, సాయంత్రం తొందరగానే చీకటి పడుతుంది. దాన్ని ఇక్కడ కవయిత్రి జంతువుతో పోల్చిన తీరు బాగుంది. పొద్దున పదిగంటలైనా మసక మసక ఉండడంతో వీధి దీపాలు ఆర్పేయరు. దాన్ని మానవగుణారోపణతో కవిత్వీకరించారు. ఎండరాని కారణంగా మొగ్గలు విచ్చుకోవు. మొగ్గలు అంటే ఇక్కడ చిన్నపిల్లలని అనుకుంటే ఎండలేకపోవడంతో చలికి నిద్రలేవరు.

"నున్నగా ఊడ్చి పచ్చగా అలుకుచల్లి
చలికాలం వాకిట్లో వేసిన రథంముగ్గు
ఇప్పుడు ఎంత బామాలి బతిమిలాడి బుదరకిచ్చి
చేతుల్లోకి తీసుకున్నా
చంకకురాక గొడగొడ కన్నీళ్లు తెప్పిస్తుంది
ఎర్రమన్ను అలికి గద్దెల చుట్టూ పరిచిన
చిటికెల ముగ్గు స్కేలు లేకుండా చక్కగా గీసిన తీగలు చుక్కలూ
గుండెల్లో భద్రపరుచుకున్న పెయింటింగ్
ఎక్కడా ఎప్పుడూ ప్రదర్శించ చేతులు రావడంలేదు
ఎగచల్లిన అన్నంమెతుకుల్లా చెల్లా చెదురైనా
ఆసుపత్రి మంచంపై వుండి కూడా
అందరినీ ఒక్కచోట క్షణంలో కట్టిపడేయడమే అమ్మతనం"

(జగన్నాథం, జూకంటి. 2013: 71)

కవితా వస్తువు గొప్పతనాన్ని చెప్పడానికి అవసరమయ్యే కొన్ని వాక్యాలు ఉత్తమమైన కవితలో కనిపిస్తాయి. పై కవితలో రథం ముగ్గు గొడగొడ ఏడ్వడం, ముగ్గు ప్రపంచంలో ఎక్కడ ప్రదర్శనకు నోచుకోకపోవడం, ఎక్కడికెక్కికో వలసపయిన కొడుకుల్ని కలిపే ప్రేమసూత్రం అమ్మకావడం అమ్మ గొప్పతనాన్ని తెలిపే వాక్యాలు. 'చలికాలం వాకిట్లో వేసిన రథం ముగ్గు' అన్న వాక్యం ఉగాది పండుగను తెలియజేస్తుంది. ఊళ్ళల్లో ఇప్పటికీ ఉగాది

వచ్చిందంటే వేసే ముగ్గు రథం ముగ్గు. అలాగే అది చలికాలంలోనే వస్తుంది. 'ఎగచల్లిన అన్నంమెతుకుల్లా చెల్లా చెదురైనా' అన్న వాక్యం వలసపోవడాన్ని తెలియజేస్తుంది. ఇలా ప్రతీకలు వాడి కవిత్వ సాంద్రతను పెంచారు. అలాగే తన చుట్టూ ఉన్న ప్రజల సంభాషణ భాషని వాడడంవల్ల ఈ కవితకి సహజత్వం వచ్చింది.

"ఎన్నెన్ని ఆత్మీయ సన్నివేశాలను
ఈ పొడిపొడి అక్షరాల్లో పొదిగిచూపను.
ఈదాలనే కోరిక పొటమరించి
నేను బెరుకుబెరుకుగా తనను చేరుకున్నప్పుడు
నురగ వేళ్ళతో నున్నగా నిమురుతూ
తన గుండె ఒడిలో
నన్నొక చేపలాగా చేర్చుకునేది.
సరదా పురులు విప్పి నేను గంతులు వేస్తుంటే
హఠాత్తుగా నా నడుమును చుట్టేసి
నన్నే ఒక ఆటబంతిలా సున్నితంగా ఎగరేసేది.
ఏమీ తోచక ఒడ్డున కూర్చుని నేను
దిక్కుల పుటలను తిరగేస్తుంటే
తానే ఒక భావధారగా మారి
నాలోని సర్వజీవాణువుల్లో
ఆర్ద్ర స్వరాలను పలికించేది.
ఏదీ ఆ నది?
నా ఆ బాల్యమైత్రీ నిధి."

(నారాయణరెడ్డి, సి. 2004: 1 – 2)

'వాగు ఎండిపాయరా... పెదవాగు తడి పేగు ఎండి పాయెరా' అంటూ వాగు ఎండిపోవడాన్ని, వాగుతో తనకున్న అనుబంధాన్ని, ఆ వాగు సౌందర్యాన్ని అద్భుతంగా గానం చేశారు గోరటి వెంకన్న. ఒకప్పుడు గలగల పారిన వాగులన్నీ, నదులన్నీ వర్షాలులేక ఎండిపోయాయి. ఎండిపోయిన నీటి చుక్కలన్ని ఇప్పుడు అక్షరాలుగా మారిపోయాయి. పిల్లలు ఈతకొట్టడం, చేపలు పట్టడం, చాకలివాళ్ళు బట్టలుతకడం లాంటి ఎన్నో పనులు

వాగుతో, నదితో ముడిపడ్డ విషయాలు. ఆ నది ఎండిపోవడంతో ఆ విషయాలన్ని కవితా వాక్యాలుగా మారాయిప్పుడు.

"గత స్మృతుల పూదోట నుండి
పుప్పొడి రేణువుల్ని మోసుకొస్తున్న
జ్ఞాపకాల సీతాకోక చిలుకలు...
తేనెలూరుతున్న భావనలు....
మబ్బులు పట్టిన ఆకాశంలా నామనసు.....
విషాదకరమైన ఒంటరి తనం...
ఎదురు చూపులు చివరివయ్యేలోగా
ఏది నేస్తం...
ఒక్కసారి,
నీ స్నేహహస్తం
అందివ్వవూ....!!!"

(రవీంద్ర, సంగెవేని. 2005: 32)

విషాదకరమైన ఒంటరితనపు తీరం మీద రాసుకున్న కవిత ఇది. గతమెప్పుడు ఒక అందమైన పూదోట. దాంట్లోని పుప్పొడి రేణువులు సంఘటనలను మోసుకొచ్చేవి జ్ఞాపకాలు. కాని ఆ పూదోటలో విషాదం కూడా ఉంటుంది. చిన్నతనంలో కలిసిమెలిసి ఆడి పాడి ఆనందంగా గడిపిన స్నేహితుల్ని వలస చేరో దిక్కుకు విసిరేసింది. అలా ఎడబాటులో గాయపడ్డ హృదయం మరో స్నేహితుడికై రాసిన కవితే ఇది.

"సాగువాటు మడిల
అలుకుడు బోనం
బంతి పూలతో పూదిచ్చి
శబ్దవాణి నరాల
నారుసుట్టు నాటి
వలస పిట్టలు వాలకుండా
వడిశెలందుకుందాం..!
తన్నీరు తడిల

మొలక మురగకుంట
దోసిల్లతో నీల్లెత్తి
గాలి మెత్తగాల్ల
ముక్కులు పలిగిన మడిదున్ని
గొర్రుకొట్టి గోకలు బెట్టి
నాటేసి....
కలుపు మొక్కలు కలిసి పీకేసి
పొట్టకొచ్చిన పంటకు
సీతల సీమంతం
అర్కతి బర్కతికి
పొలిజేసి బలిజల్లి
పరపాలకులు పొలిమేర పారంగ
తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకుందాం".

(బాలయ్య, పొన్నాల. 2008: 85)

ప్రత్యేక తెలంగాణోద్యమాన్ని వ్యవసాయంగా చూపిస్తూ చివరగా తెలంగాణ రాష్ట్ర పంట వచ్చేవరకుగల వివిధ దశల్ని చిత్రించడం గొప్ప విషయం. తెలంగాణ నారుమడిలో నీళ్లు, నిధులు, ఉద్యోగాల నారునుబుక్కే వలసపిట్టలు వాలకుండా మాటల నరాల్ని ఆ మడిచుట్టూ నాటి వడిశెలతో సిద్ధంగా ఉంటానంటున్నారు. ఎలాంటి కష్టాన్నైన ఓర్చుకొని తెలంగాణోద్యమాన్ని నడిపిస్తూ పరాయి పాలకుల్ని తరిమేసి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకుందామనడంలో బలమైన కాంక్ష కనిపిస్తుంది.

"ఓ నిశ్శబ్దనది చుట్టేసినట్టు
సద్దుమనిగిన రాత్రిమీద
సంగీతమై ప్రవహిస్తావు
కుండపోతగా కురుస్తున్న అనుభూతుల క్రింద
నిలులెల్లా పాటైతడుస్తావు
నీ పాటలో మునిగిపోయి
ఊరి ప్రక్క పొలాలమీద

ఈదులాడిన తూరుపు బావినీటిమధ్యన
కరిగీ....కరిగీ....
బాల్యపు రహదారుల్లోకి ప్రవహిస్తాను
పెనునిద్దట్లోంచి నీ పాటకోసం వెతుక్కుంటాను
నీ సంగీతపు ధ్వనులు పరుస్తూ
నా గది ముద్దవుతున్నప్పుడు
కాసింత కునుకుతీస్తాను
నీ పాట కనురెప్పలపై కాపలా కాస్తుండగా..."

(చెమన్. 2001: 4)

నిశ్శబ్దనది చుట్టేసిన రాత్రిమీద సంగీతమై ప్రవహించడం, పాటలో మునిగిపోయి తూరుపు బాయి నీటి మధ్య తేలడం, పాట కనురెప్పలపై కాపల కాయడం లాంటి పదాలవల్ల ఇది విప్లవ కవితగా గుర్తించవచ్చు. శ్రీకాకుళంలో పొడిచిన ఎర్రజెండా తన కిరణాల్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంతటా ప్రసరింపజేసింది. దాని వెలుగులో విచ్చుకున్న తుపాకులు ఎన్నో. కవాతు చేసిన కలాలు ఎన్నో. 1970 తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా విప్లవ సాహిత్యం వచ్చింది. దోపిడి, దౌర్జన్యం, బానిసత్వం, పీడన మొదలైనవాటిని అంతం చేసేది ఒక్క విప్లవమే అన్న భావనతో 1970లో విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. ఆ ప్రభావంవల్ల చాలామంది కవులు రచనలు చేశారు.

### 4.3.2. దీర్ఘ కవితలు

#### 4.3.2.1. పరిచయం

ఆధునిక కాలంలో తెలుగు సాహిత్యం అనేక విధాలుగా పరివ్యాప్తమైంది. ఈ ఆధునిక కాలంలో విస్తృతంగా వచ్చిన ప్రక్రియ కవిత్వం. రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాల కలయికతో కవిత్వం విస్తరిస్తూనే ఉంది. భావ, అభ్యుదయ, విప్లవ, స్త్రీ, దళిత మొదలైన ఉద్యమాలన్నీ ఎక్కువగా కవిత్వంలోనే వచ్చాయి. ఇలాంటి కవిత్వంలో కనబడే మరో రూపం దీర్ఘకవిత.

దీర్ఘ కవితలు కావ్యాల్లా ఎక్కువ నిడివి కలిగి ఉంటాయి. అందువల్ల మరీ ఎక్కువగా ప్రాచుర్యం పొందలేదు. కాని ఈ దీర్ఘకవితల్లో మహాద్భుతాలు చేసినవారున్నారు. డా. సి. నారాయణరెడ్డిగారు రచించిన 'విశంభర' దీర్ఘకవితయే. దీనికి అత్యంత ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ అవార్డు లభించింది.

### 4.3.2.2. నిర్వచనాలు, లక్షణాలు

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఇటు కవిత్వంలోనూ అటు కల్పనా సాహిత్యంలోనూ ప్రక్రియపరంగా, రూప పరంగా చాలా ప్రయోగాలు జరిగాయి. కొన్ని ప్రయోగాలు నిలదొక్కుకున్నాయి. కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. వచన కవిత్వంలో కుందుర్తి ప్రచారం చేసిన వచన కథా కావ్య ప్రక్రియ నిలదొక్కుకోలేదు. కాని దీర్ఘ కవితలు, దీర్ఘ కావ్యాలు బాగానే వచ్చాయి.

"దీర్ఘ కవిత దీర్ఘ (మహా) కావ్యానికి పునాది – భూమిక. ఒక ఉద్యమం, ఒక సమస్య, ఒక భావన, ఒక సంఘటన తీసుకొని ఒక తాత్విక నేపథ్యంతో దాని పరిణామాన్ని, పర్యవసానాన్ని వివరించి, కవి తన తీర్పు నివ్వడమే దీర్ఘకవితాలక్షణం" (చంద్రశేఖర రెడ్డి, రాచపాళెం. 2002: 47). ఒక సమస్యను, ఒక భావనను, ఒక సంఘటనను తీసుకొని తాత్విక నేపథ్యంతో వ్యక్తీకరించి దాని పర్యవసానాన్ని వివరించి, కవి తన తీర్పునివ్వటమే దీర్ఘకవితా లక్షణమని పై నిర్వచనంవల్ల తెలుస్తుంది. ఒక సమస్య ఆరంభం, దాని పరిణామం, పర్యవసానం, కవి తీర్పు దీర్ఘకవితలో ఉంటాయి. నిడివి, సమగ్రత, అవిచ్ఛిన్న కవిత్వ సాంద్రత, తాత్విక దృక్పథం, పర్యవసానం, తీర్పు దీర్ఘకవిత లక్షణాలు.

### 4.3.2.3. కరీంనగర్ జిల్లా దీర్ఘకవితలు

డా. సి. నారాయణరెడ్డి గారి 'విశ్వంభర' దీర్ఘకావ్యానికి ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ్ పురస్కారం లభించింది. 2001 – 2010 మధ్య కరీంనగర్ జిల్లా నుంచి జూకంటి జగన్నాథం, రావికంటి వసునందన్, జె. బాపురెడ్డి, పత్తిపాక మోహన్ మొదలైన వారు దీర్ఘకవితలు రాశారు.

### 4.3.2.3.1. వాస్కోడిగామా డాట్ కామ్

'వాస్కోడిగామా డాట్ కామ్' పేరుతో జూకంటి జగన్నాథం గారు ప్రచురించిన ఈ పుస్తకంలో 'చౌరస్తా', 'శక్తి', 'ఓ అయిదు ఎపిసోడ్స్', 'వాస్కోడి గామా డాట్ కామ్' అనే నాలుగు దీర్ఘకవితలున్నాయి.

#### 4.3.2.3.1.1. చౌరస్తా

"ఉదయానికి ముందు
మసక మసక వెలుతురులో
మేలుకొలుతున్న జనం
తిని విసిరేసిన విస్తళ్లు
కెలికిన మున్సిపాలిటి చెత్తకుండీలు
వేకువ కాబోతుంది
చీకటి బీటలు వారుతోంది
పతనానికి చిహ్నంగా"

(జగన్నాథం, జూకంటి. 2013: 11)

వేకువ చైతన్యానికి ప్రతీక. అందుకే చీకటి బీటలువారుతోందంటాడు కవి. ఈ చీకటిని అన్యాయానికి ప్రతీకల భావిస్తే చైతన్యంతో అన్యాయాన్ని అంతం చేసే ఒక భావన స్ఫురిస్తుంది. ఈ వాక్యాలతో దీర్ఘకవిత మొదలవుతుంది. అందుకే ప్రతీకాత్మకంగా జరబోయే దాన్ని సూచించినట్లు తెలుస్తుంది.

"అడవిలో
వేటగాడి తుపాకి అలికిడి
రెక్కల్ని టపటప లాడిస్తూ
దారీ తెన్నూలేక
చెట్టనకా, పుట్టనకా
పిక్కబలం కొద్దీ
ఎగిరిపోయే పక్షుల్లా

కట్టతెగిన ఏరులా

జనం ఒకటే పరుగు

(జగన్నాథం, జూకంటి. 2013: 13)

కవిత్వంలో సిద్ధ ప్రతీకలు, సాధ్య ప్రతీకలు అని రెండు విధాలు. అప్పటికి ఉన్నవి సిద్ధ ప్రతీకలు, కొత్తగా కవి సృష్టించేవి సాధ్య ప్రతీకలు. ఇక్కడ భయపడిపారిపోయే పక్షుల్లా, కట్టతెగిన ఏరులా అని జనాల్ని పోల్చడం సిద్ధ ప్రతీక. ఆ వేటగాడు ఎవ్వరు? అని అనుకుంటే సామాన్య జీవితాల్లో ఆకలికన్న గొప్ప వేటగాడుండడేమో.

"అన్యాయం

ఆకలి భుజం మీద వేసుకొని

స్వైర విహారం చేస్తోంది

వెగటుగా పగలబడి నవ్వుతోంది

అయినా

ఆకలిదేం నేరం

నేర్పుగా ఆకలిని

ఉత్పత్తి చేస్తున్నవాడిదే నేరం"

(జగన్నాథం, జూకంటి. 2013: 18)

పల్లెటూరిలో జీవితం బరువై పట్టణానికి కూలీలుగా వచ్చే జనాలు చాలా మంది మనకు కనిపిస్తారు. ఇక్కడ ఆకలిని ఉత్పత్తి చేయడం ఏంటి? అన్న ప్రశ్న రావచ్చు. ఉత్పత్తి చేయడమంటే ఆనందంగా బతికిన జీవితాల్ని నాశనం చెయ్యడమే. దీని వెనుక రహస్యం ప్రపంచీకరణ. ఊరిని విడిచి పట్టణానికి రావలసిన అవసరం ఏముంది? అని అనుకున్నప్పుడు దాని వెనుకనున్న ఒక విధ్వంస కుట మనకు బోధపడుతుంది. తమ తమ వృత్తుల్ని అనివార్యంగా త్యజించేట్లు చేయడంవల్ల వాళ్ళ జీవనోపాధి దెబ్బతిని తిండి దొరజని స్థితి ఒక్కటి వస్తుంది. అదే ఆకలిని ఉత్పత్తి చేయడమంటే. అందుకే నేరం ఆకలిది కాదు, దాన్ని సృష్టిస్తున్న వాళ్లది అనడంలో అంతరార్థం.

"బతుకు చౌరస్తాలో

చిత్రవధ చేయబడిన

రెండు పదులన్నా దాటని

ఆ చెల్లి దీపాన్ని చీకట్లో
ఆరుగురు మూకుమ్మడిగా
చిదిమేసిన క్షణాన
వలవలా కార్చిన
కన్నీటి బిందువులే
క్రూరమైన
వ్యవస్థకు సాక్ష్యం”

(జగన్నాథం, జూకంటి. 2013: 20 – 21)

చౌరస్తా అనేది కేవలం నాలుగు దారుల కూడలి మాత్రమే కాదు. అది అనేకానేక సంఘటనలకు, కార్యక్రమాలకు సాక్ష్యం. అందువల్ల యువతి మరణానికి దాన్ని సాక్ష్యంగా నిలబెట్టాడు కవి. అంతకుముందులేని తక్కువగా ఉన్న నేర ప్రవృత్తి ప్రపంచీకరణవల్ల పెరిగింది. కొత్త కల్చర్‌లు, వ్యామోహాలు, కోరికలు పెరగడం ఇందుకు ఒక కారణం.

#### 4.3.2.3.1.2. శక్తి

“చివరకు
ప్రాణమున్న సమాజం కోసం
నిన్నొక ప్రాణం లేని
పనిముట్టుగా పరిమార్చాడు
అస్సలు
నిన్ను ఈ దశకు దిగజార్చిన
వాల్మీకే నిజమైన ద్రోహి –
నిన్ను ఈ కబేళా జాతికి
మేకగా బలిచేసిన వ్యాసుడే
అసలైన కపటి”

(జగన్నాథం, జూకంటి. 2013: 29)

‘శక్తి’ అనే రెండవభాగం దీర్ఘకవితలో స్త్రీ గురించి చెబుతారు కవి. అస్సలు మనిషికి ప్రాణముంటుంది. సమాజానికి కాదు. సమాజం అంటే మానవులే గనుక వాళ్ళు చేసిన

పనులే, వారి జీవితాలే సమాజానికి ఆధారం. ఇక్కడ ప్రాణాన్ని అస్తిత్వం అర్ధంలో తీసుకుంటే స్త్రీ అస్తిత్వాన్ని హరించినవాడుగ కనిపిస్తాడు. “ ‘స్త్రీలకు మించిన పాపతమమగు పదార్ధము వేరొకటిలేదు. దోషములకెల్ల స్త్రీలే మూలము – మిక్కిలి పరిచిగల వారైనను, ధనవంతులైనను, తుల్యరూపులైనను, తమ్మనౌసరించిన వాడైనను, భర్తలను లక్ష్యము చేయక అవకాశము కల్గినచో వారిని ప్రతీక్షించి వేరొక విధంగా ప్రవర్తింపజూతురు. స్త్రీలమగు మాకాధ్ధర్మమిదియే. మేము లజ్జవిడిచి ఎట్టి పాపులనైనను సేవింతుము. స్త్రీలకు పొందరాని వాడు ఎవ్వడును లేడు..... అంతకుడును, బసవడును, మృత్యువు, పాతాళము, బడభాముఖము, కత్తిదారు, విషము, సర్పము, అగ్ని ఒకవైపున, స్త్రీలను ఒకవైపున పెట్టిన సరితూగుదురు’ ” (వినోదిని, ఎమ్.ఎమ్. 2011: 7) అన్న మహాభారంతంలోని మాటలు స్త్రీలను తక్కువచేసి ఆట్లాడడం కనిపిస్తుంది. రామాయణంలో కూడా స్త్రీలకు ఇష్టం లేకుండ చేసే పెళ్ళిళ్ళు(సీత) లాంటి అనేక విషయాలు స్త్రీలను తక్కువ చేయడానికి ప్రయత్నించినవే.

“వానికి మాత్రం మినహాయింపు
జీవితం
వాళ్ళ చేతుల్లో బందీ అయింది
నీవు ఇప్పుడు
ఇష్టమున్నా లేకున్నా
ఎవర్నో ఒకర్ని
పెళ్ళి చేసుకునే నిర్జీవివి
నీకు ఇప్పుడు
నచ్చినా నచ్చకపోయినా
ఎవరితో ఒకరితో
పిల్లల్ని పొదిగే ఇంకుబేటర్‌వి –
ఈనాడు జీవితం నీ చేతుల్లో
వుందనుకోవడం వట్టి భ్రమ”

(జగన్నాథం, జూకంటి. 2013: 31 – 32)

స్త్రీకి ఇష్టం లేకుండానే పెళ్ళిచేసుకోవడం, పిల్లల్ని కనే పరిస్థితి ఉంది. దీనివల్ల స్త్రీ కేవలం ఒక వస్తువుగానే చూడబడింది. బాల్యంలో తండ్రి ఆజ్ఞను, యవ్వనంలో భర్త మాటను, వృద్ధాప్యంలో పిల్లలు చెప్పినట్లు వినే పద్ధతిలోకి స్త్రీని అనివార్యంగా నెట్టివేశారు.

"అమ్మా!
అన్ని విలువలూ అబద్ధం
అన్ని ధర్మలూ భ్రమ
చట్టం ఎండమావి
సమస్త సమస్యలకు
సంపాదనే ప్రమాణం
అధికారమే పరమావధి –
వాళ్ళ చేతుల్లోన
నీ జీవితాన్ని
నీ చేతుల్లోకి తీసుకోవాలి"

(జగన్నాథం, జూకంటి. 2013: 34)

ఆదినుంచి చెప్పుకుంటూ వస్తున్న సంప్రదాయవాదాన్ని స్త్రీవాదులు వ్యతిరేకించారు. "పితృస్వామ్యం స్త్రీ పురుష శరీర భేదాల వల్ల ఏర్పడిందని సంప్రదాయ వాదులు భావిస్తారు. స్త్రీలు ఆధీనులుగా వుడడం దైవనిర్మితమని, సహజమని, స్త్రీ శారీరకంగా బలహీనురాలు, పురుషుడు బలవంతుడు కనుక పితృస్వామ్యం సహజ రక్షణవ్యవస్థగా అభివృద్ధి చెందిందని కూడా వాళ్ళు అంటారు. దీనిని నిరాకరించి స్త్రీలపై అధికారం పురుష సమాజానికి భౌతికంగానూ ఆర్థికంగానూ ప్రయోజనాలు సమకూరుస్తుందనీ కనుకనే ఈ సమాజం జ్ఞానం, విద్య, సాహిత్యం మొదలైన వాటి ద్వారా ప్పితృస్వామిక భావజాలాన్ని సృష్టించి బలోపేతం చేసి స్థిరీకరించటానికే నిరంతరం ప్రయత్నిస్తుంటుందని, ఈ భావజాల ప్రచారం ఎంత శక్తిమంతమైందంటే పితృస్వామ్య ఆధిపత్యంలో జీవించే స్త్రీలు సైతం ఆ ఆధిపత్యాన్ని ఆమోదించేట్లు, ఆధీనత్వాన్ని గురించిన స్పృహే లేకుండా జీవించేట్లు చేసేంత శక్తివంతమైందని స్త్రీవాదులు అంటారు" (కాత్యాయని విద్మహే. 2012: 29 – 30). శాస్త్రాలేమీ నింగిలోంచి రాలిపడవు కదా. వాటిని రాసింది కూడా ఒక వ్యక్తే కదా. కాలం

మారుతున్నకొద్దీ, జ్ఞానం విస్తరిస్తున్నకొద్దీ వాటిని మార్చుకోవల్సిన అవసరాన్ని స్త్రీవాదం గుర్తించింది.

#### 4.3.2.3.1.3. ఓ అయిదు ఎపిసోడ్స్

"అన్ని రోజుల్లానే
ఆరోజు అందరికీ తెల్లారింది
ఆ అరవై వేల మ్ందికి
ఆ దినం ఉదయం లేదు
సెప్టెంబర్ ముప్పై రాత్రి
వాళ్ళ బ్రతుకులకు బిగించిన ఉరిత్రాడు"

(జగన్నాథం, జూకంటి. 2013: 36)

30-09-1993 నాడు మరాట్వాడాలో వచ్చిన భూకంపంలో దాదాపు 20,000 వేల మంది చనిపోయారు. ఆ భూకంపంలో చనిపోయినవారికి అంకితంగా 'ఓ అయిదు ఎపిసోడ్స్' అనే దీర్ఘ కవితని అంకితమిచ్చారు.

"కూలిన గోడల క్రింద
సహాయం కోసం భూనభోతరాళాలు దద్దరిల్లేలా వేసిన
ఆ ఆఖరి కేకను
ఏ రిక్టర్ స్కేలూ నమోదు చేయలేదు
మట్టి కింద కప్పుకుపోయిన
ఆ తల్లీ పిల్లల బతుకు పెనుగులాటను
ఏ కన్ను కెమెరా లైవ్ టెలికాస్టు చేయలేదు"

(జగన్నాథం, జూకంటి. 2013: 37)

రిక్టర్ స్కేలూ కేవలం భూకంప తీవ్రతను మాత్రమే నమోదు చేస్తుంది కాని మనుషుల అంతరాల్లోని బాధలను నమోదు చెయ్యలేదు. మట్టికింద కూరుకుపోయిన తల్లిపిల్లల పెనుగులాటను ఏ కన్ను కూడా చూడలేదు.

"రాజకీయం
ఇప్పుడు ఖిల్లారి మంగ్రూర్ నన్‌దుర్గా

హరేగామ్ ఉమర్‌గామ్  శిథిలాల్లో
శవాలను తీయడం లేదు
సహాయాన్ని చేయడం లేదు
ఓట్లను ఏరుకుంటుంది
శవాలతో నష్టపరిహారం వేలిముద్రలను వేయించుకుంటుంది”

(జగన్నాథం, జూకంటి. 2013: 40)

శవాలపై రాజకీయం చేసే రాజకీయ నాయకులు అప్పుడూ ఉన్నారు, ఇప్పుడూ ఉన్నారు. మనిషి ప్రాథమికమైన కర్తవ్యం వ్యక్తికి సహాయం చెయ్యడం. ముందు నువ్వు మనిషివి ఆ తర్వాతే రాజకీయ నాయకుడివి. ఆ విషయం గుర్తెరుగని నాయకులు శవాలను కూడా రాజకీయంగా మార్చడం పెద్ద విషయం కాదు. అధికార పార్టీ నష్టపరిహారం ప్రకటిస్తే, ప్రతిపక్ష పార్టీ ఈ తప్పునంతా అధికార పార్టీ మీదకు నెట్టేస్తుంది.

**4.3.2.3.1.4. వాస్కోడిగామా డాట్ కామ్**

“రండి!
ఇండియా తమకు శిరస్సు వంచి
స్వాగతం పలుకుతుంది
రైతు వెన్నెముకల్ని ఏర్చికూర్చి
విమానం దిగుతున్న మెట్లుగా తీర్చిదిద్దాం”

(పైదే: 43)

‘శిరస్సు వంచడం’ అన్న పదబంధం లొంగిపోవడం, బానిసవ్వడం అర్థాలను తెలియజేస్తుంది. ఇక్కడి ప్రజల్ని  కష్టాల్లోకి నెట్టి తమ స్వంత ప్రయోజనంకై స్వాగతించే విదేశీ పెట్టుబడులను కవిగా తిరస్కరిస్తున్నాడు కవి.

“గిన్నెకు చెంచా ఉచితం
చెంచాలకు పాలపీక ఉచితం
మనిషికి అనిషి ఉచితం
ఒక పునరుత్పత్తిలేని
‘మోన్‌సాంటో’ బోల్డ్‌గార్డ్ విత్తన సంపత్తి

అత్యుత్తమ సంస్కృతి
నీటి నుంచి రోడ్డెక్కుతుంది
అత్యున్నత సంప్రదాయం
దుకాణ సముదాయమైపోతుంది
తారురోడ్డు
చుట్టచుట్టి ఊరును పుక్కిట పట్టిన
నిగనిగలాడే కొండచిలువ"

(జగన్నాథం, జూకంటి. 2013: 48)

పెట్టుబడిదారీ విధానంలో వస్తున్న మార్పులవల్ల రోజుకు అనేక ఉత్పత్తులు జరుగుతున్నాయి. ఆ ఉత్పత్తులను అమ్మడానికి ఒక మార్కెట్టు కావాలి. అలాంటి మార్కెట్లకోసమే భారతదేశంలాంటి దేశాల్లోకి తమ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నాయి. ఇలాంటి వస్తువుల్ని కొనడానికి డిస్కౌంట్లు, ఆఫర్స్ మొదలైనవి పెట్టి వినియోగదారుల్ని ఆకర్షిస్తుంటారు. "ఈ విధంగా సరుకును మార్కెట్లో నింపడం స్వారా, వాళ్ల సరుకును కొనేటట్లు చేయడాన్ని అమెరికా వాడు ఇప్పుడు మెక్‌డొనాల్డైజేషన్ అంటూన్నాడు. ఈ విధంగా మెక్‌డొనాల్డైజేషన్ ద్వారా, మనం పరాయీకరించబడుతున్నాం. ఈ విధంగా మనం మన సంస్కృతి నుండి దూరం చేయాడుతున్నాం. వస్తు వినియోగ సంస్కృతికి లోనవుతున్నాం." (వేణుగోపాల్, ఎన్. 2011: 189). తన వస్తువుల్ని పల్లెల్లోకి కూడా తీసుకువెళ్ళడానికి రవాణా సౌకర్యం ఉండాలి. అందుకే పల్లెల్లో రోడ్డువేయడం. ఇలా ఒక ఆలోచన ప్రకారం జరుగుతున్న పరాయీకరణ విధానాన్ని కవి తీవ్రంగా నిరసిస్తున్నాడు.

### 4.3.2.3.2.తెగినపోగు

ఈ దీర్ఘ కవితని పత్తిపాక మోహన్ రాసారు. ఈ దీర్ఘకవిత చేనేత వృత్తిలోని బాధలను మనముందు ఉంచుతుంది. "కన్నీటి చారికలతో కండె చుట్టి గుండె మగ్గంపై నేసిన అశ్రు కఫన్ ఈ తెగినపోగు. కవి తానే ఒక దారపు పోగై పుటుక్కున తెగి కన్నీటి ధారగా మిగిలాడు కవితతో. కన్నీటి దారాలతో గుండెలను కలిపి కుట్టాలన్న అసాహిర్ లూధియాన్వి గుర్తుకొస్తాడు తెగినపోగు చదువుతుంటే. చీరె ఉండాల్సిన అగ్గిపెట్టెలో శవం కూచోవడం నచ్చకపోవడం వల్లనే ఈ అసహనం. ఈ అసహనాన్ని వ్యక్తం చేయడానికి కొద్దిపాటి స్పేస్

సరిపోదు. స్పేస్ అంటే కాగితం మీది చోటు కాదు. కావ్య విస్తృతి. కవి విసుగు చిన్న కవిత. కవి అసహనం దీర్ఘ కవిత. చెప్పదలుచుకున్న అంశాన్ని సంపూర్ణంగా చెప్పడానికి చిన్న స్పేస్ సరిపోదని తెలిసినందువల్లనే దీర్ఘంగా కవిత్వీకరించాలని నిర్ణయించుకున్నాడు మోహన్. అయినా మోహన్ అసహనం తీరిందని నేననుకోను. అంటే మోహన్ కవిగా జీవించి ఉన్నాడని అర్థం" (మోహన్, పత్తిపాక. 2001: iii) అన్న ప్రసేన్ మాటలు ఈ దీర్ఘకవిత లక్ష్యాన్ని, ఇతివృత్తాన్ని చెప్పాయి.

ఈ పుస్తకంలో రెండు దీర్ఘ కవితలు ఉన్నాయి. ఒకటి 'తెగినపోగు' శీర్షిక కింద చేనేత జీవితం, వారి వృత్తి, విధానం, సంస్కృతి, ప్రపంచీకరణ ప్రభావంవల్ల చేనేత వృత్తి విధ్వంసం, దానివల్ల జీవన విధ్వంసాన్ని చెప్పారు. రెండవ భాగంలో 'విధ్వంస హుటాషా నృత్యం' అనే శీర్షిక కింద జనవరి ఇరవై ఆరవ తేదీన గుజరాత్‌లో సంభవించిన భూకంపాన్ని, చిన్నాభిన్నమైన వారి జీవితాల్ని చెప్పారు.

"అగ్గిపెట్టెలో సుతారంగా
ఒదిగిన చీర
విషాద కఫనై
భూమిని కప్పేసింది
నమ్ముకున్న 'కులకశ్పీ'
పట్టెడన్నం పెట్టాపోగా
నట్టేట ముంచింది
పానం పానమైన వృత్తి
బతుకు చావుకు తాకట్టు పెట్టింది

(మోహన్, పత్తిపాక. 2001: 1 – 2)

పని ఆధారంగా సమాజంలో కుల వ్యవస్థ ఏర్పడింది. ఆ వ్యవస్థలో ఒకటి చేనేత వృత్తి. నమ్ముకున్న కులపరికరం నాలుగు మెతుకుల్ని అందించకపోవడం, ప్రాణంల భావించే వృత్తి చావును ఇవ్వడం, చీరే ఉరితాడై మారే విషాద స్థితి చేనేత వృత్తిలో కనిపిస్తుంది. ఈ పరిస్థితి వెనుక స్వేచ్ఛా విపణి, ప్రపంచబ్యాంకు విధానాలు దాగి ఉన్నాయి.

"ఆక్టోపస్‌లా పెరుగుతున్న
యాంత్రిక నాగరికత
విశృంఖలమై విస్తరిస్తున్న స్వేచ్ఛావిపణి
సామ్రాజ్యవాద కుట్రలకు
చాపకిందనీరులా 'ప్రపంచబ్యాంకు'
వృత్తులు మూలాల్ని కోల్పోయి
జీవచ్ఛవాలై పోతున్నాయి"

(మోహన్, పత్తిపాక. 2001: 6 – 7)

1991 నుండి అమలవుతున్న ఆర్థిక విధానాలపై సాహిత్యకారులు తమ నిరసనను వ్యక్తం చేస్తూనే ఉన్నారు. పది సంవత్సరాలుగా ప్రపంచీకరణకు ప్రయోగశాలలుగా మారిన తెలుగునేల మీద కవిత్వం ఆ ప్రభావం పడడం చాలా సహజం. జాతీయోద్యమ కాలం నుంచి కూడా సామ్రాజ్యవాద వ్యతిరేక సాహిత్య వ్యక్తీకరణల చరిత్ర ఉన్న తెలుగు సాహిత్యం 1991 నూతన ఆర్థిక విధానాల ప్రకటన నాటి నుంచి తమ వ్యతిరేకతను, ధిక్కారాన్ని ప్రకటిస్తూనే ఉంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వల్ల వచ్చిన ఆర్థిక విధానం తీవ్రమైన నష్టాన్ని కలిగించింది.

"రికాము లేకుండా
పొద్దంతా 'లడీలు' సాపుచేసి
'కండెలు' 'బింగరీలు' చుట్టిన
రాట్నపు చేతులు
'ప్యాకచెక్కలు' తొక్కీ తొక్కీ
స్పర్శ కోల్పోయిన పాదాలు
పెట్టెలకు పెట్టెలు 'లడీల్ని'
'కాందితొక్కి'న అడుగులు
పోగుపోగును సరిచేసి
'గంజివెట్టి బీముల్ని
పోసిన హస్తాలు"

(మోహన్, పత్తిపాక. 2001: 4)

ఈ సమాజంలో ఏ వృత్తి చిన్నది కాదు, ఏ వృత్తి పెద్దది కాదు. అన్ని శ్రమని, చెమటని నమ్ముకుని బతికే వృత్తులే. అసలైన సౌందర్యం శ్రమ సౌదర్యమే. ఈ కవితలో కవి తన వృత్తి చేసే విధానం చెబుతున్నాడు. లడీలు, కండెలు, బింగిరీలు, ప్యాకచెక్కలు, కాందితొక్కడం, గంజిపెట్టడం వంటివి వృత్తి పదాలు. 'త్రిలింగ వ్యవహారంబగు భాష గ్రామ్యంబు' అని చెప్పినా, భాషకు ఒక ప్రామాణిక భాష ఉండాలనీ అన్నా తన అస్తిత్వ పెనుగులాటలో తన వృత్తితోపాటు, తమ స్వంత భాష కూడా సాహిత్యంలోకి వస్తుంది, రావాలి కూడా.

"బతుకును బతకనీయకుండా
కూల్చేసిన రాజ్యానిది నేరం కానప్పుడు
వృత్తుల్ని కూల్చేసి చేతుల్ని విరిచేసి
బతుకుల్ని పరాయీకరించిన
వ్యవస్థది తప్పుకానప్పుడు
ఇప్పుడు ఇక్కడ
మరణం కూడా మానవహక్కే
మరణం కూడా ఓటు బ్యాంకే"

(మోహన్, పత్తిపాక. 2001: 12)

కవిత్వ శిల్పంలో విరోధాభాసం ఒకటి. ఇక్కడ కవి దాన్ని ఉపయోగించారు. ఇక్కడ కవి రాజ్యం, వ్యవస్థలది తప్పుకాదని చెప్పినా తప్పు వాళ్లదే. వృత్తుల్ని నాశనం చేసిన వ్యవస్థ, బతుకును బతకనీయకుండ చేసిన రాజ్యం దోషులు అనేది అందరికి తెలిసిన సత్యం. రాజ్యంలోకి ఏది రావాలన్న దాని వెనుక ఒక వ్యవస్థ పనిచేస్తుంది.

"రెపరెపలాడాల్సిన జండా
ఎగరకముందే
అవనతమైపోయింది
జనగణమన పాడకముందే
పాఠశాల గొంతులోనే
మూగబోయింది"

(మోహన్, పత్తిపాక. 2001: 13)

గుజరాత్‌లో సంభవించిన భూకంపానికి స్పందించిన రాసిన దీర్ఘకవిత ఇది. వాస్తవిక సంఘటనలోకి, ఆ మూడ్‌లోకి తీసుకెళ్ళే వాక్యాలుగా ఇవి కనిపిస్తాయి. అందుకు ఇప్పుడు కన్నీళ్ళు తప్ప పూలే లేవని అలుముకున్న ఆఖరి నిశ్శబ్దం గురించి చెబుతున్నారు. "తెలుగులో కాల్పనిక వాదానికి (Romanticism) ప్రతిస్పందనగా వచ్చిన వాదాలలో వాస్తవికవాదం (Realism) ఒకటి. నిత్యజీవితంలోని వ్యక్తులు, సంఘటనలు, సంఘర్షణల్లో సగటువాటిని (ఎక్కువ అంశాలని) చిత్రించాలనేది వాస్తవవాదుల లక్ష్యం. ఇందులో 2 మార్గాలున్నాయి. 1. కళ్ళముందు కనిపించే వాటిని వేరువేరుగా చిత్రించడం – ప్రత్యక్షవాదం. ఇలాంటి అనేక విషయాల మధ్య ఉండే అంతస్సంబంధాలను చిత్రించేది – పరోక్ష (గుప్త) వాస్తవవాదం" (నారాయణశర్మ, ఎం. 2014: 15). ఈ సంఘటన వాస్తవికవాదానికి చెందింది.

"స్మశానమైన ఊరుకు
పట్టపగలే చిమ్మట జోలపాట
బడిలో మూకుమ్మడిగా
రాలిపోయిన రోజాలు
కళ్లు తెరవని 'రేపు'
'ఇవ్వాళే' భూస్థాపితం"

(మోహన్, పత్తిపాక. 2001: 17)

సంఘటనలోని మూడ్‌ని, భయంకర విషాదాన్ని కవి ప్రతీకల ద్వారా చెప్పారు. చిమ్మట జోలపాట, రాలిపోయిన రోజాలు, రేపు ఈరోజే భూస్థాపితం కావడం వంటివి ప్రతీకాత్మక వాక్యాలు. రాత్రి ఒక విషాదం, బతుకు ముగియడం, చిమ్మట(రాత్రులు అరిచే కీటకం) జోలపాట దుఃఖ సంగీతం. అస్తమించడం, మౌనంగా మారిపోవడం లాంటివి మరణాన్ని సూచించే పదాలు. అలాగే ఇక్కడ రాలిపోయిన రోజాలు అనే పదబంధం కూడా ఇలాంటిదే. 'కళ్ళు తెరవని రేపు / ఇవ్వాళే భూస్థాపితం' అనడంలో పుట్టబోయే చిన్నపిల్లలు, రేపును చూడాల్సిన వ్యక్తులు ఈరోజే మరణించడం అని అర్థం చేసుకోవచ్చు.

"సమాధుల మీదనే కదా
సామ్రాజ్యాలు తలెత్తుతాయి
పీనుగుల కుప్పలపైనే కదా
ఖద్దరో

కాషాయమో

మతమో

మొసలి కన్నీరు కారుస్తాయి

సామూహిక చితులు వేదికలై నిలుస్తాయి"

(మోహన్, పత్తిపాక. 2001: 22)

సమాజంలో జరిగిన, జరిగే దానిని తీసుకుని చెప్పే కవితల్ని యదార్థ సంఘటన చిత్రణ కవితలుగా పేర్కొనవచ్చు. సామ్రాజ్యాలెప్పుడు సైనికుల సమాధులపైనే నిర్మించబడడం, విషాదమైన సంఘటన జరిగినప్పుడు రాజకీయ నాయకులు, పెద్దలు, మతస్థులు అరువుతెచ్చుకున్న కన్నీళ్లు కార్చడం జరుగుతున్న సంఘటనలు

"మిగిలినదంతా

మనిషి నిట్టనిలువుగా చీలికూలడం

మిగిలినదంతా

ఎగురుతున్న రాబందుల క్రీనీడ మారణహోమం

పలుకుతున్న రాజకీయ చిలకపలుకుల కఠోర ఘోరం"

(పైదే: 24)

దీర్ఘ కవితల్లో ఒక లక్షణమైన తీర్పు ఇక్కడ కనిపిస్తుంది. మనిషి మనిషిగా కాక మతంగా, కులంగా, ప్రాంతంగా చీలిపోయిన స్థితి నేడు కనిపిస్తుంది. ఈ కులాల మధ్య, మతాల మధ్య, ప్రాంతాల మధ్య సంఘర్షణలు సృష్టించి ఉనికి చాటుకునే రాబందుల మారణహోమం, చేసిందంతా చేసి ఏమీ తెలియని మనుషుల్లా, మనసుల్లా ఏవో పొడిపొడి మాటలు చెప్పే రాజకీయం మాత్రమే ఇప్పుడు మిగిలింది తప్ప మనిషి, మానవత్వం కరువైపోయాయి.

#### 4.3.2.3.3.లోకాలోకనం

ఈ దీర్ఘ కవితని జె. బాపురెడ్డిగారు రాశారు. వృత్తిరీత్యా ఐఎఎస్ అధికారి. చిన్నప్పటినుండి విదేశాలు తిరిగి చూడాలనే కోరికవల్ల ఆయన తర్వాతికాలంలో ఐదు ఖండాల్లోని ముప్పయి ఆరు దేశాలు తిరిగారు. ఆ పర్యటనలో భాగంగా పొందిన అనుభూతులను ఈ 'లోకాలోకనం'గా అందించారు.

“మంచు కురిసింది మలె మొగ్గల్లాగా
మొయిలు కాడలి నుండి
తొణికి పడిన ఆణిముత్యాల చందం –
వాడగాడుపులకు వాడిపోయిన నాలో
వాసంతం కుసుమించింది
ప్రసన్న వదన హిమపాతం పాడింది అపూర్వ సంగీతం –
“హిమపాతం – హిమపాతం హేమంత సంగీతం” అంటూ
హర్షమే వర్షమై హాలండు హృదయాన్ని
అలుముకున్న అనుభూతిలో
భావగీతాలు పాడుకున్నాను
నీటిమీద పాల మీగడల్ని, తోటల్లో వెన్నెల తేటల్ని
దర్శిస్తూ ఆడుకున్నాను”

(బాపురెడ్డి, జె. 2006: 4 – 5)

కవి మేఘంలాంటివాడు. చల్లని గాలిలాంటి ప్రకృతో, సంఘటనో, సన్నివేశమో ఏదో ఒకటి తాకినప్పుడు అక్షరమై వర్షిస్తాడు. అలాంటి సన్నివేశమే పైది. తానెళ్ళిన హాలండ్‌లో మంచుకురిసే సన్నివేశంలో కవిలో కలిగిన స్పందనలు పై వాక్యాలు. మామూలుగా కొంతమందికి డైరీ రాసుకునే అలవాటుంటుంది. వాళ్ళెక్కడికెళ్ళినా ఆరోజటి విషయాలన్నింటిని మామూలు వాక్యాలుగా రాసుకుంటారు. కాని ఇక్కడ కవి కాబట్టి వాటిని కవితా వాక్యాలుగా మలిచాడు.

“ఒక ‘భూ ఖండం’
మా పాదాల క్రింద ఉందన్న
బ్రహ్మానందంలో తేలిపోయాం
మనుషుల్ని వెదుకుతున్న మైదానాలను
చూచి బావురుమన్నాం
అంగుళం చోటు దొరకక భంగపడుతున్న
భారతీయులను గుర్తు చేసుకున్నాం.
చుక్కల్లాంటి మనుషులు వెలిగే ఆకాశంలా

పరుచుకున్న ఆస్ట్రేలియాలో
ఆశలుడిగినట్లు ఆవులిస్తున్న
ఎడార్ల మౌనభాష్యం కూడా విన్నాం
అంతలోనే క్యాంబెర్రా చేరుకున్నాం”

(బాపురెడ్డి, జె. 2006: 272)

ఆస్ట్రేలియా సముద్రం మధ్యలో ఉండడంవల్ల భూభాగం పాదాలకింద ఉందని సంబరపడిపోతున్నారు కవి. ఆస్ట్రేలియాలో భూభాగం ఎక్కువ మనుషులు తక్కువ అందుకే మనుషుల్ని వెతుక్కుంటున్న మైదానాలు అన్నారు. అదే ఇండియాలో జనసాంద్రత ఎక్కువ. అలాగే అక్కడి మనుషులు తెల్లగా ఉండడంవల్ల చుక్కలతో పోల్చారు.

**4.3.2.3.4.మనస్సు**

ప్రబంధ సాహిత్యం స్త్రీ అంగాంగవర్ణనకు ప్రాధాన్యమిస్తే ఆధునిక కవిత్వం స్త్రీ సున్నితమైన ప్రేమకు, భావాలకు ప్రాధాన్యతనిచ్చింది. ఆధునిక కాలంలో వచ్చిన భావకవిత్వం స్త్రీ మనస్సుకు ప్రాముఖ్యత కల్పించింది. ఆచార్య రావికంటి వసునందన్ రాసిన ఈ దీర్ఘ కావ్యంలో కావ్యనాయిక కవి మనసుకు ప్రేమగా అల్లుకున్న ప్రేయసిగా, ఆరాధించే దేవతగా కనిపిస్తుంది.

“జనమంతా మాయమై
నువ్వూ నేనే మిగిలిపోతే
దిక్కులు చుట్టుకోవచ్చు
మబ్బులు కప్పుకోవచ్చు
నేలంతా అలికి ముగ్గులు పెట్టుకోవచ్చు
నీ ప్రేమతో నా ప్రేమతో
వసంతాన్ని మాలకట్టి చుట్టేయొచ్చు
నీ జడలో మెడలో జఘనంలో పదయుగంలో
చంద్రవంక పాపిట ముంగిట చెక్కొచ్చు
గాలి మేస్తూ కోడెనాగుల్లా
పెనవేసుకుపోవచ్చు విశ్వప్రకృతి కన్నుకుట్టేలా”

(వసునందన్, రావికంటి. 2004: 31)

కవులకు ప్రేమ ఎప్పుడూ అందమైన, ఆకర్షణీయమైన వస్తువు. ప్రేమ శరీరానికి కాక మనసుకు మనసుకు సంబంధించినదైనప్పుడు దగ్గరలో కంటె దూరంలోనే కవి ఎక్కువగా ప్రేమిస్తుంటాడు. మామూలుగా ప్రేమలోపడ్డ వాళ్ళకి లోకమంతా మాయమై ఒక్క తను ప్రేమించినవాళ్ళ రూపమే మిగిలిపోతుంది. ఈ లోకంలోని మనుషులు మాయమైపోతే ఏం చెయ్యచ్చో కవితాత్మకంగా వివరిస్తున్నారు.

"ఆరాధిస్తాను నిన్ను జన్మజన్మలకీ
కన్నీటి గంగలతో అభిషేకిస్తాను
ఊహల పోగుల పట్టుబట్టతో
ఒళ్లంతా అద్ది అందంగా కట్టబెడతాను
దివ్య ప్రేమరస చందన చర్చ
చేసుకుంటాను నీ అణువణువూ
మనసు సెగల ధూపం వేస్తాను
కైదండల మల్లెదండలు
కులుకులొలికే చిన్నారి మెడలో వేస్తాను
ఆత్మజ్యోతి తిలకంగా దిద్దుతాను
అందచందాల నొసలికి
అంతరంగం హారతి పడతాను
ముద్దు మురిపాలతో
ఏం చెయ్యను చెప్పు?
నువ్వు రాక్షసివైనా దేవతవైనా..."

(వసునందన్, రావికంటి. 2004: 66)

ప్రేమించిన ప్రియుడికి ప్రేయసి ప్రేమ దేవతల కనిపిస్తుంది. అందుకే ఆమెను ఆరాధిస్తారు, పూజిస్తారు. ఇక్కడ కూడా అదే చేస్తున్నారు. గుండెల్లో కట్టుకున్న ప్రేమ గుడిలో ప్రేయసి ప్రేమ దేవత. ఆ దేవతను కన్నీటితో అభిషేకిస్తున్నారు. ఊహల పోగుల బట్టను ఆమెకు కడుతున్నారు. ప్రేమరస చందనాన్ని పూస్తున్నారు. మనసు సెగల ధూపం పడుతున్నారు. ఆత్మజ్యోతిని తిలకంగా దిద్దుతున్నారు. అంతరంగాన్ని హారతిగా పడుతున్నారు. ప్రేమించిన అమ్మాయి ఎలాంటిదైనా ఆమె స్థానం మారదు, పూజించడం మానరు.

**4.3.2.3.5. పిల్లలమర్రి**

"విశ్వమానవ సమైక్యత కోసం, సుప్రశాంత వాతావరణం కోసం, నిర్నిరోధ ప్రగతి కోసం ప్రతిపదం సముద్యమించే నా రచనలో ఆద్యంతమూ అల్లుకున్న బలమైన కోరిక – మనుషులందరూ పిల్లలమర్రి ఉమ్మడిగుణం అలవరచుకోవాలని, అంత బలీయంగానూ మనసులు పెనవేసుకోవాలని" (వసునందన్, రావికంటి. 2006: i). స్వార్థపు మత్తులోపడి కుటుంబాల్ని, బంధాల్ని, అనుబంధాల్ని, స్నేహాల్ని కోల్పోతూ ఒంటరిగా మారుతూ, నేను, నాది అన్న సంకుచితంలోకి దిగజారుతూ మనిషి మానవత్వం, సహాయం, మంచితనం అన్న గుణాల్ని కోల్పోతున్నాడు. కులం, మతం అని ద్వేషభావం పెంచుకొని గొడవలు, కొట్లాటల్లో జీవితాన్ని అంశాతిగా మలుచుకుంటున్నాడు. ఇలాంటి పరిస్థితి పోయి విశ్వమానవ సమైక్యత, శాంత వాతావరణం, మనమనే భావనలోకి మనిషి చేరుకున్నప్పుడు దేశం బాగుపడుతుంది. అదే కవి ఆకాంక్ష.

"పిల్లలమర్రి కావ్యం – ఆ ప్రతీక చుట్టూ అల్లుకుపోయిన భావరూపం. రచయిత తన మనస్సులో స్ఫురణలకు సామాజిక చింతనలకు కవిత్వ శక్తిని సమన్వయించి ఈ నిర్మాణం పూర్తి చేశాడు. కావ్యమూలం – 'ఈ మనుషులెందుకు కలిసిరారు? మనసులెందుకు కలుపుకోరు?' అన్న విచికిత్స తోడి సంక్లిష్టమైన మనస్సులో నుంచి బైటపడ్డ నూతన భావశిశువు. కావ్యం మొత్తం పిల్లలమర్రి అన్న సంకేతంలోణి వ్రేళ్ళు, బోదె, కొమ్మలు, చివురులు, ఆకులు, పండ్లు, ఊడలు ఇలా ఎన్నెన్ని భేదాలు కనిపించినా ఆత్మీయంగా ఒకానొక చెట్టు అనే భావంలో సంలీనమై ఉన్నట్లు వైరుధ్యరహితమైన ఒక మహాసమాజం నిర్మితం కావడం కవి ఆశయం. సమాజంలో మనం చూచే భేదాలు 'అసహనం గీసిన ఇరుకు గదుల గోడలు' అంటాడు కవి" (వసునందన్, రావికంటి. 2006: v) అన్న ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య గారి మాటలవల్ల కవి ఉద్దేశ్యం తెలుస్తుంది. పిల్లలమర్రి సమాజమైతే కొమ్మలు కులం, మతం, ప్రాంతానికి, ఆకులు మనుషులకు ప్రతీకలు. ఏ కులమైనా, ఏ మతమైనా, ఏ ప్రాంతమైన అందరు కలిసుంటేనే పచ్చగా ఉంటాం. ప్రగతి సాధిస్తాం.

"చిన్న ఎత్తులో పిల్లలమర్రి
ఉమ్మడి కుటుంబ వ్యవస్థ
ఊరూ వాడా దించిన ఊడలు
ఆద్యంతాలు తెలియకుండా

సమైక్యతకు నిదర్శనంగా
అసలు మొదలేదో అంతుపట్టకుండా
ఒకదానికొకటి ఆసరా
అన్నీ మొదళ్లలా బలిసిన ఊడలు
సౌఖ్యానికీ భద్రతకూ వేశిన నిచ్చెనలు
స్వర్గానికెత్తిన విజయకేతనాలు
తల్లి ఊడా తండ్రి ఊడా
బంధువుల ఊడలూ తామరతంపరగా
సంతోషమూ విషాదమూ
కలిసి పంచుకునే మార్గదర్శక సూత్రాలు
వ్యక్తిని పటిష్ఠం చేసే శక్తి స్తంభాలు
అభివ్యక్తికి అందని అదృశ్యశక్తి ఆవ్యక్తి
ఉమ్మడి వ్యవస్థకు ఉదాహరణలా"

(వసునందన్, రావికంటి. 2006: 4)

ఒకప్పుడు అమ్మనాన్న వాళ్ళ కొడుకులు – కోడళ్ళు, వాళ్ళ కొడుకులు ఇలా అందరూ ఒక్కచోట కలిసుండే ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. కష్టమైనా, సంతోషమైనా అందరూ కలిసి అనుభవించేవారు. బాధొస్తే ఆ బాధని పోగొట్టడం, ఆనందమొస్తే దాన్ని రెట్టింపు చేసేవారు. ఉమ్మడి కుటుంబాల్లో తోడు, ధైర్యం అన్ని ఉండేవి. కవికి పిల్లలమర్రి ఈ సమయంలో ఉమ్మడి కుటుంబానికి ప్రతీకల కనిపించింది. అలా అన్ని కుటుంబాలు ఉంటే బాగుంటుంది. కాని మనీకి ప్రాధాన్యత పెరిగి మనిషికి తగ్గిందో అప్పుడే ఉమ్మడి కుటుంబాలన్ని చిన్న కుటుంబాలుగా విడిపోయాయి. ఉమ్మడి కుంటుంబాల్లో ఉండే అనురాగాలు, ఆప్యాయతలు కుంచించుకుపోయాయి. అందరిమీద ఉన్న ప్రేమ భార్య, పిల్లల మీద మాత్రమే ఉంటుంది. ఇలా అన్ని కుటుంబాలు లేకున్నా ఎక్కువ మంది ఈ కోవకు చెందినవారే.

"ఏ మతం చెప్పింది?
పీకలు కత్తిరించమని
మరో మతం నెత్తురు పీల్చమని
భూమండలం నిండా అసహ్యం

జుగుప్స
అనైక్యత పురుగు మెసిలితే
అసహనం మసిలితే
మంచికోసం మనుగడకోసం పుట్టిన మతాలు
సువిశాల విశ్వపద్మ పత్రాలు
ప్రసరిస్తాయా హింసా వాసనలు
ప్రస్తరిస్తాయా పరస్పర హనన హవన దుర్గంధాలు?
మనకి మతిచెడిగాని!”

(వసునందన్, రావికంటి. 2006: 27)

కులాలు, మతాలు మనుషుల్ని కలుపుకుపోవాలిగాని విడదీసుకుపోకూడదు. మతం మరో మనిషికి మంచిచెయ్యమని చెప్పాలని గాని చెడు చెయ్యమని కాదు. కలిసిమెలిసి ఉండాల్సిన మనుషుల్ని విడదీసే ఏ మతమైన చెడ్డదే. అందుకే మతాల్ని మాయమై మానవత్వం అంకురించినప్పుడే ఈ సమాజం శాంతి పథంలో నడుస్తుంది.

**4.3.2.3.6. మట్టిముద్దలు**

మట్టిముద్దలు ఒక మానవత్వాన్ని, జీవన తత్త్వాన్ని ప్రతీకంగా వివరించే తాత్విక కావ్యం. ఇందులోని ప్రతీకలు మానవ పరిణామ వికాసాల్ని వివరిస్తూనే మానవతని బోధిస్తాయి.

“కమ్మని కలలు కన్నాడు మనిషి
నదీ తరంగ నాగరకతా సంస్కృతి వింజామరలు ఆమోదిస్తూ
కులపర్వత నిక్షేప వైభవాలు ఆస్వాదిస్తూ
సస్యశ్యామల వక్షోజ జీవధారలు కదుపార తాగుతూ
రత్నకరాల కుదుళ్ళు దేవులాడుతూ
ఖగోళ సంపదల మొదళ్లలో మెదళ్లు పేలుస్తూ
విద్యలు కళలు శాస్త్రాలు తవ్వి తలకెత్తుకుంటూ
ఎదిగిపోయాడు అనంతంగా
ఎగిరిపోయాడు ఊహలకందకుండా”

(వసునందన్, రావికంటి. 2007: 45)

మానవ ప్రయాణం మొదటినుండి ఇప్పటిదాకా సాగిన దశల్ని చెప్పే పంక్తులు ఇవి. మొదట మానవ సంస్కృతి విలసిల్లింది నది పరివాహక ప్రాంతాల్లోనే. మానవుడికి ప్రాథమికంగా కావల్సింది నీరు. అందుకే నీరు ఎక్కడైతే సమృద్ధిగా లభిస్తుందో అక్కడే మానవుడు నివాసమేర్పర్చుకున్నాడని హరప్పా, మొహంజదారో, సింధు మొదలైన నాగరికతలవల్ల తెలుస్తుంది. అప్పటినుండి మొదలైన మానవుడి ప్రయాణం నేడు విశ్వవ్యాప్తమైంది. సకల సుఖాలు అనుభవిస్తూ ఎవరూ ఊహించనంత ఎత్తుకు ఎదిగిపోయాడు. శాస్త్ర సాంకేతికం, వైద్యం, రవాణా ఇలా అన్ని రంగాల్లో విప్లవాత్మకమైన మార్పుల్ని సాధిస్తూ రోజురోజుకు మరింత అభివృద్ధిని సాధిస్తున్నాడు.

"ఏమి కోరి పారుతున్నది ఏరు?
ఏమి ఆశించి సాగుతున్నది గాలి?
ఏ ప్రతిఫలానికి పండుతున్నది నేల?
ఏ ఖరీదుకు వెలుగుతున్నారు సూర్యచంద్రులు?
ఏ వెలకు కురుస్తున్నది మబ్బు?
కేవలం నిస్వార్థంగా పరోపకారంతో
సౌజన్యానికి సహజ లక్షణం పరులకోసం పాటుపడడం
ఇన్ని చూస్తున్న మనిషి ఎన్నో తెలిసిన మనిషి
ఎంతో చదివిన మనిషి
ఎన్నుకోవాలి కదా ఉన్నత పథాన్ని?
ఉన్నతంలో ఉపకారం చేసినప్పుడే
నిష్కామంగా నిర్మాణాత్మకంగా నడిచినప్పుడే
తనకు తృప్తి సృష్టికి సంతృప్తి
గుండె నిండుగా ఉండేది కుండలోనిది పంచినప్పుడే"

(వసునందన్, రావికంటి. 2007: 70)

మనిషి గుణమే మంచి, మానవత. ఇవ్వే లేకుండా పోతే మనిషన్న మాటకు అర్థమే లేదు. ఏరు పారడం, గాలి సాగడం, నేల పండడం, సూర్యచంద్రులు వెలగడం, మబ్బు కురవడం నిస్వార్థంతోనే. అలాగే మనిషి కూడా నిస్వార్థంగా సాటి మనుషులకు సాయం చెయ్యాలి. ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోవాలి. కాని మనిషి మంచిని మరిచిపోతున్నడు.

స్వార్థంతో బతుకుతున్నాడు. ‘మంటగలిసిన మానవత్వం’, ‘మాయమైపోతున్న మనిషి’ అనే శీర్షికలతో నిత్యం పేపర్లో ఎన్నో వార్తలు చదువుతూనే ఉన్నాం. అందుకే మాయమైపోతున్న మనిషిని మళ్ళీ బతికించాలని కవులు కోరుకుంటున్నారు, ఆరాటపడుతున్నారు.

### 4.3.3. ఒకరోజు పది గాయాలు

ఏదో కొత్తగా రాయాలనే కవిలోని ఆరాటం, ఉత్సుకత, ఉద్వేగం అన్ని కలిసి కొత్త ప్రయోగానికి దారి వేస్తాయి. అలాంటిదే ఈ ‘ఒకరోజు పది గాయాలు’. “ప్రజాస్వామ్యం సామ్యవాదానికి అనువైందనుకున్నాం కానీ గ్లోబల్ విలేజి గోతిలో పడదోస్తుందనుకోలేదు. మన పెట్టుబడులైనా విదేశీ పెట్టుబడులైనా మానవీయ విలువల్ని పరిరక్షించడం మాని వ్యాపార విలువల్ని మనలోకి రక్తం యెక్కించునట్లు యెక్కిస్తాయని పసిగట్టలేక పోయాం. ఎలుకను పట్టడానికి బోనులో ఒక పదార్థం పెట్టినట్టు ఈ పరాయీకరణ సమాజం అనేక ఆశల్ని ముందుంచి మన జీవన సంబంధాలను, మనోమమకారాలను, సహజాతి సహజమైన విలువలను యెలా కొల్లగొడుతున్నాయో యెలా విచ్ఛిన్నపరుస్తున్నాయో జూకంటి జగన్నాథం ‘ఒకరోజు పదిగాయాలు’ ఆధునిక కవిత్వంలో ఒక ప్రయోగాత్మకమైన తొలి దీర్ఘ కవితను వెలువరించాడు. ఇది దీర్ఘ కవితే అయినా ఒక సరికొత్త ప్రయోగానికి మార్గం వేసింది” (జగన్నాథం, జూకంటి. 2013: 169) అన్న నాళేశ్వరం శంకరం మాటలు ఈ దీర్ఘ కవిత విశిష్టతను తెలియపరుస్తున్నాయి. 4.9.2012 రాత్రి 12.45లకు మొదలై ఆదేరోజు రాత్రి 11.30లకు ముగిసిన దీర్ఘకవిత. ఒకటి మొదలుకొని పది గాయాల సమాహారం ఇది.

> “ఒక్కచోట నిలకడగా నిలబడలేనితనం
> నిలువునా అలుముకున్న అశాంతి
> అందరిలా గురకపెట్టో / నిశ్శబ్దంగా కలలుకంటో
> పొద్దంతా జరిగిన ఘటనల్ని కలవరిస్తో
> చిన్నపిల్లాడు నిద్రలో పాలుతాగుతూ పెదవుల్ని కదిలిస్తున్నట్టు
> నిశ్చలంగా నిద్ర గుండెలో మునిగిపోక
> ఎందుకింత ఎందుకింత అశాంతి”
>
> (జగన్నాథం, జూకంటి. 2013: 181)

పల్లె చెట్టుమీది పిట్టలన్నీ వలస దెబ్బకు ఒక్కొక్కటి ఎగిపోయిన సందర్భంలోంచి కవి అశాంతికి, అల్లకల్లోలానికి గురై ఆ బాధని కవిత్వంగా మలిచారు. తన చుట్టున్న సమాజంలో విచ్ఛిన్నమతున్న సంబంధాలను, కనురుగతున్న మానవీయ విలువల్ని, పెరుగుతున్న స్వార్థాల్ని, పొట్టనింపని వృత్తి వదిలి భారంగా ఊరదిలివెళ్తున్న మనుషుల్ని చూసాక కవికి నిద్రపట్టని పరిస్థితి.

"మంచినీళ్లకు దూరం చేస్తున్నారు
బట్టనుంచీ పొట్టనుంచీ మట్టినుంచీ
ప్రాంతంనుంచీ పనినుంచీ
గెదిమిగెదిమి కొడుతున్నారు
ఖాళీ అమ్ములపొది చేతుల్లో పెట్టి
యుద్ధానికి కాలుదువ్వుతున్నావని
నన్ను నవ్వుతూ దువ్వుతూ గిలగిల్లాడేలా చేస్తున్నారు
నన్నెవరో నాకు కాకుండా చేస్తున్నారు"

(జగన్నాథం, జూకంటి. 2013: 199)

ఇక్కడ నేను సమూహంలోని జనానికి ప్రతీక. తనల తాను బతకలేనితం అంటే సాంస్కృతికంగా, మానసికంగా రెండూ అని అర్థం. ఒకవైపు ఎప్పటి నుండో వస్తోన్న సంస్కృతి సంప్రదాయాలు, ఆచారాలతోపాటు మానసికంగా ఇక్కడి జీవనంలో భాగంగా ఉండలేదు. మనదేశంలో విద్యావిధానాన్ని ప్రవేశపెట్టిన మెకాలే తన తండ్రికి రాసిన ఉత్తరంలో "ఇంకా ఏం రాశాడంటే, 'పుట్టుకతో మాత్రమే వారు భారతీయులై ఉండాలి. లక్షణాల్లో, అభిరుచుల్లో వారిని ఇంగ్లీష్ వారిగా తీర్చిదిద్దాలి. అదే మనం నేర్పబోయే విద్యకావాలి' అని రాశాడు. అంటే ఈ దేశంలో ఇంతవరకు సంస్కృతి లేదని, మనకున్నది సంస్కృతే కాదని, దీన్నంతా రద్దుచేసి ఒక కొత్త గుమస్తాలను తయారు చేసే విద్యను, సంస్కృతిని మనకు బోధించాలనుకున్నారు" (వేణుగోపాల్, ఎన్. 2011: 187). భారతదేశంలో ఆంగ్లేయులు విద్యను ప్రవేశపెట్టడానికి కారణం ఇదే. అంత దుర్మార్గపు ఆలోచనని మనవాళ్ళు అర్థం చేసుకోవట్లేదు.

### 4.3.4. మినీ కవితలు

#### 4.3.4.1. పరిచయం

సాహిత్యం చలనశీలమైంది. సమాజంలో వస్తున్న మార్పుల్ని, అవసరాల్ని బట్టి తన మార్గాన్ని మార్చుకుంటుంది. ఈ విషయం మన సాహిత్య చరిత్ర క్రమాన్ని గమనిస్తే తెలుస్తుంది. ఇలాంటి పరిణామ క్రమంలోనే వచన కవిత ఆవిర్భవించింది. నిర్మాణంలో బాహిరమైన, అంతర్గతమైన రెండు విషయాలు వస్తాయి. బాహిర నిర్మాణంలో అక్షర నియమం, పాద నియమం, మాత్రలు మొదలైనవి వస్తే అంతర్నిర్మాణంలో భాష, ప్రతీకలు, భావచిత్రాల్లాంటివి ఉంటాయి. మినీకవితలో రెండు పాదాల నుంచి పన్నెండు పాదాల వరకు ఉంటాయి. అక్షర నియమం లేదు. 'మినీ' అనే ఆంగ్ల పదం, 'కవిత' అనే తెలుగు పదం రెండు కలిపి మినీ కవిత అయ్యాయి. మినీ కవితలో మెనీ భావాలు పలికించవచ్చు.

#### 4.3.4.2. ఆవిర్భావ కారణాలు

ఉరుకుల పరుగుల జీవితంలో మనిషికి పెద్ద పెద్ద కావ్యాలు, కవితలు చదివే ఓపిక, సమయం కరువయ్యాయి. అలాగే దినపత్రికల్లో సాహిత్యానికి కేటాయించే చిన్న స్థలంలో సరిపోయేంత కవితలు కావల్సి వచ్చాయి. "స్వేచ్ఛా కవితలో ముచ్చటించినట్లుగా ఇది ఎక్కువగా వచన కవితా రూపిణి – భావుకతాపరంగా వాదాలతో, ఉద్యమాలతో అనుబంధం లేని, స్వతంత్ర భావగంధం. కథాకావ్యాలు, దీర్ఘకవితలు రాసే వాళ్లూ, చదివేవాళ్లు కరువైపోతున్న ఈ వేగయుగంలో మినీ కవితల వడ్డన అందరికి విందు చేస్తున్నది" (బాపురెడ్డి, జె. 2007: 127).

#### 4.3.4.3. నిర్వచనాలు

మినీకవిత అంటే చిన్న కవిత అని అర్థం. ఈ పేరును ఆంధ్రజ్యోతి వారపత్రిక సంపాదకులు పురాణం సుబ్రహ్మణ్యశర్మ పెట్టారు. ఆధునిక కవిత్వంలో రూపంలో సంక్షిప్తతను ప్రధాన లక్షణంగా తీసుకొని వెలువడిన కవిత్వం మినీకవిత. సుదీర్ఘత, వర్ణనలు కవిత్వంలో ఎక్కువైన కాలంలో దానిని నివారించి తెలుగు పాఠకులకు సూక్ష్మంలో

మోక్షంలాగా భావసౌందర్యాన్ని అందించేందుకు మినీకవిత పుట్టింది. ఇది వచన కవితారూపమే. కొందరు దీన్ని వచనకవితా యౌవన రూపంగా భావించారు. వేమన ఆటవెలదుల వలె, మినీ కవిత సభ్యస్ఫూర్తి కలిగిస్తుంది. తీరికలేని వాళ్లకైనా కవితాస్వాదన చేయడానికి, రసాత్మకంగా లోకానుభవాలను దర్శించడానికి తోడ్పడుతాయి. రసాత్మకత కావ్యసృష్టిలో అనేక రూపాల్లో, ప్రక్రియల్లో, పరిమాణాల్లో ఆవిష్కృతమౌతుంది. అయినా మినీకవితగా వ్యవహరింపబడుతున్న అనేక కవితలు నేడు విజ్ఞుల, రసజ్ఞుల ఆదరాభిమానాలు పొందుతున్న అనేక రూపాల్లో వెలువడుతున్నాయి. "మినీకవిత ఆయుస్సు మెరుపంత కాగా, అది ప్రసరిస్తుంది కాలమంత' అని సి.నా.రె. మినీకవిత్వాన్ని నిర్వచిస్తూ ఆవిధంగా ఇది సౌదామినీ కవిత అని ప్రశంసించారు" (కమలాకరశర్మ, సాగి(సంపా). 2014: 234).

రావి రంగారావు గారు మినీ కవితని నిర్వచిస్తూ ప్రజాకవి మహాకవుల కన్నా ఎప్పుడూ తక్కువవాడే. సూర్యుడు నక్షత్రాల కన్నా చిన్నవాడే కదా!' అని అంటారు. మహాకవులకన్న ప్రజాకవికే ఆదరణ, నక్షత్రాలకన్న సూర్యుడికే వెలుగు ఉంటాయి.

"సమకాలీన చైతన్యాన్ని సమీక్షిస్తూ, సద్యస్ఫూర్తిగా ఒక వెలుగు వెలిగి వివేచనను మెరుపులా జిగేలు మనేటట్లు తళుక్కుమనిపించి, దాన్ని ఆలోచనామృతంగా వర్షించి, భావుకుల హృదయాలను రంజింప జేసేటట్లు అభివ్యక్తీకరించటం 'మినీ కవిత" (సుబ్రహ్మణ్యం, జి.వి. ఆంధ్రప్రభ. 1985, జనవరి: 1). సమకాలీన చైతన్యం, వివేచన, ఆలోచన కిలిగించేది అనే అంశాల్ని జి.వి. సుబ్రహ్మణ్యం గారు చెప్పరు. మినీ కవిత ఎప్పుడు పుట్టిందని చెప్పడం కష్టమే అయినా ప్రాచీన కావ్యాల్లో కవులు చెప్పే సంక్షిప్త పద్యాల్లో ఈ లక్షణాలున్నాయని విజ్ఞులు చెబుతారు.

"ఒకే ఒక్క భావాన్ని సాధ్యమైనంత శక్తివంతంగా హృదయంలో ముద్రపడేటట్లు ధ్వని పూర్వకంగా చెప్పడానికి సాధ్యపడే ప్రక్రియ మినీకవిత" (చంద్రిక, ఎం. 1987: 10). వేగానికి అలవాటుపడ్డ పాఠకులు తక్కువకాలంలో ఎక్కువ ఆనందాన్ని పొందే మార్గాన్ని అన్వేషించడం, లోలోపలి అలజడిని అప్పటికప్పుడు వ్యక్తపరిచేందుకు వాహిక కావాల్సి రావడం, దిన పత్రికలు. మార్జిన్స్ కవిత్వానికి కేటాయించిన స్థలాభావం మినీ కవిత జనించడానికి కారణాలు.

### 4.3.4.4. లక్షణాలు

మినీకవితకు చాలా మంది కవులు, విమర్శకులు, పరిశోధకులు చాలా లక్షణాలను చెప్పారు. అద్దేపల్లి రామమోహనరావు ఉచ్ఛ్వాసం క్లుప్తత, నిచ్ఛ్వాసం ధ్వనిగా ఉండాలని వీటితోపాటు ప్రతిపదం వ్యంగ్య అర్థాన్ని ఇవ్వాలని తెలిపారు. టి.యల్. కాంతారావు 'చమత్కృతి, మెరుపు, మినీ భావ ప్రకాశం' ఉండాలని, విహారి దృశ్య చిత్రణ ద్వారా పాఠకుని హృదయంలో ముద్రపడేలా ఉండాలని, జి.వి. సుబ్రహ్మణ్యం చుక్కలా మెరిసే భావచిత్రం ఉండాలని ధ్వని పూర్వకంగా ఉండాలని అనేకులు అనేక రకాలుగా వివరించారు. మినీకవిత లక్షణాల్లో సంక్షిప్తత, నవ్యబంధురశైలి, ధ్వని, శీర్షికా ప్రాధాన్యత, వ్యవహార వ్యావహారిక భాష, కొసమెరుపు, కొస చరుపు, చమత్కారం, వ్యక్తీకరణలో సూటిదనం, బహుళార్థ సాధకత, కొత్తదనం, భావ గాంభీర్యం మొదలైనవి ముఖ్యమైనవి.

#### 4.3.4.4.1. సంక్షిప్తత

"నీ సుగుణా లేమిటో
నీ శత్రువుల్ని అడుగు
నీ లోపాలేమిటో నీ మిత్రుల్ని అడుగు
వాళ్ళ అభిప్రాయాలపై స్పందించమని
నీ అంతరాత్మనడుగు"

(బాపురెడ్డి, జె. 2010: 22)

నీలో మంచి విషయాల గురించి శత్రువుని, లోపాల గురించి మిత్రున్ని అడిగి తెలుసుకోమంటున్నాడు కవి. ఒక వ్యక్తి మన గురించి లోపాల్ని చెప్పినా వారి అభిప్రాయంపై మనం సానుకూలంగానే స్పందించాలి తప్ప వారిని మన శత్రువులుగా చేసుకోకూడదు.

"ఆరిపోతానని తెలిసినా మెరుపు మెరుస్తుంది
వాడిపోతానని తెలిసినా మొగ్గ నవ్వు కురుస్తుంది
గెలుపు చావుదేనని తెలిసి కూడా
బ్రతుకు పోరాడుతూనే ఉంటుంది"

(బాపురెడ్డి, జె. 2010: 22)

పుట్టుక గిట్టుట కొరకే అని ఒక నానుడి. ఈ ప్రపంచంలో ఏది పుట్టిన తుదకు ఎప్పుడో ఒకప్పుడు నశించాల్సిందే. ఆరిపోయేదైన మెరుపు మెరుస్తుంది, వాడిపోయేదైనా మొగ్గ పూస్తుంది. అలాగే ఈ జీవితం చివరికి అంతమవుతుందని తెలిసినా బతుకులో పోరాటం చేస్తూనే ఉంటుంది. ఇది సత్యం. మనిషి జీవితం సుమారు 60 సంవత్సరాలు అనుకుంటే ఈ 60 సంవత్సరాలలో ప్రతి అంశం గురించి పోరాటమే. నడక నేర్చుకోవడం మొదలుకొని, విద్య, ఉద్యోగం, ఇళ్ళు, కారు లాంటి అనేకానేక చినచిన్న విషయాలు మొదలుకొని పెద్ద విషయాలదాకా పోరాడాల్సిందే.

"భాగ్యవంతుని చావుకు కూడా
ఓ విజయ యాత్ర
నిరుపేద బ్రతుకేమో ఓ శవయాత్ర"
(బాపురెడ్డి, జె. 2010: 09)

ధనిక, పేద బతుకుల మధ్య ఉండే వ్యత్యాసానికి నిర్వచనంల ఉంది ఇది. ధనికుడు చనిపోయిన గొప్పగా ఉంటే, పేదవాడు బతికున్న శవంలా ఉంటాడు.

### 4.3.4.4.2. చురక

గుండెకు తాకేట్టుగా భావాన్ని చెప్పడం.

"అతడు అన్నిటినీ జయించాడు
అహంకారాన్ని తప్ప
అన్నీ సాధించాడు
ఆత్మ సంతృప్తి తప్ప!"
(పైదే: 28)

మనిషి ఎన్ని జయించిన అహంకారాన్ని మాత్రం జయించి తీరాలన్న సందేశం ఇందులో కనిపిస్తుంది. అహంకారం మనుషులను దూరం చేస్తుంది. అందరికి శత్రువుల్ని చేస్తుంది. ఈ లోకంలో అన్నింకంటే సాధించాల్సిన విషయం ఆత్మ సంతృప్తి. ఎన్ని రకాల విలాసాలు ఉన్న ఆత్మ సంతృప్తి మాత్రం లేకపోతే జీవితంలో ప్రశాంతత కొరవడుతుంది. లక్షలు లక్షలు పెట్టి కారు కొంటే అతని దగ్గరికి పోయి మనం అడిగితే అతను నా ఆత్మ సంతృప్తికోసం కొన్నానంటాడు.

"ఆస్తి స్వాధీనం చేసుకున్నారు వారసులు
అయ్యా!
మీరే చేయించాలి ముద్రణలు"

(వసునందన్, రావికంటి. 2009: 15)

తల్లిదండ్రులు బరువనుకొని వారిని అనాథాశ్రమాలకు పంపే బిడ్డలు కొందరైతే, వారు బతికుండగానే ఆస్తిని స్వాధీనం చేసుకొని ఇంట్లోనుంచి తరిమేసేవాళ్ళు కొంతమంది. ఇంకా ఇప్పుడు కొంతమడి బిడ్డలు ఆస్తి పంచుకున్నటే తల్లిదండ్రుల్ని కూడా పంచుకుంటున్నారు. ఇద్దరు కొడుకులుంటే ఆరునెలలు ఒక్కరి దగ్గర, మరో ఆరునెలలు ఇంకొకరి దగ్గర. ఇలా పంచుకున్నా వారిని జాగ్రత్తగా చూసుకుంటే చాలు. కాని అనాథల్లా వదిలేయకూడదు.

### 4.3.4.4.3. వ్యంగ్యం

పరోక్షమైన ఎత్తిపొడుపు ఉండడం.

"భూలోకానికి వచ్చిపోయే వాళ్లలో
ఏనాడైనా
ఉన్నవాళ్ళకంటే పోయిన వాళ్లదే
"మెజారిటి"
మెజారిటీకి లేదు ఏ ఆరాటం
మైనారిటీలో ఉన్నంతకాలమే
బ్రతుకు పోరాటం"

(బాపురెడ్డి, జె. 2010: 30)

సమాజంలో మెజారిటి, మైనారిటీ అనే రెండు పదాలు వాడుకలో ఉన్నాయి. ఇవి హిందువులని, క్రైస్తవులని సూచిస్తాయి. ఈ రెండు పదాలను తీసుకొని కవి బతుక్కి ఆపాదించాడు. భూమ్మీద పుట్టి బతికేవాళ్ళ కంటే చనిపోయిన వాళ్ళదే మెజారిటీ అనీ, బతికే వాళ్ళు మైనారిటీ అంటే తక్కువ సంఖ్యగలవారనీ కవి చమత్కరించాడు. మైనారిటీలో ఉన్నంతకాలమే అంటే జీవించి ఉన్నంతకాలమే బతుకు పోరాటమని వివరిస్తున్నారు. అలాగే ఈ సంఘంలో మైనారిటీలది కూడా పోరాటమే. తెలుగు సాహిత్యంలో మైనారిటీవాద

సాహిత్యమనీ ఒక ఉద్యమమే వచ్చింది. వాళ్ళు మెజారిటీ ప్రజల నుండి ఎలాంటి బాధల్ని పొందుతున్నారో ఈ వాదంలో వివరించారు.

"చెవిలో ఎఫ్.ఎం. మ్యూజిక్ పువ్వు
చూపుల్లో మ్యాజిక్ లవ్వు
గడియగడియకూ సెల్లు బెల్లు
నేతి యువతకే ఆల్వేస్ చెల్లు"

(వసునందన్, రావికంటి. 2009: 23)

నేటికాలపు యువత తీరును చెప్పే మినీ కవిత. నడుస్తున్నా, పనిచేస్తున్నా, ప్రయాణిస్తున్నా ఇలా అనేక సందర్భాల్లో యువత చెవుల్లో పాటలు మారుమోగుతాయి. చూపుల్లో ప్రేమ మ్యాజిక్ కనబడుతుంది. ఆ మ్యాజిక్ కలిసి ప్రేమ పుట్టాక లేదా ఇద్దరికి పరిచయమై, ఆ పరిచయం ప్రేమగా మారాక సెల్ ఫోన్‌కి విరామం ఉండదు. అదే యువత తీరని చెబుతున్నారు కవి.

### 4.3.4.4.4. భావ గాంభీర్యం

కవిత చిన్నదిగా ఉన్నా గొప్పనైన భావం స్ఫురించడం.

"కలం పట్టుకున్న చేయి
కాలానికి దారి చూపిస్తుంది
హలం పట్టుకున్న చేయి
మట్టికి ప్రాణం పోస్తుంది"

(బాపురెడ్డి, జె. 2010: 35)

భౌతిక ప్రపంచంలో రైతుకు ఎంత ప్రాముఖ్యత ఉందో, కాల్పనిక ప్రపంచంలో కవికి అంతటి ప్రాధాన్యత ఉంది. వీరిద్దరి మధ్య ఒక పోలిక కనిపిస్తుంది. రైతు హలం పట్టుకొని వరి పండిస్తే, కవి కలాన్ని పట్టుకొని అక్షరాల్ని పండిస్తాడు. రైతుది శారీరక శ్రమ, కవిది మానసిక శ్రమ. 'కవయ క్రాంత దర్శినః' అని పెద్దల మాట. రాబోయే కాలాన్ని దర్శించి కవిత్వంగా మలిచేవాడు కవి అని. శూన్యంలో ఆకారం లేకుండా తిరిగే ఆలోచనలకు అక్షరరూపం కవి ఇస్తే, పనికిరాని బీడు భూమిలోంచి ధాన్యాన్ని పండిస్తాడు రైతు.

#### 4.3.4.4.5. శీర్షిక

మినీ కవితకు శీర్షక ఉంటుంది. శీర్షిక లేకున్నా కూడా రాయవచ్చు. కాని మినీ కవితా నిర్మాణంలో ఇది ఒక అంశం.

"సెలవడగడు సూర్యుడు
వానకొట్టిందని చలిపెట్టిందని
విశ్రాంతి పడదు పనిమంతునికి
పనిగిట్టదు శ్రాంత చేతస్కునికి"

(వసునందన్, రావికంటి. 2009: 17)

కవి శీర్షిక కవితల కిందన ఇచ్చారు. దీనికి కవి పెట్టిన శీర్షిక 'నైజం'. అంటే వ్యక్తిత్వం. ఏ ఒక్కరోజు సూర్యుడు సెలవడగడు. అలాగే వాన వచ్చిందనో, చలిపెడుతుందనో పనిమంతుడు విశ్రాంతి తీసుకోడు. పనిచెయ్యొద్దు అనుకునేవారికి పనే గిట్టదు. ఇది ఆయా వ్యక్తుల వ్యక్తిత్వం.

"వైకుంఠపాళీ పెద్దపామే నయం
రాజకీయం కన్నా
కనీసం మింగుతున్నదని తెలుస్తుంది"

(పైదే: 30)

దీనికి కవి పెట్టిన శీర్షిక 'వామ్మో'. వైకుంఠపాళీ ఆడుతున్నప్పుడు ఇన్ని పడితే పెద్దపాము మింగుతుందని ముందే తెలిసిపోతుంది. కాని రాజకీయం ఎప్పుడు మింగుతుందో ఊహించడం, తెలుసుకోవడం కష్టం. ఊహించనివి, అనుకోనివి అయ్యేవే రాజకీయమంటే.

### 4.3.5. నానీలు

#### 4.3.5.1. పరిచయం

ఆధునిక కవిత్వంలో వచ్చిన మరో రూపం నానీలు. వీటిని ఆచార్య ఎన్. గోపిగారు ప్రారంభించారు. మొదటగా ఈ నానీలు 1997 నుండి దినపత్రికల్లో రావడం ఆరంభమైంది. అప్పుడే వీటి పట్ల ఆదరణ, వీటిని సృష్టించినందుకు గోపిగారికి ప్రశంసలు పెరిగాయి. తరువాత్తరువాత వీటిని రాసేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. కవిత్వం రాసేవాళ్లలో

నానీలు రాయని కవి ఉండడంటే అతిశయోక్తి కాదు. చాలా మంది నానీలు రాసి వాటిని సంపుటాలుగా ముద్రించారు.

### 4.3.5.2. నిర్వచనం, లక్షణాలు

“నానీలు చిన్నపద్యాలు. మరీ చిన్నవికావు. నానీ అతి బిగింపు అనవసరమైన సడలింపులేకుండా నేను రూపొందించుకున్న 20-25 అక్షరాల విస్తీర్ణం గల చట్రం. 20 అక్షరాలకు తగ్గవు. 25ను మించవు. నానీలు అంటే ‘నావీ’ ‘నీవీ’ వెరసి మనవి అని అర్థం. నానీలంటే చిన్నపిల్లలని కూడా. చిట్టిపద్యాలు కదా!. నానీల్లో నాలుగు పాదాల నియమాన్ని పాటించాను. వచనకవితల్లో లాగే ఈ విభజనకు హేతుబద్ధత ఏమీలేదు. అయితే నిర్మాణం దృష్ట్యా వీటిలో ఒక పద్ధతిని గమనించవచ్చు. వీటిలో మూడొంతులకుపైగా నానీల్లో రెండేసిపాదాలకో భావాంశాన్ని(Unit) గుర్తించవచ్చు. మొదటి రెండు పాదాల్లో ఒక భావాంశం, చివరి రెండుపాదాల్లో మరోభావాంశం ఉంటాయి. మొదటిదానికి రెండోది సమర్థకంగా వుంటుంది” (మోహన్, పత్తిపాక(సంపా). 2007: 1) అని ఆచార్య ఎన్. గోపిగారు తను సృష్టించిన నానీల లక్షణాల్ని వివరించారు. కవి తన ఇష్టాన్ని బట్టి 20 నుంచి 25 అక్షరాల మధ్య నానీని ముగిస్తాడు. పూర్వకాలంలో కనిపించే చతుష్పదికి నానీ భిన్నమైనటువంటిది. ఇవి రెండు నాలుగు పాదాలతో కూడుకొన్నది. చతుష్పదిలో ఛందో, గణ నియమం ఉంటే నానీలో అది లేదు.

నానీల సృష్టికర్త అయిన గోపిగారు నానీల స్వభావం గురించి, లక్షణాల గురించి చాలా విపులంగా వివరించారు. కవి ఆలోచనకి అప్పటివరకున్న సాహిత్య రూపాలు అనువుగా ఉండనపుడు ఆ కవి సరికొత్త సాహిత్య రూపాన్ని వెతుక్కుంటాడనడానికి నానీలే ఉదాహరణ. వేమన పద్యాలకి దగ్గరగా నానీలు ఉంటాయి. ఈ నానీలు ఎంతగా ప్రాముఖ్యత పొందాయంటే తెలుగులో కవిత్వ సృజన చేసే అనేక మంది నానీల్ని రాశారు. గాఢత, సాంద్రీకరణ నానీల లక్షణాలు. వ్యర్థపదాల నిరోధం జరుగుతుంది.

“రైతు రైఫిలై
నిజాం మీద
పోరాడిన నేల యిది
వారసత్వం నడుస్తాంది”

(దేవేందర్, అన్నవరం. 2006: 6)

ఒక పుస్తకంగా రాయదగ్గ విషయాన్ని కవి నాలుగు పాదాల్లో వివరించారు. నిరంకుశుడైన నిజాం రాజు దురాగతాలపై రైతులంతా తిరగబడి తెలంగాణ సాయుధ పోరాటం చేశారు. 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన హైదరాబాద్ సంస్థానం మాత్రం ఇంకా నిజాం పాలనలోనే మగ్గిపోతుంది. నిజాం రాజును ఎదురించి బానిస సంకెళ్ళు తెంచుకొని స్వేచ్ఛ ప్రపంచంలోకి వెళ్ళాలని ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టుపార్టీల నాయకత్వాన మహోద్యమం జరిగింది. ఈ ఉద్యమంలో చిన్నాచితక, ముసలిముతక, ఆడామగ అందరు వీరోచితంగా నిజాం మిలటరీని, రజాకారులను ఎదుర్కొన్నారు. ఈ పోరాటం రావడానికి గల కారణాల్లో వెట్టిచాకిరీ, బానిసత్వం, అత్యధిక శిస్తు వసూలు చెయ్యడం, కార్మికులకి జీతాలు తక్కువగా ఇవ్వడం మొదలైనవి. ముఖ్యంగా రైతులను తన భూమి నుండి తనని విడదీసి ఆ భూమిలో పనికివచ్చే పరిస్థితిని ఆనాటి నిజాంతోపాటు దేశ్‌ముఖ్ మొదలైన రాజోద్యోగులు చేశారు. అలాగే ఆంధ్రవలస నిరంకుశ పాలనలో మళ్ళీ తెలంగాణ ఒక మహత్తర ఉద్యమాన్ని చేసింది. ఆనాటి వారసత్వం ఇప్పటివరకు నడుస్తూనే ఉంది.

"రాలే వరకు
కలిసే ఉన్నాయి
చెట్ల పూలు.
మరి మనుషులో...?"

(వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 3)

నానీల నిడివి చిన్నది కనుక ఈ నానీల్లో ప్రతిచిన్న విషయాన్ని సులువుగా, చురుకులాగా చెప్పడం కష్టం. ప్రకృతిలో అందంగా పూసే పూలు అవి రాలిపోయేంత వరకు చెట్టుపై అన్నదమ్ముల్లా కలిసే ఉంటాయి. మరీ ఈ సమాజంలో జీవిస్తున్న మనుషులు? అని ఈ సమాజానికి, మానవజాతికి వేసిన ఒక చురక పై కవిత. 'కలిసుంటే కలదు సుఖం' అని పెద్దలన్నట్టు  అందరూ, అన్ని కులాల, మతాలవారు కలిసుంటే ఈ లోకంలో కులమతాల ఘర్షణలే ఉండవు. అందుకే ఈ సమాజాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నాడు కవి.

"పల్లె నుదిటిపై
కరువు రాతలు

వలస జీవులకు
నగరం వాతలు"

(రవీంద్ర, సంగెవేని. 2006: 50)

మారిన వాతావరణ పరిస్థితులవల్ల వర్షాలు సరిగ్గా పడడం లేదు. దానివల్ల వ్యవసాయ ప్రధానమైన పల్లెటూర్లలో కరువు. ఒకవేళ పంటలు పండినా గిట్టుబాటు ధర లేక పంటకోసం చేసిన అప్పులు తీరడం లేదు. ఇలా జీవనభృతికి, అప్పు తీర్చడానికి పల్లెటూరు వలస పోవడం కనిపిస్తుంది. వలసవెళ్ళిన వాళ్లు చాలీచాలని జీతంతో నగరంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

"ప్రేమలేక కాదు
పని లేక
వలస పక్షులు
ఎగిరి పోతున్నై"

(అశోక్, జిందం. 2006: 9)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటినుండి తెలంగాణ వివక్షకు, అసమానతకు గురైందని చరిత్రను గమనిస్తే తెలుస్తుంది. విద్య, ఉద్యోగ, నీరు మొదలైన అంశాలలో తెలంగాణ తీవ్రంగా నష్టపోయింది. రైతుకు భూములున్న అవి పారేందుకు నీళ్ళు లేకపోవడం ఇక్కడి రైతుల దురదృష్టం. వారితోపాటు రైతు కూలీలు, రైతులను నమ్ముకున్న వివిధ వృత్తులవారు ఉపాధిలేక వలసమార్గం పట్టాల్సివచ్చింది. అందుకే కవి ప్రేమలేక కాదు ఇక్కడి ప్రజలు పని లేక వలసపోతున్నారని అంటాడు. కన్నవాళ్ళని, కట్టుకున్నదాన్ని, కన్నబిడ్డల్ని వదిలి బొంబాయో, దుబాయో పోవడం ఈ నానీలో ధ్వనిస్తుంది. తెలంగాణలోని ప్రతిపల్లెలో కనిపించే విషయాన్ని కవి దృశ్యమానం చేశారు.

"అరేబియాలో
అపారంగా నీళ్లు
యాదికొస్తున్నై
ఇంటిదాని కన్నీళ్లు"

(రవీంద్ర, సంగెవేని. 2006: 34)

తెలంగాణ సాహిత్యమంతా కన్నీళ్లతో, బాధలతో నిండిపోవడానికి ఇక్కడి ఆర్థిక, సామాజిక అంశాలు కారణం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తర్వాత ఇక్కడి వచ్చిన వలసవాదుల చేతుల్లో తెలంగాణ గోసను అనుభవించింది. నీళ్ళు, ఉద్యోగం, ఉపాధి అన్ని రంగాల్లో తెలంగాణ వివక్షకు గురికావడం వల్ల ఇక్కడి ప్రజలు పొట్టచేతపట్టుకొని వలసపోయేల చేసింది. అలాంటి వలసలోంచి వచ్చిందే పై నానీ.

"దొర గడిని చూస్తేనే
ఉచ్చపడేది
ఇప్పుడు అండ్లనే
పోస్తున్నం"

(దేవేందర్, అన్నవరం. 2006: 11)

ఈ నానీలో వందేళ్ళ చరిత్ర దాగి ఉంది. తెలంగాణ చరిత్రకి, దొరలకి విడదీయరాని బంధం ఉంది. అసలు ఒకరకంగా చెప్పాలంటే ఒకప్పటి తెలంగాణ చరిత్ర అంతా దొరల అరాచకాలతో, దౌర్జన్యాలతోనే ఉంటుంది. అలాంటి చరిత్ర దొరలది. 'నీ బాంచెన్ కాల్మొక్కుతా!!' అంటూ తెలంగాణ ప్రజానీకం దొరలకు బానిసలుగా ఉండేవారు. అతను చెప్పిందే వేదం, చేసిందే న్యాయం.

"అమ్మ సేవలు
వెలకట్టలేనివి
వెలలేదు గనుకే
విలువలేదు"

(రాణిప్రసాద్, కందేపి. 2006: 15)

ఈ ప్రపంచంలో నిస్వార్థమైనది ఏదైనా ఉందంటే అది కేవలం అమ్మతనం మాత్రమే. పగలు రాత్రి తేడాలేక కట్టుకున్న భర్తకోసం, పుట్టిన పిల్లకోసం పనిచేస్తూనే ఉంటుంది. అందరికంటే ముందుగా లేచి కల్లాపిజల్లి వాకిలిని అందంగా అలంకరిస్తుంది. వంటపాత్రలకు అందానద్దుతుంది. భర్తకి కాఫీలా, వేడినీళ్ళలా మారుతుంది. పుట్టినపిల్లలకు స్నానం చేయించి, అలంకరించి బడికి సాగనంపుతుంది. పొద్దున టిఫిన్, మధ్యాహ్నం, రాత్రులకు భోజనాలు, సాయంత్రవేళల అల్పాహారంలా మారుతుంది. చివరికి అందరు తిన్న

తర్వాత తిని అందరు పడుకున్న తర్వాత నిద్రపోతుంది. అలాంటి అమ్మ సేవలు ఎంత సొమ్మిచ్చినా కొనలేనివి.

"దాచిపెట్టి
ఏం చేస్తావు?
జేబైనా ఉండదు
శవం మీది గుడ్డకు"

(అశోక్, జిందం(సంపా.). 2007: 36)

తత్త్వంలా కనిపిస్తుందీ నానీ. జీవితంలో కోట్లు సంపాదించినా, వందల ఎకరాల భూమి కొన్నా అవేవీ చనిపోయినప్పుడు నీతో వెంటరావు. ఛత్రపతి శివాజీ 'నేను చనిపోయినప్పుడు నా చేతులు భూమిపైకి ఉంచి నన్ను పాతిపెట్టండి. ఎందుకంటే చనిపోయినప్పుడు నేనేమీ వెంట తీసుకుపోలేదు అని జనాలకు తెలవడానికి' అని చెప్పాడట. మనిషి తన బతుక్కిమించి డబ్బులు సంపాదించినా వాటిలో చిల్లిగవ్వ కూడా మరణంలో తోడు రాదు.

"పలకరింపుల్లో
ప్లాస్టిక్ పూలు
ఆత్మీయత వాసన
అసలే లేదు"

(రవీంద్ర, సంగెవేని. 2006 : 2)

మారిన మనుషుల మనస్తత్వాన్ని చూపించే నానీ ఇది. ఉరుకుల పరుగుల బతుకులో బంధువులతో హాయిగా గడిపే తీరికే లేకుండా పోయింది. మానవత్వం స్థానంలో మనీ వచ్చినప్పటినుండి అనురాగాలు అంతంత మాత్రం అయిపోయాయి. ఎప్పుడో ఒకప్పుడు బంధువులో, స్నేహితులో కలిస్తే ఆ వారిని పలకరించే ఆ మాటల్లో ఆత్మీయత లేదని నేటి మానవ జీవన పరిస్థితిని వివరిస్తున్నారు కవి.

"హైటెక్ యుగం
అంతటా కంప్యూటర్లు / మనోవ్యథ తుడిచే
సాఫ్ట్‌వేర్ లేదు"

(మోహన్, పత్తిపాక. 2004: 9)

ఆధునికత వచ్చాక మనిషి జీవన విధానంలో, జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. సాంకేతికత మనుషుల మధ్య దూరాన్ని తగ్గిస్తూనే పెంచేసేంది. కంప్యూటర్లు రావడం విప్లవాత్మకమైన మార్పు. ఎంతో మంది చేసే పనులు ఒక్కటే తక్కువ టైంలో, నిర్దుష్టంగా కంప్యూటర్ చేస్తోంది. యంత్రానికి పనితనంతప్ప మనసు ఉండదు. అందుకే దానికి బాధని తగ్గించే గుణం ఉండదు.

ఆధునిక సాంకేతిక యుగంలో మనిషి కూడా ఒక యంత్రమైపోయాడు. ఇప్పుడు అతనిలో నేను, నాది అన్న స్వార్థం పెరిగింది. ఎదుటివాళ్ళను పట్టించుకునే మంచితనం, సమయం లేకుండా పోయాయి. మనిషిలో ఉండాల్సిన సహజగుణమైన మానవత్వం రోజురోజుకు మాయమైపోతుంది. మనిషి అనే కంప్యూటర్‌లో మానవత్వపు సాఫ్ట్‌వేర్ లేదు.

"పుట్టిన మట్టికి
నమస్కారం
ఈ జీవితానికిదే
పెద్ద పురస్కారం"

(అశోక్, జిందం(సంపా.). 2007: 17)

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అన్న సూక్తి ప్రకారం పుట్టిన నేల స్వర్గం కన్నా మిన్న. అందుకే కవి తనని కన్న నేలకి అక్షర హస్తాలతో వందనం చేస్తున్నారు కవి దాస్యం లక్ష్మయ్య గారు. తను పుట్టింది కరువు నేలలో అయినా బాధపడకా ఇదే తనకు స్వర్గమనీ భావిస్తున్నారు. ఈ జీవితానికి అదే పెద్ద పురస్కారమని తలుస్తున్నారు.

"చీర కరువయ్యిందా
లేక బరువయ్యిందా
జానెడు గుడ్డతో
బోలెడు తైతక్కలు"

(విజయలక్ష్మి, రేగులపాటి. 2007: 3)

ఎన్నో ఏళ్ళ చరిత్రగల సంస్కృతి సంప్రదాయం భారతదేశానిది. ఎన్నో విశిష్ట లక్షణాలతో తన ప్రత్యేకతతో ప్రపంచంలోనే గొప్ప సంస్కృతి సంప్రదాయంగా విరాజిల్లింది. అలాంటి సంస్కృతి సంప్రదాయాలు నేడు పర దేశపు రాక్షస నీడలో కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. మనకు తెలియని ఎన్నో కొత్త అలవాట్లు వస్తున్నాయి. జీన్స్, టిషర్ట్స్ మొదలైనవి

ఆహార్య విషయంలో, డిజె, బ్రేక్ డాన్స్ మొదలైనవి నృత్య విషయంలో, న్యూఇయర్, ప్రేమికులరోజు మొదలైన పార్టీలు, పండుగలు, పిజ్జా బర్గర్ మొదలైనవి ఆహార విషయంలో ఇలా అన్ని రంగాల్లో పాశ్చాత్య సంస్కృతి మనపై దాడి చేస్తోంది. 'చీరలోని గొప్పతనం తెలుసుకో, చీరకట్టి ఆడతనం పెంచుకో' అన్నట్టు అందమైన చీర సంస్కృతి కనుమరుగై, చిన్నచిన్న గుడ్డలతో విర్రవీగే సంస్కృతిలోని తైతక్కల్ని వివరిస్తుంది కవయిత్రి.

"ఆరంగుళాల డ్రెస్
ఫాదర్ డాటర్ ఫైట్
ఫ్యాషన్
బూచాడొచ్చాడోచ్!"

(రవీంద్ర, సంగెవేని. 2006: 8))

ఫ్యాషన్ల పేరుతో ఫాదర్స్‌ని పరేషాన్ల పడేస్తున్న బిడ్డ గురించి ఇక్కడ వివరించడం జరిగింది. ఫ్యాషన్ల పేరుతో వికృత వేషాలతో యువత వింత పోకడలు పోవడాన్ని కవి నిరసిస్తున్నాడు. శరీరమంతా కనిపించేలా చిట్టిపొట్టి బట్టలేసుకొని తిరగడం నవీన సంస్కృతికి నిదర్శనమే అయినా అది మన బతుకుకు కొత్తది.

"తంగేడు గోగుపూల
పుట్ట బంగారం
తెలంగాణ యాస
బాస"

(అశోక్, జిందం. 2006: 17)

తెలంగాణ ప్రాంతంలో తన భాషకు సంబంధించిన మమకారం, పరప్రాంతీయులు తెలంగాణ భాషను కించర్చడంలాంటివి తిరస్కరించడం, ఏది భాష? ఏది మాండలికం? అన్న విషయాల్ని చర్చించడం తెలంగాణ అస్తిత్వ ఉద్యమం కాలంలో ఆరంభమైంది. ఈ తరుణంలో తెలంగాణ కవులు, కళారులు తమ భాష, యాసపై అక్షరసృజన చేసారు. తన మాతృభాషని ఉన్నత శిఖరాగ్రంపై నిలిపారు. ఇన్నాళ్ళు పరభాష కింద నలిగిపోయిన తన తల్లి భాషను విడిపించి గుండెలకు హత్తుకున్నారు. అలాంటి నేపథ్యంలోంచి వచ్చిందే ఈ కవిత. తన మాతృభాష, యాసని ప్రేమించనివాడు ఇతర భాషల్ని ప్రేమించలేడు. ఈ ప్రేమించడం ముదిరితే మరే ఇతర భాషలు అసలు భాషలు కావనే స్థితికి చేరుకుంటారు.

“దూదిని
ఖడ్గంతో నరకలేము
ప్రేమను
ద్వేషంతో పొందలేము”

(అశోక్, జిందం(సంపా.). 2007: 36)

ద్వేషంతో పొందేది ద్వేషమే. ద్వేషం మనుసుల్ని విడదీస్తుంది, సంహరిస్తుంది. మనశ్శాంతిని హరిస్తుంది. ఇద్దరి వ్యక్తుల మధ్య దూరాన్ని పెంచుతుంది. ప్రేమను పొందాలంటే అది మళ్ళీ ప్రేమతోనే సాధ్యమవుతుంది. కత్తి దీపాల్ని(ప్రాణాల్ని) ఆర్పుతుంది, వత్తి(దూది) దీపాల్ని వెలిగిస్తుంది.

“ఊరు
కష్టం సుఖం.....దగ్గరితనం
మట్టిగోడలు తప్ప
` అడ్డగోడల్లేనిది”

(మోహన్, పత్తిపాక. 2004: 5)

ఊరు అత్మీయపు ఆలింగనం. ఊర్లోని వారందరూ వరసలతోనే పిలుచుకునేవారు. ఎవ్వరు ఎక్కడ కనిపించినా ప్రేమగా పలకరించుకునేవారు. ఒకరి కష్టాన్ని మరొకరు పంచుకునేవారు. ఒకరి ఆనందాన్ని మరొకరితో కలిసి పెంచుకునేవారు. కాయైన, పండైన, పువ్వైన, కూరైన ఏదైనా ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకునేవారు. ఇండ్లకు అడ్డుగోడలు తప్ప మనషులమధ్య అడ్డుగోడలు లేనిది ఊరు.

### 4.3.6. పేరడీ

ఒక రచనను, ఒక కవితను, ఒక పాటను, ఒక మాటను హాస్యంగా, అధిక్షేపంగా రాయడం పేరడి. “ఒక మాతృకకు అధిక్షేపాత్మకమైన, హేలనాత్మకమైన, హాస్యాత్మకమైన విషయాంతరంతో కూడిన అనుకరణమే పేరడి. కవి అలాంటి దృష్టితో రాసినప్పుడే పేరడి అవుతుంది. అంతేకాని ఒక కవి రచనశైలినికానీ, ఒక పద్యాన్నికానీ, ఒక ఖండికనుకానీ అనుసరించిన మాత్రాన పేరడీ అని తొందరపాటుతో తలపోయరాదు” (నిత్యానందరావు,

వెలుదండ. 1994: 5). ఈ పేరడీలో పరిహాస దృష్టి, ఒక కొంటె కోణంగితనం కూడా ఉంటాయి.

వేరొక కావ్యాన్నిగాని కవితా శైలినిగాని అనుకరిస్తూ లేకితనాన్ని కల్గించి లేవిడీ కొట్టి వేళాకోళం చేసే హాస్యానుకృతులు. ఒక కావ్యాన్ని తీసుకొని, ఒక కవితా ఖండికను తీసుకొని దాన్ని హేళనగా హాస్యస్ఫూర్తితో చేసే రచన పేరడీ. మూల రచనను, కవితను తీసుకొని దానికి హాస్యంగా అనుకరణ చేయడం పేరడీలో కనిపిస్తుంది. ఈ పేరడీతోపాటు పాఠకుడికి మూలం తెలిసినప్పుడు మాత్రమే ఆ ఆనందాన్ని, హాస్యాన్ని పూర్తిస్థాయిలో అనుభవించగలుగుతాడు. ఈ పేరడీ మనకు నవలా, వచన కవిత, వ్యాసం వంటి లాగానే ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగులోకి వచ్చింది. భావకవిత్వానంతరం ఆంగ్లసాహిత్య సంసర్గం వల్ల వచ్చిన అనేకానేక ప్రక్రియల్లో పేరడీ ఒకటి. పేరడీ ప్రధానోద్దేశ్యం హాస్యమే అయినా హాస్యానికి దీనికి భేదం కనిపిస్తుంది. సారస్వత సంబంధమైన ఒక మాతృకతో అన్యోన్య సంబంధంగల రచనా విశేషం. స్థూలంగా ఒక్కమాటలో చెప్పాలంటే వికటకవిత్వం, హాస్యం, వ్యంగ్యం, ధూషణ, ఆభాస, చమత్కారం ప్రధానంగల కవిత్వం వికట కవిత్వమే.

"హాస్యాన్ని పుట్టించాలనే ఉద్దేశంలో గంభీరంగా ఉన్న రచనలోని శైలినో రూపాన్నో అనుకరిస్తూ రచియించేది పేరడీ. Parody a literary composition in which the imitated with the serious writing is imitated with the intention of producing a humorous effect" (సుధ, సూరంపుడి. 1987: 5). శైలినీగాని, రూపాన్నిగాని తీసుకొని ఒక గంభీరమైన రచనను హాస్యభరితంగా రాసేది పేరడీ.

"ప్రామాణిక నాటకాలలోని కథావస్తువు విషాద సంఘటనతో కూడుకుని ఉన్నప్పుడు ఉద్రేకరరిచే ఆ సన్నివేశాల నుంచి పాఠకుడి దృష్టిని మరల్చే ఉద్దేశంతో పేరడీ ఆవిర్భవించిందని చెప్పవచ్చు" (పైదే: 7). ఒక ప్రక్రియ ఆవిర్భవించడానికి ఆకాలంనాటి అన్ని పరిస్థితులు దోహదపడుతాయి. విషాద సంఘటనల ఉద్రేక సన్నివేశాలనుంచి పాఠకుడిని మరల్చే ఉద్దేశంలో పుట్టినట్టు మనం పై ఉటంకింపువల్ల అర్థం చేసుకోవచ్చు. పేరడీలో ముఖ్యంగా లోపాల్ని ఎత్తిచూపడం, గేలి చేయడం వంటివి కనిపిస్తాయి. ఈ పేరడీలో మూల రచయితను గాయపరచక, నవ్వించడంలో అసభ్యకరమైన పదాల్ని వాడక ఉత్తమ హాస్యాన్ని అందించడం నియమాలు.

మూలం: “ఏ చరిత్ర చూసినా

ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరజాతి పరాయనత్వం
నరజాతి చరిత్ర సమస్తం
పరస్పరాహరణోద్యోగం
నరజాతి చరిత్ర సమస్తం
రణరక్త ప్రవాహసిక్తం”

పేరడీ: ఏ పత్రిక తిప్పి చూసినా

ఏమున్నది గర్వకారణం
పత్రికల పేజీలు మొత్తం
పరదేశీ వ్యామోహకత్వం
పత్రికల పేజీలు మొత్తం
తుపాకి బుల్లెట్ల వేగం
పత్రికల పేజీల మొత్తం
కై పెక్కించే కథల గమనం”

(లక్ష్మినారాయణ, సబ్బని. 2001: 14)

ఈ పేరడీలో కవి హాస్యాన్ని కాక సమాజంలోని సమస్యను చిత్రించారు. పత్రికల్లో వచ్చే కథనాలు ఏవిధంగా ఉన్నాయో చెప్పే పేరడీ ఇది. పరదేశీ సంస్కృతి వ్యామోహం, హత్యల పర్వం, రాజకీయ చర్చలతో కైపెక్కించే కథనాల సమాహారంగా పత్రికలు మారడమనేది దురదృష్టకరమనీ, నీతిలేని దొంగరాతలు ఇంకా ఎంతకాలమని ప్రశ్నిస్తున్నారు కవి.

మూలం: దేవుడా

రక్షించు నా దేశాన్ని
పవిత్రులనుండి పతివ్రతలనుండి
పెద్దమనుషులనుండి పెద్దపులులనుండి
నీతుల రెండు నాల్కలు సాచి బుసలుకొట్టే

నిర్వేతుక కృపా సర్పాల నుండి…”

పేరడీ: దేవుడా

రక్షించు మా పాఠకుల్ని

నకలు రచయితల్నుండి, నకిలీ రచయితల్నుండి

ట్రెండ్ సెట్టర్ల నుండి, ఘోస్టు రైటర్ల నుండి

నైతిక విలువలు పక్కన పెట్టి బుసలు కొట్టే

విషపు కలాల గళాల నుండి”

(లక్ష్మినారాయణ, సబ్బని. 2001: 19)

ఎక్కడెక్కడో చదివి వాటిని తమ రచనలుగా తెలుగు చేసుకునే నకలు రచయితలనుండి పాఠకున్ని కాపాడమని వేడుకుంటున్నారు కవి. అలాగే నైతికతని పక్కకునెట్టి ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే గొప్ప రచయితనని చెప్పుకునే వారినుండి, బూటకపు రచయితలనుండి పాఠకున్ని కాపాడమంటున్నాడు కవి.

మూలం: నాకొ్కంచం నమ్మకమివ్వు

కొండలు పిండి కొట్టెస్తాను

చితికిన టొమేటో లాంటి సూర్యుణ్ణి

ఆరిన అప్పడంలాంటి చంద్రుణ్ణి

ఆకాశపు ఎంగిలి పల్లెంలోంచి నెట్టెస్తాను”

పేరడీ: “నాకొ్కంచం అవకాశమివ్వు

మేధస్సుకు పదును పెట్టేస్తాను

కుళ్ళిపేరుకుపోయిన కుసంస్కృతిని

మురికి పట్టి పారుతున్న చెత్త రాతల్ని

సాహితీలోకం నుండి నెట్టేస్తాను”

(లక్ష్మినారాయణ, సబ్బని. 2001: 22)

నాకొ్కంచం అవకాశమిస్తే మేధస్సుకు పదునుపెట్టి కుళ్ళిపోయిన సంస్కృతిని (స్వతంత్ర నవలలు కాక కాపీకొట్టే రాసే సంస్కృతిని), వ్యర్థాలాపన, మురికిపట్టిన రాతల్ని సాహితీలోకం నుండి తరిమేస్తాను అని అంటున్నారు కవి. తిలక్ గారన్నట్టు ‘నీలోంచి రావాలి, తన్నుకొని రావాలి’ అన్న ప్రకారం ఏ చిన్న వాక్యమైన నీదై ఉండాలి తప్పు ఎక్కడో

చూసి ఎవరికి తెలియకుండా నీ స్వంతం చేసుకునే లక్షణం రచయితలకు, కవులకు ఉందకూడదన్న అభిప్రాయం పై కవితలో కనిపిస్తుంది.

పేరడీ:

నవ్వించే జోకులైనా
సరదాల కబుర్లైనా
కావా కావా! నవలలు అ
వే నేటి లోకం
పసలేని ఈ రాతలైనా...
మతిలేని సబ్జెక్టులైనా....
అయినా అయినా నవలలే, అవే
నేటి నవలామృతం"

(లక్ష్మీనారాయణ, సబ్బని. 2001: 30)

నేటి నవలా రచనన పద్ధతిని, వాటి విధానాన్ని హాస్యంగా చమర్కరిస్తున్నాడు కవి. జోకులు, సరదా కబుర్లు నేటి నవల లోకంగా వ్యవహరించబడుతున్న కాలాన్ని విమర్శిస్తున్నాడు. మతిలేని సబ్జెక్ట్ తీసుకొని పసలేని రాతల్ని నవలలుగా మెప్పించే నవలా లోకాన్ని తన తప్పు తెలుసుకోమంటున్నాడు.

### 4.3.7. నానోలు

తెలుగు సాహిత్యం నిత్య ప్రవాహశీలి. కాలానుగుణంగా తెలుగు సాహిత్యంలో వచనకవిత, దీర్ఘకవిత, మినీకవిత, నానీలు, హైకూలు, రుబాయీలు ఇలా ఎన్నో కొత్తకొత్త రూపాలు, ప్రక్రియలు వచ్చాయి, వస్తున్నాయి. అలాగే తెలుగు సాహిత్యంలో వచ్చిన మరో రూపం నానోలు. "నానోలు ప్రస్తుతం తెలుగు కవిత్వంలో ఉన్న రూపాల్లోకి సూక్ష్మమైంది. నాలుగు పాదాలు, పాదానికి ఒకే ఒక్క పదం. ఆ పదం సరళమైన సమాసం లేదా సంధియైనా సరే. ఇదీ ఈ ప్రక్రియ వ్యాకరణం. అంటే నాలుగే నాలుగు పదాల్తో కవిత్వాన్ని పలికించగలగాలి. ఒక మెరుపులాగా మెరిసి పాఠకున్ని రంజింప చేయగలగాలి". (లక్ష్మీనారాయణ, సబ్బని. 2010: i) అన్న ఈగ హనుమాన్ గారి మాటలు నానోలు లక్షణాల్ని తెలుపుతున్నాయి. తెలుగులో చాలా తక్కువగా నానోల కవిత్వం వచ్చింది.

"దగాపడ్డ

దశాబ్దాల

పోరాటం

తెలంగాణ"

(లక్ష్మీనారాయణ, సబ్బని. 2010: 6)

తెలంగాణ పోరాటాలకి నిలయమని ఇక్కడ జరిగిన పోరాటాలని చదివితే అర్థమవుతుంది. ఆనాటి నిజాం వ్యతిరేక ఉద్యమం మొదలుకొని, గైర్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం, 1969 తొలిదశ తెలంగాణ పోరాటం, 2009 మలిదశ తెలంగాణ ఉద్యమం ఇలా అనేకానేక ఉద్యమాలను చేసింది, చూసింది తెలంగాణ ప్రాంతం.

"తెలంగాణ

ఆకాంక్షల

స్వప్నం

ఉస్మానియా"

(లక్ష్మీనారాయణ, సబ్బని. 2010: 17)

తెలంగాణ ఉద్యమంలో కీలక స్థానంగా ఉంది ఉస్మానియా విశ్వవిద్యాలయమే. ఏ ఉద్యమ కార్యచరణైన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండే పురుడుపోసుకోవల్సింది. తెలంగాణ ఉద్యమం జరుగుతున్న సందర్భంలో తెలంగాణతోపాటు యావత్ భారతదేశం ఉస్మానియావైపే దృష్టి పెట్టింది. ఈ విశ్విద్యాలయంనుంచే ఎంతో మంది నాయకులు, కార్యకర్తలు పుట్టుకొచ్చారు. అందుకే ఒకపాటలో 'ఉస్మానియా క్యాంపస్‌లో ఉదయించిన కిరణమా పోరు తెలంగాణమా' అని రాశారు.

"హైదరాబాద్

తెలంగాణ ఆత్మ

తెలంగాణ గుండె

తెలంగాణ నడిబొడ్డు"

(లక్ష్మీనారాయణ, సబ్బని. 2010: 21)

తెలంగాణ ప్రాంతం మలిదశ ఉద్యమాన్ని దాదాపు 90 రోజులు చేసింది. ఇన్ని రోజుల్లో ప్రతిచోట ధూందాంలు, రాస్తారోఖోలు, బంద్‌లు జరిగాయి. చివరికి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఇవ్వడానికి ఒప్పుకుంది. తెలంగాణ అతిముఖ్యమైంది హైదరాబాద్. అది లేని తెలంగాన సాధించి కూడా వ్యర్థమే. తెలంగాణ సాకార పరిణామంలో ఆంధ్ర నాయకులనుంచి, పెట్టుబడిదారులనుంచి హైదరాబాద్‌ని కేంద్ర పాలిత ప్రాంతం చెయ్యాలని, హైదరాబాద్ ఇరు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిని చెయ్యాలని అనే డిమాండ్స్ వినిపించాయి. ఇవి రెండింటిలో ఏది జరిగినా తెలంగాణ నష్టపోతుంది. కనుక దీన్ని వ్యతిరేకిస్త తెలంగాణ ప్రజలంత ఉద్యమం చేశారు.

"హైదరాబాద్
తెలంగాణ ఆత్మ
తెలంగాణ గుండె / తెలంగాణ నడిబొడ్డు"

(లక్ష్మీనారాయణ, సబ్బని. 2010: 25)

తెలంగాణోద్యమం ఆటపాటలతో, ధర్నాలు, రాస్తారోకోలు, వంటావార్పు మొదలైన వాటితో నిరాఘాటంగా నడుస్తున్నప్పుడు ఇక తెలంగాణ ఇవ్వాలి అని అనుకున్నప్పుడు సీమాంధ్ర ప్రాంతానికి చెందిన నాయకులు హైదరాబాద్‌ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు ఉమ్మడి రాజధానిని చెయ్యాలి, హైదరాబాద్‌ని కేంద్ర పాలిత ప్రాంతంగా పకటించాలి మొదలైన వాదనలు వినిపించారు. వీటన్నింటికి తెలంగాణ ప్రజలు ఒప్పుకోలేదు. ఎందుకంటే హైదరాబాద్ లేని తెలంగాణని ఊహించుకోవడం కష్టం. ఒక్క హైదరాబాద్ వల్లనే తెలంగాణకి ఆదాయం, గౌరవం.

# అధ్యాయం - 5

# కరీంనగర్ జిల్లా కవిత్వం – రూప పరిణామం

## 5. పరిచయం

ఏ సాహిత్యానికైన, సమాజానికైన పరిణామం లేదంటే అది అభివృద్ధి పొందలేదని అర్థం. సాహిత్యం, సమాజం సజీవమైనవి. సజీవమైన సమాజ, సాహిత్యాలకు మార్పు సహజం. సమాజంలో మార్పు సామాజికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఉంటుంది. ఈ మార్పులే సాహిత్యంలో ప్రతిఫలించబడుతాయి. ఎందుకంటే సమాజ, సాహిత్యాలు పరస్పర సంబంధం కలిగి ఉంటాయి కనుక. ఈ విషయాన్ని మనం సాహిత్య చరిత్ర, సమాజ చరిత్ర బేరీజు వేసుకొని చూస్తే తెలుస్తుంది.

ప్రాచీనకాలం నుంచి నేటికాలం వరకు తెలుగు సాహిత్యం భిన్నభిన్న రూపాలతో పరిఢవిల్లింది. తెలుగు సాహిత్య రూప పరిణామంలో జరిగినన్ని మార్పులు మరే భాషలోని సాహిత్యంలో జరిగి ఉండకపోవచ్చు. అన్ని రూపాలు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. ప్రాచీనకాలం నుంచి ఆధునిక యుగం వచ్చేవరకు పద్యమే ఏకైక రూపంగా మనకు కనిపిస్తుంది. ఆ తర్వాత పాశ్చాత్య సాహిత్య ప్రభావం, స్థానిక ఉద్యమాల ప్రభావంవల్ల కొత్త రూపాలు సాహిత్యంలోకి ప్రవేశించాయి. ఛందోబద్ధ కవిత్వం, ఖండకావ్యం, గజల్స్, రుబాయీలు, ప్రపంచపదులు, నవల, కథ, నాటకం, వచన కవిత, దీర్ఘకవిత, మినీకవిత, నానీలు, హైకూల ఇలా అనేక రూపాలు కనిపిస్తాయి.

## 5.1. రూపం - నిర్వచనాలు

“కవిత్వం, కథ, నవల, నాటకం మొదలైన సాహిత్య ప్రక్రియలను సాహిత్య రూపాలుగా కూడా చెప్పుకోవచ్చు – కవిత్వ రూపం, కథా రూపం, నాటక రూపం మొదలైన విధంగా. కాబట్టి ప్రక్రియ, రూపం అనేవి పర్యాయపదాలుగా ప్రయోగించబడుతున్నాయి. అయితే కవిత్వం అనేది ఒక ప్రక్రియ అయినా, అది పద్యం, గేయం, వచన కవిత, పాట అనే రూపాలలో కూడా ఉండొచ్చు. కవిత్వం అనే ప్రక్రియలో వీటిని ఉపప్రక్రియలుగా భావించవచ్చు” (చెంచయ్య, వి. 2017: 18). ఒక విషయాన్ని వ్యక్తపర్చడానికి

ఉపయోగించే రూపంలో రెండు విషయాలు పరిగణలోకి తీసుకోవాలి. ఒకటి ప్రక్రియ, రెండు చెప్పే విధానం. దీన్నే శిల్పం అని అంటాం. మొదటిది బాహిర్ రూపానికి సంబంధించిందైతే, రెండవది అంతర్నిర్మాణానికి సంబంధించింది.

తెలుగు సాహిత్యం నన్నయతో ఆరంభమైందని అనుకుంటే నన్నయ నుండి 19వ శతాబ్దం చివరివరకు పద్యం అవిచ్ఛిన్నంగా కొనసాగింది. పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, ప్రబంధాలు, నాటకాలు ఇలా అన్ని పద్యంలోనే వచ్చాయి. ఆ తర్వాత పాశ్చాత్య ప్రభావంవల్ల ఆధునిక కాలంలో కొత్త రూపాలు వచ్చాయి.

"అయితే, ప్రతియుగమూ ఆ యుగంలోని వస్తూత్పత్తి రీతుల ప్రభావం వల్ల నిర్మితమవుతోందనీ ఆ యుగంలోని ఆలోచనలూ ఆదర్శలూ కళలూ సాహిత్యమూ సమిష్టిమీద ఆ యుగధర్మాన్నిబట్టి రూపొందుతాయనీ అంగీకరించిన తరువాత కూడా, సాహిత్య పరిణామం అక్షరాలా ఎలా జరుగుతుంది? ఏ విధంగా, ఏయే కారణాల వల్ల ఏ సాహిత్య రూపాలు ఏర్పడతాయి అన్న విషయం నిక్కచ్చిగా రూపుకట్టదు. తత్కాల సామాజిక పరిస్థితులనూ ఆర్థిక వ్యవస్థనూ వివరించి, అంత మాత్రాన సాహిత్య రూపాలలో మార్పులకి అవి ప్రత్యక్ష కారణాలుగా నిరూపించబోవడం బహుక్లిష్టమైన తాత్త్విక ప్రతిపాదనని యాంత్రికంగా సాహిత్యానికి వర్తింపజెయ్యడం అవుతుంది. తెలుగు సాహిత్య విమర్శలో ఈ స్థితి తరచు కనిపిస్తుంది" (నారాయణరావు, వెల్చేరు. 2008: xvi). సమాజంలో లేదా యుగంలో సామాజిక, ఆర్థిక రంగాల్లో సంభవించే పరిణామాలు, మార్పులు సాహిత్య రూపాన్ని నిర్ధారిస్తయన్న భావనని ఖండిస్తున్నారు.

రూప విప్లవానికి సామాజిక, ఆర్థిక పరిస్థితులు కారణం కాదంటూనే దానికి భావ విప్లవం కారణంగా చూపిస్తున్నారు. "ఈ రూపవిప్లవానికి కారణం భావవిప్లవం. భావం మారినప్పుడల్లా కవితా రూపం మారింది. కొత్త రూపానికి అనుగుణంగా భావం మలుపు తిరిగింది కూడా. కవిత్వ రూపానికి కాలాతీతమైన అస్తిత్వం కాని, శాశ్వతత్వం కాని లేదు. పాత కవిత్వాన్ని సమర్థించేవారు రూపానికీ, కవిత్వానికీ అభేదం చెప్తారు. కొత్త కవిత్వాన్ని సమర్థించేవారు కవిత్వానికీ. స్వేచ్ఛకీ అభేదం చెప్తారు" (పైదే: 148). కవిలో కలిగిన భావం ఇంతకుముందున్న రూపంలో ఇమడదు అన్న భావన కలిగితే దాన్ని ఒక కొత్త రూపంలో చెప్పడానికి ప్రయత్నిస్తుంటాడు. అలా కవిలో కలిగిన భావ విప్లవమే ఒక కొత్త కవితా రూపాన్ని సృష్టించుకుంటుంది.

ఇలా ఒక కొత్త రూప ఆవిర్భావం జరిగిన తర్వాత అది కొంత కాలానికి అందరూ అనుసరించి ప్రక్రియగా మారుతుంది. మరికొంత కాలానికి అది సహజత్వాన్ని కోల్పోయి మరో కొత్త రూపం మరో కవి ద్వారా పుట్టవచ్చు. "ఇవి తాత్కాలికమైన నిజాలు. ప్రతి కవితా రూపమూ ఒక నిర్దిష్ట కాలానికి, ఒక ప్రత్యేక సామాజిక దశకీ పరిమితమైనది. ఏ రూపమూ దానంతట అదిగా కృతకమో, సహజమో లేదా నియమసహితమో, నియమరహితమో కాదు. నిజానికి ఏ కవితా రూపమూ కృతకం కాదు. ఒక నిర్దిష్టకాలానికి, సహజమైన కవితా భావానికి తగిన రూపం అయినందువల్ల ఏ కవితా రూపమూ అకృతం కాదు, ఆ నిర్దిష్టకాలం తరవాత ఆ కవితా రూపం సహజత్వాన్ని కోల్పోతుంది" (నారాయణరావు, వెల్చేరు. 2008: 148). రూపం అనేది ఒక నిర్ధిష్ట కాలానికి సంబంధించింది మాత్రమే కాని అది నిత్యం కాదు. ఆయా కాలాల్లో మొదటగా వచ్చినప్పుడు ఉన్నంత ఆదరణ ఆ తర్వాత ఉండకపోవచ్చు. కాలానుగతినిబట్టి ఇంకో కొత్త రూపం ఆవిర్భవించవచ్చు.

"కవిత్వంలోకి కొత్త తరం వచ్చిన ప్రతి సందర్భంలోనూ వస్తు దృక్పథాలు మారుతాయి. ఈ అన్నింటికంటే ముందుగా రూపం మార్పును కోరుతుంది. రూపం మార్పు విషయంలో కొత్తతరం కవులపై ఒక వొత్తిడి వుంటుంది. పూర్వతరం కవుల బలమైన ప్రభావముంటే అదే పద్ధతిలో వస్తురూప, దృక్పథాలు కొనసాగుతాయి. ఈ ప్రభావాలు లేనప్పుడు వస్తువు, దృక్పథం, రూపం మారుతుంది" (సీతారాం. 2007: 43). సామాన్యంగా కొత్తతరం మారినప్పుడు కొత్త రూపం వస్తుందంటారు సీతారాం. కొత్తతరం కొత్త ఆలోచనలతో, కొత్త భావలతో వస్తుంది కనుక అప్పటిదాకా కొనసాగుతూ వస్తోన్న రూపాలు వారి భావాలకు, ఆలోచనలకు సరిపోకపోవచ్చు. వచ్చే తరంపైన పాతతరం ప్రభావమే అధికంగా ఉంటే పాతపద్ధతిలోనే సృజన జరుగుతుంది.

"వస్తువుని బట్టి కవిత్వానికి రూపం ఏర్పడుతుందన్నది స్పష్టమైన విషయం. దేన్నైనా వ్యక్తీకరించడానికి 'రూపం' ప్రధానమైన 'వాహిక'గా పని చేస్తుంది. ఒక 'రౌడీ' పాత్రనో, 'దొంగ' పాత్రనో చూపించాలంటే ఆ పాత్రకు తగిన, మేకప్, దుస్తులు వాడతారు. చూడగానే పాత్ర రౌడీ పాత్ర లేదా దొంగ పాత్ర అని గుర్తుబట్ట గలగిన విధంగా 'రూపాన్ని' తీర్చిదిద్దుతారు. అంటే పాత్రకు అనుగుణమైన 'రూపాన్ని' ఇస్తారన్నమాట" (ఎమ్.ఎమ్. వినోదిని. 2011: 237). వస్తువును బట్టే సాహిత్యానికొక రూపం వస్తుందని చంద్రికగారి అభిప్రాయం. ఏదైన ఒక వస్తువు రూపంలోనే వ్యక్తమవ్వాలి, వ్యక్తమవుతుంది కూడా. శ్రీశ్రీగారి

'మహాప్రస్థానం' వచన కవిత్వంలోకాక మరే రూపంలో వచ్చి ఉంటే అంత శక్తి దానికి ఉండేది కాదేమో.

"సాహిత్యంలో వస్తువు ఏదో ఒక ప్రక్రియను ఆశ్రయించి బహిర్గతమౌతుంది. సామాజికమైన అనేక పరిస్థితులను బట్టి, భావాన్ని అభివ్యక్తం చెయ్యడంలోని క్రొత్త క్రొత్త అవకాశాన్ని బట్టి ప్రచలితంగా ఉన్న ప్రక్రియల్లో మార్పులు వస్తాయి. ఉన్నట్టుండి ఒక క్రొత్త రూపం ఉద్యమ స్థితికి వస్తుంది. ఒక ప్రక్రియ ఒక కాలంలో అధిక ప్రాచుర్యం పొందటానికి గాని, నిరసింపబడటానికి గాని కొన్ని పరిస్థితులు సహకరిస్తాయి" (చంద్రిక, యం. 1987: 2).

"ఒక వస్తువుని ఒక రూపంలో చెబితేనే అందం వస్తుంది. నేను ఎమోషన్‌తో రాస్తాను. ఎమోషన్ వస్తువుకో రూపాన్ని నిర్ణయిస్తుందేమో" (శివరామకృష్ణ, పెన్నా. 2005: 6). వస్తువుకుతగ్గ రూపం లేకుంటే ఆ వస్తువు పాఠకులపైన అంత ప్రభావం చూపించలేదు. కవిలోని ఎమోషనే రూపాన్ని నిర్ణయిస్తుందని అంటారు శివరామకృష్ణ గారు.

## 5.2. కరీంనగర్ జిల్లా కవిత్వం – రూప పరిణామం

మరే భారతదేశ సాహిత్యంలో కానరానంత రూప వైవిధ్యాన్ని, వస్తు వైవిధ్యాన్ని తెలుగు సాహిత్యం సొంతం చేసుకుంది. పాశ్చాత్య దేశాల్లో విస్తృతమైన, ముఖ్యమైన కవితా ధోరణులను, రూపాలను తెలుగు సాహిత్యం తనదిగా చేసుకుంది. అలాగే భారతదేశంలోని ఇతర భాషల సాహిత్య ప్రభావంవల్ల కూడా కొన్ని రూపాలు తెలుగులోకి వచ్చాయి. తెలుగు సాహిత్యంలో కనిపించే అనేక రూపాలు కరీంనగర్ జిల్లా కవిత్వంలోనూ కనబడతాయి.

### 5.2.1. ఛందోబద్ధ కవిత్వం

తెలుగు సాహిత్యారంభం నుంచి ఆధునిక కాలందాకా (అక్కడక్కడ ఛందోబద్ధ కవిత్వం వస్తోంది) సాహిత్యంమంతా ఛందోబద్ధ కవిత్వమే. కావ్యమైనా, ప్రబంధమైనా, శతకమైనా, నాటకమైనా ఏదైనా ఛందోబద్ధంగానే కవిత్వ రచన సాగింది. ఆధునికకాలం వరకు ఈ పరంపర కొనసాగింది. ఆ తర్వాత కూడా కవిత్వమెంత దినదినాభివృద్ధి సాధిస్తున్నప్పటికీ పద్య రచనలు ఇంకా వస్తూనే ఉన్నాయి. ప్రస్తుత సమాజానికి సంబంధించిన వస్తువును

తీసుకుని ప్రాచీన పద్య పద్ధతిలో కవిత్వం రాస్తున్నారు. ఈ కాలానికి పద్యం సరిపోదన్న వాదన వినిపిస్తున్నప్పటికీ తనదైన ముద్రణని వేస్తుంది. సాంప్రదాయ పద్యంపైన వచ్చిన తిరుగుబాటే వచన కవిత్వం. ఇటు వచన కవిత్వంతోపాటు పద్య కవిత్వం రాస్తున్నవాళ్లు కూడా లేకపోలేదు. కరీంనగర్ జిల్లాలో ఇప్పటికీ అక్కడక్కడ పద్య రచనలు రావడం గమనార్హం.

"పండువెన్నెలఁగాయు నీపడఁతిమోము
నందుఁ గెమ్మోవి తనరెసుధాశనప్ర
చయము సుధఁగ్రోలఁబూని చంద్రునందు
మించుఁ గెంపులగిండిఁ గీలించె ననఁగ"

(ధర్మన, చరిగొండ. 2013: 85)

పడతి మోములో పండు వెన్నెలలు కాయగా వెన్నెలను తాగదలిచిన చకోరపక్షి చంద్రున్ని మించిన కెంపులను పడతి మోములోని కెంపులను చూసి ఆ పడతి మోమును చేరింది.

"భూపతి కెల్లసంపదలఁబొందెదుచోట నసహ్యభావమున్
జూపక కార్యభారమున స్రుక్కక విశ్రమవేళ యైన సే
వాపరుఁడై మహోఘములు వచ్చుపనుల్ దొలగించి చెప్పిన
ట్లేపని యైనఁజేయునతఁడీప్సితదైవము గాక బంధుడే"

(సింగన, మడికి. 1970: 33)

సకల సంపదలు పొందేచోట రాజు అసహ్యభావాన్ని చూపక, పనిభారంవల్ల అలిసిపోక, విశ్రమించేవేళలో కూడా సేవాపరుడై దుఃఖాలను, కష్టాలను తొలగించి ప్రజలకనుగుణంగా నడుచుకునేవాడు దైవము కాక అందరికి బంధువవుతాడు.

"తల్లిగర్భమునుండి – ధనము తేఁడెవ్వడు
వెళ్లిపోయెడినాఁడు – వెంటరాదు
లక్షాధికారైన – లవణ మన్నమె కాని
మెఱుఁగు బంగారంబు – మ్రింగఁబోఁడు
విత్త మార్జనఁ జేసి – విఱ్ఱవీఁగుటె కాని
కూడఁబెట్టిన సొమ్ము – తోడరాదు
పొందుగా మఱుఁగైన – భూమిలోపలఁ బెట్టి

దానధర్మము లేక – దాఁచి దాఁచి
తుదకు దొంగల కిత్తురో – దొరల కవునొ
తేనే జుంటీఁగ లియ్యవా – తెరువరులకు
భూషణవికాస! శ్రీ ధర్మ – పురనివాస!
దుష్టసంహార! నరసింహ – దురితదూర!"

(శేషప్ప. 1984: 26)

ధర్మపురి వాస్తువ్యడైన శేషప్ప కవి స్థానిక లక్ష్మీనరసింహుడిపై త్రిశతి రచించారు. ఎంతో ప్రసిద్ధిగాంచిన పద్యాలు నరసింహ సతకంలో ఉన్నాయి. వాటిల్లో ఇదొకటి. నరసింహా! తల్లికడుపునుండి ధనం ఎవ్వరు తీసుకురారు. చనిపోయినప్పుడు అది వెంటరాదు. లక్షలు సంపాదించిన ఉప్పు అన్నమే కాని బంగారం తినలేదు. డబ్బు సంపాందించి విర్రవీగుటేకాని దాచిపెట్టుకున్న ధనం తోడురాదు. దానధర్మంలేక భద్రంగా దాచిపెట్టి చివరికి దొంగలపాలు చేస్తారు. ఎలాగంటే తుమ్మెదలు తేనే దాచి దాచి బాటసారులకు ఇచ్చినట్టు.

"ప్రేమోన్మాద ప్రకోప భారజిత హృ
త్ప్రేరపణన్ రెచ్చి ఓ
కామీ! గాఢ కృశామ్ల ధారల బలా
త్కారమ్ముగా భామినీ
మోముబ్బన్ విసిరేవు, రూపసులపై
మూఢత్వమున్ జూపుటే
లా? మాత్సర్యమనోహతుండ, మదమే
లా? దౌష్ట్యమున్ వీడుమా

(ఎలనాగ. 2012: 19)

ప్రేమోన్మాదుడి చేతిలో యాసిడ్ దాడికి బలైన స్వప్నికకు అంకితంగా పై పద్యాన్ని రాశారు. సమాజంలో ఆడవారికి కనీస భద్రత కరువైందని చెప్పడానికి స్వప్నిక మొదలైన వారిపై జరిగిన యాసిడ్ దాడులే సాక్ష్యం. ఆడవాళ్ళకి ఒక మనసుంటుంది. ఆ మనసుకు కొన్ని భావనలుంటాయి. వాళ్ళకి ఇష్టాయిష్టాలుంటాయి. వాళ్ళ భావనలని, ఇష్టాయిష్టాలని గౌరవించట్లేదనే బాధలోంచి, స్త్రీని సాటి మనిషిగా గుర్తించట్లేదన్న ఆవేదనలోంచి పై మాటలు వచ్చాయి. ప్రేమ అనేది రెండు మనసులకు సంబంధించిన విషయం. నీకు ఎదుటివారిపై

ఇష్టం ఉన్నా ఎదుటివాళ్లకు నీపై ఇష్టం ఉంటేనే అది ప్రేమవుతుంది. అమ్మాయి తన హక్కని భావించే పురుషాధిపత్య సమాజం స్త్రీకి మనసుందని, ఆ మనసుకొక ఇష్టం ఉందని గుర్తించక, తన మాటకు ఎదురుచెప్పిందనో, తన ప్రేమని ఒప్పుకోలేదనో యాసిడ్ దాడి చెయ్యడం, హత్య చెయ్యడం జరుగుతుంది. మనసున్న మనుషులుగా కవితోపాటు మనం స్త్రీలకు అండగా నిలవాలి. ఇలాంటి సంఘటనలు మళ్ళీ జరగకుండా చూడాలి.

"నాగటి చాలులో నడిచి
నాటుచు విత్తనముల్ శ్రమించుచున్
సాగెడి రైతు కూలిజన
శక్తికి తోడుగ వెంటబోవలెన్
జాగిలమట్లు కాలము; వి
షాద మయమ్మగులోక మందు, ఏ
యోగములైన నేమి తల
యొగ్గవలెన్ శ్రమయోగ సిద్ధికిన్
శ్రమయే సృష్టికి ప్రాణము
శ్రమయే పరిణామ చరిత రథసారథియున్
శ్రన సమ్మెకు దిగెనో, కా
లమునకె మూర్ఛిల్లు ఘోరప్రళయము వచ్చున్!"
(బాపురెడ్డి, జె. 2003: 57)

భూమ్మీద అన్నింటికన్న గొప్పది శ్రమశక్తినే. దానిని మించింది లోకంలో ఉండదు. "శ్రమైక జీవన సౌందర్యానికి / సమానమైనది లేనేలేదని" (శ్రీశ్రీ. 2009: 61) అన్న శ్రీశ్రీ మాటలవల్ల శ్రమ సౌందర్య గొప్పతనం అర్థమవుతుంది. ఒక రైతు శ్రమలేకపోతే అన్నం ఉండదు, ఒక చేనేత కార్మికుడు పని చేయకుంటే కట్టుకోడానికి బట్ట ఉండదు, ఇలా కుమ్మరి, కమ్మరి, చాకలి, నేత అందరూ తమ తమ వృత్తుల్ని సక్రమంగా నెరవేర్చకపోతే ప్రపంచానికే మనుగడ ఉండదు.

### 5.2.2.ఖండకావ్యం

తెలుగు సాహిత్యం ఇరవయ్యవో శతాబ్దం అనేక సాహిత్య రూపాలకు కేంద్రమైంది. తెలుగులో వచ్చిన అనేకానేక కవితా రూపాల్లో ఖండకావ్యం ఒక్కటి. సంస్కృత

అలంకారికులైన భామహుడు కావ్యాన్ని మూడు రకాలుగా విభజించిన వాటిలో అనిబద్ధ కావ్యం ఖండకావ్యమనీ, వామనుడు 'నా నిబద్ధంచ కాన్త్యేక తేజః' అని చెబితే, ఆనందవర్ధనుడు ప్రబంధంతో సమాన గౌరవాన్ని ఇచ్చాడని విమర్శకులు చెబుతారు. "ఇంద్రగంటి వారు చెప్పినట్లు మహాకావ్యాల్లోని రసవద్ఘట్టాలు, కొన్ని ప్రత్యేక సంఘటనలు, కొన్ని ప్రత్యేక వర్ణనలు మొదలైనవన్నీ ఖండకావ్యాలుగా రూపుదిద్దుకునే అవకాశం ఉంది. ఒకరకంగా వేదాల్లోని సూక్తాలు కూడా ఖండకావ్య తొలిరూపాలుగా గుర్తించవచ్చు. విశ్వనాథుని అనుసరించిన కవి హృదయాన్ని చీల్చుకొని ఉబికివచ్చు భావధారలే ఖండకావ్య వాహికలుగా నిర్ధారించవచ్చు. భావతీవ్రతను వ్యక్తపరుచుటకు, రసానందాన్ని వెంటనే కలిగింపజేయుటకు ఖండకావ్యమును మించిన ప్రక్రియ లేదన్నది పలువురు విశ్లేషకుల భావము" (కమలాకరశర్మ, సాగి(సంపా.). 2014: 167) అన్న గన్నమరాజు గిరిజా మనోహర బాబుగారి మాటలవల్ల వేదాల్లోని సూక్తాలు తొలి ఖండకావ్య రూపాలని తెలుస్తుంది.

"ఈనాడు మనం అనుకుంటున్న ఖండకావ్యం అనే దానిని మొదట్లో లఘుకావ్యం అనే అర్థంలో పరిగణించేవారు. ఈ ఖండకావ్యం భావకవిత్వయుగంలో బాగా ప్రచారంలోకి వచ్చింది. కవి తన భావాలనూ, ఒకటో, రెండో పాత్రల మీద ఆరోపించి లఘుకావ్యం సిద్ధం చేసేవాడు. నూరు, నూటయాభై పద్యాల పరిమితిలో యీ కావ్యాలు వచ్చాయి. కాని రానురాను ఖండకావ్యం అనేదానికి అర్థం మారిపోయింది. మరీ జాషువాగారు వచ్చిన తరువాత ఖండ కావ్యం అంటే 10, 20 పద్యాల ఖండిక అనే అర్థం రూఢమైపోయింది" (ఆంజనేయులు, కుందుర్తి. 1987: 25 – 26). మొదట్లో నూరు, నూటయాభై పద్యాలతో వచ్చిన ఖండకావ్యం ఆ తర్వాత పది, ఇరవై పద్యాలకు పరిమితమైందని తెలుస్తుంది.

"ఇంతకు ఖండకావ్యం అనగా చిన్న కథ పాత్రలు, పరిమిత పద్యములలో ఉన్న రచన కావచ్చును" (నారాయణరెడ్డి, సి. 1997: 172) అన్న నిర్వచనంవల్ల ఒకటో, రెండో పాత్రలుండి, చిన్నకథతో, కొన్ని పద్యాలలో ఉన్న కావ్యం ఖండకావ్యమని అర్థమవుతుంది. ఖండకావ్య రూపంలో భావకవిత్వం విస్తృతంగా వచ్చింది. భావకవులు ఆత్మాశ్రయ రీతిని ఎక్కువ ఉపయోగించుకోవడం వల్ల కవి మనసులోని భావాన్ని బలంగా పాఠకులకు అందించడానికి ఈ ప్రక్రియ దోహదపడింది.

"ఓ నవరాగ విస్ఫుట మహోదయ శీల, మదీయ భావ నో
ద్యానము నందు కొంజిగురుటాకుల రాకలెరింగి యిత్తు నీ
కానుక మవ్వపుందెలుగు కావ్యముగా సవరించి నీ యశో
గానము నందిదొక్క గమకంబయి నిల్చిననే కృతార్థుడన్"

(సత్యనారాయణరాజు, గర్రెపల్లి. 1956: 3)

1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణ సందర్భంగా వెలువడ్డదే 'కలస్వనము' అనే ఈ ఖండకావ్యం. ఈ ఖండకావ్యాన్ని 1956లో తెలంగాణ రచయితల సంఘం, హైదరాబాద్ వారు ముద్రించారు. కొత్తగా అవతరించిన ఆంధ్రప్రదేశ్ కానుకగా ఈ కావ్యాన్ని సమర్పించారు.

"ప్రతి జీవుండెట నో జనించి యెచటో ప్రాల్మాలు నీ జీవితం
బు తలాతోకయులేక బుచ్చి చనిపో బుణ్యంబొ శ్రేయంబొకో
బ్రతుకన్నన్ దిని త్రావి త్రేన్చుటయె! వీర స్వర్గదంబైన యీ
క్రతుభూమిన్ దన దేశరక్షణకునై ప్రాణంబు లీయన్ వలెన్"

(వేదాంతాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల. 1964: 27)

దేశసేవకై, దేశరక్షణకై ప్రాణాలివ్వాలనే సందేశం ఇందులో ఉంది. 'హిమాలయం నుండి లేఖ' అన్న శీర్షికలోని ఈ పద్యంలో మనిషి జీవితం దేశరక్షణ కోసం ఇచ్చి వీర స్వర్గం పొందాలంటున్నారు.

"ఆవిడ యెద చేపితే లోకం
ఆర్నెల్ల పసిపాప
ఆవిడ ఔడుగరిస్తే లోకం
రావణాసురిని కాష్ఠం"

(నారాయణరెడ్డి, సి. 2000: 111)

ఈ లోక మనుగడకు పురుషుడు ఎంత అవసరమో, స్త్రీ అంతే అవసరం. కాని స్త్రీని పురుష సమాజం సమానంగా చూడలేదని చరిత్రని చూస్తే అర్థమవుతుంది. స్త్రీని పురాణాలు, ఇతిహాసాలు అణిచిపెట్టాలని బోధిస్తే, ప్రబంధాలు అంగాంగ వర్ణనగా మార్చివేశాయి. ఆధునిక కవిత్వంలో భాగమైన భావకవిత్వం స్త్రీని ఊహాలోకపు సౌందర్యదేవతగా మార్చింది.

అభ్యుదయ కవిత్వం నుండి స్త్రీని ఒక వ్యక్తిగా చూడడం ఆరంభమైంది. ఆ తర్వాత వచ్చిన స్త్రీవాదం స్త్రీ బాధల్ని వ్యక్తపరుస్తూనే పురుష ఆధిపత్యాన్ని ప్రశ్నించింది.

"గుండెపైన ఆశయనే
కుంపటితో పగలంతా
ప్రయాణించి చెమటోడ్చని
బాటసారి సూర్యుడు"

(నారాయణరెడ్డి, సి. 2000: 138)

ఇక్కడ సూర్యుడు మధ్యతరగతి బాటసారి అనుకుంటే మధ్యతరగతి మనిషి గుండె నిండా ఆశలతో బతుకును నడిపిస్తుంటాడు. నిరంతరం ఏదో ఒక బాధతో మండుతూ ఉంటాడు.

"చైతన్యం సౌజన్యం
సౌజన్యం చైతన్యం
రెండు కలిపితే నిల్చే
దండి శక్తి జనహృదయం"

(పైదే: 174)

ఇరాక్‌లో జరిగిన విప్లవం గురించి రాసిన ఖండిక ఇది. సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎదురించడానికి ప్రజల్లో చైతన్యాన్ని నింపడానికి ఇలాంటి అక్షరాలు అవసరమవుతాయి. ఇలా చెబుతూనే నిద్రించే హృదయాలు మేల్కొన్నారని హెచ్చరిక చేస్తారు కవి.

"ఇది ప్రజకూ కవికీ గల
ఎద బంధంరా తమ్మీ!
మధువాసితమైనా యిది
మట్టి పాటయే సుమ్మీ!"

(పైదే: 177)

ఒకప్పటి కవిత్వం గగన విహారం చేస్తే, నేటి కవిత్వం మట్టి పాట పాడుతుంది. ఒకప్పటి కవిత్వం రాజు ఆస్థానం చేరితే నేటి కవిత్వం మట్టి మనిషిని గుండెకు

హత్తుకుంటుంది. అందుకే కవిత్వం ప్రజలకూ, కవికీ మధ్య ఎదబంధమైంది, కష్టాన్ని పలవరించే మట్టి పాటైంది.

“కొబ్బరి బుఱ్ఱలో కోక నమర్చిన
సన్నని నేతల ప్రన్నదనము
ఏడు ముడతలైన నేర్పడ కుండ సా
లీడు దారాల జీరాడు వలువ
నందనోద్యానంబు క్రింద జేసెడు లతా
పత్రపుష్పోజ్జ్వలచిత్రపటము
ముగ్ధులై బహుదేశముల జనుల్ తెప్పించు
కొని ధరించిన గుడ్డ పనితనంబు
చెల్వమౌ విల్వ వల్వల కొల్వు దీర్చి
సకల జాతులకున్ నాగరికత గూర్చి
అందచందాల దీర్చె భాగ్యముల జేర్చె
నాటి చేనేత విభవంబు చాట వశమె!”
(వేంకటరాజము, అందె. 1993: 65)

అగ్గిపెట్టలో పట్టే చీరనేసిన గొప్ప నైపుణ్యంగలిగి ప్రసిద్ధి చెందిన వృత్తి చేనేత. మానవుడు దిగంబరుడిగా ఉండి రానురాను ఆకులు కట్టుకొన్నాడు. తర్వాత బట్టనేసి అందాన్ని సమకూర్చి, నాగరికత నేర్పిన చేనేతవృత్తి వైభవం పై పద్యంలో వర్ణితం. ఏడు మడతలైన మడవకుండా కొబ్బరి బుర్రలో పట్టే లతాపత్ర పుష్పాలతో ఉజ్వలమైన చిత్రపటంతో కూడుకొన్న చీరకు ముగ్ధులై ఎన్నో దేశాలవాళ్ళు కొనుక్కొని ధరించారు. అంతటి కళానైపుణ్యం కలిగినవాళ్ళు చేనేత వృత్తివాళ్ళు.

### 5.2.3.గేయం

ఏ దేశ భాషలోనైన గేయం ముందుపుట్టినా అది లిఖిత రూపంలోకాక మౌఖింగానే కొంతకాలం దాకా కొనసాగుతుంది. మన తెలుగు సాహిత్యంలో నన్నయకంటే ముందు కూడా పాల్కురికి సోమనాథుడు చెప్పినట్టు గొబ్బిపదాలు, జాళిపదాలున్నా అవి మౌఖిక రూపంలోనే ఉన్నాయి. అందుకే దాన్ని జానపదగేయం అన్నారు. “ఇదే విషయాన్ని ప్రముఖ

భాషాశాస్త్రవేత్తలు 'ఆదిమ మానవుడు వచనంలో కంటే ముందు లయాత్మకమైన కవితాభాషలో తన ఆలోచనలను వ్యక్తీకరించి ఉంటాడని, ఆటవికులు ఏది మాట్లాడిన పాట తీరులోనే ఉంటుందని, వీటిని బట్టి భాష సంగీతమయంగాను ఉంటుందని, వీటిని బట్టి భాష అంతా పాటమయంగా ఉండేదని అభిప్రాయపడ్డారు" (కమలాకరశర్మ, సాగి(సంపా). 2014: 214). పై జి. చెన్నకేశవరెడ్డిగారి మాటలవల్ల గేయ ప్రాచీనత అర్థమవుతుంది.

కరీంనగర్ జిల్లాలో డా. సి. నారాయణరెడ్డిగారితోనే గేయ పుస్తకాల ముద్రణ ప్రారంభమైంది. "తెలుగు పద్య కవిత్వం వెయ్యేండ్ల చరిత కలదైతే, ఆధునిక గేయం పుట్టి అంతా వందేండ్లు కూడా కాలేదు. ఈ జిల్లాలోని గేయకవిత మహా అయితే అరువదేండ్లది. సి.నా.రె. గారితోనే 1953నుండి ఇక్కడ గేయ పుస్తకాల ముద్రణ ఆరంభమైంది" (మలయశ్రీ. 1997: 568).

"మేమూ మానవులమనే
ఈ మాటను మరవకండి!
మానానికి మడతలుగప్పే
మా చిరిగిన చేలాల్లో
ప్రాణానికి పాఠం చెప్పే
మా చీలిన గళాల్లో
సహనానికి జీవంగుప్పే
మా వ్రీలిన హృదయాల్లో
మార్దవం మాయలేదనే
మా మాటను మరవకండి
మేమూ మానవులమనే
ఈ మాటను మరవకండి.."

(నారాయణరెడ్డి, సి. 2000: 81)

1953లో అప్పటిదాకా పత్రికల్లో వచ్చిన గేయాల్ని 'జలపాతం' అనే పుస్తకంలో ప్రచురించారు. డా. సి. నారాయణరెడ్డిగారి గేయం, కవిత, రుబాయీ మొదలైన కవితా ప్రక్రియల్లో ఎక్కువగా మానవతకు సంబంధించినవి కనిపిస్తాయి. పేదవాళ్ల బతుకులు దయనీయమైనవి. చాలీచాలని దుస్తులు, బతికున్నామని చెప్పడానికి నోటి గడపదాటి

బయటకువచ్చే మాటలు, కష్టాల్ని, బాధల్ని భరించే సహనంగల హృదయాలు వారివి. శుభ్రంగా లేకపోయినా, తిన్నా తినకపోయినా వాళ్ళు కూడా మనుషులే.

"నా తెలుగు పాట వెలుగు వీణలు మీటి పాడెద
నా తెలుగు జాతి ఉన్నతి గీతి పాడెద
వాడ వాడల చెలిమి
మేడలను కట్టి
తెలుగు తల్లికి భావ
దీపాలు పెట్టి //నా తెలుగు//"

(బాపురెడ్డి, జె. 1970: 22)

కవిత్వం రాస్తున్న కవులు తానెందుకు రాస్తున్నారో ఎక్కడో ఒక్కచోటైన కచ్చితంగా చెప్పుకుంటారు. అలాగే ఇక్కడ కవి తాను తెలుగు వెలుగు వీణ మీటి, వాడవాడల్లో స్నేహపు మేడలను కట్టి, తెలుగు తల్లికి భావ దీపాలు పెట్టి తెలుగు జాతి ఉన్నతి గీతాన్ని పాడుతానని అంటున్నారు.

"శ్రామిక వర్గీయుడా ఇదేనోయ్ లాల్ సలాం
సాహసించి సాగుముందు తప్పుకోగలం
పోయేది లేదు నీకు పోతే బానిసత్వమే
వస్తుంది చూడు ఆ పిదప సమానత్వమే
క్షణానికొక గండము ఎదురయ్యే చూడరా
గుణానికొక్క యెత్తువేశి చిత్తు చేయరా
కట్టుబట్ట కూడు గూడు కొరత ఉండదు
శ్రమించు వారిదేరా దేశ సర్వసంపదా"

(దేవేందర్, అన్నవరం(సంపా.). 1997: 43)

తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని జైలుకెళ్ళినవారు మేర మల్లేశం. ఈ ఉద్యమంలో ప్రజలను చైతన్యపర్చడానికి ఆయన ఎన్నో గేయాలు రాశారు. అవన్ని ప్రజల నాలుకలే వాహికలై సాగిపోతూనే ఉన్నాయి. మేర మల్లేశం చనిపోయాక ఆయన మీద ప్రేమతో ప్రజలవద్ద సేకరించిన మేర మల్లేశం పాటల్ని ఒక పుస్తక రూపంలో తీసుకువచ్చారు. విప్లవ రచయితల సంఘం, శ్రీకాకుళ ఉద్యమ ప్రభావం కరీంనగర్ జిల్లాపై గాఢంగా ఉంది.

వీటి ప్రభావంవల్ల కరీంనగర్ జిల్లానుంచి విప్లవ సాహిత్యం విస్తృతంగా వచ్చింది. పై పాట కూడా విప్లవాత్మకమైంది.

"బ్రతుకుకు అర్థం
చావుకు అర్థం
వెతికి వెతికి వేసారుట ఏల?
స్వర్గం నరకం పాపం పుణ్యం
చర్చలలో పడి చచ్చుట ఏల?
ఉన్నదంటే ఉన్నది....."

(బాపురెడ్డి, జె. 2002: 74)

బతుక్కు, చావుకు అర్థం వెదకడం వ్యర్థం. ఉన్న కాలాన్ని ఆనందంగా అనుభవించడమే మనం చెయ్యాల్సిన పని. స్వర్గం – నరకం, పాపం – పుణ్యం ఉన్నాయి లేవు అనే చర్చల్లోనే జీవితం గడిపోతుంది. ఉన్నాయంటే ఉన్నాయి, లేవంటే లేవు అంతే. చనిపోయిన తర్వాత వచ్చే వాటి గురించి ఆలోచిస్తూ ఉన్న జీవితాన్ని నాశనం చేసుకోవడం వ్యర్థం.

"రూపాయికోసం లోపాలనీ
లోనదలపకే ఓ మనసా
లోపాములాచె లోకాలన్నీ
కాలకూటమే ఓ మనసా"

(రామయ్య, నడిమెట్ల. 1970: 8)

ప్రపంచంలో అత్యంత శక్తివంతమైంది ఏదైనా ఉందంటే అది ఒక్క డబ్బే. అది ఎంతటి పనైనా చేపిస్తుంది. మంచివాణ్ణి చెడ్డోణ్ణి చేస్తుంది, గొప్పోన్ని దిగజార్చుతుంది. అంతటి శక్తుంది గనుకే సమాజం డబ్బు వెనుక పరిగెడుతుంది.

"పాపన్న కొమురయ్య కొమురం భీం వీరులు
ఐలమ్మ స్వరాజ్యం కమలమ్మ నారులు
సోమన పోతన కాళోజి దాశరథులు
బతుకమ్మ బోనాలు పీరీల పండుగలు"

(దేవేందర్, అన్నవరం(సంపా). 2010: 22)

ఒక జాతి మరోజాతిపై దాడి చేసినపుడు వాళ్ళ అస్తిత్వాలకు ఆటంకం ఏర్పడుతుందన్న భయంలోంచి ఆ జనాలు ఉద్యమం చేస్తారు. వాళ్ల వారసత్వ సంపదలుగా వస్తున్న పోరాటయోధులను, వీరులను, సాహిత్యకారులను, సంస్కృతిని చెప్పడం అస్తిత్వ పోరాటంలో భాగంగానే ఉంటుంది. ఇక్కడ కూడా పాపన్న, కొమురం భీంలు, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం మొదలైన వీరులను, వీర వనితలను, పాల్కురికి సోమన, పోతన, కాళోజి, దాశరథి మొదలైన సాహిత్యకారులను, బతుకమ్మ, బోనాలు, పీరీల పండుగలను చెప్పడం జరిగింది.

### 5.2.4. పాట

ఆదిమ మానవుడు పగలంతా శ్రమించి రాత్రి కాగానే తన చుట్టూ ఉన్నవాళ్ళతో ఆనందంగా గడపడానికి గెంతుతూ, కూని రాగాలు తీస్తుండేవాడు. అదే నేడు పాటగా మారింది. జానపద సాహిత్యంలో పాటకి ప్రముఖ స్థానముంది. "గేయం, పదం, పాట అన్న పదాలు సామాన్య వ్యవహారంలో సమానార్థకాలుగానే చెలామణి అవుతున్నవి. కొందరు విమర్శకులు ఒక్కొక్క దానికి పరిమిత పరిధిలో పారిభాషికార్థంలో వాడుతన్నారు. 'గేయం' అంటే మాత్రాఛందస్సులో రాసిన కవిత్వమని, 'పాట' అంటే రాగ తాళాలతో పాడే సంగీత రచన అని సాహిత్య లోకంలో రూఢమైంది" (చెన్నకేశవరెడ్డి, జి. 1988: 3).

" 'గీయత ఇతి గీతం' పాడేది గీతం అని చెబుతుంది. పాటలో ఒక లయ, తాళం, సమానమైన మాత్రల సంఖ్య ఉంటుంది. "లయ అనేది పాట ప్రథమ లక్షణం. ఇది సహజంగా సిద్ధించింది. మనుషులేగాకుండా మేకలు "మే–మే" అన్నా, ఆవులు "అంబా–అంబా" అని అరచినా అవి లయబద్ధంగానే వినబడతాయి. ఆ లయ నుంచి వర్ధిల్లిందే తాళం. లయ, తాళం అనేవి పాట ప్రధాన లక్షణాలు" (కృష్ణ, వడ్డేపల్లి. 2012: 1). ఏ సామాజిక ఉద్యమంలోనైనా ముందుండేది పాటే. జాతీయోద్యమం, తెలంగాణ సాయుధపోరాటం, శ్రీకాకుళ ఉద్యమం, ప్రత్యేక తెలంగాణోద్యమం ఇలా ఏ ఉద్యమంలోనైనా పాట ముందుండి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసి నడిపించింది, నడిపిస్తుంది. అసలు పాటలేని ఉద్యమాన్ని ఊహించుకోవడం కష్టం. తెలుగు సాహిత్యంలో కూడా ఎంకి పాటలు, కొనకళ్ళ వెంకటరత్నం బంగారి మామ పాటలు మొదలైనవి ప్రసిద్ధి చెందాయి.

"ఓ దొరో విను జెరా, వినవయ్యా మా దొరా!
నిను గోత్తె నను గోత్తే నెత్తురే వత్తాది
నువు పరుపుల పండేదెందుకురో
నేను చాపల పండేదెందుకురో
నువు మేడల్లుండేదెందుకురో
నేను గుడిసెల మిడికేదెందుకురో"

(మలయశ్రీ. 1978: 1)

పాట సమాజంలోని సంఘటనల సమాహారంగా గుర్తించినప్పుడు ఆ పాటలో ఆనాటి సమాజాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు తెలంగాణ అంతట దొరల పెత్తనాలు, దౌర్జన్యాలు, దోపిడీలు, అన్యాయాలు కొనసాగుతూ ఉండేవి. అందుకే తెలంగాణ సాయుధ పోరాటం వచ్చింది. ఈ కాలంలో ఎన్నో అభ్యుదయ పాటలు వచ్చాయి. అవన్నీ ఆనాటి సమాజాన్ని మనకళ్ళముందుంచుతాయి. ఇక్కడ కూడా రచయిత దొరకు, సామాన్య మానవుడికి మధ్యగల భేదాన్ని చెబుతూనే దొరతనాన్ని ధిక్కరిస్తున్నారు.

"శ్రమజీవుల హక్కులకై అసువులుబాసిన అమరులారా
అందుకోండి అరణారుణ వందనాలు
మీ త్యాగఫలం మీ కర్మఫలం వృథా కానియ్యం
ఎర్రజెండా...ఆ...ఆ... సాక్షిగా
ఎర్రజెండ ఎర్రజెండ ఎన్నియ్యలో
ఎర్ర ఎర్రనిది ఈ జెండ ఎన్నియ్యలో
పేదలపాలిటి ఎన్నియ్యలో
మరి పెన్నిధి ఈ జెండ ఎన్నియ్యలో
ఎరజెండ ఎరజెండ ఎరజెండ ఎరజెండ ఎరజెండ ఎన్నియ్యలో
ఎర్ర ఎర్రనిది ఈ జెండ ఎన్నియ్యలో"

(వీరయ్య, అల్లం. 1981: 2)

విప్లవ సాహిత్యంలో ఈ పాటకి ప్రత్యేక స్థానముంది. సినిమా పాటలంటే ఇష్టమున్నవాళ్ళలో ఈ పాట తెలియని వారుండరనుకుంటాను. అంతగా ప్రసిద్ధి చెందింది ఈ

పాట. జానపద బాణి తీసుకొని విప్లవాన్ని ఎర్రపతాకల ఎగరేశారు రచయిత. విప్లవాన్ని జన హృదయాల్లోకి తీసుకెళ్ళిన పాటల్లో ఇదొకటి.

"ఎర్రదండు కదిలిందిరా జంబాయిరే
కూలిగుండె రగిలిందిరా జంబాయిరే
జగిత్యాల కదిలింది జంబాయిరే
ఊరూరు మండింది జంబాయిరే
తాతల నాటినుంచి – తన్నులూ గుద్దులే
తలెముంత గంజికి తంగెళ్లు బీకిండ్లు
దొరల గడీలల్ల రెక్కల్ల కష్టము
దొరల సెప్పుకింద పేదోళ్ళ బతుకులూ
ఊరు కదిలిందిరా జంబాయిరే
మద్దునూరు కదిలిందిరా జంబాయిరే"

(నారాయణ, అల్లం. 1990: 75)

ఆనాటి అన్యాయాన్ని, దౌర్జన్యాన్ని ఎదురించడానికి ఎర్రజెండాలు పట్టుకొని పల్లెలు పోరుబాటలో ఎలా నడిచాయో అన్నదానికి అక్షరరూపం ఈ పాట. "రైతుల జీవన పరిస్థితి మెరుగుపడాలని, దున్నేవాడికే భూమి చెందాలని, వ్యవసాయ విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాలపై కరీంనగర్ – ఆదిలాబాద్ జిల్లాల్లో మొట్టమొదటిసారిగా పీడిత రైతాంగం కదిలివచ్చింది. ఇందులో భాగంగానే 27 – 8 – 1977న జగిత్యాల తాలుకా గొల్లపల్లి గ్రామంలో 3000 పైగా రైతులు 10, 15 గ్రామాల నుండి సమీకరించబడి రైతుకూలీ సంఘాల నాయకత్వాన గొప్ప బహిరంగ సభ జరిగింది" (....... 2012: 21). జగిత్యాల నుంచి జంగల్ మహల్ దాకా సాగిన గొప్ప ఉద్యమంలో ఎన్నో గ్రామాలు కదిలివచ్చాయి.

"జ్ఞానం బ్రాహ్మల సొత్తు కాదని
ఎదురు నిలిచిన శంభూక
క్షత్రియ రాముని చేతిలో తెగిన
నీ శిరస్సె రాజ్యామేలాలి....................... //దళి//
ద్రోహి ద్రోణునికి గురుదక్షిణగా
బొటన వ్రేలిచ్చిన ఏకలవ్యుడా

బ్రహ్మణిజాన్ని పాతిపెట్టి

ఈ భరత గడ్డ నువ్వేలాలి..................... //దళి//

(రాములు, బి. ఎస్.(కూర్పు). 1997: 28)

1970 ఆరంభమైన దళిత సాహిత్యం 1990ల వరకు నిర్దిష్ట రూపాన్ని పొందింది. 1968 కంచికచర్ల కోటేశు సజీవ దహనం, 1985లో కారంచేడు దళితులపై మారణకాండ, 1990లో చుండూరు దళితుల ఊచకోత దళిత సాహిత్యానికి భూమికగా నిలిచాయి. అప్పటినుండి సాహితీకారులు దళిత దృక్పథంతో రచనలు చేయడం మొదలుపెట్టారు. తెలుగు సాహిత్యంలో ముఖ్యమైన వాదాల్లో ఒకటిగా చెప్పబడుతున్న దళితవాదం కరీంనగర్ జిల్లాలో అంతగా లేదు. పై పాట కె. రామలక్ష్మణ్ రాసింది. బ్రాహ్మణవాదాన్ని వ్యతిరేకిస్తూ కింది కులాలకు చెందిన పురాణ పాత్రల్ని తీసుకొని వాళ్ళే ఇప్పుడు రాజ్యమేలాలి అన్న సందేశాన్నిచ్చారు.

"సదువుకోకొడుకాని సాగానంపిన తండ్రి

సదువుల్లో సారాన్ని ఇప్పిజెప్పిన సారు

సావు వార్తావింటూ గుండే పగిలిన తల్లి

వీరులారా వందనం విద్యార్థి అమరులారా వందనం పాదాలకు"

(దేవేందర్, అన్నవరం(సంపా). 2010: 1)

దరువు ఎల్లన్న గారు రాసిన ఈ పాట తెలంగాణ ఉద్యమంలో బహుళ ప్రచారం పొందింది. భూమికోసం, భుక్తికోసం, విముక్తికోసం ప్రాణత్యాగం చేసిన అమరులను గుండెలకు హత్తుకున్న పాట ఇది. ఏ ఉద్యమంలోనైన పాటది ప్రథమస్థానం. ఆ తర్వాతే కవిత్వం, కథ, నవల మొదలైనవి. గుండెను రగిలించి ఉద్యమంలో నడిపించగల శక్తి పాటకుంది. అన్ని ఉద్యమాల్లోలాగానే తెలంగాణ ఉద్యమంలో కూడా పాట కీలకమైన పాత్ర పోషించింది. ప్రజలను ఉత్తేజపర్చింది. అందరిని ఒక్కతాటిపై తెచ్చి గమ్యాన్ని చేరుకునేల చేసింది.

### 5.2.5. గేయ నాటికలు

గేయ రూపంలో సాగే నాటకాలు. మామూలు నాటకాల్లోలాగా సంభాషణలు ఉండకుండా కేవలం గేయాల్లోనే నడిచే నాటకాలు. "నాట్య శాస్త్రంనందు భరతుడు

నిర్వచించిన నాటకాది దశవిధరూపకములకు భిన్నములై సంగీత సాహిత్యానియములకు త్రివేణీసంగమములై విలసిల్లిన నాటికాపట్టిక శ్రీ గదితపారిజాతాది నృత్య సంగీత ప్రధానములైన రూపక విశేషములను లాక్షణికులు నృత్త ప్రకారములనియును, రాగ కావ్యములనియును, గేయరూపకములనియును పేర్కొనిరి. ఇట్టి రూపక విశేషములను విశ్వనాథుడు సాహిత్య దర్పణమున తొలిసారిగా ఉపరూపకములని నామకరణము చేసినాడు. ఇట్లు ఈజాతికి చెందిన కావ్యములు ఉపరూపకములుగా వ్యాప్తి చెందుటచేత ఇవి సామాన్య రూపకములేమో అను భ్రాంతికి పలువురు లోనైనట్లు కానిపించును. కాని ఇవి నృత్య గీత ప్రధానములుగా సంస్కృతములో వెలసిన విశిష్టరూపకములు. తెలుగులో దాదాపు ఆ ఉపరూపకములవంటివే శతాధికసంఖ్యలో కడచిన నాలుగైదు దశాబ్దములనుండి గేయనాటికలనుపేర రచింపబడుచున్నవి" (శ్రీనివాసాచార్య, తిరుమల. 1988: 341). ఈ గేయ నాటికలను ఆరు రకాలుగా విభజించవచ్చు. 1. గేయపద్య వచనాత్మకం, 2. గేయ పద్యాత్మకం, 3. గేయ వచనాత్మకం, 4. గేయ వచన కవితాత్మకం, 5. గేయ పద్య వచన కవితాత్మకం, 6. గేయాత్మకం. వీటిలో వస్తువైవిధ్యం, రసం, భాష, పాత్రల పరిమితి, ప్రదర్శన కాలం, రాగతాళ నిర్దేశం, మొదలైన లక్షణాలుంటాయి. సంప్రదాయ రూపకాల్లో కనిపించే కార్యైక్యం, కాలైక్యం, స్థలైక్యం, పంచసంధులు తరచుగా కనిపిస్తుంటాయి.

డా. సి. నారాయణరెడ్డి గారు నవ్వని పువ్వు, వలపురేడు, దగ్ధశాంతి, వెన్నెలవాడ, రామప్ప, అంజంతా సుందరి, భిన్నస్వరాలు, దివ్వెల సంగీతం, మనిషి యంత్రం మొదలైన గేయనాటికలు రాశారు.

"ఎవరో?
ఎవరెవరో?
ఎల తలపులలో
కలవరమిదు వారెవరో?
తెమ్మెర బాటల ప్రాణములు పోసీ
కమ్మని పాటల గానము చేసీ
తొలి వలపులలో
గిలిగింత లిడేరెవరో?"

(నారాయణరెడ్డి, సి. 2000: 18)

‘పువ్వు, తీగ, తుమ్మెద, పవనుడు’ పాత్రలతో సాగే నాటకం ‘నవ్వని పువ్వు’. ఈ పాదాలలో భావ కవిత్వ ఛాయలు కనిపిస్తున్నాయి. ఇలా పువ్వు అనగానే

“ఝుం ఝుం ఝుం ఝుం
నేనే
తుమ్మదనే
నిను వలపించే యెదనే
ఝుం ఝుం ఝుం ఝుం
నీ కనుసన్నల నీడలలోనా
నీ నునువన్నెల జాడలలోనా
నిలిచి తపించే తుమ్మదనే
నీకయి నా బ్రతుకమ్మెదనే”

(నారాయణరెడ్డి, సి. 2000: 19)

అని తుమ్మెద సమాధానం చెబుతుంది.

“నవ్వకే నాయమ్మ!
నవ్వబోకే తల్లి!
మల్లికను విడనాడి
మధురగీతుల పాడి
మధురరసమ్మును గ్రోల
మరిగినాడే బాల
మీబోటి మొగ్గలను
మెల్లగా నవ్వించు
తీయతేనెలు ద్రాగి
హాయిగా విహరించు
కాంక్షదీరినయంత / కానరాదు నీ చెంత
నవ్వకే నాయమ్మ! / నవ్వబోకే తల్లి!”

(పైదే: 19)

ప్రాచీన లాక్షణికులు ఉపదేశం, ఆనందాలను కావ్యప్రయోజనాలుగా చెప్పారు. ఇక్కడ పవ్వును యుక్తవయసుల ఉన్న అమ్మాయిగా, తుమ్మెదను పురుషుడిగా, తీగను అమ్మాయి తల్లిగా తీసుకుంటే 'అబ్బాయిలను గుడ్డిగా నమ్మి మోసపోకే తల్లి' అనే సందేశం అంతర్లీనంగా ఉంది.

అలాగే 'మనిషి మరయంత్రం' అన్న గేయ నాటికలో తాను సృష్టించిన యంత్రమే తన మాటవినకుండా చివరికి సమాజ పతనానికి దారితీసే పరిస్థితులను అద్భుతంగా చెప్పారు డా. సి. నారాయణరెడ్డి గారు.

"యంత్రం నను లాలించే ఆత్మసఖి
యంత్రం నన్నూగించే అపశిఖి
యంత్రం నా బానసీడు
యంత్రం నా బానిసీడు"

(నారాయణరెడ్డి, సి. 2000: 220)

మనిషి ఎన్నో రోజుల శ్రమకోర్చి ఒక యంత్రాన్ని కనిపెట్టాడు. ఆ యంత్రాన్నే ఇష్టసఖిగా, అపరశిఖిగా చూసుకున్నాడు. ఆ యంత్రమే వంటమనిషిగా అన్నింటికి వాడుకొని బానిసగా మార్చుకున్నాడు.

"ఓ మనిషీ! నువ్వూ పువ్వూ కలిసి
మృత్యుకూపంలోకి తొంగిచూస్తున్నారు
యంత్రాన్ని ఎదిరించడం ఏటికి ఎదురీదడం
యముని దున్నపోతు తోక
అందుకొనగ వ్రేలడం"

(పైదే: 229)

యంత్రం మరింత అభివృద్ధి చెంది మనిషినే బానిసగా మార్చుతుంది. యంత్రం శక్తివంతంగా తయారై మనిషి తెలివితేటలను మించి మనిషినే నాశనం చేసే స్థితి వస్తుంది. ఈ పరిస్థితి వచ్చే సూచనలు ఉన్నాయని ఈ మధ్య వార్తల్లో కూడా చదివాం. 'కవయః క్రాంత దర్శినః' కవి రాబోయే కాలాన్ని ముందుగానే జ్ఞాన నేత్రంతో చూస్తాడు కనుకనే ఇలా చెప్పగలుగుతారు. పాముకు పాలుపోసి పెంచితే అది మనల్నే కాటు వేస్తుందన్న రీతిలోనే ఈ యంత్ర నాగరికత కూడా మనిషి పతనానికి కారణమవుతుందని కవి చెప్పారు.

“అయ్య నేను బడికి పోతనే
బడికి పోని బతుకు రోతనే
బడికిపోయి బాగుపడతనే
ఓ అయ్యా!
బతుకు దారి యెతుక్కుంటనే”

(మలయశ్రీ. 1997: 623)

పై ఖండిక బైరి నర్సయ్య రచించిన ‘అందెల రవళి’ గేయనాటికల సంపుటిలోనిది. చదువు ప్రాధాన్యతను తెలిపే గేయనాటిక ఇది. 1990 ప్రాంతాల్లో గ్రామీణ ప్రజలు చదువుకోవడం చాలా తక్కువ. అలాంటి గ్రామీణ ప్రజల్లో చదువుమీద ఆసక్తి పెంచి వాళ్ళని చదువుకునేటట్లు చేయగలిగేల ఈ గేయం మనకు కనిపిస్తుంది. స్థానిక భాషలో రాయడంవల్ల ఆ రచన మరింత ప్రజల్లోకి వెళ్తుంది.

ఇంకా ఈ జిల్లా నుంచి వద్దేపల్లి కృష్ణ జి. రాములు, సామ లక్ష్మారెడ్డి, ఎస్. వెంకటాద్రి, ఇమ్మడోజు భద్రయ్య, కందుల మల్లికార్జున్ మొదలైనవాళ్ళు గేయనాటికలు రాశారు.

### 5.2.6.గజల్స్

ఫారశీ భాష ప్రభావంతో తెలుగులోకి వచ్చిన కవితా రూపం గజల్. ఇది ఏడవ శతాబ్దంలో ఫారశీక దేశంలో ఉద్భవించి అరబ్బీ, తురుష్క, ఉర్దూ భాషల్లోకి వెళ్ళింది. తెలుగు సాహిత్యంలోకి 20వ శతాబ్దంలో ప్రవేశించింది. తెలుగులో మొట్టమొదటి గజల్ రాసింది దాశరథిగారు. ఆ తర్వాత అనేకమంది గజల్ రచన చేశారు. గజల్‌కి అత్యంత ప్రాముఖ్యతని కల్పించి మాత్రం డా. సి. నారాయణరెడ్డిగారే. గజల్ అంటే ‘ప్రియురాలితో సల్లాపం’ అని అర్థం. పల్లవిని ‘మత్లా’ అని, చివరి చరణాన్ని ‘మక్తా’ అని అంటారు. ప్రతి చరణం చివర అంత్యప్రాస గజల్‌కు జీవం. కొన్నిటిలో అంత్యప్రాసకు ముందు అంతఃప్రాస ఉంటుంది. వీటిని ‘రదీఫ్, ఖాఫియాలు’ అని అంటారు. చివరి చరణంలో కవి నామముద్ర ఉంటుంది. దాన్ని ‘తఖల్లుస్’ అంటారు. తెలుగు గజల్స్‌లో వస్తువు ఏదైనా ఉండవచ్చు. ఏ పాదానికి ఆ పాదం ముక్తక పద్యంలాగా స్వంతంత్ర భావం కలిగి ఉంటుంది. గజల్ అంతా ప్రాసనియమాలతో సాగే రూపం. ప్రతి పాదం ఒక ‘మిస్రా’. రెండు మిస్రాలు కలిపితే ఒక

‘షేర్’. ఇలా గజల్‌లో 5 షేర్‌ల నుండి 77 షేర్‌ల వరకు ఉండవచ్చు. ప్రతి గజల్ షేర్‌లు బేసి సంఖ్యలోనే ఉంటాయి.

“గజల్ అంటే అనేకార్థాలున్న స్థూలంగా ప్రియురాలితో సల్లాపం. ప్రాయికంగా ఇది శృంగారపదం. కొన్నిటిలో తాత్త్విక స్పర్శలు లేకపోలేదు. కాని నా గజల్లలో ప్రణయానికి బదులుగా మానవీయ దృక్పథాన్ని, ప్రగతిశీలాన్ని, మెత్తని అధిక్షేపాన్ని ప్రవేశపెట్టాను” (నారాయణరెడ్డి, సి. 2000: 3) అని చెప్పుకున్న నారాయణరెడ్డిగారు ఉర్దూ గజల్ లక్షణమైన ప్రణయానికి బదులు మనిషితనాన్ని ఆవిష్కరించారు.

“అమ్మ ఒకవైపు దేవతలంతా ఒకవైపు
సరితూచమంటే నేను ఒరిగేను అమ్మవైపు

ఈ బండి చూడరా నాన్న ఈ గుర్రమింక నీదన్నా
తెగమంకు తోచిన నాడు దిగలేదు అమ్మ మూపు

రొదలలో మౌన పాఠంల ఎదలలో జ్ఞానపీఠంలా
నా బాల్యమంతా తానే నడిపింది అమ్మ చూపు

చీకటికి చంద్రబింబంల ఆకలికి పూర్ణకుంభంలా
నిలువెల్ల మమతల నిలిచింది అమ్మ రూపు

మెరిసి సాగే ప్రభాతంల విరిసి ఊగే వసంతంలా
పెరిగె “సినారె” నీకు దొరికింది అమ్మ ప్రాపు”

(నారాయణరెడ్డి, సి. 2000: 50)

తెలుగు సాహిత్యంలో అమ్మ గురించి చాలానే కవిత్వం వచ్చింది. అయినా నిత్యనూతన వస్తువు అమ్మ, అమ్మ ప్రేమ. దేవతలకన్న అమ్మే మనకు మిన్న అని డా. సి. నారాయణరెడ్డి గారు అమ్మ గొప్పతనాన్ని వివరించారు. ఆడుకుంటే ఆటవస్తువై, రేపటి మన భవిష్యత్తుకు కాంతిరేఖై, ఆకలైతే చందమామ ముద్దై ఇలా అడుగడుగున బాల్యమంత నడిపిన అమ్మ ప్రేమ అనిర్వచనీయమైంది.

“మనిషితనం పెంచుమనుచు నా మనసును కోరుకుంటి
మంచితనం మనుట కొరకు భావాలను కూర్చుకొంటి

మహనీయుల అనుభవాలు అనవరతము చదివి చదివి
మమకారపు పూల కొరకు కోర్కె తీగ పెంచుకొంటి

తరిగిపోని ఆత్మశక్తి తరువులాగ పెరగాలని
తపనపడుచు తాపసిలా నా నడవడి మార్చుకొంటి
(కిషన్‌రావు, రేగులపాటి. 2010: 66)

డా. సి. నారాయణరెడ్డిగారి ప్రభావం కరీంనగర్ జిల్లాపై ఉంది. ఆయన మానవతావాదిగా తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధులు. ఆయన ప్రభావంవల్ల చాలామంది కవులు కవితలు రాసారు. రోజురోజుకు మనిషితనం, మంచితనం, మానవత్వం కనుమరుగవుతున్న కాలంలో ఇలాంటి కవితలు రావడం సముచితం.

“మాటకు దండం పెదుత పాటకు దండం పెదుతా
మాటను మట్టిని నమ్మిన మనిషికి దండం పెదుతా

ఎంత రాజ మొక్కైన సిమెంటులోన మొలవదురా
సృష్టికి ప్రాణంపోసే మట్టికి హారతి పడతా

చేతనైన కాస్త మంచి చేసి చూపడం ధర్మం
గంజిలో విషమొలికె నాగన్నల భరతం పడతా

నీతి చచ్చిపోతే రాజనీతి ఉండి ఏం లాభం?
పులివేషం వేసిన నక్కల తోలు బయట పెడతా

అనుకుంటే జాగృతి; పడుకునివుంటే నిస్రాస్థితి
పోటునడకతో సోమరి పొద్దుకు చురకలుపెడతా

పదును గుండె మంటమీద ముదిమియాగ వాలుదులే
మరో పదేళ్ళయినా ఈ వరుసలోనే పరుగిడతా

అరువు తెచ్చుకున్న గొంతు అసలే సరిపడదు నాకు
కడ వూపిరిదాక స్వీయ కంఠంతో గీపెడతా

అచ్చమైన ప్రతిభముందు అందరు ఒకటే 'సినారె'
కదిలితె అట్టడుగు మనిషికి కాళ్ళకు గజ్జెలుకడతా"
(నారాయణరెడ్డి, సి. 2000: 136 – 137)

మాటకు దండం పెడత, పాటకు దండం పెడత అని మనిషికి, మట్టికి దండం పెడుతున్నారు కవి. మట్టికి, మనిషికి విడదీయరాని బంధం ఉంది. విషం చిమ్మే నాగుల భరతం పడతాననీ, మేకవన్నె పులుల గుట్టు రట్టు చేస్తాననీ, మానవత్వ దారులోనే బతికున్నంతకాలం పయనిస్తాననీ, ఈ సమాజ సౌధానికి మూలవాసుల కాళ్ళకు గజ్జెలు కడతానంటు తన మనోగతాన్ని అభివ్యక్తీకరిస్తున్నారు కవి.

"చిరునవ్వులాంటి మనసుంటే నా శిరసు వంచుతాను
మోసం దాచిన ముఖముంటే ఆ ముసుగు చించుతాను

సభ్యత జార్చే ఒంటికుదుపుల ప్రసారాలరికట్టి
వీధిలోన దరువేసే డప్పుకు విలువ పెంచుతాను

ఏమిచ్చినా కళాస్రష్టల ఋణమెలా తీరుతుంది?
హృదయాన్ని తీసి ఆ మహనీయుల ఎదుట ఉంచుతాను

ఎవరేమన్నా ఫలప్రదంగా ఎదిగేవాణ్నికదా
నాలుక చచ్చినవాళ్లకు కమ్మదనాలు పంచుతాను

సమతాదృష్టికి మసిపూసే దుస్తంత్రాలెదిరించీ
బిగిసిన వర్ణ ద్వేషం కూకటివేళ్లు తెంచుతాను

కొందరి అరిచేతుల్లోనే తెలివి కులుకుతు వుండాలా?
మిన్నుదిగని విజ్ఞానఝరిని ఇలమీద దించుతాను

మనిషికే కదా విషమ పరీక్షలు మానుకా 'సినారే'
ఎన్నివలలు పైబడుతున్నా విదిలించి మించుతాను"

(నారాయణరెడ్డి, సి. 2000: 104 – 105)

చిరునవ్వుకు శిరస్సువంచడం, మోసం ముసుగును చించడం, కళాకారులను గౌరవించడం మానవత్వానికి నిదర్శనం. మనిషికి, మనసుకు, మానవత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కవిత్వం రాస్తున్న కవి గనుక డా. సి. నారాయణరెడ్డిగారు సాహిత్యలోకం మానవతావాద కవిగా తన గుండెల్లో నిలుపుకుంది.

"వెలుగులు వెదజల్లే రవిచంద్రుల వలె ఉదయిస్తా
ఫల సుమములు పంచగలుగు భూజములా జన్మిస్తా
జలరాశిలొ జననమొంది మేఘమునై నింగికెగసి
సమవర్షం సంతోషము సకాలములొ కురిపిస్తా
దివ్వెలాగ అవతరించి తమస్సులను తరిమివేసి
నరజాతికి సుందరమగు వెలుగులనే నందిస్తా"

(కిషన్‌రావు, రేగులపాటి. 2010: 78)

తనవంతు సహాయంగా ఈ సమాజానికి ఏం చేస్తానో చెబుతున్నారు కవి. అన్యాయపు చీకటున్నచోట న్యాయపు రవిలా ఉదయిస్తాననీ, అందరికి ఫలాలునిచ్చే చెట్టులా జన్మిస్తాననీ, మేఘంగా మారి వర్షంతోపాటే సంతోషాన్ని అందిస్తాననీ, దీపంలా మారి వెలుగును పంచుతాననీ చెబుతున్నారు కవి. స్వార్థం రోజురోజుకు పెరిగిపోతున్న సమయంలో

నిస్వార్థంగా సమాజానికి సహాయం చేసేవాళ్ళ చాలా అరుదు. వాళ్ళలో కవులు ముందుంటారు. అక్షరాల అడుగులతో ఎక్కడ చెడు జరిగితే అక్కడకు చేరి కవితా ఖడ్గమై అవతరిస్తారు.

### 5.2.7. రుబాయీలు

అన్య భాషల సాహిత్య ప్రభావంవల్ల తెలుగు సాహిత్యంలోకి అనేక కొత్త రూపాలు వచ్చి చేరాయి. ఆంగ్ల సాహిత్య ప్రభావంవల్ల వచన కవిత, ఫారసీ సాహిత్య ప్రభావంవల్ల గజల్, జపాన్ సాహిత్య ప్రభావంవల్ల హైకూ. అలాగే పారసీ సాహిత్య ప్రభావంవల్ల తెలుగులోకి వచ్చిన కవితా రూపం రుబాయీ. "రుబాయి ముందు పార్శీలో వచ్చింది. తరువాత అరబ్బీలో వచ్చింది. కాని, అర్థం మాత్రం అరబ్బీ భాషకు సంబంధించిందే. రుబాయీకి నాలుగు పాదాలుంటై. రుబాయీ గానయోగ్యం. అందుకే నాల్గింటిలో సమానమైన మాత్రాగణాలుంటై. అవి కొన్ని ముఖ్యగణాలే అన్న నియమం ఏమీ లేదు. 1, 2, 4 పాదాల్లో అంత్యప్రాస ఉంటుంది. 3వ పాదంలో ఉండదు. అంత్యప్రాస అనేక విధాలుగా ఉండవచ్చు. రదీఫ్, ఖాఫీయాలు రెండూ ఉండవచ్చు. లేకపోవచ్చు. రదీఫ్ చివరి పదం. దాని ముందు పదం ఖాఫియా. ఖాఫియాకి నాలుగు పాదాల్లో ఒకే అచ్చుతో అంతమయ్యే లక్షణం ఉంటుంది. ఈ రెండే కాకపోయినా, అంత్యప్రాస ఉంటుంది. అది ఎన్నో విధాలుగా కవులు మార్చుకుంటారు. రదీప్, ఖాఫీయాలు ఉంటే అది గజల్‌లోని రెండు షేర్లు లేదా మొదటి నాలుగు పాదాలు ఔతుంది. గజల్‌లో తఖల్లుస్ ఐచ్ఛికం. రుబాయీలోనూ అంతే" (రామమోహనరావు, అద్దేపల్లి. 2014: 7 – 8). గజల్, రుబాయీ, ప్రపంచపదులు అని దాదాపు ఒకే లక్షణాలతో ఉంటాయి.

"రుబాయీ రచన ఎంత సులభమో, మంచి రుబాయీ నిర్మాణం అంత కష్టం. రుబాయీలో ప్రధానంగా ఒకేఒక్క భావం ఉంటుంది. ఈ భావ ప్రసూనం నాలుగు రేకులుగా విచ్చుకుంటుంది. మొదటి పాదంలో భావం మొగ్గ తొడుగుతుంది. రెండవ పాదంలో కొంచెం విచ్చుకుంటుంది. మూడవ పాదంలో వినూత్న ప్రాసతో ఉబికి వస్తుంది. హృదయాన్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతుంది. సంగీతంలో ఆరోహణ స్వరంలా తరగెత్తుతుంది. ఇక నాలుగవ పాదం రుబాయీలోని అతి ప్రధాన భాగం. ఇందులో మూడు పాదాల సారం ఇమిడి ఉంటుంది. మొదటి పాదంలో అంకురించిన భావం సమగ్రంగా గుబాళిస్తుంది. ఈ

ముగింపులోనే కవి ప్రతిభ, చమత్కృతి, ప్రౌఢిమ ప్రస్ఫుటమవుతాయి. రుబాయీలో ప్రతిపాదం వాక్య నిర్మాణ దృష్టితో స్వతంత్రంగా ఉండటం వాంఛనీయం. కృత్రిమ పదప్రయోగం, దురాన్వయం కూడదు. శ్లేషను విశ్లేషించుకొనే అగత్యం నుంచి సహృదయులను తప్పించడం అత్యావశ్యకం. ఒక బిందువులో సింధువును ఇమిడ్చినంత పని అవుతుంది. ఒక రుబాయీని రచించడమంటే. కవికున్న ప్రౌఢిమకు అంటే కుదింపునకు రుబాయీ రచన ఒక నికషోపలం" (కమలాకరశర్మ, సాగి(సంపా.). 2014: 221) అన్న డా. తిరుమల శ్రీనావాసాచార్య గారి మాటలు రుబాయీ లక్షణాన్ని తెలియజేస్తున్నాయి. తెలుగు సాహిత్యంలో గజల్‌ని, రుబాయీని మొదట రాసింది దాశరథి గారు. కరీంనగర్ నుంచి డా. సి. నారాయణరెడ్డిగారు, తిరుమల శ్రీనివాసాచార్య, రేగులపాటి కిషన్‌రావు మొదలైన వారు రుబాయీలు రాశారు.

"మట్టి పలికితే పచ్చని మొక్క పలుకుతుంది
మబ్బు పలికితే తొలకరిచుక్క పలుకుతుంది
మౌనంగా మథనపడీ రేయంతా నిదురచెడీ
మనసు పలికితే కవితా వాక్కు పలుకుతుంది"

(నారాయణరెడ్డి, సి. 2000: 93)

ప్రత్యేకంగా రుబాయీల పుస్తకం వెయ్యకున్నా డా. సి. నారాయణరెడ్డిగారి 'రెక్కలు', 'నడక నా తల్లి', 'కవితా నా చిరునామా' అనే కవితా సంపుటాలలో రుబాయీలు ఉన్నాయి. తెలుగులో గజల్‌కి విశేషమైన ప్రాచుర్యం కలిపించిన ఈయన తక్కువగానే రుబాయీలు రాశారు. మట్టి పచ్చని మొక్కకి ప్రాణం పోస్తుంది. మబ్బు తొలకరి చినుకుకు ఆధారమవుతుంది. అలాగే మథనపడడం, నిద్రలేక రాత్రం ఆలోచిస్తే మనసు కవిత్వానికి జీవం పోస్తుంది.

"ఎంత ఆవిరి ఎగిసిపోతే ఒక్క మేఘం
ఎంత ఊపిరి ఒదిగిపోతే ఒక్క యోగం
ఎంత నాదం నాభిమూలం చీల్చుకుంటూ
గొంతు వాకిలి దాటిపోతే ఒక్క రాగం"

(నారాయణరెడ్డి, సి. 2000: 149 )

గొప్ప సూక్తిలాంటి రుబాయీ ఇది. ఒక్క మేఘం తయారవ్వడానికి ఎంతో నీరు ఆవిరి కావాలి. ఒక్క జీవితం గడవడానికి ఎంతో ఊపిరి మనిషి గుండెలో ఒదిగిపోవాలి. ఒక్క రాగం పలకాలంటే ఎంతో నాదం నాభిమూలం నుంచి రావాలి. రుబాయీ నాలుగవ పాదంలో కవి ప్రతిభ కనిపించాలి. ఇక్కడ నాలుగవ పాదంలో 'గొంతు వాకిలి' అని రూపక ప్రయోగం ద్వారా కవి ప్రతిభ కనిపిస్తుంది.

"అమావాస్య వస్తుంది నెలకొకసారి
పున్నమీ నవ్వుతుంది నెలకొకసారి
నీలవేణి చంద్రముఖి నా చెలివస్తే
అమవస పున్నములు వచ్చు కలిసి ఒకేసారి"

(శ్రీనివాసాచార్య, తిరుమల. 1988: 8)

హాస్యం, వ్యంగ్యం, ప్రకృతి, సామాజికం మొదలైన అంశాలతోపాటు డా. తిరుమల శ్రీనివాసాచార్య గారు ప్రేమ గురించి కూడా రుబాయీలు రాశారు. అమావాస్య, పున్నమి కలిసి రావడం అసంభవం. కాని కవి నాలుగవ పాదంలో రెండు కలిసే వస్తాయని చెప్పారు. దానికి మూడవ పాదంలో రెండు పదాల్ని ఉపయోగించారు. ఒకటి నీలవేణి. అంటే నల్లటి జడ కలిగినది. అంటే చీకటి. రెండు చంద్రముఖి. అంటే చందమామ లాంటి ముఖం కలిగింది. అంటే వెలుగు. ఈ రెండు పదాల ప్రయోగం వల్ల అమావాస్య, పున్నమి రెండు కలిసి రావడం సాధ్యమైంది.

"పశుత్వాన్ని నిలువరించి వికసించును మానవత
సహకారము సౌజన్యము విస్తరించు మానవత
ఈ సృష్టికి దివ్యత్వము చేకూర్చే శక్తియేది?
వెలుగునిచ్చు సూర్యునిలా వెలుగుచుండు మానవత"

(కిషన్‌రావు, రేగులపాటి. 2010: 81)

మనిషి తనం మానవత్వం. ఆ మానవత్వపు గొప్పతనాన్ని విశదీకరించేదే పై రుబాయీ. మానవత్వం ఏం చేస్తుందంటే పశుత్వాన్ని నిలువరిస్తుంది, సాటి మనుషులకు సహాయం చేస్తుంది, ఈ సృష్టికి దివ్యత్వాన్ని అందిస్తుంది, ప్రపంచానికి వెలుగునిస్తుంది. అంతటి శక్తి మానవత్వానికి ఉంది. కాని అలాంటి మానత్వం నేడు కనుమరుగైపోతోంది. స్వార్థం పెరిగిపోయాక సహాయం, మంచి అన్న మాటలు కనుమరుగైపోతున్నాయి. కొడుకు

కన్నవాళ్ళనే అనాథ శరణాలయంలో చేర్పించడం, కూతురుపై, చెల్లిపై, చిన్నపిల్లలపై మగాడు అఘాయిత్యం చెయ్యడం మాయమవుతున్న మానవతకి ఆనవాళ్ళు.

"దుర్మార్గుల ఆగడాలు అనునిత్యం ఇంతే
అమాయకులు వంచనకు గురి అవుతారంతే

సౌజన్యం సంఘములో ఏనాడు నిలుస్తుందో
పులిమేకలు కలిసి హాయి పొందుట ఒక వింతే"
(కిషన్‌రావు, రేగులపాటి. 2010: 84)

ఎక్కువ మంది మంచిని మరిచి మనుగడ సాగిస్తున్న కాలంలో అమాయకులు, మంచివాళ్ళు వంచనకు గురవతున్నారు. మనుషుల మధ్య సమానత్వం, సౌభ్రాతృత్వం వచ్చిననాడు ఈ సమాజం బాగుపడుతుంది. పులి(చెడు గుణం కలిగినవాడు), మేక(మంచిగుణం కలిగినవాడు) కలిసిపోయి హాయిగా ఉండే సమాజానికై కవి కలలు కంటున్నారు.

### ౫.౨.౮. ప్రపంచపదులు

" 'ప్ర'పంపచపదులు కేవలం ఒక ఛందస్సు పేరుకాదు. శబ్దలయా, భావస్పందనలు కలగలిసిన ఓ అభివ్యక్తి రూపం. 'ప్ర'పంచపదులు అన్న కూర్పులో అనేకార్థాలున్నాయి. ప్రపంచించి చెప్పడం అంటే విస్తరించి చెప్పడం అని అర్థం. పార్సీలోని రుబాయీలో నాలుగు పాదాలుంటాయి. సినారె వాటిని ఐదు పాదాలకు పెంచారు. అట్లాగే 'ప్ర' అన్న ఉపసర్గకు విశేషం అని అర్థం. అంటే మామూలు పంచపదులు కాదు విశేషమైన పంచపదులు అని తాత్పర్యం. 'ప్రపంచ' అని కలుపుకొంటే లోకతత్వాన్ని బట్టి చెప్పిన పదాలని అర్థం. అంటే ఛందస్సు పంచపదీయం, వస్తువేమో ప్రపంచపదీయం అన్నమాట! అవసరానికి పనికొచ్చే అర్థాలను పిండగల శబ్దశక్తి సినారెకు నైసర్గికం" (గోపి, ఎన్.(సంపా.). 2000: 152). ఒక నిర్దిష్టమైన గేయంలా సాగిపోయే ఐదు పాదాలు ఉండి మాత్రా ఛందస్సుకు దగ్గరగా కలిగిన కవితా రూపం ప్రపంచపదులు. రుబాయీ, గజల్ ప్రభావంతో వీటిని సి. నారాయణరెడ్డిగారు సృష్టించారు. వీటిలో కవితా లక్షణాలతో పాటు గేయ లక్షణాలు కూడా ఉంటాయి. ప్రపంచపదులు అంటే ప్రపంచించి చెప్పడం. రుబాయిలో నాలుగు పాదాలుంటే వాటికి

అదనంగా ఒక పాదాన్ని చేర్చి ప్రపంచపదుల్ని చేశారు సి. నారాయణరెడ్డి గారు. రుబాయిల్లోలాగా మూడవపాదం మినహా మిగిలిన పాదాల్లో అంత్యప్రాస లక్షణం కనిపిస్తుంది. మిశ్రగతి, త్రిస్రగతి, చతురస్రగతి, ఖండగతులల్లో ఈ ప్రపంచపదులు ఎక్కువగా రాశారు సినారె.

ప్రపంచపదుల్లో గతి విన్యాసమేకాక నిర్మాణ విషయం కూడా విషిష్టమైంది. 1, 2, 4, 5 పాదాలు ఒక రకంగా, మూడో పాదం ఒక రకంగా ఉంటాయి. ప్రపంచపదుల్లో అంత్యప్రాసలు, అంతఃప్రాసలు, పద విరామాలుంటాయి.

ప్రపంచపదుల గురించి ప్రపంచపదుల్లోనే చెప్పారు నారాయణరెడ్డిగారు.

"ఒరిగి పడిన జాతికి వెను చరుపులీ ప్రపంచ పదులు
మరుగు పడిన నీతికి కనుమెరుపులీ ప్రపంచ పదులు
చేదోతీపో మధించి చెప్పాడు సుమా సినారె
కునికే అడుగులకు మేలు కొలుపులీ ప్రపంచ పదులు
మారే విలువలకు దారి మలుపులీ ప్రపంచ పదులు"

(నారాయణరెడ్డి, సి. 2000: 276)

తన ప్రపంచపదులు ఎందుకో పై ప్రపంచపది వల్ల తెలుస్తుంది. మనిషి కోసం, అతని మనుగడను, అతను వేసే అడుగులను చక్కదిద్దేందుకు, పతనమవుతున్న విలువలను బతికించడానికి, మరుగున పడుతున్న నీతిని బతికించడానికి తన ప్రపంచపదులు పనికివస్తాయని, ధైర్యాన్ని అందిస్తాయని నారాయణరెడ్డి గారి అభిప్రాయం.

"నింగి లోతును చూడగోరితె నీటి చుక్కను కలుసుకో
రత్న తత్వం చూడగోరితె రాతి ముక్కను కలుసుకో
అణువునడిగితె తెలియదా బ్రహ్మాండమంటే ఏమిటో
మౌనశిల్పం చూడగోరితె మంచుగడ్డను కలుసుకో
మనిషి చూడగోరితె మట్టిబెడ్డను కలుసుకో"

(పైదే: 169)

దీనిలో అంత్యప్రాసతో పాటు అంతఃప్రాసను (నీటిచుక్క – రాతిముక్క, మంచుగడ్డ – మట్టిబెడ్డ) కూడా పాటించడం కనిపిస్తుంది. నింగిలోతు నీటి చుక్కలో, రత్నతత్వం

రాతిముక్కలో, బ్రహ్మాండం అణువులో, మౌనశిల్పం మంచుగడ్డలో, మనిషితనం మట్టిబెడ్డలో ఉందనడం ఒక్క సినారెకే చెల్లుతుంది.

"పూలపైన విహరించే పిల్లగాలికి తుమ్మముళ్లంటే జడుపుంటుందా
గోపురాలపై మెరిసే సూర్యకాంతికి పెంటకుప్పలంటే వెగటుంటుదా
మైదానంలో పారే ఏటి నీటికి మాగాణి బీడు ఒకటే
గుండెలోన పొరలులేని మనిషి కంటికి కులంపైన గురి ఉంటుందా
మానవతను పూజించే మంచి మనసుకు ఒకే మతంపైన బలి ఉంటుందా"

(నారాయణరెడ్డి, సి. 2000: 241)

సినారె ముఖ్యంగా మానవతావాది. మానవత కవిత్వాన్నే ఎక్కువగా రాశారు, మానవుడికోసమే తపించారు. మానువుడిని ముఖ్య భూమికగా చేసుకొని నారాయణరెడ్డిగారి కవిత్వం ఎక్కువగా సాగుతుంది. ఈ ప్రపంచపదిని చదువుతుంటే అన్నమయ్య కీర్తన గుర్తొస్తుంది. గాలికి పూలైన, ముళ్లైన ఒక్కటే, సూర్య కిరణాలకి గోపురాలైన, పెంటకుప్పలైన ఒక్కటే అలాగే పారే నీటికి పంట పొలమైన, బీడైన ఒక్కటే. తక్కువ ఎక్కువ అన్న బేధంలేని మనిషికి, మానవతను పూజించే మనసుకు కులమంటే పట్టింపు ఉండదు. మనిషి, మనసు సర్వోత్కృష్ట భావాలుగా డా. సి. నారాయణరెడ్డి గారి కవిత్వంలో మారుతాయి.

"ఎదురీదే చేతులుంటే ఏరు దారియివ్వక ఏంచేస్తుంది?
పయనించే అడుగులుంటె బాట చేతులెత్తక ఏంచేస్తుంది?
తనకరాలు పరికరాలు తగినపాళ్లలో సమన్వయించుకుని-
చూపును సాచే కంటికి శూన్యం శిరసొగ్గక ఏంచేస్తుంది?
పిడికిలి పిండే అనిషికి ఎడారి అలలెత్తక ఏంచేస్తుంది"

(పైదే: 258)

మనిషి తలుచుకుంటే కానిది ఏదీ లేదు. మనిషిని చైతన్యం చేసి అతనిని గమ్యంవైపు నడిపించే ప్రయత్నం ఈ కవితలో కనిపిస్తుంది. ఈతకు ఏరు దారిస్తుంది, నలుగురు నడిస్తే బాటవుతుంది, కంటి చూపుకు శూన్యం శిరస్సు వంచుతుంది, కష్టపడితే ఎడారి పచ్చదనంగా మారుతుంది. ఇలా సమాజంలో మనిషి చేస్తే సాధ్యంకానిదంటూ లేదు.

### 5.2.9. వచన కవిత

ఆధునికకాలంలో వచ్చిన అనేక సాహిత్య రూపాల్లో కవిత్వం ఒకటి. వాక్య నిర్మాణంలో, భాషలో స్వేచ్ఛను కోరుతూ వచ్చిందే ఇది. వచన కవిత్వం సమాజాన్ని గురించి సూటిగా చెపుతుంది. సమాజం మీద ఈటెలాగా విరుచుకుపడుతుంది. సమాజంలో అనేక మందికి అర్థమవుతుంది. ప్రజస్వామ్యాన్ని పటిష్టం చేస్తూ, ప్రజా హృదయాల్లోని విప్లవ దృక్పథాన్ని నిద్ర లేపి, సంపూర్ణ సామాజిక వికాసానికి దోహదం చేస్తుంది.

"సుదీర్ఘంగా సాగిపోతున్న నా జీవితాన్ని
ప్రశ్నించాను –
"శ్వాసలకు అతలాకుతలం చేస్తున్న
జటిల సమస్యల మధ్య
నీకు విసుగు రావడం లేదా అని."
అది ఇలా పలికింది
విసుగు రావడమంటే ఓటమిని ఒప్పుకోవడమే
ఓడిపోయి జీవించడమంటే
బతికున్న నీ శవాన్ని మోసుకుపోవడమే
(నారాయణరెడ్డి, సి. 2010: 15)

కవిత్వంలో లబ్ధప్రతిష్టులైన కవి డా. సి. నారాయణరెడ్డిగారు. ఈ కవిత సంభాషణాత్మక ధోరణిలో సాగుతుంది. జీవితం అనేక సమస్యల వలయం. కష్టంలేని జీవితాన్ని కోరుకోవడమంటే ఎడారిలో వ్యవసాయం చేయడం లాంటింది. రెండు ఎప్పటికీ సాధ్యంకానివి. అందుకే ఆ సమస్యలను ఎదురించే ధైర్యాన్ని మనం కలిగి ఉండి వాటిని జయించడమే జీవిత గమనం. ఓడిపోవడమంటే నీ అస్తిత్వాన్ని నువ్వు తొలగించుకున్నట్టే అందుకే ఓడిపోవడమంటే బతికున్నా మరణించడం లాంటిది. 'ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి' లాంటి పాటలు మనిషి చైతన్య పరిచేవిగా ఉంటాయి.

"మాయల ఫకీరు మంత్రభవనంలా
ఎన్ని జీవితాలక్కడ నిశ్శబ్దాలయ్యాయో....
ఎన్ని శిలాలక్కడ బద్దలయ్యాయో....
'అయ్యా...బాంచెన్ కాల్మొక్తా...' పదాలపై

నడిచిన యాసిడ్ పాదముద్రలు...
ఇంకా కౄరంగానే ఉన్నాయి...
తరాలుగా తొక్కేసిన పాలేరుతనం....
ఎత్తిన కన్రెప్పల చూపులు రాల్చిన
కన్నీటి మరకలు ఇంకా పచ్చిగానే ఉన్నాయి...
(రవీంద్ర, సంగెవేని. 2007: 60)

ఒకప్పుడు తెలంగాణ బతుకు చిత్రాన్ని మనసుపొరల్లోంచి ఆవిష్కరించే ప్రయత్నమే ఇది. నిజాం నిరంకుశ పాలనలో దొరలే గ్రామాలకు సర్వాధికారులు. ఒక్కొక్క దొరకు ఊర్లపై గుత్తాధిపత్యం ఉండేది. వందల, వేల, లక్షల ఎకరాలు వాళ్ళ ఆధీనంలో ఉండేవి. ఎవరైన తిరుగుబాటు చేస్తే మరణమే శరణం. గ్రామాల్లోని ప్రజలంతా పాలేర్లుగా, కూలీలుగా ఉండేవాళ్ళు. ఆనాడు తెలంగాణ ప్రజలు 'బాంచెన్ నీ కాల్మొక్తా' అనుకుంటూ దొరలకింద అణిగిమణిగి ఉండేవాళ్ళు. ఈ జ్ఞాపకాల్ని చాలా రోజుల తర్వాత కవి ఊరికెళ్ళగా ఆ ఊరిలోని గడిని చూస్తే గుర్తుకొచ్చాయి.

"చిట్టడివి చీల్చినట్టుండే బ్రతుకుతెరువు బాటలో
చివ్వరి దాకా ఒడిదుడుకులున్నా నివ్వెరపోకురా నాన్నా!
దురలవాట్ల దుష్టశక్తులెన్నో
మార్గమధ్యంలో మాటువేసి వుండొచ్చు
మాదకద్రవ్యాల మహాసర్పాలుంటాయి
కస్సుమని కాటెయ్యడానికి–
బుల్లితెరమీద అల్లుకుపోయిన నీ మమకారం
కళ్ళమీద మాయవస్త్రాన్ని కప్పి
వాస్తవ దర్శనాన్ని వల్లకాట్లోకి చేర్చొచ్చు....
అంతర్జాలపు అందమైన గాలానికి చిక్కి
వింత జాడ్యాల విషవలయంలో
గిరగిరా తిరిగేవు జాగ్రత్త"
(ఎలనాగ. 2010: 62 – 63)

ఒక తండ్రిల తన కొడుక్కి జాగ్రత్త చెబుతున్నట్టు ఉంది ఈ కవిత. ఇక్కడ కవి తండ్రి, కొడుకు సమాజంలోని ప్రతి వ్యక్తి. కవి తన చుట్టున్న సమాజాన్ని బహు జాగరుకతతో గమనించి వాటిలోని చెడును గమనించి, ఆ చెడుపై తిరుగుబాటు చెయ్యాలి. అలాంటి పనే కవి ఈ కవితలో చేశారు. సాంకేతిక కారణంగా అత్యంత వేగంగా మారుతున్న ఈ సమాజంలో ఏ చెడు ఉందో చెబుతూ ఆ చెడు జోలికి పోకు అని ప్రేమగా చెబుతున్నారు. మాదక ద్రవ్యాలు, టెలివిజన్, సినిమా, అంతర్జాలం ఇలా అనేక చెడు అలవాట్లలో పడి బతుకును నాశనం చేసుకోకనే సందేశం కనిపిస్తుంది. అనేక ఒడిదుడుకులను దాటుకుంటూ జీవితాన్ని గెలువు అని చెబుతున్నారు కవి.

"విరబూస్తున్న మన జీవితాల్ని
చిదుముతున్న వాన్ని తరుముదాం
పీడితులమంతా సంఘీభావమై సమరం చేస్తాం
కూబూల్ పర్వత శ్రేణుల్లో, కార్గిల్ మంచు కొండల్లో
పాలస్తీనాలో, ఎబనాన్‌లో
ఎక్కడైనా ఎప్పుడైనా
మనిషితనంకోసం బతకాల్సిందే
రహస్య యుద్ధం చేయాల్సిందే"

(దేవేందర్, అన్నవరం. 2001: 30)

కవికి ఉండాల్సింది మానవత దృష్టి. నీ, నా భేదాలు, కులమత పట్టింపులు ఉండడం కవి సంకుచితం కావడమే. అందుకే కవి కాబూల్‌లో, కార్గిల్‌లో, పాలస్తీనా ఇలా ఎక్కడ మనిషితనాన్ని నాశనం చేసే వానిపై యుద్ధం ప్రకటిస్తూనే, సామాన్య జనులకు అండగా నిలుస్తునాడు.

### 5.2.10. దీర్ఘకవిత

ఆధునిక సాహిత్యంలో వచన కవిత్వం ఒక రూపమైతే దాంట్లో అనేకానేక ప్రయోగాలు జరిగాయి. వాటిలో దీర్ఘ కవిత ఒక్కటి. ఒక పుస్తకమంత నిడివి గలిగిన కవితల్ని దీర్ఘకవితలు అంటారు. ఈ దీర్ఘ కవితలో కథ, పాత్రలు లేక అవిచ్ఛిన్నంగా అనేక

అభివ్యక్తులతో కొనసాగుతుంది. ఈ అభివ్యక్తులు అనేకాంశాల్ని తెలియజేసినా వాటిమధ్య సమన్వయం ఉంటుంది. ధ్వని, ప్రతీక, భావచిత్రం లాంటి అభివ్యక్తులతో కూడి ఉంటుంది.

'సృష్టిలో అత్యంత శక్తివంతమై, బహుముఖీనమై విజృంభించే మనస్సే అతని అనుభూతికీ, ప్రవత్తికీ, విశ్వప్రగతికీ మూలకారణమన్న' ఇతివృత్తంతో సాగిపోయే విశిష్టమైన దీర్ఘ కవిత విశ్వంభర. దీన్ని డా. సి. నారాయణరెడ్డి గారు రాశారు. ఈ దీర్ఘకవితకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠ పురస్కారం 1982లో పొందారు. "ఆదిమ దశ నుంచి ఆధునిక దశవరకు మనిషి చేసిన ప్రస్థానాలు ఈ కావ్యంలోని ప్రకరణాలు. మనిషి సాధన త్రిముఖం – కళాత్మకం, వైజ్ఞానికం, ఆధ్యాత్మికం. ఈ సాధనలో అడుగడుగునా ఎదురుదెబ్బలు. క్షతుడైనా మనిషి తిరోగతుడు కాలేదు. 'విశ్వంభర' కావ్య రచనకు పూర్వం నాలో గీసుకున్న రేఖాచిత్రమిది" (నారాయణరెడ్డి, సి. 2012: i). అని డా. సి. నారాయణరెడ్డిగారే తన విశ్వంభర దీర్ఘ కవితకు మూలం ఏమిటో తెలియజేశారు.

"నేను పుట్టకముందే
నెత్తిమీద నీలితెర
కాళ్ళకింద ధూళిపొర"

(నారాయణరెడ్డి, సి. 2012: 1)

అంటూ మొదలవుతుంది ఈ దీర్ఘకవిత. డా. సి. నారాయణరెడ్డిగారి కవిత్వంలో ఎక్కువగా మానవత కవిత్వం కనిపిస్తున్నా ఆ మానవత్వం ఈ దీర్ఘ కవితలో నూరురేకులై విచ్చుకుంది. ఈ రచన తర్వాత డా. సి. నారాయణరెడ్డిగారిని విశ్వంభర కవిగా పిలిచారని ఆయనే చెప్పుకున్నారు. అంతటి గొప్ప రచన ఇది. వచన కవితలో ఒక సమగ్ర కావ్యంగా విశ్వంభర నిలుస్తుంది. పరిపూర్ణ మానవతావాద ప్రతిఫలిస్తూ, విశ్వ ప్రగతి ప్రతిపాదకమైన కావ్యం విశ్వంభర. నేటి విశ్వ సాహిత్యంలో విశేష ప్రాచుర్యాన్ని పొందిన మానవతావాద దృక్పథాన్ని సమగ్ర వచనకావ్యంగా చిత్రించిన ప్రయోగంతో పాటు నేటి సామాజికులకు సులభంగా అర్థమవుతుంది.

" 'ఆ జీవితానికి
అణుక్షణం మృత్యుభయం!'
ఆ మృత్యువు కోరలతో
ఆడుకోవడం మాకు ప్రియం'

‘అయితే వెళ్ళిపో మట్టిమనిషీ!
ఆ మట్టిలోకి’ / ‘అలాగే;
వెళ్ళి పొంగిస్తాను ఆ మట్టిని నింగిపైకి.’
‘అందాకా వచ్చింద నీ అహంకృతి?
‘అక్కడే మొదలవుతుంది
మానవ సంస్కృతి.’”

(నారాయణరెడ్డి, సి. 2012. 8)

పుట్టిన మనిషికి మరణం సహజమే అయినా ప్రతి మనిషి మరణ భయం. కాని ఆ భయాన్ని జయించగలిగి ఆ మరణంతోనే ఆడుకోవడం అంటే నిత్యం బతుకు పోరాటం చేస్తుంటాడు మనిషి. మానవ సంస్కృతి, మానవ జీవితం మట్టిలోనే, మట్టితోనే ఉంది.

“విజేతగా వెలగాలంటే
విశ్వాన్నే భస్మం చేయాలా?
ధరాలోభం తీరాలంటే
నరరుధిరమే కావాలా?
వేయితోటలను నరికినచేయి
పూయిస్తుందా ఒక్క పువ్వును?
మారణహూంకృతులు మరిగిన నోరు
చేరబిలుస్తుందా ఒక్క శిశువును?”

(నారాయణరెడ్డి, సి. 2012: 42)

తాను హాయిగా బతకడానికి పక్కవాడి శాంతిని భగ్నం చెయ్యాలని లేదు. తాను విజేతగా నిలవడానికి ఈ విశ్వాన్ని భస్మం చెయ్యాలనీ లేదు. పగతో రగిలే మనసు ప్రేమను పంచలేదు, నాశనాన్ని కోరుకునే మది ప్రగతిని కాంక్షించదు.

“ఈ చీకటి వెలుగవుతుందా?
ఈ హింస గెలుపౌతుందా?
మగాతను నూరిపోసె లోభం
మనసుకు మేలుకొలుపౌతుందా?

కుత్తుకలను నరికితే కాదు
గుండెలను కలిపితే గెలుపు.
వినాశం జరిగితే కాదు
వివేకం పెరిగితే గెలుపు.”

(నారాయణరెడ్డి, సి. 2012: 46)

నిజమైన గెలుపు నాశనంలో కాదు విజ్ఞానంలో అని, మనుషులను చంపితే కాదు మనుషులను కలిపితే గెలుపని కొత్త అర్థమిచ్చారు కవి. ఇది పాటిస్తే మనిషి గెలుస్తాడు, కవీ గెలుస్తాడు.

“కాలం తత్త్వవేత్తల తలల్ని బద్ధలు చేసింది
జ్ఞానం వెలుగురేఖలై పలు దిశలకు వికసించింది”

(సత్యం, యెన్నం. 1996: 36)

సైన్స్ పరిభాషలో వచ్చిన దీర్ఘ కవిత ‘సుదీర్ఘ జ్ఞాపకం’ దీన్ని యెన్నం సత్యం 1996లో ప్రచురించారు. “ఈ కావ్యం 12 ప్రకరణాలుగా రచించబడింది. మన జీవితం చుట్టూ పరిభ్రమించే సకల అనుభవాలనూ, దృశ్యాలనూ ఉపసామగ్రిగా వాడుకున్నాడు. ‘లారీ రబ్బరు చెప్పు క్రింద చితికిన కుక్క కళేబరం అమెరికన్లు హైబ్రీడ్ చేసి మేకగా మార్చినా, మున్సిపాలిటీ బోన్‌లో చిక్కి’ అనే చిత్రణ మానవ జీవిత పరిభ్రమణాన్ని చిత్రిస్తాడు. ఓజోన్ కడుపులో కాలుష్యం కత్తులు, మచ్చుకైనా నేల వాసనలు మిగలని శిలానాగరికతల సుదీర్ఘ జ్ఞాపకం. ఇలా అసంఖ్యాక పద చిత్రాల ఓజస్సుతో అంతరిక్ష కథలోనే మానవజాతి పరిణామ గాథను కూడా ఇమిడ్చి కథనం చేస్తాడు” (సోమసుందర్, అవంత్స. 2001: 51 – 52).

“ఎవరన్నారు నాకు జీవ నాడులు లేవని
ఎవరన్నారు నాకు అడుగుజాడలు లేవని....
ఎవరన్నారు నాకు హృదయం లేదని
ఎవరన్నారు నాకు స్పందన లేదని
సుమేరియన్ దేవతా గణాన్ని దాగింది నేనే కాదా!
రోమ్‌నగర్ ఆడతోడేలు అందాన్ని నేను కాదా!
ఆకాశ హర్మ్యాల క్రింద ఆహ్లాదంగా పరవశించే
హాంగింగ్ గార్డెన్స్ నేను కాదా!”

(సత్యం, యెన్నం. 1997: 15)

యెన్నం సత్యం రాసిన మరో దీర్ఘ కవిత 'శిలాఘోష'. సృష్ట్యాది నుంచి వికాసం పొందిన ఎన్నో నాగరికతలను చూసిన శిలను సైన్స్‌కు సంబంధించిన పదాలతో రాయడం ఈ దీర్ఘకవితలో కనిపిస్తుంది. శిలకు ఏమి లేవని ప్రశ్నించగా దానికి సమాధానంగా మానవ నాగరికత మొదటినుంచి ఉన్న పరిణాల దశలు అన్ని నేనే అంటూ అప్పటినుండి నేటికాలంవరకు గల అన్ని అంశాల్ని స్పృశించడం జరిగింది.

'చౌరస్తా, శక్తి, ఓ అయిదు ఎపిసోడ్స్, వాస్కోడిగామా డాట్ కామ్' ఈ దీర్ఘకవితలన్నింటిని కలిపి 'వాస్కోడిగామా డాట్ కామ్' పేరుతో పుస్తకంగా వేశారు జూకంటి జగన్నాథం. చౌరస్తా అంటే నాలుగు దారుల కూడమి. ఆ చౌరస్తాలో ఏమేమీ కనిపిస్తాయో, వినిపిస్తాయో అన్నింటిని కవిత్వీకరించారు కవి.

"ఒకడు
కాళ్ళతో రిక్షా లాగుతాడు
ఒకడు
చచ్చిన పిచ్చికుక్కను
తాడుతో రోడ్డంటా
'బరబరా' లాక్కెళ్ళుతాడు
ఒకడు
జీవంలేని సర్టిఫికెట్లను పట్టుకొని
జీవితాన్ని వెతుక్కుంటూ పోతాడు"

(జగన్నాథం, జూకంటి. 2013: 16)

కూలి రిక్షా తొక్కుకుంటు వెళ్ళడం, చెపరాసి చచ్చిన కుక్కని లాక్కెళ్ళడం, నిరుద్యోగి సర్టిఫికెట్లతో ఉద్యోగ వేటకై బయలుదేరడం అన్ని ఆ చౌరస్తాలో జరిగే విషయాలు. ఆ ప్రాంతాన్ని దృశ్యమానం చేసే వాక్యాలు ఇవి. ఇవి చదవగానే ఒక దృశ్యం మనలో మెదులుతుంది. ఇంకా ఆ చౌరస్తాలో

"బతుకు చౌరస్తాలో
చిత్రవధ చేయబడిన
రెండు పదులన్నా దాటని

ఆ చెల్లి దీపాన్ని చీకట్లో
ఆరుగురు మూకుమ్మడిగా
చిదిమేసిన క్షణాన
వలవల కార్చిన
కన్నీటి బిందువులే
క్రూరమైన
వ్యవస్థకు సాక్ష్యం"

(జగన్నాథం, జూకంటి. 2013: 20)

ఓ చెల్లికి జరిగిన అన్యాయానికి సాక్ష్యంగా చౌరస్తాను చెప్పడం విశేషం. అక్కడే కొన్ని జీవితాలు వెలుగుతాయి, కొన్ని జీవితాలు చీకట్లో కలిసిపోతాయి. వీటన్నింటికి సాక్ష్యం చౌరస్తానే.

స్త్రీ అనాది నుండి ఎలాంటి వివక్షకు, దోపిడికి, అవమానానికి గురైందో, గురవుతుందో వివరించేదే 'శక్తి' దీర్ఘకవిత. సమాజం క్రమక్రమంగా అభివృద్ధి చెందుతున్నా ఆడవాళ్లపై అఘాయిత్యాలు తగ్గకపోవడం విచారకరం.

"తల్లీ!
అశోకవనంలో
శోకంగా మిగిలిన సీతవైనప్పుడే
నీ జీవితం ఆయువుపట్టుపైన
వాడు వల విసిరాడు
....
ద్రౌపదీ అహల్య అరుంధతీ
సీత సావిత్రీ పతివ్రతలనే
కట్టుకథలతో కుతంత్రాలతో
వాడు
నీ జీవిత ప్రధానవాహిని నుంచి
నీ నుంచి నిన్ను వేరు చేశాడు"

(జగన్నాథం, జూకంటి. 2013: 30)

సమాజంలోని స్త్రీలను పురుషుడికి అనుగుణంగా ఉండడానికి, వాళ్ళని అణచివేయడానికి సీత, సావిత్రి మొదలైన పాత్రలు సృష్టించబడ్డాయంటారు కవి. ఉదాత్తమైన పాత్రలను ఉదాహరణగా చూపించి వాళ్ళలాగే మీరు నడుచుకోవాలన్న ఉద్దేశ్యంతో వాటిని కల్పించి ఉంటారు. సీత, ద్రౌపదీ, అహల్యా, అరుంధతీ, సావిత్రి, శూర్పనఖ మొదలైన పాత్రలపై మగాడు ఎలా ఆధిపత్యం చెలాయించాడో స్త్రీ దృక్పథంతో చెబుతున్నాడు కవి. ఇలాంటి స్త్రీలకు అండగా నిలబడుతూ

"నిద్రాణమైవున్న
నీ శక్తిని మేల్కొలుపు
నిన్ను నీవే శత్రువుగా నిలబెట్టుకోక
హక్కులను కాజేసిన
నిజమైన దొంగపైన
నీ పోరాటాన్ని కొనసాగించు
ఈనాడు ఓడినా
ఖచ్చితంగా గెలుపునీదే
ఈనాడు అణచివేయబడ్డా
రేపు వికసించబోయే ప్రపంచానివి నీవే"

(జగన్నాథం, జూకంటి. 2013: 35)

నీకు నువ్వే, నిన్ను నువ్వే శత్రువుగా భావించుకోకుండా అసలు శత్రువెవ్వాడో తెలుసుకోని నీలో అచేతనాంగ ఉన్న శక్తిని మేల్కొల్పి నిజమైన శత్రువుపై పోరాడమని దిశానిర్దేశం చేస్తున్నారు. ఈనాడు ఓడిపోయిన రేపు గెలుపు నీదని, ఈనాడు కచ్చితంగా అణచివేయబడ్డ రేపటి ప్రపంచానివి నీవే అని ధైర్యాన్ని కలిగిస్తున్నారు.

సెప్టెంబర్ 30న మరాట్వాడలో వచ్చిన భూకంపంలో చచ్చిపోయిన 20వేల మందికి అంకితంగా 'ఓ అయిదు ఎపిసోడ్స్' దీర్ఘ కవితను రాశారు.

"కూలిన గోడల క్రింద
సహాయం కోసం భూనభోతరాళాలు దద్దరిల్లేలా వేసిన
ఆ ఆఖరి కేకను
ఏ రిక్టర్ స్కేలూ నమోదు చేయలేదు

మట్టి కింద కప్పుకు పోయిన
ఆ తల్లీ పిల్లల బతుకు పెనుగులాటను
ఏ కన్ను కెమెరా లైవ్ టెలికాస్టు చేయలేదు"

(జగన్నాథం, జూకంటి. 2013: 37)

విధ్వంసకరమైన సన్నివేశాల్ని హార్ద్రమైన హృదయంతో చెప్తున్నాడు కవి. రిక్టర్ స్కేలు భూకంపం ఎంత వచ్చిందో చెబుతుంది కాని మరణించేటప్పుడు వేసిన ఆ చివరి కేకను ఎలా చెబుతుంది, చెప్పలేదు. ఏ కెమెరా లైవ్ టెలికాస్టు చెయ్యలేని మట్టికింద కూరుకుపోయిన జీవితాల పెనుగులాటను కవి చెబుతున్నారు.

వాస్కోడిగామా ఇండియాకు దారి కనిపెట్టినప్పటి నుండి ఇండియా వలసలకు నిలయంగా మారిపోయింది. ఆ ఒక్క అన్వేషణ ఇండియా గమనాన్నే మార్చేసింది. అప్పటినుండి ఇప్పటిదాకా ఇండియా ప్రపంచ దేశాలవల్ల, ప్రపంచీకరణ వల్ల ఏం కోల్పోయిందో చెప్పే దీర్ఘకవితే 'వాస్కోడిగామా డాట్ కామ్'.

"రండి!
ఇండియా తమకు శిరస్సు వంచి
స్వాగతం పలుకుతుంది
రండి!
రైతు వెన్నెముకల్ని ఏర్చికూర్చి
విమానం దిగుతున్న మెట్లుగా తీర్చిదిద్దాం"

(జగన్నాథం, జూకంటి. 2013: 43)

విదేశాలనుంచి భారతదేశానికి పెట్టుబడులకోసం వస్తున్న వారికి రైతుల వెన్నెముకల్ని మెట్లగా మార్చి విమాననుంచి దించుతున్నాం అనడంలో ఈ దేశ వెన్నెముకైన రైతు వెన్నెముక విరచడానికే అని అర్థమవుతుంది. ఒక్క రైతే కాకుండా వృత్తులు, కుటీర పరిశ్రమలు విదేశీ పెట్టుబడులవల్ల, ప్రపంచీకరణవల్ల నాశనమయ్యాయి. అందుకే ఇక్కడి నిరసనలు, నినాదాలు, ఊరేగింపులు ఏవీ విదేశీ పెట్టుబడిదారుల కంటపడకుండ చర్యలు తీసుకుంటాం, ప్రజల రక్తంతో రెడ్ కార్పెట్ పరుస్తాం, రండి ఇండియా మీకు శిరస్సు వంచి స్వాగతం పలుకుతుందని ఇక్కడి అవినీతి, అన్యాయాన్ని చిత్రికరిస్తారు.

04.09.2002 రాత్రి 12.45ల నుండి రాత్రి 11.30ల మధ్య ఆయా సమయాల్లో కవి పొందిన ఉద్వేగాల రూపాలే 'ఒకరోజు పది గాయాలు' అన్న దీర్ఘ కవిత. ఇప్పటిదాకా ఇలాంటి దీర్ఘ కవిత రాకపోవడం గమనార్హం. ఒకరోజుని పది అంకాలుగా(భాగాలుగా) తీసుకొని ఆయా భాగాల్లో పరాయీకరణ, ప్రపంచీకరణ వల్ల సగటు మనిషి జీవన సంక్షోభాలను, విచ్ఛిన్నతను చూపగలిగాడు.

"నేలతోని సంబంధం లేదు
ఎడ్లతోని నాగలితోని గొర్రుతోని బాయితోని నీటితోని
మునివేళ్లతో చిటుకుచిటుకున నాటిన చేతులతోని
కళ్లలో వత్తులేసుకు పంటను పండించిన
అనంత అపూర్వ మట్టి యాత్రతోని
ఎలాంటి కొసపోగు అంటులేదు"

(జగన్నాథం, జూకంటి. 2013: 182)

రైతుకు పండిచిన పంటతోనే కాక ఇప్పుడు నేలతోటి కూడా సంబంధం పోవడం ఈ కవితలో చూడవచ్చు. ఎడ్లతోని, నాగలితోని, బాయితోని సంబంధాన్ని తెంచేస్తున్న ప్రపంచీకరణలో రైతు కూలీగా కొత్త అవతారం ఎత్తుతున్నాడు లేదా ఆత్మహత్య పాలవుతున్నాడు. ఈ సమాజంలో ఒక ఫ్యాక్టరీ యజమాని తయారుచేసిన ప్రతి వస్తువుకి ధర నిర్ణయిస్తాడు కాని రైతు తను పండించిన పంటకు మాత్రం ధర నిర్ణయించలేని దౌర్భాగ్య పరిస్థితి మనది.

"అయ్యా!
వస్తువులమంతా చేరాక
ఇల్లు మనసును ఖాళీ చేసిన
మార్కెట్టు అయ్యింది
కాస్సేపట్లో వచ్చినా
వాళ్లంతా వస్తువులు
వస్తువు వస్తువుతో
సహచర్యం చేసినట్టు సరుకుగా వుంటారు
ఇప్పుడు దేశం ఒక నిత్యావసర సరకు

మానవుడు గొప్ప వనరని అన్నవాడు
ప్రపంచ ప్రప్రథమ ద్రోహి!"

(జగన్నాథం, జూకంటి. 2013: 194 – 195)

డబ్బే మనిషికి పరమావధైన ఈరోజుల్లో మనసు, మమత, మానవత్వం చివరికి మనిషి కూడా సరుకుగా మారుతున్నాడు. ఇల్లు మార్కెట్, వచ్చిపోయే బంధువులు, వాళ్ల అనురాగాలు, వాళ్ల మాటలు, ఆప్యాయతలు అన్ని మార్కెట్ పరమైనవి. వస్తువులు వస్తువులతో జీవించే ఈ కాలంలో దేశం మరో దేశానికి ఒక సరకు. " 'ఒకరోజు పదిగాయాలు' అనే దీర్ఘ కవిత జూకంటి స్వానుభవ దినచర్యకాదు. జీవితం రోజురోజుకు పరాయీకరణకు గురైన సామూహిక దినచర్య. మనిషికీ మనిషికీ, మనిషికీ సమాజానికీ మధ్యనుండే మానవీయ సంబంధాలు నశించి, యాంత్రిక సంబంధాలు పెరిగిపోవడం వల్ల ఉత్పన్నమైన జీవన సంక్షోభాన్ని జూకంటి గమనించాడు. మనుషుల మధ్యన నెలకొన్న మార్కెట్ సంబంధాలను చూసి చెలించిపోయాడు" (పైదే: 173) అన్న నాళేశ్వరం శంకరం మాటలు ఈ రచనకుగల నేపథ్యాన్ని వివరిస్తున్నాయి.

"మదానికి పెద్దన్న అహంకారం
అక్కడే శ్రీకారం అన్ని అఘాయిత్యాలకూ
పతనాలకూ
ఎన్ని ఉన్నా –
దశదిశా ముఖాల్లో ప్రజ్ఞా చంద్రికలు విరగకాస్తున్నా
ఏం లాభం?
అదొక్కటి పుడితే చాలు
అంతా మన్నే!
మట్టిముద్దలకి"

(వసునందన్, రావికంటి. 2007: 37)

'మట్టిముద్దలు' అన్న పేరుతో రావికంటి వసునందన్ గారు తాత్త్వికమైన, మానవత్వమైన కావ్యాన్ని రాశారు. "కవి తెలిపినట్లుగా ఇందులోని వస్తువు లోతైనది. బుద్ధి గమ్యమైనది. భౌతిక ప్రపంచ విశేషాలకీ, కర్తవ్యాలకీ, పరిశ్రమ శక్తికీ మట్టిముద్దలు సంకేతాలు. సృష్టి తత్త్వాన్ని, తెలిపే ప్రతీకలు. వసునందన్ ప్రతీకాత్మకంగా వెల్లడించినా,

మానవతాతత్త్వాన్ని వ్యక్తీకరించినా బరువుగా వుండదు. సరళంగా సుబోధకంగా వుంటుంది. గంభీర విషయాన్ని సరళంగా చెప్పడం ఈయన శిల్పం" (వసునందన్, రావికంటి. 2007: 11) అన్న డా. ద్వానా శాస్రిగారి మాటల్లో ఈ దీర్ఘకావ్య ఇతివృత్తం, కవి దృక్పథం తెలుస్తున్నాయి. మట్టిముద్దల్లుతోపాటు త్రయి(1982), మనస్సు(2004), పిల్లలమర్రి(2006) అనే దీర్ఘ కావ్యాలు రాశారు.

"ఏ పూటకాపూట
ఆకలి పేగులు చిట్లిపోతున్నా
నాలుకమీది 'తడి' ఎండిపోంగ
పోగుల్ని అతకాలి
ఒక్క చేతి కదలికతో
లక్షల చుక్కల్ని పూయించాలి
ఆకాశాన్ని నేసినవాడికి
అడుగడుగునా చిక్కువడ్డ ఎదురు పోగులే"
(మోహన్, పత్తిపాక. 2001: 3)

చేనేత కుటుంబంలో పుట్టి చేనేత బతుకుల ఆత్మహత్యల్ని చూసి చలించి కవిత్వం రాసిన, రాస్తున్న కవి పత్తిపాక మోహన్ గారు. ఆయన కవిత్వం ఎక్కువగా చేనేత వృత్తికి సంబంధించిందే. చేనేత బతుకుల్లోని బాధలు, కష్టాలు, కన్నీళ్ళు ఇలా సమస్తం డా. పత్తిపాక మోహన్ గారి కవితా వస్తువులు. తిండున్నా, లేకున్నా మంచి నీళ్ళతో కాలం వెళ్ళదీస్తూ రేపైన బాగుంటుంది అన్న భరోసాతో బతికే చేనేత కుటుంబాలకి మంచిరోజులు రాలేదు. నిత్యం కష్టాలే ఎదురొచ్చాయి. అందమైన బట్టలు నేసినా బతకడానికి కాసింత తిండి దొరకని పరిస్థితుల్లోకి చేనేత కుటుంబాలు నెట్టివేయబడ్డాయి. అలాంటి దయనీయ పరిస్థితుల అక్షర రూపమే ఈ 'తెగినపోగు' దీర్ఘకవిత.

"హైదరాబాద్! ఓ ! హైదరాబాద్!
జగత్ ప్రసిద్ధి చెందిన
ఈ నేల కోహినూర్ వజ్రానివి కదా నువ్వు
తెలంగాణ గుండె కాయవు కదా నువ్వు
తెలంగాణ ఆత్మవు కదా నువ్వు!

తెలంగాణ కరకమలములలో కోటి రత్నాల వీణవు కదా నువ్వు!
అలనాడు తెలంగాణా బోయిలు మోసుక వచ్చిన
ముత్యాల పల్లకివి కదా నువ్వు !
తెలంగాణ ప్రాణసఖివి కదా నువ్వు !
తెలంగాణ ఆత్మసాక్షివి కదా నువ్వు !"

(లక్ష్మీనారాయణ, సబ్బని. 2010: 8)

ఈ దేశంలోని గొప్ప నగరాలలో హైదరాబాద్ ఒక్కటి. మొదటినుండి నేటిదాకా గొప్ప వైభోగాలతో, సంపదలతో తులతూగుతోంది. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమైంది కూడా హైదరాబాదే. అలాంటి హైదరాబాద్ పట్టణ గొప్పతనాన్ని తెలిపే వాక్యాలు పైవి. "కాకతీయుల కాలం నాటికే, అప్పటికింకా గోల్‌కొండగా పేరు మారకముందే, గొల్లకొండగా చెలామణీలో ఉన్న ఆ కొండ మీద ఒక 'అనామిక' బహుజన యాదవరాణి మట్టికోటను కట్టిన చరిత్రను మరువకపోతే, విభిన్న జాతుల జనాలు, జనవాసాలు ఆ మట్టికోట ఆధారంగానే ఆ చుట్టుపక్కల పరిసరాలలో విస్తరించినవన్న సత్యాన్ని గుర్తించితే, ఆ మతలబు కైఫేయత్తుల తఫ్సీళ్ల నన్నింటినీ హిసాబ్ కీ కితాబ్‌లోకి సరిగ్గా ఎక్కిస్తే ఈ పట్నం వయస్సు పది వందల వసంతాల వయస్సుకాదా? కావున అసల్‌పసల్ అవ్వల్ దర్జా పట్నం పురజనులు మరియు తెలంగాణా జాతి జనులు ఏతావాతా తెలుసుకోవలసిన, గమనించదగిన అంశం ఏమనగా చార్ సౌ సాల్ పురానా షహర్ అన్నమాటను పెడచెవిన పెట్టి వేయి సంవత్సరాల వైభవోజ్వల నగర సంకీర్తనకు శ్రీకారం చుట్టాలి" (లక్ష్మీనారాయణ, సబ్బని. 2010: i) అన్న పరవస్తు లోకేశ్వర్ గారి మాటలు హైదరాబాద్ పట్టణ ప్రాచీనతను తెలియజేస్తున్నాయి.

"పచ్చికుండను వాముల కాల్చి
బువ్వకుందను పుట్టించిన
ఆ శాస్త్రజ్ఞుడే కుమ్మరి బ్రహ్మ
మూడువేల సంవత్సరాల కిందనే
సింధూ, మెసపొటేమియా సందుల
నేల తవ్వకాల కిందనే
ఈ కుండ ఆనవాలు దొరికింది"

(దేవేందర్, అన్నవరం. 2016: 3)

విశ్వవ్యాప్తమైన ఈ అభివృద్ధికి కారణం మనిషి ఆలోచన. ఈ ఆలోచననుంచే ఆదిమకాలంలో మట్టినుంచి భిన్నభిన్న ఆకృతుల్లో వస్తువులు వచ్చాయి. దాంట్లో ఈ బువ్వకుండ ఒక్కటి. దీన్ని తయారు చేసిన శాస్త్రజ్ఞుడు కుమ్మరి. చరిత్ర అధ్యయనంలో భాగంగా మట్టితో తయారుచేసిన ఇటికెలు, గూన పెంకలు, కుండలు మొదలైనవి ప్రముఖపాత్ర వహిస్తాయని సింధు, మెసపటేమియా నాగరికతల అధ్యయనంలో ఋజువైంది.

### 5.2.11. మినీ కవిత

తెలుగు సాహిత్యంలో మనకు కనిపించే మరో కవితా రూపం మినీ కవిత. "మినీకవితకి ఉచ్ఛ్వాసం క్లుప్తత, నిశ్వాసం ధ్వని, వచన కవిత క్లుప్తతని మరచిపోయి, కేవలం వచనానికి దగ్గరైపోతున్న స్థితిలో లేదా క్లుప్తత చేతగాని కవి చేతుల్లో అస్పష్టతకి బలైపోతున్న స్థితిలో, క్లుప్తతకి ప్రతిబింబమైన మినీ కవిత – కవితా యాత్రికుడికి చలివేంద్రం అయ్యింది" (రామమోహనరావు, అద్దేపల్లి. 1998: 283). ఈ మాటలు మినీ కవిత స్వరూప స్వభావన్ని చెప్పేవి. వచన కవిత్వంలో అస్పష్టత, పొడగింపు అధికమవుతున్న కాలంలో వాటికి విరుగుడుగా వచ్చిందే మినీకవిత. మినీకవిత ఆవిర్భావానికి పత్రికల్లో స్థలాభావం, పాఠకుల చదవలేనితనం కూడా ఒక కారణం. మినీ కవితకు కొసమలుపు, కొస చరుపు, కొసమెరుపు లక్షణాలు ఉంటాయి. 1970 నుండి మినీ కవిత్వచ్ఛాయలు కనిపిస్తున్నా 1975 నుండి ఎక్కువగా రావడం ఆరంభమయ్యింది.

"మినీ కవిత అనే పేరు వినగానే మనకు రెండంశాలు స్ఫురిస్తాయి. ''మినీ'' అనే విశేషణం దాని ఆకృతికి రూపానికి సంబంధించినదని– "కవిత" అనే విశేషణం దాని స్వభావానికి సంబంధించినదని; ఆకృతి లఘువు, స్వభావం స్వాదువు" (చంద్రిక, యం. 1987: 4). మినీ కవితలోని రెండు పదాలు ఆకృతికి, స్వభావానికి సంబంధించినవి. ఆ పేరులోనే ఆ కవితా రూపానికి చెందిన స్వరూప స్వభావాలున్నాయి.

సంక్షిప్తత, ధ్వని, సూటిదనం, వ్యావహారిక శైలి, నవ్య బంధుర శైలి, శీర్షిక, కొత్తదనం, శ్లేష, బహుళార్ధ సాధకం, భావ గాంభీర్యం, చమత్కారం, విరుపులు, ముగింపు, ఆలోచన అనే వాటిని మినీ కవిత లక్షణాలుగా యం. చంద్రిక పేర్కొన్నారు.

"మినీకవిత ఆయుస్సు
మెరుపంత.
కానీ అది ప్రసరిస్తుంది
కాలమంత"

(నారాయణరెడ్డి, సి. 2000: 109)

మినీ కవిత నిర్వచనాన్ని మినీ కవితలోనే చెప్పారు డా. సి. నారాయణరెడ్డి గారు. మినీ కవిత మెరుపులాగా క్షణకాలంలోనే పుడుతుంది. కాని దాని ప్రసరణ మాత్రం కాలమంత సాగుతూనే ఉంటుంది.

"కవితకు ఇంపు
కుదింపులోనే ఉంది
అనవసరంగా 'మాట' పడని
ఆత్మగౌరవం దానికి ఉంది"

(బాపురెడ్డి, జె. 2010: 1)

ఛందస్సు, యతి, ప్రాస, గణాలు, వ్యాకరణం మొదలైన సంకెళ్ళను విడిపించుకొని వచ్చిన స్వేచ్ఛ ప్రక్రియా రూపం కవిత. అలాంటి కవిత్వానికి కుదింపే ముఖ్యం. క్లుప్తంగా, సంక్షిప్తంగా, గాఢంగా కవిత్వం ఉండాలి. అందుకే ఒక్క అనవసరమైన మాట కూడా కవిత్వంలో ఉండకూడదు. అదే కవిత్వానికి ఆత్మగౌరవం. అలా లేకుంటే కవిత్వం మాట పడుతుందనే భావాన్ని కవి వ్యక్తం చేస్తున్నారు. ఈ లక్షణం శ్రీశ్రీ కవిత్వంలో మనకు కనిపిస్తుంది. ఈ లక్షణం మినీ కవితలకు, నానీలకు సరిపోతుంది.

"కామన్‌గా మొగాడు...
కామిస్తేనే మృగాడు!"

(మల్లేశం, చిల్ల. 2014: 1)

చిన్ని కవితలో మగాడికి, మృగానికి మధ్య భేదాన్ని అద్భుతంగా చెప్పారు. మామాలుగా అతను మగాడే కాని కామంతో ఉన్నప్పుడు మాత్రం అతడు మృగమవుతాడు. చిన్న పిల్లలని, రక్త సంబంధీకులని, పరాయి స్త్రీ అని చూడకుండ అఘాయిత్యం చేసాడని మనం నిత్యం పత్రికల్లో చదువుతూనే ఉన్నాం. ఇలాంటి వార్తల్లో కామమృగం అన్న పదం ఎక్కువగా కనిపిస్తుంది. అలాంటి సంఘటనలన్నింటికి శీర్షికల ఈ కవిత నిలుస్తుంది.

"బస్, రైల్వే ఛార్జీలే
కాదు
యిక్కడ
లాఠీ ఛార్జీలు
ఎక్కువే"

(తిరుమలరావు, జయధీర్(సంపా.). 2013: 143)

సమాజంపై అంటించిన చురకలే అలిశెట్టి ప్రభాకర్ మినీకవితలు. ఇవి ధారాళంగా ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చాయి. ఆ కాలంలో జరిగిన సంఘటనలకు కౌంటర్‌గా, విమర్శనాత్మకంగా ఉండే ఈ చురకలు చాలా ప్రసిద్ధి పొందాయి. తెలుగుదేశంలో బస్, రైల్వే ఛార్జీలే కాదు లాఠీ ఛార్జీలు ఎక్కువ అని అనడంలో లాఠీల కఠినతనాన్ని చెబుతున్నారు. ఒకే చిన్నికవితలో తెలుగు సమాజంలోని ప్రయాణ, పరిపాలన పరిస్థితిని చెప్పడం అలిశెట్టికి కాక మరెవ్వరికి సాధ్యం కాదు.

"మనదేశ సంపదను చూచి విదేశీయులు ఆశ్చర్యపోయారు
మనదేశ దారిద్ర్యాన్ని చూచి మూర్ఛపోయారు"

(మలయశ్రీ. 1982: 23)

భారతదేశం సంపదలకు నెలవు. అందుకే ఇక్కడి సంపదను దోచుకోడానికి విదేశీయులు మన దేశానికి వర్తకం పేరుతో వచ్చారు. ఇక్కడి అమూల్యమైన సంపదని చూసి ఇక్కడ మెలమెల్లగా అధికారం సంపాదించి సంపదనంతా దోచుకెళ్ళారు. ప్రస్తుతం మన దేశ సంపద నల్లడబ్బుగా విదేశీ బ్యాంకుల్లో మూలుగుతోంది.

"ఆ తండ్రికే చెయ్యండి లింగనిర్ధారణ..
ఆడపిల్లను పెంచగల మగాడో కాదో!"

(మల్లేశం, చిల్ల. 2014: 11)

ఆదినుంచి ఇప్పటిదాక ఆడవాళ్ళపై వివక్ష కొనసాగుతూనే ఉంది. 'పుత్రుడు పున్నామ నరకం నుంచి తప్పిస్తాడు' లాంటివి స్త్రీలపై గల వివక్షకు నిదర్శనాలుగా కనిపిస్తాయి. ఇండ్లల్లో ఆడపిల్లలను ఒకరకంగా పెంచడం, అబ్బాయిని ఒక రకంగా పెంచడం మనం గమనించదగ్గ అంశం. ఆడపిల్లైతే కడుపులోనే చంపేసే తండ్రులు ఈ సమాజంలో అధికం. దానివల్ల నేటి సమాజంలో పురుష, స్త్రీ నిష్పత్తిలో తేడాలు వచ్చాయి. అందుకే కవి ఆడపిల్లను

పెంచగల మగాడో కాదో అని తెలియడానికి ప్రతి మొగాడికి లింగ నిర్ధారణ చెయ్యమంటున్నారు. ఇలా తెలుసుకోవడం కష్టమే అయినా ఒక పరీక్ష ఉండాలనే భావన కనిపిస్తుంది.

"సమాజం చెడిపోయింది
కారణం ఏమై ఉంటుంది
రాజకీయం భ్రష్టుపట్టింది"

(మలయశ్రీ. 2002: 5 )

సమాజం బాగుపడడానికి ఆ దేశ పరిపాలన వ్యవస్థ ముఖ్య భూమికను పోషిస్తుంది. 'యథా రాజ తథా ప్రజా' లాగా ఒక దేశంలో నాయకులు మంచివాళ్ళైతే ఆ దేశ ప్రజలు మంచివాళ్లవుతారు. తద్వారా ఆ దేశం అభివృద్ధి చెందుతుంది. అదే నాయకులు బాగా లేకపోతే సమాజం పతనమైపోతుంది. అందుకే కవి రాజకీయం భ్రష్టుపట్టడం వల్లే ఆ దేశ సమాజం చెడిపోయిందంటాడు.

"ఇప్పుడంతా మర మనుషులు..
ఔనను.. ప్లాస్టిక్ మనసులు!"

(మల్లేశం, చిల్ల. 2014: 14)

మనీ మాయలో మనిషి మర యంత్రంల మారిపోతున్నాడు. తన తనాన్ని కోల్పోతూ రోబోల తయారవుతున్నాడు. అందుకే అందెశ్రీ 'మాయమై పోతున్నడమ్మ మనిషన్నవాడు, మచ్చుకైన కానరాదు మానవత్వం ఉన్నవాడు' అని పాడారు. మనం అన్న మాటను మరచి నాది, నేను, నా కుటుంబం అనే స్వార్థాన్ని పెంచుతుంది రూపాయి. బంధాలనుండి, బంధుత్వాలనుండి దూరం చేస్తుంది. అన్నింటి తెంచుకొని, స్పందనను త్యజించి మనిషి మరయంత్రంల మారడం కవికి, రచయితకి, మంచి మనసున్న వాళ్ళకి నచ్చని విషయం. అందుకే వాళ్ళు మనుషుల రూపంలో ఉన్నవాళ్ళను మనుషులుగా మార్చేందుకు మాటలై, పాటలై, అక్షరాలై పుడతారు.

"దేవుడు లేంది ఇదంతా ఎట్లా వచ్చె?
మంచి ప్రశ్న!
మరి, దేవుడు ఎట్లా వచ్చె?

(మలయశ్రీ. 2002: 280)

ప్రశ్నించడం నాస్తికత, హేతువాదం. దేవుడు ఆజ్ఞలేనిదే చిన్న చీమైన పుట్టదంటారు. ఆయన ఆజ్ఞమేరకే ఇల్లు, వాకిలి, వాహనం అన్ని. దేవుడే లేకుంటే ఇవన్నీ రావు కదా అన్నది ఆస్తికులు చెప్పేది. కాని దేవుడు ఎక్కడినుంచి వచ్చాడు అనేది నాస్తికుల ప్రశ్న.

"ఎడ్లు లేని సేద్యమిప్పుడు కల్చర్..
ట్రాక్టర్లు, హార్వెస్టర్లదే అగ్రికల్చర్!"

(మల్లేశం, చిల్ల. 2014: 15)

మానవ జీవితాన్ని, గమనాన్ని మలుపు తిప్పింది ప్రపంచీకరణ. వృత్తుల్ని విధ్వంసం చేసి, కుటీర పరిశ్రమల్ని కూలదోసి పల్లెల్ని పరాయీకరణ చేసింది. అప్పటిదాకా ఆనందంగ బతికిన జీవితాలు ఒక్కసారిగా దుఃఖంలోకి జారిపోయాయి. ఏండ్ల నుంచి కొనసాగుతూ వస్తున్న జీవన విధానం పొట్టనింపనిదయ్యింది. ప్రపంచీకరణను తెలుగు రాష్ట్రాలలో ప్రవేశపెట్టినవాళ్లు దానికి బలైన జీవితాలకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపలేకపోయారు. దానివల్ల ఎన్నో బతుకులు బుగ్గిపాలయ్యాయి. ఎన్నో కుటుంబాలు రోడ్డు మీద పడ్డాయి. పడుతూనే ఉన్నాయి.

"అందంగా
తోకాడించే
కుక్కపిల్ల లాంటిది
కాదు
కుట్టిన
ఎర్రతేలు
మంటలాంటిది
ఆకలి"

(తిరుమలరావు, జయధీర్ (సంపా.). 2013: 188)

ఆకలి సర్వమానవులకు సహజమైన గుణం. ఆ ఆకలి తత్త్వాన్ని వివరించేదే ఈ కవిత. అణిగిమణిగి ఉండే కుక్క తోకలాంటింది కాదు ఆకలి ఎర్రతేలు కుట్టిన మంటలాంటిది అనడంలోనే ఆకలి తీవ్రత అర్థమవుతుంది. "కవిత్వం భారీ కాయంతో సంస్కృతపద భూయిష్టం, సంక్లిష్ట భావార్థం, సర్కస్ ఫీటుతత్వం వంటి వాటిని నిరాకరించి సులభంగా అర్థమయ్యే తెలుగు పదాలు, స్పష్టంగా గుండెని చేరే ఇన్‌స్టంట్ భావాలు, జీవితంతో

అనుబంధించే ఘర్షణంతా అతని కవితల్లో చేరాయి" (తిరుమలరావు, జయధీర్ (సంపా.). 2013: xi) అన్న మాటలు అలిశెట్టి కవిత్వతత్వాన్ని వివరిస్తాయి. అతి సామాన్య ఉపమానాలతోనే చెప్పదలుచుకున్న విషయాన్ని అత్యద్భుతంగా ఆవిష్కరించడం అలిశెట్టి కవితల గొప్పతనం.

"కనిపించని మీ దేవుడే రౌతు..
కష్టించే మా దేవుడే రైతు!"

(మల్లేశం, చిల్ల. 2014: 59)

దేవుడి గురించి ఇలాంటి వాఖ్యానం చెయ్యడం ధైర్యంతో కూడుకున్న పని. ఎందుకంటే సమాజంలో దేవుడు, దేవుడి పాత్ర నమ్మకంతో కూడుకున్న విషయం. దేవుడిపై చేసే విమర్శ దేవుణ్ణి నమ్ముకున్న ప్రజల కోపాలకు దారి తీస్తుంది. దేవుడు కనిపించడని అందరికి తెలిసిన విషయాన్నే మనం చెబితే పిచ్చివాణ్ణి చూసినట్టు చూస్తారు. అందుకే కవి కనిపించని మీ దేవుడు రాయి మాత్రమే. సమాజంలో మంచి చేసిన వాళ్ళను దేవుడు అని అనడం సహజం. అంటే మంచి చేసేవాడు దేవుడైతే మనకి ఆరుగాలం కష్టపడి అన్నం అందించే రైతే దేవుడు.

"లేనివాడు తిండికై ఫైటింగ్
ఉన్నవాడు
ఎక్కువై
డైటింగ్"

(విప్లవ్‌దత్ శుక్లా. 1996: 4)

సమాజంలో ఉన్నవాడికి తిండి ఎక్కువైతే, పేదవాడికి అసలు తినడానికి తిండే లేని పరిస్థితి. ఒక్కపూట తిండికోసం పేదవాడు రోజంతా ఎంతో శ్రమిస్తున్నాడు. కాని ధనవంతుడు తిన్నది అరగక డైటింగ్ చేయడం సమాజంలోని అసమానతకి అద్దం పడుతుంది.

"శ్రమను నమ్ముకుంటే బానిసత్వం
అమ్ముకొనుటేనట విజయసూత్రం"

(మల్లేశం, చిల్ల. 2014: 42)

ప్రస్తుత సమాజ పరిస్థితికి చక్కగా సరిపోయే కవిత. కష్టపడ్డ రైతుకు మన్ను మిగులుతుంది. రాత్రనక, పగలనక కష్టపడ్డవాళ్ళు ఆ కష్టంలోనే ఉంటున్నారు. అదే ఆ

కష్టాన్ని అమ్ముకుంటున్న దళారులకు మనీ మిగులుతుంది. ఎండనక వాననక శ్రమించేవాళ్ళు పూరి గుడిసెళ్ళోనే బతుకీడుస్తున్నారు. ఈ మధ్యస్థులు మాత్రం ఖరీదైన మిద్దెల్లో, మేడల్లో ఉంటున్నారు. ఇది మన భారతదేశ దౌర్భాగ్య పరిస్థితి. పొట్టనింపేవాళ్ళకంటే పొట్టకొట్టేవాళ్ళకే గౌరవం, ప్రాధాన్యత.

"వెదికిన దొరకనిది లేదు
కోరిన తీరనిది లేదు
వెదుకుటయే 'వేదాంతం'
కోరుటయే 'జీవితం'

(బాపురెడ్డి, జె. 2010: 25)

వెతికితే దొరకని లేదనే మాట నిత్యవ్యవహారంలోనిది. ఏదైన వస్తువు కనబడకపోతే ఎదుటివాళ్ళు 'వెతకరా వెతికితే దొరకనిదంటూ లేదు' అని అంటుంటారు. దీన్నే వేదాంతానికి అన్వయించుకుంటె వెదుకుటే వేదాంతం కదా. ఇక్కడ ఈ రెండింటికి చక్కగా అన్వయించారు కవి. కోరికలుండాలి వాటిని ప్రయత్నించి సాధించుకోవాలి. కోరికలు జీవితంలో సహజం. కనుక కోరుకోవడమే జీవితం.

"కలం పట్టుకున్న చేయి
కాలానికి దారి చూపిస్తుంది
హలం పట్టుకున్న చేయి
మట్టికి ప్రాణం పోస్తుంది"

(బాపురెడ్డి, జె. 2010: 36)

ఈ కవితలో కవికి, కర్షకుడికి నిర్వచనమిచ్చే ప్రయత్నం చేశారు. కవి, కర్షకుడి ఇద్దరు సమానులే. కవి కలం పట్టుకుని అక్షరాల్ని పండిస్తాడు. కర్షకుడు హలం పట్టుకుని ధాన్యాన్ని పండిస్తాడు. ఈ విషయంలో కవికి, కర్షకుడి సామ్యత కనిపిస్తుంది. మట్టికి ప్రాణం పొయ్యడమంటే మట్టిని తెల్లటి మెతుకులుగా మార్చడం.

"తురుష్కుడు అల్లా అంటే
హిందువుడు రాం
ఈ సంగతి చూస్తుంటే

ఇది యుద్ధానికి
అలారం”

(విప్లవ్‌దత్ శుక్లా. 1996: 1)

అల్లా అయినా, రాముడైనా, జీసస్ అయినా అందరూ ఒక్కటే అనుకుంటే మత కొట్లాటలు ఉండవు. మనుషులంతా సోదరుల్లా కలిసిమెలిసి హాయిగా, ఆనందగా జీవనం సాగించవచ్చు. అలా కాక మా దేవుడు గొప్ప అంటే మా దేవుడు గొప్ప, మా మతం గొప్పంటే మా మతం గొప్ప అన్న అహంకారంలో రక్తపాతం తప్ప శాంతి ఉండదు.

“సంహరణం కాదు
చేయవలసింది సంస్కరణం
మరణం కాదు కావలసింది
మార్పు”

(బాపురెడ్డి, జె. 2010: 43)

‘హితేన సహితం సాహిత్యం’ అన్న ఆర్యోక్తి ప్రకారం సాహిత్యం ఉపదేశాత్మకంగ ఉండాలి. పై కవితలో అది గమనించవచ్చు. సమాజ హితాన్ని కోరేవాడు కవి. కనుక సంహరణాన్ని మాని సంస్కరణకు పూనుకొమ్మని నాయకులకు హితోపదేశం చేస్తున్నారు. అలాగే ప్రజలకు మరణించడం నీలో మార్పు తెచ్చుకోమనే నీతిబోధ చేస్తున్నారు. చిన్నదానికి, పెద్దదానికి చనిపోయేవాళ్ళు చాలా మంది ఉన్నారు సమాజంలో. పరీక్ష ఉత్తీర్ణత కాలేమో అని, నాన్న డబ్బులు ఇవ్వలేదని, ఫోన్ కొనియ్యలేదని ఇలా చిన్న విషయాలకు మరణించేవాళ్ళు ఉన్నారు. అలాంటి వాళ్ళకు ధైర్యమిచ్చే టానిక్‌ల ఉపయోగపడుతుంది ఈ కవిత.

### 5.2.12. నానీలు

తెలుగు సాహిత్యంలో నానీల సృష్టికర్త ఎన్. గోపిగారు. నావీ, నీవీ కలిసి నానీలుగా మారాయి. నానీలంటే చిన్నపిల్లలని కూడా అర్థముంది. నానీలు నాలుగు పాదాల్లో ఉంటాయి. 20 – 25 అక్షరాల నిడివి కలిగి ఉంటాయి. “20 నుండి 25 అక్షరాల నియమంతో, 4 పాదాలతో గోపి ఏర్పర్చిన కొద్దిపాటి నియమం వెనుక వెసులుబాటు ఉంది. రూప సంక్షిప్తత అనే ఆశయం ఉంది. కట్టుబాటులో స్వేచ్ఛ, స్వేచ్ఛలో కట్టుబాటు ఉంది. దేశీయ ఛందస్సులిలాంటివే. అటు అక్షర సమత, ఇటు మాత్రాసమతకు దేశీ ఛందస్సు మధ్యే మార్గం.

యతి, ప్రాసల విషయంలో స్వేచ్ఛ ప్రాస, యతిరూపం(ప్రాసయతి)లో ఉంది. వీటి విషయంగా ఐచ్ఛికత ఉంది. అదే భావన గోపీ నానీ సృష్టికి కారణమైందని ఆయన పీఠికలు, ఇంటర్వ్యూలు చెప్పాయి. ఇది దేశీయమైనదన్నారు గోపి. గణబంధాల, మాత్రల బంధాలు, దేశఛందో గణ నియమాలు లేక ఇది వచన కవిత్వమే. వచన కవిత్వం రూపంలోని విస్తృత రూపానికి సంక్షిప్తరూపం. చిన్నభావం, అనతికాలిక గానం, అత్యల్ప సంవిదానం, ముక్తకం, కంఠస్థ యోగ్యం నానీకి మరి కొన్ని లక్షణాలు" (రఘు, ఎస్(సంపా). 2006: 11) అన్న సంగనభట్ల నరసయ్య మాటలు నానీల ఆవిర్భావానికి దేశీయ ఛందస్సులో గల మూలాలను నానీలకు, దేశీయ ఛందస్సులకు సారూప్యాలను, నానీల లక్షణాలను వివరిస్తున్నాయి. మొదటి రెండు పాదాలు ఒక భావార్థంగానూ, మిగిలిన రెండు పాదాలు దానికి కొనసాగింపుగానూ లేదా కొత్త భావార్థంగానూ ఉండవచ్చు. కరీంనగర్ జిల్లా కవిత్వంలో నానీల ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఎక్కువే. చాలా మంది కవులు ఈ కొత్త సాహిత్య రూపానికి ఆకర్షణకు లోనై విరివిగా నానీలను రాశారు, రాస్తున్నారు. వీరిలో చెప్పుకోదగ్గవారు అన్నవరం దేవేందర్, బూర్ల వెంకటేశ్వర్లు, కన్నోజు లక్ష్మీనారాయణ, మాడిశెట్టి గోపాల్, సబ్బని లక్ష్మినారాయణ, కొలిపాక శోభారాణి, దాస్యం సేనాధిపతి, దాస్యం లక్ష్మయ్య, నలిమెల భాస్కర్ మొదలైనవారు.

"నెలకోసారి నెట్‌లకు
వచ్చే కొడుకు / తల కొరివి
వెబ్‌లో పెడతాడట!"

(సునీత, సి.హెచ్. 2014: 12)

మనుషుల మధ్య దూరమవుతున్న అనురాగాలు. ఎక్కడో ఉద్యోగంలో క్షణం తీరికలేని జీవితంలో మనషులు కలుసుకోవడం, మాట్లాడుకోవడం ఇప్పుడంతా నెట్‌లోనే. అందుకే నెలకోసారి నెట్‌లోకి వచ్చే కొడుకు. చివరికి తల్లిదండ్రులు చనిపోయిన కూడా వారికి తలకొరివి పెట్టడానికి రాని జీవితం. అందుకే తలకొరివి కూడా వెబ్‌లో పెడతాడట అని అనడం మనుషుల మధ్య అనుబంధాలు ఎలాంటి దీనమైన స్థితిలోకి జారిపోయాయో అర్థమవుతుంది. ఇంకా కొంతమందైతే కన్నవాళ్ళను పోషించడం వ్యర్థమని ఇంట్లోనుంచి తరిమేస్తున్నవాళ్ళున్నారు. ఇంకొంతమంది వేరే కాపురం పెట్టేసి నెల నెల కొంత డబ్బిచ్చేవాళ్ళున్నారు.

"గుండె తడికి సంకేతం
కన్నీళ్లేనా?
మౌన ప్రవాహాల్ని
అడగాలి"

(వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 42)

గుండెల్లో బాధ ఉన్నప్పుడు ఏడుస్తాం. గుండెలోని బాధకి సంకేతం కేవలం కన్నీళ్లేనా? అని అనడంలో కాదు అనే అర్థం దాగుంది. బాధ ఉన్నప్పుడు మౌనంగ కూడా ఉంటాం. కనుక మౌనం కూడా బాధకు మరో చిహ్నం.

"ముంబాయిలో
గజానికో వింత
అడుగడుగునా / జీవితమే ఓ సంత !"

(రవీంద్ర, సంగెవేని. 2006: 66)

ఎత్తైన కట్టడాలు, అందమైన భవనాలు, పాశ్చాత్య సంప్రదాయం, ప్రసిద్ధ ప్రదేశాలతో ముంబాయి విస్మయాన్ని కలిగించే నగరం. కాని మారుతున్న సమాజం, కనుమరుగవుతున్న మనసుతనంలో జీవితం ఒక సంత. సంతలో అనేక వస్తువులు కనిపిస్తుంటాయి. అలాగే జీవితంలో కూడా అనేక అనుభవాలుంటాయి.

"నమ్ముకున్న కులకశ్పి
నట్టేట ముంచింది
రాట్నం, మొగ్గం
అటుకెక్కినయి"

(మోహన్, పత్తిపాక. 2009: 14)

ప్రపంచీకరణ ప్రభావం ముఖ్యంగా పల్లెల్లోని వృత్తుల మీద పడింది. ఒక్క చేనేతనే కాక సకల వృత్తులు మృత్తిలో కలిసిపోయాయి. ప్రపంచానికి ఒంటికి బట్టనిచ్చిన చేనేతకు చేయూత చేకుండా పోయింది. ఇటు ప్రభుత్వం, అటు కంపెనీలు ఆదుకోకపోవడంతో కనీసం తిండికి లేక చాలా మంది ఆత్మహత్య చేసుకున్నారు, చేసుకుంటున్నారు. అందుకే 'రోజుకో శవయాత్ర చూడాలంటే సిరిసిల్లకు రండి' అని కవి అనడంలో ఎంతటి దుర్భర దుస్థితుందో తెలుస్తుంది.

"కాలానికి
పురుటి నొప్పులు!
తెలంగాణ బిడ్డ
ఉదయించడానికి!"

(లక్ష్మినారాయణ, సబ్బని. 2011: 34)

అరవై సంవత్సరాల వివక్షను, దోపిడిని, అన్యాయాన్ని అంతం చేసేందుకు స్వరాష్ట్రం, స్వపాలన, స్వభాష అనే అస్తిత్వం ప్రధానంగా వచ్చిన ఉద్యమమే తెలంగాణ ఉద్యమం. వేల అమరుల ప్రాణత్యాగం, కోట్లాది మంది ప్రజల పోరాటం చేశారు. అందుకే కాలానికి పురిటినొప్పులు ఎందుకంటే తెలంగాణ బిడ్డని కనడానికి. గొప్ప భావన ఈ నానీలో కనబడుతుంది. కాలానికి పురిటినొప్పులు రావడం అన్న ఆలోచన అత్యద్భుతం.

### 5.2.13. హైకూలు

జపాన్ భాషనుండి తెలుగు సాహిత్యంలోకి వచ్చిన కొత్త కవితా రూపం హైకూ. మూడు పాదాలుగల చిన్న కవిత. ఒకటి, మూడు పాదాల్లో ఐదు అక్షరాలు, రెండవ పాదంలో ఏడు అక్షరాలు ఉండడం హైకూ కవితా లక్షణం. హైకూకు మూలమైన 'రెంగ' మరియు 'హైకై' అనే గొలుసు పద్యాలు జపాన్ సాహిత్య చరిత్రలో వందలఏళ్ళ చరిత్ర కలిగి ఉండడం మనం గమనించవచ్చు. "హైకు మూడు మాత్రల పదం "ha-i-ku". జపాన్ భాషాపదమైన 'హైకై' నుండి వచ్చింది. 'హైకై' అనగా వ్యుత్పత్తి అర్థంలో సరదా అని. ఎలాంటి సరదా అంటే అది కవిత్వపు సొబగులను అందిపుచ్చుకుంది. 'హైకై'కు మూలమైన 'హైకై రెంగ' అనే పద్యశైలిని మొదటగా 'యమజకి సోకన్' (1465-1553) మరియు 'అరకిడ మొరిటెక్' అనే ఇద్దరు కవులు ప్రధానంగా హాస్య, చమత్కార వైశిష్ట్యంతో సాహితీలోకానికి అందించారు" (రూప్‌కుమార్, డబ్బీకార్. 2009: 17 – 18). జపాన్ భాషలో మొదటగా హాస్యం, చమత్కారంతో ప్రారంభమైన హైకై తర్వాత్తర్వాతి కాలంలో ఆలోచన, అనుభూతి, ప్రకృతి మొదలైన భిన్న భిన్న రకాలుగా జపాన్ ప్రజల జీవితంలో స్థిరపడిపోయింది. "తాదాత్మ్య స్థితిలో కవికి ఆశ్చర్యాన్నో, ఆనందాన్నో, విషాదాన్నో, సున్నితమైన సంవేదననో కలిగించిన దృశ్యానికి లేదా దృశ్య శకలానికి బౌద్ధికమైన వివేచన లేకుండా యథాతథంగా ఇవ్వబడిన అక్షర రూపమే 'హైకూ'. తాదాత్మ్యం మూలంగా ఉక్తివైచిత్రి చేకూరుతుంది; క్లుప్తత, గుప్తతలు

సమకూరుతాయి" (శివరామకృష్ణ, పెన్నా. 2005: 39). హైకూ గురించి మొదటగా దువ్వూరి రామిరెడ్డి 1923లో 'మర్మ కవిత్వము' అనే వ్యాసంలో ప్రస్తావించారు. మొట్టమొదట స్వంత హైకూలను రాసింది గాలి వాసరరెడ్డి. ఈయన హైకూలు 1990లో దినపత్రికల్లో అచ్చైనవి.

పద్యం గేయంగా మారింది. ఈ దశలో గేయ రచనలన్నింటిలోనూ పద్య లక్షణాలే ఉన్నాయన్నారు విమర్శకులు. గేయం వచనం కవిత్వంగా మారుతున్న కాలంలో వచన కవిత్వం నిండా గేయలక్షణాలే ఉన్నాయని పరిశోధకులు నిరూపించగలిగారు. వచన కవిత్వం Free Verse libre గా గుర్తింపు పొందింది. ప్రక్రియా గౌరవాన్ని సంపాదించుకుంది. అయితే వచన కవిత లక్షణ నియతి లేదు కనుక రూపంలో పటిష్టత లేని చోట పేలవంగా కనబడింది. అలా వచన కవిత్వం రూపపరంగా బలహీనమవుతున్న దశలో దిగంబర కవులు వచన కవిత్వ రూపాన్ని అనూహ్యంగా మార్చివేశారు. విప్లవ కవులు కూడా వచన కవిత్వానికి దృక్పథాన్ని జోడించారు. కానీ, రూపపరమైన మార్పు తీసుకురాలేకపోయారు. ఈ నేపథ్యంలో 'హైకూ' అనే జపాన్ సంప్రదాయ కవితా రూపం ఒకటి తెలుగు సాహిత్యంలో వేళ్ళూనుకుంది. కవిత్వం వచనమై పేలవంగా మారుతున్న ప్రతి సందర్భంలో ఒక కొత్త కవితా రూపం ఆవిర్భవించింది. మినీ కవితైనా, ఇటు హైకూ అయిన. దిగంబర కవులు వచన కవిత్వాన్ని చక్కదిద్దే ప్రయత్నం చేస్తే, విప్లవకవులు వచన కవిత్వానికి దిశా నిర్దేశం చేశారు. వాళ్ళు వస్తువును, భాషను, దృక్పథాన్ని పట్టించుకున్నంత కొత్త కవితా రూపం విషయంలో పట్టించుకోలేదు.

తెలుగు కవిత్వంలో హైకూలు గాలి వాసరరెడ్డితో ప్రారంభమై తెలుగు కవిత్వ పుష్టికి దోహదం చెయ్యడంలో తనవంతు పాత్రను నిర్వహించాయి. గాలి వాసరరెడ్డి, ఇస్మాయిల్, పెన్నా శివరామకృష్ణ, బి.వి.వి. ప్రసాద్, లలితానంద్ మొదలైన వారంతా హైకూలు రాసి పుస్తకాలు ప్రచురించారు. యాంత్రిక జీవనం, సినిమాల ప్రభావం, దీర్ఘ కవితలను చదవలేనితనం మొదలైన కారణాల వల్ల హైకూ వచ్చి పాఠకులకు ఆనందాన్ని కలిగించింది.

"తీగల ముగ్గులేక
వాకిలి బెంగటీలింది
నిన్న చెల్లె పెళ్లైంది"

(మోహన్, పత్తిపాక. 1999: 6)

వాకిలి బాధపడింది. ఎందుకంటే ముగ్గులేక. ముగ్గు ఎందుకు వేయలేదంటే ఆ ఇంటి ఆడపిల్ల పెళ్ళై వెళ్ళిపోయింది కనుక. ఆడపిల్లని ఇంటి లక్ష్మి అని అంటారు. అలాంటి ఆడపిల్ల పెళ్ళై వెళ్ళిపోయాక ఆ ఇంటి వాకిలితో పాటు, వాళ్ళ మనసులు కూడా బాధపడ్డాయి.

భూమి ఆకాశం
మావూరి కొత్త చెరువు అద్దం ముందు
ఒకటయ్యాయి"

(పైదే: 12)

పల్లె జీవితం నేపథ్యంగల కవి గనుక ఆ పల్లెలో కనిపించే అందమైన దృశ్యాల్ని అక్షరాలు చేశారు. వానలు పడ్డాక చెరువులోకి కొత్త నీరు వస్తుంది. అప్పుడు ఆ దృశ్యం అందగా ఉంటుంది. నిండిన చెరువు ఒక అద్దం. ఆ అద్దంలో చూస్తే భూమి, ఆకాశం కలిసినట్టుగా అనిపిస్తుంది.

"కాలం సిగలో
తెలంగాణ పువ్వు
పూస్తుంది"

(లక్ష్మీనారాయణ, సబ్బని. 2011: 11)

'కవయః క్రాంత దర్శినః' అన్నారు మన అలంకారికులు. రేపు ఏం జరగబోతుందో ముందగానే కవికి తెలిసిపోతుంది. అందుకే తెలంగాణ వస్తుంది అని భవిష్యత్తును ముందే చెబుతున్నారు. కవి చెప్పినట్టుగానే సుదీర్ఘ పోరాటం తర్వాత కాలం సిగలో అందంగా తెలంగాణ పువ్వు పూసింది.

"గుండె పుస్తకంలో
దాచుకున్న నెమలి ఈక
నువ్వు నేనూ బడి ఇరిగిన కిటికీ"

(మోహన్, పత్తిపాక. 1999: 21)

బాల్యం మధురమైన జ్ఞాపకం. బాల్యంలో చేసిన అల్లర్లు, గొడవలు, ఆడుకున్న ఆటలు, పాడుకున్న పాటలు తలుచుకున్నప్పుడల్ల మనసును గిలిగింతలు పెడతాయి. ఈనాడు బాల్యం బడి చదువులో బరువైపోతున్న తరుణంలో ఒకప్పటి బాల్యపు గుర్తుల్ని మననం చేసుకొని బాల్యమంటే అది అన్న స్పృహని లోకానికి కలగజేయడం కవి కర్తవ్యం. ఎందుకంటే కవి

సమాజాన్ని ఆనందంగా, అందంగా చూడాలనుకోవాలి. అందుకే కవి ఇక్కడ అదే పని చేశారు. పుస్తకాల్లో నెమలీకలు దాచుకోవడం, దేశీయమైన ఆటలాడుకోవడం, పాటలు పాడుకోవడం నేడు చాలా అరుదైన విషయాలు. చదువు చదువని బడిలోనో, ఇంట్లో హోంవర్క్‌తోనో బాల్యం గడిచిపోతుంది. కొంచెం సయం దొరికితే ఫోన్‌లో ఆటలాడుకోవడం, యూట్యూబ్‌లో రైమ్స్ వినడంతోనే సరిపోతుంది తప్ప పిల్లలందరు కలిసి ఆడుకోవడం, పాడుకోవడం కనుమరుగవుతోంది. అందుకే ఒకప్పటి బాల్యం ఇప్పటి తరానికి అమూల్యం.

"పల్లెలు
నోళ్ళు విప్పుతూ
తెలంగాణ పాట"

(లక్ష్మీనారాయణ, సబ్బని. 2011: 22)

ప్రజల్ని చైతన్యపర్చి గమ్యంవైపు నడిపించే ధైర్యాన్ని అందించేది పాట. తెలంగాణోద్యమంలో పాట క్రియాశీలకమైన పాత్ర పోషించింది. గద్దర్, గోరటి వెంకన్న, అందెశ్రీ, గూడ అంజయ్య, జయరాజ్, మిట్టపల్లి సురేందర్ లాంటి ఎందరో రచయితలు తమ పాటలతో తెలంగాణ అంతటా ఉత్తేజం నింపారు.

"నిప్పు పూల వనంవోలె
కుప్ప పోసిన క్రాంతివోలె
తెలంగాణ ధూం! ధాం!"

(లక్ష్మీనారాయణ, సబ్బని. 2011: 23)

'ఛలో ధూంధాం తెలంగాణ జాతరొచ్చెరా' అంటూ తెలంగాణోద్యమంలో బాగా ఆకట్టుకున్న కళా రూపం ధూంధాం. తెలంగాణ ఉద్యమం నడిచిన ప్రతిరోజు ఎక్కడో ఒక్కచోట ధూంధాం కచ్చితంగా ఉండేది. ఆట పాటలతో కూడుకున్న ఈ కళారూపంవల్ల ఎంతోమంది కళాకారులు తమ ప్రతిభను నిరూపించుకున్నారు.

"లంచగాళ్ళను
పట్టిన్రు వదిలిన్రు
లంచాలు తిని"

(మలయశ్రీ. 2011: 30)

లంచాలు తీసుకునే అధికారులకు కొరడాదెబ్బలాంటిది ఈ హైకూ. లంచాలు తీసుకునేవాళ్ళను పట్టుకునే అధికారులే లంచాలు తీసుకొని వాళ్ళను వదిలిపెట్టడం అవినీతికి పరాకాష్ట.

### 5.2.14. పేరడీ

పేరడీ ఒక సారస్వత ప్రక్రియ. ముఖ్యంగా వినోద క్రీడ. ఒక పరిహాస దృష్టితో, ఒక కొంటె కోణంగితనంతో రచయిత హావభావ విన్యాసాలను, ఊతపదాలను ఒక అనుదాత్త వస్తువు నాలంబనగా చేసుకొని వాటిని అతిశయింప చేసి ప్రదర్శిస్తు 'పనిగట్టుకొని' అనుకరిస్తే 'పేరడీ అవుతుంది" (లక్ష్మినారాయణ, సబ్బని. 2001: i) అన్న ప్రొఫెసర్ వెలుదండ నిత్యానందరావు గారి మాటలవల్ల పేరడీ అంటే ఏమిటో తెలుస్తుంది. ప్రసిద్ధి చెందిన పాటలనుగానీ, పద్యాలనుగానీ, కవితలనుగానీ తీసుకొని వాటిని హాస్యాత్మకంగ చిత్రించేది పేరడీ. జరుక్ శాస్త్రి, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, కాట్రగడ్డ మొదలైనవారు పేరడీలు రాశారు. ఈ పేరడీలు హాస్యానికే కాక సందేశాత్మకంగానూ, ప్రశ్నాత్మకంగానూ, దెప్పిపొడుపుకు కూడా వాడుకోవచ్చు. సబ్బని లక్ష్మినారాయణగారు మనప్రస్థానంలో పేరడీని కేవలం హాస్యంకోసం కాక వ్యంగ్యంకోసం వాడుకున్నారు.

"ఆడపిల్లా
బోగస్ విల్లా
రమణ షోకిల్లా
కాదని చూడకు దేన్ని
నవలామయమేనోయ్ అన్ని
పత్రిక ప్రపంచమొక గారడీ లోకం
నవల ఒక అగాధం"

(లక్ష్మినారాయణ, సబ్బని. 2001: 4)

శ్రీశ్రీ ఋక్కులులోని 'కుక్కపిల్ల అగ్గిపుల్ల సబ్బుబిల్ల' అన్న కవితకు ఇది పేరడీ. ఒకానొక కాలంలో వచ్చిన వ్యాపారాత్మక నవలను దెప్పిపొడుస్తూ రాసిన పేరడీ ఇది. వ్యాపారాత్మక నవలలకు కేవలం వ్యాపార దృష్టితోనే తప్ప సాహిత్యాన్ని సుసంపన్నం

చేయాలని ఉండదు. ఎన్ని నవలలు అమ్ముడుపోయాయా అని తప్ప ఎంతగా సాహిత్యంలో స్థానాన్ని సంపాదించుకుంది అని అవసరం ఉండదు.

“రచయితలకలం విషజ్వాల పోయంగ
నవలమణులు నవలాకుసుమాలల్లంగ
పత్రిక సారథుల తోవలే చూపంగ / మోహరాగం జ్వలించగ
నలుదిక్కుల నవల తేజమ్ములలరగ
అందాల పరవళ్ళు పత్రికల్లో నిలువ
పాఠకుల నూగింప పత్రికలు వెలయ
చీకటి లోకం చూప కలం సైయన లేవ
నడుస్తున్నదీ నవ్యలోకమ్ము తమ్మి!
కనిపించె నీ దివ్యలోకమ్ము చెల్లి!”

(పైదే: 33 – 34)

ఇది రాయప్రోలు సుబ్బారావు గారి ‘ఏ దేశమేగిన ఎందుకాలిడిన’ పద్యానికి పేరడీ. ఈ పేరడీలో కూడా వ్యాపారాత్మక నవలనే వస్తువు.

“నాకొ్కంచం అవకాశమివ్వు
మేధస్సుకు పదును పెట్టేస్తాను
కుళ్ళిపేరుకుపోయిన కుసంస్కృతిని
మురికి పట్టి పారుతున్న చెత్త రాతల్ని
సాహితీలోకం నుండి నెట్టేస్తాను
ఈ విశాల సాహితీ ప్రపంచాన్ని
గుక్కెడుగా ఆపోశన పట్టేస్తాను
నిస్సహాయ పాఠకుడి తలరాత
ఒక్క కలం పోటుతో మార్చేస్తాను”

(లక్ష్మినారాయణ, సబ్బని. 2001: 33 – 34)

కవికి ఒక్క అవకాశమిస్తే చెత్త రాతల్ని, పనికిరాని మాటల్ని సాహితీలోకం నుంది పారద్రోలుతానని అంటున్నాడు. పాఠకుల నిస్సహాయ స్థితిని ఒక్క కలం పోటుతో మార్చేస్తానంటున్నాడు.

### 5.2.15. ఫీచర్ కవిత

ఆధునిక కవిత్వంలో మరో రూపం ఫీచర్ కవిత్వం. "ప్రతి రోజూ పత్రికలలోని ఒక నిర్ధిష్టమైన గడి(Colum)లో ఏదో ఒక సంఘటన పైనో సరళంగా, సంక్షిప్తంగా స్వయం సంపూర్ణంగా వెలువడిన కవితను 'ఫీచర్ కవిత' అనవచ్చు" (వెంకటేశ్వర్లు, జి. 1995: 05). ఈ కవిత్వం మినీ కవితకు దగ్గరగా ఉంటుంది. దీని ప్రత్యేకత ఏమిటంటే ప్రతిరోజు పత్రికల్లో వచ్చే రన్నింగ్ కాంమెంట్రీ. దీంట్లో హాస్యం, వ్యంగ్యం, అధిక్షేపం, విమర్శ మొదలైనవి కనిపిస్తున్నా సంఘసంస్కరణ ఈ కవితకి ముఖ్యం.

కరీంనగర్ జిల్లాలో ఈ కవిత్వానికి ఆద్యుడు అలిశెట్టి ప్రభాకర్. 1985, సెప్టెంబర్ 1న ఆంధ్రజ్యోతి దినపత్రికలో అలిశెట్టి కొరకు ఆ పత్రిక సంపాదకులైన ఏ.బి.కె. ప్రసాద్ గారు 'సిటీలైఫ్' అని ఒక కాలమ్‌ని ప్రారంభించారు. అది ఇంతింతై వటుడింతై అన్నట్టు విశేషమైన ప్రాచుర్యం పొందింది. 1993, జనవరి 5 వరకు ఆరేళ్ళపాటు ధారాళంగా వచ్చింది. 1500లకు పైగా ఫీచర్ కవితలు రావడం విశేషం. వీటిలో మంచివన్నిటిని ఏరి 1990లో 'సిటిలైఫ్' అనే పేరుతో పుస్తకం తీసుకువచ్చారు అలిశెట్టి ప్రభాకర్.

"సిటీ లైఫే నా సమగ్ర కవితా స్వరూపానికి కొలబద్దా కాదు. సుదీర్ఘ కవితా ప్రకంపనా కాదు... కానీ ధ్వంసమై పోతున్న సమస్త మానవ విలువల్నీ, హింసా రాజకీయాల్ని నిరసించడంతోపాటు నిప్పు కణికల్లాంటి, కన్నీటి గుళికలు. ప్రతిరోజు ఆంధ్రజ్యోతి పాఠకులకు అందించే చిన్న చిన్న కవితలు" (తిరుమలరావు, జయధీర్(సంపా.) 2013: 133) అని అలిశెట్టి ప్రభాకర్ గారు తన చిన్ని కవితల గురించి చెప్పుకున్నారు. మనిషిని, మానవ విలువల్ని పునర్జీవింపజేవడం, హింసా రాజకీయ నిరసన ఈ కవితల్లో కనిపించే ముఖ్య లక్షణాలు.

"జీవితాంతం
వొంటిమీద
నూలు పోగు లేకుండా
కల్లుగీసేవాడూ
నేత నేసేవాడే

మన నేతాజీ కలలుగన్న
మరో ప్రపంచం....!"

(తిరుమలరావు, జయధీర్(సంపా.). 2013: 146 – 147)

కల్లుగీసేవాళ్లు, నేతనేసేవాళ్లు తమ జీవితాంతం బట్టలు వేసుకొని నిజస్థితిని కవి చెబుతున్నాడు. బట్టలునేసేవారికే ఒంటిమీద బట్ట కరువవ్వడం ప్రపంచీకరణ ప్రభావం. అందుకే నూలుపోగుకు ఉరేసుకొని చచ్చిపోతున్నారు.

"ఎవరూ ఎత్తని
మోయని
రూపాయి పాడె మీద
నిరంతరం
ఊరేగుతున్న శవమే
సగటు మనిషి"

(తిరుమలరావు, జయధీర్ (సంపా.). 2013: 165)

సగటు మనిషి జీవితాన్ని ఇంత చిన్న కవితలో ఒదిగించడం అత్యద్భుతం. చావలేక బతకలేక మధ్యన కష్టాలతో జీవించేవాడు సగటు మనిషి. ఎప్పుడైతే రూపాయి వచ్చి మనిషిని వస్తువుగా మార్చేసిందో అప్పటినుంచి సగటు మనిషి జీవితం మరింత పతనమైంది. అందుకే రూపాయి పాడెమీద ఊరేగే శవం అనడం ఈ పరిస్థితికి దర్పణం.

వారాల ఆనంద్ గారు 'మానేరు టైమ్స్' పేరుతో వారం వారం రాసిన ఫీచర్ రచనల్లోంచి ఉత్తమమైనవాటిని తీసుకొని 1998లో 'మానేరు తీరం' పేరుతో పుస్తకం ప్రచురించారు.

"జీవిత గమ్యం మరింత స్పష్టమవుతుంది
కళ్లు తెరిచి చూడమంటున్నాను
మూగవాడా!! మాటలు నేర్చుకోమంటున్నాను
స్తబ్దుడా చలనాన్ని శ్వాసించమంటున్నాను
మానవుడా!! సమాజాన్ని అర్థం చేసుకోమంటున్నాను"

(ఆనంద్, వారాల. 1998: 6)

క్షణక్షణం రణరంగమైన ఈ జీవితాన్ని గెలవాలంటే మనిషికి కావల్సింది ధైర్యం. కవి మనిషికి ధైర్యం చెబుతున్నాడు.

## 5.2.16. హాజిర్ హై

హాజిర్ హై జింబో సృష్టించిన కవిత్వ నాటకం. కవిత్వంలో దీర్ఘకవితలు, కావ్యాలు రాసినవారున్నారు. కాని ఇలా నాటకాన్ని రాసినవాళ్ళలో కుందుర్తి ఆంజనేయులు గారు మాత్రమే కనిపిస్తారు. ఆయన 'ఆశ' అని కవిత్వ నాటకాన్ని రాశారు. "హాజిర్ హై జింబో సృష్టి – ఒక నాటకము. రంగస్థలం 'ఆ గది'. ఆ గదిలో వెనుక అహింసా మూర్తి నవ్వుతూ – ఆ గదిలో ఒక కుర్చీ, కుర్చీ మీద మూడు తలల రాజసింహం. వెనుక దూడూ బసవన్నలా తలాడించే తెల్లటి పరదా. కొలిమినించి తీసిన ఇనుపకడ్డీని నడుము చుట్టూ కట్టుకున్నట్టు చప్రాసీ – పక్కన నేరాల్ని శిక్షల్ని నింపుకు నిద్రిస్తున్న పుస్తకాల తాబేళ్ళు. కుర్చీపైన కటకటాల వెనుక మూల్గుతున్న ముద్దాయి(నిందితుడు)లా ఫ్యాను. ముందటి రెండు కుర్చీల్లో ఏ చిన్న శబ్దమైనా లేచి నించోడానికి తయారుగా ఉన్న రెండు పిపీలికాలు – ఇంకా – ముందర కుర్చీల్లో నల్లకోటు గబ్బిలాలు. గది బయట పట్టుకురాబడ్డ పావురాలు. చార్జిషీటు లేక, సాక్ష్యాలు రాక ఎన్నో నెలలుగా మస్తూపోతూ స్వేచ్ఛకై తపిస్తున్న పావురాలు.పావురాల్ని పంజరంలోకి లాక్కెళ్ళే కాకులు(కాకీలు) దగాపడ్డ అభాగినులు. రాజకీయాల ముంపుకు గురయ్యే అమాయకులు – ఇదీ ఆ రంగస్థల అలంకరణ పాత్రల వివరన. ఈ వేళ జనసామాన్యానికందరికీ సుపరిచితమైన – ఆ గది, దాని వ్యవస్థ – అవస్థ" (జింబో. 1996: vi) అన్న కాళోజి నారాయణరావు గారి మాటలు ఈ పుస్తక సారాంశాన్ని, వస్తువును, సంవిధానాన్ని, లక్షణాన్ని వివరిస్తున్నాయి. జింబో గారు వృత్తిరీత్యా లాయర్ కాబట్టి ఆ వృత్తిలోని మంచి చెడ్డలను తన అనుభవంతో చెప్పారు. ఈ పుస్తకంలోని కవితలు 1986 నుంచి 1995ల మధ్య రాసినవి.

"నీ భవిష్యత్తు
ఆ గదిలో లిఖించబడుతుంటే
వేచి చూడ్డం కన్నా దుర్భరమైనది
ఏదీ
నీ జీవితంలో చూసి ఉండవు"

(జింబో. 1996: 1)

అవును నిజమే కోర్టు గది ముందు గంటలు గంటలు వేచి చూడడం దోషికైన, నిర్దోషికైన తప్పని నరకం. ఎందుకంటే ఆ గదే తన భవిష్యత్తును నిర్ణయిస్తున్నప్పుడు వేచి

చూడడం తప్ప మరేమీ చెయ్యలేని నిస్సహాయ స్థితి. చీకట్లోకి పోతావో, వెలుగుగా మారుతావో ఆ గదే నిర్ణయిస్తుంది.

"కుల రాజకీయాల మధ్య
కుటిల రాజకీయాల మధ్య
కుర్చీ దయా దాక్షిణ్యాల మధ్య
'కాకీ' కరుణాకటాక్షాల మధ్య
నీ బతుకైపోయి
నీ బతుకు అవిటిదై పోయిందని
నిన్ను వదిలి పెట్టాను
ఓ నా నల్లకోటూ"

(జింబో. 1996: 6)

నిజం డబ్బుకు అమ్ముడుపోయే కాలాన్ని కవిత్వంగ మలచడం ధైర్యం చెయ్యడం. కవి ఆ వృత్తిలోని వారై ఉండడం వల్ల ఆ వృత్తిలోని న్యాయాన్యాయాలను అనుభవం ద్వారా తెలుసుకొని దాన్నే అక్షరాలుగా మలచడం సాహసమే అనవచ్చు. కులం, కుటిలం, రాజకీయం, బంధుత్వం, డబ్బు, అధికారం న్యాయాన్ని శాసిస్తున్నప్పుడు న్యాయానికి న్యాయం జరగడం కష్టం. అందుకే న్యాయానికి చిహ్నామైన నల్లకోటుని వదిలివేస్తున్నానంటున్నాడు.

"అక్కడ
ఏమైన జరగవచ్చు
కేసు ధ్వంసం కావచ్చు
కేసుకి ప్రాణప్రతిష్ట జరగవచ్చు
డాక్యుమెంట్ల సృష్టి జరగవచ్చు
డాక్యుమెంట్లు మారిపోవచ్చు
మన ప్రమేయం లేకుండా
మన స్టేట్‌మెంట్ నమోదు కావొచ్చు
లేక
మన స్టేట్‌మెంట్లు రూపు రేఖలే మారిపోవచ్చు
అదొక మాయా ప్రపంచం

జరిగింది జరగనట్టు
జరగంది జరిగినట్టు
ఏమైనా కవొచ్చు"

(జింబో. 1996: 32)

కోర్టు కేసుల గురించి వాస్తవికతతో చెప్పిన వాక్యాలివి. అక్కడ అధికారం, పరిచయం, పలుకుబడి, డబ్బు ఉంటే ఏమైన జరగవచ్చు. కేసు మళ్ళీ మొదటికి రావచ్చు, పూర్తిగా కొట్టివేయబడవచ్చు, డాక్యుమెంట్లు మారిపోవచ్చు, స్టేట్‌మెంట్ మారిపోవచ్చు ఏమైన జరగవచ్చు. అంతా డబ్బు మయం, జబ్బు మయం.

"నేను వస్తువునన్న విషయం
నువ్వే కాదు
నువ్వు తయారు చేసిన చట్టమూ
నువ్వు నన్ను రేప్ చేసినా
అది రేప్ కాదు
నేరం కాదు
అది నీ హక్కు
అందుకే నేనొక వస్తువుని
నేనొక సొత్తుని"

(జింబో. 1996: 56)

ఒక క్లైంట్ బోనులో నిలబడి జడ్జితో అంటున్న మాటలు. సంభాషణ విధానంలో సాగిపోయే కవితా పంక్తులు. ఒక స్త్రీ మగాడికి వస్తువా? సొత్తా? దాసా? అన్న ప్రశ్నలు తెలుగు సాహిత్యంలో స్త్రీవాదాన్ని గుర్తుకు తెస్తాయి. స్త్రీ ఆటబొమ్మకాదు. ఆమె కూడా ఒక మనిషే. ఆమెకు ఒక మనసుంటుంటుంది, ఆ మనసుకు కొన్ని స్పందనలుంటాయి. ఈ విషయం మనసున్న ఎవ్వరికైన తెలిసేదే. కాని తరతరాల నుండి స్త్రీ ఒక వస్తువైందనే ఆవేదన ఈ వాక్యాలలో కనిపిస్తుంది. స్త్రీ మగాడి సొత్తు కాదు, ఆస్తి అంతకన్న కాదు అన్న విషయం గుర్తించాలనే బాధ కనిపిస్తుంది. తన ఇష్టం లేకున్న స్త్రీని అనుభవించడం మగాడి హక్కు అని నువ్వే కాదు, నువ్వు నిర్మించిన కోర్టు, న్యాయం కూడా అనడం స్త్రీ దయనీయ స్థితిని తెలియజేస్తుంది. "ఇదీ ఖాకీల స్థావరాల కథ. పరిణామంగా జనజీవనం ఏ విధంగా

ఉంటుందో ఊహకు కూడా అందని విషయం. జింబో అటు గదిలో ఇటు ఖాకీ స్థావరాల్లో జరిగే విషయాలను నాటకంలోని దృశ్యాలుగా మనముందు ఉంచినాడు. జనజీవన స్రవంతిలోని అవకతవకలు, అన్యాయాలు నేరాలు ఎట్లా ఉన్నాయో చూడండి అంటున్నాడు జింబో" (జింబో. 1996: viii) అన్న కాళోజి నారాయణరావు గారి మాటలు హాజిర్ హై గొప్పతనాన్ని, కవి నిశితగుణాన్ని మనకు పరిచయం చేస్తాయి.

## 5.2.17. నానోలు

కవిత్వం నిత్య నూతనమైంది. ఆయా కాలాలకు అనుగుణంగా కవిత్వం రూప పరిణామం చెందుతుంటుంది. వచన కవిత, దీర్ఘకవిత, మినీ కవిత, హైకూలు ఇలా అనేక రూపాలుగా కవిత్వం వచ్చినా మరో కొత్తరూపం ఆయా కాలాన్ని అనుసరించి వస్తుంది. నానోలు కొత్త కవితా రూపం "నానోలు ప్రస్తుతం తెలుగు కవిత్వంలో ఉన్న రూపాల్లోకి సూక్ష్మమైంది. నాలుగు పాదాలు, పాదానికి ఒకే ఒక్క పదం. ఆ పదం సరళమైన సమాసం లేదా సంధియైనా సరే, ఇదీ ఈ ప్రక్రియ వ్యాకరణం. అంటే నాలుగే నాలుగు పదాల్తో కవిత్వాన్ని పలికించగలగాలి. ఒక మెరుపులాగా మెరిసి పాఠకున్ని రంజింప చేయగలగాలి. మొట్టమొదటగా 'నానోలు' 2005 మేలో ఈగ హనుమాన్‌చే రాయబడ్డాయి. తదాదిగా దేశ విదేశాల్లో (అంతర్జాలం ద్వారా) ప్రాచుర్యత పొందడమే గాక, తెలుగు కవిత్వంలో నవ్య ప్రక్రియల్లో ఒకటిగా విరాజిల్లుతూంది. ప్రాథమికంగా కవిత్వానికుండే లక్షణాలైనటువంటి క్లుప్తత, గుప్తత, గాఢత 'నానోల'కి కూడా వర్తిస్తుంది. నాలుగు స్వతంత్రమైన పదాలు ఒక భావాన్ని, ఆలోచనని చిక్కగా ప్రసారం చేయగలిగితేనే చీకట్లో చిరుదివ్వెలా 'నానో' భాసిల్లుతుంది. ఆ సూక్ష్మరూపం గనుక ఖచ్చితంగా చిక్కదనాన్ని, కవిత్వాన్ని ఒలికించాల్సిందే, నినాద ప్రాయంగానో, వార్తాపత్రిక శీర్షికల్లాగానో ఉంటే నానో తేలిపోవడమే కాకుండా, కవి కూడా అపప్రథకు లోనయ్యే అవకాశముంటుంది" (లక్ష్మీనారాయణ, సబ్బని. 2010: i) అన్న ఈగ హనుమాన్ గారి మాటలు నానో కవితా రూప తత్త్వాన్ని, లక్షణాని విశదపరుస్తున్నాయి.

"ఉద్యమమంటే
లావాలా
పెల్లుబికే
ప్రజాగ్రహజ్వాల"

(లక్ష్మీనారాయణ, సబ్బని. 2010: 8)

ఉద్యమం అనే మాటకు "సం. వి. అ. పుం. 1. పై కెత్తుట, 2. ప్రయాసము, 3. పూనిక, 4. సిద్ధమగుట" (సూర్యరాయాంధ్ర నిఘంటువు. 1936: 595) అని అర్థమిచ్చింది. ఉద్యమం ఒక లక్ష్యంకోసం జరిగే ప్రయత్నం. తెలంగాణోద్యమం స్వంత రాష్ట్రంకోసం, స్వంత పాలనకోసం, దోపిడి, అన్యాయం, వివక్షల నుంచి విముక్తికోసం జరిగింది.

"బతుకు
గొడవ
ధిక్కారం
కాళోజి"

(లక్ష్మీనారాయణ, సబ్బని. 2016: 2)

సూక్ష్మంలో మోక్షంలాగా చిన్న కవితలో కాళోజి జీవితాన్ని చెప్పారు కవి. ప్రజలవైపు, ప్రజల పక్షాన ఉన్న ఏ కవికైనా బతుకు గొడవలతో, ధిక్కారాలతో కూడుకుంటుంది. కాళోజి అసలు సిసలైన ప్రజల కవి, ప్రజా కవి. ప్రజల గొడవని 'నా గొడవ'గా వెలువరించిన కాళోజి ప్రజల సమస్యల, భాషను కవిత్వంలోకి తీసుకొచ్చారు. కాళోజి కవిత్వానికి మానవత్వమే అసలు వస్తువు. ప్రజల్ని మోసంచేసే ఏ రాజునైనా, ప్రభుత్వాన్నైనా కాళోజి ధిక్కరించారు. నిజాం వ్యతిరేక కవిత్వంలో, ఆంధ్రాధిపత్య పాలనలో దీనిని గమనించవచ్చు.

"కవిత
సూక్ష్మం
భావం
అనంతం"

(లక్ష్మీనారాయణ, సబ్బని. 2017: 25)

చిన్నచిన్న కవితల్లోనే అనంతమైన భావాన్ని చెప్పగలగడం కవుల గొప్పదనం. దీర్ఘమైన కావ్యాలనుండి కవిత్వం చిన్నచిన్న పదాలదాకా చేరుకోవడం, ఆ పదాల్లో విశ్వవ్యాప్తమైన భావాల్ని అందించడం నేటి కవిత్వంలోని విశేషం.

# అధ్యాయం – ౬
# కరీంనగర్ జిల్లా కవిత్వం – శిల్ప విశ్లేషణ

## ౬.౦. పరిచయం

సాహిత్య విమర్శలో ఎక్కువగా వినిపించే పదాలు వస్తువు, రూపం, శిల్పం. కవి తన రచనలో చెప్పే ప్రధాన విషయం వస్తువైతే, ఏ ప్రక్రియలో చెబుతున్నాడో అది రూపమైతే, ఎలా చెబుతున్నాడనేదే శిల్పం అవుతుంది. ఆగ్లంలో 'Techinque' అన్న పదానికి సమానార్థకంగా తెలుగులో శిల్పం అని వాడుతున్నాం. ఒక విధంగా అభివ్యక్తిని శిల్పం అనవచ్చు. కవి ఎంచుకున్న వస్తువును అభివ్యక్తీకరించే విధానమే శిల్పం. "కవి స్వీకరించిన వస్తువును ఆవిష్కరించే అభివ్యక్తిరీతినే శిల్పమంటారు" (తిరుమల(సంపా). 2000: 95). అని చెప్పిన అవంత్స సోమసుందర్ గారి మాటల్లో అభివ్యక్తీకరించే తీరు శిల్పమవుతుందని తెలుస్తుంది. తెలుగు సాహిత్యంలో వస్తు, రూప, శిల్పాలపైన విస్తృతమైన చర్చ జరిగింది. కొంతమంది వస్తువు ప్రధానమని చెబితే మరికొందరు రూపం ప్రధానమని చెప్పినవారు ఉన్నారు. కొంతమంది ఏం చెప్పిన తనదైనా విధానమే ముఖ్యమన్నారు. శిల్పమంటే చెప్పే విధానం. శిల్పమనే మాట ప్రాచీన కాలం నుండి మనకు కనిపిస్తుంది. ప్రాచీనులు శిల్పాన్ని 'కళ' అన్న మాటగా వాడారు.

"సాహిత్యం విస్తృతమైన రూపం కాగా కవిత్వం అందులో సాంద్రతగల ప్రక్రియ. కవిత్వ సాంద్రతకి తొలి కారణం కవిత్వంలో పెనవేసుకున్న వస్తు శిల్ప సమన్వయమే" (వెంకటేశ్వర్లు, లంకా. 2005: i). వస్తు శిల్పాలు సమంగా ఉంటేనే ఆ కవిత పాఠకుల హృదయాలపై గాఢమైన ముద్ర వేయగలదు. ఏది ఏమైనా వస్తుశిల్పాల వల్ల కవిత్వం నిత్యనూతనమై పాఠకుల్ని పరవశుల్ని చేస్తూనే ఉంటుంది. నన్నయ్యలో నానారుచిరార్థసూక్తి, అక్షర రమ్యత శిల్పమే. తిక్కనలో నాటకీయ శిల్పంపైన పరిశోధనలే జరిగాయి. ఇలా ప్రాచీన కవుల నుండి మొదలుకొని ఇప్పటి కవులదాకా ఒక్కొక్కరిది ఒక్కో శిల్పం, ఒక్కో శైలి.

## 6.1. నిర్వచనాలు

కవి, రచయిత ఎన్నుకున్న వస్తువును చెప్పే పద్ధతే శిల్పం. మనిషి బుద్ధిజీవి, ఆలోచనాపరుడు. ప్రతివ్యక్తికి తనవైన ఆలోచనలు, అభివ్యక్తులుంటాయి. సామాన్య వ్యక్తులకంటే ముఖ్యంగా కవుల అభివ్యక్తీకరణ భిన్నంగా కనిపిస్తుంది. మనసులోని భావాల్ని చెప్పడం అభివ్యక్తీకరణ. అభివ్యక్తీకరించే విధానంలో చూపే నైపుణ్యమే శిల్పం. "ఒక రచయిత లేదా కళాకారుడు తన పనిలో కళాకేశలాలను వినియోగించే రీతి సామర్థ్యం, ఒక నిర్దిష్ట రంగంలో వినియోగించే ప్రత్యేకీకృత పద్ధతులు ప్రక్రియా విధానాల సమాహారం చెప్పాలంటే, ఏ పనిలోనైనా కళానైపుణ్యాన్ని చూపే పద్ధతినే శిల్పం అనవచ్చు" (దక్షిణమూర్తి, పోరంకి. 1998: 396 – 397). శిల్పి ఎంత జాగ్రత్తతో ఒక శిల్పాన్ని చెక్కుతాడో కవి కూడా అంత జాగ్రత్తగా కవితా శిల్పాన్ని నిర్మించాల్సి ఉంటుంది.

"విషయాన్ని వ్యక్తీకరించే పద్ధతి. చెప్పే పద్ధతి. ఇందులో వాక్య నిర్మాణమూ, భాషా, వాడిన ప్రతీకలూ మొదలైనవన్నీ వస్తాయి. వీటి ద్వారా రచయిత శైలీ ఎటువంటిదీ, వస్తువుకి ఎంతవరకూ తగినదీ అని నిర్ణయించవచ్చు" (నళిని, ఎస్.ఎస్. 2009: 23 - 24). సామాన్యంగా ప్రతి కవి కొత్తగా చెప్పాలని అనుకుంటాడు. ఈ అభివ్యక్తిలో ముఖ్యంగా రెండు పద్ధతులు ఉన్నాయి. ఒకటి ఆత్మానుభవ వ్యక్తీకరణ. ఇందులో కవి తన స్వంత అనుభవాలను చెబుతాడు. రెండు – వస్తుగత వ్యక్తీకరణ. ఇందులో ఒక వస్తువుని ఎన్నుకుని దాన్ని వర్ణిస్తూ చెప్పడం.

"కవిత్వం ఒక ప్రత్యేక ఆలోచనా పద్ధతి. ఆవిష్కరణ విధానం కూడా. క్లుప్తంగా చెపితే పద చిత్రాలతో ఆలోచించటమే కవిత్వం. తత్ప్రకటనా రీతి అభివ్యక్తి. దీనిలో సంక్షిప్తత ప్రధాన గుణం. ఈ తరహా ఆలోచనకు కవికి ఉపకరించే సాధనం భాష. అందుకు తన ఆలోచనా క్రమంలో కవి భాషా వనరులన్నిటినీ భావ ప్రకటన నిమిత్తం వాడుకోజూస్తాడు" (సీతారాం. 2007: 7). సాహిత్యంలో ఒక కవిత చదివినప్పుడో, ఒక కథ చదివినప్పుడో ఇంకేదైన చదివినప్పుడో చాలా బాగా చెప్పాడు అని అంటుంటారు. ఈ బాగా చెప్పడం అంటే ఏమిటి? అని అనుకున్నప్పుడు ఆ కవి చెప్పే పద్ధతిలో ఉంటుంది. ఈ పద్ధతికి భాష, ప్రతీకలు, భావచిత్రాలు మొదలైనవి కవికి ఉపయోగపడతాయి. దీనిలో ముఖ్యమైంది భాష.

నిత్య వ్యవహారంలో వాడే పదాలైన కవి సృజనలో కొత్త భావనలో వాడబడతాయి. వస్తువు పాతదే అయినా దాన్ని సరికొత్తగా ఆవిష్కరించాలనే తపన కవిలో ఉండాలి.

“కవిత్వంలో కవి మనస్సును ఆకట్టుకునే విధంగా చెప్పేందుకు కొన్ని రకాల పద్ధతులను ఆశ్రయిస్తాడు. వాటిలో కొన్ని విధాలయిన భాషా నియమాలను అతిక్రమించడం ఉంటుంది. విలక్షణంగా కనిపించేందుకు సాధారణ భాషా నియమాతిక్రమణకు కవి పూనుకునే క్రమంలో అభివ్యక్తికొక ఉనికి ఏర్పడుతుంది. కవి అనుభూతి, అనుభవం, ఉద్వేగం ప్రత్యేకంగా కనిపిస్తూ భాషా రూపాన్ని పొందటమే అభివ్యక్తి. ఇంద్రియ నైశిత్యం కలిగిన కవి తన భావోద్వేగాలను పఠితకు సంక్రమింపజేయగల అపూర్వ భావ ప్రకటనా రీతిని కవిత్వాభివ్యక్తిగా వ్యవహరించే వీలుంది” (సీతారాం. 2007: 8). కవి పాఠకుల మనసులను భావోద్వేగానికి గురిచెయ్యడానికి పాతపదాలనే సరికొత్తగా ఆవిష్కరిస్తాడు. దీనికోసం కొన్ని పరిమితులకు అతిక్రమించినా అది కవిత్వాభివ్యక్తికి అవసరమైంది. ఇదే సామాన్య వ్యక్తులకు, కవికి మధ్య భేదం. అందుకే కవిత్వంలో ప్రధానమైందిగా అభివ్యక్తిని విమర్శకులు పరిగణిస్తారు.

‘ఈయన కృష్ణశాస్త్రిల రాస్తున్నాడు, శ్రీశ్రీల రాస్తున్నాడు’ అన్న భావన పాఠకుల్లో కలిగిందంటే ఆ కవికి కొత్త అభివ్యక్తీకరణ లేదన్నట్టే. కవి ఒకరిని అనుకరిస్తున్నాడంటే తన అస్తిత్వాన్ని తానే చెరిపేసుకుంటున్నాడని అర్థం. ఎప్పటికప్పుడు కొత్తగా రాయాలనే తపన లేకుంటే కొత్తగా రాసేందుకు ఏమీ ఉండదు. ఇంతకుముందున్న కవులకన్న ఏదో నూతనంగా చెబితేనే కవి సాహిత్యంలో ఒక స్థానాన్ని సంపాదించుకోగలుగుతాడు. కవిలో సంవేదనే కొత్తగా రాయాలన్న కాంక్షని కలగజేస్తుంది.

“శిల్పం అంటే ఒక వస్తువుని పాఠకుని మనస్సుమీద గాఢంగా ముద్రవెయ్యడానికి అవసరమైన, నిర్మాణపరమైన అంశాల సమాహారం” (వెంకటేశ్వర్లు, లంకా. 2005: ii). పాఠకుని మనసుకు హత్తుకునే విధంగా చేసే నిర్మాణపరణమైన అంశాలే శిల్పమన్నారు అద్దేపల్లి రామమోహనరావు గారు. ఇక్కడ నిర్మాణం అన్న పదాన్ని మనం గ్రహిస్తే ప్రాచీనకాలంలో చెప్పిన రసం, అలంకారం, వక్రోక్తి, ధ్వని మొదలైనవి, ఆధునికంగా చెప్పే ప్రతీకలు, భావచిత్రాలు నిర్మాణంలో ప్రధాన పాత్ర వహిస్తాయి. “ప్రతీకలు, భావ చిత్రాలు, అలంకారాలు మొదలైనవి అభివ్యక్తి రీతులు. భాష, సామాజిక సామూహిక ఆమోదానికి విస్తృతమైన రూపాన్నిస్తుంది. ఇవన్నీ శిల్పంలో ప్రధానాంగాలు” (పైదే: 2).

“రూపంలో లీనమై సాహిత్యాన్ని ఆస్వాదించడానికి ఉపయోగపడేది శిల్పం. ఆస్వాదనకు ఉపయోగపడడం శిల్పానికున్న ఒక ప్రయోజనం. ఆస్వాదన ద్వారా వస్తువును

పాఠకుల మనసుల్లోకి ఎక్కించడం శిల్పానికున్న రెండో ప్రయోజనం. శిల్పంలోని వస్తువు పాఠకులకు ఆయా తరతమ భేదాలతోనే అందుతుంది. రూపంగానీ, శిల్పంగానీ వస్తు సారాంశం పాఠకులకు అందడానికి అనుకూలంగా ఉండాలి. వస్తు రూపాల మధ్య ఐక్యతను సాధించే విధంగా శిల్పం ఉండాలి. శిల్ప విన్యాసం వస్తువును మింగేసే విధంగా ఉండకూడదు. వస్తువును మింగేసే శిల్పం సాహిత్య ప్రయోజనల్ని దెబ్బతీస్తుంది. వస్తునిర్మాణ నైపుణ్యమే శిల్పం. సాహిత్యానికి వస్తువు జీవితం. రూపం శరీరం. శిల్పం ప్రాణం. జీవితం, శరీరం, ప్రాణం వేరు కానట్టే వస్తురూపశిల్పాలు కూడా వేరు కావు" (చెంచయ్య, వి. 2017: 7). సాహిత్యంలో ప్రధానంగా వినిపించే మాటలు వస్తువు, రూపం, శిల్పం. ఇవి మూడు ఒక రచనకు చాలా ప్రధానమైనవి. వీటిలో ఏది ప్రధానం అంటే మూడు ప్రధానమే అని తెలుస్తుంది. మూడింటిలో ఏ ఒక్కటి సరిగ్గా లేకున్నా ఆ రచన ప్రయోజనం సంపూర్ణం కాదు.

## 6.2. కరీంనగర్ జిల్లా కవిత్వం – శిల్ప విశ్లేషణ

ప్రాచీన అలంకారికులు కవి గురించి, కవిత్వం గురించి విశేషమైన చర్చ చేశారు. కవిత్వం చెప్పే విధానం గురించి కూడా విస్తృతమైన చర్చలు జరిగాయి. కావ్యానికి రసం, అలంకారం, వక్రోక్తి, ధ్వని మొదలైనవి ప్రధానమని లాక్షణికులు చెప్పారు. అలాగే చెప్పే విషయాన్నిబట్టి గౌడి, వైదర్భి మొదలైన రీతులలో ఏ రీతిని ఎన్నుకోవాలో, కదళి, ద్రాక్ష, నారికేళ పాకాలలో ఏదో ఒక దాన్ని తీసుకోవాలని సూచించారు. ఆధునిక సాహితీ ప్రక్రియలు పాశ్చాత్య సాహిత్య ప్రభావంవల్ల వచ్చాయి కనుక అందులోని కొన్ని నిర్మాణ పద్ధతులు కూడా పాశ్చాత్య సాహిత్యంలోనివే. ఈ నిర్మాణ పద్ధతులను గుర్తించడాని డా. జి. లక్ష్మీనరసయ్య గారి 'కవిత్వ నిర్మాణ పద్ధతులు', డా. యాకూబ్ గారి 'కవిత్వం సృజనానుభవం' ఉపయోగపడ్డాయి.

### 6.2.1. ప్రతీకలు (Symbols)

ఒకదాని గురించి చెబుతున్నప్పుడు దానికి సమానమైన ఇంకోదాన్ని చెప్పడమే ప్రతీక. "తాత్వికంగా చూస్తే సృష్టిలోని ప్రతివస్తువూ ప్రతీకాత్మకమే. కవి ఒక వస్తువును అనుభూతి చెందటం ద్వారా ఆ అనుభూతిని ఉన్నదున్నట్లుగా చెప్పటానికి ప్రతీక కంటే అనువైన సాధనం

లేదు. ప్రతి వస్తువూ, వ్యక్తిలోని అనేకమైన అనుభూతుల్ని అంతరంగంలో అత్యంత సంకీర్ణంగా రగిలిస్తుంది. కవి ప్రయోగించిన ప్రతీక, ఆ అనుభూతుల్ని వెలువరించేదిగా వుండాలి. అందుకే వస్తువుని చెప్పకుండా, అనుభూతి కేంద్రమైన మరో వస్తువుని చెప్పటం ద్వారా అసలు వస్తువుని స్ఫురింపచేయటం ప్రతీక వినియోగమవుతుంది" (వెంకటేశ్వర్లు, లంకా. 2005: 23). ఒక వస్తును చూసి ఆ వస్తువు గురించి చెప్పకుండా ఇంకో వస్తువు గురించి చెప్పి కవి చెప్పదలుచుకున్న వస్తువును పాఠకుని అర్థమయ్యేట్టు చెప్పడమే ప్రతీక.

సాహిత్యంలో ప్రతీకవాదం ఒకటి ప్రత్యేకంగా రావడం దీని ప్రాధాన్యతను తెలుపుతుంది. "రెండు వస్తువులను జోడించి చెప్పినప్పుడు దేనితో పోల్చి పైకి చెబుతున్నామో అది ప్రతీక" (నళిని, ఎస్.ఎస్. 2009: 119). దేనితో పోల్చి చెబుతున్నామో అని అన్నప్పుడు అలంకార శాస్త్రంలోని ఉపమాలంకారం స్ఫురణకు వస్తుంది. కాని ప్రతీకలో ఉపమానం మాత్రమే చెప్పబడుతుంది, ఉపమేయం చెప్పబడదు.

"నరుడు కర్కోటకుడై పశువై
ఓ స్త్రీ దేహంపై పంజావిప్పిన మృగమై
రక్షించే మానవుడే భక్షిస్తుంటే....
ఆ స్త్రీ హృదయ రోదనతో విలవిలలాడింది"
(రవీందర్, నాగిళ్ళ. 2005: 12)

పశువుకు మంచి చెడనే ఆలోచన ఉండదు. కాని మనిషికి మంచి, చెడుల ఆలోచన ఉంటుంది. అయినా కామవాంఛలో అవేవీ పట్టించుకోకుండా పరాయి స్త్రీపై అఘాయిత్యానికి పాల్పడడం వల్ల పశువయ్యాడు. పంజావిప్పడమంటే వేటాడడానికి సిద్ధంగా ఉందని అర్థం. అంటే ఇక్కడ మగవాడు స్త్రీని బలత్కారం చెయ్యడానికి సిద్ధమయ్యాడని గ్రహించవచ్చు.

"పువ్వులా విచ్చుకుంటున్న
పదహారు ప్రాయాన్ని
మడిబట్టల కింద అణుచుకుంటూ
సాంద్ర ధ్యాన ముద్రలో దేవతలా ఆమె.
కేరింతల చప్పుళ్లలోనే
పసుపుకుంకాలు గాలిలో
కల్సిపోయాయని

పెద్దలు చెపితే తెల్సుకున్న
అమాయకత్వంలోంచి!
తెల్లని చీర, తెల్లని రవికె
శరీర అచ్ఛాదనమైనప్పుడు
రంగురంగుల వస్త్రాలన్నీ
సీతాకోకచిలుకలై
ఆమె కళ్లముందు నర్తించాయి!"

(శివప్రసాద్, సంకేపల్లి. 2002: 26)

స్త్రీ శరీరంలో వయసునుబట్టి మార్పులు సంభవిస్తాయి. మొగ్గ నుండి పువ్వుదశకి చేరుకుని ఆ పువ్వు విచ్చుకునే దశ పదహారు ప్రాయాన్ని చూపిస్తుంది. స్త్రీ ఎదుగుదలలో వచ్చే మార్పుల్లో ఒకటి ఋతుక్రమం. ఈ పదాన్ని సూటిగా వాడకుండా కవి 'మడిబట్టలు' అనే పదబంధంవల్ల ఆ స్ఫురణను పాఠకుడికి కలిగిస్తున్నారు. ఇప్పటికీ బాల్యవివాహాలు జరుగుతున్నా ఒకప్పుడు భారతదేశంలో బాల్యవివాహాలు అధికంగా జరిగేవి. కేరింతల చప్పుళ్లు అనేది బాల్యానికి ప్రతీక. ఎందుకంటే చిన్ననాడే అల్లర్లు, కేరింతలు చేస్తుంటాం. అలాగే పసుపుకుంకుమాలు ఐదవతనానికి ప్రతీక. తెల్లని చీర, తెల్లని రవిక వైధవ్యానికి చిహ్నాలు. ఇలా ప్రతీకల ద్వారా ఒక స్త్రీ జీవితంలోని కొన్ని సంఘటనలు చిత్రించారు కవి.

"దగాకోర్ల దెబ్బలతో
గాయపడ్డ నేలతల్లి,
దేహంపై మొలకెత్తిన
కురుపులు
మా గుడిసెలు"

(రవీంద్ర, సంగెవేని. 2005: 22)

అసలు నేలకు దెబ్బలు తగులుతాయా? అనుకుంటే నేలను ఒక తల్లిగా పోల్చడంవల్ల మానవ శారీరక గుణం వచ్చింది. మరీ దెబ్బలు? ఓపెన్ కాస్ట్ లాంటివన్నీ నేల అనుభవించే గాయాలు. అలాగే కవి పూరి గుడిసెల్ని దేహంపై మొలకెత్తిన కురుపులతోటి పోల్చడంవల్ల అవి ఎంత చిన్నవో అర్థమైతుంది. అలాగే అవి ఎక్కువకాలం మనలేని స్థితిని కూడా

తెలియజేస్తుంది. కవిత చివర్లో 'మాకైతే అవి గుడిగోపురాలు' అని అనడంలో పేదవాళ్ళకు అవి ఎంతటి పుణ్యస్థలాలో అర్థమౌతుంది.

"నేడు
గుండె గుండెలో రెక్కలు విప్పిన రెపరెపలు
పికం గొంతులో ప్రతిధ్వనించిన పిరంగి మోతలు
చురకత్తులైన ముడి లోహపు తునకలు
పడ్గ విప్పుతున్న పల్లెల పలాశ పతాకలు
అనల నయనాలౌతున్న జనసామాన్యం
నిప్పు రవ్వలై నింగి కెగురుతున్న యువజనం
ఇవన్నీ
ఈనాడు రేకులు విచ్చుకుంటున్న అగ్ని పుష్పాలు"

(దేవేందర్, అన్నవరం(సంపా). 2010: 57)

అన్న ఎలనార కవితా వాక్యాలు తెలంగాణ ఉద్యమ తీవ్రతను తెలియజేస్తాయి. ఫిరంగి సామ్రాజ్యవాద, దోపిడివాద తనానికి ప్రతీక. ముడి లోహం కార్మిక శక్తికి, సామాన్య జనానికి ప్రతీక. పడగ విప్పుతున్న పల్లె ప్రతిఘటనకు ప్రతీక. అనల నయన జనసామాన్యం కోపోద్రిక్త వాతావారణానికి, నిప్పురవ్వల యువజనం ఉద్వేగానికి, ఉక్రోషానికి ప్రతీకలు. 'అగ్ని పుష్పం' విప్లవమై మండుతున్న తెలంగాణకు సంకేతం. ఇలా కవితంతా ప్రతీకలతో చెప్పదలుచుకున్న విషయాన్ని క్లుప్తంగా, గాఢంగా చెప్పారు.

"తెస్తానని ఒకరంటే
ఇస్తానని ఇంకొకరు
పార్టీలు రెండైతె
మాటలు రెండు నూర్లయితై
ప్రజలకు మాత్రం
రాజకీయ వ్యాకరణం అర్థం కాదు"

(పైదే: 100)

ఈ కవిత రాసిన ఎం. నారాయణశర్మ గారు 'రాజకీయ వ్యాకరణం' అన్న కొత్త పదబంధాన్ని సృజించారు. తెలుగు పఠనంలో క్లిష్టమైన అంశం వ్యాకరణం. అలాగే రాజకీయ

ఎత్తుగడలను, ఆలోచనలను అర్థం చేసుకోవడం కూడా కష్టమైన పని. కనుక రెండు కష్టమైన అంశాలను తెలియజేస్తూ ఒక కొత్త ప్రతీకను సృష్టించారు.

"నిన్న దేశాన్ని కావచ్చు నేడు రాష్ట్రాన్ని కావచ్చు
ఆక్రమించుకోవడంలో అందెవేసింది
'కథలు' చెప్పి కళ్ళముందటి నిజాలను
అబద్ధం చేయగలదు
కళ్ళుకప్పి కథల్లోనూ మిగలకుండా
కనుమరుగు చెయ్యగలదు
ఇంగ్లీషోడి విద్య ఒంటబట్టిన పిల్లి"

(శివకుమార్, వఝుల. 2004: 10)

ఈ కవితలో పిల్లి వ్యక్తికి ప్రతీక. గుట్టుచప్పుడుకాకుండా ఎలుకను వేటాడంలో, ఇంట్లోని పాలను తాగిపోవడంలో పిల్లి నైపుణ్యతను ప్రదర్శిస్తుంది. ఇంగ్లీషోడి విద్య (మోసం చెయ్యడం, ప్రజల్ని బానిసలుగా మార్చడం) ఒంటబట్టిన వ్యక్తి కూడా దేశాన్ని, రాష్ట్రాన్ని ఆక్రమించుకొని ప్రజల్ని దోచుకుంటాడు, బానిసలుగా చూస్తాడు.

"జుట్లు విరబోసుకుని పైశాచికంగా నర్తిస్తున్న
కటిక చీకట్ల నడుములు విరిగిపోయే వరకు.
ఒదిగొదిగి చూస్తున్న ఉదయ సూర్యబింబం
నిటారుగా నిలబడి
అరుణ పతాకలా రెపరెపలాడే వరకు."

(నారాయణరెడ్డి, సి. 2010: 28)

. సామాన్యుల దృష్టిలో చీకటి చీకటే. కాని కవికి చీకటి జుట్టు విరబోసుకుని పైశాచికంగా నర్తిసున్నట్టు కనిపించింది. సూర్యుడు చైతన్యానికి ప్రతీక. అరుణ పతాకం కూడా చైతన్యానికి, విప్లవానికి ప్రతీక. అందుకే చీకటి చెఱలో నుండి అప్పుడప్పుడే ఒదిగి ఒదిగి వస్తున్న సూర్యుడు అరుణపతాకమై నిటారుగా నిలబడే స్థితికి చేరుకునే సమయం వచ్చేదాకా కవి తన ఆలోచనలకి పదును పెడుతూనే ఉంటానంటున్నారు. అంటే అసమాన, అన్యాయ సమాజం అంతరించేదాకా ఆలోచనలకి అక్షరరూపం ఇస్తానంటున్నారు.

"రాతిరి నాకు
నిద్దర రాలేదు.......
బక్కచిక్కిన చుక్కలన్నీ
ఆకాశంలో ఆకలి కేకలు వేస్తూంటే
రాతిరి నేను నిద్ర పోలేదు....."

(రవీంద్ర, సంగెవేని. 2005: 3)

ఇక్కడ బక్కచిక్కిన చుక్కలు బక్కచిక్కిన మనుషులకు ప్రతీక. ఆకాశం సమాజానికి ప్రతీక. రోజంతా కష్టపడ్డ కడుపునిండని జీవితాలు ఆ ఆకలిని ఓర్చుకొని ఓర్చుకొని చివరికి ఆకలి పోరాటాన్ని ప్రారంభించాయి. ఇంకా ఈ కవితలో చీకటిని అన్యాయానికి ప్రతీకగా చూపిస్తారు కవి. చివరగా చుక్కల తాకిడికి చీకటి తోక ముడిచింది అనడంతో అన్యాయంపై న్యాయం గెలిచిందని తెలుస్తుంది.

### ౬.౨.౨. భావచిత్రాలు (Imageries)

ఒక అంశాన్ని తీసుకొని కేవలం ఆ అంశం గురించే చెప్పకుండా దాని ముందు వెనకాలను చెప్పడం భావచిత్రం. "What do we understand, then by the poetic image? In its simplest terms, it is a picture made out of words" (Day Lewis, D. 1961: 21). భావచిత్రమంటే పదాల ద్వారా ఒక చిత్రాన్ని పాఠకుడి మనసులో కలిగించడం.

"మౌలికంగా కవి పొందిన అనుభూతి నుండి ఉత్పన్నమై శబ్దార్థాల సమన్వయంతో భావచిత్రంగా భౌతికరూపం తీసుకుంటుంది. అంటే ఒక పదార్థానికి సంబంధించిన పోలికను చెప్పటంలో ఆ పదార్థ సౌందర్యం దగ్గరే ఆగిపోకుండా అనేక అంశాల సమ్మేళనంలోని నవ్యత వలన సందర్భానికి తగిన ఒక భావనని, ఒక అవస్థని(Mood) ప్రతిబింబించినట్లైతే అది కేవలం 'చిత్రము' కాకుండా 'భావచిత్ర' మవుతుంది" (వెంకటేశ్వర్లు, లంకా. 2005: 37).

ఒక వస్తువును చెప్పడానికి బదులు దానికి సారూప్యమైన మరో వస్తువుతో చెప్పడం ప్రతీకైతే, ఒక పదార్థం గురించి చెప్పేటప్పుడు సౌందర్యంతోపాటు, దానికి సంబంధించిన అనేక అంశాలను చెప్పడం భావచిత్రం అంటారు. "భావచిత్రాలను 1) అలంకారాలు

2) పాశ్చాత్య కళాపద్ధతులు 3) మనోవైజ్ఞానిక భూమిక ద్వారా మూడురకాలుగా చిత్రిస్తారు" (నారాయణశర్మ, ఎం. 2014: 51).

"ఈ వ్యవస్థలో ప్రతి అంగుళమూ అక్షరానికి తెల్సు
నాయకుల గ్లిజరిన్ కన్నీళ్ళు తెల్సు
పతాకాల ముసుగులో జరిగే ఊరేగింపుల లొసుగులు తెల్సు
బాధల ఊబిలో చిక్కుకొన్న
మధ్యతరగతి ప్రజల
ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలు తెల్సు"

(శివప్రసాద్, సంకేపల్లి. 2002: 18)

అక్షరం గురించి, అది నిర్వర్తించే విధి గురించి వివరిస్తున్నారు కవి. ఇక్కడ కేవలం అక్షర సౌందర్యం గురించి చెప్పకుండా అక్షరం సమాజన్నంతటిని బహు జాగరుకతతో పరిశీలించే విధానం పై కవితలో గుర్తించవచ్చు. కపట నాటకాలు, స్వార్థ రాజకీయ ఊరేగింపులు, మధ్య తరగతి ప్రజల బాధలు, కష్టాలు అన్నీ అక్షరానికి తెలుసు. అక్షరానికి తెలుసు అంటే కవికి తెలుసు. అందుకే కవి సామాజిక సంస్కర్త అవుతారు. సమాజంలో చెడు, అన్యాయం విస్తరిస్తున్నప్పుడు వాటిపై యుద్ధం ప్రకటించి, సామాన్య ప్రజలవైపు, పీడితులవైపు తను నిలబడతాడు, పోరాటం చేస్తాడు.

"అవ్వా తెలంగాణా!
తల్లీ తెలంగాణా
నిన్ను యాజ్జేసుకుంటం
నిన్ను మతిల బెట్టుకుంటం
బతుకమ్మ పాటలల్ల
బడ్డీక ఆటలల్ల
చిర్రగోనె చిరుతల రామాండెం
బోనాల పండుగ్గోలె
డడ్డెంక డెం డడ్డెంక డెం
డప్పు సప్పుల్లల్ల

కిన్నెర రాగాలల్ల
నిన్ను తల్సుకుంటం”

(దేవేందర్, అన్నవరం. 2005: 16)

తెలంగాణ ఉద్యమ సందర్భంగా విస్తృతమైన సాహిత్య సృజన జరిగింది. దాంట్లో తెలంగాణ ఖ్యాతిని, కీర్తిని తెలిపే అనేక కవితలు వచ్చాయి. ఇక్కడ కవి తెలంగాణ గురించి చెబుతున్నప్పుడు ఆ తెలంగాణకు సంబంధించిన ప్రత్యేకతలు ఎందులో ఉంటాయో వివరిస్తున్నాడు. బతుకమ్మ పాటలల్ల, చిర్రగోనె, చిరుతల భాగోతం, దప్పుసప్పుల్లు ఇలా తెలంగాణకు సంబంధించిన ప్రత్యేక విషయాలను చెప్పడం జరిగింది.

“కవిత్వం నాకు
గుడిసె మీద పారే బీర తీగ
ముండ్ల కంపపై పుష్పించిన కట్ల పువ్వు
గంగ డోలుకు కట్టిన గంట
గొంతులో ప్రవహించిన రాగం
కళాత్మకంగా కుండను వానినట్లు
నాణ్యతగా చెప్పును ముడిచినట్లు
అందమైన చీర నేసినట్లు
నేను కవిత్వాన్ని పదిలంగా అల్లుతా”

(దేవేందర్, అన్నవరం. 2003: 2)

ఇక్కడ చెప్పదలుచుకున్న ప్రధానమైన అంశం తను కవిత్వం రాసే పద్ధతి, విధానం. కాని దానికి కవి తీసుకున్న భావచిత్రాలవల్ల తన కవిత్వ నిర్మాణ పద్ధతి ఎలాంటిదో మనకు తెలుస్తుంది. ఇక్కడ మరో విశేషమేమిటంటే కవి తీసుకున్నవన్నీ గ్రామీణ జీవితానికి, తన చుట్టున్న సమాజానికి సంబంధించినవి కావడం వల్ల ఈ కవితకి మరింత సౌందర్యం వచ్చింది. పాఠకుని మనసు గుడిసె అయితే దానికి అల్లుకుపోయే బీరతీగ కవిత్వం. కవి జీవితంలోని బాధ ముండ్లకంపైతే పుష్పించిన కట్లపువ్వు కవిత్వం. పేజీ గంగడోలైతే మోగే అక్షరం గంట. కాలం గొంతైతే కాలం నిండా ప్రవహించే రాగం కవిత్వం. అలాగే కుండ చేసినట్టు, చెప్పును మడిచినట్టు, చీర నేసినట్టుగా కవి తన కవిత్వాన్ని అత్యంత నేర్పుతో రచిస్తానని చెప్పుకుంటున్నాడు. కుమ్మరి, మాదిగ, చేనేత వృత్తులలో నైపుణ్యత ఉంటుంది.

అలాంటి నైపుణ్యంతో కవిత్వాన్ని అల్లుతాననడంలో ‘లోకోత్తర వర్ణనా నిపుణ: కవి. తస్య కర్మ కావ్యం’ అన్న సూక్తి జ్ఞప్తికి వస్తుంది.

“నువ్వు వచ్చేదాకా
మౌనాన్ని కప్పుకొని నిద్రిస్తున
ఇల్లూ, ఇంట్లో ప్రతి వస్తువూ
నువు రాగానే
సంగీత వాద్యాలై కచ్చేరీకి ఉపక్రమిస్తాయి
ర్యాక్ నిండా పుస్తకాలు
హార్మోనియం మెట్లై నీ వేళ్ళ స్పర్శకోసం
తపిస్తుంటాయి
నీ ముఖంలోకి చూసుకొని
అద్దం తననితను దిద్దుకోవాలని
ముచ్చట పడుతుంది”

(శివకుమార్, వఝుల. 2004: 61)

ఇంట్లో చిన్నపిల్లలుంటే ఆ సందడే వేరు. వాళ్ళు చేసే అల్లరి, మాట్లాడే బుజ్జిబుజ్జి మాటల్లో పరవశం పొందుతారు ఇంటివాళ్ళు. ఆ పరవశాన్ని ఎక్కువగా అనుభవించి దాన్ని కవిత్వంగా మలిచారు కవి. తప్పటడుగులు వేసుకుంటూ ఇంట్లో దొరికే ప్రతి వస్తువును కింద పడేస్తుంటారు. అది ఇక్కడ సంగీత వాద్య కచ్చేరి అయింది. ర్యాక్‌లోని పుస్తకాల్ని తీసి తిప్పుతుంటారు. ఆ పుస్తకాలు హార్మోనియం మెట్లయ్యాయి. అద్దంలో చూసుకొని సంబరపడతారు. అద్దం తనని తాను చూసుకొని మురిసిపోవడమైంది. ఇలా ప్రతి అంశాన్ని ఒక చిత్రంగా భావంలో ఒదిగించారు కవి.

“బతుకమ్మంటే....?
విప్లవగీతం, బహుజన కథ
దిగంబర కవిత్వం, అంబేద్కర్
భూ పోరాటాల వారసత్వ సంపద, శ్రామిక సంస్కృతి...
ఏముడాల రాజన్న, కొమురెల్లి మల్లన్న
కొత్త కొండీరన్న, యదగిరి నర్సన్న

బాసర సరస్వతి, లష్కర్ బోనాల పండుగ
సింగరేణి గనులు, పోచంపాడ్, నిజాంసాగర్
శ్రామిక జనుల వర్గమాండలికం...”

(దేవేందర్, అన్నవరం(సంపా). 2010: 72)

ఇక్కడ కేవలం బతుకమ్మ సౌందర్యాన్ని చెప్పకుండా కొత్త అర్థాన్ని ఇచ్చారు కాలువ మల్లయ్య గారు. ప్రశ్నతో కవితను మొదలుపెట్టి దానికి సమాధానంగా కవితని నడిపించారు. అలాగే బతుకమ్మ కేవలం తెలంగాణ ప్రాంతానికి మాత్రమే సంబంధించింది. బతుకమ్మను తెలంగాణ ప్రాంతానికి ప్రతీకగా తీసుకుంటే ఆ తెలంగాణ అంటే ఏమిటి, ఏమేమి ఉన్నాయో తెలుస్తుంది.

“నేల తపస్సు చేస్తున్నది నీటికోసం
మండుటెండలు
మట్టిగుండెను మలమల మాడుస్తున్నాయి
వీచే గాడ్పులు కణకణలాడే ఆవిరులై
గరికపోచల ముఖాలను కమరిస్తున్నాయి.
నీలాకాశం
నెర్రెలు వారిన బీడులా పరుచుకుని వుంది.
ఎంత చూసినా అక్కడ
ఒక్క మబ్బు మొలకైనా కనబడడం లేదు.”

(నారాయణరెడ్డి, సి. 2010: 24)

పెరుగుతున్న కాలుష్యంవల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటుంది. ఓజోన్ పొర దెబ్బతిని ఎండ తీవ్రత పెరుగటం, వర్షాలు సరిగ్గా పడకపోవటం జరుగుతుంది. అలాంటి స్థితిని అత్యంత అద్భుతంగా వివరిస్తున్నారు. ‘మట్టిగుండెను మలమల మాడ్చడం, ఎండ గాడ్పులు గరికపోచల ముఖాలను మాడ్చడం’ ఎండ తీవ్రతను తెలియజేసే భావచిత్రాలు. ఆకాశ కూడా నెర్రెలు వారిన బీడుతో పోల్చడంవల్ల చెప్పదలుచుకున్న విషయ భయానక దృశ్యాన్ని కళ్ళముందు చిత్రిస్తున్నారు. ఆకాశాన్ని నేలతో, మబ్బుల్ని మొలకలతో పోల్చడం కవి ప్రతిభకు నిదర్శణం.

"నెత్తుటితో స్నానించిన మతం
కత్తుల కురులు విచ్చుకుంది
తెగిన తలలు చిమ్మిన రక్తంతో
సబర్మతీ నది గడ్డకట్టింది"

(దేవేందర్, అన్నవరం. 2003: 41)

మతం ఒక భావన. స్నానం మామూలుగా మనుషులు నీళ్లతో చేస్తారు. ఇక్కడ మతం నెత్తుటితో స్నానం చేసిన అంటే కొట్లాటలు, గొడవలవల్ల రక్తపాతం జరగడం. ఇక్కడ కత్తులను కురులతో పోల్చడంతో భయానక దృశ్యం ఆవిష్కృతమైంది. మనిషి రక్తం నదిలో కలవడంవల్ల నది గడ్డకట్టింది అని చెప్పడంతో ఎంతటి విధ్వంసం జరిగిందో తెలుసుకోవచ్చు.

"మందార పూసింది
ఆకాశానికి.
ఆకుపచ్చరంగేసి
బొట్టుపెట్టినట్లు."

(వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 2)

ఉదయాన్ని తెలుగు సాహిత్యంలో ప్రాచీనకాలం నుంచి ఇప్పటిదాకా చాలామంది కవులు చాలా రకాలుగా వర్ణించారు, వర్ణిస్తూనే ఉన్నారు. ఇక్కడ కూడా కవి ఉదయవర్ణనని ఒక దృశ్యమానంగా మనకు అందిస్తున్నారు. పొద్దుపొడవగానే సూర్యుడు ఎర్రగా ఉంటాడు. అది మందారం. అప్పుడప్పుడే కొండమీదినుంచి వస్తుంటాడు కనుక ఆ కొండభాగమంత పచ్చగా ఉండడంతో దాన్ని అలుకుగా భావించారు కవి. ఇలా ఉదయకాలాన్ని అందంగా దర్శించారు, వర్ణించారు.

### ౬.౨.౩. భాష (Diction)

శైలీశాస్త్రంలో భాషది ప్రధాన పాత్ర. భాష ఆధారంగానే ఒక కవి ప్రతిభని, శైలీని అంచన కడతారు. ఈ శైలీవల్ల ఆ కవి శిల్పాన్ని సాధిస్తారు. కవి తన ఎన్నుకున్న వస్తువుకు, చెప్పదలుచుకున్న భావానికి సరైన భాషను వాడకపోతే ఆ వస్తువు, భావం గందరగోళమై పాఠకుడి మనసుకు చేరదు. కనుక రచనలో ప్రధానపాత్ర పోషించేది భాషే. రచనలో భాషను ఎలా వాడుకున్నాము అన్నదాన్నిబట్టి కవి ప్రతిభ ఆధారపడి ఉంటుంది.

### 6.2.3.1. గ్రాంథిక భాష (Textual Language)

"కుక్షినిండ భక్షించి
సుమాళివై నిద్రించకు
ఈ రోజైనా!
వ్యధ చెందెడి జనుల చూచి
వెతల కతము తెలుసుకొనుము
ఈ రోజైనా!
మంచికి మోసం జరుగునెందుకు?
వంచన నిత్యం బ్రతుకునెందుకు?
యోచించుము ఈరోజైనా!
ధనికుల మాటలు చెల్లునెందుకు?
పేదల మాటలు వమ్మవు నెందుకు?
యోచించుము ఈ రోజైనా!"

(కిషన్‌రావు, రేగులపాటి. 2010: 20)

దాదాపు కవితంతా గ్రాంథిక భాషలో ఉంది. తెలుగు వచన కవితా ఆవిర్భావానికిగల కారణాల్లో భాష ఒక్కటి. కేవలం పాండిత్య ప్రకర్షణకోసమే దీర్ఘ సమాసాలు, శ్లేషార్థాలు వచ్చే సంస్కృత పదాల్ని ఉపయోగించి కావ్యాలు, ప్రబంధాలు రాసేవారు. ఈ కావ్యాలు, ప్రబంధాలు కేవలం పండితులకు మాత్రమే అర్థమయ్యేవి. సామాన్య పాఠకులు చదువుకోవాలంటే వ్యాఖ్యానాలు అవసరమయ్యేవి. అలాంటి భాషని కాదని సామన్య పాఠకుడు కూడా ఏ నిఘటువులు, వ్యాఖ్యానాలు అవసరం లేకుండా చదువుకొని రసాస్వాదన పొందేల భాషా సౌలభ్యం దృష్ట్యా వచన కవిత ఆవిర్భవించింది. అందుకే శ్రీశ్రీ "శ్మశానాలవంటి నిఘంటువులదాటి / వ్యాకరణాల సంకెళ్ళు విడిచి / ఛందస్సుల సర్ప పరిష్వంగం వదిలి / వడిగా, వడివడిగా / వెలువడినై, పరుగిడినై, నా యెదనడుగిడినై!" (శ్రీశ్రీ. 2009: 68) అని అన్నారు.

"కటిక రేయిలాంటి నా జీవితంలో
కాంతులేవి లేక కన్నీళ్ళు రాల్చుచున్నాను
వెక్కెక్కి ఏడుస్తూ అరవలేక అరచేతితో

కన్నీళ్ళు తుడుచుకుంటున్నాను
ఎదదాటిరాలేని ఆవేదనను
ఎన్నో యేళ్ళుగా నాలోనే ఇముడ్చుకుంటున్నాను
ఈ స్థితి ఈనాటిది కాదు
బాల్యము నుండె మొదలైనది
ఇల్లు విడిచి కన్నవాళ్ళను విడిచి
ఇహలోక ఆశలతో ఎనలేని బాధలతో...
ఎన్ని బ్రతుకుదారులు ఏపర్చుకున్నానో...
నా బ్రతుకు దారులన్ని ఎడారులై
నా బ్రతుకంతా...! బహు ఘోరమై
బాధతప్తమైన నా హృదయాన్ని ఓదార్చుకోలేక
ఓదార్చేవారెవరు నావెంటలేక
వెక్కెక్కి ఏడ్చిన రోజులు లెక్కకు మించినవే...
(రవీందర్, నాగిళ్ళ. 2005: 30)

రాల్చుచున్నాను, బాల్యము, ఇహలోక, బ్రతుకుదారులు మొదలైన పదాలు గ్రాంథికానికి సంబంధించినవి. రాలుస్తున్నాను, బాల్యం, భూలోక, బతుకుదారులు ఇలా ఇప్పుడు రాస్తున్నారు. సమకాలీన భాష పదాలు వాడి ఉంటే ఈ కవిత మరింత పఠనీయత వచ్చేది.

“నన్ను వదలి పెట్టుమురా
చేయి వదలి పెట్టుమురా
కన్ను తెరచి చూడుమురా
చెల్లెలాగా చూడుమురా
కామదృష్టి వదిలి పెట్టి చెల్లీ! అని పిలువుమురా
నాపై నీ కామదృష్టి చెల్లదురా చెల్లెనురా
అన్నలాగా చూచుకొందు అన్నా! అని పిలుచుకొందు
నీ చెల్లెలు మోము చూచి నా మోమును చూడుమురా
చెల్లీ అని పిలిచి నాదు చేయి వదలి పెట్టుమురా

అన్నా! అన్నా! అన్నా! అని నిన్నెప్పుడు పిలుచుకొందు
పిలుపు, పిలుపులో చెల్లెలి
ప్రేమనెపుడు తెలుపుకొందు"

(కిషన్‌రావు, రేగులపాటి. 2005: 29)

సందేశాత్మకంగా సాగినా ఈ కవితలోని భాష పాఠకులని కొంచెం ఇబ్బంది పెడుతుంది. వ్యవహార భాష, మాండలిక భాషల్లో రచనలు సాగుతున్న నేటి తరుణంలో గ్రాంథిక భాష కొంత ఇబ్బందికి గురి చేస్తుంది. చెప్పే విషయం ఎంత మంచిదైనా భాష సరిగ్గా లేకపోతే అది పాఠకులకు చేరదు.

### 6.2.3.2. మాండలిక భాష (Dialect Language)

"మాకు మా బూమ్మీద లావు ఆపేచ్చ
మా పానమంత పావురం
కని కాల్రెక్కలిచ్చిందీ ఈతల్లే
విత్తుకు పాలిచ్చి మొల్క జేసి
గొల్కై గోస దీర్చింది ఈ తల్లే
ఇగురం నేర్పిందీ ఇమానం నేర్పిందీ ఈ తల్లే
అచ్చు గట్టీచ్చి ఇదుగిరువాల్దున్ని
పిడికెడు కలలు జల్లితే
పొదిగి నిజం చేసింది."

(శివకుమార్, వఝుల. 2004: 58)

కవిత్వ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించేది భాష. ఈ కవితలో కూడా కవి తన స్వంత మాండలిక భాషలో కవితని నడపడం వల్ల కవితకి సహజత్వం వచ్చింది. అస్తిత్వవాద ఉద్యమాల వల్ల సాహిత్యానికి అందిన గొప్ప కానుక వారి వారి వర్గాలకు, కులాలకు, ప్రాంతాలకు చెందిన పదాల్ని సాహిత్యంలోకి తీసుకురావడం. స్త్రీ, దళిత, మైనారిటీ వాదాల్లో ఈ లక్షణం కనిపిస్తున్నా తెలంగాణ ఉద్యమంవల్ల మరింత విస్తృతమైంది. "ఇక మనం అభివ్యక్తి గురించి ఆలోచించినప్పుడు అనివార్యంగా భాషను గురించి ఆలోచించక తప్పదు" (సీతారాం. 2007: 10). ఈ కవితలోని 'ఆపేచ్చ, పానమంత, గోస, ఇగురం, ఇమానం, ఇదుగు, ఇరువాలు' మొదలైన పదాలు కవితకి మరింత బలాన్ని చేకూర్చాయి.

"జరసైసు బిడ్డ
వీల్లెమో లావు నీల్గుతున్నరు
మైసమ్మ పోతులోల్గె బలిసి
ఊరికేమో చేసినట్లు
ఉరిమి ఉరిమి సూత్తుండ్రు
కంకెడు కంకెడు మీసాలు
కాగోలె బొత్తెలున్నోల్లు
ఏం సగబెట్టిండ్రు"

(దేవేందర్, అన్నవరం. 2003: 22)

కవి తన ప్రాంత మాండలిక పదాలైన 'జరసైసు, నీల్గుతున్నరు, మైసమ్మ పోతులు, కంకెడు, కాగు, బొత్త, సగపెట్టడం' వాడడంవల్ల శిల్పాన్ని సాధించాడు. చేకూరి రామారావు 'మాండలికం కవిత్వభాష కాదా?' అన్న వ్యాసంలో ఒక్కచోట "అలంకారాల్లేవు. అర్థంకాని మాటల్లేవు. అన్వయ కాఠిన్యం లేదు. అసలు సంకేతాలే లేవు. భావాల కుదింపులు లేవు. సాధారణంగా వచన కవిత్వంలో కనిపించే కవితా సామగ్రి ఇందులో లేదు. అయినా ఇది కవిత్వంగా నిలిచింది, తన సొంత కాళ్ళమీద" (రామారావు, చేకూరి. 1991: 104) అని అన్నారు. ఇక్కడ 'తన సొంత కాళ్ళమీద' అన్న మాటలు మాండలిక భాషని స్ఫురింపజేస్తాయి. అది మాండలిక భాషకున్న విశిష్టత, గొప్పతనం. ఇక్కడ కూడా కవిత సొంత కాళ్ళమీద నిలబడింది. సహజ జీవిత సన్నివేశాల్ని చెప్పేటప్పుడు మాండలికాన్నే వాడితే స్ఫూర్తిని కలిగిస్తాయి.

"దగ్గరికిపోయినప్పుడలా
మూతిఇటు ముక్కుఅటు
అంతా వద్దు పెరుగు కలిపిన
కొస ముట్టనియ్యనితనం
ఇవ్వాల రేపట్ల
ఎడ్డిర్కం లేని మనిషి
కావాల్నంటే

ఎక్కడ దొరుకుతాడు
కంట పడుడు మహా కష్టం”

(శోభారాణి, కొలిపాక. 2004: 60)

పని ఉందని వెళితే బాధల్ని వినేవారే లేరు. సహాయం చెయ్యకపోగా మనపని మనం చేసుకున్న వెక్కిరించే జనాలే నేటి కాలంలో అధికం. అలాంటి మనషుల గురించి స్వంత భాషలో చెప్పడంవల్ల కవితకొక అసామాన్య శిల్పం వచ్చింది. ఈ కవితలో వాడిన ‘మూతిఇటు ముక్కుఅటు, అంతా వద్లు పెరుగు కలిపిన, ఎడ్డిర్కం లాంటి పదబంధాలు, పదాలు ఈ కవితకు బలాన్ని చేకూర్చాయి.

“శెప్పుకుంటే మానంబోతది
శెప్పకుంటె పానంబోతది
ఇల్లిల్లు ఏ పొంటెకాపొంటె
శెబదల్లతోటి గడ్పవట్టె
పల్లె కండగరిగించి పెర్గిన పంట
పట్నం గోదాములల్ల నిండిపాయె
పల్లె గుమ్మిల గుండె బేజారై
మక్కజొన్న గట్కకు తెల్ల జొన్నంబలికి మొకం వాశిపాయె
నీళ్ళతోటన్న పానం నిల్పుదామంటె
నిరుటి పూడ్కెదేలి బొట్టుబొట్టుకు గండమాయె”

(వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 11)

ఊరిలో దోపిడిని, కరువును పల్లె భాషలోనే చెప్పడంవల్ల ఈ కవితకి శిల్పం చేకూరింది. ఈ వస్తువును వ్యవహారిక భాషలో కూడా రాయవచ్చు. కాని ఈ కవితకు వచ్చినంత సౌందర్యం వ్యవహారిక భాషవల్ల రాదు. పల్లె గురించి చెప్పేటప్పుడు స్థానిక భాషని ఉపయోగించడంవల్ల మరింత ఆకర్షణీయంగా మారుతుంది.

“పైసపైస గూడవెట్టి
మత్తుగ తెత్తననుకున్న
మస్కటు తొవ్వమరిసి దూరమైందు
సేతిల పగ్గమే

మెడకు ఉగ్గమయింది
నవ్వుల పాలయిన బతుకు
నాయం కోసం ఎనుకులాడింది
సూసి సూసి సుక్కల్ల జేరిండు
అయినోల్ల మనసులల్ల
ఆరిపోకుంట నిలిశిండు"

(నరహరి, డింగిరి. 2005: 83)

ప్రపంచీకరణవల్ల తెలంగాణలో వృతులన్ని అన్నంపెట్టని కన్నతల్లులైనప్పుడు ఆ తల్లిని నమ్ముకున్న వారంతా వలసపోయారు. పై కవితలో కూడా చేనేత వృత్తిని నమ్ముకున్న వ్యక్తి ఆ పనివల్ల బతుకుదెరువు లేకపోయేసరికి మస్కట్(దుబాయ్)కు వలసపోయాడు. కాని అక్కడ కూడా డబ్బులురాక చివరికి చనిపోయాడు. ఈ వేదనాభరితమైన సన్నివేశాన్ని కవి స్వంత భాషలో చెప్పడంతో సహజత్వం వచ్చింది. 'మత్తుగ, తొవ్వమరిసి, దారమైందు, ఎనుకులాడింది, సుక్కల్ల జేరిండు, నిలిశిండు' లాంటి ప్రాంతీయ పదజాలం ఈ వస్తువుని ఉన్నతంగా తీర్చిదిద్దింది.

"ఎర్రగ బుర్రగ స్టేజిమీద ఆగిందా
ఇంటికి సుట్టం వచ్చినంత సంబురం
ఎక్కన్నో దూరం వందల వాహనాల్లో
మోనోగ్రాం తళతళ మెరిస్తే చాలు
మా ఊరు చక్రాలమీ ఉరికచ్చినట్టు
దాన్నిండ తెల్సిన బలగమే నిండినట్టు
మనసంత చెంగలిచ్చి పులకరిస్తది

(దేవేందర్, అన్నవరం. 2008: 42)

తెలంగాణ ఉద్యమం సమయంలో వచ్చిన సాహిత్యంలో తెలంగాణ పదజాలం విస్తృతంగా వచ్చింది. ఆయా ప్రాంతాల పదజాలాలతో ఎన్నో కవిత, కథ సంకలనాలు, సంపుటాలు, నవలలు, వ్యాసాలు వచ్చాయి. ఈ కవితలో కూడా ఇదే చూడవచ్చు. అన్నవరం దేవేందర్‌గారు మొదటినుండి మాండలికంలోనే కవిత్వం రాస్తున్నవారు. తన కవిత్వ సంపుటాలైన 'తొవ్వ', 'నడక', 'మంకమ్మతోట లేబర్ అడ్డా', 'పొద్దుపొడుపు',

'బొడ్డుమల్లెచెట్టు' లాంటి వాటిల్లో మాండలిక కవిత్వాన్ని చూడవచ్చు. అన్నవరం దేవేందర్ కవిత్వానికి కొత్త డిక్షన్ ఉంటుంది. తన స్వంత భాషని భావాలకనుగుణంగా వాడుకోవడంవల్ల కవిత్వానికి ఒక ప్రత్యేకత వచ్చింది. "ఒరిజినాలిటీ వున్న కవి భాషని యదాతథంగా వాడుకోడు. తాను చెప్పదలుచుకొన్న భావానికనుగుణంగా మలుచుకొంటాడు. దాన్ని సాహిత్య విమర్శకులు డిక్షన్ అన్నారు. పాత మాటల్ని కొత్త అర్థాల్లో వాడుకోవడం, ఉన్న మాటల్ని కొత్త కూర్పుతో వాడుకోవటం ఈ డిక్షన్ లక్షణం" (చేరా. నవతెలంగాణ. 19.12.2017). అన్నవరం దేవేందర్ కవిత్వానికి ఉన్న గుణం ఒరిజినాలిటీ. ఏ వస్తువునైన పల్లెనుంచి చెప్పడం అన్నవరం కవిత్వంలో గుర్తించదగ్గ విషయం.

"తొవ్వలు పెద్దగ జేత్తరు
అడ్డం వచ్చిన పెద్దపెద్ద చెట్లను నరికి అవతల పారెత్తరు
ఎండలు లగాయించి దంచుతయ్
చలి మాదండిగ పెడుతది
వాన కొడితే ఒక్కతీర్గ కుండపోత
లేకుంటే బొత్తిలకే గుండుసున్న
మల్లి నెత్తిన నోరు సేసుకు గా బాటలపొంటే
మొలకలు పాతిపెట్టుడు
రా గాడిది పో గాడిది పుజూల్ పన్లు"

(జగన్నాథం, జూకంటి. 2013: 92)

జూకంటి కవిత్వంలో సహజంగా ఒదిగిపోయే పదజాలం ప్రాంత విశిష్టతను చెబుతుంది. "జూకంటి భాషలోనూ మూడు మార్గాలున్నాయి. ఇవి తెలంగాణాలోని నుడికారం, జాతీయాలను, ఇతరాలను చేర్చే సంప్రదాయిక భాష. శాస్త్రాల అధ్యయనం వల్ల, రాజకీయ కారణాల వల్ల, సాహిత్యం వల్ల చేరిన ఆధునిక పరిభాష, ప్రాంతీయ జనజీవితాన్ని, శైలినీ స్పష్టం చేయగల, ప్రస్ఫుటం చేయగల ప్రజల భాష. జూకంటి విషయంలో ఆధునికమైన సాహిత్య పదజాలం తక్కువే. తెలంగాణ సంప్రదాయిక, ప్రాంతీయాస్తిత్వ ముద్రగల జీవద్భాషలే జూకంటిలో ఎక్కువ. నామ్నీకరణాలు, క్రియలు, సాధారణంగా భాషలోని పదాల మధ్య ఉండే సంయుగ్మ బంధాలు వీటికి సంబంధించి ఆయనలో ఒక మౌలిక నిర్దిష్టత ఉంది" (నారాయణశర్మ, ఎం. 2016: 16). జూకంటి జగన్నాథంగారు ఇక్కడ ఉపయోగించింది

కూడా స్థానిక భాషే. 'లగాయించి, మాదండిగ, ఒక్కతీర్గ, బొత్తిలకే గుండుసున్న' లాంటి పదాలు కవితకు చిక్కదనాన్ని చేకూర్చడంతోపాటు ప్రాంతీయ ఉనికిని నిలిపాయి.

### ౬.౨.౩.౩. సమ క్రియల వాడకం

"ఎంత సవరించినా,
గొంతునుండి స్వరాలు రావడం లేదు.....
ఎంత చికిలించినా
కళ్ళనుండి చీకటి తెరలు జారడం లేదు....
ఎంత అదిలించినా,
గుండె క్రమబద్ధంగా కదలడం లేదు...."

(రవీంద్ర, సంగెవేని. 2005: 73)

సమాన పదాల్ని వాడడం గజల్‌లో కనిపించే లక్షణం. ఎందుకంటే గణాల సంఖ్య కలవాలి, అంత్యప్రాస సరిపోవాలి. ఇక్కడ కూడా కవి 'ఎంత సవరించినా, ఎంత చికిలించినా, ఎంత అదిలించినా' మొదలైన పదాల వాడడం, చివర 'రావడం లేదు, జారడం లేదు, కదలడం లేదు' మొదలైన సమాన క్రియా పదాలు వాడడంతో శిల్పాన్ని సాధించారు కవి.

"మనస్సు
సుమనస్సులా
పరిమళించాలి
ఉషస్సులా
భాసించాలి
పయస్సులా
ప్రవహించాలి
హవిస్సులా
ప్రజ్వలించాలి"

(తిరునగిరి. 2009: 8)

మనస్సు, సుమనస్సు, ఉషస్సు, వయస్సు, హవిస్సు లాంటి సమానమైన పదాలు, పరిమళించాలి, భాసించాలి, ప్రవహించాలి, ప్రజ్వలించాలి అన్న సమాన క్రియా పదాల ద్వారా అంత్యప్రాసను, లయని సాధించారు.

"తొడిగిన చిగుళ్లు తొందరపడుతున్నాయి
తాము శాఖలుగా విస్తరించేదెప్పుడా అని.
చెక్కుతున్న శిలలు ఆరాటపడుతున్నాయి
తాము శిల్పాలుగా మూర్తీభవించేదెప్పుడా అని.
జలలూరే తలుపులు కలవరపడుతున్నాయి
తాము కవితలుగా ప్రవహించేదెప్పుడా అని.
సృష్టిలో అన్నిటి దృష్టి వికాసం వైపే"

(నారాయణరెడ్డి, సి. 2009: 75)

సి. నారాయణరెడ్డిగారు గజల్స్ రాసిన వారు కావడం చేత ఒకే విధమైన క్రియల్ని ఎక్కువగా వాడడం తెలిసి ఉంటుంది. పై కవిత కూడా కొంచెం గజల్ లాగానే ఉంది. గజల్‌లో మొదటి రెండు పాదాలు ఇలానే ఉంటాయి. తొందరపడుతున్నాయి, ఆరాటపడుతున్నాయి, కలవరపడుతున్నాయి ఇలా ఒకే విధమైన క్రియల్ని వాడారు.

"చెట్టు మీదనే వాలుతాయి
నేల మీదనే తిరుగుతాయి
నింగిలోనే ఎగురుతాయి
గూటి చయములో నివసిస్తాయి
కలిసిమెలిసియే వివరిస్తాయి
సడలని చెలిమితో జీవిస్తాయి
ఆహారాన్వేషణ సాగిస్తాయి
అందిన తిండిని భుజిస్తాయి"

(కిషన్‌రావు, రేగులపాటి. 2010: 28)

మనుషులకున్న ఈర్ష ద్వేషాలు, కులం, మత కొట్లాటలు, స్వార్థం, మనిషిని మనిషి మోసం చెయ్యడం ఇలాంటివన్నీ పక్షులకు లేవనీ అవే మనుషులకన్న గొప్పవని కవి చెబుతూ వాటిని వర్ణించే క్రమంలో వాలుతాయి, తిరుగుతాయి, ఎగురుతాయి ఇలా ఒకేరకమైన

క్రియల్ని ఉపయోగించి చిన్నచిన్న కవితా వాక్యాలుగా మార్చడంవల్ల కవితకు సాధారణత్వం వచ్చింది.

### 6.2.3.4. జాతీయాలు, సామెతలు, నానుడుల ప్రయోగం

"ఏకంగ
మా నెత్తుల మీదనే అడ్డ చిటాయించి(నా.
బూములు జాగలు
నీళ్ళు నిధులు
ఉద్యోగాలు అన్ని ఊడప్ప–మొత్తం మాయం
మంది మాటలు పట్టుకొని మార్మానం బోతె
మల్లచ్చె వరకు ఇల్లు గాలినట్టు
పెద్ద మనుషుల ఒప్పందాన్ని నమ్మినందుకేనా
మీతోని మా బతుకులిట్ల కాలవడ్డయి?"
(దేవేందర్, అన్నవరం(సంపా). 2010: 41)

అని నలిమెల భాస్కర్ గారు తెలంగాణలో సీమాంధ్ర వలసవాదులవల్ల జరిగిన అన్యాయాన్ని చెబుతున్నారు. విశాలమైన అర్థాన్ని మామూలుగా సూచించేందుకు, చెప్పదలుచుకున్న విషయాన్ని బలంగా చెప్పడానికి సామెతలు, జాతీయాలు, నానుడులు ఉపయోగపడతాయి. 1956లో ఒకే భాష మాట్లాడే ప్రజలంతా ఒకే రాష్ట్రంగా ఉండాలని ఉద్దేశ్యం ఒకటి ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ నాయకుల్లో ఏర్పడింది. కాని అప్పటికే అధిక రెవెన్యూ గల తెలంగాణ ప్రాంతం ఒక రాష్ట్రమయ్యాక అభివృద్ధికి చెందుతుందో, లేదో అన్న అనుమానం తెలంగాణ ప్రజలకు ఉండేది. అయినా కొందరు పెద్దమనుషుల కలిసి కొన్ని అంశాల్లో ఒప్పదం చేసుకొని సంతకాలుపెట్టి ఒక రాష్ట్రంగా ఏర్పాటు చేశారు. అయితే ఈ ఒప్పందలో అంశాలు కార్యచరణగా రూపుదాల్చక పోవడంతో తెలంగాణ అంతట వ్యతిరేకతక ఏర్పడింది. తెలంగాణ ప్రజలకు ఇష్టం లేకున్నా బలవంతంగా ఒక రాష్ట్రం కావడంతో నష్టపోయిన స్థితిని 'ఎవరో చెప్పారని ఇల్లరికం పోతే తన ఇంటికివచ్చేసరికి ఇళ్ళు కాలిపోయిన' అనే జాతీయంతో పోల్చడం ఔచిత్యవంతంగా ఉంది.

"అంతా ఏరుదాటి తెప్పతగిలేసుకున్న
కొత్త సంస్కారం
మునిగిపోతున్న కాళ్ళకింది నేలకంటే
ముంచిపోతున్న గాలిమీదే
వ్యామోహాల క్రేజీ"

(శివకుమార్, వర్ధుల. 2004: 13)

ఏరుదాటి తెప్పతగిలెయ్యడం అంటే పని అయిపోయాక వదిలేయడం అన్నమాట. అవసరానికి మనుషుల్ని వాడుకోవడం. మనిషికి విలువ తగ్గి డబ్బుకు విలువ పెరగడంవల్ల ఒక మనిషిని మరో మనిషి తన అవసరాలకు వాడుకుంటున్నాడు. తన పని అవ్వగానే నువ్వెవరు అన్నట్టుగా ప్రవర్తిస్తున్నారు.

"ఇల్లు అలుకంగనే పండుగైతుందా!
బాణాసంచా కాల్చడాలెందుకు?
స్వీట్లు పంచుకొని తినడమెందుకు?
సంబరాలు, ఊరేగింపులు చెయ్యడాలెందుకు?"

(లక్ష్మీనారాయణ, సబ్బని. 2010: 6)

అప్పుడే ప్రారంభించి ఇంకా గమ్యం చివరిదాకా చేరకముందే సంబరపడేవాళ్ళను ఉద్దేశించి ఈ సామెత వాడతారు. ఎన్నో రోజుల పోరాటం తర్వాత కేంద్ర ప్రభుత్వం 2010, డిసెంబర్ 9న చిదంబరంతో తెలంగాణ ప్రక్రియ మొదలవుతుంది అని ప్రకటన చేయించింది. అప్పుడే తెలంగాణ వచ్చినట్టు తెలంగాణ ప్రజలంతా బాణసంచా కాల్చడం, స్వీట్లు పంచిపెట్టుకోవడం, సంబరాలు చేసుకోవడం జరిగింది. వీళ్ళను ఉద్దేశించి కవి ఇప్పుడే ఏమీ కాలేదు. తెలంగాణ ఏర్పాటుకు ఇంకా చాలా సమయముందని చెప్పడానికి ఈ సామెతని ఉపయోగించారు.

"ఏరు దాటి తెప్ప తగిలేసే
వడ్డించే వాడు పరాయి వాడైతే
ఏం ప్రయోజనం?
సంస్కృతి, సామాజికోద్యమ వారధులా?

ఎడ్డయిన, గుడ్డయిన తన కొడుకులుండాలే....

తర్రయిన, బుర్రయిన తన సేను పండాలే....!"

(బాలయ్య, పొన్నాల. 2008: 24)

తెలంగాణ ప్రజలు ఎంత ఉద్యమం చేసినా ఇచ్చేవాళ్ళు మనవాళ్ళైతేనే తెలంగాణ వస్తుంది. సీమాంధ్ర తెలంగాణతో కలిసి ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటినుండి తెలంగాణకు దక్కాల్సిన వాట దక్కకపోవడానికి కారణం వడ్డించేవాడు మనవాడు కాకపోవడమే. అంటే అధికారంలో మనవాళ్ళు లేకపోవడంతో తెలంగాణకు అన్యాయం జరిగింది. మంచోడైనా, చెడ్డోడైనా మనవాళ్ళే అధికారంలో ఉన్నప్పుడే మనకు అందాల్సిన ఫలితాలు అందుతాయి.

"కడుపులో చల్ల కదలకుండ
కలం తిప్పే వీరులం మేము!
కనువిప్పు వైనావు మాకు సీతారామూ!
వైరసు కాటేసిన శాపోపహతుల బతుకుల్లో
ఆశల వెలుగుల్ని అలవోకగా చిలకరిస్తూ
అర్థవంతమైన బతుక్కి
అందమైన నిర్వచనమైనావు ఆశారామూ"

(ఎలనాగ. 2010: 65)

ఉద్యమం జరుగుతున్నప్పుడు ఆ ఉద్యమంలో పాల్గొనక కొంతమంది కవులు కడుపులోని చల్లకదలకుండా కూర్చొని కవిత్వం రాసేస్తారు. కొంతమంది మాత్రం ఉద్యమంలో పాల్గొని వారి అనుభవాల్ని, వారు చూసిన ప్రజల కష్టాల్ని కవిత్వంగా మలుస్తారు. ఈ కవిత 30.11.2009న ఆంధ్రజ్యోతి వివిధలో వచ్చిన సీతారాం అనే చేతలకవి గురించి చదివి ఈ కవిత రాసానని చెప్పారు కవి. ఈ కవిత చివర్లో చేతల కవైన తనకి రాతల కవులైన మేమంత చేతులెత్తి నమస్కారం చేస్తున్నామంటాడు కవి.

"నిప్పుల్ల బొర్లుడు పక్షిపక్షోలె అర్సుడు
ఇనరాదు కనరాదు మ్యాల్లంకాదు మొరపుట్టదు
యాభై ఏండ్ల నుంచి
గుట్టకు కుక్క మొరిగినట్లాయె"

(జగన్నాథం, జూకంటి. 2013: 156)

తెలంగాణ ఉద్యమ కాలంలో కవిత్వం ఎక్కువగా వచ్చింది. ఈ కవిత్వమంతా వివక్ష, దోపిడి, అన్యాయాన్ని ప్రశ్నిస్తూనే తెలంగాణ ప్రాంత చరిత్ర, సంస్కృతి, కళల గొప్పదనాన్ని తెలియజేస్తూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని బలంగా కాంక్షించింది. యాభై ఏండ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఎంత చెప్పినా వినే వ్యక్తులు లేరనీ, ఆ చెప్పిన మాటలన్నీ వ్యర్థమయ్యాయనే ఉద్దేశ్యంలో కవి 'గుట్టకు కుక్క మొరిగినట్టు' అన్న సామెతను వాడారు. గుట్టవైపు నిలబడి కుక్క ఎంత మొరిగినా సమాధానంకాని, ఎలాంటి చర్యగాని ఉండదు. అలాగే తెలంగాణ గురించి తెలంగాణేతర వాళ్ళ దగ్గర, తెలంగాణ ఇష్టంలేని వాళ్ళ దగ్గర ఎంత చెప్పినా ప్రయోజనం ఉండదు.

### ౬.౨.౪. విరోధాభాసం (Paradox)

వాక్యాలు ఒకదానికొకటి వ్యతిరేకంగ కనబడినా వాటి మధ్య ఒక సత్యం ఉంటుంది. అసంబద్ధంగా కనబడుతూ లోపల ఒక అనుగుణ్యతనీ, సత్యాన్నీ కలిగివుండే వాక్యాల్ని తయారు చేయడం. “A paradox is a statement which seems on its face to be logically contradictory or absurd, yet turns out to be interpretable in a way that makes good sense” (Abrams, M.H. 1999: 201). పైకి అసంబద్ధంగా, వ్యతిరేకంగా ఉంటూనే తర్కబద్ధమైన భావాన్ని అందిస్తుంది.

“పట్టపగలే
నగరం నడిబొడ్డుమీద
రోడ్డుమీద
చీకట్ల ప్రవాహం”

(జగన్నాథం, జూకంటి. 2013: 16)

సూర్యుడుదయించగానే వెలుగు వస్తుంది. ఇంకా ఇక్కడ పట్టపగలు అని అనడంతో మరింత ప్రకాశవంతమైన వెలుగు ఉంటుంది. అలాంటప్పుడు చీకటి ఉండడం అసంభవం, అసాధ్యం. కాని కవి చెప్పదలుచుకుంది ఏంటంటే పగలైతే జనసంచారం ఉంటుంది. నగరంలో రోడ్డు మీద జరిగే ఏ విషయాన్నైనా, అన్యాయాన్నైనా జనాలు చూస్తారు, ఎదురిస్తారు. చీకట్లో అయితే ఏ అన్యాయం జరిగిన ఏర్పడదు, కనిపించదు. కాని పట్టపగలే జరిగే అన్యాయాన్ని చూసి చూడనట్టు, ఎవరికి పట్టనట్టు జనం వెళ్ళిపోవడంతో కవి ఈ

వాక్యం రాయాల్సి వచ్చింది. అలాగే కవి ఉదయమో, సాయంత్రమో అని అనలేదు. ఎందుకంటే ఉదయం, సాయంత్రాలు అంతగా వెలుగుండదు. పట్టపగలు అనడం ద్వారా చెప్పే విషయాన్ని మరింత బలంగా మలచగలిగారు.

"కోడి కావ్ కావ్
కుక్క కొక్కొరక్కో
పరాయి భాష ప్రాక్టీసులో
జంతువులు"

(రాణీప్రసాద్, కందేపి. 2006: 33)

సహజంగా కోడి కొక్కొరొక్కో అనీ, కుక్క బౌబౌ అని అరుస్తుంది. కాని ఇక్కడ కోడి కావ్ కావ్ అని, కుక్క కొక్కొరకో అని అరవడం విరోధాభాసం. ప్రపంచీకరణవల్ల దేశాలమధ్య దూరం తగ్గిపోయి ప్రపంచం గ్రామమైంది. అమెరికా ఆధిపత్యం పెరిగిపోయింది. భారతదేశంలో కూడా ప్రపంచ దేశాల కంపెనీలు రావడం, అవి ఆంగ్ల భాషనే ఉపయోగించడం వల్ల, ఆ కంపెనీలల్లో ఉద్యోగం పొందాలంటే ఆంగ్ల భాష నేర్చుకోవడం తప్పనిసరైంది. దాంతో ఆంగ్లభాష ప్రభావం అన్ని భాషలపైన పడింది. అంగ్లభాష నేర్చుకుంటేనే ఉద్యోగం, ఉపాధి అన్న భావనలోకి సమాజం అనివార్యంగా నెట్టివేయడంవల్ల ఆంగ్ల భాషనే నేర్చుకొంటున్నారు. తద్వారా ఆయా ప్రాంతాల స్థానిక భాషల ఉనికి సన్నగిల్లింది. వాళ్ళ వాళ్ళ మాతృభాషని కాదని పరాయి భాష మోజులో పడిపోతున్నారు.

"ఇక్కడ
అప్పుడప్పుడు
సమాధి పాలైన జీవితాలు
కాసేపు శిఖరాగ్ర
సమావేశం జరుపుతాయి"

(జగన్నాథం, జూకంటి. 2013: 21)

చనిపోయాకే కదా సమాధి చేసేది. సమావేశాలు జరుపుకోవడం, మాట్లాడుకోవడం సజీవ మనుషులు చేసే పని. అలాంటప్పుడు సమాధిపాలైన జీవితాలు సమావేశం జరుపుకోవడం ఎలా కుదురుతుంది. అంటే బతికున్నా మరణించినవారని అర్థం. మనిషి

గుణం చెడును చూసి స్పందించడం, ఆపదలో ఉన్నవాళ్ళకి సహాయం చేయడం. కాని నేడు అది కనుమరుగైంది. అలాంటి మనుషులు, వారి జీవితం సమాధిపాలు కాక మరేమౌతుంది?

"భూమి అనకలేదు
బున్యాదులు కదిలిపోతున్నయ్
అగ్గి అంటుకోలేదు
పచ్చనిచెట్లు మాడిపోతున్నయ్"

(జగన్నాథం, జూకంటి. 2013: 146)

భూకంపం వస్తే ఇండ్లు కూలిపోతాయి. అగ్గి అంటుకుంటే చెట్లు కాలిపోతాయి. కాని ఇవేమీ జగకుండానే ఇండ్లు కూలడానికి, చెట్లు కాలడానికి కారణం ప్రపంచీకరణ. ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వంలో పల్లె జీవన విధానం, పల్లె విధ్వంస చిత్రణ, పల్లె సౌదర్యం మొదలైనవి కనిపిస్తాయి. పల్లె ముఖ్యంగా వృత్తుల సమాహారం. వ్యవసాయమే పల్లెకి పునాది. ఒక వృత్తి మరొక వృత్తిపై ఆధారపడుతూ, ఒకరికొకరు సహాయంగా ఉంటూ పల్లె జీవితం హాయిగా గడిచిపోయేది. ఎప్పుడైతే ప్రపంచీకరణ వచ్చిందో పల్లె వృత్తులన్ని నాశనమై పునాదులు కదిలిపోయాయి. ఏ కల్మషం తెలియని జీవితాల్లో స్వార్థపు, వ్యాపారపు బుద్ధి వచ్చి జీవితాల్ని బుగ్గిపాలు చేసింది. ఇక్కడ పచ్చని చెట్లని మంచి మనుషులకు ప్రతీకగా తీసుకుంటే ఆ మనుషులు స్వార్థపు నిప్పంటుకొని కాలిపోతున్నారు.

"విచ్చుకుపోతున్న ఆత్మ స్థయిర్యాల మధ్య
మనిషి ఒక సజీవ శవం"

(శివకుమార్, వఝల. 2004: 15)

ఎప్పుడైతే ప్రపంచీకరణ ప్రవేశించిందో మానవుల జీవనశైలి పూర్తిగా మారిపోయింది. అంతకంతకు పెరిగిపోతున్న ఆధునికతవల్ల అన్ని క్షణాల్లో మారిపోతున్నాయి. ఒక బాధలోంచి బయటపడే లోపే మరో బాధ మనిషిని చుట్టుముట్టేస్తుంది. అటు ఆరోగ్యపరంగా ఇటు మానసికంగా మనిషి అల్లకల్లోలమైపోతున్నాడు. డబ్బు విలువ పెరిగినప్పటినుండి మనిషికి మనశ్శాంతి లేకుండాపోయింది. సనాతనంగా కొనసాగుతూ వస్తోన్న మనిషి అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడుతోంది. రోజురోజుకు మనిషి ఆత్మస్థైర్యం తగ్గిపోతుడడంతో భయంలో బతకడం బతుకు కాకుండా పోతోంది.

"దూరం నుంచి ఒక మూగపిలుపు వినిపిస్తున్నది
నన్ను తన దాకా చేరుకొమ్మని"

(నారాయణరెడ్డి, సి. 2010: 68)

వినిపించడం శబ్దానికి సంబంధించింది. మూగతనం నిశ్శబ్దానికి సంబంధించింది. ఈ రెండు విదుద్ధాంశాలు. కాని ఈ రెంటిని కలిపి కవి మూగపిలుపు వినిపిస్తున్నది అని అన్నారు.

"పసితనానికి పగల పొగలంటవు
అది నిసర్గసుందరంగా నిర్మలంగా వెలిగే
చల్లని జ్వాల"

(నారాయణరెడ్డి, సి. 2008: 43)

జ్వాల వేడిగా ఉంటుంది. దానికి చల్లదనానికి కుదరనే కదరదు. కాని చల్లని జ్వాల అని కవి అనడంలో ఉద్దేశ్యం దహించే జ్వాల కాదు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని పంచే జ్వాల. చల్లని వెన్నెలలాగా అన్నమాట.

"ఏడు సముద్రాలకవతల
ఎదిరిచూస్తుందో శవం
ఒంటరిగా...."

(రవీంద్ర, సంగెవేని. 2007: 49)

వర్షాలు సరిగ్గా పడక పల్లెలో కరువు ఏర్పడడంవల్ల బతుకుదెరువుకై పల్లె జనం దుబాయో, మస్కటో, సింగపూరో ఏదో ఒక దేశం వలసపోతుంది. ఈ వలసపోవడానికి కూడా వాళ్ళ దగ్గరున్న కొన్ని డబ్బులకి అప్పుచేయడమో, ఉన్న కాసింత బంగారం అమ్మడమో, పొలం అమ్మడమో జరగుతుంది. ఇలా వలస వెళ్ళిన తర్వాత అక్కడ సరిగ్గా పనిలేక, తిండిలేక, తిరిగి ఇంటికి రాలేక వెళ్ళిన వ్యక్తి అక్కడే ఆత్మహత్య చేసుకుంటాడు.

### 6.2.5. అలంకారాలు (Figures of Speech)

"యవ్వనపు బోనులో చిక్కుకొని
దగాపడ్డ సింహంలా ఉన్నాను
నినాదాల హోరులో చితికిన గాలిలా

చెట్టులో చిక్కిన పతంగిలా
పారిపోలేక పోతుంది,
మారిపోలేక "పోతుంది" నా బతుకు"

(శివప్రసాద్, సంకేపల్లి. 2002: 53)

తన జీవితం గురించి కవి చెప్పే సమయంలో ఆ జీవనం తాలూకు బాధ ఎలా ఉంటుందో పోలికలతో చెప్పడం జరిగింది. యవ్వన బోనులో చిక్కుకొని దగాపడ్డ సింహంల, నినాదాల హోరులో చితికిన గాలిల, చెట్టులో చిక్కుకున్న గాలిపటంల తన జీవితం ఉందని చెప్పడంవల్ల ఒక భావచిత్రంలోకి తీసుకెళ్ళారు. ఉపమాలంకారం వాడి తన బాధ ఎలాంటిదో వివరించారు. ఇలా ఉపమానాలు వాడడం ద్వారా తన బాధ తీవ్రతను చెప్పగలిగారు.

"రావిచెట్టుపై గుడ్ల గూబలా,
రాబందుల రెక్కల చప్పుడులా,
రాత్రిలా నీవు
కక్కుర్తి అత్తగారి కడుపుమంటకు
దిక్కులేని పక్షిలా,
చిక్కిపోయిన హంసలా,
రక్కసి కోరల నడుమ
తల్లడిల్లే నేను....."

(రవీంద్ర, సంగెవేని. 2005: 37)

స్త్రీ పెళ్ళాయక అత్తరాగింట్లో పడే కష్టాలను వివరిస్తున్నారు కవి. గుడ్లగూబ, రాబందుల రెక్కల చప్పుడు, రాత్రి అన్నీ భయానకమైనవి. అలాగే స్త్రీ జీవితం కూడా అత్తాగారింట్లో భయంకరమైంది. తర్వాత దిక్కులేని పక్షి అనడంలో అందరున్నా అనాధగా మారిందనే అర్థం కనిపిస్తుంది. ప్రాచీన సాహిత్యంలో కూడా స్త్రీని హంసతో పోల్చేవారు. ఇక్కడ కూడా చిక్కిపోయిన హంస అని అన్నారు. 'చిక్కిపోయిన హంస' అంటే అత్తారిళ్ళు అనే పంజరంలో ఆ హంస చిక్కిపోయింది.

"చాలాసార్లు
మనసు చెట్టుమీది దిగులు పిట్ట
ఒంటరిగా ఏకాకిగా

ఒక నమ్మకంకోసం వెతుక్కుంటూ వుంటుంది
తనని తానొక హృదయం ముందు
ఆవిష్కరించుకొని
తత్కాల శాంతికోసం తపించిపోతుంది"

(హిమజ. 2006: 22)

"Metaphor and metonymy(or synecdoche) are both figures of equivalence, but generated different processes, metaphor according to continuity or association between part and whole, cause and effect, thing and attribute, etc" (Rice, Philip(Ed.). 2001: 89). ఆంగ్లంలో దీన్ని 'మెటఫర్' అని పిలిచే రూపకాలంకారాన్ని ఆధునిక కాలంలో కవులు అత్యధికంగా ఉపయోగిస్తున్నారు. 'నీ ముఖం చంద్రబింబంల ఉంది' అంటే ఉపమాలంకారం, 'అది ముఖమా? చంద్రబింబమా?' అంటే ఉత్ప్రేక్ష అలంకారం, 'చంద్రవదన' అంటే అది రూపకాలంకారం. రూపకాలంకారం అంటే ఉపమానానికి, ఉపమేయానికి అభేదం లేకుండా చెప్పడం. పై కవితలో మనసుకు – చెట్టుకు, దిగులుకు – పిట్టకు అభేదం చెప్పారు.

"వరండాలో,
ఎదురు చూపులతో అమ్మ..
పక్కింటిలో ముస్తాబై
మొగుడి జాడలో పరువాల బొమ్మ
మాట వినని కోళ్ళను,
మచ్చిక చేస్తూ ముసలమ్మ...
పరవశంతో కదులుతున్న
మాయింటి జామకొమ్మ...."

(రవీంద్ర, సంగెవేని. 2005: 77)

తన ఊరిలో కనిపించే దృశ్యాల్ని అంతే సహజంగా చెప్పడం ఈ కవితలో కనిపిస్తుంది. ఎలాంటి వర్ణనలు లేకుండా ఉండే కవితలను 'సరళకవితలు' అంటారు. పై కవిత ఈ కోవకు చెందిందే. ఉన్నదున్నట్టు చెప్పడం స్వభావోక్తి. ఇక్కడ కవి కూడా ఆ అలంకారంలోనే తన ఊరిలోని సంఘటనలను చెప్తున్నాడు. అలాగే 'రెండు – నాలుగు –

ఆరు – ఎనిమిది' వాక్యాలలో చివరగా 'అమ్మ, బొమ్మ, ముసలమ్మ, జామకొమ్మ' అని అంత్యప్రాస పాటించడం జరిగింది.

"ఏది ఎవరికి కావాలన్నా
అన్నీ తానై
ఇల్లంతా అలరిస్తూ.....
వండీ వార్చి
పిల్లల్ని నిద్రలేపి కాలకృత్యాల్లో సహాయం చేసి
ఒళ్ళురుద్ది లాలపోసి
ఇష్టాలను మన్నించి
అన్నం తినిపించి
తలదువ్వి
ముస్తాబు చేసి
ఒళ్ళోనుంచి
బళ్ళోకి పంపుతూ....."

(శోభారాణి, కొలిపాక. 2004: 61 – 62)

నిజజీవితంలో తల్లి నిత్యవ్యవహారాన్ని ఉన్నది ఉన్నట్టుగా చిత్రించే కవిత. సాహిత్యంలో ఒక విషయాన్ని, వ్యవహారాన్ని, పనిని ఉన్నది ఉన్నట్టు చెబితే దాన్ని స్వభావోక్తి అంటారు. ఇక్కడ కవి కూడా ఎలాంటి అలంకారాలకు, సంక్లిష్ట వాక్యాలకు చోటివ్వకుండా సరళ కవితగా తల్లి తన బిడ్డలకు చేసే పనుల గురించి చెప్పారు.

### ౬.౨.౬. జానపద విధానం (Folk Narrative)

"వలస ఒక వంక మాత్రమే
శ్వాసంతా ఉట్టిమీది పాలముంతపైనే
స్థావరం ఎప్పుడూ గోడమీదే
నలుపొక నెపం మాత్రమే
ఏడిళ్ళు తిప్పుకుంటూ కూనలకి
అపనమ్మకాన్ని వారసత్వంగా ఇస్తున్న పిల్లి"

(శివకుమార్, వఝుల. 2004: 9)

ఊర్లలో పక్కనున్న ఇంటివాళ్ళకు లేదా ఒకే ఇంట్లోని వాళ్ళకి గొడవ జరిగినప్పుడు వాళ్ళని నేరుగా కాకుండా ఒక వస్తువుపైననో, ఒక పక్షిపైననో పెట్టి తిడుతూ ఉంటారు, వాళ్ళ బాధను తీర్చుకుంటారు. సరిగ్గా అలాంటి శిల్పాన్నే వాడుకున్నారు కవి. ఇక్కడ పిల్లి, పిల్లికి సంకేతం కాదు. అది మోసానికి, దగకి, వివక్షకి మారురూపమైన మనిషికి ప్రతీక. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వలసవాదులను ఉద్దేశిస్తూ పిల్లిని వారికి ప్రతీకగా నిలిపి కవి తనకు, తన ప్రాంతానికి చేసిన అన్యాయం గురించి చెబుతున్నారు.

"చూపు బందయ్యింది
మాట బందయ్యింది
మనసులో ఏముందోగాని
కొన ఊపిరుంది
చుట్టాలందరికీ చెప్పి పంపింర్రా
ఇక ఇప్పుడో అప్పుడో
అందరు వచ్చేటాల్లకు ఏయాల్ల అయితదో
పాపం చిన్న మనువరాలంటే పాణం
పాణముండంగా అందితె బాగుండు బిడ్డా!"

(జగన్నాథం, జూకంటి. 2013: 109)

గ్రామాల్లో ఒక మనిషి చివరి స్థితిలో ఉన్నప్పుడు ఉండే సన్నివేశాన్ని, అతని చుట్టూ చేరిన బంధువుల, ఆత్మీయుల మధ్య ఉండే మాటల్నే ఇక్కడ కవిత్వంలోకి తీసుకురావడం జరిగింది. మనిషి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ ఉన్నప్పుడు తులసి నీళ్ళు పొయ్యడం, చనిపోబోతున్న వాళ్ళకి ఇష్టమైన వాళ్ళని చూపించడం లాంటివి చేస్తుంటారు. అందుకే ఈ కవితలో చిన్నమనువరాలు చనిపోయే ముందు తాత దగ్గరికి వస్తే బాగుండు అని బాధపడడం కనిపిస్తుంది.

"పైసవెద్దె దునియ గనవడ్తుందిర కొడుకా
కడుపుల యత దించుకుందమంటె
సాయం బట్టెటోళ్ళు కనవడ్తలేరు
నా జీవునమున్నంతల
ఒక్కసారి అచ్చిపోంర్డిరా

ఈడనే మన మూలాలున్నయి
ముచ్చట్లున్నయి
బోనాలున్నయి
బతుకమ్మలున్నయి"

(దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 70)

బతుకుదెరువుకో, ఉద్యోగం కోసమో పట్టణం పోయిన తన పిల్లలకై ఒక తల్లిపడే వేదనను సహజంగా చిత్రించారు కవయిత్రి హిమజ గారు. ఇన్నాళ్ళు తనతో ఉన్న పిల్లలు పట్టణం వెళ్ళినా కళ్ళముందే ఉన్నట్టు ఉన్నారనీ, పట్టణం మనసును పోగొట్టుకున్న మనిషనీ, డబ్బుతప్ప మనుషులకు విలువుండదనీ, గ్రామంలోనే మన మూలాలు, సంస్కృతి, జాతరలు, పండుగలు ఉన్నాయనీ నేను చనిపోయేలోపు ఒక్కసారి మీరు వచ్చిపోవాలని కవయిత్రి బాధని వెల్లడిస్తుంది.

"ఏంటోరా కన్నా!
ఇప్పటి ఈ మాయకాలపు మాటే వేరు
కవ్వించి కన్నుగీటే కల్మషాల నడుమ
బురద అంటని పంకజంలా
పెరిగి పెద్దవ్వడమే పెద్ద సవాలు నేడు!"

(ఎలనాగ. 2010: 63)

పల్లెనుంచి తన కొడుకో, కూతురో పట్టణం పోతున్నప్పుడు అక్కడి పరిస్థితుల్ని కొంచెం తెలుసుకొని జాగ్రత్తలు చెప్పడం ఎక్కువగా పల్లెల్లో కనిపించే దృశ్యం. ఆ దృశ్యమే ఇక్కడ కవిత్వమైంది. ప్రపంచీకరణ ప్రభావంవల్ల మారిపోతున్న సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, సాంకేతికత, అంతర్జాలం అందుబాటులోకి వచ్చాక ఫోన్ వాడకం పెరగడం, డబ్బుకోసం మనిషి స్వార్థపరుడ కావడం ఇలాంటి అనేక కల్మషాల మధ్య మంచి మనిషిగా పెరగడమే నేటి అవసరం.

"పొద్దుపాయె! పొద్దుపాయె!
నడువుండ్రి! నడువుండ్రి!!
ఓ మంచి నీలబాయికాడి మల్లవ్వా

ఓ గడ్డమీది ఎల్లవ్వా!
ఓ బీరవ్వా! ఓ పోశవ్వా! పాంౘ్రి పాంౘ్రి"

(జగన్నాథం, జూకంటి. 2013: 141)

కలువనో, వరి కొయ్యడానికో, మిరపకాయలు ఏరడానికో వెళ్ళినప్పుడు ఇంటికి వచ్చే సమయంలో ఉండే సంభాషణని యథాతథంగా కవి ఇక్కడ కవిత్వంగా మలిచారు. ఎక్కడెక్కడో ఉన్న వాళ్ళందరిని పిలుచుకొని అందరు వచ్చాక అందరు కలిసి ఇంటికి రావడం మచ్చలేని మనసుకు, అనురాగపు జీవితానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

### 6.2.7. పౌరాణిక కథనం (Mythopoeie)

పురాణ పాత్రల నేపథ్యంగా కవిత్వ నిర్మాణం చెయ్యడం ఇందులో కనిపిస్తుంది. పురాణ పాత్రల్ని చెప్పే విషయానికి అనుగుణంగా మార్చుకొని విస్తృతంగా చెప్పదలుచుకునే విషయాన్ని సంక్షిప్తంగా సూచించడం జరుగుతుంది.

"జీవితాంతం భరించాల్సినవాడే
వ్యసనాల హరిశ్చంద్రుడై నడివీధిలో
నిన్ను చంద్రమతిని చేస్తే, అబలవై
నీవు జనారణ్యంలో రోదిస్తుంటే
ఏ కన్నులు కూడా దయామృతాల్ని
వర్షించలేదే?"

(శివప్రసాద్, సంకేపల్లి. 2002: 45)

హరిశ్చంద్రుడు, చంద్రమతి పౌరాణిక పాత్రలు. వారిని నేటి సమాజంలోని పాత్రలకు సారూప్యం చూపిస్తూ చెప్పిన కవిత. హరిశ్చంద్రుడు వ్యసనకారుడై చివరికి భార్యైన చంద్రమతిని నడివీధిలో వదిలేస్తాడు. అలానే నేటి సమాజంలో మగవాడు కూడా తన భార్యని చంద్రమతిని చేసి నడివీధిలో వదిలేస్తున్నారని తెలియజేస్తున్నాడు.

"తేదీలపై తేదీలను ప్రసవిస్తున్న
న్యాయాలయ ప్రాంగణాలు

సామాన్యుల పాలిట
ద్రోణాచార్యులే కావచ్చు......"

(రవీంద్ర, సంగెవేని. 2005: 68)

ప్రసవించడం స్త్రీకి సంబంధించిన అంశం. ఇక్కడ న్యాయస్థాన ప్రాంగణాలు ప్రసవించడమంటే వాయిదాల మీద వాయిదాలు పడడం. ద్రోణాచార్యుడు పాండవులకు ధనుర్విద్య నేర్పిన గురువు. ముఖ్యంగా అర్జునుడిని ధనుర్విద్యలో ప్రావీణ్యుడిని చేస్తాడు. ఏకలవ్యుడు విలువిద్య నేర్పమని ద్రోణాచార్యుడి దగ్గరికి వెళ్ళి అడుగుతాడు. నీవు తక్కువ కులానికి చెందిన బోయవాడవు కనుక ఇలాంటి జనులు విలువిద్య నేర్చుకోడానికి అనర్హులని విలువిద్యను నేర్పడు. దానికి ఏకలవ్యుడు ద్రోణాచార్యుని బొమ్మను తయారుచేసుకొని ఆ బొమ్మనే గురువుగా భావించి విలువిద్యలో అత్యంత నేర్పుగలవాడవుతాడు. అది తెలిసిన ద్రోణాచార్యుడు ఆ విలువిద్య ప్రదర్శించకుండా ఉండడానికి ఏకలవ్యుని బొటనవేలు గురుదక్షిణగా అడుగగా అతను ఇస్తాడు. ఇలా ఏకలవ్యుడు తక్కువ కులానికి చెందినవాడు కనుక అతనికి న్యాయం జరగకపోగ వివక్షను ఎదుర్కొంటాడు. అలాగే ఇక్కడ కూడా న్యాయాస్థానాలు సామాన్య జనులపాలిట అన్యాయాలయాలుగా మారాయని కవి పురాణ పాత్ర ఆధారంగా పెద్ద విషయాన్ని చిన్న పాత్ర ద్వారా సూచించారు.

"నల్లని చీకటిని
నారుపోసే నరకాసురులు
సత్యభామలకు ఎప్పుడూ సవాళ్లే
కృష్ణుని సాయం లేకపోయినా
కూలబడకుండా విల్లును
ఎక్కుపెట్టేవాళ్లు కావాలిప్పుడు"

(ఎలనాగ. 2010: 41)

కవి ఈ కవితకు 'కష్టపరిహారం' అని పెట్టినపేరే కొత్తదనంతో కూడుకున్నది. సామాన్యంగా నష్టపరిహారం అనే మాట వాడుకలో ఉంది. కాని దాన్ని కవి 'కష్టపరిహారం'గా మార్చారు. దేవిని ఉపాసించిన నరకాసురుడు అనేక వరాలు పొంది బలవంతుడిగా మారుతాడు. దీంతో తనకు తిరుగేలేదని అనేక రాజ్యాలను వశపరుచుకుంటాడు. ఒకనాడు స్వర్గంపై దండయాత్ర చెయ్యగా దేవతలంతా కాపాడమని కోరగా శ్రీకృష్ణుడు సత్యభామ

సమేతుడై యుద్ధానికి వెళ్తాడు. ఈ యుద్ధంలో శ్రీకృష్ణుడు నరకాసురుడి బాణం తగిలి మూర్ఛపోతాడు. దీంతో సత్యభామ నరకాసురుడితో యుద్ధం చేసి అలసిపోతుంది. మూర్ఛనుండి తేరుకున్న శ్రీకృష్ణుడు సహాయం చెయ్యగా సత్యభామ నరకాసురుడిని చంపుతుంది. ఇదీ పురాణగాథ. నేటి సమాజంలో స్త్రీ జీవితాన్ని చీకటిగా మార్చే నరకాసురులు చాలా మందే ఉన్నారు. వీరి వల్ల స్త్రీలకు ఎప్పుడూ నష్టమే. పురాణంలో నరకాసురుడిని చంపడానికి శ్రీకృష్ణుడు సహాయం చేసాడు. కాని నేటి సమాజంలో శ్రీకృష్ణుడిలాంటి వాళ్ళు సహాయం చేయకపోయినా నరకాసురులను చంపే విల్లును సంధించాలనీ, ధైర్యంగా మారాలనీ కవి ఆకాంక్ష.

"ఇప్పుడు నేను
రాముని బాణాన్ని విరిచే శంభూకున్ని
లక్ష్మణుని చెవులు కోసే శూర్పనఖను
ద్రోణుని ద్రోహాన్ని గుర్తించి
బాణం సంధిచిన ఏకలవ్యున్ని"

(దేవేందర్, అన్నవరం. 2001: 9)

దళితుల్ని, అట్టడుగు కులాలను నీచంగా చూసి హింసించిన, చంపేసిన దాఖలాలు అనేకం. వాటినన్నింటిని దళిత సాహిత్యం సాహిత్యపుటలపై కన్నీటితో లిఖించింది. దళితోద్యమ ప్రభావంవల్ల ఒకనాడు ఎక్కువ కులం వాళ్ళ చేతుల్లో అవమానాలు, బాధలు అనుభవించిన శంభూకుడు, శూర్పనఖ, ఏకలవ్యుడు మొదలైన తక్కువకులాల పాత్రలు ఇప్పుడు ఎక్కువ కులాలవాళ్ళపైన తిరుగుబాటు చేస్తున్నాయి. అందుకే ఇక్కడ ఆ పాత్రలు చైతన్యాన్ని నింపుకున్న పాత్రలుగా, అన్యాయాన్ని ప్రశ్నించే మాటలుగా కనిపిస్తాయి.

"అన్నా! హాలికా! క్షేత్రపాలికా!
నాగలి పట్టిన బలరామునివే
పాతాళగంగను తెచ్చిన బగీరథునివే
వెనుకా ముందూ చూడక
దానం చేసే బలి చక్రవర్తివే
పంటలక్ష్మిని పాలించే పరమాత్ముడివే
పదిమందికి అన్నం పెట్టే పరమాప్తుడివే

బలం ధరిత్రికి బలికావించే
పోరాట భీముడివే
మెప్పులకుపొంగే
ఒప్పుల కుప్పవు కావాలి
అప్పులకు క్రుంగే
ఆర్తుడవు కావద్దు”

(నరహరి ఆచార్య, డింగరి. 2005: 90)

చేసిన అప్పులు కట్టలేక కుంగిపోయి ఆత్మహత్య చేసుకునే రైతుకు ధైర్యం చెబుతున్నారు కవి. నాగలి పట్టి భూమిని పచ్చదనంగ మార్చే బలరామునివని, బోర్లువేసి నీటిని పైకి తెచ్చే భగీరథుడివని, పంటనంతా దానంచేసే బలిచక్రవర్తవని, పంటను ప్రేమగా లాలించే పరమాత్ముడవని, నువ్వు కష్టపడి నలుగురికి అన్నంపెట్టే ఆప్తుడవని, బీడైన భూమికి పంట బలాన్నిచ్చే భీముడవని, ఎప్పుడైనా ప్రశంసలకు ఉప్పొంగిపోవాలిగాని అప్పులకు డీలా పడిపోయి చనిపోవద్దని రైతుకు అండగా నిలుస్తున్నారు కవి. రైతే లేకపోతే నాలుగు మెతుకులు నోట్లోకి వెళ్ళవు. ఈ దేశానికి వెన్నెముక రైతు అంటారు కదా అలాంటి రైతుకు సరైన గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉంది.

“ఐదుగురు పాండవులైన మహాభారతంలో
నూరుగురు అధర్మ కౌరవులపై
ఎందరు ద్రోణాచార్యులు, భీష్మాచార్యులు, కృపాచార్యులు
వారి పక్కన నిలిచినా కూడా
వారు ధర్మపోరాటం చేసి గెలిచారు
ధర్మానికి, న్యాయానికి, మంచికి
మారుపేరైనా రామాయణ శ్రీరాముడు
రావణాసురున్ని, వేయిల వానరసేనతో
సునాయాసంగా గెలిచి నిలిచారు
రామాయణాలైన, భారతాలైనా, ఇతిహాసాలైనా
ధర్మమే గెలుస్తుంది

న్యాయమే గెలుస్తుంది
తెలంగాణ ధర్మపోరాటం గెలుస్తుంది"

(లక్ష్మీనారాయణ, సబ్బని. 2010: 21)

ఎప్పటికైనా ధర్మమే, న్యాయమే గెలుస్తుందనీ, అలా ధర్మంగా, న్యాయంగా సాగే తెలంగాణ పోరాటం గెలుస్తుందని చెబుతూ కవి దానికి ఉదాహరణలుగా రామాయణ, మహాభారతాల్లోని కథల్ని చెప్పారు. వందలమందున్నా కౌరవుల్ని ఐదుగురు పాండవులు ఓడించారనీ, పది తలకాయలు, లక్షల సైన్యమున్నా రావణ రాజ్యాన్ని వానరులతో కలిసి శ్రీరాముడు జయించాడనీ, అలాగే తెలంగాణ పోరాటం కూడా విజయం సాధిస్తుందని కవి ఆకాంక్ష, తీర్పు.

### ౬.౨.౪. ప్రశ్న – సమాధాన పద్ధతి

"మసీదుల్లో ఏముంది?
మానవత్వ పరిమళాలు
మందిరాల్లో ఏముంది?
మమతల నైవేద్యాలు...."

(రవీంద్ర, సంగెవేని. 2005: 68)

ఈ కవితలో కవి పాఠకున్ని ప్రశ్నిస్తున్నట్టు మొదటి వాక్యంలో ఉంది. తర్వాత తానే దానికి సమాధానం చెబుతున్నాడు. ఇలా ప్రశ్నోత్తర పద్ధతిలో సాగిపోయే శిల్పాన్ని కవి ఈ కవితలో వాడుకున్నాడు. ఈ పద్ధతి ఒక ఉత్సుకతనీ, ఆలోచనని అందిస్తుంది. మసీదుల్లో ఏముంది? అని మనం ఒక క్షణం ఆలోచనలో పడగానే కవి మానవత్వ పరిమళాలున్నాయనే సమాధానం చెబుతాడు. మొదటి, మూడు వాక్యాలలోని ప్రశ్నలకి, రెండు – నాలుగు పాదాల్లో సమాధానం ఇచ్చారు.

"సమాజమన్నప్పుడు సమస్యలుంటాయి
సమస్యలున్నప్పుడు సంఘర్షణలు తప్పవు.
సమస్యల ఆంతర్యమేమిటో
తడిమిచూస్తే తెలియదు తరచిచూస్తే తప్ప.
ఒకే చెట్టుకున్న రెండు కొమ్మలు

ఒకదాన్ని మరొకటి
చూసుకోకుంటే ఎలా?
ఒకే కొమ్మకున్న రెండు రెమ్మలు
ఎడ ముఖం పెడ ముఖంగా ఉంటే ఎలా?
అన్నిటి మూలం ఒక్కటే అని
తెలుసుకోలేని అవివేకమే అది.”

(నారాయణరెడ్డి, సి. 2009: 9)

భారతదేశంలో అత్యంత జఠిలమైనవి మతం, కులం. ఈనాటికి మతం పేరుతో, కులం పేరుతో ఎక్కడో అక్కడ గొడవలు, కొట్లాటలు జరుగుతూనే ఉన్నాయి. ఒక మతం మరో మతంపై, ఒక కులం మరో కులంపై, ఒక కులంలోని ఒక వర్గం మరో వర్గంపై ఇలా గొడవకు దిగుతూనే ఉంది. ఒకే చెట్టుకున్న రెండు కొమ్మలంటే ఒకే దేశంలో ఉన్న రెండు మతాలుగా, ఒకే కొమ్మకున్న రెండు రెమ్మలంటే ఒకే మతంలోని రెండు కులాలుగా మనం గుర్తించాల్సి ఉంటుంది. ఒకరినొకరు చూసుకోకుండ ఉండడం, ఎడముఖం పెడ ముఖంగా ఉండడం అవివేకం తప్ప వివేకం కాదనీ, సమాజంలోని గొడవల్ని లోతుగా ఆలోచించి అర్థం చేసుకోవాలనీ, అలా అర్థం చేసుకుంటే గొడవలే ఉండవని కవి భావన.

“మబ్బులు రొమ్ము విరిచి అడ్డువస్తే
సూర్యుడు తన నడక ఆపి నిలిచిపోతాడా?
గాలి తన శక్తి నంతా కూడదీసుకొని వీస్తే
సూర్యుడు వెనుదిరిగి వెళ్ళిపోతాడా?
ఉన్నచోటే పడివుండే సాగరుడు
తన కెరటాల బాహువులతో
సూర్యుణ్ణి బంధించాలని చూస్తే
క్షణకాలమైనా బంధించబడుతాడా?
ఎంతో ఎత్తుకు ఎగురుగలనని
గర్వపడే గద్దని చూచి
సూర్యుడు నవ్వుకోకుండా ఊరుకుంటాడా?

(కిషన్‌రావు, రేగులపాటి. 2010: 12)

మనిషి విజయం సాధించాలంటే ఏం చెయ్యాలో చెబుతూ పై వాటిని ఉదహరణలుగా వివరించారు కవి. మేఘాలు అడ్డువచ్చినా సూర్యుడు ఆగిపోనట్టే కష్టాలెదురైనా ఆగిపోకూడదనీ, గాలి ఎంత గట్టిగా వీచిన సూర్యుడు వెనకడుగు వెయ్యనట్టే బాధలెన్నొచ్చినా వెనుకడుగు వెయ్యొద్దనీ, సముద్రం కెరటాలతో సూర్యున్ని ఆపనట్టే ఎలాంటి పరిస్థితులు నిన్ను ఆపలేవనీ, నేను అది చేస్తా ఇది చేస్తానని గొప్పలు చెబితే మన పక్కనున్నవాళ్ళు నవ్వుకుంటారని ఆ నవ్వుని ఆపేలా మనం మన విజయాన్ని అందుకోవాలని కవి కర్తవ్య బోధ చేస్తున్నారు.

"విరబూసిన పువ్వులను చూసి పరవశించే మనసులు
వాటిని కనిపెంచే
పచ్చని తీగతల్లులను మరిచిపోతే ఎలాగ?
జిలుగు వన్నెల నేతచీరలపై ప్రశంసలు కురిపించేవారు
వాటికి రూపమిచ్చిన మగ్గాల సహనశీలానికి
జోహారులర్పించకుంటే ఎలా?"

(నారాయణరెడ్డి, సి. 2010: 68 – 69)

ఒక పువ్వు పూయడానికి కారణమైన తీగలను మరిచి పూవు అందాలకి పరవశించిపోవడం సరైంది కాదు. చేనేత కార్మికులు ఒక చీర నేయడానికి రెండు, మూడు నెలలు కష్టపడుతుంటారు. ఆ రెండు, మూడు నెలలు కష్టపడి చీర నేసిన తర్వాత ఆ చీర అందానికి ముగ్ధులవుతారు తప్ప ఓపికతో ఆ రెండు, మూడు నెలలు ఆ చీర నేసిన చేనేత కార్మికున్ని కష్టాన్ని, నైపుణ్యాన్ని ఎవరు పట్టించుకోరు. కాని ఆ సహనానికే, కష్టానికే, నైపుణ్యానికే మనం జోహారులర్పించాలని కవి కోరిక.

### ౬.౨.౯. సంభాషణాత్మకం

"బొంకియ్యం బోర్లెయ్యం బుదరకియ్యం
సాఫ్ సీదా ముచ్చట
బల్ల గుద్దుడే గల్లపట్టుడే గెదుముడే
కుండ పల్గొట్టినట్టు కుల్లం కుల్లం
తేట తెల్లం తెలంగాణం"

(దేవేందర్, అన్నవరం. 2005: 12)

తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను, అది సాధించాలనే ఆశను కవి ఎదుటివారికి చెబుతున్నట్టుగా నిర్మాణం చేశారు.

> "ఇగ నేనుండ
> ఎల్లి పోతున్ననే లచ్చవ్వా
> ఈ కరెంట్ రేట్లు ఎవ్వడు పెంచె
> బక్కోడు ఎవుసాలు బంద్ పెట్టాల్న ఏంది
> ఎవనికి జీతం ఉండి బతుకాలె
> ఏడ పడి ఏడ సావాలె...."
>
> (దేవేందర్, అన్నవరం. 2005: 41)

కరెంటు సరిగ్గా లేక, వచ్చిన కరెంటుకి బిల్లు ఎక్కువకాగ, పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర రాక, అప్పులు పెరిగి వ్యవసాయం బక్కచిక్కి బతుకుదెరువులేక వలసపోయే రైతుల దీనస్థితి పై కవితలో కనిపిస్తుంది. భర్త భార్యతో తన వ్యవసాయం చితికిపోయి వలసపోవడానికి కారణమైన వ్యవస్థ గురించి ఎదురుగా ఉండి మాట్లాడుతున్నట్టుగా చిత్రించారు.

> "హలో! సార్ ! నమస్తే
> హలో నమస్తే బాగున్నారా!
> ఏం బాగులెండి? / ఏంటలా ఉన్నారు?
> మా శాంతి కనిపించడం లేదు
> పోలీసు కంప్లయింట్ ఇవ్వకపోయారా?
> పోలీసులేం చేస్తారు? / అలా అంటారేం?
> ఔను ఎందరికో చెప్పాను / మరెందరినో అడిగాను
> పెద్దలనూ గురువులనూ
> పరువుగల రాజకీయ నాయకులనూ
> రచ్చబండ దగ్గర ముచ్చటించుకునే ప్రతివాణ్ణీ!
> ఎవరూ నా మాటే ఖాతరు చేయడంలేదు
> ఎవరూ నాకు సాయం చేయడంలేదు"
>
> (నరహరి ఆచార్య, డింగరి. 2005: 64)

శాంతి కనబడడం లేదని వెతికే క్రమంలో ఎదురుగా తెలిసిన వ్యక్తి కనిపించగా ఉండే సంభాషణలా కవిత సాగింది. తిరుపతి వెళ్ళినా, ఆధ్యాత్మిక సభలకెళ్ళినా, బొగ్గుగనుల కార్మికుల దగ్గరికెళ్ళినా, రాళ్ళుకొట్టే బాలకార్మికులని అడిగినా, ఎక్కడ వెతికినా, ఎవ్వరిని అడిగినా శాంతి కనబడడం లేదనీ, కనిపిస్తే మీరైనా చెప్పడనే అభ్యర్థనగా కవిత ముగుస్తుంది. అణునిత్యం ఏదో ఒక గొడవ, ప్రతిక్షణం ఏదో ఒక వివాదం మానవ జీవితాల్ని అతలాకుతలం చేస్తుంటే శాంతి కనబడకపోవడం విచిత్రమేమీ కాదు.

"అన్న!
మనం తెలాంగాణోల్లమన్న!
పార్టి ఏదన్నగాని
మనం మనం ఒకటేనన్న
గిప్పటిమందం చూసి
నద్మంత్రపు పదవుల కోసం
ఆత్మవంచన చేసుకోకన్న!
తెలంగాణ గడ్డమీద పుట్టిన
ప్రతి బిడ్డ నరనరంల
తెలంగాణ కావల్ననుందన్న!"

(దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 48)

తెలంగాణ మలిదశ ఉద్యమం మొదలై ఉవ్వెత్తున సాగుతున్నప్పుడు పార్టీలన్ని తెలంగాణను 'మేం ఇస్తాం, మేం తెస్తాం' అని వాగ్ధానాలు చేసాయి. ఇలా వాగ్ధానాలు చేసే పార్టీలను నమ్మకూడదని, మనకు తెలంగాణ రావడం ముఖ్యమని తెలంగాణ ప్రజానీకానికి చెప్పే ఒక సంభాషణల, ఉపదేశంల ఉంది ఈ కవిత.

"నిన్ను ఒడిలో కూర్చోబెట్టుకుని ఊగించే
కెరటాల ఉయ్యాలలున్నాయి.
పచ్చదనంతో నీ కళ్లను
పరిమళాలతో నీ హృదయాన్ని పరవశింపచేసే
చెట్లూ తీగలూ ఉన్నాయి.
నువ్వు కో అంటే ఓ అని నీ చుట్టూ వాలిపోయే

ఆప్తులున్నారు స్నేహమూర్తున్నారు.
అదృష్టమంటే నీది.
అందుకే నువ్వంటే నాకు తీయని అసూయ."

(నారాయణరెడ్డి, సి. 2008: 8)

2000 సంవత్సరం తర్వాత డా. సి. నారాయణరెడ్డిగారివి ఎక్కువగా సంభాషణాత్మక కవితలే. గాలి, ఆకాశం, నేల, చెట్టు, పర్వతం, మనసు ఇలా ఏదో ఒకటి తనతో ఏదో అన్నట్టు చెబుతూ ఒక గొప్ప సందేశాన్ని అందిస్తాయి డా. సి. నారాయణరెడ్డిగారి కవితలు. ఈ కవితలో కూడా ఆకాశం కవిని చూసి అసూయపడుతున్నట్టు, ఆ అసూయ పడడానికి కారణాలు చెబుతున్నట్టు మనకు తెలుస్తుంది. దానికి కవి సమాధానం చెబుతుంటాడు మిగతా వాక్యాలలో. ప్రకృతి, మనుషులు ఇలా అన్నీ ఉన్న మనిషి అదృష్టవంతుడని కవి చెప్పదలుచుకున్నారు.

"నానా గోత్రికులు చెయ్యి ఇచ్చిపుచ్చుకుంటున్నారు
చిన్నపిల్లాని ఏడుపు హాలంతా ప్రతిధ్వనించింది
తల్లివైపు చూశాను హాండ్ బ్యాగులోంచి
పాలసీసా తీసి గుక్కపట్టిన నోటికందించింది
ఇంద్రజిత్తులా పెద్దగా మాట్లాడడం తెలియదని
ముందే మీకు మనవి చేశాను
నమస్కారం సెలవు
మా ఊరి బస్సుయాల్ల అయిందిక పోతాను"

(జగన్నాథం, జూకంటి. 2013: 108)

ఉరుకుల పరుగుల జీవితంలో మారుతున్న జీవన విధానాన్ని, ప్రపంచీకరణ నేపథ్యంలో మానవుల్లో వస్తోన్న మార్పుల్ని ఈ కవిత చక్కగా వివరిస్తుంది. కులం, మతం, గోత్రం ఒకప్పుడు చాలా ప్రాధాన్యమైన అంశాలు. కులాల్లో అంతరాలు, మతాల్లో గొడవలు, గోత్రాల్లో వివాదాలు ఉండేవి. కాని నేడు కొంతవరకు తగ్గినా పూర్తిగా కనుమరుగుకాకపోవడం విచారించదగ్గ విషయం. ఒకప్పుడు పిల్లాడు ఏడిస్తే తల్లి వాడికి పాలిచ్చేది. కాని నేడు కొంతమంది పాలసీసాలు పట్టిస్తున్నారు.

## 6.2.10. వర్ణనాత్మకం

కవి తన వాస్తవజీవితంలోంచి ఒక అంశాన్నో, విషయాన్నో, ఘటననో తీసుకొని వివరిచే పద్ధతి వర్ణనాత్మకం. దీంట్లో ముఖ్యంగా కవి వాస్తవిక జీవితం ఉంటుంది.

"ఎంత మధురం నా బాల్యం అదొక తియ్యని యాది
నా బాల్యం కశ్కెలో దాచుకున్న కమ్మని పాలగోకు
నా బాల్యం తంపిలో కాల్చుకున్న ల్యాత మక్కంకి
నా బాల్యం కొత్తకొండ తీర్థంలో తిన్న శిల్కల పేరు
నా బాల్యం దూపకు బుడ్డిలో జుర్రిన గడ్క సల్ల
ఎంత గొప్ప జ్ఞాపకం నా బాల్యం,
అదొక విరబూసిన సింగిడి"

(దేవేందర్, అన్నవరం. 2001: 1)

తన చిన్ననాటి బాల్యంలోని విశేషాలను వాస్తవిక సంఘటన ధోరణిగా కవి చెబుతున్నాడు. ఎవరికైనా బాల్యం అమూల్యం. కవికి బాల్యం ఇప్పుడు అక్షరరూపం. నాటికి, నేటికి జీవన విధానం మారింది, మారాలి కూడా. ఈ జీవన విధానంలోని బాల్యంలో కూడా మార్పొచ్చింది. అందుకే కవి ఆ అందమైన బాల్యాన్ని నేటి తరానికి చెప్పడంలో ఉద్దేశ్యం. 'రిమోట్ కార్లు, లియో బొమ్మలు, వీడియో గేములు/సృజనకు తావీయని టీవీ సిరియెల్లు, మోతకోలు పుస్తకాలు' అయిన ఇప్పటి బాల్యంలో ఒకప్పటి ఆనందాలు, వస్తువులు మాయమయ్యాయని, సృజనాత్మకత లేని టీవీ సీరియల్స్‌లో, వీడియో గేముల్లో చిక్కుకున్నాయనే బాధ కవిలో కనిపిస్తుంది.

"వలసంటే...
అనుభూతుల్ని అవసరాల కొలిమిలో
కాల్చేసే క్రౌర్యం...
ఆకలి కవాతు చేస్తూ వేటగాన్ని వేటాడే కాలం....
వలసంటే
విత్తనంలా పగిలి మొలకెత్తడమే....."

(రవీంద్ర, సంగెవేని. 2007: 3)

తెలంగాణలో ఎక్కడ చూసినా వలసలు సర్వసాధారణమే. తెలంగాణలో ఉమ్మడి మహబూబ్‌నగర్, కరీంనగర్ నుంచి వలసలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ వలసలు ఎంత బాధతో కూడుకున్నవో తెలియజేస్తున్నారు కవి. చిన్నప్పటినుంచి పెరిగిన ఊరులో ఎన్నో అనుభవాలు, జ్ఞాపకాలు ఉంటాయి. వాటన్నింటిని వదులుకొని వెళ్ళడం ఎంతో కష్టమైన పని. ఆకలి వేటాడగా మనిషి వేరే దేశం వలసపోవడం పగిలిపోయి మొలకెత్తడం లాంటిదని వలసలోని వేదనని కళ్ళకు కట్టినట్టు చూపించారు.

"నా కంటికి
కవి కలం
జేబు గూటినించి
కాగితం కొమ్మపై వాలి కమ్మగా పాడే కోయిలై తోస్తుంది
కవి కలం
కాగితం ముంగిట్లో సిరాతో అలికి
ముగ్గులేసే ఆడపిల్ల హస్తంలా కనిపిస్తుంది
కలం
మన ఆలోచనల కారుమబ్బులకు
సిరా 'పురివిప్పి' ఆడే మయూరం"

(భాస్కర్, నలిమెల. 2008: 19)

కవి కలం తనకి ఎలా కనిపిస్తుందో అత్యంత రమణీయంగా వర్ణించారు కవి. కోయిల పాట, ముగ్గులేసే ఆడపిల్ల, పురివిప్పి ఆడే నెమలి ఇలా కవి తీసుకున్న పోలికలన్నీ పల్లె వాతావరణానికి సంబంధించినవే. అలాగే జేబు గూటి, కాగితం కొమ్మ, కాగితం ముంగిలి, ఆలోచనల కారుమబ్బులు ఇలా రూపకాలంకారాన్ని కూడా ఈ కవితలో ఉపయోగించడం ద్వారా చిక్కదనం, చక్కదనం రెండూ సమకూరాయి.

### 6.2.11. అసాధారణ పోలిక (Conciet)

అసలు సంబంధంలేని వాటి మధ్య పోలికని సాధించడం అసాధారణ పోలిక. "పరస్పరం పొంతనలేని వస్తువుల్నీ, విషయాల్నీ ఒకచోట చేర్చి వాటి మధ్య ఒక మంచి పోలికను సాధించడం ద్వారా కవిత్వాన్ని నిర్మించవచ్చు" (లక్ష్మీనరసయ్య, జి. 2015:

125). సంబంధం లేని వాటి మధ్య పోలిక చేయడమే అసాధారణ పోలిక. ఆంగ్లంలో దీన్ని 'కన్సీట్' అంటారు. సంబంధమున్న అంశాలుమధ్య పోలిక మనకు ఉపమా అలంకారం అవుతుంది. 'ఆమె ముఖం చంద్రబింబంలా ఉంది' ఇలాంటివి చూసాం. కాని అస్సలు సంబంధంలేని వస్తువుల్ని, విషయాల్ని పోల్చడం దీంట్లో కనిపిస్తుంది.

"విషాదం అరుగుమీద
ఆమె
శూన్యమైన జీవితాన్ని కళ్లలోంచి
వొంపుకుంటూ
కరిపోయిన గతం తాలూకు
జ్ఞాపకాల ప్రతినిధిగా"

(శివప్రసాద్, సంకేపల్లి. 2002: 25)

విషాదానికి, అరుగుకు సంబంధమే లేదు. కాని 'విషాదం అరుగుమీద' అని విషాదాన్ని అరుగుతో పోల్చడం ఇక్కడ కనిపిస్తుంది.

"లంచ్ టైంకి అందరికీ డబ్బాలందాలని
ఉపవాస ప్రార్థన చేస్తాడు"

(రవీంద్ర, సంగెవేని. 2007: 17)

ముంబాయిలో 'డబ్బావాలా' అనే పనివాళ్ళు ఉంటారు. వీళ్ళు ఆఫీసుల్లో పనిచేసే వాళ్ళకు వాళ్ళ వాళ్ళ ఇంటినుండి లంచ్ బాక్స్‌లు తీసుకువచ్చి ఇస్తుంటారు. ఎక్కడెక్కడో తిరిగి లంచ్ బాక్స్‌లు తెచ్చి ఎక్కడెక్కడో ఉన్న వాళ్ళందరికి ఇచ్చేసరికి వీళ్ళు తినాల్సిన సమయం కాస్త అయిపోతుంది. ఈ విషయాన్ని కవి ఉపవాస ప్రార్థన అని అన్నారు. ఉపవాసానికి, ప్రార్థనకి సంబంధం లేకున్నా కవి పోలిక చేసాడు.

"చీకట్లో దూసుకెళ్తున్న రైలు / మిల్లు వర్కర్లా ఉంది....."

(రవీంద్ర, సంగెవేని. 2007: 73)

ఇక్కడ కూడా రెండు సంబంధంలేని విషయాలకి పోలిక చెప్పడం జరిగింది.

"ముక్కిపోయిన శరీరాన్ని / సౌదులో నాన్చుకొని
బాగా ఉడికి / ఘుమఘుమ వాసనై వ్యాపిస్తా"

(దేవేందర్, అన్నవరం. 2003: 54)

శరీరాన్ని సౌదులో నాన్చుకోవడం అనేది అసాధారణంగా అనిపిస్తోంది. మామూలుగా చాకలివాళ్ళు మాసిపోసిన బట్టల్ని సౌదులో నానబెట్టి, ఉడికించి ఉతుకుతారు. అలా శరీరాన్ని ఉడకబెట్టుకోలేం. మళ్ళీ వాసనై వ్యాపించడం కూడా పోలిక సరిపోలేదని అనిపిస్తుంది.

"ఊరికి అవతల,
ఏరుకి యివతల,
కురుపుల్లాంటి పాకల మధ్య....
నిశ్శబ్దంగా,
ఒక ఉరుము ఉరిమింది......
నిశ్చలంగా,
ఒక మెరుపు మెరిసింది......"

(రవీంద్ర, సంగెవేని. 2005: 1)

కురుపుకి, గుడిసెలకి అస్సలు సంబంధమే లేదు. కాని చిన్నచిన్న పాకలు అని చెప్పడానికి కురుపుని పోలికగా తీసుకోవడం జరిగింది.

"సమస్యల చుట్టకుదురు నెత్తికెత్తుకొని
చిమ్మటిచ్చే కుండ నిండగా
బాధలను తల మీదుంచుకొని
నిరంతరాయం సాక్షిగా
అంతరాయాల నడక"

(శోభారాణి, కొలిపాక. 2004: 20)

సమస్యలకు ఒక రూపం ఉండదు. అవి ఒక ఆలోచనగా మన మనసులో మొదలవుతాయి. మనల్ని వేదిస్తాయి. వాటిని చుట్టకుదురుగా పోల్చి నెత్తిమీద ఎత్తుకున్నానని అనడం కొత్తగా అనిపిస్తుంది. బాధలు కూడా అంతే అవి ఆలోచనగానే ఉంటాయి. వాటిని కూడా ఒక వస్తువుగా తల మీదుంచుకోవడం అసాధ్యం, అసాధారణం. ఏదైనా తలపైనా పెట్టుకుంటే మనం కొంతవరకే భరిస్తాం. ఎక్కువసేపు భరించలేం. సమస్యలు, బాధలు కూడా అంతే. కాని సమస్యలకు చుట్టకుదురుకు సంబంధంలేదు.

### ౬.౨.౧౨. అపరిచయీకరణ (Unfamiliar)

"The technique of art is to make objects unfamiliar" (Rice, Philip(Edt.). 2001: 50). కళ అసలు శిల్పం వస్తువులని అపరిచయీకరణ చెయ్యడమే అని Victor Shklovsky తన 'Art as Techique' అన్న పుస్తకంలో తెలిపారు. "పరిచయమున్న వాటిని పరిచయంలేని వాటిగా ప్రవేశపెట్టడం, అంతకుముందు చూసిన వాటిని గురించి ఎన్నడూ చూడని స్పృహతో మాట్లాడటం, అనుభవంలోకి ఎప్పుడో వచ్చిన ఘటనని తొలిసారిగా కనుగొన్న భ్రమను కలిగించే వాతావరణాన్ని ఏర్పరచడం – కవి ఈ పద్ధతిని పాటించడం ద్వారా కూడా విషయాన్ని ప్రకంపన రూపంలో కవిత్వంగా మార్చవచ్చు" (లక్ష్మీనరసయ్య, జి. 2015: 43). నిజజీవితంలో చూసేవే అయినా కవి వాటిని కొత్తగా ప్రవేశపెట్టడంవల్ల అవి మనకు కొత్త స్పృహతో అర్థమవుతాయి, కొత్తగా అర్థమవుతాయి.

"కన్నీటి ప్రవాహంతో నిండిన
నాగేటి చాల్లలో
నెత్తుటి ముద్దలు కురుస్తున్నాయి
బక్కరైతు గుండెల్లో బడబాగ్ని పేలింది
కరువు రైతు కన్నుల్లో
మోదుగుపూలు విచ్చుకున్నాయి"

(దేవేందర్, అన్నవరం. 2001: 11)

రైతులు దుఃఖించడంతో కన్నీళ్ళతో నాగేటి చాల్లు నిండాయనడం, వ్యవసాయం గిట్టుబాటుకాక ఆత్మహత్యకై మందుతాగడంతో నెత్తురు కక్కుకొని చావడాన్ని నెత్తుటి ముద్దలు కురవడం, ఓర్చుకోలేని బాధ గుండెల్లో ఉందని చెప్పడానికి బడబాగ్ని పేలడం, రైతులు ఏడవడంతో కళ్ళు ఎర్రగా మారుతాయి. ఎర్రగా మారడాన్ని మోదుగుపూలు విచ్చుకోవడంగ మలిచి అప్పటికే పరిచయమున్న అంశాల్ని కొత్తగా వింటున్నట్టుగా చేసారు.

"అవ్వా! బొర్లాడిబొర్లాడి పుల్లెందుల పడి
అటీటూ ఎందుకు బెంగటీలి తొక్కులాడుతున్నవ్!!
ఊరు బొత్తిలకు ఇంకిపోతుంది
పొద్దు నిండుపొద్దు కడుపుల గుంకిపోతుంది

అయ్యా! బాయి గడ్డమీద నిలబడి
ఎండిన పొలంను ఎందుకు తల్సుకుంటున్నవ్!
నాయినా! నజర్ ఆనని కండ్లనీళ్లను
ఎర్రగీతల రుమాలుతో ఎందుకు తుడ్సుకుంటున్నవ్!!
అడుగులు పడతలేవ్!
చెయ్యిలు ఆడుతలేవ్!!"

(జగన్నాథం, జూకంటి. 2013: 207)

ప్రపంచీకరణవల్ల పల్లె పల్లెకాకుండా పోవడాన్ని అపరిచయంలా మనకు కవి అందిస్తున్నాడు. మనం రోజు చూస్తున్నదే అయినా మనం అంతగా గమనించని విషయాలు చాలా ఉంటాయి. అవి మామూలుగానే జరిగాయి అనుకున్నా వాటి వెనుక ఒక కుట్ర దాగి ఉంటుంది. పల్లెల్లో మొక్కజొన్న, కందులు, పెసళ్ళు మొదలైన పంటలు పండగా కొత్తగా పత్తి రావడంవల్ల మొక్కజొన్న, కందులు, పెసళ్ళు లాంటి పంటలు తక్కువై పోయి లోటు ఏర్పడింది. పత్తి పంట ప్రోత్సహించడానికి కారణం అది వాణిజ్య పంట కావడం.

"ఆమె కాళ్లు కంది పుల్లలు
తాటి పీచు జుట్టు
ఆమె అంతా అస్థిపంజరం
గొడ్డు మాంసం దెచ్చి ముక్కలు వేరుజేసి
బొక్కలను ఉడికించి జంబులోన పోసి
పిల్లలంత పీల్చుకొని పనిరాయిపై పగల కొట్టుకొని
ముదుసుల నుండి మూలుగును తినిపించింది అవ్వ....."

(బాలయ్య, పొన్నాల. 2008: 45 – 46)

ఏ కవైనా తన సామాజిక జీవితంలోని వస్తువును, భాషని తీసుకురావడంవల్ల సాహిత్యానికి తన వంతు సహాయాన్ని చేసినవాడవుతాడు. ఇక్కడ కవి దళితుల కుటుంబానికి చెందినవారు కావడంతో తల్లి పాత్రను మనకు పరిచయంచేసే పద్ధతి కొత్తగా అనిపిస్తుంది. ఆమె రూపాన్ని వర్ణించేటప్పుడైనా, ఆమె గొడ్డుమాంసం తెచ్చి వాటిని వండి తినిపించేటప్పుడైన ఆమె మనకు నూతనంగా దర్శనమిస్తుంది. తెలుగులో దళితవాదం అందించిన చైతన్యంవల్ల ఎంతోమంది కవులు, కళాకారులు తమతమ జీవితాల్ని అక్షరాలుగా ఆవిష్కరిస్తున్నారు.

తమకే స్వంతమైన అనుభవాల్ని తమదైన స్వంత భాష ద్వారా వ్యక్తీకరిస్తున్నారు.

"ఈ గదిలో
ఈ నులక మంచమే నా జీవితమన్నవేళ
ఈ గదిలో అటూ ఇటూ కదలాడే ఎర్రచీమలే నా స్నేహితులన్న వేళ
అనుక్షణం నన్ను వెంటాడే ఈ ఈగలే నా ఆత్మీయులన్న వేళ
ఈ గదిలోకి వచ్చే చిరుకాంతే నా నుదిటిమీది కుంకుమ దీపమన్నవేళ
దానిష్టం వున్నప్పుడు తిరిగే విమానం మోతే నా జీవన సంగీతమన్న వేళ
నే నిన్ను ప్రశ్నిస్తే–
నా బాధ్యత నేను నిర్వర్తించానని అంటావా–
ఓ నా స్తనాన్ని ఆశ్రయించినవాడా –"

(జింబో. 2002: 34)

తల్లి శక్తిలేకుంట అయ్యి చివరి స్థితిలో ఒక గదిలో మంచంమీదే జీవితం సాగాలన్నప్పుడు ఆ తల్లిని పట్టించుకునే కొడుకుగానీ, మరెవ్వరు లేనప్పుడు ఆ తల్లి స్థితి ఎలా ఉంటుందో ఈ కవిత మనకు తెలియజేస్తుంది. కడుపులో పడ్డప్పటినుంచి ప్రయోజకుడయ్యేదాకా జాగ్రత్తగా పెంచిన తల్లిని అవసానదశలో జాగ్రత్తగా, ప్రేమగా ఆ కొడుకు చూసుకోకపోవడం అత్యంత దౌర్భాగ్యం. ఈనాటి వార్తాపత్రికల్లో రోజు ఇలాంటి వార్తలు మనకు కనిపిస్తూనే ఉంటున్నాయి. అంటే కన్నవాళ్ళ విలువ, బంధాల విలువ తగ్గిపోయి డబ్బుకు విలువ పెరిగిపోతుంది అన్నమాట.

"ఏకాంతంలో దిగులు మేఘాలు చుట్టుముట్టి
మనస్సును మబ్బు కమ్మినప్పుడు
వెనక నుంచి వచ్చి మెత్తగా వాటేసుకుని
చెక్కిలి నిమిరే అదృశ్య హస్తపు
అమృత స్పర్శ దానిదే
గడ్డకట్టిన నువ్వు కరిగి నీరయ్యేది దానివల్లనే
స్తబ్ధతను వీడి నువ్వు ఏరయ్యేది దానిమూలంగానే"

(ఎలనాగ. 2010: 17)

సంగీతాన్ని ఆస్వాదించే గుణం అందరిలోనూ ఉంటుంది. సంగీతం విన్నప్పుడల్లా దానికి అనుగుణంగా మన మనసో, కాళ్ళో రెండు స్టెప్పులేస్తాయి. అంతటి కదిలించే గుణం సంగీతానికుంది. ఒంటరితనంలో ఉన్నప్పుడు, బాధలో ఉన్నప్పుడు కొంతమంది సంగీతం వినండి అని చెబుతారు. అప్పుడు ఒంటరితనం, బాధ రెండు దూరమైపోయి మనసు హాయిగా అనిపిస్తుంది.

### 6.2.13. మానవ గుణారోపణ (Personification)

వస్తువులకీ, అమూర్త భావనలకీ, జంతువులకీ, ప్రకృతి విషయాలకీ మానవ స్వభావాన్ని, రూపాన్ని, లక్షణాలని ఆపాదించడం ద్వారా కవిత్వం చేసే పద్ధతి. ఆంగ్లంలో దీన్ని 'Personification' అంటారు. "వ్యక్తిత్వారోపణ లేదా మానవ గుణారోపణ. ఒక వస్తువుకు, భావానికి, జంతువుకు మానవ గుణారోపణ చేయడం లేదా మూర్తీకరించడం. మూర్తీకరణ అనే పదం పర్సానిఫికేషన్‌కు సరిపోవచ్చు. అంటే మానవేతరమైన వస్తువు, భావం, జంతువు వగైరాలు మానవీయ గుణగణాలు కలిగినవిగా చూపించడం" (యాకూబ్. 2017: 123). తెలుగు కవిత్వంలో మానవగుణారోపణ చాలా సందర్భంలో కనిపిస్తుంది.

"ఊరూరికీ కుంపటిసెగ
పచ్చని బతుకులన్నీ ఎండిపోయి
మనిషి నిలువునా ఇచ్చుక పోయిందు
పల్లెపల్లెకూ వెయ్యిన్నొక కత్తిగాట్లు"
(దేవేందర్, అన్నవరం. 2008: 83)

కత్తిగాట్లు మనిషికి అయ్యే గాయం. కాని ఇక్కడ పల్లెకు కత్తిగాట్లు పడ్డాయనడంలో మానవ రూపాన్ని పల్లెకు ఆరోపించారు కవి. గురజాడ అప్పారావు గారు 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్నట్టు పల్లె మనుషులతో కూడుకున్నది. పల్లెకు ప్రత్యేకమైన సంస్కృతి, జీవన విధానం, మంచితనం, మానవత్వం లాంటివి ఎన్నో ఉంటాయి. అవన్నీ నేడు ప్రపంచీకరణవల్ల మాయమై మంచితనం, బంధాలు దెబ్బతింటున్నాయి. రోజురోజుకు పెరిగిపోతున్న ఆధునికత, మనుషుల్లో స్వార్థం పల్లె జీవన విధానాన్ని, నిర్వచనాన్ని మార్చేసింది.

"గాలితో పూలు చేసే

సంభాషణ వినడానికైనా"

(జింబో. 2003: 19)

సంభాషించుకోవడం మనుషులకు మాత్రమే సాధ్యమయ్యే క్రియ. కాని ఇక్కడ గాలి, పూలు సంభాషించుకుంటున్నాయి అనడంలో మానవ లక్షణారోపణ కనిపిస్తుంది.

"గోడను ముద్దాడిన పోస్టర్"

(గఫూర్ శిక్షక్, సిరిసిల్లా. 2010: 73)

గోడమీద పోస్టర్ అతికించారు అనేది మామూలు వాక్యం. దాన్నే కవి మానవగుణారోపణ ద్వారా కవిత్వీకరించారు.

"రిక్షాలు భారంగా ఒళ్ళువిరుచుకొని

లేచి కూర్చుంటాయి"

(జగన్నాథం, జూకంటి: 2013: 15)

'ఒళ్ళు విరుచుకోవడం' అనే మానవ లక్షణాన్ని రిక్షాలకు ఆరోపించడంవల్ల వాక్యాన్ని కవిత్వంగా మలచగలిగారు కవి. రాత్రంత పడుకొని పొద్దున్నే ప్రయాణికులు ఎవరైన వస్తే ఆ రిక్షా నడిపే వాళ్ళ లేచి ఒళ్ళు విర్చుకొంటారు. ఆ సన్నివేశాన్ని కవి రిక్షాలే ఒళ్ళు విర్చుకోవడం అన్న వాక్యంగా మలిచి కవిత్వ నిర్మాణ పద్ధతిని పాటించారు.

"ఎర్రని చొక్కాధరించి

గుండీలు సర్దుకొంటున్న

సాయంత్రం"

(జగన్నాథం, జూకంటి. 2013: 23)

సాయంత్రంలో సూర్యుడు అస్తమించే సమయాన ఎర్రటి ఎండ ఉంటుంది. దాన్ని చొక్కగా భావించాడు కవి. అప్పుడప్పుడే ఆకాశంలోకి నక్షత్రాలు వస్తుంటాయి. వాటిని గుండీలుగా పోల్చారు. ఇలా సాయంకాలపు సమయంలోని సూర్యుడిని మానవుడిల భావించి, ఎండను చొక్కాగా, నక్షత్రాలను గుండీలుగా ఆపాదించారు.

"పల్లె మొకం

చిన్నబోయింది

ఊరు కన్నీరు పెట్టింది

పండుగ లేదు

పబ్బం లేదు”

(దేవేందర్, అన్నవరం. 2003: 79)

ఒకవైపు బతుకుదెరువులేక పల్లె సగం జనం వలసపోయింది. మరోవైపు వర్షాలు సరిగ్గా పడకపోవడంతో కరువు ఏర్పడింది. ఇలా రెండు విధాలా పల్లె చిన్నబోయింది. ఊరు కన్నీరు పెట్టింది. వర్షాలుపడి పంటలు పండితే, నాలుగు డబ్బులొస్తే పండుగైనా, పబ్బమైనా. వర్షాలు లేక, పంటలులేక, ఊళ్లో జనాలు లేక ఊరంత మూగబోయింది.

“కళ్ళు తెరిస్తే

భయంకర భీభత్స దృశ్యాలు

నొసలు చిట్లించిన నేల

గుండె పగులుతున్న నేల

నిస్సహాయంగా దీనంగా

నీరింకిన కళ్ళతో నీలాకాశం

మౌనిలా మౌనసాక్షిగా తెల్లబోయిన చంద్రుడు”

(లక్ష్మణరావు, జి. 2003: 8)

వానలు లేక భూమి నెర్రలు పాయడాన్ని ‘నొసలు చిట్లించిన నేల’గా, నీళ్ళు లేక ఎండిన పంటభూమిని ‘గుండె పగులుతున్న పొలాలు’గా, ఆకాశంలో మేఘాలు లేవనేదాన్ని ‘నీరింకిన కళ్ళతో నీలాకాశం’గా, వీటన్నింటిని చూసి కూడా మాట్లాడని చంద్రుడుని ‘మౌనిలా మౌన సాక్షిగా తెల్లబోయిన చంద్రుడు’గా ఇలా ప్రతి అంశాన్ని మానవ లక్షణాలతో ఆరోపించడం కవిపిస్తుంది.

“పండు వెన్నెల పలకరింపుతో

అడవితల్లి పులకరిస్తుంది

రెక్క విదిల్చిన విహంగం

నింగికేగిన వేళలో

అడవితల్లి ఒల్లు విరుచుకుంది”

(దేవేందర్, అన్నవరం. 2001: 23)

'పులకరించడం' అనేది అన్ని సందర్భాలో జరగని పని. అత్యంత ఇష్టమైన వాళ్ళు పిలిచినప్పుడో, అందమైన దృశ్యాన్ని చూసినప్పుడో ఇలా కొన్ని సందర్భాల్లో మాత్రమే పులకరించడం జరుగుతుంది. ఇక్కడ అడవితల్లి అన్నారు గనుక చంద్రున్ని బిడ్డ అనుకుంటే, వెన్నెల పిలుపు. కొడుకు పిలుపుకు తల్లి మనసు పులకరిస్తుంది. రాత్రంత చెట్లపై పడుకున్న పక్షులు తెల్లారగానే వేటకై బయలుదేరుతాయి. ఇలా ఎగిరేటప్పుడు చెట్లు కదులుతాయి. అలా కదలడాన్ని ఒళ్లు(శరీరం) విరుచుకోవడంగా భావించవచ్చు. ఇలా మానవ గుణారోపణ ద్వారా కవి మంచి శిల్పాన్ని సాధించి ఒక భావచిత్రంగా మలిచారు. తద్వారా ఆ సన్నివేశం మన కళ్ళ ముందు అద్భుత దృశ్యంగా కనిపిస్తుంది.

"తోట నిద్రపోతుంది / పరిమళాలు
మేలుకున్నాయి"

(శివకుమార్, వఝుల. 2004: 89)

నిద్రపోవడం మనిషి చేసే క్రియ. ఇక్కడ తోటకు దాన్ని ఆపాదించడంవల్ల కవిత్వమైంది. అంటే ఎవ్వరు లేక తోటంత నిశ్శబ్దంగా ఉంది. అలాగే పువ్వు వికసించడం ద్వారా సువాసన వస్తుంది. ఆ సువాసనని పరిమళాలు మేలుకున్నాయి అని అన్నారు.

"ఈ అనూహ్య వైపరీత్యానికి తట్టుకోలేక
ఆకాశం తల తిరిగిపోయింది
దాని సర్వాంగాలకు చెమటలు పట్టాయి
ఎలుగెత్తి ధరిత్రిని అభ్యర్థించింది
శ్వాస బంధన దీక్షను విరమించుకొమ్మని"

(నారాయణరెడ్డి, సి. 2010: 25)

తల తిరగడం, అన్ని అవయవాలకు చెమటలు పట్టడం, అభ్యర్థించడం లాంటి వాటిని ఆకాశానికి ఆరోపించడంవల్ల శిల్పం సాధించారు కవి.

"తేదీలపై తేదీలను ప్రసవిస్తున్న
న్యాయాలయ ప్రాంగణాలు
సామాన్యుల పాలిట
ద్రోణాచార్యులే కావచ్చు......"

(రవీంద్ర, సంగెవేని. 2005: 70)

సామాన్యంగా కోర్టులో ఒక కేసు పరిష్కారం కావడానికి చాలా సమయం పడుతుంది. అందులో సామాన్యుల పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటుంది. ఇలా చాలా రోజులు కోర్టులో గడిచిపోవడాన్ని కవిత్వీకరించడానికి ప్రసవిస్తున్న అన్న మానవ గుణారోపణ చేశారు. అలాగే పురాణ పాత్ర పోలిక కూడా కనిపిస్తుంది. ఏకలవ్యుడు తక్కువ కులానికి చెందినవాడు. ఇతనికి విలువిద్య నేర్చుకోవాలని ఉంటుంది. కాని తక్కువ కులంవాళ్ళు ఇలాంటి విద్యలు నేర్చుకోవడానికి ఆనాటి కాలం ఒప్పుకోదు. అందుకే ఏకలవ్యుడు గూఢంగా ద్రోణాచార్యుడి ఫోటో పెట్టుకొని విలువిద్యలో ఆరితేరుతాడు. ఇది తెలుసుకున్న ద్రోణాచార్యుడు అర్జునుడే విలువిద్యలో గొప్పవాడిగా ఉండాలని ఏం పాపం చెయ్యని ఏకలవ్యుని బొటనవేలు గురుదక్షిణగా అడుగగా ఏకలవ్యుడు ఇస్తాడు. అలాగే న్యాయాస్థానాలు కూడా సామాన్యుల పాలిట ద్రోణాచార్యులే అనడంవల్ల సామాన్యులకు అన్యాయం జరుగుతుందని చెప్తున్నారు.

### 6.2.14. తళుక్కున ప్రారంభం కావడం (Abrupt Beginning)

దీన్ని ఆంగ్లంలో 'Abrupt Beginning' అంటారు. కవిత ఉన్నట్టుండి ప్రారంభం కావడం. ఎవరైన సడెన్‌గా వచ్చినప్పుడు తళుక్కున వచ్చావేంటి అని అంటారు. అలానే కవిత కూడా సడెన్‌గా ప్రారంభం కావడం.

"Know Thy self
నువద్దె
నన్ను నేను తెల్సుకున్న
నువ్వెవరో పోల్చుకున్న
ఇగ నువ్వు
నన్నే మార్చలేవు ఏమి మార్చలేవు"

(దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 26)

ఇక్కడ కవిత 'Know Thy self' అన్న ఆంగ్ల వాక్యం తర్వాత 'నువద్దె(నిజమే)' అని తళుకున్న ప్రారంభమై ఆ నిజమేమిటో కవితంతా చెప్పడం జరిగింది. ఈ కవిత ఎత్తుగడ కవిత చివరి పాదమో అన్నట్టుగా ఉంది. కవిత మొదటనే నిజమని చెప్పి ఆ కవితంత ఆ నిజమేమిటో వివరణాలాగా ఉంటుంది.

"దిక్కుమల్లె తలరాత రాసుకచ్చుకున్నమె అవ్వా
పోరగాండ్లు పచ్చులోలె రాలవట్టిరి
ఎవల పానానికి వాళ్ళు పోవట్టిరి
తెలంగాణ వచ్చుడో సచ్చుడో ఏమోగానీ
సావులను కండ్ల సూడవడితిమి"

(దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 88)

జనవ్యవహారంలో ప్రజలు తమకి ఆపద కలిగినప్పుడో, విషాద సంఘటన జరిగినప్పుడో 'దిక్కుమల్ల తలరాత రాసుకచ్చుకున్నమె అవ్వా' అన్న వాక్యాన్ని ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. అదే వాక్యంతో కవి కవితని ఆరంభించడం ద్వారా ఒక విషాదమేదో చెబుతున్నానని చూసిస్తూ, ఆ విషాదమేమిటో కవిత మిగిలిన పాదాల్లో చెప్పడం జరిగింది.

"ఎంత పనయింది ఎల్లన్నా!
మనగతేంది మల్లన్నా!
గిట్లయితదనుకోలేదు
గింతగనం కొంపలు ముంచుతడనుకోలేదు
గిట్ల జేత్తడనుకుంటే
గింతగూడ గెలువనియ్యకపోదుం"

(లక్ష్మణరావు, జి. 2003: 24)

నమ్మి ఓట్లేసిన నాయకుడు మోసం చేసిన వైనాన్ని ఎదుటివారితో సంభాషణాత్మకంగా సాగే ఈ కవిత 'ఎంత పనయింది ఎల్లన్నా!' అన్న క్రియా వాక్యంతో ఉన్నపళంగా ప్రారంభమైంది. దాంతో ఒక ఉత్సుకతని కలిగిస్తుంది. స్థానిక పదజాలం ఈ కవితకి మరో అందం.

"రండి
ఇండియా తమకు శిరస్సు వంచి
స్వాగతం పలుకుతుంది
రైతు వెన్నెముకల్ని ఏర్చి కూర్చి
విమానం దిగుతున్న మెట్లగా తీర్చిదిద్దాం"

(జగన్నాథం, జూకంటి. 2013: 43)

‘రండి’ అన్న పదంతో కవిత ప్రారంభం కావడంవల్ల ఎవరు రావాలి, ఎక్కడికి రావాలి అన్న ఆలోచన కలిగించడంవల్ల కవితను చదివించే గుణం దీనికి కలిగింది. ఆ తర్వాతి పాదాల్లో ఇండియాకు రమ్మని, వస్తే ఇండియా ఏం చేస్తుంది ఇలా అనేక విషయాలతో కవిత సాగుతుంది. ధ్వని, వ్యంగ్యం లాంటి కవిత నిర్మాణ పద్ధతులు కూడా ఈ కవితలో మనకు కనిపిస్తాయి. ఇండియాలోని అనేక రంగాల్ని ప్రైవెటైజేషన్ చేస్తున్న ప్రభుత్వానికి నిరసనగా బలమైన గొంతుక ఈ కవిత నిండా వ్యాపించి ఉంది.

“జీవిస్తున్నాను
మృత్యువుకు జోల పాడడానికి.
పోగొట్టుకుంటున్నాను
నన్ను నేను పొందడానికి”

(నారాయణరెడ్డి, సి. 2008: 32)

కవితారంభమే ‘జీవిస్తున్నాను’ అన్న క్రియతో అయ్యింది. ఇలా క్రియతో ప్రారంభం కావడం చాలా అరుదుగా కవిత్వంలో కనిపిస్తుంది. సామాన్య సంభాషణలో కర్త కర్మ క్రియ ఉంటుంది. కాని కవిత్వంలో ఈ వరుస తారుమారవుతుంది. ఒక విషయాన్ని కవిత్వం చెయ్యడానికి కవులు ఇలాంటి పద్ధతులను ఉపయోగిస్తారు.

“విన్నావురా కన్నా?
బ్రతుకు బాట మీద బయల్దేరావు సరే
విద్యను మూటగట్టుకుని
ఉద్యోగ సోపానాల మీద ధనార్జన భారాన్ని మోస్తూ
పైకి చేరాలి, పదిలం బాబూ!”

(ఎలనాగ. 2010: 62)

కాలేజ్‌లో చేరిన తన బిడ్డకి మంచి చెడులను వివరిస్తున్నారు. ఎన్ని కష్టాలొచ్చినా చివరిదాకా నడవాలనీ, అనుకున్న గమ్యాన్ని చేరుకోవాలనీ, దురలవాట్లను అలవాటు చేసుకోవద్దనీ, సినిమాల మోజులోపడి చెడిపోవద్దనీ, ధూమపానం, మద్యం అలవాటు చేసుకోవద్దనీ, అంతర్జాలనికి బానిస కావద్దనీ ఇలా అన్ని మంచి విషయాలు చెబుతారు కవి.

### 6.2.15. భంగిమలకు తగిన భాషను ఎన్నుకోవడం (Language of gesture)

కవి తన మనసులోని భావానికి తగ్గ భంగిమలనీ, సైగలని కవిత్వంలో వాడుకోవడం. “కవి తనకున్న ఆలోచnalani సైగ రూపంలోనో, ముఖానికీ, చేతులకీ సంబంధించిన భంగిమ రూపంలోనో ఒక నాటకీయ వాతావరణం ద్వారానో ప్రవేశపెట్టినప్పుడు కూడా కవిత్వం వెలువడుతుంది. తాను చెప్పదలుచుకున్న భావం తాలూకు భంగిమనీ, సైగని పట్టివ్వడానికి ఉపయోగపడే రీతిలో భాషను ఎన్నుకోవడం, నిర్మించడంలోనే ఈ రకం కవితా నిర్మాణ రహస్యం ఉంది. భావం తాలూకు భౌతిక సూచనల భాగమయిన సైగని, భంగిమని సమగ్రంగా వ్యక్తం చేయగల మాటల, పదాల వ్యవస్థన ‘Language of gesture’ అంటారు భాషా శాస్త్రవేత్తలు” (లక్షీనరసయ్య, జి. 2015: 23). ‘Language of gesture’ అన్న తన సిద్ధాంత వ్యాసంలో ఆంగ్లకవులు gesture ని వాడిన విధానాన్ని వివరించారు బ్లాక్మర్. కరీంనగర్ జిల్లా ఎంతోమంది కవులు ఈ కవితా నిర్మాణాన్ని వాడుకొన్నారు.

“అయినోళ్లందరిని పిడాత చంపుకొని
కానోళ్లందరిని పిడుగోలె నింపుకొని
తీరొక్క తరీక తీర్చిదిద్దిన
అరొక్క అతారకు మనసుల్నే మొక్కుకొని
గూడు పట్టు చెదిరి
చలిరాత్రి చెట్టు కొమ్మమీద తడిసి
పొద్దిపొడుపు నీరెండకు
కాకి రెక్కల్ని ఆరబెట్టుకుంటున్నట్టు
విలవిల్లాడుతూ మొదలుపెడుతున్నాను
కల్లపెల్ల ఉడుకుతూ కదిలిపోతున్నాను”

(జగన్నాథం, జూకంటి. 2013: 330)

కడుపునింపని వృత్తిని, కన్నతల్లిల పెంచిన ఊరిని వదిలి వెళ్ళిపోతున్న వలసదారుని ఎదలోని బాధ నీళ్లలో తడిసి ఎండకు ఆరబెట్టుకుంటున్న కాకి రెక్కల్ల విలవిల్లాడుతూ, కల్లపెల్ల ఉడుతుకూ ఉన్న వేదనని పాఠకుడు భాషద్వారా అనుభవించినప్పుడు ఉద్వేగానికి గురికాక

తప్పదు. కవికి కలిగిన బాధని పాఠకుడు తనదిగా చేసుకొని బాధపడడానికి కవి చక్కటి కవితా నిర్మాణ పద్ధతిని ఉపయోగించారు.

"కొట్టిన ఉదయం బడిగంట
విద్యార్థుల వెలుగు పాదముద్రలు
సలపరం కలువరపడడం
తడవడం ఒడిసిపోవడం
గావర గావర ఏటేటో ఎత్తుకపోవడం
చేదు చేదు కడుపులో చేయిపెట్టి దేవడం
లోపల వుంచుకోలేక బయటకు చెప్పుకోరాక
తాయిమాయి ఆగమాగం ఎల్తి ఎల్తి
ఒక మసులుతున్నదేదో ఒక మరుగుతున్నదేదో
పద్యం అద్దమై ముత్యమై పగడమై
నన్ను రెండు చేతుల ఎత్తుకు గుండెలకు హత్తుకు
వానదేవుడిలా కరిగి
కనికరిస్తుంది కరుణిస్తుంది"

(జగన్నాథం, జూకంటి, 2013: 353)

ఒక కవిత, పద్యం రాయడానికి కవిపడే వేదనను సలుపరం, కలువరపడడం, గావరగావర, ఎటేటో ఎత్తుకుపోవడం, చేదుచేదు కడుపులో చేయిపెట్టి దేవడం లాంటి పదాలతో, వాక్యాలతోచెప్పినప్పుడు ఆ వేదనని పాఠకుడు తనదిగా మలుచుకొని అనుభవిస్తాడు. చివరికి 'నన్ను రెండు చేతుల ఎత్తుకు గుండెలకు హత్తుకు వాన దేవుడిలా' అన్న వాక్యంలోని ఆప్యాయత, అనురాగం, కవితని దేవుడిలా అనుకున్న భావాన్ని కవితోపాటే పాఠకుడు సమాంగా అనుభవిస్తాడు.

"నాలుగు కండ్లు
ఏక్‌దమ్ మత్తడి దునికేటట్టున్నయి
ఎన్ని దుక్కులు దున్నిందో
ఎన్ని పుట్లు పండిచ్చిందో ఎద్దు

మిట్టమిట్ట సూస్తంది
గుడ్లల్ల గంగ తిరుగుతంది”

(దేవేందర్, అన్నవరం. 2008: 86)

రైతులకు పశువులు బిడ్డలతో సమానం. పిల్లలను ఎలా చూసుకుంటారో పశువుల్ని అలాగే ప్రేమగా, జాగ్రత్తగా చూసుకుంటారు. అంతలా ప్రేమగ చూసుకున్న ఎడ్లని చివరికి అమ్మేసే స్థితిలోని బాధ  తీవ్రమైంది. ఆ తీవ్రతలో ఆ రైతు, ఎద్దు పరిస్థితిని అంతే తీవ్రమైన వాక్యాలతో చెప్పడం జరిగింది.

“కడుపులో గడ్డపారలు వదిలేసినట్లు
గుండెకాయ కెల్లగించిన నొప్పి
కనుగుడ్లల్ల పచ్చబొట్లు పొడిచినట్లు బాధ
మనస్సు కలికలి అయ్యింది
తీరొక్క బాధలతో
నన్ను మంగులంల ఏంచుతున్నరు”

(దేవేందర్, అన్నవరం. 2001: 5)

జీవితంమీద దాడిచేసి, తన సంస్కృతి, భాష, కళలు ఇలా అన్నింటిని నాశనం చేసి తన ఉనికిని, అస్తిత్వాన్ని లేకుండా చేస్తున్నప్పుడు కలిగే బాధను కవి సహజమైన ఉదహరణతో చెప్పారు. కడుపులో గడ్డపారలు వదిలేయడం, గుండెకాయను కెల్లగించడం, కనుగుడ్లపై పచ్చబొట్టు పొడవడం, మంగులంల వేయించడం అత్యంత బాధాకరమైన అంశాలు. అలాంటి బాధ కవి అనుభవిస్తూ పాఠకులచేత అనుభవించేల చేస్తున్నారు.

### 6.2.16. వస్తు స్థానభ్రంశం (Misplacement of Things)

ఒక వస్తువును దాని మామూలు స్థానం నుంచి బయటకి తీసి తద్భిన్నమైన వాతావరణంలో భిన్నమైన వస్తువుతో కలపడంవల్ల కవిత్వసృష్టి జరుగుతుంది. ‘Poetry is misplacement of things’ అని అన్నాడు లార్జ్ డేవిడ్.

“మా ఊరు చక్రాలమీద ఉరికచ్చినట్టు
మనసంతా చెంగలిచ్చి పులరిస్తది”

(దేవేందర్, అన్నవరం. 2008: 42)

'చెంగలించడం' ఆవులు, ఎద్దులు, బర్రెలు మొదలైనవి చేసేపని. కాని ఇక్కడ మనసు చెంగలిస్తుంది అని అనడంవల్ల దాని స్థానం నుంచి తప్పించి మనసుతో కలపడం వల్ల కవిత్వ శిల్పాన్ని సాధించారు. పశువులు చాలా సంతోషంలో, ఆనందంలో ఉన్నప్పుడు చెంగలిస్తుంటాయి. అలాగే బస్సును చూడగానే కవి మనసు కూడా సంతోషంతో నిండిపోవడంతో చెంగలిస్తుంది అని చెప్పడం జరిగింది.

"ఎండిపోయిన పొలాలు
అలమటించే ఆలుబిడ్డలు
కన్నవాళ్ళు నా ఆనవాళ్ళు
కనుమరుగవుతుంటే
కడసారి లేచే చేతులకు
కన్నీటి వీడ్కోలు చెప్పి
కదిలిపోయే ఆ బస్సు
ముక్కలైన చిక్కటి స్వప్నం"

(రవీంద్ర, సంగెవేని. 2007: 8)

ముక్కలు కావడం వస్తువులకు సంబంధించిన అంశం. అలాగే చిక్కటి అనే పదం కూడా కొన్ని ద్రవ పదార్థాలకు(చాయి చిక్కగుంది, పాలు చిక్కగున్నాయి) ఉపయోగించేది. ఈ రెండింటిని కలతో కలపడం జరిగింది.

"అబద్ధాన్ని నెత్తిమీదెట్టుకు ఊరేగడం పెద్ద విషాదం
నిజాన్ని కడుపులో దాచుకు గడపడం గొప్ప హాస్యాస్పదం"

(జగన్నాథం, జూకంటి. 2013: 119)

అబద్ధాన్ని నెత్తిమీద పెట్టుకొని తిరగటానికి అదేమీ వస్తువు కాదు కదా. అంటే అబద్ధాలు చెప్పడం, అబద్ధంగా బతకడమని కవి ఉద్దేశ్యం. అలాగే నిజాన్ని కడుపులో దాచుకోవడం కూడా కుదరని పని. అంటే నిజాల్ని చెప్పకపోవడం అన్నమాట.

"ఆకల్ని కొలిచి చూస్తేనేమో అడుగులు
తడబడతాయి....
నాల్రోజులు డ్యూటీ ఎక్కకకపోతే / నాలుక మీద తడి ఉండదు"

(రవీంద్ర, సంగెవేని. 2007: 46)

మామూలుగా ఆకలిని కొలవడం సాధ్యపడదు. ఎందుకంటే అది వస్తువో, స్థలమో ఇంకేదో కాదు కాబట్టి. అసలు ఆకలికి ఒక రూపం ఉండదు. అదొక భావన, చర్య. అలాంటిదాన్ని సామాన్యంగా కొలవడం సాధ్యపడదు. కాని కవిత్వం కొంచెం భిన్నం కనుక ఇక్కడ అది సాధ్యమైంది. ఆకలిని కొలవడంవల్ల అడుగులు ముందుకు సాగడంలేదు అంటే నడిచే శక్తి లేదని అర్థం.

"రోడ్లు పాదముద్రలతో
పోటెత్తి పొంగిపొర్లుతుంటాయి
రోడ్లు అట్టడుగు ప్రజల
ఉద్యమ చలన సంగీతమవుతుంటాయి"

(జగన్నాథం, జూకంటి. 2013: 31)

అత్యధిక సంఖ్యలో ప్రజలు ఉద్యమంలో పాల్గొంటున్నారనీ, ఆ ఉద్యమంలో భాగంగా నినాదాలు ఇస్తున్నారనీ, పాటలు పాడుతున్నారనీ కవి పై వాక్య ప్రయోగాలు చేశారు. నదులకు, సముద్రాలకు ఉండే పోటెత్తే గుణం రోడ్లకి చెప్పడంవల్ల కవిత్వ శిల్పాన్ని సాధించారు కవి.

"ఇక నోమోర్ సెంటిమెంట్స్....
నడకనేర్పిన వేలిని తెగ్గోసి
చూపు పోగొట్టుకున్న అడుగులతో
చాలా దూరం వచ్చేశాం"

(శివకుమార్, వఝల. 2004: 12)

మనిషికి దృష్టి అనేది ఒకటుంటుంది. అది ఆంతరంగికమైందిగా ఉండాలి. ముందుచూపు కూడా ఉండాలి. అలా అయితేనే మనం జీవితాన్ని ఆనందంగా గడపగలుగుతాం. మనిషికి చూపుంది కనుకే అన్నీ చూస్తాడు. ఆ చూడడంలో ఎదుటివారి బాధ, దుఃఖం, వేదన అన్నీ కనబడతాయి. వాటిని చూసి మనిషి స్పందిస్తాడు. కాని నేడు ఆ చూపు లేకుంట అయ్యిందన్న బాధ కనిపిస్తుంది.

"దుర్భర శబ్దం
నిశ్శబ్దాన్ని అదేపనిగా కాటేస్తున్నది"

(నారాయణరెడ్డి, సి. 2010: 30)

కాటేయ్యడం పాముకో, తేలుకో సంబంధించింది. ఇక్కడ పామునే తీసుకుంటే బాగుంటుది. పాము కాటేయ్యడంవల్ల మనిషి చనిపోతాడు. అలాగే శబ్దం కాటేయ్యడంవల్ల నిశ్శబ్దం మరణిస్తుంది. అసలు శబ్దం ఉన్నచోట నిశ్శబ్దం, నిశ్శబ్దం ఉన్నచోట శబ్దం ఉండవు.

### 6.2.17. ధ్వన్యనుకరణ (Onomatopoeia)

"ఒనమటోపియా అంటే పదాన్ని ఉచ్చరించిన ధ్వని ఆ పదం సూచించే వస్తువు లేదా క్రియను పోలి ఉండడం. ధ్వన్యనుకరణ అని మనం చెప్పవచ్చు" (యాకూబ్. 2017: 105). మనకు తెలుగులో శబ్దాలంకారాల్లో ఇలాంటి నిర్మాణ పద్ధతి కనిపిస్తుంది. అంటే ఒక్కొ అలంకారం ఒక్కో రకమైన శబ్దాల్ని ఉపయోగించడం ప్రధానంగా కనిపిస్తుంది.

"పెయ్యి మండుతున్న పొయ్యి
సలసల మసులుతున్న ఎసరు
అంటుకున్న చలినెగడు
అగ్గోలె భగ్గున కాలుతున్నది"
(దేవేందర్, అన్నవరం. 2003: 31)

జ్వరం వచ్చిన తర్వాత శరీర స్థితిని చెప్పడానికి వాడిన వాక్యాల్లో 'సలసల', 'భగ్గున' అన్న పదాలు జ్వరపు తీవ్రతని తెలియజేస్తాయి. మసులుతున్న ఎసరు అనడానికి 'సలసల మసులుతున్న ఎసరు అనడానికి 'అగ్గోలె కాలుతున్నది' అనడంలో, 'అగ్గోలె భగ్గున కాలుతున్నది' అనడంలో జ్వరం తాలూకు ఉచ్ఛస్థితి పూర్తిగా చెప్పదలుచుకున్న అంశానికి, విషయానికి వచ్చేసింది. దీంతో మొదటి వాక్యంకన్న రెండవ వాక్యం చదివినప్పుడు కలిగిన భావం మరింత గాఢంగా అనిపిస్తుంది.

"మొగులై మొగులై
ఉడికి ఉడికి
చర్‌చరా మెరుపు మెరిసి
చట్‌చటా ఉరుము ఉరిమి
భూదేవి వాకిలి సాన్పు చల్లినట్టు
వాన వచ్చింది"
(జగన్నాథం, జూకంటి. 2013: 144)

వాన వచ్చే విధానాన్ని అంతే సహజంగా వాక్యాలుగా మార్చడం మనం ఇక్కడ గమనించవచ్చు. 'చర్‌చరా', 'చట్‌చటా' అన్న ధ్వన్యనుకరణ పదాల్ని కవిత్వంలోకి తీసుకురావడంతో సహజత్వం వచ్చింది. 'భూదేవి వాకిలి సాన్పు చల్లినట్లు' అన్న వాక్యంలో కళాత్మకత కనిపిస్తుంది.

"భాషను బతుకును
ఎటమటం చేసి ఎగిరిస్తే
వక్కడ వక్కడ నవ్వుకుంటిమి
సిటపట పండ్లు కొరకక పోతిమి"

(దేవేందర్, అన్నవరం. 2008: 56)

అన్యాయం చేసినా కోపానికి రాక ఆనందపడడం అన్న విషయాన్ని 'వక్కడ వక్కడ' 'సిటపట' అన్న పదాల్లో చెప్పారు కవి. తెలుగు సాహిత్యంలో నవ్వు గురించి విశేషంగా చెప్పింది అన్నమాచార్యులు. అతని దాదాపు 108 నవ్వుల గురించి చెప్పారు. ఇక్కడ నవ్వే విధానాన్ని కవి 'వక్కడ వక్కడ' అనడం కొత్తగా ఉంది.

తుమ్మెద రాగాలు వింటే
తుకతుక ఉడికిపోతాడు"

(నరహరి ఆచార్య, డింగిరి. 2005: 22)

కొన్ని ప్రాంతాల్లో ఉడకడానికి వాడే ధ్వన్యనుకరణ పదం కుతకుత అని ఉంది. 'అన్నం కుతకుత ఉడుకుతుంది' అంటారు. ఇక్కడ తుకతుక కనిపిస్తుంది.

"పక్షుల కిచకిచలు కప్పల బెకబెకలు
కాకుల కావుకావులు పిల్లుల మ్యావు మ్యావులు
ధ్వన్యనుకరణ కళారూపాలకు / చుట్టిన శ్రీకారాలు"

(నారాయణరెడ్డి, సి. 2008: 42)

భాషోత్పత్తి వాదాలైన బౌబౌ, పూపూలు అరుపులనుండే భాష ఆవిర్భవించిందని చెబుతాయి. మానవుడు మొదట్లో తన భావాన్ని తెలపడానికి సైగలు చేసేవాడు. తర్వాత ధ్వనులుగా, ఆ తర్వాత అర్థవంతమైన ధ్వనులుగా మారి భాష ఏర్పడింది. కవిత్వంలో పక్షుల, జంతువుల ధ్వనులని సందర్భానుసారంగా ఉపయోగిస్తుంటారు కవులు.

### ౬.౨.౧౮. పునరుక్తి (Repetetion)

"ఇంగ్లీషు కవిత్వంలో పునరుక్తి రెండు విధాలుగా కనిపిస్తుంది. ఒకటి Repetetion, రెండవది Refrain ఇవి రెండు కూడా పునరుక్తులే. రిపిటీషన్‌కు రిఫ్రయిన్‌కు మధ్య భేదం ఏమిటంటే రిపిటీషన్ అంటే ఒక విషయాన్ని నొక్కి చెప్పడానికి, లయను సాధించడానికి అవసమైనన్ని సార్లు ఒకే పదాన్ని లేదా పదాలను లేదా వాక్య భాగాన్ని, లేదా పూర్తి భాగాన్ని మళ్ళీ మళ్ళీ చెప్పడం"(యాకూబ్. 2017: 107). తెలుగులో పునరుక్తిని అద్భుతంగా వాడుకున్న కవి శ్రీశ్రీ.

"పగలకుండా పయనించే శీతల పానీయాలు
పట్టపగలు చంపే టెర్మినేటర్ విత్తనాలు
సర్రున లారీలు లారీలుగా చేరుతున్న
రసాయన క్రిమి సంహారకాలు
ఆ నున్నటిరోడ్లపై పయనించి పయనించి
నా ఊరి సారాన్ని పీల్చి వేస్తున్నాయి"

(దేవేందర్, అన్నవరం. 2003: 33 – 34)

ప్రపంచీకరణ ప్రభావం పల్లెల్లో ఎంత తీవ్రంగా ఉందో అందరికి తెలిసిన విషయమే. పల్లె సంస్కృతిని నాశనం చేసి పట్టణ సంస్కృతిని తీసుకొచ్చి మనుషుల మధ్య అగాధం పెంచింది. పల్లెల్లో సహజంగా దొరికే అన్నింటిని అంగడిలోకి చేర్చింది. అప్పటిదాకా ఉన్న వస్తువుల స్థానంలో కొత్తవి వచ్చాయి. మజ్జిగ, కొబ్బరిబోండ మొదలైన వాటి స్థానంలో కోకకోల, పెప్సీ, థమ్సప్ లాంటి పానీయాలు, కల్లు స్థానంలో బీరు, విస్కీ లాంటి మద్యపానీయాలు రావడంవల్ల కొత్త సంస్కృతి అలవాటైంది. వీటికి మధ్యతరగతి ఆకర్షించబడి ఎక్కువగా తాగడం మొదలుపెట్టింది. అది క్రమక్రమకంగా మరింత ఎక్కువై అన్ని వర్గాలకు చేరింది. తద్వారా ఎక్కువ దిగుమతి కావల్సి వచ్చింది. దానికై లారీలు ఎక్కువగా పల్లెల్లో తిరుగుతున్నాయనడానికి లారీ పదాన్ని రెండుసార్లు ప్రయోగించాల్సి వచ్చింది. అలాగే పయనించి పదాన్ని కూడా రెండుసార్లు వాడడంలో ఉద్దేశ్యం రాత్రనక, పగలనక నడుస్తూనే ఉన్నాయని. మాములుగా 'తిరిగొచ్చాను' అనడానికి 'తిరిగి తిరిగి వచ్చాను' అనడానికి భావ బేధం, తీవ్రత కనిపిస్తాయి.

"కబళించి కబళించి
కలుపుకున్న నాటి నుంచి
ఇల్లు గుల్ల పొలం గుల్ల
భాష యాస అన్నీ గుల్ల గుల్ల"

(దేవేందర్, అన్నవరం. 2008: 5)

తెలంగాణ, కోస్తాంధ్ర కలిపి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడ్డనాటినుండి తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని, వివక్షను, దోపిడిని తెలంగాణ ఉద్యమ సందర్భంగా ఎంతోమంది కవులు తెలియజేశారు, ప్రశ్నించారు, వ్యతిరేకించారు. అలాంటి పరపరంలోనే పై కవితలో కవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ పల్లెలు, పొలాలు, భాష, యాస అన్నీ నాశనం అయ్యాయి, లేకుండా పోయాయి అని చెపడానికి 'గుల్ల' అనే ప్రాంతీయ పదాన్ని ఎక్కువసార్లు వాడారు.

"చౌరస్తా జీవితంగా
చౌరస్తా జీవనంగా
చౌరస్తా కుటుంబంగా
బతుకే చౌరస్తాగా
చౌరస్తా బతుకుగా
చౌరస్తా వ్యవస్థగా
ఘోరాతి ఘోరంగా
క్రూరాతి క్రూరంగా
జీవితాలు చిత్రవధ చేయబడుతుంటాయిక్కడ"

(జగన్నాథం, జూకంటి. 2013: 25)

ఒకే వస్తువు ఎన్ని విధాలుగా, రూపాలుగా కవికి కనిపిస్తుందో చెప్పడానికి పై కవిత మంచి ఉదహరణగా చెప్పవచ్చు. ఇక్కడ కవి చౌరస్తాని అనేక రూపాలుగా, విధాలుగా దర్శించి దాని ప్రాధాన్యతని తెలియజేశారు. ఇలా పదాన్ని పునరుక్తం చేయడం మాత్రమే కాకుండా ప్రాంతీయ భాషలో సహజంగా కనిపించే అనుకరణ పదాల్ని కూడా జూకంటి జగన్నాథం ఉపయోగిస్తారు. ఈ పునరావృతాన్ని ప్రాంతీయ ప్రజలనుండి గ్రహించవచ్చు. ఏదైనా భావోద్వేగంలో తెలంగాణలో పునరుక్తి ఎక్కువగా ఉంటుంది. భావోద్వేగాలను సమపాళ్ళలో చెప్పడానికి ఈ పునరుక్తి చాలా బాగా ఉపయోగపడుతుంది.

"విచ్చుకుపోతున్న ఆత్మస్థయిర్యాల మధ్య
మనిషి ఒక సజీవ శవం
భయం భయం భయం
భయంలోనే బతకడం
ఓ దుర్భర దైనిక క్రీడ"

(శివకుమార్, వఝుల. 2004: 15)

రోజురోజుకు మారుతున్న రాజకీయ, సామాజిక పరిస్థితులు, ప్రపంచీకరణవల్ల వస్తోన్న కొత్తకొత్త వాటివల్ల జీవితంలో ఎప్పుడూ ఏదో ఒక అలజడి, భయం వెంటాడుతూనే ఉంది. ఒక చెరలోంచి విడుదలైన నిమిషంలోనే మరో చెరలోకి చేరే జీవితంలో భయమే భరోసా లేకుండా పోయింది. అందుకే భయంలోనే బతకడం, భయంగానే బతకడం, భయంతోనే బతకడం.

"చెట్లకొమ్మలపైనో గూళ్లలోనో
ముడుచుకొని పడుకునే పక్షులు
ప్రభాతం పలకరింపులతో ఉలికిపడి లేచి
జంటలు జంటలుగా గుంపు గుంపులుగా
తమ దైనిక ప్రస్థానాన్ని ప్రారంభిస్తాయి"

(నారాయణరెడ్డి, సి. 2010: 92)

రాత్రంత చెట్లపై నిదురించి తెల్లరాగానే పక్షలన్నీ వేటకు బయలుదేరుతాయి. అప్పుడు ఒక్కొక్కటిగా అవి వెళ్ళవు. అన్నీ కలిసే వెళ్తాయి. ఆకాశ గుమ్మానికి కట్టే తోరణంల పక్షులన్నీ జంటలుగా, గుంపులుగా వెళ్తుంటాయి. ఇది ఎక్కువగా పల్లెటూర్లో కనిపించే దృశ్యం.

"అది ప్రచండం
అగ్ని గుండం
ఆపలేవు దాన్ని
అది చైతన్యం
అది చైతన్యం
అది చైతన్యం"

(రవీంద్ర, సంగెవేని. 2005: 2)

జనాన్ని జాగృతం చేసేది చైతన్యం. స్తబ్ధంగా, నిస్సత్తువుగా పడివున్న జనాన్ని క్రియాశీలకత్వంలోకి తీసుకెళ్ళి వాళ్ళవాళ్ళ బాధల్ని, దుఃఖాల్ని తొలగిస్తుంది. తెలుగు సమాజంలో ఎన్నో చైతన్యాలు మనషుల్ని పోరాట శక్తులుగా మలిచాయి. తెలుగు సాహిత్యంలో కూడా చైతన్యానికి సంబంధించిన చాలా అంశాలు కనిపిస్తుంటాయి. చైతన్యాన్ని ఒక మార్పుకు సంకేతంగా భావించి మీ హృదయాల్ని తెరిచి ఉంచడని కవి జనానికి హితబోధ చేస్తున్నాడు. ఒకవేళ ఎవరైనా ఆపిన అది ఆగదని, అది ప్రచండం, అగ్ని గుండమని చైతన్య వ్యతిరేక శక్తులకు తెలియజేస్తున్నారు.

"దాహం..... దాహం..... దాహం......
తనువంతా జ్వాలానల సందోహం
నీటికోసం గునపాలు దించిన చోట
బుల్‌డోజర్లు దించినా భూ శరీరం స్పందిచదు"

(వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 8)

ప్రపంచీకరణవల్ల గ్రామాల్లో ఎలాంటి స్థితి వచ్చిందో చెప్పే కవిత ఇది. ఫ్యాక్టరీలకోసమో, రియలెస్టేట్ కోసమో చెట్లను నరికివేయడంవల్ల వర్షాలు సరిగ్గా పడవు. దాంతో కరువు సంభవిస్తుంది. ఆ కరువులో ప్రజల పరిస్థితిని చెప్పడానికి కవి దాహం అన్న పదాన్ని మూడుసార్లు వాడడం జరిగింది. అంటే కరువు ఎక్కువగా ఉందని దీనివల్ల అర్థమవుతుంది.

# అధ్యాయం - 7

# కరీంనగర్ జిల్లా కవిత్వం – భాషా విశ్లేషణ

## 7.0. పరిచయం

మానవాభివృద్ధి క్రమంలో చేష్టల, సైగలనుంచి వచ్చిన ధ్వనులే క్రమంగా భాషగా అభివృద్ధి చెందాయి. అందుకే భాషోత్పత్తి వాదంలో వచ్చిన సిద్ధాంతాలైన బౌబౌ, పూపూలు అరుపుల్ని, ధ్వనుల్ని ఆధారంగా చేసుకున్నాయి. భాష అనేది నిరంతర శ్రమ. అదొక చైతన్యం. నిత్య ప్రవాహశీలి. సమాజం మారుతున్నట్టే భాష కూడా మార్పులకు లోనవుతూ ఉంటుంది. "హుంబోలు అభిప్రాయము ప్రకారము భాష యొక వస్తువు కాదు. అది పరిపూర్ణత నొందినది కాదు. అది చైతన్యము. అది యూహలను తెలుపుటకు వాగింద్రియ మూలమున మనస్సు చేయుచుండు నిరంతర కృషి" (అప్పలస్వామి, పురిపండా(పరి.). 1981: 137).

భాష ప్రధానంగా మనసులోని భావాలను ఎదుటివాళ్ళకు చేరవేసే వాహకం. అనేక రకాల ధ్వనుల సమహారం. "మానవుడు తన మనస్సులోని అభిప్రాయాలని బహిర్గతం చెయ్యడానికి నోటిద్వారా చేసే ధ్వనులే భాష. మనకు తెలియని భాష ఒకరు వ్యవహరిస్తున్నప్పుడు మనం వినేవి ఆ వ్యక్తి నోటి ద్వారా చేసే రకరకాల ధ్వనులే. ఆ భాష తెలిసినవారికి ఆ ధ్వనుల అర్థం బోధపడుతుంది; తెలియనివారికి వాటి అర్థం బోధపడదు" (సుబ్రహ్మణ్యం, పి.యస్. 2007: 3). మానవుడు తన నోటి ద్వారా రకరకాల ధ్వనులు చేసినా వాటికి ఒక అర్థం ఉంటేనే అది భాష అవుతుంది.

ఉద్యోగరీత్యా, మతప్రచారంరీత్యా భారతదేశానికి వచ్చిన పాశ్చాత్యులు ఇక్కడి స్థానిక భాషలలో పాలన చేస్తే సులభతరమనీ, మతప్రచారం చేస్తే తొందరగా ప్రజల్లోకి వెలుతుందనీ స్థానిక భాషలను నేర్చుకునే క్రమంలో వాటిమధ్యగల సంబంధ, వ్యత్యాసాలను గుర్తించారు. దాంతో భాషా పరిశోధన భారతదేశంలో మొదలైంది. ఈ అభివృద్ధి క్రమంలో తెలుగు సంస్కృత జన్యం కాదనీ, తెలుగు, మలయాళం, తమిళం, కన్నడ మొదలైన భాషల మధ్య దగ్గరి సంబంధం ఉండడం వల్ల ఇవి ఒకే భాష నుండి వెలువడ్డాయనే అనేక కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. తద్వారా భాష పరిశోధన మరింత వేగవంతమైంది.

"A Language is a system of arbitrary vocal symbols by means of which a social group co-operates" (Bloch & Trager. 1972: 5). సంఘంలో ఒకరికొకరు భావవినిమయం చేసుకోవడానికి వాగ్రూపంలో వెలువరించే సంకేతాల రూపం భాష. భాష భావవినిమయం జరిగిన అది అసంపూర్ణం, అసమగ్రం. భాష లేని సమాజం ఆలోచనలేని వ్యక్తి లాంటిది. మనిషికి ఆలోచన, సమాజానికి భాష లేకపోతే అభివృద్ధి ఉండదు. ఈ భాషే విశ్వంలోని కోట్ల జీవ సమూహం నుండి మనుషులను వేరుచేసి విజ్ఞానులను చేయడంలో అత్యంత క్రియాశీలక బాధ్యత పోషిస్తోంది. సంస్కృతివల్ల ఆ ప్రాంత విశిష్టత తెలిస్తే, భాషవల్ల ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. ఒక ప్రాంత ప్రజల జీవన స్థితిని తెలుసుకోడానికి కూడా భాష ఉపకరిస్తుంది. అందుకే భాషలో కుల, వర్గ మాండలికాలు వచ్చాయి. చదువుకున్నవారి భాషకు, చదువుకోనివారి భాషకు మధ్య వ్యత్యాసం కనిపిస్తుంది. పదాల్లో, అవి ఉచ్చరించే వ్యక్తుల మధ్య వ్యత్యాసం కనిపిస్తుంది. భాషలో ఎక్కువ, తక్కువ అన్న న్యూనత భావం ఉండదు. అన్ని భాషలు సమానమైనవే, ప్రాధాన్యత కలిగినవే.

## 7.1. తెలంగాణ భాష

పి.యస్. సుబ్రహ్మణ్యం గారు తెలుగు భాషని నాలుగు మాండలికాలుగా గుర్తించినా ఆధునిక భాషావేత్తలు అసలు మాండలికాలే లేవు, అన్ని భాషలే అన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అలాగే అసలు ప్రామాణిక భాషకూడా ఉండదు అని అంటున్నారు. తెలంగాణ ఉద్యమం తెలంగాణ కూడా భాషని, అది మాండలికం కాదని చర్చించింది. "తెలంగాణ భాషేననీ, అది మాండలికం కాదనీ చెప్పడానికి కావలసినన్ని ఆధారాలున్నాయి. అంతేకాదు రెండున్నర జిల్లాల ఆంధ్రభాష అసలు భాషే కాదనీ, అది కేవలం మాండలికమని నిరూపించడానికి అనుస్వారం, మూలద్రావిడ భాషకు తెలంగాణ భాషకుగల దగ్గరి సంబంధం, అచ్చ తెలుగు పదాలు, తెలంగాణ భాషలోని పదాల మూలరూపాలు, భాషకు, బతుక్కీ సంబంధం మొదలైన చాలినన్నీ సాక్ష్యాలున్నాయి. ఉదాహరణకి అదువర్దాక, ఇదువర్దాక, ఎదువర్దాక, ఉల్లారుడూ మొదలైన వాటికి ప్రామాణిక అంతవరకూ, ఇంతవరకూ, ఎంతవరకూ, లోపల ఆరడం అనునవి. తెలంగాణ పదాలకు తమిళ పదాలకు సామీప్యం అరువరైయిల్, ఇదువరైయిల్, ఎదువరైయిల్, ఉళ్ళే అరువదు వాటికి దగ్గరి సంబంధం ఉంది. తెలుగు ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన కారణం చేత తెలంగాణ

పదాలు ద్రావిడానికి చాలా దగ్గరగా ఉన్నాయి. అందుకే తెలంగాణలో పలుకుతున్నది భాష" (సుమాలినీ రెడ్డి, నంద్యాల (ప్ర.సంపా.). 2013: 7 – 22). ఇలా అనేక ఉదాహరణలతో వివరిస్తూ తెలంగాణలో మాట్లాడేది మాండలికం కాదు భాషని సోపపత్తికంగా నిరూపించారు నలిమెల భాస్కర్ గారు.

ఎక్కడైతే వాదముంటుందో అక్కడ ప్రతివాదం కూడా ఉంటుంది. "తెలంగాణ ప్రాంతం వారిది మాత్రమే తెలుగు అనీ, కోస్తా – రాయలసీమ వాసులది ఆంధ్రం అనీ, కనుక ఈ రెండు వొకటి కాదని కొందరు, ఒకటే అయినా తెలంగాణ వారిదే అసలు తెలుగు భాష – రాయలసీమ, కోస్తా వారిది అతుకుల భాష అని కొందరు ప్రతిపాదించారు. కొమర్రాజు, స్టాలిన్లు చెప్పిన వాటి ప్రకారం తెలుగు – ఆంధ్రము పర్యాయపదాలే కాని వేర్వేరు ప్రత్యేక భాషలు కావని అర్థం చేసుకోవచ్చు. ఆ విధంగా 'తెలుగు – ఆంధ్రము' వేర్వేరు భాషలన్న వాదన రాజకీయ ప్రయోజనాల కొరకే తప్ప మరొకందుకు లేదు" (దివికుమార్. ఆంధ్రజ్యోతి. 4-3-2013). ఒక భాష మాట్లాడేవాళ్ళు మరో భాష మాట్లాడేవాళ్ళ భాషను చిన్నచూపు చూసినప్పుడు అవమానపడ్డ భాషీయులనుంచి వ్యతిరేకత వస్తుంది. అది ప్రాంతీయవాదానికి దారి తీస్తుంది. తెలంగాణ ఉద్యమంలో భాష కూడా బలమైన కారణం. ఏ భాష గొప్పదికాదు, తక్కువది కాదు. అన్ని భాషలు సమానమే.

మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలో కోస్తా, రాయలసీమ ఆనుకొని ఉన్న జిల్లాలు మినహాయించి మిగిలిన తెలంగాణ ప్రాంతానికి తనదైన స్వంత పదజాలం ఉంది. అంగీ, పోంటీన్ (నామవాచకాలు), ఎన్కులాడడం, పెడుతుండ్రు, మళ్లిస్తుండ్రు, ఒడిశినయ్ (క్రియలు), గాడు, గీడు, గది, గిది (సర్వనామాలు), సైతం (కూడా అనే అర్థంలో), హర్రాజ్, గాయబ్ లాంటి ఉర్దూ పదాలు, కాడ, తాన (విభక్తి ప్రత్యయాలు) మొదలైన పదాల్ని, ఉచ్చారణ వైవిధ్యాన్ని కలిగి ఉంది. తెలంగాణ భాషలో ఎక్కువగా ఉర్దూ భాష పదాలు కనిపిస్తాయి. ఎందుకంటే ఈ ప్రాంతాన్ని ముస్లింలు ఎక్కువకాలం పరిపాలించారు కనుక. పాలకుల భాష పాలితుల భాషలోకి రావడం సాధారణం.

## 7.2. అన్యదేశ్యాలు

ఒకే భాషలో సహజంగా ఉన్నటువంటి పదజాలాన్ని 'దేశ్య పదజాలం' అనీ, ఇతర భాషల నుంచి వచ్చిన పదజాలాన్ని 'అన్యదేశ్య పదజాలం' అని అంటారు. వీటినే 'ప్రాంతీయ పదజాలం', 'ఎరువు పదజాలం' అని కూడా అంటారు.

1206లో కుతుబుద్దీన్ ఐబక్ ఢిల్లీలో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించటంవల్ల ఆనాటి నుండి 1857 వరకు భారతదేశ సార్వభౌములు ఇస్లాం మతానుయాయులు. క్రీ.శ. 1309 అల్లావుద్దీన్ ఖిల్జీ రాజ్యంలో ఓరుగల్లు కలిసినప్పటి నుంచి నిజాం ప్రభుత్వంలో విలీనమయ్యేదాకా తెలుగు ప్రాంతం మీద రాజకీయంగా ముస్లింల ప్రభావం ఉంటూ వచ్చింది. హైదరాబాద్ సంస్థానంగా పాలించిన నిజాం కాలంలో పాలనభాషగా, బోధనభాషగా ఉర్దూ ఉండడంవల్ల చాలా మంది ఉర్దూలోనే చదువుకున్నారు. అధికార భాష కావడంతో ఆ ప్రభావం తెలంగాణ భాషపై పడింది. దానివల్ల 100లో 25 పదాలు ఉర్దూ పదాలు తెలంగాణ భాషలో చోటుచేసుకున్నాయి.

కరీంనగర్ జిల్లా కవిత్వంలోని ఉర్దూ, అరబ్బీ, ఫారసీ పదాల్ని ఒకే విభాగంలో చర్చిస్తున్నాను. దీనికి కింది పద్ధతి పాటించాను.

1. క్రమసంఖ్య, వెన్వెంట భాషా పదం
2. ఆ పదం ఏ వ్యాకరణ విభాగానికి చెందిందో చెప్పడం
3. ఆ పదానికి గల తెలుగు అర్థం సూచించడం
4. "<" గుర్తు తర్వాత ఉన్నది భాషా లేదా దాని సంక్షిప్తరూపం తర్వాత ఆ భాషలో తెలుగులో సూచించడం పదం అసలు రూపం.
5. కుండలీకరణాల్లో ఉన్నవి 'ఆ భాషా పదం' అనటానికి తగిన ఆధార గ్రంథాలు
6. ఏ కవి ప్రయోగం, దాని తర్వాత కుండలీకరణాల్లో సంవత్సరం, పుట సంఖ్య.

### 7.2.1.ఉర్దూ, ఫారసీ, అరబ్బీ భాషా పదాలు

1. **సవాల్**: నా.పు.అ. 1. ప్రశ్నించేతీరు – ప్రశ్న. 2. నివేదన – ప్రార్థన < అరబీ. సవాల్
(ఉ. తె. ని. 2010: 284)

"ఇది గుండెవున్న మనిషికి ప్రశ్న
ఇది జాతి మీద విసిరేసిన సవాల్ (జగన్నాథం, జూకంటి. 2013: 26)

2. **ఫాయిదా**: నా. పు. అ. 1. లాభం, ప్రాప్తం, 2. ప్రయోజన సిద్ధి, కోరిక నెరవేరడం. < అరబీ. ఫాయదా. (ఉ. తె. ని. 2010: 179)

"ఎన్నివుంటె ఏమి ఫాయిదా
ఎంతగనం తెలుత్తె ఏమి అచ్చె" (జగన్నాథం, జూకంటి. 2013: 130)

3. **తనఖా**: నా. స్త్రీ. ఫా. నెలసరి జీతం – వేతనం. < ఫారసీ. తన్‌ఖాహ.

(ఉ. తె. ని. 2010: 113)

"హక్కులు ఉత్తరీయ కూడదు

ముందే మనల్ని తనఖా పెట్టారు" (జగన్నాథం, జూకంటి. 2013: 192)

4. **నౌఖరీల**: నా. స్త్రీ. ఫా. 1. నౌకరు చేసే పని, సేవ – కొలువు – ఉద్యోగం, 2. చేసే పనికి వేతనం లభించే వృత్తి. < ఫారసీ. నౌకరీ. (ఉ. తె. ని. 2010: 165)

"మన బతకొచ్చినతనమో మన నౌఖరీల బదిలీల జలుబో

ఏవో (జింబో. 2002: 35)

5. **తర్జుమా** : నా. పు. అ. అనువాదం – భాషాంతరం – ఒక భాషలోని విషయాన్ని మరొక భాషలోకి మార్చడం. < అరబీ. తర్‌జుమా. (ఉ. తె. ని. 2010: 116)

"నా దుఃఖపు భాషలోకి తర్జుమా

చేసుకొంటాను" (శివప్రసాద్, సంకేపల్లి. 2002: 33)

6. **హాజిర్** : వి. అ. (వ. హాజరిన్). 1. సమ్ముఖం – ఉపస్థితి. 2. హాజరు కావడం. < అరబీ. హాజిర్. (ఉ. తె. ని. 2010: 307)

"నా హాజిర్ హై లని

నా రెండక్షరాలని" (జింబో. 2003: 71)

7. **షికారుకా** : నా. పు. ఫా. అడవి జంతువులను చంపే కార్యం లేదా క్రీడ – వేట. < ఫారసీ. శికార్. (ఉ. తె. ని. 2010: 270)

"చిక్కడపల్లి సెంటరు / షికారుకా!

అక్కడ / బాలాజీ గుడి కూడా వుంది" (లక్షీకాంతం, కన్నోజు. 2006: 2)

8. **ముషాయిరాలే** : నా. పు. అ. పలువురి చేరి శేర్‌లు గజళ్ళు చదివే స్థానం, కవి సమ్మేళనం, కవితా గోష్ఠి. < అరబీ. ముశాయరా. (ఉ. తె. ని. 2010: 230)

"గజల్స్ విన్లేదా / మా ఓల్డ్ సిటీకి రా

పాత గోడల్లో / యింకా ముషాయిరాలే"(లక్ష్మీకాంతం, కన్నోజు. 2006: 101)

9. **నవాబుల** : నా. పు. అ. మొగలుల కాలంలో ఒక పెద్ద భూభాగానికి ప్రాతినిధ్యం వహించేవాడు. < అరబీ. నవాబ్. (ఉ. తె. ని. 2010: 150)

"శాతవాహన కాకతీయ నవాబుల చరితలు" (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 22)

10. **బర్బాదాయే** : వి. ఫా. నష్టం, పాడైపోవడం, నాశనం కావడం. < ఫారసీ. బర్‌బాద్. (ఉ. తె. ని. 2010: 188)

"చెర్వెండి పాయె, బాయెండి పాయె, వాగులెండి పాయె
బతుకెండి పాయే, బతుకులు బర్బాదాయే"(దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 80)

11. **ఫకీర్లు** : (ఏ. వ.) నా. పు. అ. (ఫుక్‌రా – బ.వ.) భిక్షమెత్తుకొనేవాడు – భిక్షగాడు. < అరబీ. ఫకీర్. (ఉ.తె.ని. 2010: 174)

"బికార్లు ఫకీర్లు" (శివకుమార్, వర్షుల. 2004: 34)

12. **బేహోషు** : నా. స్త్రీ. ఫా. 1. మూర్ఛ, అచేతనావస్థ. 2. స్పృహలేకపోవడం. < ఫారసీ. బేహోశ్. (ఉ. తె. ని. 2010: 199).

"ఆలి కొచ్చెను జోషు / అపుడు ఖర్చయె క్యాషు
మొగుడాయె బేహోషు / ఓ కోకిలమ్మ!" (ఎలనాగ. 2009: 48)

13. **ఫరక్** : నా. పు. అ. 1. వేర్పాటు 2. మధ్యలోనిది, 3. అంతరం, దూరం. < అరబీ. ఫర్క్. (ఉ. తె. ని. 2010: 175).

"వాడంతే / చావైనా....పుట్టుకైనా
దేనికైనా ధూం ధాం / షాన్‌ల ఫరకేంలేదు" (మోహన్, పత్తిపాక. 2009: 14)

14. **ఇనాము** : నా. పు. అ. (ఇన్‌ఆమ్) 1. పురస్కారం, 2. ఉపహారం, 3. బహుమతులు, కానుక. < అరబీ. ఇనామ్. (ఉ. తె. ని. 2010: 37).

"పాట పాడక సోము / గారు ఉండగ కాము
ఇచ్చినారు ఇనాము / ఓ కోకిలమ్మ (మోహన్, పత్తిపాక. 2009: 61)

15. **బరాబర్** : వి. ఫా. 1. సమానం, తుల్యం, సాదృశం, 2. ఎత్తు పల్లాలు లేనిది, సమతలం. < ఫారసీ. బరాబర్. (ఉ. తె. ని. 2010: 188).

"కోటి లింగాలను అనుమకొండను / అమరావతి మింగినప్పుడు
నా సమ్మక్క సారక్కల రేషానికి
నీ నాగమ్మ పౌరుషం బరాబరైతదా?" (వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 35)

16. **పరేషాన్** : వి. ఫా. వ్యాకులత – ఉద్విగ్నత – ఆందోళన. < ఫారసీ. పరేశాన్.
(ఉ. తె. ని. 2010: 168)

"జై జవాన్ జై కిసాన్....
జనమంతా పరేషాన్...." (రవీంద్ర, సంగెవేని. 2005: 14)

17. **బర్కత్** : (ఏ.వ.) నా. స్త్రీ. అ. (బర్కాత్ – బ.వ.) 1. ఆధిక్యం, వృద్ధి, లాభం. 2. సమాప్తి, అంతం. < అరబీ. బర్కత్. (ఉ. తె. ని. 2010: 187)

"కన్నీటి కల తెల్లారింది
బతుకు పొడుగూతా బర్కత్ లేనేలేదు" (దేవేందర్, అన్నవరం. 2008: 70)

18. **ఖజానా** : నా. పు. అ. 1. ధనాగారం 2. కోశాగారం 3. విలువైన వస్తువులను ధనాన్ని భద్రపరిచినగది. < అరబీ. ఖజానా. (ఉ. తె. ని. 2010: 67)

"తవ్వినకొద్దీ ఎల్లుతున్న ఖజానా పాతర"(దేవేందర్, అన్నవరం. 2008: 79 )

19. **ఆఖరికి** : (ఏ. వ.) వి. అ. (బ. వ. – అవాఖిర్) 1. అంతిమ 2. వెనకటి 3. చివరి. < అరబీ. ఆఖిర్. (ఉ. తె. ని. 2010: 27)

"ఆఖరికి
హరిలో రంగ హరీ – భిక్షగాణ్ణయ్యాను" (లక్ష్మణరావు, జి. 2003: 12)

20. **నజర్** : (ఏ.వ.) నా. స్త్రీ. అ. (బ.వ. అన్జార్) 1. దృష్టి – చూపు. < అరబీ. నజర్.
(ఉ. తె. ని. 2010: 146)

"నాలుగు దిక్కులా నజర్ పెట్టి
అడుగులో అడుగెయ్" (లక్ష్మణ్, ఆడెపు. 2007: 39)

## 7.2.2. హిందీ భాషా పదాలు

కరీంనగర్ జిల్లా కవిత్వ పుస్తకాల్లో కనిపించే హిందీ భాషా పదాల్ని ఇవ్వడంలో కింది పద్ధతి పాటించబడింది. ఇదే పద్ధతి ఆంగ్ల పదాలకి వర్తిస్తుంది.

1. క్రమ సంఖ్య, వెన్వెంట భాషా పదం.
2. ఆ పదం ఏ వ్యాకరణ విభాగానికి చెందిందో చెప్పడం
3. ఆ పదానికి గల తెలుగు అర్థం సూచించడం

4. కుండలీకరణాల్లోనున్నవి ఆ భాషా పదం అనడానికి తగిన ఆకర గ్రంథాలు
5. కరీంనగర్ జిల్లా కవుల ప్రయోగం, దాని తర్వాత కుండలీకరణాల్లో సంవత్సరం, పుట సంఖ్య.

1. **బడా** : వి. పెద్ద, గొప్ప. (త్రి. ని. 2014: 284)
"వాణిజ్యంలో నీటి వాటా పెంచుకోవడానికై
బడా కంపెనీలు పెదవులు తడుపుతుంటాయి"(వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 9)
2. **దిక్‌నా** : అ. కనిపించుట. (త్రి. ని. 2014: 209)
"బ్యాట్ వీరుడొస్తున్నాడు
బాల్ బాల్‌కు ఫోర్ కొడతాడు
భాయి.... బాల్ నహీదిక్‌నా" (రవీందర్, నాగిళ్ళ. 2005: 66)
3. **నకిలీ** : వి. కృత్రిమమైన, అసలైనది కానిది. (త్రి. ని. 2014: 137)
"ఆ వాగ్దానాల్లో అగుపిస్తుంది
నకిలీ విశ్వాసాల సంతకం (నారాయణరెడ్డి, సి. 2010: 101)
4. **చప్టా**: వి. చప్పిడి(ముక్కు). (త్రి. ని. 2014: 137)
"చప్టా మీద కునుకు తీస్తూ
మూలుగుతున్న ఆయాసం (జగన్నాథం, జూకంటి. 2013: 15)
5. **బచ్‌పన్** : పుం. బాల్యము. (త్రి. ని. 2014: 283)
"బడిగంట కొట్టారు / బచ్‌పన్
జ్ఞాపకమై / అల్లుకుంది" (మోహన్, పత్తిపాక. 2004: 2)
6. **బడాయి** : గొప్పతనము, ప్రశంస. (త్రి. ని. 2014: 284)
"కృష్ణుడి నోట్లో / బ్రహ్మాండాలు.. బడాయి" (రవీంద్ర, సంగెవేని. 2006: 22)
7. **పరేశాన్** : వి. విసిగిన, వ్యాకులత చెందిన. (త్రి. ని. 2014: 254)
"పై కెగిసే రాకెట్టు / పరేశాన్ అయ్యింది" (గోపాల్, మాడిశెట్టి. 2007: 23)
8. **కహాని** : స్త్రీ. కథ, లేనిపోని పుకార్లు పుట్టించడం. (త్రి. ని. 2014: 81)
"షురూ హోగయీ / నయీ కహాని" (గోపాల్, మాడిశెట్టి. 2007: 36)
9. **షురూ** : పుం. ప్రారంభము. (త్రి. ని. 2014: 372)
"కోటొక్క చేతుల కొట్లాట షురూ జేసినం" (శివకుమార్, వఝుల. 2004: 60)

10. **ఆవాజ్** : స్త్రీ. ధ్వని. (త్రి. ని. 2014: 47)
"ఆవాజ్ దో! హమ్ ఏక్ హై!" (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 32)

### 7.2.3. ఆంగ్ల పదాలు

1. **ఆఫీసరు** : n. s. అధికారి (బ్రౌ. ఇ. తె. ని. 1987: 786)
"హాస్యం కాకున్నా
ఆఫీసరు నవ్వినప్పుడు" (జగన్నాథం, జూకంటి. 2013: 22)
2. **ఎపిసోడ్** : n. s. ఉపాఖ్యానము, ఉపకథ, చిత్రకథ. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 374)
"డాలర్ తిని ఆకలి చల్లార్చుకోవడం
ఎపిసోడ్ చూసి దాహం తీర్చుకోవడం" (జగన్నాథం, జూకంటి. 2013: 51)
3. **ఇండెక్స్** : n. s. సూచి, సూచిక (బ్రౌ. ఇ. తె. ని. 1987: 604)
"ఇండెక్స్ సూచీలన్నీ పైపైకి దూసుకు పోతున్నాయ్"
(జగన్నాథం, జూకంటి. 2013: 369)
4. **పేషెంట్** : n. s. రోగి. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 824)
"సాంస్కృతిక బానిసత్వాన్ని
నీ పేషెంట్ బాడీకి స్టెరాయిడ్‌లా ఎక్కిస్తాడు" (శివప్రసాద్, సంకేపల్లి. 2002: 39)
5. **రొటీన్** : n. s. క్రమము, వరస. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 978)
"రొటీన్ జీవితంలో రోజూ శేషప్రశ్నలే!" (శివప్రసాద్, సంకేపల్లి. 2002: 66)
6. **కన్ఫెషన్** : n. s. ఒప్పుకోవడము (బ్రౌ. ఇ. తె. ని. 1987: 207)
"కన్ఫెషన్ స్టేట్‌మెంట్ ఇవ్వడం" (జింబో. 2002: 15)
7. **అబార్షన్** : n. s. కడుపు దిగబడడము. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 3)
"భూములన్నింటికి అబార్షన్ చేయించినట్టు
ఎక్కడా పచ్చని దృశ్యమే లేదు" (జింబో. 2002: 22)

8. **డస్టర్** : n. s. దుమ్ము తట్టే గుడ్డ. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 343)
"బుర్రలో నిలిచిన పాఠాలకు/ డస్టర్‌లా" (గఫూర్ శిక్షక్, సిరిసిల్ల. 2010: 73)

9. **స్పిరిట్** : n. s. జీవము, ప్రాణము, జీవాత్మ. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 1086)
"ఆశయాల స్పిరిట్ తగ్గిందా ఏంది...?"(దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 62)

10. **డిటెక్టర్** : n. s. అధికారి, శాస్తా. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 294)
"నాయకులకు లై డిటెక్టర్ పరీక్షలు"(దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 163)

11. **మెమరీ** : n. s. జ్ఞాపకము. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 724)
"ఇప్పుడు మాటకందని దృశ్యాలు
మెమరీ పొరల్లో నిక్షిప్తమవుతాయి" (వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 4)

12. **రిజిస్టరు** : n. s. లెక్క, పట్టి. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 939)
"జనన మరణాల రిజిస్టరులోని ఇటీవలి పుటలో
మన పేరు నమోదవుతుంది." (నారాయణరెడ్డి, సి. 2009: 93)

13. **సరెండర్** : n. s. అప్పగింత పెట్టడము. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 1140)
"సరెండర్! సరెండర్! / నీ వెన్నుముక మీద నువ్వు
ఊపిరి సంతకం పెట్టు" (శివకుమార్, వఝల. 2004: 76)

14. **లేటెస్ట్** : adj. కడాపటి. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 665)
"ర్యాంకుల హాస్టల్ / లేటెస్ట్ టైంటేబుల్" (శివకుమార్, వఝల. 2004: 29)

15. **ఫ్యాషన్** : n. s. తీరు, రీతి, వైఖరి. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 415)
"ముంబయి ప్రపంచం మోహన వస్త్రమై
ఫాషన్ పెరేడ్ చేసింది...?" (రవీంద్ర, సంగెవేని. 2007: 34)

16. **జోక్** : n. s. పరిహాసము, ఎకసెక్కము. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 647)
"వాస్తవ స్పర్శలేని జోక్ వింటే
నవ్వాలని కాదు – ఏడ్వాలని అనిపిస్తుంది" (బాపురెడ్డి, జె. 2010: 37)

17. **ఎర్రర్** : n. s. తప్పు, పొరపాటు. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 378)
"ఇప్పుడు కర్రెరోడ్డు ఎర్రటీ ఎర్రర్" (దేవేందర్, అన్నవరం. 2008: 8)

18. **ఇన్‌స్టంట్** : n. s. క్షణము, నిమిషము, కాలము. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 622)

"ఇన్‌స్టంట్ తీర్పులు రెడిమేడ్ శిక్షలు" (దేవేందర్, అన్నవరం. 2008: 40)

19. **డిజైన్ల** : n. s. ఉద్దేశము, యత్నము, యోచన, ఆలోచన. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 286)

"అగాధాల అంచుల డిజైన్ల మధ్య" (మోహన్, పత్తిపాక. 2001: 3)

20. **సీక్వెన్స్** : n. s. క్రమము, అనుక్రమము. (బ్రౌ. ఇ. తె. ని. 1987: 1022)

"సీక్వెన్స్ లేని కలమీద
చిన్న దుఃఖాశ్రువైన్ రాలదేమి" (చెమన్. 2001: 30)

## 7.3. దేశ్య పదాలు

"త్రిలింగ వ్యవహారసిద్ధంబగు భాష దేశ్యంబు" (బాల వ్యా. సంజ్ఞా పరి. 21). సంస్కృత, ప్రాకృత భాషల నుంచి కాక త్రిలంగ (శ్రీశైలం, ద్రాక్షారామం, కాళేశ్వరం) మధ్య ప్రాంతంలో ఉచ్ఛరించేదాన్ని దేశ్యంగా చెప్పారు చిన్నయసూరి. కొంత ప్రాంతానికే పరిమితమై, మిగిలిన వారికి వివరణతోగానీ, పర్యాయపదంలోగాని అర్థమయ్యే పదాల్ని ఆ ప్రాంత దేశ్యపదాలుగా చెప్పవచ్చు. ఉదా: తెలంగాణ: అంగి, గంజు, పయ్య, సాయిమాను మొదలైనవి. రాయలసీమ: కపిల, నాగేలి మొదలైనవి.

1. కూరాడుకుండ : ఇంటి లక్ష్మిగా కొలుచుకుని పూజించే కుండ (రవీంద్ర, సంగెవేని. 2007: 5)
2. లిక్కి : చిన్న కొడవలి (బాలయ్య, పొన్నాల. 2008: 17)
3. పొంటె : పూట (వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 10)
4. జాగ : స్థలం (నారాయణరెడ్డి, సి. 2010: 87)
5. ముచ్చట : మాట (మోహన్, పత్తిపాక. 2009: 17)
6. అయిరాండ్ల కుండలు : పెళ్ళిలో వాడే కుండలు (శివకుమార్, వఝల. 2004: 58)
7. పైలం : జాగ్రత్త (రవీంద్ర, సంగెవేని. 2006: 49)

8. బుడుబుంగ : నీరుకాకి (శివప్రసాద్, సంకేపల్లి. 2002: 54)

9. తాయిమాయి అయిన : ఉక్కిరిబిక్కిరి అయిన (భాస్కర్, నలిమెల. 2008: 41)

10. పెత్రామాసనాడు : పితృ అమావాస్య (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 6)

11. గుమ్మిలోని : వడ్లు దాచుకునేందుకు వెదురు బద్దలతో చేసేది. (జింబో. 2002: 14)

12. నల్లికుట్లతనాలు : ఎవరైన అడిగినా ఏమి మాట్లాడకపోవడం (జగన్నాథం, జూకంటి. 2013: 94)

13. కొప్పెర : నీళ్ళు వేడిచేసుకోవడానికి వాడే పాత్ర. (దేవేందర్, అన్నవరం. 2008: 3).

14. బిగ్గీత : గట్టిగా (దేవేందర్, అన్నవరం. 2008: 17)

15. నీరటిగాడు : పంటపొలాలకు నీళ్ళు పారించడానికి ఉండే వ్యక్తి (పైదే: 44)

16. ఆసరా : సహాయం (వసునందన్, రావికంటి. 2005: 59)

17. నశ్యపు : ముక్కులో పీల్చుకునే పొడి పదార్థం (బాపురెడ్డి, జె. 2010: 30)

18. అవుసులాయన : పద్మశాలి వ్యక్తి (లక్ష్మణరావు, జి. 2003: 35)

19. కల్లిబొల్లి : అబద్ధపు మాటలు (నరహరి ఆచార్య, డింగిరి. 2005: 74)

20. వైలు : పుస్తకాలు (నారాయణ, ఆడెపు. 2004: 28)

## 7.4. క్రియలు

"క్రియ యనగా పని. పనుల దెలుపు పదములను క్రియలందురు. తెలుగున నీ క్రియలకే ధాతువులని పేరు. సంస్కృతమున ఏ విధమగు ప్రత్యయములు చేరని మూల రూపములను 'ధాతువు' లని వ్యవహరింతురు. ఆ ధాతువులకే 'ఙ' ప్రత్యయములు చేరినచో 'క్రియ'లని వ్యవహరింతురు" (చిన్నయసూరి, పరవస్తు. 1983: 171). పనిని, స్థితిని తెలిపే వాటిని క్రియలంటారు. తెలంగాణ ప్రాంత క్రియలు మిగిలిన(ఆంధ్ర, రాయలసీమ) ప్రాంతాలకంటే భిన్నంగా, వైవిధ్యంగా ఉంటూ ఒక ప్రత్యేక ప్రతిపత్తిని కలిగున్నాయి.

### 7.4.1. భూతకాలం

1. మన్నువోసింద్రు (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 67)
2. మందు కలిపింద్రు (పైదే: 67)
3. ఇరిసేసింద్రు (జగన్నాథం, జూకంటి. 2013: 147)
4. ఇరగొట్టిన్రు (పైదే: 121)
5. తాగింద్రు (దేవేందర్, అన్నవరం. 2003: 65)
6. పొడిసింద్రు (బాలయ్య, పొన్నాల. 2008: 38)
7. మూసింద్రు (పైదే: 62)
8. కూల్చేసింద్రు (కిషన్‌రావు, రేగులపాటి. 2010: 47)
9. ఇరిగింది (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 127)
10. వాశిపాయె (వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 10)

### 7.4.2. వర్తమానం

1. మొత్తుకుంటున్నరు (లక్ష్మణరావు, జి. 2003: 26)
2. తైతక్కలాడుతుంద్రు (లక్ష్మణ్, ఆడెపు. 2007: 8)
3. చూస్తుంద్రు (పైదే: 9)
4. రగులుతున్నోల్లం (శివకుమార్, వఝల. 2004: 69)
5. సల్లుతుంద్రు (దేవేందర్, అన్నవరం. 2003: 21)
6. సూత్తుంద్రు (పైదే: 22)
7. జూత్తంది (వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 10)
8. గుద్దుకోవట్టె (పైదే: 10)
9. తిరుగుతుంటాయి (వసునందన్, రావికంటి. 2005: 27)
10. నవుకుంటుంద్రు (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 82)

### 7.4.3. భవిష్యత్ కాలం

1. ముట్టియ్యంద్రి (జగన్నాథం, జూకంటి. 2013: 110)
2. ఎత్తుకోంద్రి (పైదే: 110)

3. తడుస్తాను (చెమన్. 2001: 4)
4. ప్రవహిస్తాను (పైదే: 4)
5. పోరాడుండ్రి (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 82)
6. నరుకుతం (పైదే: 145)
7. పోరాడుతం (పైదే: 145)
8. పాతరేస్తాం (వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 2)
9. త్రాగేస్తాం (వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 2)
10. నడిపిస్తాం (జింబో. 2002: 44)

## 7.5.ధ్వని పరిణామం

భాష కాలక్రమేణ అనేక మార్పులకు లోనవుతుందని ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను గమనిస్తే అర్థమవుతుంది. క్రొవ్వు, క్రొత్త, మ్రోగు లాంటి పదాలలోని రేఫ ఇప్పుడు లోపించింది. “ఒక భాషలో ఒక కాలంలో ఉన్న ఒక ధ్వని తరవాత కాలంలో ఒకటి గాని లేక అంతకన్న ఎక్కువ ధ్వనులుగా మారడాన్ని ధ్వని పరిణామం (Sound change) అంటారు” (సుబ్రహ్మణ్యం, పి.యస్. 2007: 242).

### 7.5.1.వర్ణ సమీకరణం

భిన్న (వేర్వేరు) అచ్చులు పొరుగు అచ్చుల ప్రభావంవల్ల మార్పు చెందడాన్ని వర్ణ సమీకరణం అంటారు.

#### 7.5.1.1. పరవర్ణ సమీకరణం

1. నొప్పి + లు = నొప్పులు (జగన్నాథం, జూకంటి. 2013: 97)
2. పెదవి + లు = పెదవులు (పైదే: 138)
3. చివర + కి = చివరికి (సూర్య, వొడ్నాల. 2003: 67)
4. వీధి + లు = వీధులు (పైదే: 80)
5. సూర్యుడు + కి = సూర్యుడికి (సూర్య, వొడ్నాల. 2003: 113)

### 7.5.1.2. పూర్వవర్ణ సమీకరణం

1. అవని + కు = అవనికీ (సూర్య, వొడ్నాల. 2003: 70)

### 7.5.2. వర్ణనాశనం

ఒక పదంలోని వర్ణం నశించిపోవడం(లోపించడం) వర్ణనాశనం

1. దుకాణంల – దుకాన్ల (దేవేందర్, అన్నవరం. 2008: 28)
2. పట్టణం – పట్నం (లక్ష్మణ్, ఆడెపు. 2007: 9)
3. తిరగవడితే – తిర్గవడితే (శివకుమార్, వఝల. 2004: 60)
4. చెరువులకు – చెర్లకు (పైదే: 59)
5. చెరువులు – సెర్లు (జగన్నాథం, జూకంటి. 2013: 122)

### 7.5.3. స్వరలోపం

1. కలిసిపోయిన – కల్సిపోయిన(దేవేందర్, అన్నవరం. 2008: 12)
2. కనిపిస్తది – కన్పిస్తది (పైదే: 18)
3. పలుకుతంది – పల్కుతంది (పైదే: 20)
4. అమెరికా – అమ్రికా(జగన్నాథం, జూకంటి. 2013: 96)
5. కాలువల – కాల్వల (శివకుమార్, వఝల. 2004: 59)
6. మునుగకుంట – మున్గకుంట(శోభారాణి, కొలిపాక. 2004: 30)
7. బతకటానికి – బత్కటాన్కి (పైదే: 31)
8. వెలుగుతూ – వెల్గుతూ (హిమజ. 2006: 8)
9. కాలువలై – కాల్వలై (పైదే: 10)
10. చూసుకొని – చూస్కొని (లక్ష్మణ్, ఆడెపు. 2007: 35)

### 7.5.4. వర్ణాగమనం / వర్ణాధిక్యం / స్వరభక్తి

సంయుక్త హల్లుల ఉచ్చారణలో క్లిష్టతను పోగొట్టడానికి వాటిమధ్య అచ్చు చేరడాన్ని వర్ణాగమనం అంటారు. ఇందులో ఒక వర్ణం అధికంగా చేరుతుంది.

1. అర్ధరాత్రి – అర్ధరాతిరి (దేవేందర్, అన్నవరం. 2008: 22)
2. నిద్రపోయే – నిద్దరోయే (సూర్య, వొడ్నాల. 2003: 33)

3. రాత్రి - రాతిరి (హిమజ. 2006: 13)
4. తూర్పు - తూరుపు (చెమన్. 2001: 4)
5. నిద్రల - నిద్దురల (పైదే: 22)
6. నడమంత్రపు - నడమంతరపు (లక్ష్మణ్, ఆడెపు. 2007: 9)
7. సంక్రాంతికి - సంకురాత్తిరికి(దేవేందర్, అన్నవరం(సంపా.).2010: 35)
8. ఫిల్మ్‌సిటీలట - ఫిలిమిసిటీలట (పైదే: 70)
9. సర్దుకుపోవాలనుకున్న- సదురుకపోవాలనుకున్న (పైదే: 104)
10. ఆఫ్రికా - ఆఫిరికా (కనకయ్య, గుండెడప్పు. 2001: 12)

### 7.5.5. లోప దీర్ఘత

ఒక పదంలో ఒక వర్ణం లోపించి తత్పూర్వ స్వరానికి ఆ లోపాన్ని తెలియజేయడానికి దీర్ఘం చెయ్యడాన్ని లోపదీర్ఘత అంటారు. "సంయుక్తాక్షరంలో ఒక హల్లు లోపించినప్పుడు దాని ముందున్న అచ్చు సాధారణంగా దీర్ఘమవుతుంది, ఇది హల్లోపకృత స్వర దీర్ఘత(compensatory lengthening)" (సుబ్రహ్మణ్యం, పి.యస్. 2007: 254).

1. నక్షత్రము + లు - నక్షత్రాలు (రవీంద్ర, సంగెవేని. 2005: 3)
2. ప్రాణము + లు - ప్రాణాలు (బాలయ్య, పొన్నాల. 2008: 20)
3. అక్షరము + లు - అక్షరాలు(దేవేందర్, అన్నవరం. 2008: 34)
4. సంకేతము + లు - సంకేతాలు(వసునందన్, రావికంటి. 2005: 6)
5. అకృత్యము + లు - అకృత్యాలు (తిరుపతి, కూకట్ల. 2005: 47)
6. స్వప్నము + ల - స్వప్నాల (నారాయణరెడ్డి, సి. 2010: 9)
7. మేఘము + లు - మేఘాలు (గోపాల్, మాడిశెట్టి. 2007: 12)
8. జీవితము + లు - జీవితాలు (రాణీప్రసాద్, కందేపి. 2006: 15)
9. సత్యము + లు - సత్యాలు (బాపురెడ్డి, జె. 2003: 2)
10. నాదము + లు - నాదాలు (బాపురెడ్డి, జె. 2001: 18)

### 7.5.6. వర్ణమార్పు

చదువుకోనివారికి, చదువుకున్నవారికి వ్యత్యాసం గమనిస్తే ఒత్తులు పలకకపోవడం, సంయుక్తాక్షరాలు ఉచ్చరించకపోవడం మొదలైనవి కనిపిస్తాయి. అలాగే చ, శ, ష, సల మధ్య తేడా కూడా కనిపించదు.

#### 7.5.6.1. చ > స

1. చావంటే - సావంటే (శివకుమార్, వఝల. 2004: 69)
2. చుక్కకి - సుక్కకి (నరహరి ఆచార్య, డింగరి. 2005: 82)
3. చుక్కల్ల - సుక్కల్ల (పైదే: 83)
4. చదువు - సదువు (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 1)
5. చేసేపని - సేసేపని (లక్ష్మణరావు, జి. 2003: 26)
6. చెప్పాలంటే - సెప్పాలంటే (పైదే: 36)
7. చుట్టూ - సుట్టూ (దేవేందర్, అన్నవరం. 2008: 7)
8. చుట్టం - సుట్టం (పైదే: 42)
9. చప్పుడు - సప్పుడు (పైదే: 56)
10. చూడలేదు - సూడలేదు (లక్ష్మణ్, ఆడెపు. 2007: 9)

#### 7.5.6.2. చ > శ

1. లేచి - లేశి (వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 10)
2. చెప్పుకుంటే - శెప్పుకుంటే (పైదే: 10
3. చెవిన - శెవున (పైదే: 11)
4. చినుకు - శినుకు (భాస్కర్, నలిమెల. 2008: 42)
5. చక్కర - శక్కరి (దేవేందర్, అన్నవరం. 2005: 23)
6. విడిచి - ఇడిశి (పైదే: 24)
7. కసికెదు - కశ్కెదు (పైదే: 36)
8. ఊరిడిచి - ఊరిడిశి (పైదే: 96)
9. చిన్న - శిన్న (దేవేందర్, అన్నవరం. 2003: 25)
10. చెద్ద - శెద్ద (బాలయ్య, పొన్నాల. 2008: 28)

### 7.5.6.3. ష > స

1. భాష – బాస (దేవేందర్, అన్నవరం. 2005: 31)
2. విషపు – ఇసపు (దేవేందర్, అన్నవరం. 2003: 21)
3. వేషం – యేసం (బాలయ్య, పొన్నాల. 2008: 18)
4. విష – ఇస (పైదే: 66)
5. పెద్దమనుషులు – పెద్దమనసులు (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 35)
6. షురు – సురు (పైదే: 172)

## 7.6. పదాదిన వు, వూ, వొ, వో లు వాడడం

"యకారంబును వు, వూ, వొ, వో లును తెలుగు మాటలకు మొదటలేవు" (బాల వ్యా. సంజ్ఞా పరి. 17) అని చిన్నయసూరి తెలుగులో మొదట వు, వూ, వొ, వో లు లేవని చెబుతూ, యెవడు, యెక్కడ, వూరు మొదలైనవి పలకడం తప్పని చెప్పాడు.

1. ఉండేదే – వుండేదే (శోభారాణి, కొలిపాక. 2004: 31)
2. వేపలు – యాపలు (దేవేందర్, అన్నవరం. 2005: 20)
3. ఏంటో – యాంటో (దేవేందర్, అన్నవరం. 2003: 63)
4. ఇంట్లో – యింట్లో (బాలయ్య, పొన్నాల. 2008: 37)
5. ఉన్నది – యున్నది (పైదే: 50)
6. ఊళ్ళే – వూల్లే (పైదే: 83)
7. ఉండదా – వుండదా (హిమజ. 2006: 20)
8. ఉంటుంది – వుంటుంది (పైదే: 23)
9. ఊళ్లో – వూళ్లో (రవీంద్ర, సంగెవేని. 2006: 8)
10. వెలిగి – యెలిగి (లక్ష్మణ్, ఆడెపు. 2007: 28)

### 7.7.ధ్వన్యనుకరణ పదాలు

1. గటగటా (ఎలనాగ. 2009: 29)
2. పటపటమని (బాపురెడ్డి, జె. 2001: 44)
3. కుహుకుహు (బాపురెడ్డి, జె. 2010: 109)
4. మ్యావ్ మ్యావ్ (శివకుమార్, వఝల. 2004: 9)
5. పకపకా (నారాయణరెడ్డి, సి. 2009: 66)
6. టపటపా (నారాయణరెడ్డి, సి. 2010: 13)
7. కిటకిటలు (తిరుపతి, కూకట్ల. 2005: 40)
8. కిలకిలలు (పైదే: 40)
9. మంటర మంటర (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 68)
10. గలగల (రవీందర్, నాగిళ్ళ. 2005: 91)

### 7.8.జంట పదాలు

1. సేనుసెలకల్లారా (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 1)
2. గోరువంకల్లారా (పైదే: 1)
3. సడీసప్పుడు (జగన్నాథం, జూకంటి. 2013: 94)
4. మందుమాకూ (సూర్య, వొడ్నాల. 2003: 93)
5. దిక్కు సక్కి (దేవేందర్, అన్నవరం. 2005: 44)
6. తల్లడం మల్లడం (లక్ష్మణ్, ఆడెపు. 2007: 50)
7. పొలం పుట్రా (పైదే: 58)
8. అప్పుసప్పు (పైదే: 28)
9. తాడో పేడో (దేవేందర్, అన్నవరం(సంపా.).2010: 36)
10. గొడ్డు గోదల్తో (పైదే: 80)

### 7.9.విభక్తి ప్రత్యయాలు

నామవాచకాలకు, సర్వనామాలకు చేరుతూ వాక్యంలోని ఇతర పదాలతోగల సంబంధాన్ని తెలిపే వాటిని 'విభక్తులు' అంటారు.

### 7.9.1. ప్రథమా విభక్తి ప్రత్యయాలు

1. సూర్యుడు (నారాయణరెడ్డి, సి. 2007: 1)
2. రెక్కలు (పైదే: 3)
3. మేనులు (గఫూర్ శిక్షక్, సిరిసిల్లా. 2010: 2)
4. బతుకులల్ల (దేవేందర్, అన్నవరం(సంపా). 2010: 89)
5. పాత్రలు (సూర్య, వొడ్నాల. 2003: 21)
6. పసికూనలు (తిరుపతి, కూకట్ల. 2005: 37)
7. మతోన్మాదులు (నారాయణ, ఆడెపు. 2004: 1)
8. కార్మికులు (రమేశ్, నాగిళ్ళ. 2009: 3)
9. కలతలు (మల్లయ్య. 2006: 11)
10. గదమాయింపులు (హిమజ. 2006: 14)

### 7.9.2. ద్వితీయా విభక్తి ప్రత్యయాలు

''ను వర్ణంబు ద్వితీయ'' (బాల వ్యా. తత్సమ పరి. 21). 'ను' వర్ణాన్ని ద్వితీయా విభక్తి ప్రత్యయంగ చెప్పిన సంప్రదాయ వ్యాకరణాలు 'నిన్, నున్, లన్, కూర్చి, గురించి' లను పేర్కొనడం జరిగింది.

1. వాళ్లకు (నారాయణరెడ్డి, సి.2007: 9)
2. పక్కింటికి (తిరుపతి, కూకట్ల. 2005: 39)
3. కన్నెకు (వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 1)
4. బతుకమ్మను (బాలయ్య, పొన్నాల. 2008: 19)
5. చరిత్రను (దేవేందర్, అన్నవరం. 2008: 80)
6. శక్తిని (బాపురెడ్డి, జె. 2003: 120)
7. జన్మభూమిని (అదృశ్య కిరణాలు: 32)
8. మంచికి (నరహరి ఆచార్య, డింగరి. 2005: 40)
9. గుండెను (నారాయణరెడ్డి, సి. 2010: 51)
10. సిరిసిల్లకు (మోహన్, పత్తిపాక. కఫన్: 19)

### 7.9.3. తృతీయా విభక్తి ప్రత్యయాలు

తృతీయా విభక్తి ప్రత్యయాలుగా సాంప్రదాయ వ్యాకరణాలు '-చేతన్, -చేన్, -తోడన్, -తోన్' అను పేర్కొన్నాయి. చేత, తోడలను బాలవ్యాకరణం పేర్కొంది.

1. అమ్మాయితో (రవీందర్, నాగిళ్ళ. 2005: 21)
2. ఎవరితోని (జగన్నాథం, జూకంటి. 2013: 121)
3. భార్యపిల్లలతోడ (మల్లయ్య. 2006: 28)
4. ఎక్కాలతో (జింబో. 2003: 9)
5. ఆరాటంతో (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 96)
6. పెద్దలచేత (లక్ష్మణరావు, జి. 2003: 5)
7. గానంతో (ఎలనాగ. 2010: 15)
8. జల్లుతో (రమేశ్, నాగిళ్ళ. 2009: 8)
9. భావజాలంతో (లక్ష్మయ్య, దాస్యం(సంపా.). 2006: 29)
10. పోటుతో (లక్ష్మీనారాయణ, సబ్బని. 2001: 22)

### 7.9.4. చతుర్థీ విభక్తి ప్రత్యయాలు

**-కోసం, -కై**

1. యాసకోసం (లక్ష్మణ్ ఆడెపు. 2007: 46)
2. అక్షరాలకోసం (రవీంద్ర, సంగెవేని. 2005: 8)
3. విరులకోసం (ఎలనాగ. 2009: 27)
4. మట్టికోసం (లక్ష్మణరావు, జి. 2003: 23)
5. తల్లికోసం (నారాయణ, ఆడెపు. 2004: 44)
6. న్యాయంకోసం (లక్ష్మయ్య, దాస్యం(సంపా.). 2006: 23)
7. మెతుకులకై (సూర్య, వొడ్నాల. 2003: 74)
8. పదవులకై (పైదే: 110)
9. మాకై (హిమజ. 2006: 56)
10. పాటకోసం (చెమన్. 2001: 4)

### 7.9.5. పంచమీ విభక్తి ప్రత్యయాలు

**-ట్ల, -కంటె**

1. అంగట్ల (జగన్నాథం, జూకంటి. 2013: 281)
2. పిడికిట్ల (దేవేందర్, అన్నవరం. 2003: 60)
3. అణుబాంబుల కంటె (సూర్య, వొడ్నాల. 2003: 59)
4. అంతకంటే (బాపురెడ్డి, జె. 2006: 50)
5. ఊగిసలాడే కంటే (హిమజ. 2006: 15)

### 7.9.6. షష్ఠీ విభక్తి ప్రత్యయాలు

**-కు**

1. వక్తకు (గోపాల్, మాడిశెట్టి. 2007: 33)
2. చేనేతకు (మోహన్, పత్తిపాక. 2005: 1)
3. ఊళ్ళకు (ఎలనాగ. 2009: 23)
4. జాగకు (బాలయ్య, పొన్నాల. 2007: 30)
5. గీతకు (నారాయణ, ఆడెపు. 2004: 6)

**-కి**

1. విద్యార్థికి (గోపాల్, మాడిశెట్టి. 2007: 30)
2. కీర్తికి (శివప్రసాద్, సంకేపల్లి. 2002: 17)
3. బ్రహ్మణుడికి (సూర్య, వొడ్నాల. 2003: 24)
4. వాడికి (మోహన్, పత్తిపాక. 2001: 3)
5. మట్టికి (వసునందన్, రావికంటి. 2005: 4)

**-లో**

1. కవిత్వంలో (గోపాల్, మాడిశెట్టి. 2007: 1)
2. ఒడిలో (నారాయణరెడ్డి, సి. 2009: 3)
3. వాడిలో (రవీంద్ర, సంగెవేని. 2007: 72)
4. ఆలయంలో (వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 1)
5. ఆకాశంలో (రాణీప్రసాద్, కందేపి. 2006: 1)

**-ల, -లా**

1. నవ్వుల (గోపాల్, మాడిశెట్టి. 2007: 2)
2. మొగ్గల (నారాయణరెడ్డి, సి. 2009: 4)
3. తుఫానుల (రాణీప్రసాద్, కందేపి. 2006: 34)
4. అనుభవాల (నారాయణరెడ్డి, సి. 2007: 5)
5. రకంలా (తిరుపతి, కూకట్ల. 2005: 35)

**-లోంచి, -ల్లోంచి**

1. సందుల్లోంచి (లక్ష్మణ్ ఆడెపు. 2007: 42)
2. గాయాల్లోంచి (పైదే: 43)
3. నెర్రెల్లోంచి (శివకుమార్, వర్ఘుల. 2004: 50)
4. అనుభవంలోంచి (శివకుమార్, వర్ఘుల. 2004: 14)
5. గుండెల్లోంచి (జగన్నాథం, జూకంటి. 2013: 40)

**-లోపలి, -లోపల**

1. కళ్లలోపల (నారాయణరెడ్డి, సి.2008: 10)
2. ఇల్లులోపల (జగన్నాథం, జూకంటి. 2013: 270)
3. తెరలోపల (పైదే: 73)

**-బాపతు**

1. బాపతు (శివప్రసాద్, సంకేపల్లి. 2002: 47)

**-పొంటి**

1. ఊరిపొంటి (జగన్నాథం, జూకంటి. 2013: 216)
2. బాటల పొంటే (పైదే: 92)
3. దేశాల పొంటి (లక్ష్మణరావు, జి. 2003: 25)
4. పొలాల పొంటి (పైదే: 35)
5. పెరళ్లపొంటి (బాలయ్య, పొన్నాల. 2008: 46)

### 7.9.7. సప్తమీ విభక్తి ప్రత్యయాలు

1. కుటుంబాన (లక్ష్మయ్య, దాస్యం(సంపా.). 2006: 32)
2. పులకించిన (లక్ష్మీనారాయణ, సబ్బని. 2001: 7)
3. చాటుమాటున (తిరుపతి, కూకట్ల. 2005: 39)

### 7.9.8. సంబోధన ప్రథమా విభక్తి ప్రత్యయాలు

1. ప్రభూ! (శివకుమార్, వఝుల. 2004: 39)
2. ఓ సింగరేణి కార్మికా! (మల్లయ్య. 2006: 26)
3. బోధకుడా! (నారాయణ, ఆడెపు. 2004: 23)
4. అవ్వా! (పైదే: 37)
5. ఓ భాగమై పోయినదానా! (జింబో. 2003: 37)
6. కవులారా! (వసునందన్, రావికంటి. 2005: 12)
7. గులాబిపువ్వా! (రాణీప్రసాద్, కందేపి. 2006: 4)
8. రాజకుమారా! (జగన్నాథం, జూకంటి. 2013: 8)
9. ఓ బీరవ్వా! (పైదే: 141)
10. కృష్ణా! (తిరునగిరి. 2009: 101)

## 7.10. ఔపవిభక్తిక ప్రత్యయాలు

"ఇ –టి – తి వర్ణంబులు వక్ష్యమానంబు లౌపవిభక్తికంబులు" (బాల వ్యా. ఆచ్ఛిక పరి. 28). –ఇ, –టి, –తి అను మూడింటిని చిన్నయసూరి ఔపవిభక్తికాలుగా పేర్కొన్నాడు. –ంటి కూడా ఔపవిభక్తికంగా పేర్కొనబడింది.

–అ

1. బాగోతుల (జగన్నాథం, జూకంటి. 2013: 143)
2. కేకల (సూర్య, వొడ్నాల. 2003: 69)
3. మేఘాల (పైదే: 104)
4. అక్షరాల (శివకుమార్, వఝుల. 2004: 31)
5. బంధాల (హిమజ. 2006: 51)

–టి

| | |
|---|---|
| 1. ఎర్రటి | (జగన్నాథం, జూకంటి. 2013: 132) |
| 2. మొదటి | (పైదే: 132) |
| 3. నెత్తుటి | (సూర్య, వొడ్నాల. 2003: 46) |
| 4. ఒకనాటి | (పైదే: 86) |
| 5. నాటిదో | (హిమజ. 2006: 106) |

– ంటి

| | |
|---|---|
| 1. ఇంటి | (జగన్నాథం, జూకంటి. 2013: 119) |
| 2. కంటి | (చెమన్. 2001: 17) |
| 3. ఒంటికి | (లక్ష్మణ్, ఆడెపు. 2007: 51) |

–ఇ

| | |
|---|---|
| 1. వాడి | (శివకుమార్, వఝల. 2004: 39) |
| 2. ఇల్లాలి | (సూర్య, వొడ్నాల. 2003: 81) |
| 3. నలుగురి | (జగన్నాథం, జూకంటి. 2013: 120) |

## 7.11. అన్యదేశ్య పదాలకు తెలుగు ప్రత్యయాలు

### 7.11.1. ఆంగ్ల పదాలు

| | | |
|---|---|---|
| 1. కాలేజీలు | (ప్రథమా) | (రాణీప్రసాద్, కందేపి. 2006: 18) |
| 2. రోడ్లను | (ద్వితీయా) | (రవీంద్ర, సంగెవేని. 2007: 94) |
| 3. రిమోట్‌తో | (తృతీయా) | (దేవేందర్, అన్నవరం. 2008: 84) |
| 4. ఫ్యాక్టరీల | (షష్టీ) | (బాలయ్య, పొన్నాల. 2007: 71) |
| 5. బెడ్‌షీట్‌కి | (షష్టీ) | (సూర్య, వొడ్నాల. 2003: 64) |

### 7.11.2. ఉర్దూ, అరబీ, ఫారసీ పదాలు

| | | |
|---|---|---|
| 1. పరేషాన్‌లు | (ప్రథమా) | (శివకుమార్, వఝల. 2004: 59) |
| 2. ఇజ్జత్‌ను | (ద్వితీయా) | (జగన్నాథం, జూకంటి. 2013: 272) |

3. సర్కారుకు (షష్టీ) (మోహన్, పత్తిపాక. 2009: 26)

4. నుమాయిష్‌కు (షష్టీ) (వసునందన్, రావికంటి. 2005: 7)

5. దర్వాజాల (షష్ఠీ) (జింబో. 2002: 79)

## 7.12. తిట్లు

1. లఫంఘే (జగన్నాథం, జూకంటి. 2013: 3)
2. దగుల్బాజీ (పైదే: 42)
3. సెత్తకు గత్తరరాను (పైదే: 149)
4. లత్కోరు (శివకుమార్, వఝుల. 2004: 69)
5. ఆడిగుళ్ళ కొడుక్కి (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 62)
6. ఆస పుండ్లన్న పుట్టకపాయె (పైదే: 79)
7. రాబందుల్లారా (పైదే: 126)
8. నక్కల్లారా (పైదే: 126)
9. దగుల్బాజీ నా కొడుకుల్ని (లక్ష్మణ్, ఆడెపు. 2007: 34)

## 7.13. నానుడులు, జాతీయాలు, సామెతలు

1. చెవిటివాడి ముందు శంఖనాదాలు (లక్ష్మణరావు, జి. 2003: 32)

   చెప్పే విషయాన్ని వినకపోయినా, చెప్పినదాన్ని చేయకపోయినా ఈ సామెతను ఉపయోగిస్తారు.

2. మొసలి కన్నీరు (మోహన్, పత్తిపాక.2001: 22)

   మొసలి చర్మం గట్టిగా ఉండడంవల్ల ఏదైనా జంతువును తిన్నప్పుడు ఆ జంతువు లవణాలు కంటి నీరు ద్వారా పోతాయి. అంటే మొసలి కన్నీరు కార్చినప్పుడు బాధపడాల్సిన అవసరం లేదు. అలాగే ఊళ్లలో ఎవరైనా తప్పుచేసి నటిస్తూ ఏడుస్తున్నప్పుడు నమ్మకూడదనే ఉద్దేశ్యంలో ఈ సామెతని వాడుతారు.

3. అన్నప్రాసననాడే ఆవకాయ పెట్టినట్టు (వసునందన్, రావికంటి. 2005: 34)

   ఏదైనా మొదటగా నేర్చుకునేటప్పుడు ఆరోజే బరువైన, కఠినమైన పనులు చేయించినప్పుడు ఈ సామెతని వాడుతారు.

4. చేతులు కాలిం తర్వాత ఆకులు పట్టుకున్నవాళ్లకంటే (బాపురెడ్డి, జె. 2010: 19)

తప్పు జరిగాక బాధపడేవారిని చూసి ఈ సామెత వాడతారు.

5. ఏరుదాటి తెప్ప తగిలేసుకున్న (శివకుమార్, వఝుల. 2004: 13)

ఒకరి సహాయం తీసుకొని పని అయిపోయాక వాళ్ళని పట్టించుకోని సందర్భంలో వాడే సామెత ఇది.

6. ఈతాకులిచ్చి తాటాకులు దొబ్బే (శివకుమార్, వఝుల. 2004: 59)

చిన్న వస్తువు మనకిచ్చి పెద్ద వస్తువు తీసుకునేవాళ్ళని దృష్టిలో ఉంచుకొని వాడే నానుడి ఇది.

7. తెలిసినోనికి తెలుకపిండి తెలువనోనికి గానుగ పిండి (జగన్నాథం జూకంటి. 2013: 250)

మనకు పరిచయమున్న వాళ్ళని బాగా చూసుకొని పరిచయం లేనివాళ్ళని పట్టించుకోకపోవడం.

8. దున్నంగపోయి దులపంగ వచ్చి (పైదే: 292)

వ్యవసాయంలో దున్నడం మొదటిది, దులపడం చివరిది. ఎవరైనా ఏదైనా పని ఆరంభంలో వెళ్ళి చివరికి వస్తే ఈ సామెతని వాడుతారు.

9. సంచులు సగపెట్టె సరికి అంగడి ఇచ్చుల్లారమైతుంది (పైదే: 322)

అన్ని సిద్ధం చేసుకునేవరకే అనుకున్న కాలం కాస్త గడిపోయింది అన్న ఉద్దేశ్యంలో వాడతారు.

10. మంది మాటలు పట్టుకొని మార్మానం బోతె మల్లచ్చె వరకు ఇల్లు గాలినట్టు (దేవేందర్, అన్నవరం(సంపా). 2010: 41)

ఎవరో చెప్పిన మాటలు విని మోసపోవడం.

11. తియ్యటి మాటలకు తీర్థంబోతే అది గుల్లె నువు సల్లె (పైదే: 103)

చెప్పుడుమాటలు విని మోసపోవడం

12. ముంగిట ముచ్చటలాడుతావ్ వెనుక ఎక్కిరిస్తావ్ (బాలయ్య, పొన్నాల. 2008: 28)

మనం ముందు ఒకలాగా, మన వెనక ఒకలాగా ప్రవర్తించేవాళ్ళను ఉద్దేశించి చెప్పే సామెత.

13. మనున్నపుడు మంచినీళ్ళు లేవు చచ్చినంక సమాధులు కట్టుడు (పైదే: 30)

బతికున్నప్పుడు పట్టించుకోక చనిపోయాక బాధపడడం.

14. పులింజూసి నక్క వాతలు బెట్టుకున్నట్టు (నారాయణ, ఆడెపు. 2004: 28)

ఒకరు ఒక పని చేసారని ఇంకొకరు అదేపని చేస్తే ఈ సామెత ఉపయోగిస్తారు.

15. పేనుకు పెత్తనమిస్తే తెల్లవారుకుట్టు (ఎలనాగ. 2009: 14)

అర్హతలేనివారికి అధికారం ఇవ్వకూడదనే ఉద్దేశ్యంలో ఈ సామెత వాడుతారు.

## 7.14. సంధులు

పూర్వ, పర స్వరాలకు పరస్వరం ఏకాదేశంగా రావడాన్ని సంధి అంటారు. "పూర్వపరస్వరంబులకుం బరస్వరం బేకాదేశంబగుట సంధియనంబడు" (బాల వ్యా. సంధి పరి. 1). సంస్కృత వ్యాకరణవేత్తలు సంధిని గురించి చెప్పేటప్పుడు 'సంహిత' అనే మాటను ఉపయోగిస్తారు. ఆధునిక భాషావేత్తలు వేగోచ్చారణలో పదం, పదాంశం మధ్యగానీ, రెండు పదాలమధ్యగాని అవ్యవహితంగా ఉచ్ఛరించినపుడు వాటిమధ్య కలిగే ధ్వని మార్పులను సంధి అన్నారు.

సంధులని తెలుగు, సంస్కృత సంధులుగా విభజించారు. మళ్ళీ వాటిలో ఎన్నో విభజనలున్నాయి. వాటిని ఇక్కడ పేర్కొనక కేవలం ప్రత్యేకమైన ఒక్క సంధినే ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

### 7.14.1. వకార లోప సంధి

'వ, వా, వి, వీ, వె, వే'లలోని 'వ్' కారం లోపం జరగడం తెలంగాణలో కనిపిస్తుంది.

1. ఇంటి+వెనుక = ఇంటెనుక (జగన్నాథం, జూకంటి. 2013: 86)
2. ఇంట్లకు + వచ్చేదాక = ఇంట్లకచ్చేదాక (పైదే: 156)
3. విసిరి + విసిరి = ఇసిరిసిరి (దేవేందర్, అన్నవరం. 2003: 68)
4. ఏడుపు + వింటే = ఏడుపింటే (కనకయ్య, గుండెడప్పు. 2001: 3)
5. ఎవరు + వింటారే = ఎవరింటారే (పైదే: 9)

## 7.15. సర్వనామాలు

సర్వ అంటే అంతట అని అర్థం. నామవాచకానికి బదులు అంతట వాడబడేది సర్వనామం. భాషలో సూచికవ్యవస్థ ఒకటి పనిచేస్తూ ఉంటుంది. ఏదో ఒకదాన్ని సూచిస్తూ ఉండడం దీని పని. అటువంటి సూచిక వ్యవస్థలో కొన్నికొన్ని తరగతులకు చెందిన అన్ని మాటలను సూచించే పదాలలో సర్వనామాలు ఒక భాగం. సూచించబడే పదాలు నామాలు అయినపుడు ఈ సూచించే పదాలను సర్వనామాలు అంటారు.

### 7.15.1. పురుష వాచక సర్వనామాలు

i) **ఉత్తమ పురుష**

**ఏకవచనం**

నా (నారాయణరెడ్డి, సి. 2009: 14)

నేను (జగన్నాథం, జూకంటి. 2013: 62)

నన్ను (ఎలనాగ. 2009: 29)

నాకు (బాపురెడ్డి, జె. 2006: 34)

**బహువచనం**

మా (జగన్నాథం, జూకంటి. 2013: 113)

మన (నరహరి ఆచార్య, డింగరి. 2005: 23)

మేం (రవీంద్ర, సంగెవేని. 2007: 38)

మనం (శివప్రసాద్, సంకేపల్లి. 2002: 4)

ii) **మధ్యమ పురుష**

**ఏకవచనం**

నువ్వు (శివకుమార్, వఝల. 2004: 41)

నీ (గఫూర్ శిక్షక్, సిరిసిల్ల. 2010: 13)

నీవు (శివప్రసాద్, సంకేపల్లి. 2002: 14)

నిన్ను (హిమజ. 2006. 14)

**బహువచనం**

| | |
|---|---|
| మీ | (జగన్నాథం, జూకంటి. 2013: 113) |
| మీకు | (రవీంద్ర, సంగెవేని. 2007: 38) |
| మీరు | (దేవేందర్, అన్నవరం. 2008: 98) |

iii) **ప్రథమ పురుష**

**దూరం**

| | |
|---|---|
| అతను | (జగన్నాథం, జూకంటి. 2013: 62) |
| వాని | (పైదే: 32) |
| వాటి | (శివకుమార్, వఝల. 2004: 47) |
| అవి | (పైదే: 40) |
| దాని | (నరహరి ఆచార్య, డింగరి. 2005: 12) |
| వాడు | (పైదే: 13) |
| అది | (నారాయణరెడ్డి, సి. 2009: 13) |
| ఆమె | (గఫూర్ శిక్షక్, సిరిసిల్ల. 2010: 31) |
| వారి | (పైదే: 46) |

**సమీపం**

| | |
|---|---|
| గిది | (జగన్నాథం, జూకంటి. 2013: 123) |
| ఇది | (బాపురెడ్డి, జె. 2006: 56) |
| వీడు | (దేవేందర్, అన్నవరం. 2003: 16) |

**7.15.2. రీత్యర్థక సర్వనామాలు**

1. ఎలా (శివప్రసాద్, సంకేపల్లి. 2002: 18)
2. అలా (బాపురెడ్డి, జె. 2006: 66)
3. గిట్లెట్లాయె (దేవేందర్, అన్నవరం. 2003: 62)
4. ఎట్లనో (దేవేందర్, అన్నవరం. 2008: 88)
5. గట్ల (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 62)

### 7.15.3. హేత్వర్థక సర్వనామాలు

1. ఏమిటీ (నారాయణరెడ్డి, సి. 2009: 64)
2. ఎందుకో (బాపురెడ్డి, జె. 2006: 53)
3. ఎందుకు (జగన్నాథం, జూకంటి. 2013: 88)

### 7.15.4. కాలవాచక సర్వనామాలు

1. గిప్పుడు (జగన్నాథం, జూకంటి. 2013: 129)
2. ఇవ్వాళ్ళ (నరహరి ఆచార్య, డిగరి. 2005: 27)
3. అప్పుడప్పుడు (నారాయణరెడ్డి, సి. 2009: 38)
4. ఇప్పుడు (గఫూర్ శిక్షక్, సిరిసిల్ల. 2010: 14)
5. ఎప్పుడైనా (దేవేందర్, అన్నవరం. 2008: 47)
6. ఆనాడు (బాపురెడ్డి, జె. 2006: 63)

### 7.15.5. స్థలవాచక సర్వనామాలు

1. ఎక్కడో (నారాయణరెడ్డి, సి. 2009: 41)
2. అక్కడ (రవీంద్ర, సంగెవేని. 2007: 24)
3. ఇక్కడి (దేవేందర్, అన్నవరం. 2008: 51)
4. అచ్చటి (బాపురెడ్డి, జె. 2006: 36)

### 7.15.6. పరిమాణార్థక సర్వనామాలు

1. ఎన్ని (నరహరి ఆచార్య, డింగరి. 2005: 17)
2. ఎంత (పైదే: 17)
3. అంతా (రవీంద్ర, సంగెవేని. 2007: 55)
4. ఇంత (దేవేందర్, అన్నవరం. 2008: 63)
5. ఎన్ని (పైదే: 88)
6. గింత (జగన్నాథం, జూకంటి. 2013: 63)

## 7.16. సంఖ్యావాచకాలు

ఇవి ఏకత్వ బోధక సంఖ్యావాచకాలు, బహుత్వ బోధక సంఖ్యావాచకాలు అని రెండు రకాలు.

### 7.16.1. ఏకత్వ బోధక సంఖ్యావాచకాలు

1. ఒక్క (లక్ష్మణరావు, జి. ముగ్గు: 3)
2. ఒక (వసునందన్, రావికంటి. 2005: 2)
3. ఒకటే (బాపురెడ్డి, జె. 2010: 2)
4. ఒకరు (నారాయణరెడ్డి, సి. 2007: 27)
5. ఒకడు (జగన్నాథం, జూకంటి. 2013: 16)

### 7.16.2. బహుత్వ బోధక సంఖ్యావాచకాలు

#### i) మనుష్య వాచకాలు

1. ఇద్దరు (జింబో. 2002: 13)
2. ముగ్గురు (నారాయణ, ఆడెపు. 2004: 5)
3. నలుగురు (జగన్నాథం, జూకంటి. 2013: 68)
4. ఆరుగురు (జగన్నాథం, జూకంటి. 2013: 20)
5. నాలుక్కొట్లామంది (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 10)

#### ii) అమనుష్య వాచకాలు

**సామాన్య సంఖ్యావాచకాలు**

1. రెండు (రవీందర్, నాగిళ్ళ. 2005: 28)
2. మూడు (గఫూర్ శిక్షక్, సిరిసిల్ల. 2010: 66)
3. నలుగురు (రవీందర్, నాగిళ్ళ. 2005: 39)
4. అయిదేండ్ల (రవీంద్ర, సంగెవేని. 2005: 60)
5. ఏడు (రవీంద్ర, సంగెవేని. 2007: 49)
6. ఎనిమిది (సూర్య, వొడ్నాల. 2003: 33)

7. ఆరు (శివకుమార్, వర్ఘుల. 2004: 53)

8. పది (నారాయణరెడ్డి, సి. 2007: 16)

9. ఇరవై (నారాయణ, ఆడెపు. 2004: 21)

10. ముప్పై (బాలయ్య, పొన్నాల. 2007: 49)

11. యాభై (వసునందన్, రావికంటి. 2005: 7)

12. డెబ్బయి (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 78)

13. సహస్ర (రవీంద్ర, సంగెవేని. 2007: 62)

14. లక్ష (వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 28)

15. కోటి (గఫూర్ శిక్షక్, సిరిసిల్ల. 2010: 12)

## గుణిత సంఖ్యావాచకాలు

1. (2 x 100) = (రెండు x వంద) = రెండువందల (దేవేందర్, అన్నవరం. 2008: 79)
2. (6 x 100) = (ఆరు x వంద) = ఆరువందల (పైదే: 55)
3. (8 100) = (ఎనిమిది వంద) = ఎనిమిదొందల(ఎలనాగ. 2009: 73)
4. (2 x 1000) = (రెండు x వెయ్యి) = రెండు వేలు (ఎలనాగ. 2009: 25)
5. (2 x 1,00,00,000) = (రెండు x కోటి) = రెండు వందల కోట్లు (వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 10)

## సంకలన సంఖ్యావాచకాలు

1. (10 + 2) = (పది + రెండు) = పన్నెండు (బాలయ్య, పొన్నాల. 2007: 43)
2. (20 + 3) = (ఇరవై + మూడు) = ఇరవైమూడు (వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 17)
3. (30 + 1) = (ముప్పై + ఒకటి) = 31 (శివప్రసాద్, సంకేపల్లి. 2002: 88)
4. (40 + 5) = (నలభై + ఐదు) = నలుభై అయిదు (జింబో. 2004: 14)
5. (50 + 6) = (యాభై + ఆరు) = యాభై ఆరు (జగన్నాథం, జూకంటి. 2013: 38)

6. (60 + 4) = (అరవై + నాలుగు) = అరవై నాలుగు (బాపురెడ్డి, జె. 2001: 32)
7. (200 + 50) = (రెండు వందలు + యాభై) = రెండొందల యాభై (వసునందన్, రావికంటి. 2005: 64)
8. (300 + 65) = (మూడు వందలు + అరవై ఐదు) = 365 (జగన్నాథం, జూకంటి. 2013: 295)
9. (400 + 60) = (నాలుగు వందలు + అరవై) = నాలుగు వందల అరవై (దేవేందర్, అన్నవరం. 2008: 79)
10. (600 + 10) = (ఆరు వందలు + పది) = ఆరువందల పది (జగన్నాథం, జూకంటి. 2013: 323)

# ముగింపు

సమాజం, సాహిత్యాలు అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. ఒకసారి సమాజంవల్ల సాహిత్యం ప్రభావితమైతే, ఇంకోసారి సాహిత్యంవల్ల సమాజం ప్రభావితమవుంటాయి. ఇలాంటి సాహిత్యంలో కవిత్వానిది ప్రముఖ స్థానం. ఒకప్పుడు కవిత్వమంటే ఊహ, కల్పనలు, వర్ణనలు. కాని నేడు కవిత్వమంటే నిజ జీవితం. ఒకప్పటి కవిత్వానికి రాజు, ధీరోధత్తాది పురుషుడు నాయకుడు. కాని నేటి కవిత్వానికి సామాన్య మానవుడే నాయకుడు. రాజాస్థానాలనుంచి కవిత్వం ఎప్పుడో పూరిగుడిసెల్లోకి వచ్చేసింది.

తెలుగు సాహిత్యంలోని ఏ ఉద్యమమైనా, ధోరణైనా, వాదమైనా ఎక్కువగా కవిత్వంలో వచ్చింది, వస్తుంది అనడానికి సంశయించాల్సిన అవసరం లేదు. కవిత్వానికున్న వెసులుబాటు అలాంటిది. కరీంనగర్ జిల్లా కవిత్వంలో కూడా అనేక ఉద్యమాలకు, ధోరణులకు, వాదాలకు సంబంధించిన కవిత్వం కనిపిస్తుంది. అలాగే ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం కూడా ఎక్కువగా వచ్చింది. ఇలాంటి కవిత్వాన్ని నా పరిశోధనకు తీసుకొని సూక్ష్మంగా పరిశీలించి, పరిశోధించాను.

మొదటి అధ్యాయం 'కరీంనగర్ జిల్లా కవిత్వం – నేపథ్యం'లో కరీంనగర్ జిల్లా కేంద్రం మొదట్లో ఎక్కడుండేది, ఆ తర్వాత ఎక్కడికి మారింది, కరీంనగర్ జిల్లాకి ఆ పేరెలా వచ్చింది, జిల్లా సరిహద్దుల్ని, జిల్లాలోని మండలాల్ని, ఈ జిల్లాని పాలించిన రాజుల్ని, రాజవంశాల్ని, జిల్లాలోని చారిత్రక, దర్శనీయ స్థలాల్ని, జిల్లాలోని ప్రాచీన సాహిత్యాన్ని, ఆధునిక సాహిత్యంలోని నవల, కథ, నాటకం మొదలైన భిన్న ప్రక్రియల్ని పరిచయం చేస్తూ, కరీంనగర్ జిల్లాలో ఆధునిక కవిత్వం రావడానికి సాహిత్య సంస్థల, పత్రికల, వ్యక్తుల కృషిని, రాజకీయ, సామాజిక, ఉద్యమ నేపథ్యాల్ని వివరించాను.

రెండవ అధ్యాయం 'కరీంనగర్ జిల్లా కవిత్వం – వస్తు విశ్లేషణ'లో వస్తువంటే ఏమిటి, వస్తువు నిర్వచనాలు చెప్పి, కరీంనగర్ జిల్లా కవిత్వాన్ని సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అని స్థూలంగా విభజన చేసి, మళ్ళీ సామాజికంలో కుటుంబమనీ, మళ్ళీ కుటుంబంలో తల్లి, తండ్రి అనీ, వృత్తుల్లో చేనేత, కుమ్మరి, దళితులనీ, స్త్రీ, మానవ సంబంధాలు, పల్లె, ప్రకృతి, ప్రపంచీకరణలో వృత్తుల విధ్వంసం, పల్లె పరాయీకరణ, మానవ సంబంధాల విధ్వంసం వంటివి, తెలంగాణ ఉద్యమంలో వివక్ష, దోపిడిని

ప్రశ్నించడం, తెలంగాణ భాష, అమరవీరులను తలుచుకోవడం మొదలైనవి, రాజకీయంలో నాయకుడు, ఓటర్లు, ఎలక్షన్స్ మొదలైనవి, సాంస్కృతికంలో ఆచారాలు – వ్యవహారాలు, పండుగల్లో బతుకమ్మ, దసరా, కళల్లో బుర్రకథ, యక్షగానం మొదలైన వాటిని ఈ అధ్యాయంలో కూలంకషంగా విశ్లేషించాను.

మూడవ అధ్యాయం 'కరీంనగర్ జిల్లా కవిత్వం – వస్తు పరిణామం'లో కరీంనగర్ ఆధునిక కవిత్వంలోని వస్తువు ఏ విధంగా పరిణామం చెందిందో చెబుతూ, మొదటగా కరీంనగర్ జిల్లా ప్రాచీన సాహిత్యాన్ని పరిచయం చేసాను. తర్వాత కోస్తాంధ్ర నుంచి ఎప్పుడు మొదటి కవిత వచ్చిందో, దానికి కారణాలేమిటో చెబుతూ తెలంగాణ ప్రాంతంలో మొదటి కవిత ఎప్పుడొచ్చింది, కరీంనగర్ జిల్లాలో ఎప్పుడొచ్చింది, కోస్తాంధ్ర ప్రాంతానికి, తెలంగాణ ప్రాంతాల మధ్య వచన కవితావిర్భావికి మధ్య ఎంత సమయముంది, వాటికిగల కారణాలేంటి తదితర అంశాల్ని వివరించాను. ఆ తర్వాత 1965 నుంచి 1990 వరకు మధ్యగల కరీంనగర్ జిల్లా కవిత్వ వస్తువుని, ఆ తర్వాత 1990 నుంచి 2017 వరకు వచ్చిన ప్రపంచీకరణ కవిత్వాన్ని, అలాగే 1996 నుంచి 2014 వరకు తెలంగాణ ఉద్యమ కవిత్వ వస్తువును, 2014 నుంచి 2017 వరకుగల కవితా వస్తువును విశ్లేషించాను.

నాల్గవ అధ్యాయం 'కరీంనగర్ జిల్లా కవిత్వం – రూప విశ్లేషణ'లో కరీంనగర్ జిల్లాలో కనిపించే వచన కవిత, దీర్ఘకవిత, మినీ కవిత, పేరడీ, నానీలు, హైకూలు, హాజీర్ లాంటి కవితా రూపాలను విపులంగా విశ్లేషించాను.

ఐదవ అధ్యాయం 'కరీంనగర్ జిల్లా కవిత్వం – రూప పరిణామం'లో ఆధునిక కాలంనుంచి కరీంనగర్ జిల్లా కవిత్వంలో కనిపించే పద్యం, పాట, ఖండకావ్యం, గేయ నాటికలు, గజల్స్, రుబాయీలు, ప్రపంచపదులు, వచన కవిత, దీర్ఘకవిత, మినీ కవిత, హైకూలు, నానీలు, ఫీచర్ కవిత, రెక్కలు, హాజీర్ హై, పేరడీ, ఒకరోజు పదిగాయాలు వంటి వాటిని వివరించాను.

ఆరవ అధ్యాయం 'కరీంనగర్ జిల్లా కవిత్వం – శిల్ప విశ్లేషణ'లో శిల్పం నిర్వచనాలు చెప్పి, కరీంనగర్ జిల్లా కవిత్వ శిల్పాన్ని భావచిత్రాలు, ప్రతీకలు, భాషలో గ్రాంథిక భాష, మాండలిక భాష, సమక్రియల వాడకం, జాతీయాలు, సామెతలు, నానుడులు ప్రయోగం, విరోధాభాసం, అలంకారాలు, జానపద విధానం, పౌరాణిక నేపథ్యం, ప్రశ్న – సమాధాన పద్ధతి, సంభాషణాత్మకం, వర్ణనాత్మకం, అసాధారణ పోలిక, అపరిచయీకరణ, మానవ

గుణారోపణ, తళుక్కున ప్రారంభం కావడం, భంగిమలకు తగ్గ భాషను ఎన్నుకోవడం, వస్తు స్థానభ్రంశం, ధ్వన్యనుకరణ, పునరుక్తి గా వింగడించి విశ్లేషించాను. అలాగే వస్తు, రూప, శిల్ప ప్రాధాన్యతని చర్చించి, సమన్వయం చేశాను.

ఏడవ అధ్యాయం 'కరీంనగర్ జిల్లా కవిత్వం – భాషా విశ్లేషణ'లో భాషంటే ఏమిటి అన్నదానికి నిర్వచనాలిచ్చి, తెలంగాణ భాష గురించి చర్చించి, అన్యదేశ్యాల్లో ఉర్దూ, ఫారసీ, అరబీ, హిందీ, ఆంగ్ల భాషాపదాలనీ, దేశ్యపదాలనీ, క్రియల్లో భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలనీ, ధ్వని పరిణామంలో వర్ణసమీకరణం(పూర్వవర్ణ సమీకరణం, పరవర్ణ సమీకరణం), వర్ణనాశనం, స్వరలోపం, వర్ణాగమనం, లోపదీర్ఘత, వర్ణమార్పు(చ>స, ష>స), పదాదిన వు, వూ, వొ, వోలు రావడం, జంటపదాలు, విభక్తి ప్రత్యయాల్లో ప్రథమా, ద్వితీయా, తృతీయా, చతుర్థీ, పంచమీ, షష్టీ, సప్తమీ, సంబోధనా ప్రథమా విభక్తులనీ, ఔపవిభక్తిక ప్రత్యయాలు, అన్యదేశ్య పదాలకు తెలుగు ప్రత్యయాల్లో ఆంగ్ల, ఉర్దూ, ఫారసీ, అరబీ పదాలనీ, తిట్లు, నానుడులు, జాతీయాలు, సామెతలు, సంధుల్లో వకారలోప సంధి, సర్వనామాల్లో పురుషవాచక సర్వనామాలు, రీత్యర్థక, కాలవాచక, స్థలవాచక, పరిమాణార్థక సర్వనామాలను, సంఖ్యావాచకాల్లో ఏకత్వ, బహుత్వ బోధక సంఖ్యావాచకాల్ని ఉదహరణలతో సహా వివరించాను.

## ఫలితాంశాలు

1. కరీంనగర్ జిల్లా చరిత్రకి ఒక విశిష్టత ఉంది. కోటిలింగాల్లో జరిపిన తవ్వకాల ద్వారా కరీంనగర్‌ను పాలించిన తొలి రాజులు శాతవాహనులే అన్న అభిప్రాయం పూర్వపక్షమై ఆంధ్రుల రాజ్యం కొత్తగా వెలుగులోకి వచ్చింది. అలాగే శాతవాహనులపై ఉన్న అనుమానాలన్ని మాయమయ్యాయి. శాతవాహనుల మొదటి రాజధాని ప్రతిష్టానపురము అన్నది పోయి కోటిలింగాలే అని తేలింది. శాతవాహనుల రాజవంశ స్థాపకుడు సిముకుడు కాదు శాతవాహనుడే అని నిర్ధారణైంది.
2. తెలుగు ప్రాచీనతకు ముఖ్య ఆధారంగా చెప్పబడుతున్న హాలుడి 'గాథాసప్తశతి' ఈ జిల్లానుంచే వచ్చింది.
3. మొదటి కందపద్యాలు ఈ జిల్లా కురిక్యాలలో జినవల్లభుని కురిక్యాల శాసనంలో కనిపిస్తున్నాయి.

4. వేములవాడ, ధర్మపురి, మంథెన లాంటి చారిత్రక దర్శనీయ ప్రదేశాలు సాహిత్య సృజనకు ఆలవాలుగా పనిచేశాయి.
5. కరీంనగర్ జిల్లా ఆధునిక కవిత్వం రావడానికి సామాజిక, రాజకీయాంశాలతోపాటు సాహితీ సంస్థల, పత్రికల, వ్యక్తుల కృషి గొప్పనైంది.
6. పత్రికల్లో సారస్వత జ్యోతి పత్రిక ప్రముఖ కవుల కవితలతోపాటు యువకవుల కవితలను ముద్రించేది.
7. 1954లో మంథని పాఠశాల విద్యార్థులే సంపాదకులుగా ఉంటూ తమ రచనల ముద్రణకై 'విజయ' పత్రికను వెలువరించారు.
8. హాలుడి గాథాశప్తశతి నుండి నేటివరకు ఈ జిల్లాలో సాహిత్య వారసత్వం కొనసాగుతూ వస్తోంది.
9. ఆధునిక సాహిత్య రూపాలైన నాటకంలో నారంభట్ల నరహరి, న్యాలకొండ కిషన్‌రావు, పులికాంత రాజయ్య, గంగా లక్ష్మణరావు మొదలైనవాళ్ళు, నవలలో ముడుంబై రామానుజాచార్యులు, వేణుగోపాలరావు, తిరునగిరి శివరామశాస్త్రి, అల్లం రాజయ్య, కాలువ మల్లయ్య, బి.యస్. రాములు, పెద్దింటి అశోక్ కుమార్, సాహు మొదలైనవాళ్ళు, కథలో జి. రాములు, గూడూరి సీతారాం, జి. సురమౌళి, పి.వి. నరసింహారావు, మలయశ్రీ, చొప్పకట్ల చంద్రమౌళి, కాలువ మల్లయ్య, అల్లం రాజయ్య, జూకంటి జగన్నాథం మొదలైనవాళ్ళు, , వచన కవిత్వంలో డా. సి. నారాయణరెడ్డి, డా. జె. బాపురెడ్డి, అలిశెట్టి ప్రభాకర్, జూకంటి జగన్నాథం, అన్నవరం దేవేందర్, పత్తిపాక మోహన్ మొదలైనవాళ్ళు ఈ జిల్లాకు చెందినవారు.
10. కవిత్వంలోని అన్ని ఉద్యమాలకు, ధోరణులకు, వాదాలకు సంబంధించిన కవిత్వం ఈ జిల్లాలో కనిపించినా, స్త్రీవాద, దళితవాద కవిత్వం తక్కువగా, మైనారిటీవాద కవిత్వం అతి తక్కువగా వచ్చింది.
11. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి. నారాయణరెడ్డి గారి 1965లో వచ్చిన 'అక్షరాల గవాక్షాలు' పుస్తకంతో ఆరంభమైన ఆధునిక కవిత్వం ఇంతింతై వటుడింతై అన్నట్టుగా విస్తృతమవుతూ వస్తోంది.

12. ఆధునిక కవిత్వంలో మొదట్లో భక్తి, వర్ణాశ్రమ ధర్మాలకి సంబంధించిన వస్తువుంటే అ తర్వాత తెలంగాణ సాయుధ పోరాటం, జగిత్యాల జైత్రయాత్ర, కార్మికోద్యమం మొదలైన ఉద్యమాల ప్రభావంతో విప్లవానికి సంబంధించిన వస్తువు ఎక్కువగా ఉంది.

13. 1969 తెలంగాణ తొలిదశ ఉద్యమ ప్రభావంవల్ల టి. కృష్ణమూర్తి యాదవ్ మాండలికంలో మొట్టమొదట కరీంనగర్ నుంచి కవిత్వం రాశారు.

14. ప్రపంచీకరణకు వ్యతిరేకంగా విస్తృతమైన కవిత్వం వచ్చింది. నోస్టాల్జియాలో భాగంగా బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకోవడం, ఊరు గొప్పతనాన్ని వివరించడం వాటితోపాటు విచ్ఛిన్నమవుతున్న పల్లెటూరును చిత్రించడం, విధ్వంసమవుతోన్న మానవ సంబంధాల గురించి బాధపడడం, యాంత్రిక వ్యవస్థ రావడంవల్ల వృత్తులు నాశనమై ఆ వృత్తుల్ని నమ్ముకున్నవాళ్ళ వలసల్ని, ఆత్మహత్యల్ని చిత్రించడం జిల్లా కవిత్వంలో కనిపిస్తుంది.

15. ప్రపంచీకరణలో భాగంగా చేనేత వృత్తి కవిత్వం ఎక్కువగా ఈ జిల్లానుంచి వచ్చింది.

16. తెలంగాణ మలిదశ ఉద్యమానికి మద్ధతుగా విస్తృతమైన కవిత్వం వచ్చింది. తెలంగాణకు అన్యాయం చేస్తోన్న వారందరిని వ్యతిరేకిస్తూ, తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని, వివక్షను ప్రశ్నించి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఎందుకు కావాలో తెలియజేసింది. తెలంగాణ భాష, సంస్కృతి, సాహిత్య, కళల గొప్పతనాన్ని వివరిస్తూ, ఉద్యమంలో అసువులుబాసిన అమరులను తలుచుకొని దుఃఖించింది. ఇకపై ఎవరు చనిపోకూడదని ధైర్యం చెప్పింది.

17. మొదటి నుంచి ప్రాంతీయ మాండలికంలో కవిత్వం కొంత వస్తోన్న, తెలంగాణ ఉద్యమంవల్ల జిల్లా స్థానిక భాషలో కవిత్వం ఎక్కువగా వచ్చింది. అన్నవరం దేవేందర్, జూకంటి జగన్నాథం, వఝుల శివకుమార్, బూర్ల వెంకటేశ్వర్లు తదితర కవులు ప్రాంతీయ భాషని అద్భుతంగా వినియోగించుకున్నారు, వినియోగించుకుంటున్నారు.

18. మొదటినుండి ఈ జిల్లా ఉద్యమాలవల్ల, పోరాటాలవల్ల సామాజిక అల్లకల్లోలాన్ని అనుభవిస్తూనే వస్తోంది. ఈ జీవన పోరాటాన్నంత కవిత్వం కళ్ళకు కట్టినట్టు చిత్రించింది. బొగ్గుకార్మికుల గురించి ఉద్యమం జరిగినప్పుడు దానికి మద్ధతుగా, తెలంగాణ మలిదశ ఉద్యమానికి మద్ధతుగా ఇలా ఏ ఉద్యమం జరిగినా ఆ ఉద్యమానికి సంబంధించిన కవిత్వం వచ్చింది.

19. సమాజానికి, సాహిత్యానికి ఉన్న అవినాభావ సంబంధంవల్ల ఆయా ఉద్యమాల, పోరాటాల, సామాజిక అల్లకల్లోలవల్ల కవిత్వ వస్తువు మారుతూ వస్తోంది.

20. 1990కి ముందు పోరాటం, సామాజికం, భక్తి కవిత్వం వచ్చింది. ఆ తర్వాత పోరాట, ప్రపంచీకరణ వ్యతిరేకత కవిత్వం, ఆ తర్వాత తెలంగాణ మలిదశ ఉద్యమ కవిత్వం, ఆ తర్వాత సామాన్య కవిత్వం కనిపిస్తుంది.

21. 2001 – 2010 మధ్యకాలంలో ఈ జిల్లాలో వచన కవిత, దీర్ఘకవిత, మినీ కవిత, హైకూలు, నానీలు, పేరడీ, హాజిర్ హై లాంటివి మాత్రమే కనిపిస్తున్నాయి.

22. ఆధునిక కవిత్వారంభం నుండి ఈ జిల్లాలో ఖండకావ్యం, గజల్స్, ప్రపంచపదులు, గేయం, పాట, వచన కవిత, దీర్ఘకవిత, మినీకవిత, హైకూలు, నానీలు, పేరడీ, రెక్కలు, నానోలు, నాన్మీలు మొదలైన తెలుగు సాహిత్యంలో కనిపించే అన్ని రూపాలు ఈ జిల్లాలో కనిపిస్తాయి.

23. కరీంనగర్ జిల్లా నుంచి డా. సి.నారాయణరెడ్డిగారు 'ప్రపంచపదులు' అన్న కొత్త కవిత్వ రూపాన్ని సృష్టించారు. గజల్స్‌ని ఎక్కువగా ప్రాచుర్యంలోకి తెచ్చింది కూడా ఈయనే.

24. ఆధునిక కాలంలో కూడా ఛందోబద్ధ కవిత్వం ఈ జిల్లాలో కనిపిస్తుంది.

25. భావచిత్రాలు, ప్రతీకలు, అలంకారాలు, భాష, మానవ గుణారోపణ, అపరిచయీకరణ, జానపద విధానం మొదలైన శిల్పరీతుల్ని ఉపయోగిస్తు సంఘటనని అత్యద్భుతంగా ఈ జిల్లా కవులు కవిత్వంగా మలిచారు.

26. భాషలో, వ్యక్తీకరణలో, తీసుకున్న పోలికలో, వస్తువులో, శైలిలో కరీంనగర్ జిల్లా కవిత్వ ప్రత్యేకత కనిపిస్తుంది. ఉదారణకు భాష విషయానికొస్తే "మొలుదారంకు యాలాడే తాళం చెయి / దుగుట్ల దీపం కింద పావుల నెవులు / తనబ్బిల వయ్యికింద పోంటీన్ / దూలం మీఅ దాగున్న మీసం కట్టె / శిల్కొయ్యకు తగిలిచ్చిన ఎడ్ల గంటలు / గాజె బొత్త మీన జల్లెడల సద్దుల ముద్దలు / లక్ష్మిందేవి పట్వల శారెదు ఎండి బిల్లలు" (దేవేందర్, అన్నవరం. 2005: 28). ఇలా ప్రాంతీయ భాషని ఎక్కువగా కవిత్వంలోకి ఈ జిల్లా తీసుకొచ్చింది.

27. దేశ్యపదాలు విరివిగా కవిత్వంలోకి వచ్చాయి. ఉదారణకు అయిరాండ్లకుండలు, పైలం, పోంటీన్, వయ్యి, ఎన్కలాడడం, కొప్పెర, జప్పజప్ప, గుల్ల, నువ్వద్ది మొదలైన ఎన్నో ప్రాంతీయ పదజాలం ఈ జిల్లా కవిత్వంలో కనిపిస్తుంది.

28. ఆంగ్లభాష ప్రభావం ఎక్కువగా ఉన్నట్టు కవిత్వంలో కవులు వాడిన ఆంగ్లభాష పదాలవల్ల తెలుస్తుంది.

29. క్రియా పదాల్లో పురుష ప్రత్యయం ముందున్న అచ్చు ఎక్కువగా హ్రస్వం అవుతుంది. బతుకుతున్నరు (దేవేందర్, అన్నవరం. 2005: 50), జేత్తరు (జగన్నాథం, జూకంటి. 2013: 92).

30. నడువుండ్రి (జగన్నాథం, జూకంటి. 2013: 141), ఇరిసేసింద్రు (పైదే: 147), వడిపెట్టింద్రు (పైదే: 147) లాంటి క్రియలు కనిపిస్తాయి.

31. తెలంగాణ భాషలో అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడు మొదలైన శబ్దాల్లో అ, ఇ, ఎలకు బదులు గ, గి, గెలు కనిపిస్తాయి. ఇది కరీంనగర్ జిల్లా కవిత్వంలో కూడా కనిపిస్తుంది. ఉదాహరణకు: అట్లున్న – గట్లున్న (దేవేందర్, అన్నవరం. 2003: 62), ఇది – గిది(పైదే: 63), ఇట్ల – గిట్ల(జగన్నాథం, జూకంటి. 2013: 281) మొదలైనవి.

32. వ, వా, వి, వీ, వె, వే లలో మొదటి వకారం లోపిస్తుంది. ఉదాహరణకు: విసిరిసిరి – ఇసిరిసిరి (దేవేందర్, అన్నవరం. 2003: 68), వెలుగని – ఎలుగని (జగన్నాథం, జూకంటి. 2013: 92), వెనుకకు – ఎన్కకు (పైదే: 94), వచ్చిపోండ్రిరా – అచ్చిపోండ్రిరా (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 70) మొదలైనవి.

33. పాలకుల భాష పాలితుల భాషలోకి రావడం సాధారణ విషయమే. ముస్లిం పాలకులు తెలంగాణని పాలించడంవల్ల తెలంగాణ భాషలో ఉర్దూ, ఫారసీ, అరబీ, హిందీ భాషా పదాలు 100కి 25 వరకు కనిపిస్తాయి. అలాగే కరీంనగర్ జిల్లా కవిత్వంలో కూడా ఈ భాషా పదాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

34. ప్రాంతీయమైన జాతీయాల్ని, నానుడుల్ని, సామెతల్ని కవిత్వంలో వాడారు కవులు. ఉదాహరణకు: మందిమాటలు పట్టుకొని మార్మానం బోతే / మల్లచ్చె వరకు ఇల్లు గాలినట్టు (దేవేందర్, అన్నవరం(సంపా.). 2010: 41), ఈతాకులిచ్చి తాటాకులు దొబ్బే (శివకుమార్, వఝల. 2004: 59), తెలిసినోనికి తెలుకపిండి తెలువనోనికి గానుగపిండి(జగన్నాథం, జూకంటి. 2013: 250) మొదలైనవి.

35. కొన్ని పదాలు వ్యవహారిక భాషకు సంబంధంలేని కొత్త పదాలు కనిపిస్తాయి. ఉదాహరణకు: ఈరోజు – ఈయాల్ల (జగన్నాథం, జూకంటి. 2013: 90), అరవడం – ఒర్రుడు (పైదే: 93) వ్యవసాయం – యెవుసం (లక్ష్మణరావు, జి. 2004: 82), బలవంతంగా – బలిమీటికి (శివకుమార్, వఝుల. 2004: 68), స్నేహాలు – సోపతులు (దేవేందర్, అన్నవరం. 2005: 3), మాట్లాడిస్తే – మందలిస్తే (పైదే: 7) మొదలైనవి.

36. కొన్ని కొన్ని పదాల్లో ఎక్కువ వర్ణమార్పులు జరిగాయి. ఉదాహరణకు: విడిచి – ఇడ్సి (జగన్నాథం, జూకంటి. 2013: 93) (ఇందులో 'వ్' లోపించింది, 'డి'లోని స్వరలోపం జరిగింది. చకారం సకారంగా మారింది), పగిలితె – పగుల్తె (పైదే: 110). ఇందులో కూడా 'లి'లోని స్వరలోపం జరిగి 'పగిల్తె'గా మారి, 'గి'లోని ఇకారం ఉకారంగా మారింది).

37. 'సంది' అనే పదాన్ని కాలవాచకంలో, తాన, కాడ అనే పదాల్ని దగ్గర, ఒద్దులు అనే పదాన్ని రోజులు అనే అర్థంలో వాడారు. ఉదారణకు: పదేండ్ల నుండి – పదేండ్ల సంది (దేవేందర్, అన్నవరం. 2005: 71), బావి దగ్గరికి – బాయికాడికి (పైదే: 39), అయిదు రోజులు – అయుదొద్దులు (పైదే: 23),

38. అన్యదేశ్య పదాలకు తెలుగు ప్రత్యయాలు వాడడం జరిగింది. డైలాగులు (వెంకటేశ్వర్లు, బూర్ల. 2007: 4), బెల్టుతో (గఫూర్ శిక్షక్, సిరిసిల్ల. 2010: 18), తారీఖులు (శివప్రసాద్, సంకేపల్లి. 2002: 31), హాలులో (పైదే: 67), గరీబుకు (రవీంద్ర, సంగెవేని. 2007: 78).

భావి పరిశోధకులు కరీంనగర్ జిల్లా కవిత్వంలోని ఈ కింది అంశాలపై పరిశోధన చేయడానికి వీలుంది.

1. కరీంనగర్ జిల్లా కవిత్వం – సామాజిక విశ్లేషణ
2. కరీంనగర్ జిల్లా కవిత్వం – భాషా విశ్లేషణ
3. కరీంనగర్ జిల్లాకి చెందిన ప్రముఖ కవులైన జె. బాపురెడ్డి, జూకంటి జగన్నాథం, అన్నవరం దేవేందర్ మొదలైన వారిపైన
4. నవలాకారులైన అల్లం రాజయ్య, కాలువ మల్లయ్య, మలయశ్రీ, పెద్దింటి అశోక్ కుమార్ మొదలైన వారిపైన

5. కరీంనగర్ జిల్లా సాహితీ సంస్థలైన మానేరు రచయితల సంఘం, సిరిసిల్ల రచయితల సంఘం, తెలంగాణ రచయితల వేదిక(కరీంనగర్ శాఖ), సాహితీ సోపతి మొదలైన ఎన్నో సంస్థలు విరివిగా పుస్తకాల్ని ప్రచురించాయి. ఒక్కొక్క సాహితీ సంస్థపైన కూడా పరిశోధన చెయ్యవచ్చు.
6. కరీంనగర్ జిల్లా కవిత్వానికి, మిగిలిన జిల్లాల కవిత్వాభివ్యక్తికి తులనాత్మకంగా అధ్యయనం చెయ్యవచ్చు.
7. కరీంనగర్‌లో తెలంగాణ రచయితల వేదిక తరపున 'ఎన్నీల ముచ్చట్లు' ప్రతి నెల జరుగుతుంది. మొదట్లో నెలకో కవిత్వ బులిటెన్ తీసుకొస్తే, తర్వాత మూడు నెలలకోసారి కవిత్వ బులిటెన్ తీసుకొస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు దాదాపు యాభై ఎన్నీల ముచ్చట్లు జరిగాయి. దీనిపైన కూడా పరిశోధన చేయవచ్చు.
8. తెలంగాణోద్యమ కవిత్వం – వస్తు, రూప విశ్లేషణ అనే అశంపై
9. తెలంగాణ రచయిత్రుల కవిత్వం పైన పరిశోధనలు చెయ్యవచ్చు.

## డా. నలిమెల భాస్కర్

### (కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, భాషాశాస్త్రవేత్త, ప్రముఖ కవి)

**1. మీ దృష్టిలో కవిత్వం అంటే ఏమిటి? అది ఎలా ఉండాలి?**

కవిత్వం అంటేనే దృష్టి, చూపు, దృక్పథ. అంటే కవి ఐనవాడూ ద్రష్ట కావాలి. రవి కాంచంది కవి కాంచాలి. కవిత్వం అంటే దృష్టి మాత్రమే కదు సృష్టి. కవి అనేవాడు స్రష్ట. రాయాలి, రచించాలి, సృష్టించాలి. భావావేశపు వెల్లువలో కొట్టుకుపోవడం కవిత్వం. ఉద్వేగాల వూపులో వున్మత్తుడవ్వడం కవిత్వం. కోపతాపాల్లో, సుఖదుఃఖాల్లో హృదయంలోంచి వెల్లుబికితే కవిత్వం. కవిత్వానికి రెండు ప్రయోజనాలున్నాయి. ఒకటి రసానుభూతి. రెండు సాంఘిక స్పృహ. ఏది ఎప్పుడు అవసరమో కవికి స్పష్టమైన తెలివిడి వుండాలి. కవిత్వం పదాలు కలపడానికి జనానికి చైతన్య పదాలు తెలిపేలా వుండాలి. కవితా వ్యాసంగం సంఘంలోన కుళ్ళును ఈషణ్మాత్రమైనా ఈసడించేలా వుండాలి.

**2. మీ అభిప్రాయంలో వస్తువు, రూపం, శైలి అంటే ఏమిటి? వీటికి మధ్యగల సామ్య భేదాలు ఏమిటి?**

కవిత్వంలో ఏం చెప్పదలుచుకున్నారో అది వస్తువు. ఎలా చెప్పదలుచుకునారో అది రూపం. ఎవరి అభిప్రాయమైన దాదాపు యిదే! మొదటిది Matter. రెండవది Manner. మొదటిది ఆత్మ. రెండోది శరీరం. శైలి అంటే రూపంలో యిమిడిపోతుంది. రూపమూ, శైలి, శిల్పమూ యిలాంటివి దాదాపు సమానార్థకాలే!

**3. కవి ఎలాంటి వస్తువును స్వీకరించాలి?**

కవి సర్వస్వతంత్రుడు. నిరంకుశుడు. దేన్నైనా కవితా వస్తువుగా గ్రహించవచ్చు. అయితే తాను ఏ సమాజంలో నివసిస్తున్నాడో ఆ సమాజ ప్రతిఫలనం తన కవనంలో వుండేలా చూసుకోవడం కనీస సంస్కారం. కనీస బాధ్యత కూడాను. "రోమ్ అగరం తగలబడుతుంటే వీరో చక్రవర్తి ఫిడేలు వాయించుకున్నట్లు" కూర్చోవడం కవికి ఎలా కుదురుతుంది? కవికి తప్పనిసరిగా సంఘం, మనిషి, పేదలు, దళితుల గురించి రాయవల్సిన అవసరం వుంది. శ్రమజీవుల గురించి చెప్పవల్సిన అక్కర మిక్కిలిగా వుండాలి.

**4. సాహిత్యంలో కొత్త కొత్త రూపాలు రావడానికి కారణాలు ఏమిటి?**

కవిత్వానికే పరిమితమైన ఈ ప్రశ్నకు సమాధానం అనేక రూపాలున్నాయి. ఉంటాయి. మనిషి మూలభూతంగా వైవిధ్యాన్ని యిష్టపడతాడు. సంఘం మారుతుంది. మానవుడు మార్పును కోరుకుంటాడు. కొత్త ఎప్పుడు ఒక వింతగా వుంటుంది. పాశ్చాత్య కవిత్వ విధానాలు కూడా రూప వైవిధ్యానికి కారణాలు. మన వచన కవిత ఆంగ్ల ఫ్రీవర్సే కదా! హైకూకు మూలాలు జపాన్‌లో వున్నాయి కదా! శ్లోకం, గేయం, పద్యం, వచన కవిత నానీ....యిట్లా అనేక రూపాలు కవిత్వంలో కాలం మారి ప్రపంచం మార్పుకు లోనై ఆసక్తులు మారితే కవితా రూపాలూ మారక తప్పదు.

**5. వస్తు రూప సంబంధంపై మీ అభిప్రాయం ఏమిటి? వీటిలో ఏది ముఖ్యం?**

కవిత్వం విషయానికొస్తే అది కళాత్మక అభివ్యక్తిగా వుండాలి. ప్రజల గురించే చెప్పినా అది కళాత్మకంగా వుండాలి. వస్తు రూపాలు రెండు పరస్పరాధారితాలు. పరస్పర పూరకాలు. ఆ రెండూ కలిస్తేనే ఒకటి అవుతుంది. రూపం లేకుండా సారం వుండదు. పాత్ర లేకుండా నూనె లాంటి ద్రవ్ లేనట్ల. సారం లేని రూపం నిస్సారం, నిరర్థకం. రెండు ముఖ్యమైనవే. కవిత్వంలో మాత్రం రూపమే ముఖ్యం.

**6. కవిత్వ నిర్మాణానికి పాటించవల్సిన సూత్రాలు, నియమాలు ఏమైనా వున్నాయా? ఉంటే అవి ఏమిటి?**

నిజానికి కవిత్వం బుద్ధికి సంబంధించింది కాదు. అది హృదయానికి చెందిన భాష. నువ్వొక భాష స్థితిలో ఉన్నప్పుడు అత్యంత సహజంగా నిరాఘాటంగా గుండె కొండల్లోంచి నిసర్గ సుందర జలపాతం కవితం, గణాలూ, యతులూ, ప్రాసలూ, పంక్తులూ, చరణాలూ, శబ్దలయా, భావలయా యిత్యాదులన్నీ కవిత్వంలో సెకండరీ అంశాలు. ప్రాథమికంగా కవి కదిలిపోవాలి – కరిగిపోవాలి– కలత చెందినా కవిత రావాలి – గాయపడినా గేయం రాయాలి. అయితే ఒక ట్రాన్సులో దూకిన కవితా పంక్తుల్ని ఓమారు అద్దంలో అలంకారాలున్నాయా, ఛందస్సు సరిగా కుదిరిందా అని చూసుకోవడం తప్పేమీ లేదు. కవిత ప్రారంభమూ – ముగింపూ... ఈ రెంటి మధ్య అంతస్సూత్రం తెగిపోకుండా నిర్వహించాల్సిన అవిచ్ఛిన్నమైన టెంపో యివన్నీ ముఖ్యమే కవిత్వానికి. శబ్దార్థాలు రెండు ప్రధానమే!

**7. కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్యానికి, ముఖ్యంగా తెలంగాన సాహిత్యానికి ఎంతవరకు దోహదపడిందని మీ భావన?**

దీన్నే కవిత్వానికి సీమితం చేసుకొని మాట్లాడుకుందాం. ఆధునిక కవిత్వం(జిల్లా కవిత్వం) తెలుగు కవిత్వానికే కాక, తెలంగాణ కవిత్వానికే కాక భారతీయ కవిత్వానికి దోహదపడింది. డా. సినారె 'విశ్వంభర' కు జ్ఞానపీఠం వచ్చింది. అది యితర భాషల్లోకి వెళ్ళింది. అట్లాగే 'మంటలు మానవుడు' తమిళం మొదలైన దేశ భాషల్లోకి అనూదితమైంది. అలిశెట్టి ప్రభాకర్ కవిత్వ వికాసానికి దోహదం చేసింది. ఎంతో మంది మినీ కవితలు రాశారు. కొంగర జగ్గయ, బ్రహ్మానందం, డా. సినారె వంటి వ్యక్తులకు బాగా వచ్చిన కవిత్వమైంది. జూకటీ, అన్నవరం, జింబో, వఝల, తైదల, పొన్నాల..ఒకరా యిద్దరా రాష్ట్ర కవిత్వ వేదిక మీద సగౌరవంగా ఆసీనులైనవాళ్లు. ఆ సీను, దృశ్యం మనం నిత్యం చూస్తున్నాం కదా!

**8. కరీంనగర్ జిల్లాలో ఆధునిక కవిత్వం రావడానికి నేపథ్యం ఏమిటి?**

ఏ జిల్లా అయినా ఏ ప్రాంతం అయినా కాలం మారుతుంది కనుక కవిత్వం మారిపోతుంది. ఇది ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన మార్పు కాదు. ఆధిన్క భావలూ, ఆధునిక సమాజ చలనాలూ ఆధునిక కవిత్వానికి వూపిరి పోస్తాయి. మార్పు సహజం. ఆ నేపథ్యంలోంచే ఆధునిక కవిత్వావిర్భావం జరిగింది.

**9. కరీంనగర్ జిల్లా సాహిత్యంలో కవిత్వ పాత్ర ఎంత?**

సింహభాగం కవిత్వానిదే. మఖ్యంగా నిన్న మొన్నటిదాకా అంటే తను చనిపోయేంతవరకు ఏడాదికో ఒక సంపుటి వేసిన కవివరేణ్యుడు డా. సినారె కరీంనగర్ జిల్లావాడే కదా! ఈ జిల్లా నుంచి 2001 – 10 మధ్య కాల్పనిక సాహిత్యంలో పెద్దింటి తరం వాళ్ళెంత పెద్ద మొత్తంలో రాశారో జూకంటి తదితరులు అంత ఎక్కువ మొత్తంగా కవిత్వం రాశారు.

**10. కరీంనగర్ జిల్లా కవిత్వంలో ఏయే ఉద్యమాలకు, ధోరణులకు, వాదాలకు సంబంధించిన కవిత్వం కనిపిస్తుంది?**

కరీంనగర్ జిల్లా కవిత్వానికిచలనశీలం ఎక్కువ. ప్రగతి కాముకత్వం అధికం. స్త్రీవాద కవిత్వం తక్కువ కావచ్చుగాక అభ్యుదయ, విప్లవ, దళిత, మానవతావాద కవిత్వం యిక్కడ పుష్కలంగా వచ్చింది. ముస్లింవాద కవితలు తక్కువే! ఇటీవలి తెలంగాణ ప్రాంతీయవాద కవిత్వం ఈ జిల్లాలో ఎక్కువగా వచ్చింది. అట్లాగే ప్రపంచీకరణకు వ్యతిరేకంగా గొంతు విప్పిన కవులు ఎందరెందరో! ప్రపంచంలో ఏ మూలన ఏ చిన్న సంఘటన జరిగినా యిక్కడి కవి స్పందిస్తాడు. తన అక్షర సరాన్ని సంధిస్తాడు. పాఠక లోకానికి అందిస్తాడు.

**11. కరీంనగర్ జిల్లా కవిత్వంలో మీరు గమనించిన వస్తు వైవిధ్యాన్ని, మీరు ఎన్నుకొన్న వస్తువును వివరించండి?**

పై ప్రశలోని భిన్న ధోరణులూ, వాదాలూ, వుద్యమాలు యిక్కడి వస్తు వైవిధ్యమే! నా 'సుద్దముక్క'లో ముఖ్యంగా ఆరు ఉపాధ్యాయ కవితలు రాశాను. తెలంగాణ, తెలంగాణ భాష, అనువాదాలు, అనుభూతులు, పల్లెలు, బీ.సిలు, పుస్తక పఠనం, రైలు ప్రయాణం ఇటువంటి అనేక అంశాల్ని వస్తువులుగా రచించాను. పోతే 'మట్టిముత్యాలు' నానీల్లో ఎక్కువశాతం మట్టి మహత్తు గురించి చెప్పాను.

**12. కరీంనగర్ జిల్లా కవిత్వం ఏయే రూపాల్లో వచ్చింది? వస్తోంది?**

తెలుగు కవిత్వంలో వున్న అన్ని రూపాలూ యిక్కడునాయి. పద్యం, పాట, వచన క్వితి, మినీ కవిత, హైకూలు, నానీలు అన్నీ ఈ జిల్లా కవిత్వంలో చోటు చేసుకున్నాయి.

**13. కరీంనగర్ జిల్లాకి మాత్రమే ప్రత్యేకమైన, విలక్షణమైన అంశాలు ఏమైనా ఉన్నాయా?**

కరీంనగర్ జిల్లా భాషకు సంబంధించిన ప్రాంతీయ సోయగం ఈ జిల్లా కవిత్వంలో వుంది. ఇది తరచుగా జూకంటి, అన్నవరం, చైతన్య ప్రకాశ్, పొన్నాల బాలయ్య, బూర్ల వెంకటేశ్వర్లు, కూకట్ల తిరుపతి తదితర కవుల్లో కనిపిస్తుంది. జిల్లాకు సంబంధించిన అంశాలు కూడా ఈ కవిత్వంలో వున్నాయి. ఉదహరణకు నలిమెల భాస్కర్ కరీంనగర్ 'మా', అన్నవరం 'మంకమ్మతోట లేబర్ అడ్డా' యిటువటివి యిక్కడి స్థానీయతను నమోదు చేశాయి.

**14. కరీంనగర్ జిల్లా కవిత్వంలో కరీంనగర్ భాష ప్రాధాన్యతను ఇవరించండి?**

జూకంటి, అన్నవరంల కవిత్వమంత ఈ ప్రశ్నకు సరైన జవాబుగా వుంటుంది.

**15. కరీంనగర్ జిల్లా కవిత్వాభివృద్ధికి సంస్థలు, వ్యక్తులు ఎంతవరకు తోడ్పడ్డారు?**

ఎన్నీల ముచ్చట్లు, సాహితీ గౌతమి, ఆంధ్ర భూమి, మెరుపు పేజీ మొదలైనవి జిల్లాలో సాహితీ వాతావరణాన్ని కల్గచేశాయి. గంద్ర లక్ష్మణరావు, దాస్యం సేనాధిపతి, వారాల ఆనంద్, నలిమెల, అన్నవరం, బూర్ల తదితరులు ఇటీవలి తరాన్ని బాగా ప్రోత్సహిస్తున్నారు.

**16. ప్రస్తుత తెలుగు సాహిత్యంలో కవిత్వం నిర్వహించే పాత్ర ఏమిటి? ఎలా ఉండాలి?**

అసలు కవిత్వం నిర్వహించని పాత్ర ఏమైనా వుంటుందా? కవిత్వానికి పెద్ద బాధ్యత వుంది. అక్షరం ప్రజల పక్షం వహించాలి. అది పాలకులకు లొంగి పోరాదు. వంగి వంగి సలాములు చేయకూడదు. గులాము కారాదు. అది అన్ని రకాల అణిచివేతలను, దురాగతాలను, అన్యాయాలను ప్రశ్నించాలి, పృచ్ఛించాలి – తర్కించాలి – చర్చించాలి. కవి తన ఆత్మగౌరవాన్ని కాపడుకోవాలి. అక్షరాన్ని నమ్ముకోవాలి గానీ తెగనమ్ముకోరాదు. సాహిత్యంలో కవిత్వమే తక్షన స్పందన తెలియజేసేది. అది ఏ చిన్న హృదయవిదారక దృశ్యాన్న చూసినా ప్రతిస్పందించాలి. కవిత్వం సగర్వంగా తలెత్తుకొని తిరగాలి.

★★★

## డా. పత్తిపాక మోహన్

### (నేషనల్ బుక్ ట్రస్ట్ తెలుగు విభాగ ఛైర్మెన్, ప్రముఖ కవి)

**1. మీ దృష్టిలో కవిత్వమంటే ఏమిటి? అది ఎలా ఉండాలి?**

నామట్టుకు నాకు కవిత్వమంటే ఒక అంతర్వేదనని లేదా కొన్ని సందర్భాలలో కలిగిన ఆవేదన కావచ్చు, లేకుంటే దుఃఖం కావచ్చు, బాధ కావచ్చు వీటిని ఓవర్‌కమ్ చేయడానికి వెతుక్కునే తొవ్వ కవిత్వం. సాధారణంగా కవిత్వమంటే ఆనందంకోసం రాయడమో, సంతోషంకోసం రాయడమో జరుగుతుంది. నామట్టుకు నాకు నా కవిత్వం మొదలైందే నేత కార్మికులమీద కవిత్వం రాయడంతో. నా తెగినపోగు కూడా అట్లొచ్చిందే. ఈ తెగినపోగు కూడా మా ఊళ్లో గుడిముందు ఒకేసారి ఆరుగురు సూసైడ్ చేసుకొని చనిపోతే... అంతకుముందు రెండు మూడు రోజుల కింద వాళ్ళందరిప్రత్యక్షంగా చూసాను. నిన్నటిదాక ఉండి సడెన్‌గా ఈరోజు మాయమయ్యేసరికి కలిన బాధే తెగినపోగు కవిత్వం.

**2. మీ దృష్టిలో వస్తువు, రూపం, శైలి అంటే ఏమిటి? వీటిమధ్యగల సామ్య భేదాలు ఏమిటి?**

మనిషికి ఎలాగైతే అలంకరణ అందాన్నిస్తదో కవితకు శైలి కూడా అందాన్నిస్తుంది. వస్తువు కవిత యొక్క లోతును, సాంద్రతని తెలియజేస్తుంది. నేను రాసిన కవిత్వంలో యాభై నుంచి అరవై శాతం చేనేత కార్మికులే. వాళ్ళ జీవన విధానం నా కవిత్వంలో ఉన్నది కాబట్టి నా వస్తువంత చేనేత వృత్తికి సంబంధించిందే.

**3. కరీంనగర్ జిల్లా సాహిత్యం తెలుగు సాహిత్యానికి ముఖ్యంగా తెలంగాణ సాహిత్యానికి ఎంతవరకు దోహదపడింది?**

ఒకరకంగా చెప్పాలంటే ఏబికె ప్రసాద్ అనుకుంటాను వేములవాడకి వచ్చినప్పుడు ఒక మాటన్నారు 'తెలుగు ముఖద్వారం తెలంగాణం, ఆ తర్వాత ఏదైన ఉంటే కరీంనగరం'. ఇవాళ తెలంగాణలో కవులన్నా, రచయితలన్నా, విమర్శకులన్నా, చివరికి కెసిఆర్ ఉద్యమం

మొదలుపెట్టాలన్నా కేరఫ్ కరీంనగరే. కరీంనగర్ కవిత్వ విషయానికొస్తే నారాయణరెడ్డి మొదలుకొని జూకంటిదాకా, నారాయణశర్మదాకా తనకంటూ ఒక అస్తిత్వాన్ని, విలక్షణమైన శైలిని కరీంనగర్ జిల్లా కొనసాగిస్తూ వస్తోంది. మనం దానికి కొనసాగింపే. ఈనాడు కవిత్వమన్నా, కథన్నా తెలంగాణలో కేరాఫ్ కరీంనగరే.

**4. కవిత్వ నిర్మాణానికి పాటించవల్సిన నియమాలు, సూత్రాలు ఏమైన ఉన్నాయా?**

ఉంటాయి. వ్యాకరణాన్ని, అలంకారాన్ని చదువుకున్నప్పుడు ఆటోమెటిక్‌గా ఉంటాయి. ఒకప్పుడు కవంటే తెలుగు సాహిత్యంలో ఎం.ఏ., పిహెచ్.డి. చేసినవారు, ఛందస్సు, వ్యాకరణం చదువుకున్నవాళ్ళు ఉండే కాబట్టి వాళ్ళకువాళ్ళు భాషా పరంగా, వస్తువు పరంగా, శైలి పరంగా, నిర్మాణ పరంగా కొత్తకొత్త దారులు వెతుక్కునేవారు. కాని ఇవ్వాళ్ళ కొత్తగా వస్తున్న కవులెవరైతే ఉన్నారో వీళ్ళలో తెలుగు సాహిత్యంతో సంబంధం లేనివాళ్ళు ఉన్నారు. ఇది గొప్ప పరిణామం. సాఫ్ట్‌వేర్ నుంచి మొదలుపెట్టి లేబర్ దాకా ప్రతిఒక్కరు వస్తున్నారు కాబట్టి వాళ్ళకు కొద్దిగా సాహిత్యాన్ని చదువుకున్నవాళ్ళ కంటే నిర్మాణ విషయంలో జ్ఞానం తక్కువగా ఉండవచ్చు. కాని వారిదైన ఒక నిర్మాణ పద్ధతి ఉంది.

**5. కవి ఎలాంటి వస్తువును తీసుకోవాలి?**

ఫలానా వస్తువే తీసుకోవాలని ఏమీ లేదు. నేను ఇంతకుముందే చెప్పాను నేను చాలా కవిత్వం రాశాను. నేను బాధపడ్డ అంశాలు, చూసి చలించిపోయిన అంశాలు తప్ప చెట్ల గురించి, పూల గురించి ఇలా ప్రకృతి గురించి రాసింది తక్కువ. ప్రకృతిలో భాగమైన మనిషి గురించి రాసింది ఎక్కువ.

**6. కరీంనగర్ జిల్లాలో ఆధునిక కవిత్వం రావడానికిగల నేపథ్యం ఏమిటి?**

ఉద్యమాలు. మొదటినుంచి కరీంనగర్‌లో ఎన్నో ఉద్యమాలు జరిగాయి. జగిత్యాల జంగల్ మహల్ కావచ్చు, శ్రీకాకుళ నిప్పురవ్వ నక్సల్బరీని అందిచడం కావచ్చు, తెలంగాణ ఉద్యమం కావచ్చు, అంతకు ముందున్న అస్తిత్వవాద ఉద్యమాలు కావచ్చు ఇలా మొదటినుంచి చైతన్యమనేది ఆ మట్టికి ఉంది. అది జీవ లక్షణం.

**7. కరీంనగర్ సాహిత్యంలో కవిత్వ పాత్ర ఎంత?**

నిజానికి సాహిత్య ప్రక్రియల్లో కవిత్వమే అగ్రస్థానంలో ఉంటది. కరీంనగర్ కథా రచయితలున్నా మొదటినుంచి కవిత్వమే మొదటి స్థానంలో ఉంది. వివిధ కవుల ప్రోత్సాహంతోపాటు డా. సి. నారాయణరెడ్డి గారి ఇన్స్పిరేషన్ కవిత్వంవైపు మళ్లేల చేసింది.

**8. కరీంనగర్ జిల్లా కవిత్వంలో ఏయే ధోరణులకు, వాదాలకు, ఉద్యమాలకు సంబంధించిన కవిత్వం కనిపిస్తుంది?**

కరీంనగర్ జిల్లాలో ప్రతి వాదానికి, నినాదానికి సంబంధించిన కవిత్వం కనిపిస్తుంది. గుండేడప్పు కనకయ్య, జూకంటి జగన్నాథం, జింబో, కొలిపాక శోభారాణి, హిమజ ఇలా ఒక్కొక్కరు ఒక్కో వాదానికి, ఉద్యమానికి సంబంధించినవాళ్ళు ఉన్నారు.

**9. కరీంనగర్ జిల్లాలో మీరు గమనించిన వస్తు వైవిధ్యాన్ని, మీరు ఎన్నుకొన్న వస్తువును వివరించండి?**

అన్నవరం దేవేందర్ ఉంటాడు మంకమ్మతోట లేబర్ అడ్డా రోజు మన కళ్లకు కనిపించేది. దాన్ని పతాక స్థాయిలో కవిత్వంగా చేస్తాడు. జూకంటి జగన్నాథం ఉన్నాడు. ఆయన పుస్తకం పేరే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్. దీంట్లో ప్రపంచీకరణ గురించి కవిత్వం రాశారు. ఇలా ఒక్కొక్కరు తమ దృష్టిలో ఉన్న వస్తును కవిత్వంలోకి తీసుకువచ్చారు. ఇంకా నా వస్తువు విషయానికొస్తే చేనేత బతుకుల తెగినపోగే నా వస్తువు. చేనేత కుటుంబ నుంచి వచ్చిన వాడిగా, ఆ వృత్తి చేసిన వాడిగా చేనేతకు సంబంధించిన బాధల్ని, బతుకు తండ్లాటని నా కవిత్వానికి వస్తువుగా తీసుకున్నాను. అందుకే నారాయణశర్మలాంటి విమర్శకులు నన్ను అస్తిత్వవాద కవి అంటారు.

**10. కరీంనగర్ జిల్లా కవిత్వం ఏయే రూపాల్లో వచ్చింది, వస్తోంది?**

పద్యం వచ్చింది. గేయం వచ్చింది. వచన కవిత్వం వచ్చింది. ఎన్. గోపిగారు ప్రారంభించిన నానీల ప్రక్రియ ఎక్కువగా వచ్చింది ఉత్తర తెలంగాణ, కరీంనగర్‌లోనే. ఆ

తర్వాత దీర్ఘ కావ్యాలు వచ్చాయి. ఎన్నం సత్యం శిలాఘోష కావచ్చు, నా తెగినపోగు, జూకంటి జగన్నాథం ఒకరోజు పదిగాయాలు ఇలా ఎన్నో దీర్ఘ కావ్యాలు వచ్చాయి. సినిమా గేయం కూడా కరీంనగర్‌లో వచ్చింది. సినారె మొదలుకొని వడ్డేపల్లి కృష్ణ వరకు సినిమా గేయాలు రాశారు.

**11. వస్తు, రూప సంబంధంపై మీ అభిప్రాయమేంటి? దీంట్లో ఏది ముఖ్యం?**

ఏది ముఖ్యమంటే చెప్పలేం. రెండూ ముఖ్యమే. మనం ఎన్నుకున్న వస్తువునుబట్టి ఆధారపడి ఉంటాయి. నేను వచన కవిత్వాన్ని ఎందుకు ఎన్నుకున్నానంటే అందరికి తొందరగా అందుబాటులో ఉంటుందనే ఉద్దేశ్యం ఒకటి. రెండవది వస్తువు. నేను ఎన్నుకున్న వస్తువును చెప్పదలుచుకున్న పదాలు గేయంలో ఇమడకపోవచ్చు. కాబట్టి వస్తువు, రూపం రెండింటికి పరస్పర సంబంధం ఉంటాయి. అది మనం ఎన్నుకున్న అంశాన్నిబట్టి, ఎంచుకున్న విధానాన్నిబట్టి ఉంటది. ఈ రెండింటిని కాదని ఏది ఉండలేదు.

**12. కరీంనగర్ జిల్లా కవిత్వానికే విలక్షణమైన, ప్రత్యేకమైన అంశాలు ఏమైనా ఉన్నాయా?**

కరీంనగర్ జిల్లాకు సంబంధించి అంటే వస్తువే. గ్లోబలైజేషన్ మీద చర్చలు జరుగుతుంటే దాని మొట్టమొదటిసారిగా గొంతెత్తింది జూకంటి జగన్నాథం. అస్తిత్వవాద ఉద్యమంలో చేనేతకు సంబంధించి మొట్టమొదటి దీర్ఘకావ్యం నా తెగినపోగు. అలాగే సినిమా పాటల్లో తెలంగాణ ముద్రని సి. నారాయణరెడ్డి గారు తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అంతకుముందు ఎవ్వరు చెయ్యలే. ఇది నారాయణరెడ్డి గారితో ప్రారంభమైంది.

**13. కరీంనగర్ జిల్లా కవిత్వాభివృద్ధికి వ్యక్తులు, సంస్థలు ఏ విధంగా దోహదం చేశాయి?**

తొలినాళ్ళ నుంచి వ్యక్తుల, సంస్థల పాత్ర ఉంది. నారాయణరెడ్డి అన్న క్క పేరుతోనే వందలమంది కవులు తయారయ్యారు. ఇంకా సాహిత్య సంస్థల విషాయానికొస్తే మా మానేరు రచయితల సంఘం ముప్పై ఏళ్ళుగా కృషి చేస్తోంది. 48 కవితా సంపుటాలు తీసుకొచ్చాం. తర్వాత నటరాజ కళా నికేతన్, సాహితి గౌతమి, భారతి సాహితి సమితి ఇలా నాకు తెలిసి పద్దెనిమిది, పంతొమ్మిది సంస్థలు కరీంనగర్ జిల్లా కవిత్వానికి విశేషమైన కృషి చేశాయి. మా మానేరు రచయితల సంఘం నెలకోసారి ఉపన్యాసం పెట్టేది. సిరిసిల్ల నుంచి

దిక్సూచి అన్న పత్రిక వచ్చేది. కేవలం సాహిత్యం కోసమే వచ్చేది. నిజాం వెంకటేశం నడిపించేవాడు. సిరిసిల్ల సాహితి సమితి గత ఇరవై ఏళ్ళుగా ప్రతి నెల ఒక ఆదివారం నాడు సమావేశం చెయ్యడం నిరాఘటంగా వస్తోంది. ఇలా ఎన్నో సంస్థలు కరీంనగర్ జిల్లా కవిత్వాభివృద్ధికి విశిష్టంగా దోహదం చేశాయి.

**14. ప్రస్తుతం తెలుగులో కవిత్వం నిర్వహించే పాత్ర ఏమిటి? అదెలా ఉండాలి?**

కవిత్వం తొలినాళ్ళనుంచి కూడా బలమైన భూమికను నిర్వహిస్తోంది. ప్రతి ఉద్యమానికి, ప్రతి వ్యక్తి వేదనకు, సంవేదనకు ఆనవాలమైంది. తెలుగు సాహిత్యంలోని అస్తిత్వవాదాలైన స్త్రీవాదం, బహుజనవాదం, మైనారిటీ వాదం ఇలా అన్ని వాదాలకు కవిత్వం ఒక బలమైన ఆయుధంగా, దిశా దిక్సూచిగా నిలిచింది. మొదటినుండి కూడా కవిత్వం బలమైందే, అది అట్లనే నడుస్తుంది.

★★★

# అన్నవరం దేవేందర్

## (ప్రముఖ కవి)

**1. మీ దృష్టిలో కవిత్వమంటే ఏమిటి? అది ఎలా ఉండాలి?**

కవిత్వంటే చాలా మంది చెబుతున్నట్టుగా స్పాంటినియస్‌గా వచ్చేది. సమస్యలనుంచి పుట్టేది తాత్వికత నుంచి పుట్టేది. మనం ఏదైనా రాయాలనుకున్నప్పుడు బలమైన వ్యక్తీకరణకు కవిత్వాన్ని ఒక సాధనంగా వినియోగించుకుంటాం. రాయకుండా ఉండలేనిది అదే కవిత్వం.

**2. కవిత్వం ప్రయోజనం ఏమిటి?**

కవిత్వ ప్రయోజనం సామాజిక ప్రయోజనమే. పక్కు సమాజాన్ని ఉద్దరించడానికి అని మనం చెప్పలేము గాని కవిత్వం ఒక సామాజిక ప్రయోజనం, సమాజానికి సంబంధించిన సమస్యలనుగానీ, స్పందనలు గానీ కవిత్వంలో ఉంటాయి. సమాజమే అంతిమంగా.

**3. మీ అభిప్రాయంలో వస్తువు, రూపం, శైలి అంటే ఏమిటి?**

మొదట వస్తువును ఎన్నుకుంటాం. అది సమాజం కావచ్చు, ప్రకృతి కావచ్చు, సంఘటనలు కావచ్చు. కవిత్వానికి ప్రధానంగా వస్తువు ముఖ్యం. ఆ తర్వాత శిల్పం శైలి ముఖ్యం. తెలంగాణ కవిత్వానికి శైలి – శిల్పం ముఖ్యం, భాష ముఖ్యమే. రూపాన్ని ఫ్రీవర్స్‌గా రాస్తూనే ఉన్నాం. దాన్ని రూపంగా తీసుకుంటాం. వస్తువు, రూపం, శైలి, భావం ఇవన్నీ మేళవిస్తేనే అసలైన కవిత్వం వస్తుంది. వచనం కన్న భిన్నంగా కవిత్వాన్ని అల్లే ఒక పద్ధతి ఉంటుంది.

**4. కవి ఎలాంటి వస్తువులు తీసుకోవాలి? మీకేమైన నియమ నిబంధనలు ఉన్నాయా?**

వస్తువు తీసుకోవాలనే నియమాలు చెప్పేవారు ఎవరు ఉండరు. కవి తన సామాజిక దృక్పథాన్ని, తన జీవితాన్ని, తన అనుభవాన్ని, తను ప్రయాణిస్తున్న తాత్విక నేపథ్యాన్ని అర్థం చేసుకునే రీతిలో వస్తువు తనే తీసుకుంటాడు. ఈ వస్తువే తీసుకోవాలని ఏమీ లేదు. ఒక ఆధ్యాత్మిక చింతన ఉన్నవాళ్లు వేరే ఉండవచ్చు. తన జీవిత అనుభవం నుంచే వస్తువు

వస్తుంది. నా జీవితం ప్రకారమే నా అనుభవం వస్తుంది. నేను సమాజాన్ని చూసే దృక్పథాన్ని, పద్ధతిని, నేపథ్యాన్ని బట్టి కవిత్వం వస్తుంది.

**5. సాహిత్యంలో కొత్త కొత్త రూపాలు హైకూలు, నానీలు, జపనీస్ లాంటివి రావడానికి కారణాలు ఏమంటారు?**

కారణం ఏముంటుంది. కవిత్వంలో ఇది రావలి, ఇది రావద్దు అనేది ఏమీ ఉండదు. ప్రజలు వీటిని స్వీకరిస్తున్నారు. వాళ్లు స్వీకరిస్తున్నంతవరకు ఏదొచ్చినా మనం తీసుకోవల్సిందే.

**6. కవిత్వంలో వస్తువు, రూపం మధ్య సంబంధం ఏమిటి? వీటిలో ఏది ముఖ్యం?**

రెండూ ముఖ్యమే. తీసుకున్న వస్తువుకు అనుగుణంగా రూపం ఇవ్వాలి. రూపమే ప్రధానం కాదు, వస్తువే ప్రధానం కాదు. కవిత్వానికి రూపం, వస్తువు రెండు ప్రధానమే. రెండింటిని సమన్వయంతో రాస్తేనే అది వినసొంపుగా ఉంటుంది, అద్భుతంగా కవిత్వం వస్తుంది.

**7. కవిత్వ నిర్మాణానికి పాటించవలసిన నియమాలు, సూత్రాలు ఏమైనా ఉన్నాయా? ఉంటే అవి ఏమిటి?**

కవిత్వ నిర్మాణానికి సంబంధించిన సూత్రాలు చెలామణీలో ఉన్నయే. అవి పాటించాల్సిందే. ఎత్తుగడ, వ్యూహం, కవిత్వం నడక, పదచిత్రాలు అవన్నీ ఉంటాయి. వీటిని పాటించాల్సిందే. పాటిస్తేనే అది కవిత్వమవుతుంది. లేదంటే వచనంగా తేలిపోతుంది.

**8. కరీంనగర్ జిల్లా కవిత్వం తెలుగు సాహిత్యానికి ముఖ్యంగా తెలంగాణ సాహిత్యానికి ఏవిధంగా దోహదపడిందని మీ భావన?**

తెలంగాణ సాహిత్యానికి కరీంనగర్ జిల్లా సాహిత్యం అద్భుతంగా దోహదపడింది. తెలంగాణ ఉద్యమానికి కూడా కరీంనగర్ సాహిత్యం చాలా తోడ్పాటు చేసింది. తెలంగాణ ఉద్యమానికి నారాయణరెడ్డిగారు మద్దతుగా ఉన్నాడు. కాని అతను రాసిన పాటలు తెలంగాణ భాషలో ఉన్నాయి. ఆ తర్వాత జూకంటి జగన్నాథంగారుగానీ, నలిమెల భాస్కర్ గారు గానీ, నేను గానీ ఇంకా చాలామంది తెలంగాణకు సంబంధించిన సాహిత్యాన్ని సృష్టించాం ఇక్కడ.

అది తెలంగాణ సాహిత్యానికి చాలా గొప్పగా పని చేసింది. ఆ మాటకొస్తే తెలుగు సాహిత్యానికి కరీంనగర్ జిల్లా సాహిత్యం చేసిన కంట్రిబ్యూషన్ తక్కువేమి కాదు. ఆనాటి హాలుని గాథాసప్తశతి మొదలుపెడితే ఇప్పటివరకూ వస్తున్నటువంటి సంకలనాలు, సంపుటాలు చాలా వస్తున్నాయి. ఈ ప్రాంతం నుంచి రచయితలు, కవులు చాలామంది ఉన్నారు. అది పెద్ద కంట్రిబ్యూషన్ అని నేను భావిస్తున్నాను.

**9. కరీంనగర్ జిల్లాలో ఆధునిక కవిత్వం రావడానికి నేపథ్యం ఏమిటి?**

ఏ ఆధునిక ఆలోచనలకైన, పరిణామాలకైన ఉద్యమాలు ఊపునిస్తాయి. కరీంనగర్ జిల్లాలో 80 ప్రాంతంలో నక్సలైట్ ఉద్యమం జరిగింది, 47 – 50 ప్రాంతాల్లో తెలంగాణ సాయుధ పోరాటం జరిగింది. ఒక ప్రశ్నించే భావజాలం, ఒక అడిగే భావజాలం, ఒక కొశ్చనింగ్ అథారిటీ అవన్నీ ఉద్యమాలు కలిపిస్తాయి. 80 తర్వాత వచ్చినటువంటి నక్సలైట్ రాజకీయ ఉద్యమం కూడా కరీంనగర్ ప్రజలను, విద్యార్థులు చాలా ప్రభావితం చేసింది. అంటే యదాతథా స్థితినుంచి ప్రశ్నించే స్థితిలోకి తీసుకుపోయిందంటే దానికి మూలమైనవాళ్లు కవలు, రచయితలు. అది ఆధునికమైన భావన. దాన్ని అందిపుచ్చుకున్నవే ఇవన్నీ. అందుకే ఆధునిక కవిత్వం అప్పటినుండి వచ్చింది. లేకుంటే మనం పద్యాలల్లనో, శ్లోకాలల్లనో ఉంటుంటుమి. శ్లోకాలనుంచి, పద్యాలనుంచి మనం ఇప్పుడు ఆధునిక కవిత్వం దాకా వచ్చినం. అందుకుంటున్నామంటే ప్రపంచ గమనాన్ని, సామాజిక ఉద్యమాలని అందుకోవడమే.

**10. కరీంనగర్ జిల్లాలో ఆధునిక కవిత్వం ఎప్పుడు మొదలైంది?**

సినారెనే. సినారె నుంచి కరీంనగర్ జిల్లాలో ఆధునిక కవిత్వం మొదలైంది.

**11. కరీంనగర్ జిల్లా సాహిత్యంలో కవిత్వం పాత్ర ఎంత?**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కవిత్వం రాసేవాళ్ళు చాలా మందే ఉన్నారు. గొప్ప పాత్రనే పోషిస్తుంది. వఝల శివకుమార్ గాని, జూకంటి జగన్నాథం గాని, నలిమెల భాస్కర్ గాని, నేను గాని, అంతకుముందున్నవాళ్ళు గాని నిత్యం కవిత్వ రూపంలో పత్రికల్లోగాని, సమావేశాల్లోగాని చలామణిలో ఉన్నారు.

**12. కరీంనగర్ జిల్లాలో ఏయే ఉద్యమాలకు, వాదాలకు, ధోరణులకు సంబంధించిన కవిత్వం కనిపిస్తుంది?**

కరీంనగర్ జిల్లాలో విప్లవ కవిత్వం వచ్చింది. మొదట్లో విప్లవానికి సంబంధించిన కవిత్వం బాగానే విరసం, జగిత్యాల, సిరిసిలా ఉద్యమాల, అలిశెట్టి ప్రేరణతో వచ్చింది. ఆ తర్వాత విప్లవ, విప్లవానంతర కవిత్వం వచ్చింది. దళితవాద కవిత్వం, దళితవాద దృక్పథాన్ని కరీంనగర్ జిల్లా ఎక్కువగా అందుకోలేదు. కరీంనగర్ జిల్లాకి చెందినటువంటి గుండెడప్పు కనకయ్య గారు దళిత కవిత్వాన్ని మొట్టమొదలు సెంట్రల్ యూనివర్సిటీ నుంచి పరిచయం చేసినటువంటి ఆయన. ఆయన తర్వాత దళిత కవిత్వం పేరెన్ని రాసినవాళ్ళు లేరు. దాని స్పృశిస్తూ రాసినవాళ్ళు ఉన్నరు తప్ప దళితవాద దృక్పథాలతో వస్తున్నది కాని పర్టికులర్‌గా రాలేదని చెప్పవచ్చు. స్త్రీవాద కవిత్వం కూడా కరీంనగర్ కేంద్రంగా బాగా చెప్పుకోదగ్గ పేర్లు దాదాపుగా లెవ్వనే చెప్పవచ్చు. కొందరు స్త్రీ దృక్పథంతో స్త్రీ సమస్యలమీద రాస్తున్నారుగాని తెలుగు నేల స్త్రీవాద దృక్పథం వచ్చినటువంటి కాలంలో స్త్రీవాద కవులెవరూ కరీంనగర్ నుంచి లేరు. మైనారిటీ కవులు కూడా ఎక్కువగా లేరు. మైనారిటీ వాదాన్ని ప్రతిఫలించే కవులు కూడా లేరు. కాని ఇప్పుడు రాసే కవులు మాత్రం దళితవాద, స్త్రీవాద, మైనారిటీ, తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వాన్ని మేలవించుకొని అన్ని అవగాహనలతోని రాస్తున్నటువంటి తరం ఉన్నది. ఇగ తెలంగాణ కవిత్వం, అస్తిత్వవాద కవిత్వమంటే అద్భుతంగా వచ్చింది. దాదాపు కరీంనగర్ నుంచి ఎన్నో సంకలనాలు వచ్చినై. అందరూ రాసిన వందల సంకలనాలు వచ్చినై. ఇది గొప్ప కాంట్రిబ్యూషన్ తెలంగాణకి.

**13. మీరు ఎలాంటి వస్తువును ఎన్నుకున్నారు?**

నా నేపథ్యమంతా పల్లెలు, పల్లెటూరి మనుషులు, రైతులు. నేనెక్కువ ఊరు నేపథ్యాన్ని, పల్లె నేపథ్యాన్ని ఎన్నుకున్న. నేను రాసే కవిత్వ భాష కూడా తెలంగాణ భాషలోనే రాస్త. తెలుగు భాష వేరు, తెలంగాణ భాష వేరని నేను చెప్పగలను. ఊరు మాట్లాడే భాష తెలంగాణ భాష. నా భాషగానీ, నా ఊరుగానీ, నా పల్లెలుగానీ, నా రైతులుగాని వీటిని అర్థమయ్యే భాషలో సరళంగా కవిత్వం రాస్త. సంఘటనలమీద రాస్త, సామాజిక రాజకీయాల మీద రాస్త, ప్రభుత్వాల ఆగడాల మీద రాస్త, సామాజికవిషయాల మీద ఎక్కువగా కవిత్వం అల్లుతా.

బహుజన దళిత జీవితాలను, పల్లె జీవితాలను విధ్వంసం చేస్తున్న ప్రపంచీకరణ వ్యతిరేకంగా రాస్త. అగ్ర రాజ్యాల వ్యతిరేకంగా రాస్త. అమెరికానైజేషన్‌కు వ్యతిరేకంగా రాస్త. అది నా వస్తువు.

**14. కరీంనగర్ జిల్లా కవిత్వానికి మాత్రమే ప్రత్యేకమైన, విలక్షణమైన అంశాలు ఏమైనా ఉన్నాయా?**

దీనికి పర్టికులర్‌గా చెప్పడానికి ఏముంటుంది. కరీంనగర్ జిల్లా నుంచి కవిత్వం ఎక్కువగా వస్తోంది. తెలంగాణ భాషలో ఎక్కువగా కవిత్వం వస్తోంది. ఇదే దీనియొక్క ప్రత్యేకత.

**15. ప్రస్తుత తెలంగాణ కవిత్వం ఎలా ఉంది? ఏ పాత్ర నిర్వహిస్తోంది? ఇంకెలా ఉండాలి?**

నిజంగా చెప్పాలనుకుంటే తెలంగాణ ఉద్యమం తర్వాత 2014 తర్వాత తెలంగాణ కవిత్వం కొంచెం సద్దుమాలిందని చెప్పవచ్చు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో కవిత్వం కాని అంశాల్ని కూడా కవిత్వంగా చెలామణిలో ఉన్నయి. నిజమైన కవిత్వానికి పరీక్ష కాలమే ఇది 2014, 2015, 2016 గాని. తెలంగాణ వచ్చిన తర్వాత. అయితే కవెప్పుడు ప్రజలవైపు ఉండాలి. ఒక దృక్పథాన్ని పట్టుకొని కవి పాలకుల వైపు ఉండడానికి లేదు. ఉండకూడదు. రాజ్యానికి అనుకూలమైన భావన కాకుండా ప్రజలవైపు ఉండాలనే భావన ఉండాలి. అది తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణ కవుల్లో కొంచెం కనబడుత లేదు. అంటే ఎందుకు కనబడుత లేదంటే ఉద్యమం చేసి మన రాజ్యాన్ని మనమే తెచ్చుకున్నం కదా అన్న దృక్పథంతో ఉండవచ్చు. కాని రాజ్యమెప్పుడూ రాజ్యంగానే ఉంటది. ప్రజలవైపే కవిత్వం ఉండాలె. ఆ భావన తెలంగాణలో వస్తావున్నది. వున్నది కొంతమంది రాస్తున్నవాళ్ళు ఉన్నరు. కాకపోతే పిడికెడు మందున్నరు వాళ్ళు.

**16. కరీంనగర్ జిల్లా కవిత్వానికి సంస్థలు, వ్యక్తులు ఏవిధంగా దోహదం చేశారు?**

కరీంనగర్ జిల్లాలో 2001లో తెలంగాణ రచయితల వేదిక ఆవిర్భవించిన తర్వాత అనేక వేదికలు నిర్వహించింది. దీని ప్రభావం కరీంనగర్ జిల్లాపై ఉన్నది. అంతకు ముందు 1986లో సంస్థల సమాఖ్యగా ఏర్పడ్డ సాహితీ గౌతమి ఒక సంస్థం ఉండె. ఆ సంస్థ కూడా కరీనగర్‌లో దాని ప్రభావం కూడా ఉండె. ఇటీవలి కాలం లోపట ఒక నాలుగు సంవత్సరాల నుంచి ఎన్నీల ముచ్చట్ల అనే కార్యక్రమం జరుగుతుంది. ఎన్నీల ముచ్చట్లంటే ప్రతి పౌర్ణమి

రోజు ఒక కవి ఇంటి డాబామీద కరీంనగర్ టౌన్‌లో ఉన్నటూవంటి కవులు కలుసుకొని ఎన్నీల ముచ్చట్లని కవిత్వం చెప్పుకుంటా ఉంటరు. ప్రతి పౌర్ణమి రోజు జరుగుతుంది. దాదాపు రాష్ట్రంలో, దేశంలో ఎక్కడా జరుగుతలేదు. ఇది యాభై నెలలుగా నిరంతరంగా సాగుతున్నది. ఆ కవిత్వమే ప్రతి నెల కవిత్వ సంకలనంగ వస్తా ఉన్నది. ఈ పున్నమికి వచ్చిన కవిత్వం వచ్చే పున్నమి నాటికి సంకలనంగా వస్తా ఉన్నది. అట్లా నలభై పుస్తకాలొచ్చినై. నెలకోటి సంకలనం రావడం కష్టం కావడంవల్ల మూడునెలలకోసారి సంకలనం వేయడం పనిగా పెట్టుకున్నది. ఈ కార్యక్రమాన్నంత తెలంగాణ రచయితల వేదిక, సాహితీ సోపతి అనే సంస్థ నిర్వహిస్తా ఉన్నది. సాహితీ సోపతి ఈ పుస్తకాలని ప్రచురిస్తుంది. సాహితీ గౌతమి ప్రభావం, సాహితీ సోపతి ప్రభావం, తెలంగాణ రచయితల వేదిక ప్రభావం, స్థానికంగా ఉన్నటువంటి నలిమె భాస్కర్ గారి ప్రభావం, నగునూరి శేఖర్, జూకంటి, తర్వాత నారాయణశర్మ, గాజోజు నాగభూషణం, బూర్ల వెంకటేశ్వర్లు, కూకట్ల తిరుపతి వీళ్ళందరి యొక్క ప్రభావంవల్ల ఇక్కడ ఎదుగుతున్న కవుల సంఖ్య ఎక్కువగా ఉన్నది. ఎన్నీల ముచ్చట్ల ద్వారా పదిహేను మంది అంతకుముందు పేరులేనివాళ్ళు కవులుగా ఎదిగి ప్రధాన స్రవంతిలో నిలబడ్డరు. వాళ్ళ పుస్తకాలు కూడా అచ్చేసుకున్నరు. అంటే ఈ ఎన్నీల ముచ్చట్ల ప్రభావం తెలుగు సాహిత్యంమీద, తెలంగాణ సాహిత్యం మీద, కరీంనగర్ సాహిత్యం మీద గొప్పగా ఉన్నదని నేను చెప్పదలుచుకున్నాను. ఎందుకంటే కవిత్వ వాతావరణం ఇక్కడ నెలకోసారి జరుగుతుంది ఇక్కడ.

1950 ప్రాంతంలో సారస్వత జ్యోతి అనే పత్రిక వచ్చింది. ఆ తర్వాత రచ్చబండ, జీవగడ్డ అనే పత్రికలు వచ్చాయి. సాహిత్యేతర పత్రికలైన సాహిత్యాన్ని ప్రోత్సహించాయి. తర్వాత అన్న, వాగు మొదలైన పత్రికలు చాలానే వచ్చాయి, వస్తున్నాయి.

★★★

# ఉపయుక్త గ్రంథసూచి


1. 2012. *జగిత్యాల జంగల్ మహల్ 1*. హైదరాబాద్: విప్లవ రచయితల సంఘం.
2. 2012. *జగిత్యాల జంగల్ మహల్ 2*. హైదరాబాద్: విప్లవ రచయితల సంఘం
3. 2017. *అక్షర బాటసారి సినారె*. హైదరాబాద్: నవతెలంగాణ ప్రింటర్స్.
4. ఆనంద్, వారాల. 1998. *మానేరు తీరం*. కరీంనగర్: ఫోయెట్రీ ఫోరం.
5. అప్పలస్వామి, పురిపండా. (పరి.). 1981. *సారస్వత వ్యాసములు (మొదటి సంపుటి*. హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
6. అఫ్సర్ (సంపా.). 2010. *అనేక (పదేళ్ళ కవిత్వం. 2000 – 2009)*. హైదరాబాద్: సారంగ బుక్స్.
7. అశోక్, జిందం. 2006. *మానేరు నానీలు*. సిరిసిల్ల: మానేరు రచయితల సంఘం.
8. అశోక్, జిందం (సంపా.). 2007. *పెద్ద గడియారం (కరీంనగర్ నానీలు)*. సిరిసిల్ల: మానేరు రచయితల సంఘం.
9. ఆంజనేయులు, కుందుర్తి. 1987. *కుందుర్తి వ్యాసాలు*. హైదరాబాద్: తెలుగు పరిశోధన ప్రచురణలు.
10. ఎం.ఎస్.ఆర్. 1992. *కాగడాగా వెలిగిన క్షణం*. హైదరాబాద్: విప్లవ రచయితల సంఘం.
11. ఎలనాగ. 2009. *పెన్మంటలు కోకిలమ్మ పదాలు*. హైదరాబాదు: రాగకృతి ప్రచురణలు.
12. ఎలనాగ. 2009. *వాగంకురాలు*. హైదరాబాదు: రాగకృతి ప్రచురణలు.
13. ఎలనాగ. 2010. *సజల నయనాల కోసం*. హైదరాబాదు: పాలపిట్ట బుక్స్.
14. ఎలనాగ. 2012. *అంతర్లయ*. హైదరాబాదు: పాలపిట్ట బుక్స్.
15. కనకయ్య, గుండెడప్పు. 2001. *వీణవంక*. హైదరాబాద్ విశ్వవిద్యాలయం: ఏ.పి. దళిత్ రీసర్చ్ సెంటర్.
16. కనకయ్య, గుండెడప్పు. (సంక.). 2001. *కడుపుమీద కొట్టకుండ్రి*. హైదరాబాద్ విశ్వవిద్యాలయం: ఏ.పి. దళిత్ రీసర్చ్ సెంటర్.
17. కమలాకరశర్మ, సాగి. (సంపా.). 2014. *కదంబం(తెలుగు సాహిత్య ప్రక్రియలు*

*రూపాలు).* హైదరాబాద్: మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక.

18. కాత్యాయని విద్మహే. 2012. *స్త్రీవాదం.* హైదరాబాద్: పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం.
19. కాత్యాయని విద్మహే. 2013. *ప్రాంతీయ చైతన్యం తెలంగాణ సాహిత్యం.* హైదరాబాద్:పాలపిట్ట బుక్స్.
20. కాశీం. 2015. *తెలంగాణ సాహిత్యం.* హైదరాబాద్: స్నేహ ప్రచురణలు.
21. కిషన్‌రావు, రేగులపాటి. 2010. *అక్షర సౌజన్యం.* కరీంనగర్: విజయలక్ష్మీ ప్రచురణలు.
22. కృష్ణ, వడ్డేపల్లి. 2012. *తెలుగు పాట.* హైదరాబాద్: పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం.
23. కృష్ణజయంతి, ఎస్వీ. 2001. *50 వసంతాల తెలుగు కవిత (వస్తువు-రూపం-శిల్పం).* హైదరాబాద్: జయంతి పబ్లికేషన్స్.
24. కృష్ణమూర్తి యాదవ్, టి. 1988. *తొక్కుడుబండ.* హైదరాబాద్: మంజు పబ్లికేషన్స్.
25. కృష్ణారావు, చెలికాని. 2010. *మార్క్సిస్టు మూల సూత్రాలు.* హైదరాబాద్: రామారావు మెమోరియల్ కమిటి.
26. గంగాధర్, ఆకుల. 1994. *దళిత భారతి.* జగిత్యాల: విశాల సాహిత్య అకాడమీ.
27. గఫూర్ శిక్షక్, సిరిసిల్ల. 2010. *చైతన్య వసంతం.* నిజామాబాద్: శిక్షక్ పబ్లికేషన్స్.
28. గుడిపాటి. 2002. *గ్లోబలైజేషన్ సాహిత్య దృక్పథం.* హైదరాబాద్: మొలక పబ్లికేషన్.
29. గుడిపాటి. 2006. *అభివ్యక్తి.* హైదరాబాద్: స్పృహ సాహితీ సంస్థ.
30. గోపాల్, మాడిశెట్టి. 2007. *చెలిమి చెలిమెలు.* కరీంనగర్: సమైక్య సాహితి ప్రచురణలు.
31. గోపి, ఎన్ (సంపా.). 2000. *డా. సి. నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం (ఐదవ సంపుటం)* హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.
32. గోపి, ఎన్ (సంపా.). 2000. *డా. సి. నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం (మూడవ సంపుటం).* హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.
33. గోపి, ఎన్ (సంపా.). 2000. *డా. సి. నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం (ఆరో సంపుటం).* హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.

34. గోపి, ఎన్ (సంపా.). 2000. *డా. సి. నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం (పదకొండవ సంపుటం).* హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.
35. గోపి, ఎన్ (సంపా.). 2000. *డా. సి. నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం (పదమూడవ సంపుటం).* హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.
36. గోపి, ఎన్ (సంపా.). 2000. *డా. సి. నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం (పదహారవ సంపుటం).* హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.
37. గోపి, ఎన్. (సంపా.). 2000. *డా. సి. నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం (పదిహేడవ సంపుటం).* హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.
38. చంద్రమౌళి, చొప్పకట్ల. 1971. *సమతా దీపాలు.* వేములవాడ: సాహితీ మిత్రబృందం.
39. చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం. 2002. *ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు – సందర్భాలు.* అనంతపురం: ఆర్. లక్ష్మి.
40. చంద్రిక, యం. 1987. *మినీకవిత్వం నిర్మాణ శిల్పం, భావాభివ్యక్తి.* హైదరాబాద్: రాఘవేంద్ర.
41. చిన్నయసూరి, పరవస్తు. 1983. *బాలవ్యాకరణం.* గుంటూరు: టెక్నికల్ పబ్లిషర్స్.
42. చెంచయ్య, వి. 2001. *సాహిత్య దృక్పథం.* నెల్లూరు: విరసం.
43. చెంచయ్య, వి. 2017. *సాహిత్యంలో వస్తు రూప శిల్పాలు.* తిరుపతి: అభినవ ప్రచురణలు.
44. చెన్నకేశవరెడ్డి, జి. 1988. *ఆధునికాంధ్ర గేయ కవిత్వం.* హైదరాబాద్: జయమిత్ర పబ్లికేషన్స్.
45. చెమన్. 1997. *ఎడారి స్వప్నం మధ్య.* అదిలాబాద్: గోదావరి సాహిత్య వేదిక.
46. చెమన్. 2001. *ఆవిష్కరించిన దృశ్యం.* అదిలాబాద్: గోదావరి సాహిత్య వేదిక.
47. జగన్నాథం, జూకంటి. 2013. *జూకంటి జగన్నాథం కవిత్వం – 1.* సిరిసిల్ల: నయనం ప్రచురణలు.
48. జగన్నాథం, జూకంటి. 2013. *జూకంటి జగన్నాథం కవిత్వం – 2.* సిరిసిల్ల: నయనం ప్రచురణలు.

49. జగన్నాథం, జూకంటి. 2013. *జూకంటి జగన్నాథం కవిత్వం – 3.* సిరిసిల్ల: నయనం ప్రచురణలు.
50. జయవీర్, కోటగిరి. 2012. *కరీంనగర్ జిల్లా నాటకరంగం – ఒక పరిశీలన.* హైదరాబాద్: తెలంగాణ రిసోర్స్ సెంటర్.
51. జింబో. 1996. *హాజిర్ హై.* హైదారాబాద్: పోయట్రీ ఫోరమ్.
52. జింబో. 2002. *రెండక్షరాలు.* హైదారాబాద్: పోయట్రీ ఫోరమ్.
53. జింబో. 2003. *లోపలి వర్షం.* హైదారాబాద్: పోయట్రీ ఫోరమ్.
54. తిరునగిరి. 2009. *మనిషి నా పద్యం.* హైదరాబాద్: భారతి ప్రచురణలు.
55. తిరుమల(సంపా.). 2000. *ఆధునిక కవిత అభిప్రాయ వేదిక.* హైదరాబాదు: కిన్నెర పబ్లికేషన్స్.
56. తిరుమలరావు, జయధీర్(సంపా.). 2013. *అలిశెట్టి ప్రభాకర్ కవిత.* జగిత్యాల: అలిశెట్టి మిత్రులు.
57. దక్షిణమూర్తి, ఇసుకపల్లి(సంపా.). 1988. *రజత రంజని.* హైదరాబాద్: రంజని రజతోత్సవ సంఘం.
58. దక్షిణామూర్తి, పోరంకి. 1998. *కథానిక స్వరూప స్వభావాలు.* హైదరాబాద్: శ్రీమతి వరలక్ష్మీ పబ్లిషర్స్.
59. దేవేందర్, అన్నవరం (సంపా.). 1997. *మేర మల్లేశం పోరాట పాటలు.* కరీంనగర్: మోయ తుమ్మెద బుక్ ట్రస్ట్ ప్రచురణ.
60. దేవేందర్, అన్నవరం(సంపా.). 2010. *వల్లుబండ.* కరీంనగర్: సాహితీ సోపతి.
61. దేవేందర్, అన్నవరం. 2001. *తొవ్వ.* కరీంనగర్: నూతన సాహితి.
62. దేవేందర్, అన్నవరం. 2003. *నడక.* కరీంనగర్: నూతన సాహితి.
63. దేవేందర్, అన్నవరం. 2005. *మంకమ్మతోట లేబర్ అడ్డా.* కరీంనగర్: నూతన సాహితి.
64. దేవేందర్, అన్నవరం. 2008. *బొడ్డుమల్లె చెట్టు.* కరీంనగర్: తెలంగాణ రచయితల వేదిక.
65. దేవేందర్, అన్నవరం. 2011. *పొద్దు పొడుపు.* కరీంనగర్: సాహితీ సోపతి.

66. దేవేందర్, అన్నవరం. 2014. *పొక్కిలి వాకిళ్ళ పులకరింత.* కరీంనగర్: సాహితీ సోపతి.
67. దేవేందర్, అన్నవరం. 2016. *ఇంటిదీపం.* కరీంనగర్: సాహితీ సోపతి.
68. దేవేందర్, అన్నవరం. 2016. *బువ్వకుండ.* కరీంనగర్: సాహితీ సోపతి.
69. ధర్మన్న, చరిగొండ. 2013. *చిత్ర భారతము.* హైదరాబాద్: పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం.
70. నరహరి, డింగరి. 2005. *వేళ్ళు.* కరీంనగర్: శారదా ప్రింటర్స్.
71. నళిని, ఎస్. ఎస్. 2009. *సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ.* హైదరాబాద్: నవోదయ బుక్ హౌస్.
72. నాగేంద్రశర్మ, సంకేపల్లి. 2004. *హరివిల్లు.* కరీంనగర్: సత్యనారాయణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్.
73. నాగేంద్రశర్మ, సంకేపల్లి. 2010. *తెలంగాణ వీణ.* కరీంనగర్: తెలంగాణ రచయితల వేదిక.
74. నాగేంద్రశర్మ, సంకేపల్లి. 2017. *ఎములాడ మూలవాగు.* కరీంనగర్: శరత్ సాహితీ కళాస్రవంతి.
75. నారాయణ, అల్లం. 1990. *జగిత్యాల పల్లె.* కృష్ణాజిల్లా యూనిట్: విప్లవ రచయితల సంఘం.
76. నారాయణ, ఆడెపు. 2004. *ఉదయ కిరణాలు.* సిరిసిల్ల: సిరిసిల్ల సాహితీ సమితి.
77. నారాయణరావు, వెల్చేరు. 2008. *తెలుగులో కవితా విప్లవాల స్వరూపం.* అమెరికా: తానా ప్రచురణలు.
78. నారాయణరెడ్డి, సి. 1982. *రెక్కలు.* రాజమండ్రి: వంశీ ఆర్ట్స్ థియేటర్.
79. నారాయణరెడ్డి, సి. 1983. *నడక నా తల్లి.* హైదరాబాద్: మనస్వినీ ప్రచురణ.
80. నారాయణరెడ్డి, సి. 2003. *రెక్కల సంతకాలు.* హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.
81. నారాయణరెడ్డి, సి. 2004. *జ్వాలగా జీవించాలని.* హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.
82. నారాయణరెడ్డి, సి. 2005. *కొనగోటి మీద జీవితం.* హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.
83. నారాయణరెడ్డి, సి. 2006. *కలిసి నడిచే కాలం.* హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.

84. నారాయణరెడ్డి, సి. 2007. *ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు*. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
85. నారాయణరెడ్డి, సి. 2007. *ఏవీ ఆ జీవనిధులు*. హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.
86. నారాయణరెడ్డి, సి. 2008. *సమూహం వైపు*. హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.
87. నారాయణరెడ్డి, సి. 2009. *మనిషిగా జీవించాలని*. హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.
88. నారాయణరెడ్డి, సి. 2010. *విశ్వం నాలో ఉన్నప్పుడు*. హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.
89. నారాయణరెడ్డి, సి. 2011. *నా చూపు రేపటి వైపు*. హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.
90. నారాయణరెడ్డి, సి. 2012. *విశ్వంభర*. హైదరాబాదు: వరేణ్య క్రియేషన్స్.
91. నారాయణరెడ్డి, సి.(ప్ర.సంపా.). 2013. *తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం*. హైదరాబాద్: తెలంగాణ సారస్వత పరిషత్తు.
92. నారాయణశర్మ, ఎం. 2011. *అస్తిత్వ పుష్పాలు*. కరీంనగర్: సాహితీ సోపతి.
93. నారాయణశర్మ, ఎం. 2014. *ఈనాటి కవిత*. హైదరాబాద్: కవి సంగమం బుక్స్.
94. నారాయణశర్మ, ఎం. 2016. *ఊరి దుఃఖం*. రాజన్న సిరిసిల్ల: మారసం.
95. నారాయణశర్మ, ఎం. 2016. *వ్యక్తీకరణ*. రాజన్న సిరిసిల్ల: మారసం.
96. నారాయణశర్మ, ఎం. 2016. *సాధారణ*. రాజన్న సిరిసిల్ల: పత్తిపాక గ్రాఫిక్స్.
97. నిత్యానందరావు, వెలుదండ. 1994. *తెలుగు సాహిత్యంలో పేరడీ*. హైదరాబాద్: పద్మావతి ఆర్ట్స్ ప్రింటర్స్.
98. నూతన్. 1993. *వెదురు వనాల గానం*. హైదరాబాద్: విప్లవ రచయితల సంఘం.
99. పరమాత్మ, ఎ. 2017. *తెలంగాణ మాండలిక కవిత్వం*. హైదరాబాద్: వరలక్ష్మి పబ్లికేషన్స్.
100. పార్థసారథి, సి. (ప్ర. సంపా.). 2006. *మా 'నేటి' కరీంనగర్*. కరీంనగర్: శాతవాహన కళోత్సవ కమిటి.
101. పిళ్ళే, ఎస్.కె. (సంపా.). 1983. *జనహిత*. కరీంనగర్: జనసాహిత్య సమితి.
102. పెరుమాళ్లు, వేముల. 2011. *తెలంగాణ జాతీయాలు*. సికింద్రాబాద్: విరాట్ పబ్లికేషన్స్.

103. ప్రతాపరెడ్డి, కాసుల (సంపా.). 2013. *తెలంగాణ తోవలు*. హైదరాబాద్: తెలంగాణ సాంస్కృతిక వేదిక.
104. ప్రతాపరెడ్డి, కాసుల. 2007. *తెలంగాణ సందర్భాలు*. కోదాడ: స్పృహ సాహితీ సంస్థ.
105. ప్రతాపరెడ్డి, కాసుల. 2008. *ఇరుసు (తెలంగాణ సాహిత్య వ్యాసాలు)*. ఆలగడప: మట్టి ముద్రణలు.
106. ప్రతాపరెడ్డి, కాసుల. 2008. *ఇరుసు*. నల్లగొండ: మట్టి ముద్రణలు.
107. ప్రతాపరెడ్డి, కాసుల. 2015. *తెలంగాణ సాహిత్యోద్యమాలు*. హైదరాబాద్: తెలంగాణ ప్రచురణలు.
108. ప్రభాకర్, వేముల. 2009. *బతుకుతొవ్వ*. సికింద్రాబాద్: విరాట్ పబ్లికేషన్స్.
109. బాపురెడ్డి, జె. 1969. *బాపురెడ్డి పద్యకావ్యాలు*. హైదరాబాదు: సుఖేలా ప్రచురణ.
110. బాపురెడ్డి, జె. 1970. *బాపురెడ్డి గేయాలు*. హైదరాబాదు: సుఖేలా ప్రచురణ.
111. బాపురెడ్డి, జె. 1986. *బాపురెడ్డి పద్యకావ్యాలు*. హైదరాబాదు: జయం ప్రచురణలు.
112. బాపురెడ్డి, జె. 2001. *అక్షరానుభూతులు*. హైదరాబాద్: జూబిలీ పబ్లికేషన్స్.
113. బాపురెడ్డి, జె. 2001. *జీవన శ్రుతులు*. హైదరాబాద్: జూబిలీ పబ్లికేషన్స్.
114. బాపురెడ్డి, జె. 2003. *నవగీత నాట్యం*. హైదరాబాద్: జూబిలీ పబ్లికేషన్స్.
115. బాపురెడ్డి, జె. 2003. *హృదయ పద్యం*. హైదరాబాద్: జూబిలీ పబ్లికేషన్స్.
116. బాపురెడ్డి, జె. 2006. *లోకాలోకనం(దీర్ఘకవిత)*. హైదరాబాద్: జూబిలీ పబ్లికేషన్స్.
117. బాపురెడ్డి, జె. 2007. *ఆధునిక తెలుగు కవిత్వం – తీరుతెన్నులు* హైదరాబాద్: జూబిలీ పబ్లికేషన్స్.
118. బాపురెడ్డి, జె. 2010. *భావ చిత్రాలు*. హైదరాబాద్: జూబిలీ పబ్లికేషన్స్.
119. బాలగోపాల్, కె. 2016. *కొన్ని తెలంగాణ వ్యాసాలు*. ఆలగడప: మట్టి ముద్రణలు.
120. బాలగోపాల్, కె. 2017. *సరళీకరణ – విధ్వంసం*. హైదరాబాద్: మానవ హక్కుల వేదిక ప్రచురణలు.
121. బాలయ్య, పొన్నాల. 2008. *ఎగిలివారంగ*. కరీంనగర్: మోయుతుమ్మెద ప్రచురణలు.
122. బాలయ్య, పొన్నాల. 2011. *దందెడ*. మెదక్: మంజీరా రచయితల సంఘం.

123. బాల్‌రెడ్డి, సంపతి. 2000. *వచన కవిత్వ కథ*. హైదరాబాద్: శ్రీ బాలాజీ ఆర్ట్స్ ప్రింటర్స్.

124. భాస్కరం, కల్లూరి. 2006. *కాలికస్పృహ*. కోదాడ: స్పృహ సాహితీ సంస్థ.

125. భాస్కర్, నలిమెల. 2008. *సుద్దముక్క*. కరీంనగర్: తెలంగాణ రచయితల వేదిక.

126. భాస్కర్, నలిమెల (గౌ.సంపా.). 2012. *కరీంనగర్ కవిత 2011*. కరీంనగర్: సాహితి సోపతి.

127. భాస్కర్, నలిమెల (గౌ. సంపా.). 2013. *కరీంనగర్ కవిత 2012*. కరీంనగర్: సాహితి సోపతి.

128. మధుసూదనరావు, త్రిపురనేని. 1997. *సాహిత్యంలో వస్తు శిల్పాలు*. హైదరాబాద్: పర్‌స్పెక్టివ్ ప్రచురణలు.

129. మందేశ్వరరావు, వడలి. 2002. *సాహిత్య ప్రస్థానం – కొన్ని మజిలీలు*. మైసూర్: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వెజెస్.

130. మలయశ్రీ. 1997. *కరీంనగర్ జిల్లా సాహిత్య చరిత్ర (క్రీ.శ.0950 – 1995)*. కరీంనగర్: సత్యార్థి ప్రచురణలు.

131. మలయశ్రీ. 1978. *పేదల పాటలు*. కరీంనగర్: స్వంత ప్రచురణలు.

132. మలయశ్రీ. 1982. *కొరడాదెబ్బలు (మినీ కవితలు)*. నిమిలికొండ: విజ్ఞాన ప్రచారిణి గ్రంథమాల.

133. మలయశ్రీ. 2011. *స్వీట్ బుల్లెట్లు – హాట్ చాక్లెట్లు!(నానీలు, మినీకవితలు)*. కరీనగర్: నవ్య సాహిత్య పరిషత్.

134. మల్లయ్య (సంపా.). 2007. *నానీల నాన్నపై నానీలు*. కరీంనగర్: అను ప్రచురణలు.

135. మల్లయ్య. 2006. *హృదయఘోష*. హైదరాబాద్: ఓం సాయి గ్రాఫిక్స్.

136. మల్లారెడ్డి, తూర్పు (ప్ర. సంపా.). 2007. *తెలంగాణ సాహిత్యం – జీవిత చిత్రణం*. నల్లగొండ: శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళాశాల (తెలుగుశాఖ).

137. మల్లేశం, చిల్ల. 2014. *మినీ బుల్లెట్స్*. కరీంనగర్: సత్యనారాయణ ప్రింటింగ్ ప్రెస్.

138. ముత్యం, కె (ప్ర.సంపా.). 2011. *ఉత్తర తెలంగాణ సంస్కృతి చరిత్ర*. కరీంనగర్: శాతవాహన విశ్వవిద్యాలయం తెలుగు విభాగం.

139. మురళీకృష్ణ, వేముగంటి (సంపా.). 2012. *మునుం (తెలంగాణ కవితా పుష్కరం 2000 – 2011).* హైదరాబాద్: తెలంగాణ సాహిత్య సమాఖ్య.
140. మోహన్, పత్తిపాక(సంపా). 2007. *నానీల వీఠికా ప్రస్థానం.* సిరిసిల్ల: మానేరు రచయితల సంఘం.
141. మోహన్, పత్తిపాక. 1999. *బంతిపూలు.* సిరిసిల్ల: మానేరు రచయితల సంఘం.
142. మోహన్, పత్తిపాక. 2001. *తెగినపోగు.* సిరిసిల్ల: మానేరు రచయితల సంఘం.
143. మోహన్, పత్తిపాక. 2004. *పచ్చబొట్టు.* సిరిసిల్ల: మానేరు రచయితల సంఘం.
144. మోహన్, పత్తిపాక. 2009. *కఫన్ (చేనేత నానీలు).* సిరిసిల్ల: మారసం.
145. యాకూబ్. 2017. *కవిత్వం సృజనానుభవం.* హైదరాబాద్: అనుపమ ప్రింటర్స్.
146. యాకూబ్. 2018. *ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ.* హైదరాబాద్: నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్.
147. రంగనాథాచార్యులు, కె.కె (సంపా.). 1982. *ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు.* హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు.
148. రంగారావు, రావి. 2006. *వచన కవితోదయం.* మచిలీపట్నం: సాహితీ మిత్రులు.
149. రఘు, ఎస్ (సంపా.). 2006. *నానీలు – సంవీక్షణం.* ఖమ్మం: మనస్వి ప్రచురణలు.
150. రమణయ్య, జైశెట్టి. 2003. *కరీంనగర్ జిల్లా చరిత్ర – సంస్కృతి.* జగిత్యాల: జైశెట్టి వారి ప్రచురణ.
151. రమేశ్, సుంకర. 2008. *తెలంగాణ కవిత 2007.* నల్లగొండ: మట్టి ముద్రణలు.
152. రమేశ్, సుంకర. 2009. *తెలంగాణ కవిత 2008.* నల్లగొండ: మట్టి ముద్రణలు.
153. రమేశ్, సుంకర. 2010. *తెలంగాణ కవిత 2009.* నల్లగొండ: మట్టి ముద్రణలు.
154. రవి, వీరెల్లి. 2017. *కుందాపన.* యూఎస్ఏ: వాకిలి.
155. రవీందర్, నాగిళ్ళ. 2005. *బతుకు బాటలో....* హైదరాబాద్: విజీవిస్ గ్రాఫిక్స్.
156. రవీందర్, పిట్టల (సంపా.). 2007. *మట్టి పొరల్లో.* హైదరాబాద్: తెలంగాణ విద్యావంతుల వేదిక.
157. రవీందర్, సందినేని. 2001. *కొత్తలోకం.* కరీంనగర్: కీ.శే. ఎస్.కె.పిళ్ళె స్మారక ప్రచురణలు.
158. రవీంద్ర, పి.ఎస్ (సంపా.). 1982. *లయ.* వేములవాడ: పోయట్రీ ఫోరమ్.

159. రవీంద్ర, సంగెవేని. 2005. *అన్వేషణ*. ముంబయి: స్వామి వివేకనంద ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్.
160. రవీంద్ర, సంగెవేని. 2006. *వర్లి*. ముంబయి: స్వామి వివేకనంద ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్.
161. రవీంద్ర, సంగెవేని. 2007. *వలస పత్రం*. ముంబయి: ముంబయి తెలుగు సాహిత్య వేదిక.
162. రాజు, ఎస్.ఎస్ (సంపా.). 2006. *వచన కవిత రూప పరిశీలన*. హైదరాబాదు: శ్రీ సత్య ప్రచురణలు.
163. రాణీప్రసాద్, కందేపి. 2006. *నందివర్ధనాలు*. సిరిసిల్ల: మానేరు రచయితల సంఘం.
164. రాధాకృష్ణ, బూదరాజు (సంపా.). 2012. *తెలుగు మాండలికాలు కరీంనగర్ జిల్లా*. హైదరాబాద్: తెలుగు అకాడమి.
165. రామకృష్ణ, మిరియాల. 1980. *శ్రీశ్రీ కవిత్వం వస్తువు – సంవిధానం*. కాకినాడ: శ్రీ దుర్గ ప్రెస్.
166. రామమోహనరావు, అద్దేపల్లి. 1998. *అద్దేపల్లి సాహిత్య వ్యాసాలు*. విజయవాడ: పల్లవి పబ్లికేషన్స్.
167. రామమోహనరావు, అద్దేపల్లి. 2014. *రుబాయీ ఉపలబ్ధి*. హైదరాబాద్: సూర్య ప్రచురణలు.
168. రామయ్య, నడిమెట్ల. 1970. *జై జవాన్ జై కిషన్ (గేయ సంపుటి)*. కరీంనగర్: స్వంత ప్రచురణలు.
169. రామయ్య, చుక్కా. 2006. *ప్రపంచీకరణ – విద్య*. హైదరాబాద్: రామయ్య విద్యాపీఠం.
170. రామస్వామి, నాగరాజు. 2015. *గూటికి చేరిన పాట*. హైదరాబాద్: తిరురంగ ప్రచురణ.
171. రామారావు, చేకూరి. 1991. *చేరాతలు*. హైదరాబాద్: చరిత్ర ప్రచురణలు.
172. రామారావు, చేకూరి. 1997. *ముత్యాల సరాల ముచ్చట్లు*. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

173. రామారావు, చేకూరి. 2001. *రింఛోళి*. హైదరాబాద్: చేరా పబ్లిషర్స్.

174. రామారావు, చేకూరి. 2002. *వచన రచన తత్త్వాన్వేషణ*. రాజమండ్రి: శ్రీరత్న ప్రింటర్స్.

175. రాములు, బి. ఎస్ (కూర్పు, ముందుమాట). 1997. *కె. రామలక్ష్మణ్ దళిత పాటలు*. జగిత్యాల: విశాల సాహిత్య అకాడమీ ప్రచురణ.

176. రామ్మోహన్, సొదుం. 1999. *సాహిత్యంలో శిల్పం*. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

177. రూప్‌కుమార్, డబ్బీకార్. 2009. *హైకూ సారస్వతం*. హైదరాబాద్: పాలపిట్ట బుక్స్.

178. రెసారె. 1988. *రక్త చలన సంగీతం*. హైదరాబాద్: విప్లవ రచయితల సంఘం.

179. లక్ష్మణచక్రవర్తి, సి.హెచ్ (సంపా.). 2016. *తెలుగు సాహిత్య విమర్శ దర్శనం*. హైదరాబాద్: పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం.

180. లక్ష్మణరావు, జి. 2003. *ముగ్గు*. కరీంనగర్: సమతా ప్రచురణలు.

181. లక్ష్మణ్, ఆడెపు. 2007. *రాత్ పైలీ... దివస్ పైలీ....* సిరిసిల్ల: మానేరు రచయితల సంఘం.

182. లక్ష్మయ్య, దాస్యం (సంపా.). 2006. *ఆకాశంలో సగం*. కరీంనగర్: ఉదయ సాహితి.

183. లక్ష్మీకాంతం, పింగళి. 1995. *సాహిత్య శిల్ప సమీక్ష*. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

184. లక్ష్మీనరసయ్య, జి. 2015. *కవిత్వ నిర్మాణ పద్ధతులు*. హైదరాబాదు: ప్రతీక ప్రచురణలు.

185. లక్ష్మీనరసయ్య, జి. 2015. *సామాజిక కళా విమర్శ*. హైదరాబాదు: ప్రతీక ప్రచురణలు.

186. లక్ష్మీనారాయణ, సబ్బని. 2001. *మన ప్రస్థానం (పేరడీలు)*. కరీంనగర్: శరత్ సాహితీ కళా స్రవంతి.

187. లక్ష్మీనారాయణ, సబ్బని. 2010. *తెలంగాణ ఒక సత్యం*. కరీంనగర్: తెలంగాణ సాహిత్య వేదిక.

188. లక్ష్మీనారాయణ, సబ్బని. 2010. *తెలంగాణ నానోలు*. కరీంనగర్: తెలంగాణ సాహిత్య వేదిక.
189. లక్ష్మీనారాయణ, సబ్బని. 2011. *తెలంగాణ రెక్కలు*. కరీంనగర్: తెలంగాణ సాహిత్య వేదిక.
190. లక్ష్మీనారాయణ, సబ్బని. 2011. *తెలంగాణ హైకులు*. కరీంనగర్: తెలంగాణ సాహిత్య వేదిక.
191. లక్ష్మీనారాయణ, సబ్బని. 2015. *తెలంగాణ మార్చ్*. కరీంనగర్: తెలంగాణ సాహిత్య వేదిక.
192. లక్ష్మీనారాయణ, సబ్బని. 2015. *తెలంగాణ వైభవ గీతములు*. కరీంనగర్: తెలంగాణ సాహిత్య వేదిక.
193. లక్ష్మీనారాయణ, సబ్బని. 2016. *సాహిత్య నానోలు*. కరీంనగర్: శరత్ సాహితీ కళాస్రవంతి.
194. లక్ష్మీనారాయణ, సబ్బని. 2017. *అక్షరాణువులు*. కరీంనగర్: శరత్ సాహితీ కళాస్రవంతి.
195. వసునందన్, రావికంటి. 2004. *కలం కదిలితే....* హైదరాబాద్: విప్ల కంప్యూటర్ సర్వీస్.
196. వసునందన్, రావికంటి. 2004. *మనస్సు*. హైదరాబాద్: విప్ల కంప్యూటర్ సర్వీస్.
197. వసునందన్, రావికంటి. 2004. *మెరుపు మెరిస్తే....* హైదరాబాద్: విప్ల కంప్యూటర్ సర్వీస్.
198. వసునందన్, రావికంటి. 2005. *వానకురిస్తే....* హైదరాబాద్: విప్ల కంప్యూటర్ సర్వీస్.
199. వసునందన్, రావికంటి. 2006. *నేల నవ్వితే....* హైదరాబాద్: విప్ల కంప్యూటర్ సర్వీస్.
200. వసునందన్, రావికంటి. 2006. *పిల్లలమర్రి*. హైదరాబాద్: విప్ల కంప్యూటర్ సర్వీస్.
201. వసునందన్, రావికంటి. 2006. *మనసు నిండితే....* హైదరాబాద్: విప్ల కంప్యూటర్ సర్వీస్.

202. వసునందన్, రావికంటి. 2006. *సింగిణీ మొలిస్తే....* హైదరాబాద్: జగ్గమాంబ ప్రచురణలు.
203. వసునందన్, రావికంటి. 2007. *మట్టిముద్దలు.* హైదరాబాద్: విప్ల కంప్యూటర్ సర్వీస్.
204. వసునందన్, రావికంటి. 2008. *నెమలి ఆడితే....* హైదరాబాద్: విప్ల కంప్యూటర్ సర్వీస్.
205. వసునంద, రావికంటి. 2009. *అడుగడుగునా....* హైదరాబాద్: జగ్గమాంబ ప్రచురణలు.
206. విజయ్ కుమార్, కోడూరి. 2010. *అనంతరం.* హైదరాబాద్: పాలపిట్ట బుక్స్.
207. విజయలక్ష్మి, రేగులపాటి. 2007. *మొగిలిపూలు (నానీలు).* కరీంనగర్: విజయలక్ష్మి ప్రచురణలు.
208. వినాయక్, సువర్ణ. (సంపా.). 2017. *తెలంగాణ వైభవం పరిచయ దీపిక.* హైదరాబాదు: రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థ.
209. వినోదిని, ఎమ్.ఎమ్. 2011. *స్త్రీవాద కవిత్వం (భాష, వస్తు, రూప నవనీత).* హైదరాబాద్: చరిత ఇంప్రెషన్స్.
210. విప్లవ్‌దత్ శుక్లా. 1996. *చెకుముకిరాళ్ళు.* కరీంనగర్: స్వంత ప్రచురణలు.
211. వీరయ్య, అల్లం. 1981. *అల్లం వీరయ్య పాటలు.* హైదరాబాద్: జననాట్యమండలి యుగ ప్రచురణలు.
212. వెంకటేశ్వర్లు, బూర్ల. 2007. *రంగుల విల్లు (నానీలు).* కరీంనగర్: వేద పబ్లికేషన్స్.
213. వెంకటేశ్వర్లు, బూర్ల. 2007. *వాకిలి.* కరీంనగర్: వేద పబ్లికేషన్స్.
214. వెంకటేశ్వర్లు, బూర్ల. 2017. *రెండు పక్షులూ..ఒక జీవితం.* కరీంనగర్: సాహితీ సోపతి.
215. వెంకటేశ్వర్లు, లంకా. 2005. *ఆధునిక కవిత్వంలో భావచిత్రాలు – ప్రతీకలు.*
216. వెంకటరాజం, జక్కని. 1977. *అర్ధరాత్రి సూర్యుడు.* సిరిసిల్ల: యువసాహితీ సమితి.
217. వేంకటరాజము, అందె. 1993. *మానసవీణ.* కోరుట్ల: మహేశ్వరీ గ్రంథ మండలి.
218. వేంకటేశం, బొద్దుల (తె. అను.). 2012. *సాహిత్య – విజ్ఞానం.* కరీంనగర్: సరోజా ప్రచురణలు.

219. వేణుగోపాల్, ఎన్. 2010. *లేచినిలిచిన తెలంగాణ*. హైదరాబాద్: స్వేచ్ఛా సాహితి.

220. వేణుగోపాల్, ఎన్. 2011. *రాబందు వాలిన నేల*. హైదరాబాద్: స్వేచ్ఛా సాహితి.

221. వేదాంతాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల. 1964. *వనమాల*. ముస్తాబాద్: నవోదయ సమితి.

222. శరత్ జ్యోత్స్నారాణి, ఎస్. 2003. *స్వాతంత్ర్యానంతరం తెలుగు కవిత వస్తువు, రూపం శిల్పం*. హైదరాబాద్: జ్యోత్స్న కళాపీఠ ప్రచురణలు.

223. శారద – లక్ష్మీనారాయణ, సబ్బని. 2015. *దంపతి నానీలు*. కరీంనగర్: శరత్ సాహితీ కళాస్రవంతి.

224. శారద, సబ్బని. 2014. *తెలంగాణ బతుకమ్మ పాట*. కరీంనగర్: తెలంగాణ సాహిత్య వేదిక.

225. శిఖామణి. 2006. *సమాంతర*. హైదరాబాద్: నందిని పబ్లికేషన్స్.

226. శివకుమార్, వఝల. 1999. *పాలకంకుల కల*. హైదరాబాద్: పోయెట్రీ ఫోరమ్.

227. శివకుమార్, వఝల. 2004. *దాఖలా*. హైదరాబాద్: పోయెట్రీ ఫోరమ్.

228. శివప్రసాద్, సంకేపల్లి. 2002. *అష్టమ సముద్రం*. వేములవాడ: పోయెట్రీ ఫోరమ్.

229. శివరామకృష్ణ, పెన్నా. 2005. *ఎరుక*. కోదాడ: చుక్కా రామయ్య విద్యాపీఠం.

230. శివరామకృష్ణ, పెన్నా. 2008. *సి.నా.రె. విశ్వంభరలో అర్థయుక్తి*. హైదరాబాద్: స్పృహ సాహితీ సంస్థ.

231. శివరామకృష్ణ, పెన్నా. 2009. *ఆవిష్కరణ*. హైదరాబాద్: రామయ్య విద్యాపీఠం.

232. శివరామకృష్ణ, పెన్నా. 2009. *దేశదేశాల హైకూ*. హైదరాబాద్: పాలపిట్ట బుక్స్.

233. శివశంకర్, పాపినేని. 1996. *సాహిత్యం మౌలిక భావనలు*. గుంటూరు: పాపినేని ప్రచురణలు.

234. శివశంకర్, పాపినేని (సంపా.). 2006. *కవిత – 2005*. విజయవాడ: సాహితీ మిత్రులు.

235. శివశంకర్, పాపినేని (సంపా.). 2007. *కవిత – 2006*. విజయవాడ: సాహితీ మిత్రులు.

236. శివశంకర్, పాపినేని (సంపా.). 2008. *కవిత – 2007*. విజయవాడ: సాహితీ మిత్రులు.

237. శివశంకర్, పాపినేని. 2008. *నిశాంత.* హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
238. శేఖర్, నగునూరి (సంపా.). 2013. *వస్త్రగాలం.* కరీంనగర్: సాహితి సోపతి.
239. శేషప్ప. 1984. *నరసింహ శతకము.* మద్రాసు: బాలసరస్వతీ బుక్ డిపో.
240. శోభా గాంధి. 2010. *ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల చరిత్ర.* హైదరాబాద్: కర్షక్ ఆర్ట్స్ ప్రింటర్స్.
241. శోభారాణి, కొలిపాక. 2004. *చలనం.* సిరిసిల్ల: నయనం ప్రచురణలు.
242. శ్రీకాంతశర్మ, ఇంద్రగంటి. 2007. *ఆలోచన.* సికింద్రాబాద్: మై బుక్స్.
243. శ్రీధర్, వెల్దండి. 2017. *ప్రత్యేక తెలంగాణా ఉద్యమ కవిత్వం.* హైదరాబాద్: తెలంగాణ సాహిత్య అకాడమీ.
244. శ్రీనివాసాచార్య, తిరుమల. 1988. *తెలుగు రుబాయీలు (ముక్తక మంజరి).* హైదరాబాద్: యువభారతి.
245. శ్రీనివాసాచార్య, తిరుమల. 1988. *తెలుగులో గేయనాటికలు.* హైదరాబాద్: యువభారతి.
246. శ్రీనివాస్, కె. 2015. *తెలంగాణ సాహిత్య వికాసం.* హైదరాబాద్: తెలంగాణ ప్రచురణలు.
247. శ్రీహరి, రవ్వా (సంపా.). 2016. *తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర.* హైదరాబాద్: తెలుగు అకాడమి.
248. సత్యం, ఎన్నం. 1996. *సుదీర్ఘ జ్ఞాపకం (దీర్ఘకవిత).* సిరిసిల్ల: నయనం ప్రచురణలు.
249. సత్యం, ఎన్నం. 1997. *శిలాఘోష (దీర్ఘకవిత).* సిరిసిల్ల: స్వంత ప్రచురణలు.
250. సత్యనారాయణ, వేముల (సంపా.). 1977. *కిరణాలు.* కరీంనగర్: నటరాజ కళానికేతన్.
251. సత్యనారాయణరాజు, గర్రెపల్లి. 1956. *కలస్వనము.* హైదరాబాద్: తెలంగాణా రచయితల సంఘం.
252. సింగన, మడికి. 1970. *సకలనీతిసమ్మతము.* హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
253. సింహాద్రి, యస్. 2000. *తల్లడిల్లుతున్న తెలంగాణ.* హైదరాబాద్: సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్.

254. సిధారెడ్డి, నందిని. 2007. *ఇగురం*. హైదరాబాద్: తెలంగాణ రచయితల వేదిక.
255. సిధారెడ్డి, నందిని. 2011. *ఆవర్తనం*. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
256. సీతారాం. 2007. *అదేపుట*. ఖమ్మం: పాజిటివ్ పబ్లికేషన్స్.
257. సీతారామయ్య, కన్నెగంటి (అను.). 2003. *గ్లోబలైజేషన్*. హైదరాబాద్: రావిపాటి ట్రస్ట్.
258. సుజాత, నాంపల్లి. 2009. *మట్టి నా ఆలాపన*. హైదరాబాద్: వంశీ చైతన్య ప్రచురణలు.
259. సుజాత, నాంపల్లి. 2015. *మట్టి నానీలు*. హైదరాబాద్: వంశీ చైతన్య ప్రచురణలు.
260. సుజాతారెడ్డి, ముదిగంటి (సంపా.). 2005. *ముద్దెర*. హైద్రాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్.
261. సుధ, సూరంపుడి. 1987. *జరుక్‌శాస్త్రి పేరడీలు – ఒక పరిశీలన*. హైదరాబాద్: హైదరాబాద్ ప్రింటింగ్ ప్రెస్.
262. సునీత, సి.హెచ్. 2014. *నానీల అలలు*. కోరుట్ల: శ్రీ లక్ష్మీ ఆఫ్‌సెట్, ప్రింటర్స్.
263. సుబ్బారావు, అన్నంరాజు. 2014. *పాశ్చాత్య సాహిత్య విమర్శనారీతులు*. హైదరాబాదు: తెలుగు అకాడమి.
264. సుబ్రహ్మణ్యం, జి.వి. 2005. *సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు*. హైదరాబాద్: తెలుగు అకాడమి.
265. సుబ్రహ్మణ్యం, పి.యస్. 2007. *ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు*. హైదరాబాద్: పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం.
266. సుమాలినీరెడ్డి, నంద్యాల (ప్ర.సంపా.). 2013. *జై కిషన్ (అభినందన సంచిక)*. హైదరాబాద్: దక్కన్ ఆర్కియలాజికల్ సెంటర్.
267. సూర్య, వొడ్నాల. 2003. *వొడ్నాల సూర్య కవితలు*. హైద్రాబాద్: విశాల సాహిత్య అకాడమి.
268. సూర్యసాగర్, బి. 1995. *సాహిత్యం – సౌందర్యం*. గుంటూరు: జనసాహితి.
269. సోమసుందర్, అవంత్స. 2001. *చరమదశాబ్దిలో కవితారసాబ్ధి (వ్యాసాలు)*. పిఠాపురం: స్వంత ప్రచురణలు
270. హిమజ. 2006. *ఆకాశమల్లె*. హైదరాబాద్: లయ ప్రచురణలు.

## పరిశోధన గ్రంథాలు

271. ఉదయభాను, దానక్క. 2011. *తెలంగాణ కవిత్వం – మౌలిక భావనలు*. అముద్రిత సిద్ధాంత వ్యాసం. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
272. మహేశ్వరం, వి. 2009. *పాలమూరుగోస – ఒక పరిశీలన*. అముద్రిత సిద్ధాంత వ్యాసం. హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
273. వెంకటేశ్వర్లు, జి. 1995. *అలిశెట్టి ప్రభాకర్ 'సిటీలైఫ్' ఒక పరిశీలన*. ఉస్మానియా విశ్వవిద్యాలయం. అముద్రిత పరిశోధన వ్యాసం.
274. శివప్రసాద్, సంకేపల్లి. 2006. *కరీంనగర్ జిల్లా ఆధునిక కవిత్వం – అనుశీలన*. అముద్రిత సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
275. సురేష్, తన్నీరు. 2010. *ఆధునిక తెలుగు లఘు కవితలు నిర్మాణం, వస్తువు (మినీ కవిత, హైకూ, నానీ: కాలం 2000-2006 సం.)*. హైదరాబాద్ విశ్వవిద్యాలయం: అముద్రిత సిద్ధాంత గ్రంథం.

## జర్నల్స్ / పత్రికలు

276. ఎల్లారెడ్డి, కర్ర (సంపా.). 2009. *మన తెలంగాణ (కరీంనగర్ సంచిక)*. హైదరాబాద్: ఆకృతి ఆఫ్ సెట్ ప్రింటర్స్.
277. చెంచయ్య, వి. 1991. *అరుణతార (డిసెంబర్)*. కావలి: విప్లవ రచయితల సంఘం.
278. చేరా. *నవ తెలంగాణ*. 19-12-2016
279. దివికుమార్. *ఆంధ్రజ్యోతి*. 04-03-2013
280. శివశంకర్, పాపినేని. 1991. *అరుణతార (మే)*. కావలి: విప్లవ రచయితల సంఘం.
280. సుబ్రహ్మణ్యం, జి.వి. *ఆంధ్రప్రభ*. 1985, జనవరి.1.

## నిఘంటువులు

281. బ్రౌణ్, సి.పి. 1987. *బ్రౌణ్య ఇంగ్లీషు తెలుగు నిఘంటువు*. న్యూ ఢిల్లీ: ఏషియన్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్.

282. రామయ్య పంతులు, జయంతి. 1936. *సూర్యరాయాంధ్ర నిఘంటువు (మొదటి సంపుటము).* హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం.
283. లక్ష్మణరావు, పతంగే. 2010. *ఉర్దూ తెలుగు నిఘంటువు.* హైదరాబాద్: ఎమ్మెస్కో బుక్స్.
284. లక్ష్మయ్య శెట్టి, బుశెట్టి. 2014. *త్రిభాషా నిఘంటువు(హిందీ – ఇంగ్లీషు – తెలుగు).* విజయవాడ: విక్టరీ పబ్లికేషన్స్.
285. సీతారామాచార్యులు, బహుజనపల్లి. 2013. *శబ్దరత్నాకరము.* విజయవాడ: విక్టరీ పబ్లిషర్స్. తొమ్మిదవ ముద్రణ.
286. సుబ్బయ్యశాస్త్రి, కాశీభట్ట. 1988. *శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు (నాల్గవ సంపుటం).* హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం.

## ఆంగ్ల పుస్తకాలు

287. Abrams, M.H. 1999. “A Glossary of literary terms”. United States of America: Heinle & Heinle.
288. Bloch & Trager. 1972. “Outline of Language Analysis”. New Delhi: Oriental books Reprint.
289. Cuddon, J.A. 2013. “A DICTIONARY OF Literary Terms and Literary Theory”. UK: A John Willey & Sons Ltd. Publications.
290. Day Lewis, C. 1961. “The Poetic Image”. London: Jonathan cape & Thirty Bedford square. Tenth Impression.
291. Rice, Philip (Edt.). 2001. “Modern Literary Theory”. London: Arnold Publishers.
292. Richards, I.A. 2006. “Principles of Literary Criticism”. New York: Routledge Classics. Second Edition.
293. Shklovsky, Viktor. 2009. “Theory of Prose”. London: Dalkey Archive Press. Fourth Edition.


పరిశోధన:
నాడు,నేడు,రేపు
(అంతర్జాతీయ సదస్సు పత్రాలు)
సంపాదకులు
ఆచార్య మాడభూషి సంపత్ కుమార్

# పరిశోధన:
# నాడు, నేడు, రేపు

(అంతర్జాతీయ సదస్సు పత్రాలు)


సంపాదకులు

**ఆచార్య మాడభూషి సంపత్ కుమార్,** డి.లిట్.

తెలుగు శాఖాధ్యక్షులు, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై-600005

సహసంపాదకులు

**డాక్టర్ కోదండ లక్ష్మణ**

# PARISOODHANA: NINNA, NEEDU, REEPU

(Research Papers Presented in the International Seminar
"Research : Yesterday, Today and Tomorrow")

**Editor: Dr. M. Sampath Kumar**
Prof. & Head, Department of Telugu
University of Madras
Chennai-600 005
Mobile:09444075128
email: madabhushisk@gmail.com

First Edition: February 2016

(c) Editor

Cover Design: Thy Designers, Chennai

**ISBN No. : 978-93-81992-32-6**

# పరిశోధన: నిన్న, నేడు, రేపు

(అంతర్జాతీయ సదస్సు పత్రాలు)

**సంపాదకులు:**

**ఆచార్య మాడభూషి సంపత్ కుమార్,** డి.లిట్.
తెలుగు శాఖాధ్యక్షులు, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై-600 005

హక్కులు : సంపాదకులు
మొదటి ప్రచురణ : ఫిబ్రవరి 2016
ముఖపత్ర అలంకరణ: థై డిజైనర్స్
వెల: రూ.400/-

ప్రతులకు:

**పాలపిట్ట బుక్స్**
16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ
సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాదు-500 036
ఫోను:040-27678430

# పత్ర క్రమం


| | | | |
|---|---|---|---|
| 001. | ఆరాల లింగమల్లయ్య | గంగిరెద్దులాట | 001 |
| 002. | ఆరాల సైదులు | తెలుగు పత్రికలలో బాల సాహిత్య ఆవిర్భావం-వికాసం | 004 |
| 003. | ఈశ్వరబాబు.కె. | ఆంధ్ర మహాభాగవతం-శ్రీకృష్ణుని అష్టభార్యలు | 007 |
| 004. | కంబాల మురళీకృష్ణ | తెలుగు దినపత్రికలు ఆధునిక ధోరణుల అనుశీలన | 011 |
| 005. | కదిరి కృష్ణయ్య | విద్వాన్ విశ్వం 'పెన్నేటి పాట' - భాషా పరిశీలన | 015 |
| 006. | కళ్యాణి జిల్లా | తెలంగాణ రచయిత్రుల నవలలు-స్త్రీల జీవిత చిత్రణ | 018 |
| 007. | కాశింబాబు.ఎ. | కారకవిశేషాలు-తిక్కనగారి ఉద్యోగ పర్వం | 021 |
| 008. | పి.కాళియప్ప | ఆధునికానంతర సాహిత్య విమర్శ-ధోరణులు | 025 |
| 009. | కుంజం శ్రీనివాస్ | కోయతెగ-పండుగలు | 029 |
| 010. | కృష్ణారెడ్డి.సి.యన్ | సీమ కథాశిల్పి - సింగమనేని | 031 |
| 011. | కొక్కిలిగడ్డ వాణి | స్వాతంత్ర్య పోరాటంలో తెలుగు స్త్రీలు | 034 |
| 012. | కోదండ లక్ష్మణ | లకుమ 'గోరింటాకు చందమామ' కవితా వైభవం | 038 |
| 013. | గంధసిరి వీరన్న | బందూక్ నవల- సామాజిక పరిశీలన | 042 |
| 014. | గరికిపాటి గురజాడ | ఆంధ్ర మహాభారతంలో యక్ష ప్రశ్నలు : మానసిక పరిపక్వత | 047 |
| 015. | గరిగె రాజేష్ | కరీంనగర్ జిల్లా కవిత్వం - వస్తు విశ్లేషణ | 049 |
| 016. | గల్లా జ్యోత్స్న | కొలకలూరి ఇనాక్ 'ఊరబావి' - వస్తువైవిధ్యం | 054 |
| 017. | గాదిరాజు రంగరాజు | సాహిత్యంలో చారిత్రక నాటకాల విశిష్టత | 060 |
| 018. | గాయత్రి.ఎస్ | కడుపు కోత కథా సంపుటి- సామాజిక విశ్లేషణ | 063 |
| 019. | గిన్నారపు ఆదినారాయణ | దళిత సాహిత్యంలో ఆత్మకథలు | 066 |
| 020. | గొంగులూరి కృష్ణవేణి | గంగుల శాయిరెడ్డి కాపుబిడ్డ-రైతు జీవిత చిత్రణ | 070 |
| 021. | గోపాల్.పి | గోపిచంద్ వ్యక్తిత్వం | 073 |
| 022. | గోపాల్ ఆర్. | కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సాహిత్య ప్రస్థానం | 075 |
| 023. | గోపినాథ్ రాథోడ్.పి | మహబూబ్ నగర్ జిల్లా పత్రికలు - సాహిత్య సేవ | 078 |
| 024. | గోవిందు.హెచ్ | మానవల్లికవి మనోహర కల్పనాకావ్యం 'మృగావతి' | 082 |
| 025. | గౌతమ.బి.వి.ఎస్ | సూర్య దినపత్రికలో కవిత్వం : చర్చనీయాంశాలు | 085 |
| 026. | చంద్రమౌళి మొరవపల్లి | కవి జీవిత పరిశోధనల్లో డా:సి.ఆర్.రెడ్డి జీవితం, రచనలు | 087 |
| 027. | చంద్రయ్య.ఎస్ | తిమ్మాజిపేట మండల మౌఖిక భాష-వర్ణనాత్మక వ్యాకరణం | 090 |
| 028. | చెన్నకేశవులు.సి | కథామహల్ కథల్లో వస్తువైవిధ్యం | 093 |
| 029. | డుంగావత్ నరేష్ కుమార్ నాయక్ | గోర్‌బోలి భాషా - వ్యాకరణం | 096 |
| 030. | తిరుపతి కల్లెబోయిన | నాడు తెలుగు పరిశోధనకు దీప్తి తెలుగు పరిశోధన పత్రిక | 103 |
| 031. | దస్తగిరి.పి | ఆధునిక తెలుగుసాహిత్యం - చాకలివారి జీవిత ప్రస్తావన | 105 |
| 032. | దార సుమన్ | సినిమాలుగా రూపొందిన తెలుగు నవలలు-నాటకీయత | 108 |
| 033. | దాసరి విజయ లక్ష్మి | కొలకలూరి ఇనాక్ కథానికలలో మానవత | 112 |
| 034. | దుర్గ.సి | సర్వజగన్నాథ రెడ్డిగారి 'కచ్ఛపి కావ్యం' - ప్రబోధాంశాలు | 116 |
| 035. | దైద వీరయ్య | దక్కలికుల సాంస్కృతిక సామాజిక జీవనం | 119 |
| 036. | నగరి చాముండేశ్వరరావు | తరికొండ వెంగమాంబ రచనలు-యోగదర్శనం | 121 |





Scanned by CamScanner

# కరీంనగర్ జిల్లా కవిత్వం - వస్తు విశ్లేషణ

గరిగె రాజేష్,హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

## 1. పరిచయం

తెలుగు సాహిత్యంలో ఏ వాదమైనా మొదట కవిత్వంలోనే వెలువడుతుందని తెలుగు సాహిత్య చరిత్రని గమనిస్తే అర్థమవుతుంది. ఎందుకంటే కవిత్వానికున్నా సౌలభ్యం అలాంటిది. అలాగే తెలుగునాట అస్తిత్వవాద ఉద్యమాలు ప్రతి కవిని, రచయితని తన ప్రాంతం నుండి, కులం నుండి మాట్లాడేలా చేశాయి. ఇది స్త్రీవాద, దళితవాద, మైనార్టీ మొదలైన అస్తిత్వవాద ఉద్యమాల్లో కనిపిస్తున్న తెలంగాణ ఉద్యమం మరింత ప్రభావాన్ని చూపగలిగింది. భాష, సంస్కృతి, చరిత్ర, వివక్ష మొదలైన అనేకాంశాల్లో తన నేలనుండి కవిని ఆలోచించుకునేలా చేసింది. తద్వారా ప్రతి కవి, రచయిత శత్రువును ప్రశ్నిస్తూనే, ఇన్నాళ్ళ వివక్షను, జరిగిన అన్యాయాన్ని లేవనెత్తుతూనే తన ప్రాంత గొప్పతనాన్ని, ప్రత్యేకతల్ని అక్షరాలుగా మలచడం మొదలుపెట్టాడు. అనేక సంవత్సరాలు పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రస్తుతం తెలంగాణ చరిత్ర(సాహిత్యపరంగా, చారిత్రకంగా), సంస్కృతి సంప్రదాయాలు, భాష, ప్రత్యేకతలు మొదలైన అంశాల్లో చర్చ జరుగుతుంది. ఇలాంటి చారిత్రక సందరంలో తెలంగాణలోని ప్రతి జిల్లా విశేషాల్ని, సంస్క ృతి సంప్రదాయాల్ని, భాష, చరిత్రల్ని సాహిత్యపరంగా అధ్యయనం చెయ్యవల్సిన అవసరం ఏర్పడింది. ప్రతి జిల్లాలోని సంఘటనలను, చారిత్రక విషయాల్ని మొదటగా కవిత్వంలోనే వెలువడతాయి కనుక నేను 2000 నుండి 2010 మధ్యకాలంలో కరీంనగర్ జిల్లా కవిత్వాన్ని నా పరిశోధనాంశంగా తీసుకున్నాను.

## 2. పత్ర ఉద్దేశ్యం

తెలంగాణ కవికి కవిత్వం గాలి ఊసులు కావు. ఆకాశంలో వివరించే ఊహాగానాలు కావు. వెన్నెలల వెలుగులు, ఇసుక తిన్నెలు ఇక్కడి కవిత్వంలో లేవు. ఇక్కడి జీవితంలో లేవు. ఈడ్చుకుపోయిన డొక్కలు, తడిసిన కన్నులు, ఎండిన చెరువులు, భూములు, తల్లడిల్లె హ ృదయాలు మొదలైనవి తెలంగాణ కవిత్వంలో కనిపిస్తాయి. తెలంగాణ కవికి కవిత్వం నిజ జీవితం, రక్త సంబంధం. బతుకులోంచి, బాధలోంచి అది తన్నుకొస్తుంది, తల్లడిల్లుతది. తన చుట్టూ ఎటుచూసిన రోదనలు, వేదనలు. వీటినుండే కవిత్వం జనిస్తుంది. అలా జనించిన తెలంగాణ కవిత్వంలో ప్రపంచీరణ ప్రభావం వల్ల అన్యాయం పాలైన పల్లెటూర్ల వ్యధలు, వ ృత్తులన్ని పోయి బజారుపాలైన వృత్తికారుల కథలు, ఆంధ్రపాలకుల చేతుల్లో అన్యాయానికి గురైన తీరు, వివక్ష, దోపిడి, వర్షాలు లేక పొట్టచేతపట్టుకొని వలసెళ్ళిపోతున్న ప్రజల కన్నీళ్ళు, మనుసు, మానవత్వంకలగలిసిన గ్రామాల పరిస్థితి అన్ని కనిపిస్తాయి. పత్ర నిడివి దృష్ట్యా కరీంనగర్ జిల్లా కవిత్వంలో కనిపించే వస్తువుని కొన్ని విభాగాలుగా విభజించి వివరిస్తాను, విశ్లేషిస్తాను.

## 3. కరీంనగర్ జిల్లా కవిత్వం - వస్తు విశ్లేషణ

కవి, రచయిత చెప్పే ప్రధాన విషయాన్ని వస్తువు అనవచ్చు. "సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భావాన్ని వస్తువనవచ్చును. రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చు" (మధుసూధనరావు, త్రిపురనేని. 1997: 13). కవి, రచయిత ఎంచుకున్న అంశం వస్తువు. వస్తువును అభివ్యక్తం చేసే తీరు శిల్పం. ఈ రెండింటిలో ముఖ్యమైంది వస్తువే. conten అన్న ఆంగ్లపదానికి సమానార్థంలో 'వస్తువు' అని తెలుగులో వాడుతున్నాం. రచనలో, కవిత్వంలో వ్యక్తమయ్యే ప్రధాన అంశం వస్తువుగా చెప్పుకోవచ్చు. సాహిత్యంలో ఏ ప్రక్రియ తీసుకున్న ఆ ప్రక్రియకు జీవానాధారంగా చెప్పుకోదగ్గది వస్తువు. ప్రతి అంశానికి మూలాధారం వస్తువే. కవి, రచయిత సమాజాన్ని సూక్ష్మద ృష్టితో పరిశీలించి తను దేన్ని చూసి స్పందిస్తాడో దాన్ని వస్తువుగా గ్రహిస్తాడు. ఈ ప్రపంచంలో అన్నీ కవికి, రచయితకి వస్తువులవుతాయి. "సంబంధాలు, సామాజిక జీవితం, అందలి సమస్త వైరుధ్యాలు వీటన్నిటి యొక్క కళాత్మకమైన ఆవిష్కరణే సాహిత్యంలో వస్తువు" (శివశంకర్, పాపినేని. 2008: 8). మనుషులు, వారి మధ్య అనురాగాలు, ఆప్యాయతలు, ద్వేషాలు, ప్రేమలు మొదలైన మానవ సంబంధంలోని సమస్త వైరుధ్యాలతో పాటు చెట్లు, పర్వతాలు, నదులు అన్ని సాహిత్యంలో అందమైన వస్తువులుగా మారుతాయి. సాహిత్యంలో వస్తువు కానిదంటూ ఏదీ లేదు. సమాజం మారినకొద్దీ వస్తువు కూడా మారుతూ ఉంటుంది. ఎందుకంటే సాహిత్యం నిరంతర చలనశీలమైంది కనుక.



Scanned by CamScanner

### 3.1. తెలంగాణ

మలిదశ తెలంగాణ ఉద్యమం అందించిన చైతన్యం అంతా ఇంతా కాదు. పరాయి భాష, పరాయి సంస్కృతి, పరాయి చరిత్ర, పరాయి పాలన మొదలైన ఎన్నో విషయాలను తిరస్కరిస్తూ తమ భాష, తమ సంస్కృతి, తమ చరిత్ర, తమ పాలన మొదలైన అంశాలను ముందుకుతీసుకొచ్చింది. సుప్తచేతనావస్థలో ఉన్న ప్రతి వ్యక్తిని నిదింపజేసి కలంతో, గళంతో యుద్ధోన్ముఖుల్ని చేసింది. ఇన్నాళ్ల దోపిడికి, దౌర్జన్యానికి, నిరంకుశత్వానికి భరతవాక్యం ఆలపించేలా చేసింది. ఈ ఉద్యమం అందించిన స్ఫూర్తితో ఎంతో మంది నవీన కవులు, కళాకారులు, పరిశోధకులు ఆవిర్భవించారు. కవులకు, కళాకారులకు, రచయితలకు, పరిశోధకులకు తెలంగాణ ఒక అమూల్య వస్తువైంది.

గ్రామగ్రామాన రోజుకో కొత్త పాట వెలసింది, వారానికో కొత్త కవితా సంకలనం నిలసింది. తెలంగాణ ఆవశ్యకత కేవలం భౌగోళికంగానే కాదు సకల దౌర్జన్యాలనుంచి, దురాగతలనుంచి అని కవులు, కళాకారులు నినదించారు. అసమానత, అక్రమ పరిపాలనను కూల్చడానికి స్థానికతావాదం ఎదురైనిలిచింది. అందుకే తెలంగాణ సాహిత్యం శత్రువుపైకి గురిపెట్టిన అక్షరబాణం. ఇలా వచ్చిన సాహిత్యాన్ని దేన్ని చూసిన తెలంగాణ ప్రాంతీయతవాదం కనిపిస్తుంది. తెలంగాణ ఉద్యమంలో ఎకడెక్కడో చిందరవందరగా వచ్చిన కవిత్వాన్ని ఒక రాశిగా పోసే సందర్భంనుండే అనేకానేక కవితా సంకలనాలు పుట్టుకొచ్చాయి. ఏది న్యాయం, ఏది అన్యాయం, ఏది ధర్మం, ఏది అధర్మం అని తెలంగాణ ప్రజలకి తెలియజెప్పే బాధ్యతను కేవలం తెలంగాణ నిర్వహిస్తే, కవులు, కళాకారులు ప్రజలను ఉద్యమం దిశగా అడుగులు వేయించే బాధ్యతను స్వీకరించారు.

అసలు ఈ తెలంగాణ ఉద్యమం ఎందుకు వచ్చిందో ప్రజలు కొంత అవగాహన ఉండాలి. వెనుకబాటుతనం, నిధుల కేటాయింపులో వివక్ష, అభివృద్ధిలో పక్షపాతం, ఎప్పటికప్పుడు పెరిగిపోయిన నిరుద్యోగం, తమ భాష, సంస్కృతి, చరిత్ర మొదలైన విషయాల్లో పరాయి పెత్తనం మొదలైన అనేకానేక అంశాలు తెలంగాణ ఉద్యమం రావడానికి దారితీశాయి. "విశాలాంధ్ర ఏర్పడ్డాక ఈ యాభై ఏండ్లలో తెలంగాణకు జరిగిన విస్మరణ, వివక్ష, సహజ వనరుల దోపిడీ, నిధుల నియామకాల్ని కొల్లగొట్టడం, రాజకీయ ఆర్థిక సాంస్కృతిక వాస్తవ పరిస్థితులకు వక్రీకరణలు చెబుతున్న ప్రచార, ప్రసార మాధ్యమాలు తెలంగాణ ప్రజల రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక జీవితం అతి నికృష్టదశకు చేరుకునేలా చేశాయి. తెలంగాణకు తన అస్తిత్వాన్ని వెతుక్కునే దేవులాటలోకి అనివార్యంగా నెట్టాయి. ప్రత్యేక అస్తిత్వం అన్న ఆకాంక్ష కేవలం రాజకీయమైంది మాత్రమే కాదు. బాహాటంగాను, నిగూఢంగాను ఉన్న సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, భాషాత్మకమైంది కూడా. ఈ నేపథ్యంలో రచయితలు వివిధ రూపాలలో అస్తిత్వాన్ని అన్వేషించారు. ప్రత్యేకతను ప్రతిపాదించారు" (మల్లారెడ్డి, తూర్పు(ప్రసంపా.). 2007 : ix). తెలంగాణ ఉద్యమం కేవలం సీమాంధ్ర రాజకీయ నాయకులపై, ఇక్కడి సంపదను, భూమిని కొల్లగొట్టే భూరాక్షసులపై మాత్రమే కాని సామాన్య ప్రజానీకంపై కాదు అని స్పష్టం చేసింది.

"ప్రేమలేదు, బాధ్యత లేదు/నాయకత్వానికై నటిస్తున్నావ్.../బట్ట పొట్ట బతుకు తంట/నిరుత్సాహం, నిర్లిప్తత/మాకోసం ఆలోచించలేదు/మీ కోసమే జీవిస్తున్నాం.../ఆవేశం తప్ప అనుమానం లేదు/అణిచివేతల నుండి.../పాట, పల్లవి పుట్టింది/ఉద్యమానికి ఊపిరయింది/ఉద్యమాలు నడుస్తాయ్...!/నాయకత్వాలు పుట్టుకొస్తాయ్...!" (బాలయ్య, పొన్నాల. 2008 : 24). "1956లో రాష్ట్రం అవతరించిన రోజు నుండి దాదాపు 5 సంవత్సరాల కాలంలో తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్ర ప్రాంతంతో సమానంగా అభివృద్ధి పరుస్తామని వాగ్దానం చేయటం జరిగింది. తెలంగాణ ప్రాంతపు వనరులను ఈ ప్రాంతాభివృద్ధికే వినియోగించి ఇతర ప్రాంతాలకు తరలించి ఉండకుండా ఉంటే ఇరు ప్రాంతాలలో అసమానతలు 5 సంవత్సరాలు కాకపోయిన 10 సంవత్సరాలకైనా తొలగిపోయేవి. కాని రాష్ట్రావతరణ నుండి ఈనాటి వరకు తెలంగాణ ప్రాంతాన్ని అన్ని విధాలా కొల్లగొట్టి ఇతర ప్రాంతాలను అభివృద్ధిపరచుట వలన ఈ ప్రాంతం మరింత వెనుకబడిపోయింది. ప్రాంతీయ అసమానతలు మరింత పెరిగి పోయినవి. ప్రత్యేక రాష్ట్ర నినాదానికి ప్రత్యామ్నాయం లేకుండా పోయింది" (సింహాద్రి, యస్(సంపా). 2001 : 16). ఒకటే భాషని కలిసిన ఆంధ్రప్రదేశ్‌లో సీమాంధ్ర నాయకులు తెలంగాణపై ప్రేమ, బాధ్యత చూపించలేదు. వలసలుపోయిన, ఆకలితో అల్లాడిన, నిరుద్యోగం పెరిగినా ఇక్కడి వారి గురించి ఆలోచించలేదు. ఉద్యమాలు చేసిన అణిచివేశారు తప్ప సమస్యల పరిష్కారానికై ప్రయత్నించలేదు. ఓట్లు రావడానికి నాయకత్వం సంపాదించడానికి ప్రేమగా ఉన్నట్టు నటించారు. ఇన్నాళ్ళు తమదికాని తమ బతుకు జీవించిన తెలంగాణ ప్రజల్లో నిర్లిప్తత, నిరంతరం తంటాలు. ఈ బాధల్ని అంతం చేయడానికి తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఈ ఉద్యమాన్ని నలుదిశలా వ్యాపింపజేసింది పాట.

### 3.2. ఊరు

ఎటుచూసిన పచ్చటి పొలాలు, బతుకంతా అల్లుకుపోయిన బంధాలు, స్వార్థం ఎరుగని మనుషులు, వృత్తిని నమ్ముకొని



Scanned by CamScanner

బతుకీడ్చే ప్రజలు, ఎన్నో ఏండ్లుగా వస్తున్న ఆచారాలకు కొలువు, సంస్కృతి సంప్రదాయాలకు నెలవు పల్లెలు. పైలపచ్చీస్, ఊంచుడుబెక్క, కట్టెబిమ్మడు మొదలైన ఆటలు, 'పంతులయ్యా పంతులయ్యా పప్పుచెక్కర బుక్కవయ్యా' వంటి పాటలు కాలగర్భంలో కలిసిపోయి ప్రపంచీకరణ పాదాల కింద నలిగిపోతుంది. దసరాకు, దీపావళికి, సంక్రాంతికి పిల్లాపాపలతో, చిన్నపెద్దలతో వెలిగిపోయే పల్లె బతుకు వేటలో వెలవెలబోతుంది. ఎవరికి ఆపదొచ్చిన ముందుండి ఆదుకునే వాళ్ళంతా వలసపడవెక్కి పరాయిదేశం చేరుకుంటున్నారు. "ఊరు ఊరంతా ఇంపుసొంపుగా లేదు/ఇరిగిపోయిన పెంట పొనుక/తూట్లుపడ్డ వడ్ల బోరెం/కూలిపోయిన పిడికెల కుచ్చె/చెదలు పట్టిన పాతగుమ్మి"(దేవేందర్, అన్నవరం, 2003 : 5). పగిలిపోయిన 'కూరాటి కుండ' అనే ఈ కవితలో ఇంపుసొంపు, పెంట పొనుక, తూట్లు, వడ్ల బోరెం మొదలైన అన్ని పదాలు మాండలిక పదాలే. పల్లెగురించి చెప్పినప్పుడు పరాయి భాషలో చెప్పడం వల్ల అది అసమగ్రంగా, అసంపూర?ంగా ఉంటుంది అందుకే ఆ పల్లె భాషనే ఎన్నుకొని కవిత రాసారు.

"సాయిమాను కింద చూరనీళ్ళు/తడిసిపోయిన ఊరపిచ్చుక/ఏంచిన మక్కపాలాల వాసన.../అన్నీ యాదికొచ్చి..../పీరీల పండగ నాటి అగ్గిల దూకినట్లయితది.../లచ్చవ్వ పీరీకేసిన కుడుకలపేరు/మాదిగపోతడేసిన జడల దయ్యం/మంగలి బుచ్చివేసే మైసాచ్చిపొగ.../గుండెలనిండా కమ్ముకొని.../కండ్లల్ల నీళ్ళస్తయి..."(రవీంద్ర, సంగెవేని. 2007 : 46). జీవితం జ్ఞాపకాల గ్రంథాలయం. ఇందులో కొన్ని మనకు సంతోషాన్నిచ్చేవి, కొన్ని బాధనిచ్చేవి ఉంటాయి. పొట్టకూటికై వలసపోయిన వ్యక్తి అంతర్మథనమే ఈ కవిత. వర్షాకాలంలో ఏంచుకున్న మక్కపాలాలు, పీరీల పండుగ రోజు లచ్చవ్వ వేసిన కుడకల పేరు, మాదిగపోతడి జడల దయ్యం, మంగలి బుచ్చి మైసాచి పొగ అన్ని జ్ఞాపకమచ్చి మనుసు భారంగా మారి కళ్ళన్ని కన్నీళ్ళతో నిండిపోతాయి.

## 3.3. ప్రపంచీకరణ

'గ్లోబలైజేషన్' అన్న ఆంగ్ల పదాని సమానార్థకంగా తెలుగులో ప్రపంచీకరణ అని వాడుతున్నాం. బహుళజాతి సంస్థలు ఉత్పత్తి చేసే వస్తువులను ప్రపంచ వ్యాప్తంగా అమ్ముకోడానికి ప్రపంచీకరణను ముందుకు తీసుకువచ్చాయి. ప్రపంచం అంతా ఒక చిన్న గ్రామంగా మారిపోవడం ప్రపంచీకరణ. మన దేశంలో ప్రపంచీకరణ 1990 నుండి ఆరంభమైనట్లు తెలుస్తుంది. 1959లో globalization అనే పదం రూపొంది 1961లో వెబ్‌స్టర్ నిఘంటువును చేరింది. ఈ పదసామ్యం కలిగిన భాషలు స్పానిష్‌లో గ్లోబలైజేషన్, రష్యాలో గ్లోబలిసస్యా అనే పదాలు కనిపిస్తాయి. తెలుగులో 1990 తర్వాత వచ్చిన కొన్ని నిఘంటువుల్లో గ్లోబల్ అనే పదానికి అంతర్జాతీయ, గోలాకార, భౌగోళిక, ప్రపంచవ్యాప్తం అనే అర్థాలున్నాయి. గ్లోబలైజేషన్ అనే పదానికి భౌగోళికరణ, భౌమీకరణ, విశ్వీకరణ, విశ్వవ్యాప్తీకరణ, ప్రపంచీకరణ అనే అర్థాలున్నాయి. ప్రపంచీకరణ అనే పదం వ్యవహారంలో స్థిరపడింది. "ఏ విషయమైనా ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ప్రభావాన్ని నెరపితే దానిని ప్రపంచీకరణ అని అన్నారు. ప్రపంచంలో ఒక మూల నుంచి ఇంకో మూలకి సరకులు వనరులు ఎటువంటి అంక్షలు లేకుండా తరలించటం. ఈ తరలింపు అంతర్జాతీయ వక్తరూపంలో అనేక దేశాల్లో విస్తరించినపుడే బహుళజాతి సంస్థల రూపంలో జరుగుతుంది". ప్రంపచీకరణ ప్రభావం నేడు అన్ని రంగాల్లో పడింది. ప్రతి పల్లెకు విస్తరించిందీ.

"చిన్నప్పుడు /నేను 'లాల' తాగిన బొడ్డు చెంబు/ఇప్పుడు సందర్శకులను/విశేషంగా ఆకర్షిస్తూ అలరిస్తున్న పురావస్తువు/ఎవరి గొంతులకు వారే/వంతులవారి/ఉరిత్రాళ్ళు బిగించుకుంటున్న కాలం". (జగన్నాథం, జూకంటి. 2013 : 47). ఊర్లలన్నీ ఖాళీలై వలసపోతున్నాయి, ఇంకొంత పాత ఇండ్లన్నీ బంగ్లాలవుతున్నాయి. పాతకాలంనాటి వస్తువులన్నీ మరుగునపడి కొత్త వస్తు సంస్కృతి అందుబాటులోకి వస్తోంది. ఊర్లలో మసాలాలు నూరుకోడానికి, అల్లం, వెల్లుల్లి నూరుకోడానికి రోళ్ళు, రోకలి దుడ్లు ఉండేవి ఉండేవి. ఇప్పుడు మిక్సర్, గ్రైండర్ మొదలైనవి రావడం వల్ల మూలపడ్డాయి తద్వారా రోళ్ళు చేసేవారు, రోకలిదుడ్లు చేసే వడ్లోళ్ళ వృత్తి క్షీణిస్తోంది. అలానే ఇంకా ఎన్నో పాత వస్తువుల స్థానంలో కొత్త వస్తువులు రావడంతో కొన్ని నేటి తరం వారికి అవి అపురూపమైనవిగా కనిపిస్తున్నాయి. ఇలా ప్రపంచీకరణ ఊర్లోని అన్ని వృత్తుల్ని తన కబంధ హస్తాల్లో బంధించి నాశనం చేస్తోంది.

"పరిఢవిల్లే విషసంస్కృతి నుడికారాన్ని/'పరాయికరణ' పదఘట్టనల క్రింద నలపడాన్ని/రంగుస్వప్నాల వ్యాపారవ్యూహంతో/అంతరంగ స్వేచ్ఛవిహంగాల్ని/నేల కూర్చే క్రూరత్వాన్ని/అడ్డుకోవల్సిందే.. ధిక్కరించాల్సిందే..." (రవీంద్ర, సంగెవేని. 2007 : 31). ప్రపంచీకరణ ప్రభావం వల్ల ఒక విషసంస్కృతి వచ్చింది. లేట్‌నైట్ పబ్బులకు పోవడం, కొత్తసంవత్సరాన్ని ఆర్భాటంగా జరుపుకోవడం ఇలా కొత్తకొత్త అలవాట్లు వస్తున్నాయి. ప్రతి వస్తువును డబ్బుతో ముడిపెట్టి మానవత్వాన్ని నాశనం చెయ్యడం, భాష, వేశం మొదలైన వాటిల్లో మార్పు రావడం, తనదికాని తన బతుకు జీవించడం ప్రపంచీకరం ప్రభావాలు. అందుకే నీ ఊపిరిపై నీకు



Scanned by CamScanner

అధికారం కావాలంటే నడుంబిగించాలి, ప్రతి మాటలో, పాటలో ధిక్కారం వినిపించాలి అని కవి తెలుపుతున్నాడు.

### 3.4. వలస

సాధారణంగా ప్రజలు తమ ప్రాంతంలో సరైన నిధులు, భూములు లేక జీవనం దూరమైనప్పుడు పొట్టకూటికై వలసపోతుంటారు. తెలంగాణలో నిధులు, భూములు అన్ని ఉన్నా వలసలు ఎక్కువగా ఎందుకున్నాయంటే నిధులు ఆంధ్ర రాజకీయ నాయకుల చేతుల్లో ఉండడం, భూములున్న నీళ్ళు పారకపోవడం, ఉద్యోగాలున్న వాటిల్లో సీమాంధ్ర వాళ్ళే ఉండడం తెలంగాణలో వలసలకు దారి తీసింది.

"వలసంటే/అకారణంగా తన్నుకువచ్చే కన్నీళ్ళను/అన్నీ తానై తుడుచుకునే అసహాయత/మట్టి స్పర్శతో పులకించిన పాదాలు/కాంక్రీటు నిప్పులపై ఆవిరయ్యే నిస్సహాయత/ఆకలి మూలాల్ని పెళ్లగిస్తూ/పేగులు చేసే ఆర్తనాదాలు/పల్లె దోసిలి నుండి ఎగిరొచ్చే పైరగాలి/హృదయంపై తేనేగాయం చేస్తుంటే/వలస ఎంత వేదనో తెలిసి వస్తుంది (రవీంద్ర, సంగెవేని. 2007 : 1 - 2). కవిత వలసకి నిర్వచనంలా కనిపిస్తుంది. చిన్నప్పటినుండి పెరిగిన పల్లెని, చిన్ననాటి స్నేహితుల్ని, అమ్మనిన స్వని కుటుంబ సభ్యులందరిని వదిలి వెళ్తున్నప్పుడు వచ్చే కన్నీళ్ళలో బంధుత్వాల్ని, అనురాగాల్ని అంతం చేసుకోవడం. మట్టితో మనకుగల బంధాన్ని తెంచుకొని కాంక్రీటు నిప్పులపై నడవడం. పల్లెకు, పల్లె అనురాగాలకు వీడ్కోలు చెబుతూ మనదికాని ప్రాంతంలో, మనది కాని భాషలో, మనది కాని దేశంలో జీవనం సాగించడం. అమ్మ లాలన, నాన్న పాలన గుండెను వేదిస్తున్న మౌనంగా భరిస్తూ సాగిపోవడం.

### 3.5. కరువు

"సాధారణంగా కరువు అంటే ఏదైనా ఒక ప్రాంతంలోని ప్రజలు వర్షాభావం వల్ల, అధిక వర్షాల వల్ల, రోగాల మూలంగా ఆకలివాత పడినట్లయితే ఆ ప్రాంతాన్ని కరువు ప్రాంతం అంటారు" (మహేశ్వరం, వి. అముద్రిత సిద్ధాంతవ్యాసం. 2009 : 18). ఒకప్పుడు తెలంగాణలో వర్షాలు అధికంగానే ఉండేవి ఎప్పుడైతే రియలెస్టేట్ పేరిట ప్రపంచీకరణ ప్రవేశించిందో అడవులన్నీ మాయమై వాటి స్థానంల బహుళ అంతస్థుల బంగ్లాలు లేచాయి. తద్వారా అడవుల శాతం తగ్గిపోయి వర్షాభావం ఏర్పడింది.

"నాలుగొద్దులకోపారి వచ్చే నీళ్లకు/నల్లకాడ లొల్లి లొల్లి/ఆపతి సంపతిల పాణం ఇచ్చుకొని/ఎప్పుడూ కూడుండే ఆడోళ్ళం/నీళ్ళు జెయ్యవట్టి కొట్లాడుతున్నం/నీళ్ళ తిప్పలు చెప్పరాదు/పావుగంట పనికి పొంటె పోతది/సోడు లేకుంటే పంటం గానీ/సుక్కనీళ్ళు లేకపోతే ఎల్లుద్దా" (దేవేందర్, అన్నవరం. 2005: 34, 35). కరువు ప్రాణంలా కలిసున్న వాళ్ళని శత్రువుల్లా చేస్తుందనడానికి పై కవితనే ఉదాహరణ. నాలుగురోజులకు ఒకసారి నీళ్ళు రావడం వల్ల కలిగే బాధల్ని కవి వివరిస్తున్నాడు. తన చూసిన లేక అనుభవించిన అనుభవమే పై కవిత. పట్టణాల్లోనైతే నీళ్ళ ట్యాంకర్, పల్లెటూర్లోనైతే నల్లా నాలుగురోజులకు ఒకసారి రావడంతో ఆ వీది వాళ్లంతా ఒకేసారి అక్కడకు చేరుకుంటారు. దాంతో గొడవలు మొదలవుతాయి. అన్నం ఉన్నా లేకున్నా బతకగలగవచ్చు కాని నీళ్ళు లేకుండా బతకలేం. అలాంటి కఠిన స్థితిలో నీళ్ళు అమూల్యమైనవి.

"పుట్టినపిల్ల పురిట్లనే పోయినట్లు/మంస్లెగలువక ముందే సినుకు గాల్లే గలువవట్టె/తాకినేలుకే దెబ్బతాకినట్టు/గాలిమీద గాలచ్చి రాళ్ళదెబ్బగొట్టవట్టె/ఆరుగాలం ఆవురావురుమని పన్జేసిన బక్కోడ్లను జూత్తె/పానం అవిశిపోవట్టె". (వెంకటేశ్వర్లు, బూర్ల. 2007 : 10). తెలంగాణ రైతుకు అభిమానం ప్రాణంతో సమానం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త రకాల పంటలు రైతులకు కొత్త కోరికలని రేకెత్తించాయి. పంట రహస్యం, మార్కెట్ రహస్యం తెలియని రైతులు నష్టపోయి అప్పులు మిగులగా ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. వర్షాలు లేకపోవడం, ఒకవేళ ఉన్న పంట చేతికొచ్చే సమయానికి గాలో, వానో వచ్చి పంటను నాశనం చేయడం రైతుల బతుకులను ఆగమాగం చేస్తున్నాయి. పంటలేకపోవడం వల్ల గడ్డి లేకపోవడంతో తెలంగాణ ప్రజల లెక్క ఎడ్లు ఎండుకపోయాయన్న వాస్తవ పరిస్థితిని వివరిస్తున్నారు కవి.

### ముగింపు

ఏ కవి తన పరిసర ప్రాంతాల ప్రభావానికి అతీతుడు కాడు. కనుకనే తన చుట్టూ జరుగున్న, కనిపించిన విషయాల్ని కవిత్వంలో వస్తువుగా మలుస్తాడు. ఈ క్రమంలోనే సమాజంలోని ప్రతి అంశం కవిత్వ వస్తువుగా మారుతుంది. దీనికి కరీంనగర్ జిల్లా కవిత్వం మినహాయింపేమీ కాదు. నేను 2000 నుండి 2010 వరకు మాత్రమే నా పరిశోధన పరిధిగా నిర్ణయించుకున్నాను కనుక ఈ మధ్యకాలంలో కరీంనగర్ జిల్లా కవిత్వంలో నేను గమనించిన వస్తువుల్ని విశ్లేషించే ప్రయత్నం చేసాను.



Scanned by CamScanner

ఉపయుక్తగ్రంథ సూచి


1. గుడిపాటి. 2006. అభివ్యక్తి. కోదాడ: సాహితీ సంస్థ ప్రచురణ.

2. జగన్నాథం, జూకంటి. 2013. జూకంటి జగన్నాథం కవిత్వం(రెండవ భాగం). సిరిసిల్ల: నయనం ప్రచురణలు.

3. దేవేందర్, అన్నవరం. 2003. నడక. కరీంనగర్: నూతన సాహితి.

4. దేవేందర్, అన్నవరం. 2005. మంకమ్మతోట లేబర్ అడ్డా. కరీంనగర్: నూతన సాహితి.

5. దేవేందర్, అన్నవరం. 2008. బొడ్డుమల్లె చెట్టు. కరీంనగర్: తెలంగాణ రచయితల వేదిక.

6. మధుసూధనరావు, త్రిపురనేని. 1997. సాహిత్యంలో వస్తు శిల్పాలు. హైదరాబాద్: పరస్పెక్టివ్ ప్రచురణలు.

7. మహేశ్వరం, వి. 2009. పాలమూరు గోస ఒక పరిశీలన. అముద్రిత సిద్ధాంత వ్యాసం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

8. రవీంద్ర, సంగెవేని. 2005. అన్వేషణ. ముంబయి: స్వామి వివేకానంద ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్(రిజి.).

9. రవీంధ్ర, సంగెవేని. 2007. వలస పత్రం. ముంబయి: ముంబయి తెలుగు సాహిత్య వేదిక

10. లక్ష్మీకాంతం, పింగళి. 1995. సాహిత్య శిల్ప సమీక్ష. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

11. వెంకటేశ్వర్లు, బూర్ల. 2007. రంగులవిల్లు(నానీలు). కరీంనగర్: వేద పబ్లికేషన్స్.

12. వెంకటేశ్వర్లు, బూర్ల. 2007. వాకిలి. కరీంనగర్: వేద పబ్లికేషన్స్.

13. శరత్ జ్యోత్స్నారాణి, ఎస్. 2003. స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత వస్తువు, రూపం, శిల్పం. హైదరాబాద్: జ్యోత్స్నకళాపీఠం ప్రచురణలు.

14. శివశంకర్, పాపినేని. 1996. సాహిత్యంలో మౌలిక భావనలు. గుంటూరు: పాపినేని ప్రచురణలు.





Scanned by CamScanner



# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి: 8 సంచిక: 5 హైదరాబాద్ 87 మే 2018 పేజీలు: 52 వెల: 20/-

Marx 200

# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

మే 2018
సంచిక : 5
సంపుటి : 8

గౌరవ సంపాదకులు
ప్రొ॥ అడపా సత్యనారాయణ

సలహామండలి
అల్లం నారాయణ
చైర్మన్-ప్రెస్ అకాడమి
చిక్కుడు ప్రభాకర్
అడ్వకేట్-న్యాయ సలహాదారు

ప్రధాన సంపాదకుడు
డా॥సి.కాశీం

సంపాదకురాలు
స్నేహలత ఎం.

సంపాదకవర్గం

డా॥ఎ.సిల్మానాయక్, అసోసియేట్ ప్రొఫెసర్
క్రాంతి, జర్నలిస్టు
శివరాత్రి సుధాకర్, పరిశోధక విద్యార్థి
ప్రతాప్ గోపగళ్ల, పరిశోధక విద్యార్థి

డిటిపి, లే ఔట్ : స్నేహ
కవర్ డిజైన్ : క్రాంతి

రచనలు, చందాలు, విరాళాలు పంపవల్సిన చిరునామా
స్నేహలత ఎం.,
క్వార్టర్ నెం. R-9, O.U క్వార్టర్స్,
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్-500 007.
ఇ.మెయిల్: nadusthunnatelangana@gmail.com
ఫోన్ నెం.: 9290745490

నడుస్తున్న తెలంగాణ అకౌంట్ నెంబర్: 62254225854
ఎస్‌బిహెచ్, రాంకోఠి బ్రాంచ్(20350), హైద్రాబాద్.
IFSC: SBIN0020350

## సంపాదకుని ఉత్తరం

దేశమా
అప్రియమైన
మాతృదేశమా

నీ బిడ్డలను
నీవే తినటం నేర్చుకున్నావు!
నీ నరమాంస ప్రీతిని చూసి
మత్స్య న్యాయం
ఇంద్రావతిలో సిగ్గుపడింది

జలగ రక్తం మాత్రమే తాగుతుంది
రాజ్యమా
నీవు శరీర శకలాలను
వలవేసి పడుతున్నావు

పాలకా కాచుకో
నీటిలో తేలిన శవాల మీద
రేపటి స్వప్నాన్ని చెక్కివచ్చాము

కాశీం

8 మే 2018

నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదక వర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.

# తెలంగాణ తొవ్వ


**సంపాదకీయం**

| | | |
|---|---|---|
| మార్క్స్ నుంచి నేర్చుకుందాం | సి.కాశీం | 5 |

**నడుస్తున్న కాలం**

| | | |
|---|---|---|
| మతవాదం మీద విమర్శ రాజకీయాల మీద విమర్శే | మార్క్స్ | 7 |
| మేడే ఉత్సవం కాదు! | సి.కాశీం | 8 |
| కొంచెం ఆలోచించి మాట్లాడుదాం | ఎ.సునీత, తేజస్విని మాడభూషి | 11 |
| ప్రపంచ సామ్యవాద పదనిర్దేశకుడు కార్ల్ మార్క్స్ | ఎనిశెట్టి శంకర్ | 14 |
| పత్రహరితంపై పేలిన తూటా | క్రాంతి | 18 |
| ట్రంప్ వాణిజ్య దౌత్యయుద్ధం | ఎ.నర్సింహారెడ్డి | 20 |
| ఆదివాసీలపై 'గ్రీన్‌హంట్ ఆపరేషన్' ఆపాలి | పూకె రామకృష్ణ | 24 |

**సాహిత్యం**

| | | |
|---|---|---|
| దళిత స్త్రీ చైతన్య ప్రతీక 'వొయినం' | మహేందర్ | 26 |
| 'కరీంనగర్ జిల్లా కవిత్వం' ప్రపంచీకరణ | గరిగె రాజేశ్ | 31 |
| ప్రమాదంలో భావ ప్రకటన స్వేచ్ఛ | రేపల్లె రాజానందం | 35 |
| కల్లోల దశాబ్దపు గుండెచప్పుడు | శివరాత్రి సుధాకర్ | 38 |
| ధీర కథ | జ్యోతి | 43 |

**నివేదిక**

| | | |
|---|---|---|
| మా ఊరు మా భూమి మాకేకావాలి | ఎనుపోతుల వెంకటేష్ | 47 |
| కన్నారంలో భూ పోరాటం | ఇంద్రసేన కొత్తూరి | 48 |
| కాన్పూర్ భూమిపై హక్కు ప్రజలదే | మెంచు రమేష్ | 49 |

# 'కరీంనగర్ జిల్లా కవిత్వం' ప్రపంచీకరణ

గరిగె రాజేష్

## పరిచయం

ప్రపంచం చిన్న గ్రామంగా మారడమే ప్రపంచీకరణ. ఏ దేశమైన తమ ఉత్పత్తుల్ని ఏ దేశంలోనైనా అమ్ముకోవటానికి, తన వ్యాపారాన్ని అభివృద్ధి పరిచేందుకు ఏ దేశ కంపెనీ అయినా ఏ దేశంలోనైనా పెట్టుబడులు పెట్టడానికి, పరిశ్రమలు స్థాపించడానికి ఉద్దేశించిందే ప్రపంచీకరణ. ముఖ్యంగా ఈ ప్రపంచీకరణ ఆర్థికాంశానికి సంబంధించింది. "ఒక దేశ ఆర్థికవ్యవస్థను ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం చేయడమే ప్రపంచీకరణ. ప్రపంచాన్ని ఏకైక అంతర్జాతీయ మార్కెట్‌గా రూపొందించడమే ప్రపంచీకరణ లక్ష్యం". (సాయిబాబ పి.సి., వాజ్మయి. 2003: 57). ఆర్థికాంశాలకే ప్రాముఖ్యత తప్ప మానవీయాంశాల్ని ప్రపంచీకరణ పట్టించుకోలేదు, పట్టించుకోదు. 1991లో భారతదేశంలో ఆరంభమైన ప్రపంచీకరణ అన్ని రంగాలకు విస్తరించింది.

## పత్ర ఉద్దేశ్యం

ప్రపంచీకరణ భారతదేశంలో అమలయ్యాక సమాజంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. అన్ని రంగాలపై తన ఆధిపత్యాన్ని ప్రదర్శించి మానవుల జీవితాలను అల్లకల్లోలం చేసింది. అప్పటిదాకా హాయిగా, ఆనందంగా జీవించిన మనుషులు బాధల్లోకి, కష్టాల్లోకి నెట్టబడ్డారు. ఇలా సమాజ అల్లకల్లోలాన్ని చూసి స్పందించిన సాహిత్యకారులు ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ సాహిత్య సృజన చేశారు. అలాంటి ధిక్కార స్వరాన్ని సాహిత్య ప్రపంచానికి అందించింది కరీంనగర్ జిల్లా కవిత్వం. చెదిరిపోతున్న వృత్తులు, వాటిని నమ్ముకొని అప్పులపాలై మరణించిన, వలసపోయిన జీవితాలు, కనుమరుగవుతున్న మానవ సంబంధాలు, విధ్వంసానికి గురవుతున్న పల్లెలు, సంస్కృతి మొదలైన అనేకానేక అంశాల్ని చెబుతూ ప్రపంచీకరణపై యుద్ధాన్ని ప్రకటించారు కరీంనగర్ జిల్లా కవులు. ఇలాంటి అంశాల్ని విశ్లేషించడమే ఈ పత్ర ఉద్దేశ్యం.

## పత్ర సంక్షిప్తి

"ఉత్తమ సాహిత్యం జీవితానికి వెలిగా, విడిగా మడిగట్టుకున్న ప్రత్యేక ప్రపంచమేమీ కాదు. అది సమాజ జీవితంలో ఒక భాగం. మానవ మానసిక జీవితంలో ఒక అంతర్భాగం. సంస్కారవంతుల మేధో కార్యకలాపాలలో ఒక కీలక భాగం. ఉత్తమ సాహిత్యానికి జన్మస్థానం సమాజ జీవితమైనట్లే దాని గమ్యస్థానం కూడా సమాజ జీవితమే". (రా.వి.ఆర్. అరుణతార. 1988: 17) అన్న రా.రా.గారి మాటలు ఉత్తమ సాహిత్యం గురించి తెలియజేస్తున్నాయి. కవి తను నివసిస్తున్న సమాజాన్ని తప్పించుకొని రాయలేడు. సాధ్యం కాదు కూడా. అలా సమాజంలోని సమస్యల్ని చిత్రిస్తూ రాసినవారే ఉత్తమ కవులు. అవే ఉత్తమ రచనలు. కరీంనగర్ జిల్లా కవులు కూడా ఉత్తమ సాహిత్య సృజనే చేశారు. చేస్తున్నారు. ప్రపంచీకరణ వల్ల ప్రభావమైన ప్రతి చిన్న విషయాన్ని వస్తువుగా గ్రహించి కవితలు రాశారు, రాస్తున్నారు. యంత్రాలొచ్చి వృత్తికారులు, కూలీలు ఎలా బతుకును కోల్పోయారు, మార్కెట్ సంస్కృతిలో మానవుల మధ్య సంబంధాలు ఎలా దెబ్బతిన్నాయి, టెలివిజన్, మొబైల్ లాంటి కొత్త వస్తువులు రావడంవల్ల సంస్కృతి, సాంప్రదాయాలు ఎలా ధ్వంసమయ్యాయో మొదలైన అన్ని విషయాల్ని అక్షరీకరణం చేసింది. పత్ర నిడివి దృష్ట్యా కొన్ని విషయాలకే పరిమితం కావల్సి వచ్చింది.

## 3. కరీంనగర్ జిల్లా కవిత్వం- ప్రపంచీకరణ

### 3.1. వృత్తుల విధ్వంసం

ప్రపంచీకరణ ప్రభావం ఎక్కువగా పడ్డది వృత్తులపైన. తెలుగు ప్రాంతాల్లోని పల్లెలు వృత్తిని ఆధారం చేసుకొని హాయిగా జీవనం సాగించేవి. ఎప్పుడైతే ప్రపంచీకరణ వల్ల యంత్రాలు వచ్చాయో అప్పుడు వృత్తులన్నీ నాశనమై ఆ వృత్తుల్ని నమ్ముకున్న వృత్తికారులు ఆత్మహత్య చేసుకోవడమో, వలస పోవడమో జరిగింది.

"అగ్గిపెట్టెలో సుతారంగా
ఒదిగిన చీర
విషాద కథనై
భూమిని కప్పేసింది
నమ్ముకున్న 'కులకళ్ళీ'
పట్టెడన్నం పెట్టకపోగా

నట్టేట ముంచింది
పాణం పాణమైన వృత్తి
బతుకును చావుకు తాకట్టు పెట్టింది"

(మోహన్, పత్తిపాక. 2001: 1 -2)

అగ్గిపెట్టెలో పట్టే చీర నేసిన ఘనత సిరిసిల్ల నేతన్నది. కాని ఆ సిరిసిల్ల ఇప్పుడు ఉరిశాలగా మారిన దయనీయ పరిస్థితి. తిండి పెడుతుందని నమ్ముకున్న కులవృత్తి పరికరాలు పట్టెడన్నం పెట్టలేదు సరికదా బతుకును చావుకు తాకట్టు పెట్టాయి. నెలలు కష్టపడి బట్టలు నేసినా బుక్కెడు బువ్వ దొరకడం గగనమై ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలు సిరిసిల్లలో అనేకం.

"అవుసులాయన హెూటల్ పెట్టిండు
మేరాయన చికెన్ సెంటర్ పెట్టిండు
శాలాయన కట్టెల దుకాణం బెట్టిండు
వడ్లాయన వైద్యం నేర్చుకున్నడు
శానమంది ఓటికోటి జేత్తండ్రు
ఊరంత సిత్తు బొత్తయింది
ఏషం మారింది - ఎవారం మారింది"

(లక్ష్మణరావు, జి. 2003: 36)

'పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల
నా తల్లి బందీ అయిపోయిందో కనిపించని కుట్రల'

అని గోరటి వెంకన్న ఛిద్రమైన పల్లె బతుకు చిత్రాన్ని హృదయానికి హత్తుకునేలా గానం చేశారు. వృత్తి బతుకు నియ్యనప్పుడు బతకడానికి మరో పని చెయ్యక తప్పదు. అందుకే స్వర్ణకారుడు హెూటల్ పెట్టాడు. మేరాయన చికెన్ సెంటర్ పెట్టాడు. ఏ వృత్తివాళ్ళు ఏ పని చేస్తున్నారో అర్థం కావడం లేదు. పల్లెలోని పరిస్థితులన్నీ తారుమారయ్యాయి.



## 3.2. మానవ సంబంధాల విధ్వంసం

"పిల్లలకు చక్కని క్రెషెష్
వృద్ధులకు ఎంచక్కా ఆశ్రమాలు
పక్కపక్కనున్నా మనిషికీ మనిషికీ నడుమ
విస్తరిస్తున్న వేనవేలకొలది మైళ్ళ దూరాలు"

(జగన్నాథం, జూకంటి. 2013: 47)

"జూకంటి కవిత్వానికి నిర్దిష్టమైన సందర్భం ఉంది. ప్రయోజనముంది. ఆయన ఎదిగివచ్చిన కాలమే ఆయనకొక అసర్ట్. కాలం కడుపుతో ఉండి కవిని కంటుందంటే, ఆ కాలానికి అవసరమైన కవిని చరిత్ర రూపొందించుకుంటుందని అర్థం. చరిత్ర పొరలలోనుంచి మొలకెత్తిన కవిపుష్పం జూకంటి". (కాశీం. 2015: 107). ఒకవైపు ఉవ్వెత్తున ఎగిసే జన సముద్రాలు, రాజ్యహింస, హత్యలు, ఆత్మహత్యలు. మరోవైపు కుంచించుకుపోతున్న వైశాల్యాలు, బతుకు తండ్లాట, బెంగటీలదాలు మొదలైనవి కలికలి చేయడంతో కవిత్వం రాసానని ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. అందుకే మనిషి గురించి, మానవుల మధ్య ప్రేమల గురించి అంతగా బాధపడతారు. రూపాయి విలువ పెరిగి మనిషి తన సంబంధాల్ని మరిచిపోతున్న వైనాన్ని కవిత్వీకరించారు.

"ఇపుడు!
మా ఊర్నిండా బంగ్లాలే!
నైలు కానాల్లెక్క
అన్నిటికి ఊసల గేట్లే
ఎవ్వలకు మందలిచ్చే తీరిక లేదు
ఇపుడు!
నా పల్లెల్లో అభివృద్ధి అద్దంల సందమామ
సూపుకే నోసుకున్నదిగానీ
సల్లటి మనసు పాడుచేసుకున్నది"

(వెంకటేశ్వర్లు, బుర్ర. 2007: 12)

ఒకప్పుడు ఊరిలో గుడిసెలున్నా వాటికి

స్వచ్ఛయా ఉండేవి. ప్రేమగా మాట్లాడించడం, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పువ్వులు ఏమున్న ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకునేవారు. కాని ఆ గుడిసెలు బంగ్లాలై సల్లటి మనసును పాడుచేసుకోవడం వెనుక మార్కెట్ వ్యవస్థ ఉంది. ఇప్పుడు ప్రేమగా మాట్లాడుకోవడాలు లేవు, ఇచ్చిపుచ్చుకోవడాలు లేవు.

**3.3. సంస్కృతి, కళల విధ్వంసం**

*"మర చెంబుతో దాహం తీర్చుకున్న*
*గొంతులకే 'కిన్లే' తడి*
*దూపతీర్చిన సల్ల ముంత పగిలింది*
*'హెరిటేజ్ బటర్మిల్క్' పాంచ్ రూపాయ్"*

(దేవేందర్, అన్నవరం. 2008: 13)

చుట్టాలొచ్చినా, కొత్తవాళ్లు వచ్చినా నీళ్లిచ్చేవారు, సల్ల ఇచ్చేవారు. కులాసాలు అడిగి తెలుసుకునే సంస్కృతి ఊరిలో ఉండేది. కాని నేడు మంచినీళ్ల బాటిల్స్, బటర్ మిల్క్ పాకెట్లు రావడంవల్ల మనషుల మధ్యనున్న సంబంధాలు దెబ్బ తింటున్నాయి. అలాగే మనవైన చెంబు, సల్లముంత లాంటి వస్తువుల వాడకం తగ్గి అవి కనుమరుగైపోతున్నాయి.

*"సాంస్కృతిక బానిసత్వాన్ని*
*నీ పేషెంట్ బాడీకి స్టెరాయిడ్‌లా ఎక్కిస్తాడు*
*పాప్ మ్యూజిక్ రాప్ మ్యూజిక్ మోతలే! మోతలు!*
*సమంతా ఫాక్స్ నీకు దేవత*
*మైకెల్ జాక్సన్, మరెవడో*
*నీ గుండెను డ్రమ్స్‌గా మోగిస్తాడు*
*నిన్ను కీలుబొమ్మలా ఆడిస్తాడు"*

(శివప్రసాద్, సంకేపల్లి. 2002: 39)

అయా జాతుల సంస్కృతులను నాశనం చేసి విశ్వమానవున్ని తయారు చేస్తున్నది ప్రపంచీకరణ. మనదైన జీవన విధానం నాశనమై మరొకరి జీవన విధానంలోకి మనం అనివార్యంగా నెట్టివేయబడతాం. దోతి, పంచెలు పోయి జీన్స్, టీషర్ట్స్, లంగవోణి, చీరలు పోయి మిడ్డీలు, స్కర్ట్‌లు వచ్చాయి. ఉగాది పోయి న్యూ ఇయర్, జానపదం పోయి పాప్, రాప్ మ్యూజిక్‌లు ఇలా అన్ని రంగాల్లో మనం మనం కాకుండా పోతున్నాం.

**3.4. ప్రపంచీకరణ ప్రతిఘటన**

*"పరిఢవిల్లే విశ్వసంస్కృతి నుదికారాన్ని*
*'పరాయికరణ' పదఘట్టనల క్రింద నలపడాన్ని*
*రంగుస్వప్నాల వ్యాపార వ్యూహంతో*
*అంతరంగ స్వేచ్ఛా విహంగాల్ని*
*నేల కోల్చే క్రూరత్వాన్ని..*
*అడ్డుకోవాల్సిందే...ధిక్కరించాల్సిందే...*
*తమ దేశాల్లో తామే బందీలయ్యే*
*బానిసత్వ కీటాణువుల్ని మెదళ్ళ కుహారాల్లో*
*పొదుగుతున్న ఈ గ్లోబల్ 'వామన' పాదానికి*
*నిప్పుల చెప్పులు తొడగాల్సిందే"*

(రవీంద్ర, సంగెవేని. 2007: 31)

ఆహారంలో, ఆహార్యంలో మనదికాని పరాయి సంస్కృతిలోకి ప్రపంచీకరణ నెట్టివేస్తున్నది. స్థానిక సంస్కృతిని తుడిచి వేయడం ద్వారా ఆయా స్థానిక జాతులు, వర్గాలు అస్థిత్వాల్ని కోల్పోతారు. ఆ అస్థిత్వ పోరాటంలో భాగంగా పై కవితని అర్థం చేసుకోవాలి. మెకాలే తన తండ్రికి రాసిన ఉత్తరంలో "పుట్టుకతో మాత్రమే వారు భారతీయులై ఉండాలి. లక్షణాల్లో, అభిరుచులలో వారిని, ఇంగ్లిష్ వారిగా తీర్చిదిద్దాలి. అదే మనం నేర్పబోయే విద్యకావాలి అని రాశాడు. అంటే ఈ దేశంలో ఇంతవరకు సంస్కృతి లేదని, మనకున్నది సంస్కృతి కాదని, దీన్నంతా రద్దుచేసి ఒక కొత్త గుమస్తాలను తయారు చేసే విద్యను, సంస్కృతిని మనకు బోధించాలనుకున్నారు". (వేణుగోపాల్,ఎన్. 2011: 187). తమ దేశంలోనే బానిసత్వంగా బతికేల చేసే పరాయి సంస్కృతిని తప్పక ఎదురించాలి, పోరాడాలి.

*"ప్రపంచ వాణిజ్యం ప్రచండమై*
*గ్రామ వికాసాన్ని ఆర్పేసింది*
*చేతి పనుల ఇరుసులు విరిగిన ధ్వని*
*నాలుగు వక్కలైన నాగలి కర్రు*
*దేశీయత దేహం గాయమైంది*
*భూగోళీకరణ అగ్ని*
*దేశదేశాలకు అంటుకున్న నిప్పు*
*విస్తరిస్తున్న విశ్వీకరణ*
*ప్రాంతీయాత్మే ప్రతిఘటన"*

(దేవేందర్, అన్నవరం. 2005: 3)

ప్రతి పల్లెకు ప్రపంచీకరణ నిప్పు అంటుకొని దేశీయత తగలబడిపోతోంది. ఇంకా చూస్తూ ఊరుకుంటే మరింత

ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అందుకే ప్రపంచీకరణను ఎదుర్కోవడానికి ప్రాంతీయాత్మే ఫైర్ ఇంజన్. ఇప్పటిదాకా అంటుకొని కాలిపోయిన మన ఆనవాళ్ళకి, మన మూలాలకి చికిత్స చెయ్యాలి. మళ్లీ బాగుపర్చుకోవాల్సిన బాధ్యత మనమీద ఉంది.

**4.ముగింపు**

ఆర్థిక సంస్కరణ వల్ల ప్రతి రంగంలో వ్యాపార ధోరణి ఎక్కువై మనిషికి విలువ లేకుండా పోయింది. ఆ అమానవీయతను ఖండిస్తూ, డబ్బు చెదలు పట్టిన మనుషుల్ని మళ్లీ మానవీయులుగా మార్చడానికి, ప్రపంచీకరణ వల్ల గాయపడ్డ ప్రతి విషయాన్ని గుండెలకద్దుకోవడానికి కవులు ప్రతి గడపలోకి అక్షరాల పాదాల్తో నడుచుకుంటూ వెళ్లి ప్రేమగా అడుగుపెట్టారు.

**ఉపయుక్త గ్రంథ సూచి**


1. కాశీం. 2015. "తెలంగాణ సాహిత్యం". హైదరాబాద్: స్నేహ ప్రచురణలు.

2. జగన్నాథం, జూకంటి. 2013. "జూకంటి జగన్నాథం కవిత్వం-2". సిరిసిల్ల: నయనం ప్రచురణలు.

3. దేవేందర్, అన్నవరం. 2005. "మంకమ్మతోట లేబర్ అడ్డా". కరీంనగర్: నూతన సాహితి.

4. దేవేందర్, అన్నవరం. 2008. "బొడ్డుమల్లె చెట్టు". కరీంనగర్: తెలంగాణ రచయితల సంఘం.

5. మోహన్, పత్తిపాక. 2001. "తెగినపోగు". సిరిసిల్ల: మానేరు రచయితల సంఘం.

6. రవీంద్ర, సంగెవేని. 2007. "వలసపత్రం". ముంబయి: ముంబయి తెలుగు సాహిత్య వేదిక.

7. లక్ష్మణరావు, జి. 2003. "ముగ్గు". కరీంనగర్: సమతా ప్రచురణలు.

8. వెంకటేశ్వర్లు, బూర్ల. 2007. "వాకిలి". కరీంనగర్: వేద పబ్లికేషన్స్.

9. వేణుగోపాల్, ఎన్. 2011. "రాబందు వాలిన నేల". హైదరాబాద్: స్వేచ్ఛాసాహితి.

10. శివప్రసాద్, సంకేపల్లి. 2002. "అష్టమ సముద్రం". వేములవాడ: పొయిట్రీ ఫోరమ్.


**పత్రికలు**


1. కె.వి.ఆర్. అరుణతార. నవంబర్. 1988

2. సాయిబాబ, పి.సి. వ్యాయి. ఏప్రిల్ –జూన్. 2003


T





**నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు**

**ఫేస్‌బుక్ పేజీ:** www.facebook.com/pages/Nadustunna-Telangana

జాతీయ సదస్సు

# TSCHE Sponsored Two-Day NATIONAL SEMINAR on

## Documentation and Dissemination of Linguistic Literary and Cultural Heritage-The Role of Cinema

(A Multilingual, Multicultural & Multiethnic Seminar)

భాషా, సాహిత్య, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, పరివ్యాప్తి-సినిమా పాత్ర

**DEPARTMENT OF TELUGU**

**SRR GOVT. ARTS & SCIENCE COLLEGE**

affiliated to SATAVAHANA UNIVERSITY

Dist :Karimnagar, TELANGANA STATE

# CERTIFICATE

This is to Certify that Dr./ Mr/ Mrs/ Garige Rajesh ______ of ______ has Participated / Presented Paper / Chaired Session / Convened Session / Addressed the Session entitled Karimnagar Jilla Kavithvam – Rupa Visleshana ______ in TSCHE Sponsored Two-Day National Seminar on *Documentation and Dissemination of Linguistic, Literary and Cultural Heritage -The Role of Cinema* held on 17th & 18th Feb 2017 at SRR Govt. Arts & Science College, Karimnagar, Dist. KARIMNAGAR, TELANGANA STATE

Seminar Organizer
Dr.Kotthireddy Mallareddy
Asst. Professor & Incharge Dept. of Telugu

Principal & Seminar Chairman
Sri. P. Nithin

తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు
యు.పి.ఇ -II, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు
భారతీయ భాషల కేంద్ర సంస్థ, మైసూరు
తెలుగు భాషాశాస్త్రజ్ఞుల వేదిక, హైదరాబాదు
సంయుక్తంగా నిర్వహిస్తున్న

## తెలుగు భాషాశాస్త్రజ్ఞుల వేదిక 8వ జాతీయ సదస్సు

**ధ్రువపత్రం**

శ్రీ/శ్రీమతి/కుమార్/కుమారి/డా/ప్రొఫెసర్. గరిగె రాజేశ్ హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదులో 2017, ఫిబ్రవరి 23, 24 తేదీలలో నిర్వహించిన తెలుగు భాషాశాస్త్రజ్ఞుల వేదిక 8వ జాతీయ సదస్సులో పాల్గొని కరింనగర్ జిల్లా కవిత్వం - మాండలిక పదాల పరిశీలన అనే అంశంపై పత్రం సమర్పించారు.

---

## Department of Telugu, University of Hyderabad, Hyderabad
**Organized in collaboration with**
**U.P.E –II, University of Hyderabad, Hyderabad**
**Central Institute of Indian Languages, Mysore and**
**Telugu Linguists' Forum, Hyderabad**

## 8th National Conference of Telugu Linguists' Forum, Hyderabad

**Certificate**

This is to certify that Sri /Smt /Kumar/ Kumari /Dr. /Prof. Garige Rajesh ................................ Presented a paper entitled ................................................................................ at the 8th National Conference of Telugu Linguists' Forum held at the University of Hyderabad, Hyderabad on 23rd and 24th February, 2017.

| Coordinator<br>Department of Telugu<br>University of Hyderabad | Coordinator<br>C.I.I.L, Mysore | Head<br>Department of Telugu<br>University of Hyderabad |
|---|---|---|